# మొదటితరం
# రాయలసీమ కథలు

(1882-1944)

సంపాదకుడు

**డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి**

అబ్జ క్రియేషన్స్
సాహిత్య సాంస్కృతిక సంస్థ (రి)
హైదరాబాద్.




హైదరాబాద్‌లో జ్ఞానసింధు సర్దేశాయి తిరుమలరావు గ్రంథావిష్కరణ సభ




షిల్లాంగ్ (మేఘాలయ)లో కేంద్ర సాహిత్య అకాడమీ

యువ పురస్కారాన్ని స్వీకరిస్తున్న డా॥అప్పిరెడ్డి హరినాథరెడ్డి

# మొదటితరం
# రాయలసీమ కథలు

**(1882 - 1944)**

జనవినోదిని — హిందూసుందరి
సౌందర్యవల్లి — శారద
శ్రీసాధన — తెనుగుతల్లి
విజయవాణి — చిత్రగుప్త

*(పత్రికల నుండి స్వీకృతము)*


సంపాదకుడు

**డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి**

**కేంద్రసాహిత్య అకాడమి యువపురస్కార గ్రహీత**



**అబ్జ క్రియేషన్స్,**
**సాహిత్య సాంస్కృతిక సంస్థ,**
**రిజిష్టర్ నెం. 6628/99,**
**హైదరాబాద్.**

MODATI TARAM RAYALASEEMA KATHALU (1882-1944)

Editor: Dr. Appireddy Harinath Reddy
(Receipent of Sahitya Academy Yuva Puraskar)
Yogivemana Adhyana Abhivruddhi Kendram
Tallakalva Village, Gandlapenta Mandal
Anatapuram District - 515521 A.P.
Ph: 9963917187, e mail: a.harireddy@gmail.com

Publication No : 7

First Edition: May 2015

Price Rs. 200/-

Copies : 1000

For Copies
K.MuraliMohan
9111, Block 9A
Janapriya Mahanagar,
Meerpet, Hyderabad- 500 097
Ph: 9701371256
&
All leading Book Sellers in A.P. and T.S.

Cover Design : Radha Hitech,
9440286206

D.T.P. : Gousia Graphics, Kadiri

Printing : Akruthi Offset Printers
Chikkadapally, Hyderabad - 20
Phone No: 040-27664525

# సీమకథా సౌరభం

**భా**రతీయులకు శాస్త్రీయ పరిశోధనలపట్ల ఆసక్తి తక్కువ అన్న అపప్రథ ఉంది. వైజ్ఞానిక దృష్టి తక్కువ అన్న ఆరోపణా ఉంది. దీనికి తోడు పలు కారణాలవల్ల పరిశోధకులంతా 'నలుగురితోపాటు నారాయణ' అన్న రీతిలో ఒకరు పయనించిన దారిలోనే మరొకరు పయనిస్తూ ఒకరు చూపిన పొరపాటు దారినే అనుసరిస్తూ పొరపాటునూ అలవాటుచేసి, రాచబాటగా మలచటం పలు రంగాలలో కనిపిస్తూ ఉంది. తెలుగు కథ విషయంలోనూ ఇదే జరిగింది. ఇప్పుడిప్పుడు అత్యంత ఆసక్తి, ఉత్సాహము, సత్యశోధనానిరతి కల కొందరు యువపరిశోధకులు పూనుకుని అలవాటైన చూపును వదలి సరికొత్త దృష్టితో నూతన పంథాలో సత్యాన్వేషణ సాగిస్తున్నారు. పాత సత్యాలలోని అసత్యాన్ని నిరూపిస్తూ నూతన సత్యాన్ని ఆవిష్కరిస్తున్నారు. అలాంటి సత్యావిష్కరణ ప్రయత్న ఫలితమైన ఈ చిన్ని పుస్తకాన్ని 'మొదటితరం రాయలసీమకథలు' పేరిట తెలుగు సాహిత్య ప్రపంచానికి మా కానుకగా ఉడుతాభక్తితో సవినయంగా సమర్పిస్తున్నాము. ఎంతో శ్రమకు, వ్యయప్రయాసాల కోర్చి పరిశోధన కావించి, ఆ పరిశోధన ఫలితాలను పుస్తక రూపంలో సాహిత్య లోకానికి అందించే అవకాశం అబ్జక్రియేషన్స్‌కు కలిగించిన డా॥అప్పిరెడ్డి హరినాథరెడ్డిగారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

తెలుగు సాహిత్య ప్రపంచంలో తెలుగు కథ ప్రసక్తి వచ్చినప్పుడల్లా ఈ పుస్తకం పేరు వినపడక తప్పదన్న విశ్వాసంతో, చారిత్రకంగా, సామాజికంగా, సాహిత్యపరంగా అత్యంత విలువైన పుస్తకాన్ని అందిస్తున్నందుకు గర్విస్తున్నాం. ఒక రచన విలువ అది ప్రచురితమైన కాలంకన్న, వందేళ్ళ తరువాత తెలుస్తుందంటారు. ఈ సంకలనంలోని కథలు వందేళ్ళ క్రితం నాటివైనా ఈనాటి సమకాలీన సామాజిక పరిస్థితులకూ వర్తిస్తూ కాలదోషం పట్ట కుండా నాటి తెలుగు సృజనాత్మక రచయితల ప్రతిభాపాటవాలకు అద్దం పడుతున్నాయి. ఈ రచనలు వెలువడే నాటికి ప్రాంతీయ సంకుచిత్వాలు, అస్తిత్వ లంపటాలు లేవు. అందువల్ల ఆయా కథలలో రచయితలు తమ చుట్టుపక్కల సమాజాన్నే చిత్రించినా ఈ కథలలో విశ్వజనీనత ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయి.. తెలుగుదనం ఉట్టిపడుతుంటాయి. అకాడమీలు, యూనివర్సిటీలు చేయ విస్మరించిన సాహిత్య పరిశోధనలకు ప్రోత్సాహ మిస్తూ, సాహితీ విరూపాక్షుడు విద్వాన్ విశ్వం, జ్ఞానసింధు సర్దేశాయి తిరుమలరావు వంటి విలువైన పుస్తకాల తరువాత అబ్జక్రియేషన్స్ అందిస్తున్న మరో విలువైన సాహిత్య మణిమాల ఈ పుస్తకం.

చదవండి, ఆనందించండి, ఆలోచించండి.

**కోడీహళ్లి మురళీమోహన్**
వ్యవస్థాపక కార్యదర్శి
అబ్జక్రియేషన్స్ సాహిత్య సాంస్కృతిక సంస్థ

## ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి

ప్రసిద్ధ కథారచయిత, సాహిత్య విమర్శకులు
హెచ్.ఐ.జి- 237, సింగపూర్ టౌన్‌షిప్
రిమ్స్ మెడికల్ కాలేజి ఎదురుగా,
వయా శంకరాపురం సబ్‌పోస్టాఫీసు, పుట్లంపల్లి,
కడప - 516 002. సెల్: 9866713647




# అవిశ్రాంత పరిశోధకుడు

**అ**ప్పిరెడ్డి హరినాథరెడ్డి బాషోపాధ్యాయుడు అయినప్పటికీ రాయలసీమ చారిత్రక, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక రంగాలను నిశితంగా పరిశీలిస్తున్న పరిశోధకుడు అయిన రచయిత. కొత్త కొత్త శాసనాలను, తాళ ప్రతులను, రాతప్రతులను సేకరించడంలో ఎంత శ్రద్ధ చూపుతాడో, ఆదిమానవుల రేఖాచిత్రాల మీద అంతే శ్రద్ధ చూపుతాడు. వేమన అధ్యయనం మీద అంతే శ్రద్ధ వహిస్తాడు. ఇంత వరకు హరినాథ్ ప్రచురించిన వ్యాసాలు, పుస్తకాలు రాయలసీమ అధ్యయనానికి ఎంతో తోడ్పడతాయి. అందువలనే కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారాన్ని ఇటీవల అందుకున్నాడు. విశ్వవిద్యాలయ తెలుగుశాఖలోని యువ అధ్యాపకుల కృషితో పోల్చితే ఒక పల్లెటూరి బడిపంతులుగా బోధిస్తూ, పరిశోధనారంగంలో హరినాథ్ చేస్తున్న కృషి అనుసరణీయమైనది.

సీమ కథా చరిత్ర రచనలో ఒక గొప్ప మలుపు ఇప్పుడు హరినాథ్ వెలువరి స్తున్న 'మొదటితరం రాయలసీమ కథలు' (1882–1944). సులభంగా అందుబాటులో లేని ఎనిమిది పత్రికల నుంచి 42 కథల్ని సేకరించి ఇందులో ప్రచురిస్తున్నాడు. సేకరణతో పాటు ఆ కథల ప్రచురణ వివరాలను, సంపాదకులు, పాఠకుల లేఖలను, రచయితల వివరాలను ఇవ్వడం అతని చారిత్రకదృష్టికి ఒక దృష్టాంతం. సీమకథ మూలాల అన్వేషణతో పాటు అనుబంధంలో 15, జనవరి,1927 శ్రీసాధన పత్రికలో హెచ్. నంజుండరావు రాసిన 'చిన్నకథలు' అనే కథాలక్షణ పరామర్శకు సంబంధించిన వ్యాసాన్ని చేర్చడం ఒక విశేషం.

కథా లక్షణాలను పరామర్శించిన ఆ వ్యాసం స్ఫూర్తితో నాటి కథారచయితలు ఎంత వరకు రాశారో, పరిశీలించదగిన విషయం. సీమ కథా సాహిత్య విమర్శలో ఈ వ్యాసం పరిగణించదగ్గది. ఈ వ్యాసానికి ఆధారం 1913లో హడ్సన్ రాసిన 'హిస్టరీ ఆఫ్ ఇంగ్లీష్

లిటరేచర్' అయి ఉండాలి. హడ్సన్ కథానికతో పాటు వివిధ ప్రక్రియలను ఆ పుస్తకంలో పరామర్శించారు. నంజుండరావు తన వ్యాసంలో కొన్ని అంశాలను పేర్కొన్నారు. అందులో ముఖ్యమైన అంశం కథా రచన నైపుణ్య ప్రకటనలు, 'యడ్గర్ అలెన్ పో' చిన్న కథలను ప్రస్తావించడం, చారిత్రక కథకు కథానిక రచనకు ఉన్న భేదాన్ని పట్టించడం, కళాస్వభావం ఏమిటో తెలియజెప్పడం.

హరినాథ్ తను సేకరించిన కథలు మరికొన్ని ఉండవచ్చు. ఈ పుస్తకంలో ఉన్నవి 42 మాత్రమే. తొలి కథల అన్వేషణ ఇటీవల అంటే గత రెండు దశాబ్దాల నుండి ఒక ముఖ్యమైన పరిశోధన అంశం అయింది. గురజాడ 'దిద్దుబాటు' కథకు ముందే వచ్చిన దాదాపు 102 కథల్ని వివినమూర్తి పట్టుకోగలిగినాడు. వీటిలో 92 కథలతో 'దిద్దుబాటలు' అన్న సంకలనంగా ప్రచురించి అందించాడు.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి, తవ్వా వెంకటయ్యలు సంగిశెట్టి శ్రీనివాస్ లాగా రాయలసీమ అస్థిత్వ ఆకాంక్ష మనుసునిండా నింపుకొని తొలినాటి రాయలసీమ కథల కోసం అన్వేషించారు. ఈ అన్వేషణా క్రమంలో హరినాథ్ ఈ సంకలనంలో కథల్ని కూర్చడమే కాకుండా ఆ కథలలోని సామాజిక నేపథ్యాన్ని, శిల్ప లక్షణాలను, భాషాశైలిని గురించి సంగ్రహంగా తన ముందుమాటలో తెల్పినాడు. శ్రీసాధన పత్రిక లోని అన్ని కథలు వాడుక భాషలో కంటే, కావ్యభాషలోనే ఎక్కువగా ఉన్నాయి. వాడుకభాష ఉద్యమంలో సీమ వెనుకబాటుతనానికిది నిదర్శనమేమో ఆలోచించాలి. సీమలో అప్పటికి పండితభాష ఏలుతోందనడంలో పెద్దగా శ్రమపడనక్కరలేదు. అయితే సృజనాత్మక వచన రచన రంగంలో సీమ రచయితలు ప్రవేశించడం, చిన్నకథ మీద తమ దృష్టిని నిల్పడం తప్పనిసరిగా ఒక ముందడుగుగా భావించాలి.

హరినాథరెడ్డి అందిస్తున్న 'మొదటితరం రాయలసీమకథలు' సీమలో కథానిక ఎదుగుబాటుకు ఎంతగానో తోడ్పడుతుంది. ఆత్మముగ్ధత్వం లేకుండా ఈ కథలలోని వస్తు శిల్పాలను లోతుగా పరామర్శించాల్సిన కర్తవ్యం ఈనాటి సాహిత్య విమర్శకుల మీద ఉంది. ఏమైనా ప్రాంతీయ కథాచరిత్ర మూలాలను వెలికితీసి పాఠకుల ముందు ఉంచుతున్న హరినాథ్ అభినందనీయుడు. యువ పరిశోధకులకు అనుసరణీయుడు.

**6-2-2015,** **- కేతు విశ్వనాథరెడ్డి**

**కడప.**

**సింగమనేని నారాయణ,**

**ప్రముఖ కథారచయిత, సాహిత్య విమర్శకులు**

**13-2-505, రామచంద్రనగర్,**

**అనంతపురము - 515 001.**

**సెల్: 9493423442**



## అవసరమైన పరిశోధన

గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' కంటే ముందుగానే తెలుగు కథ ప్రాణం పోసు కుందని, ఇటీవలి పరిశోధనలు కొన్ని వెల్లడి చేస్తున్నాయి. 'వివినమూర్తి' సంపాద కత్వంలో 'దిద్దుబాటు' కంటే ముందు వచ్చిన 92 కథలు గల ఒక సంకలనాన్ని 'దిద్దుబాటలు' పేరుతో 'తానా' ప్రచురించింది. పరిశోధకులకే గాదు, పాఠకులకు కూడా ఈ సంకలనం ఆసక్తికరమైనదే.

ఇక రాయలసీమ విషయానికొస్తే రాయలసీమలో ఆధునిక కథ, చాలా ఆసల్యంగా ప్రారంభమైందనీ, చిత్తూరు జిల్లాకు చెందిన కె.సభా (1944), అనంతపురం జిల్లాకు చెందిన జి.రామక్రిష్ణ (1941) గార్లు రాయలసీమ కథకు ఆద్యులని, ఇంత కాలంగా మనం అనుకుంటూ వస్తున్నాము. అయితే ఈ మధ్య కాలంలో లభించిన కొన్ని ఆధారాల వల్ల రాయలసీమ కథ, మరికొంత ముందే ప్రారంభమైనట్టు కొందరు పరిశోధకులు, లభించిన కథల ఆధారంగా నిరూపిస్తున్నారు. అప్పిరెడ్డి హరినాథరెడ్డి, తవ్వా వెంకటయ్య గార్లు ఆ పరిశోధకులు. ఇటీవలే తవ్వా వెంకటయ్య గారు 'రాయలసీమ కథలు – తొలితరం' పేరుతో 25 కథలతో ఒక సంకలనాన్ని ప్రచురించి నారు. 1926–27 మధ్య కాలంలో ప్రొద్దుటూరు నుంచి వచ్చిన 'భారత కథానిధి' అన్న పత్రికలో వచ్చిన కథలవన్నీ.

ఇదిగో, ఇప్పుడు అప్పిరెడ్డి హరినాథరెడ్డి గారి ఈ పుస్తకం. అప్పిరెడ్డి మరి కొంత ముందుకు వెళ్లి 1882 నాటి నుండి 1944 వరకు రాయలసీమ నుండి వెలు వడిన 42 కథలతో ఈ సంకలనం తెస్తున్నారు. రాయలసీమ కథ పుట్టుక, పరిణామం గురించి, ఆ కథల వస్తురూప, భావజాలాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తిగల వారికి ఈ సంకలనం మంచి **Hand Book.** భవిష్యత్ పరిశోధకులకు ఈ రెండు పుస్తకాలూ, ఒక ఒరవడిని తీర్చిదిద్దుతాయనటంలో ఎలాంటి సందేహము లేదు.

ఈ సంకలనంలో 'పెన్నేటిపాట' కావ్యకర్త విద్వాన్ విశ్వం గారు రాసిన 9 కథలు ఉండటం ఒక విశేషం. ఆ కథలన్నీ కూడా 1939– 1944 మధ్య కాలంలో 'శ్రీసాధన' పత్రికలో వచ్చినవే. ఈ సంకలనంలోని ఇతర కథకుల కథలన్నీ, గ్రాంథిక భాషలో ఉండగా, విశ్వంగారి కథలు మాత్రం వ్యవహారికంలో ఉండటం గమనార్హం. అలాగే

జి.రామకృష్ణ గారి 'చిరంజీవి' కథ, కథనం వ్యవహారికంలోనూ, పాత్రల భాష అనంతపురం 'మాండలికం'లోనూ ఉండటం కూడా మరింత గమనార్హం. విద్వాన్ విశ్వం, జి. రామకృష్ణగారు, పత్రికా రంగంలో కూడా పనిచేసినవారు కావటం వల్లనే, ఆధునిక కథకు, ఆధునిక భాషను ఉపయోగించినారని అర్థం చేసుకోవచ్చు.

కె.సభా రాసిన, ఇంత వరకూ ఎక్కడా ప్రచురితం కాని 'కడగండ్లు' కథను సేకరించి, ఈ సంకలనంలో అప్పిరెడ్డి చేర్చటం అతని పరిశోధనా కృషికి నిదర్శనం.

చాలా కథలు, స్థల కాలాల నేపథ్యంలో నడిచి వుండటాన్ని ఈ సంకలనంలో మనం గమనించవచ్చు.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి పరిశోధనా కృషి, ఈ పుస్తకానికి ఆయన రాసిన ముందుమాట ద్వారా వ్యక్తమౌతుంది. ఆ కృషినే, ఆ సామర్థ్యాన్నీ వివరించాలంటే మొత్తం ఆ ముందుమాటను నేను యిక్కడ రాయాల్సి ఉంటుంది. రెండు, మూడు విషయాలు మాత్రం ప్రస్తావిస్తాను.

1. కేవలం కథలు సంపాదించే దృష్టి మాత్రమే గాకుండా, ఆ కథల నిర్మాణాన్నీ, భాషనూ వస్తువునూ, భావజాలాన్ని కూడా పరిశోధకుడు పరిశీలించినాడు.
2. తన పరిశోధనకు సహకరించిన పాతతరం పెద్దలనూ పరిశోధకులనూ, గ్రంథాలయాలనూ పాఠకులకు పరిచయం చేసినాడు.
3. కథతో పాటు కథకు సంబంధించిన చర్చను కూడా ఇందులో చేర్చినాడు.
4. కథలను ప్రచురించిన అప్పటి పత్రికల కృషిని, చాలా సాకల్యంగా పాఠకులకు వివరించినాడు.
5. నాటి సాంఘిక జీవితం, అప్పటి కథల్లో ప్రతిబింభించిన వైనాన్ని కూడా సమీక్షించినాడు.
6. అప్పట్లో వచ్చిన, కథానిక లక్షణాలకు సంబంధించిన వ్యాసాన్ని కూడా పాఠకులకు అందించినాడు.

ఇవన్నీ కూడా సమగ్ర పరిశోధనకు సంబంధించి అతని కృషిని వెల్లడి చేస్తాయి. అభిరుచితోనూ, సాహిత్య స్పృహతోనూ, తెలుగు కథకు తన పరిశోధన ఏ కొద్ది మాత్రమైనా ఉపయోగపడగలదనే తపనతోనూ, అప్పిరెడ్డి ఈ పనికి పూనుకున్నాడని పాఠకులకు అర్థమౌతుంది.

పరిశోధన అంటే, ఎత్తిపోతలుగా, ఉటంకింపులుగా స్థిరపడిన వర్తమానంలో, నిజమైన పరిశోధన అంటే ఎలా ఉండాలో, ఎలా ఉంటుందో ఈ గ్రంథం నిరూ పిస్తున్నది. ఇలాంటి అవసరమైన పరిశోధనకు తెలుగు సాహిత్యం ఇప్పుడు 'డిమాండ్' చేస్తున్నది. అప్పిరెడ్డికి నా అభినందనలు.

**4-3-2015,**

**– సింగమనేని నారాయణ**

**అనంతపురము.**

# సంపాదకుని మాట

'మొదటితరం రాయలసీమ కథలు' పేరున ప్రచురించిన ఈ కథాసంకలనంలోని కథలు వస్తురీత్యా లేదా పత్రికలు వెలువడిన ప్రాంతం, రాసిన రచయితల దృష్ట్యా రాయలసీమ ప్రాంతంతో ఏదో ఒక రకంగా ముడిపడి ఉన్నాయి. మొత్తం ఈ 42 కథలలో రాయలసీమ ప్రాంతానివే అనదగ్గవి, స్థలకాలాలతో రాయలసీమ జీవితాన్ని రేఖామాత్రం గానైనా ప్రస్ఫుటింపజేసేవి 17 కథలు ఉన్నాయి. మిగిలిన కథలు సార్వకాలీనంగా ఎక్కడైనా జరిగేవే అయినప్పటికి ఆధునిక కథాసాహిత్యంలో సీమకథకుల విస్తృతిని అవగాహన చేసుకోవడానికి వీలుంటుందని ఈ సంకలనంలో చేర్చాను.

జనవినోదిని (1882), హిందూసుందరి (1913), సౌందర్యవల్లి (1918), శారద (1922), శ్రీ సాధన (1926-1941), తెనుఁగుతల్లి (1937), విజయవాణి (1941), చిత్రగుప్త (1944) తదితర పత్రికల నుండి ఈ కథలను సేకరించాను. వీటిలో జనవినోదిని, హిందూసుందరి, శారద, చిత్రగుప్త పత్రికలు ఇతర ప్రాంతాలనుండి వెలువడగా, మిగతా పత్రికలు రాయలసీమ ప్రాంతం నుండే వెలువడినాయి. శ్రీసాధనపత్రిక నుండి 31 కథలను, తెనుఁగుతల్లి పత్రిక నుండి 4 కథలను, మిగిలిన ఆరు పత్రికల నుండి ఒక్కొక్క కథను, సంకలనగ్రంథం నుండి 'సుగాలీ కుటుంబం' అనే కథను ఇందులో సమకూర్చాను. ఈ సంకలనంలోని కథలలో కందాళ శేషాచార్యులు 10 కథలు, విద్వాన్‌విశ్వం 9 కథలు, టి.అర్ముగంపిళ్ళై 3 కథలు రాసినవి కాగా, మిగతా కథలు ఒక్కొక్క రచయిత రాసినవి ఉన్నాయి. కథకుల పేర్లు లేని కథలు 7 కాగా, మారుపేర్లతో ఉన్నవి 2 కథలు ఉన్నాయి. కథకుడి పేర్లు స్పష్టంగా ఉన్న కథలు 14 కథలు ఉండగా, వారిలో ఆరు మంది కథకుల వివరాలు లభ్యంకావడంలేదు. అసంపూర్తిగా ఉన్న 'ఒక చిన్నకథ' అనే కథ కూడా ఈ సంకలనంలో చోటుచేసుకుంది.

మొదటితరం, రెండవతరం అని స్పష్టంగా ఒక గీత గీయలేనప్పటికి ఆధునిక రాయలసీమ కథాసాహిత్యంలో కె.సభా గారిని ఒక కొండగుర్తుగా చెప్పవచ్చు. కె.సభాకు ముందు, తరువాత రాయలసీమ కథాసాహిత్యం అని స్థూలంగా విభజించుకోవచ్చు. కె.సభా 1944 ఏప్రిల్ నెలలో చిత్రగుప్త పత్రికలో రాసిన 'కడగండ్లు' కథ మొదలుకొని తరువాత కాలంలో 300 దాకా కథలు రాసి సీమ కథాసాహిత్యంలో చెరగని ముద్రవేశాడు. కథాసాహిత్యంలో తరువాత తరాలని ప్రభావితం చేసి ఆదర్శప్రాయుడయ్యాడు. సభా అనంతరం రాయలసీమ కథాసాహిత్యంలో చాలా మార్పులు, పరిశోధనలు జరిగాయి. 1980ల నుండి రాయలసీమ ప్రాంతీయ అస్థిత్వం ఆధారంగా సాహిత్య, సామాజిక, రాజకీయ రంగాలలో పెద్ద ప్రయత్నమే జరిగింది. స్వాతంత్ర్యానికి పూర్వం రాయలసీమలో వెలువడిన సాహిత్యం సరైన క్రమంలో నిక్షిప్తం కాలేదు. కథాసాహిత్య ప్రక్రియలో ఈ లోటు మరింత స్పష్టంగా కనిపిస్తుంది.

గతానికి సంబంధించి లభిస్తున్న ఏ కొద్ది సమాచారాన్నైనా క్రోడీకరించి భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఆ ప్రయత్నంలో భాగంగానే కె.సభా కథా రచన ప్రారంభానికి పూర్వం అంటే 1944కు పూర్వం రాయలసీమలో లభిస్తున్న కథలను సంకలితం చేసి ఈ పుస్తకాన్ని మీ ముందుకు తెస్తున్నాను.

ప్రాచీన సంప్రదాయ సాహిత్యానికి కేంద్రం కావటం, పద్యసాహిత్యమే గొప్ప సాహిత్యంగా బాసిల్లటం, వ్యవహార భాషోద్యమ ప్రభావం లేకపోవటం, విద్యా సౌకర్యాలతో పాటు సామాజిక, ఆర్థిక రంగాలలో అంతంత మాత్రమే పురోగతి ఉండటం, సమకాలీన సామాజిక జీవితాన్ని, వెనుకబాటుతనాన్ని అర్థం చేసుకోలేకపోవటం తదితర అనేక కారణాలవల్ల రాయల సీమలో ఆధునిక సాహిత్య ప్రక్రియలు వేగంగా వికాసం పొందలేదని సీమ సాహిత్య విమర్శకులు ఆయా సందర్భాలలో విశ్లేషించారు. నిజానికి గత కొన్ని శతాబ్దాల తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలిస్తే అన్ని సందర్భాలలోనూ రాయలసీమ ప్రాంతం మిగతా ప్రాంతాలతోపాటు సమాంతరంగా కాస్త అటుఇటు అడుగులు వేస్తోందనే చెప్పాలి. తొలితెలుగు వచనశాసనం, ప్రబంధసాహిత్యం, శతకసాహిత్యం, సంకీర్తన సాహిత్యం, వచనకావ్యాల వికాసం, నాటకం, నవల ఇలా అన్ని సాహిత్య ప్రక్రియల పురోగతికి సీమ ప్రాంతం తన వంతు ప్రాతినిధ్యం వహించింది. ఆ సాహిత్య చరిత్ర పరిణామాలను సరైన పద్ధతులలో దాఖలు చేసుకోకపోవడమే మన తప్పిదం. ఇవేమీ పరిగణలోకి తీసుకోకుండా మనల్ని మనమే వెనుకబడిపోయామనే ఒక రకమైన ఆత్మన్యూనతా భావంలో కొట్టుమిట్టాడుతున్నాం. ఇదే భావం ఆధునిక సాహిత్య ప్రక్రియలోను కొనసాగింది.

1947 సం॥ దాకా మనకు తెలిసినంతలోనే రాయలసీమలో అరవై దాకా పత్రికలు వెలువడినాయి. ఈ పత్రికలన్నీ కూడా ఈ ప్రాంత సాహిత్య, సామాజిక, సాంస్కృతిక వికాసానికి ఇతోధికంగా తోడ్పడ్డాయి. మన దురదృష్టవశాత్తు వాటిలో ఏ కొన్ని మాత్రమే లభిస్తున్నాయి. ఇంకా చాలా అక్కడక్కడ అటకలపై మిగిలే ఉన్నాయి. యాభై ఏళ్ల క్రితం ప్రచురితమైన అనేక పుస్తకాలు ప్రస్తుతం అలభ్యాలుగా ఉండటం అత్యంత బాధాకరమైన విషయం. ఇవన్నీ వెలుగులోకి వచ్చి పరిశోధనలు జరిగితే వెనుకబడిన ప్రాంతాలలో తమకున్న పరిమితుల్లోనే ఏ మేరకు సమకాలీన స్పృహతో, సామాజిక చైతన్యంతో కొనసాగారో స్పష్టమవుతుంది.

ప్రస్తుతం రాయలసీమ కథా విషయానికొస్తే... ఉద్యోగరీత్యా ఈ ప్రాంతంలో వుండిన చింతాదీక్షితులు సీమలోని గిరిజనుల జీవిత మాధారంగా 'సుగాలీ కుటుంబం' కథను చిత్రించడంతో ఈకథనే రాయలసీమ జీవితమున్న తొలికథగా విమర్శకులు గుర్తించారు. 1941లో 'చిరంజీవి కథను అనంతపురములో ఉండే గుత్తి రామకృష్ణ రాశారు. వీరినే రాయలసీమ తొలి కథకుడిగా ఇన్నాళ్లు భావిస్తూ వచ్చాం. పరిశోధకులు, విమర్శకులకు సరైన ఆధారాలు లభ్యం కాకపోవడంతో ఈ అభిప్రాయాలలోనే ఉండాల్సి వచ్చింది. కానీ ఈ మధ్యకాలంలో సరికొత్త ఆధారాలు లభిస్తుండడంతో రాయలసీమ కథా సాహిత్య విషయమై చాలా కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

2010 సంవత్సరంలో నాకు లభ్యమైన 'శ్రీసాధన పత్రిక' 1926 ఆగస్టు 14 నుండి వారపత్రికగా పప్పూరు రామాచార్యుల సంపాదకత్వంలో అనంతపురం కేంద్రంగా వెలువడింది. ఈ పత్రికలో 1926 అక్టోబరు నెల మొదలుకొని 1941 దాకా దాదాపు 31 కథలు ప్రచురితమయ్యాయి. ఈ కథల వివరాలను 'తెలుగువెలుగు' (ఫిబ్రవరి 2014) మాసపత్రికలో 'రాయలసీమ కథారత్నాలు' అనే వ్యాసంలోనూ, 'సీమసాహితీస్వరం- శ్రీసాధన పత్రిక' అనే నా పుస్తకంలోనూ సవివరంగా పాఠకులకు అందించాను. ఈ కథలన్నింటిని ఒక సంకలనంగా ప్రచురిస్తే బాగుంటుందని అనిపించింది. సాధన పత్రికలోని అంతర్గత ఆధారాలనుబట్టి మరిన్ని పత్రికలలో ఆరోజులలో కథలు వెలువడినట్లు తెలిసింది. లభిస్తున్న మరికొన్ని పత్రికలలోని కథలను కూడా ఇందులో చేరిస్తే సమగ్రంగా ఉంటుందని భావించి ఈ సంకలనాన్ని ప్రచురించాను.

వేమన విశ్వవిద్యాలయంలో పరిశోధన పూర్తిచేసిన తవ్వా వెంకటయ్య రాయలసీమ కథలపై పరిశోధన చేస్తున్న క్రమంలో 'భారత కథానిధి' పత్రికను పరిశీలించాడు. 1926 జూలై నుండి ప్రొద్దుటూరు కేంద్రంగా ఈ పత్రిక వెలువడింది. ఈ పత్రిక వ్యవస్థాపకుడు పైడిమర్రి పిచ్చయ్యచౌదరి కాగా, ప్రకాశకులుగా యన్.సుబ్బయ్యశ్రేష్ఠి ఉండేవారు. ప్రధాన సంపాదకులుగా సి.నరసింహశాస్త్రి కొనసాగారు. అన్ని రకాల కథలకు ఈ పత్రిక విశేష ప్రాధాన్యమిచ్చేది.ఆ పత్రికలోని రాయలసీమ కథా విషయాలను '1941కి ముందూ సీమకథ' అనే వ్యాసంలో (21-1-2013ఆంధ్రజ్యోతిలో) తవ్వా వెంకటయ్య తెలియజేశాడు. 1926 జూన్ నెలలో 'మతబేధం', 'మీనాక్షి ' అనే కథలను రాసిన అయ్యగారి నరసింహమూర్తి, బొగ్గవరపు నాగవరదయ్య శ్రేష్ఠిలను లభిస్తున్నంతలో తొలి రాయలసీమ కథకులుగా పేర్కొన్నాడు. ఆధునిక కథాలక్షణాలతో కూడిన కథలు ఈ పత్రికలో 50 దాకా ఉన్నట్లు తవ్వా వెంకటయ్య తెలిపారు. వాటిలో 1926-27 సం॥లలోని 25 కథలను ప్రత్యేక సంకలనంగా ప్రచురించాడు. ఈ ప్రయత్నం చేసిన తవ్వా వెంకటయ్యకు అభినందనలు.

తెలంగాణ ప్రాంతంలోని సాహిత్యపరిశోధకుడు, విమర్శకుడు సంగిశెట్టి శ్రీనివాస్ గారు 1902 సంవత్సరంలో సత్తిరాజు సీతారామయ్య సంపాదకత్వాన ఏలూరులో ప్రారంభమైన 'హిందూసుందరి' పత్రిక ఆధారంగా 'తొలి తెలుగు కథలు - బండారు అచ్చమాంబ' పుస్తకాన్ని ప్రచురించారు. అప్పటి వరకు తొలి తెలుగు కథకుడిగా నిర్ధారించ బడిన గురుజాడ అప్పారావు స్థానంలో బండారు అచ్చమాంబను సంగిశెట్టి శ్రీనివాస్ నిలిపాడు.తొలి తెలుగు కథలను వెలుగులోకి తీసుకురావడం కోసం ఇతను చేసిన ప్రయత్నం ప్రశంసనీయం. తవ్వా వెంకటయ్య రాసిన వ్యాసానికి ప్రతిస్పందనగా '1918లోనే సీమ తొలికథ' (10-02-2013 ఆంధ్రజ్యోతి) వ్యాసాన్ని సంగిశెట్టిగారు రాశారు. 1918 అక్టోబరు నెలన సౌందర్యవల్లి మాసపత్రికలో ప్రచురితమైన 'కడపటి పైసా' కథను రాయలసీమ తొలి కథగా తెలియజేశారు. కథకుని పేరు లేకుండా ప్రచురితమైన ఈ కథను గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు రాసి ఉండవచ్చునని వీరు అభిప్రాయపడ్డారు. 1918 సెప్టెంబరు నెలన గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి

సతీమణి రామాబాయి సంపాదకత్వాన 'సౌందర్యవల్లి' మాసపత్రిక వెలువడింది. అక్టోబరు సంచిక మాత్రమే లభిస్తోంది. మిగతా సంచికలు కూడా లభిస్తే సీమ తొలి కథల విషయమై మరింత స్పష్టత వస్తుంది.

సంగిశెట్టి శ్రీనివాస్ గారిని సీమ తొలికథల విషయమై సంప్రదించగా చిత్తూరు జిల్లాలో 1937లో కుమారదేవ సంపాదకత్వాన వెలువడిన 'తెనుఁగుతల్లి' పత్రికలోని కథలను తెలియజేశాడు. ఈ పత్రిక సంస్థాపకులు సి.వి.రాజారెడ్డి (వల్లివేడు) కాగా, సంస్తారకులుగా ఈ.వెంకట్రావు గారు కొనసాగారు. పత్రిక నిర్వహణ సభ్యులుగా సి.అణ్ణామలై పిళ్లె (పలమనేరు), జి.రామలింగారెడ్డి (గుండ్లపల్లి), యన్. చెంగల్‌రెడ్డి (పాకాల), యం.వి.షేక్ ముహమ్మద్ రావుతర్ (పాకాల), యన్. రంగయ్యనాయుడు (పాకాల), యస్. దొరస్వామిశెట్టి (చిత్తూరు), పి.రంగస్వామి (తిరుమల), సి.రామచంద్రారెడ్డి (పళ్ళిపట్టు)లు ఉండేవారు. ఈ పత్రికలో రావూరు చంగనార్య, టి.ఆర్ముగంపిళ్ళెలు రాసిన కథలను సంగిశెట్టి శ్రీనివాస్ నాకు అందించాడు. టి.ఆర్ముగంపిళ్ళె మద్రాసులోని ముత్యాలుపేట హైస్కూలులో ప్రధానాంధ్రోపాధ్యాయుడిగా ఉండేవారని తెలుస్తోంది. ఇతను 'మదవిదలనము' అనే వచన గ్రంథం రాసినట్లు అనంతపురము ఆర్ట్సుకళాశాలలోని పుస్తకాల క్యాటలాగ్ (స్టాక్ నెం.2123)లో ఉంది.

వీటన్నింటికి మించి సంగిశెట్టి శ్రీనివాస్ గారు1913 అక్టోబరు 1న 'హిందూ సుందరి' పత్రికలో (సంపుటం:11,సంచిక:5) గాడిచర్ల హరిసర్వోత్తమరావు రాసిన 'రోజాంబ-శ్వేతాంబ' కథ వివరాలను తెలియజేశారు. ఈ కథ ప్రాచీన రూపంగా, అద్భుత కథగా అనిపించినప్పటికీ శిల్పపరంగా కథ ఒదిగిన తీరు చాలా నైపుణ్యంగా ఉంది. ప్రత్యేకించి రాయలసీమ జీవితం లేకున్నా, రాయలసీమ ప్రాంతం వారైన గాడిచర్ల హరిసర్వోత్తమ రావుగారు ఈ కథను రాశారు.

సీమ తొలికథల విషయమై నేను చేస్తున్న పరిశోధనను అభినందిస్తూ ఎంతో సహృదయతతో 'హిందూ సుందరి',' సౌందర్యవల్లి','తెనుఁగుతల్లి' పత్రికలలోని సీమ సంబంధ కథలను ఈ సంకలనంలో ప్రచురించేందుకు తోడ్పడిన సంగిశెట్టి శ్రీనివాస్ గారికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

తొలితెలుగు కథలపై మరింత విస్తృంగా అధ్యయనంచేసి 'దిద్దుబాటలు' పేరున 'దిద్దుబాటు'కథ(1910)కు ముందునాటి 92 కథలను సంకలనంగా ప్రచురించిన 'వివినమూర్తి' గారి ప్రయత్నం ఎంతో విలువైనది. వీరు శ్రీకాకుళం కథానిలయం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. 1882 జులై నెల నుండి 1883 ఏప్రిల్ వరకు జనవినోదిని పత్రికలో 'ఒక సంవత్సరము పల్లెటూరి యందునికి' లేక 'ఋతుచర్య' అనే శీర్షికన అయిదు భాగాలుగా ప్రచురించిన ఒక పెద్ద కథను పై సంకలనంలో సమకూర్చాడు.'జనవినోదిని' పత్రిక 1875లో ప్రారంభమైంది. **Madras School and Vernacular Literature Soceity** వారు ఈ పత్రికను ప్రచురించేవారు. ఈ పత్రికలో వెలువడిన పై కథ బహుశా తెలుగులో తొలివరుస కథ కావచ్చునని 'వివినమూర్తి' పేర్కొన్నారు. కథకుడి పేరులేకుండా వెలువడిన ఈ కథ

గ్రాంధిక భాషలో, ఋతువుల వర్ణన ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తుంది. ఆయా ఋతువుల చర్యలను 'చిన్నకథ' రూపంలో తెలియజేస్తానని స్పష్టంగా 'చిన్నకథ' అని ఆ కథకుడు అప్పట్లోనే పేర్కొవడం విశేషం.

ఈ కథ రాయలసీమలోని ఒక పల్లె కేంద్రంగా నడుస్తుంది. నెల్లూరు, కడపల మధ్య పెన్నేటి ఒడ్డున వుండే సోమేశ్వరం కనుమకు ఈశాన్య భాగాన ఒక కోనలోని బోయపల్లె నేపథ్యంగా కథ కొననసాగుతుంది. చెంచునాయుడు అనే బోయదొర అతని ఇద్దరు కుమార్తెలు పేరక్క, బాలక్కలు, కుమారుడు కొండలరాయుడు కథలో ప్రధానపాత్రలు. వీరు సోమేశ్వరము నుండి ఎల్లంపేట మీదుగా రాజంపేటకు వెళ్లి, అక్కడి నుండి పొగబండిలో తిరుపతికి వెళ్లడం, చంద్రగిరి కోటను చూసి తిరిగి స్వగ్రామం చేరుతారు. ఈ భాగం కథంతా వసంత, గ్రీష్మ, వర్ష, శరదృతువుల కాలంలో జరుగుతుంది. ఆ తరువాత నెల్లూరు మీదుగా ప్రళయ కావేరి చేరి అక్కడి నుండి చెన్నపట్నం వెళ్లి సందర్శించి వెనుదిరిగి బోయపల్లెకు వచ్చే కథాభాగమంతా హేమంత, శశిరఋతువులలో జరుగుతుంది. ఒక సంవత్సర కాలంలో యాత్రా రూపకంగా సాగిన ఈ కథ అప్పటి రాయలసీమ ప్రాంతంలోని గ్రామీణ జీవనం, సంప్రదాయాలు, ఉత్సవాలు, పండుగలు, వ్యవసాయం, పశువులు, అడవులు ఇలా అనేక అంశాలను ప్రతిబింభిస్తుంది. స్థలకాలాలతో పాటు నిర్దీష్టమైన వస్తువుతో ఆకట్టుకునేలా సాగే ఈ కథను రాయలసీమ స్థానిక జీవితం తెలిసినవారే రాసిఉంటారు. ఇప్పటిదాకా లభిస్తున్నంతలో 1882 లోని ఈ 'ఋతుచర్య' కథనే రాయలసీమలో తొలికథగాను, రాయలసీమ ప్రాంతపు జీవితమున్న తొలికథగాను పేర్కొనవచ్చు. కథకుడి పేరు లేనందున ఆ కథకుడెవరో చెప్పలేము. ఈ కథను ఈ సంకలనంలో ప్రస్తావించేందుకు సహృదయతతో అనుమతించిన వివినమూర్తిగారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

1913 అక్టోబరున హిందూ సుందరి పత్రికలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు రాసిన 'రోజాంబ–శ్వేతాంబ' కథలో స్పష్టంగా కథకుడి పేరు ఉంది. 1918 నాటికి సౌందర్యవల్లి పత్రికలో 'కడపటిపైసా' కథతో సీమకథ వస్తుశిల్పాలలోను, భాషాపరంగాను స్పష్టమైన రూపం తీసుకుంది. 1921, 23 సంవత్సరాలలో వెలువడిన 'సుగాలీ కుటుంబం', 'అచ్చుబాటుకాని చదువు' కథలతో సీమకథ ముందడుగు వేసింది. 1926 సంవత్సరంలో రాయలసీమలో శ్రీసాధన, భారతకథానిధి పత్రికలు ప్రారంభమై విస్తృతంగా ప్రజాబాహుళ్యం లోకి వ్యాపించాయి. పై రెండు పత్రికలలోనూ రాయలసీమ కథ కొత్తపుంతలు తొక్కటం మొదలైంది. ఈ స్థాయిలో 1926లో రాయలసీమలో కథ ప్రారంభమైందంటే అంతకు ముందు కూడా సీమలో తన స్థానం నిలుపుకునే ఉంటుంది.

1882 నుండి 1925 వరకు నాలుగు దశాబ్ధాల కాలంలో రాయలసీమ జీవితానికి సంబంధించి లేదా రాయలసీమ కథకులకు సంబంధించి కేవలం నాలుగైదు కథలు మాత్రమే కనిపిస్తుండడం ఆలోచించాల్సిన విషయం. ఇదే సమయంలో కోస్తాంధ్ర ప్రాంతంలో కథ వేగవంతంగా అభివృద్ధి చెందింది. ఆ పత్రికలలోనే అడపాదడపా రాయలసీమ కథలు వచ్చేవి.

కోస్తా ప్రాంతంలో 1875లో 'జనవినోదిని', 1881లో 'చింతామణి', 1884లో 'హిందూజన సంస్కారిణి' 1889లో 'మహారాణి', 1893లో 'తెలుగుజనాన పత్రిక', 1896లో 'బాలిక', 1895లో 'శారద', 1902లో 'హిందూ సుందరి', 1902లో 'కృష్ణపత్రిక' 1903లో 'కల్పలత', 1904లో 'సావిత్రి', 1905లో 'సువర్ణలేఖ', 1910లో 'ఆంధ్రభారతి' తదితర అనేక పత్రికలు ప్రారంభమై వెలువడ్డాయి. ఆధునిక సాహిత్య ప్రక్రియల వికాసానికి అవి ఎంతగానో తోడ్పడినాయి. ప్రస్తుతం ఆ పత్రికలు లభిస్తుండడం వలన ఈ విషయాలు తెలుస్తున్నాయి. ఇంచుమించుగా అదే కాలంలోనూ రాయలసీమలో అనేక పత్రికలు వెలువడినాయి. 1835లో బళ్లారిలో ప్రారంభమైందంటున్న 'సత్యదూత' మొదలుకొని, శ్రీయక్షిణి, భారతి, సన్మార్గబోధిని, ప్రభుద్దాంధ్ర, విజ్ఞానవర్ధిని, ప్రభావతి, పూర్ణిమ తదితర పత్రికలు 1900 దాకా వెలువడినాయి. 1910 నుండి 1925దాకా హంస, సుజ్ఞాన, ఆంధ్రచంద్రిక, శంకరవిజయం, ఆర్యతిలక, విజ్ఞానవల్లిక, రామకథాసుధ, అరుణోదయం, ఆనందచంద్రిక, బాలభారతి, పినాకిని, మాతృసేవ, లోకమాన్య, బ్రహ్మానందిని, భారతమహిళ తదితర పత్రికలు రాయలసీమలో వెలువడినాయి. 1925దాకా మొత్తం 30దాకా పత్రికలు రాయలసీమలో వెలువడినప్పటికీ అందులో 'సౌందర్యవల్లి' పత్రిక ఒక సంచిక మాత్రమే లభిస్తోంది. అప్పటి మరిన్ని పత్రికలు లభిస్తే రాయలసీమ ఆధునిక కథాసాహిత్య ఆవిర్భావ వికాసాలను మరింత సాధికారికంగా అధ్యయనం చేయవచ్చు.

తెలుగు కథాశతజయంతి సంకలనంగా 'నూరేళ్లు నూరుగురు కథకులు - నూరు కథానికలు' (1910-2009) పుస్తకాన్ని 2009లో జయంతి పాపారావు, ఆచార్య ఎస్.శేషారత్నంలు ప్రచురించారు. 1923 జులై నెలన 'శారద పత్రిక'లో కొప్పర్తి నారాయణ రాసిన 'అచ్చుబాటుకాని చదువు' అనే కథ పై సంకలనంలో ఉంది. 1922 సెప్టెంబరు నుండి బందరు కేంద్రంగా 'శారద'మాసపత్రిక వెలువడింది. కౌతా శ్రీరామశాస్త్రి, నడింపల్లి లక్ష్మీనరసింహం, శీలం జగన్నాథరావులు ఆ పత్రికను కొనసాగించేవారు. కథారచయిత కొప్పర్తి నారాయణ గారి వివరాలు తెలియటంలేదు గానీ ఈ కథ బళ్లారి, మదనపల్లి తదితర రాలయసీమ ప్రాంతాల నేపథ్యంగా జరుగుతుంది. ఈ కథను కూడా ఈ సంకలనంలో చేర్చాను. పై సంకలన కర్తలకు కృతజ్ఞతలు.

పి.యస్.ఆచార్య రాసిన 'దాహపుదొంగ' కథ 1935 జూన్ 8న సాధనలో ప్రచురితమయింది. ఈ రచయిత పూర్తి పేరు పాళ్యూరు సుబ్బణాచార్యులు. వీరు మడకశిర తాలూకాలోని 'హరేసముద్రం' గ్రామంలో 1912లో జన్మించారు. 'ఆంధ్రపత్రిక', 'హిందూ పత్రికలలో విలేఖరిగా, ప్రజావాణి పత్రికలో సంపాదకునిగా ఉన్నారు. తొలకరి చినుకులు, క్రొక్కారు మెఱుగులు, లేపాక్షి శిల్పకళాక్షేత్రము, ప్రణయసమాధి తదితర పద్యకావ్యాలను రాసారు. 1930లో అనంతపురము పట్టణంలో వెల్లాల ఉమామహేశ్వరరావు, శ్రీమఠం వాసుదేవమూర్తిలతో కలిసి 'కవికుమార సమితి'ని స్థాపించారు. సుబ్బణాచార్యులు గారు రాసిన 'కథాగుచ్చం' అనే చిన్న కథల సంపుటినో లేదా సంకలనమో ఆ రోజులలో

ప్రచురించారు. ఈ పుస్తకానికి ఉరవకొండలోని నూతలపాటి పేరంరాజు గారు ప్రచురణ కర్తగా ఉన్నారు. ఆర్ట్సుకళాశాలలోని పుస్తకాల క్యాట్‌లాగ్ (స్టాక్ నెం.1970, 1971)లో ఈ పుస్తక వివరాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ పుస్తకం అలభ్యంగా ఉంది. ఈ పుస్తకం లభిస్తే ఆ రోజులలోని కథా వివరాలు తెలిసే అవకాశం ఉంది.

1905లో ప్రస్తుతం తమిళనాడులోని తెలుగు ప్రాంతమైన హొసూరు లో వెలువడిన తెలుగు పత్రికలలో కూడా కథలు వెలువడినాయని తెలుస్తోంది.

ప్రస్తుతం ఈ సంకలనంలోని కథలలో కొన్నింటిని పేర్లు లేకుండాను, మారు పేర్లతోను రాయటం కనిపిస్తుంది. ఆనాటి సమాజంలోని వాస్తవాలను ఎలుగెత్తే క్రమంలో రచయితలు తమనితాము మరుగుచేసుకొని ఉండవచ్చు.ఒకటి రెండు కథలు మినహా మిగతా అన్ని కథలలో స్థల,కాల నేపథ్యాల స్పృహతో సమకాలీన జీవితం చిత్రితమయింది. విద్యా,సామాజిక రంగాలలో ఆధునికత పయనించాలనే తీరు, వలస పాలకుల నుండి బయటపడి స్వాతంత్ర్యం పొందాలనే కాంక్ష, స్వదేశీవస్త్రాల వాడకం,మద్యనిషేధం, జాతీయోద్యమ స్ఫూర్తి, మూఢ విశ్వాసాల ఖండన, విశ్వాసాలు-మానవ పురోభివృద్ధికి ఉపయోగపడాలనే శాస్త్రీయ దృక్పథం, స్త్రీలకు విద్యతో పాటు అన్ని రంగాలలో స్వేచ్ఛా సమానత్వాల ఆవశ్యకత, పురుషాధిపత్య వ్యతిరేకత, వితంతువుల సమస్యలు, పునర్వివాహాలు, వరకట్న సమస్య, మతాల పేరుతో అమాయకులకు జరిగే మోసాలు, ఉపాధ్యాయుల జీవనపోరాటం, మధ్యతరగతి జీవితాల నేపథ్యంలోని పరిస్థితులు, ఆర్థికాంశం మనుష్యులలో ప్రవేశించి అంతరించి పోయే మానవ సంబంధాలు, సమసమాజ నిర్మాణ ఆకాంక్ష, సీమలోని కరువు, సాగునీటి సమస్య, సీమలోని గ్రామీణ, గిరిజనుల జీవితం, వెట్టిచాకిరిలో నలిగిపోయే యువకులు, పెత్తందారుల చేతుల్లో బలైపోయే పేదలు ఇలా వైవిధ్యభరితమైన జీవనపార్శ్వాలు ఈ కథలలో కనిపిస్తాయి.

శిల్పపరంగాను ఈ కథలలో ఆధునిక లక్షణాలు ఉన్నాయి, చాలా కథలు సర్వసాక్షి దృష్టి కోణంలో వాస్తవిక శిల్పమాధారంగా నిర్మితమయ్యాయి. కొన్ని కథలు ఉత్తమ పురుష, సంభాషణాత్మక రూపంలో కొనసాగాయి.వ్యవహారికభాష కూడా కథలలో కనిపిస్తుంది. కథా శీర్షికల నిర్మాణంలో సృజనాత్మకత గోచరిస్తుంది. చాలా కథలకు కథాశీర్షికలుగా ఉపశీర్షికలుగా చిన్నకథ, కథ, కథానిక అనే సూచనలు కనిపిస్తాయి.కొన్ని కథలలో రచయితల పేర్ల స్థానంలో కథకుడు అని మాత్రమే కనిపిస్తుంది. సమకాలీన పరిస్థితులను ప్రత్యక్షంగా వ్యక్తంచేయలేని పరిస్థితులలో ప్రతీకాత్మకంగా వ్యక్తమైన కథలున్నాయి.

1927లోనే 'ఇరువురు యాత్రికులు' కథపై జరిగిన చర్చ, విమర్శలను కూడా ఆ కథతో పాటు ఈ సంకలనంలో అందించాను. అదే సంవత్సరం జనవరి15న 'చిన్నకథలు' శీర్షికన హెచ్.నంజుండరావు రాసిన కథాలక్షణాల వ్యాసాన్ని కూడా ఈ సంకలనంలో అనుబంధంగా అందించాను. ఇవన్నీ సీమ ఆధునిక కథా పురోగతిని సూచిస్తాయి.

భవిష్యత్తులో రాయలసీమ కథలపై మరింత లోతైన అధ్యయనం జరిగితే సీమ తొలికథల విషయమై మరింత తెలిసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ సంకలనంలోని కథల లోటుపాట్లు,

వస్తుశిల్పాలు, బాష, తెలుగు కథాసాహిత్యంలో వీటి స్థానం తదితరాలన్నింటిని నిర్ణయిం చాల్సింది పాఠకులు, విమర్శకులే.

శ్రీసాధన పత్రికలో నా దగ్గరలేని మరికొన్ని కథలను ఈ సంకలనం కోసం ఇచ్చిన సాహితీ సహృదయుడు, యువపరిశోధకులకు అండగా నిలిచే శ్రీ కైప నాగరాజు గారికి (అనంతపురము), విజయవాణి పత్రికలో గుత్తిరామకృష్ణ గారు రాసిన 'చిరంజీవి' కథను ఈసంకలనం కోసం ఇచ్చిన వారి కుమారుడు శ్రీ గుత్తి ఆనందవర్ధన్ (అనంతపురము) గారికి ధన్యవాదాలు. కె.సభా గారు రాసిన తొలికథ 'కడగండ్లు'ను వారి కుటుంబీకుల నుండి సేకరించిన రాతప్రతిని నాకు ఇచ్చి ఈ సంకలనంలో ప్రచురించేందుకు సహకరించిన 'మనసు ఫౌండేషన్' నిర్వాహకులు శ్రీ యం.వి. రాయుడుగారికి ధన్యవాదాలు.

ఈ సంకలనానికి ముందుమాటలు రాసిన శ్రీ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డిగారికి, శ్రీ సింగమనేని నారాయణ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సంకలనం చాలా భాగం పూర్తిఅయి సంవత్సరకాలం కావస్తున్నా ప్రచురించేందుకు పరివిధాలుగా ప్రయత్నించాను. ప్రస్తుతం ఈ పుస్తక ప్రచురణ భారాన్ని మోసిన అబ్జ క్రియేషన్స్ వ్యవస్థాపకుడు, సాహిత్యాభిలాషి శ్రీ కోడీహళ్లి మురళీమోహన్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

**26-01-2015,** **- డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి**

## విషయ సూచిక


**ముందుమాటలు ...**

| | | |
|---|---|---|
| సీమకథా సౌరభం | - కోడీహళ్లి మురళీమోహన్ | II |
| అవిశ్రాంత పరిశోధకుడు | - ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి | IV-V |
| అవసరమైన పరిశోధన | - సింగమనేని నారాయణ | VI-VII |
| సంపాదకుని మాట | - డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి | VIII- XV |

| క్రమ.సం. | రచయిత | సం॥ | పుట |
|---|---|---|---|
| 1.ఒక సంవత్సరము పల్లెటూరియందునికి లేక ఋతుచర్య | - కథకుడి పేరులేదు | 1882 | 19 |
| 2. రోజాంబ, శ్వేతాంబ | - గాడిచర్ల హరిసర్వోత్తమరావు | 1913 | 21 |
| 3. కడపటి పైసా | - కథకుడి పేరులేదు | 1918 | 23 |
| 4. సుగాలీ కుటుంబం | - చింతా దీక్షితులు | 1921 | 25 |
| 5. అచ్చుబాటుగానీ చదువు | - కొప్పర్తి నారాయణ | 1923 | 32 |
| 6. ఒక చిన్నకథ | - కథకుడి పేరులేదు | 1926 | 37 |
| 7. ఇరువురు యాత్రికులు | - రామచంద్ర | 1927 | 42 |
| ఇరువురు యాత్రికులు కథ-విమర్శనము | | | 60 |
| 8. మన బెబ్బులి | - కథకుడి పేరులేదు | 1927 | 65 |
| 9. భగీరథ ప్రయత్నము | - కథకుడి పేరులేదు | 1930 | 73 |
| 10. సన్యాసం | - కథకుడి పేరులేదు | 1930 | 78 |
| 11. దాహపు దొంగ | - పి.యస్.ఆచార్య | 1935 | 82 |
| 12. గెలుపెవరిది | - ప్రభాకరుడు | 1935 | 85 |
| 13.సుశీలా మోహనులు | - యె.యల్. నరసింహారావు | 1935 | 89 |
| 14. ప్రేమబలి | - కథకుడిపేరు లేదు | 1936 | 94 |
| 15. బ్లాకీకుక్క చరిత్ర | - కందాళ శేషాచార్యులు | 1936 | 120 |
| 16. సముద్ర మథనము - స్వరాజ్య సంపాదనము | - యర్రగుంట నారపరెడ్డి | 1936 | 126 |
| 17. చంద్రికా మోహనులు | - రావూరు చంగనార్య | 1936 | 128 |

| | | | |
|---|---|---|---|
| 18. రాఘవేంద్రరావుగారి రాజీనామా | - టి. ఆర్మోగంపిళ్ళై | 1937 | 131 |
| 19. బిక్కిరింత పిదప వెక్కిరింత | - టి. ఆర్మోగంపిళ్ళై | 1937 | 137 |
| 20. పాపిచావు | - టి. ఆర్మోగంపిళ్ళై | 1937 | 140 |
| 21. వెలి | - పాణ్యం సంజీవశాస్త్రి | 1938 | 145 |
| 22. విడుమర | - కందాళ శేషాచార్యులు | 1938 | 149 |
| 23. ఉగాది కానుక | - కందాళ శేషాచార్యులు | 1939 | 161 |
| 24. నా పెండ్లి సంబరం | - విద్వాన్ విశ్వం | 1939 | 165 |
| 25. మొగమహారాజు | - విద్వాన్ విశ్వం | 1939 | 168 |
| 26.ఎందుకు | - విద్వాన్ విశ్వం | 1940 | 172 |
| 27. నీతులు | - విద్వాన్ విశ్వం | 1940 | 176 |
| 28. ఎక్కడికి? | - విద్వాన్ విశ్వం | 1940 | 179 |
| 29. ప్రభాతభేరీ | - యం.వి.శాస్త్రి | 1940 | 183 |
| 30. ప్రాణస్నేహితం | - విద్వాన్ విశ్వం | 1940 | 186 |
| 31. భవతీ బిక్షాం దేహి | - విద్వాన్ విశ్వం | 1940 | 190 |
| 32. ప్రళయ దీపావళి | - విద్వాన్ విశ్వం | 1940 | 194 |
| 33. చిలక గోరంకా | - విద్వాన్ విశ్వం | 1940 | 198 |
| 34. కూలివాడు | - కందాళ శేషాచార్యులు | 1941 | 202 |
| 35. లక్ష్మీ కటాక్షం | - కందాళ శేషాచార్యులు | 1941 | 205 |
| 36.101వ మార్గము | - కందాళ శేషాచార్యులు | 1941 | 209 |
| 37.బడిపంతులు | - కందాళ శేషాచార్యులు | 1941 | 212 |
| 38. రైల్వే గైడ్ | - కందాళ శేషాచార్యులు | 1941 | 215 |
| 39.బి.ఏ. అర్జీ | - కందాళ శేషాచార్యులు | 1941 | 219 |
| 40. ఆకలి | - కందాళ శేషాచార్యులు | 1942 | 223 |
| 41. చిరంజీవి | - జి.రామకృష్ణ | 1941 | 225 |
| 42. కడగండ్లు | - కె.సభా | 1944 | 227 |

*అనుబంధం ...*

| | | | |
|---|---|---|---|
| చిన్నకథలు (కథాలక్షణ వ్యాసం) | - హెచ్.నంజుండరావు | 1927 | 238 |

# ఒక సంవత్సరము పల్లెటూరియందునికి
# లేక
## ఋతుచర్య (కథలో కొంత భాగం)

వసంతము నందు చరించునట్టి మానవుల చర్యలను వివరించుట సాధ్యము కాదు. కాకున్నను, ఆయా ఋతువుల చర్యలను దెలుపునట్టి చిన్నకథ యొకటి కలదు. దానిచే గొంతకొంత తెలియబడును.

ఎల్ల కలుములకు నాకరమైన ఈ భరతఖండము నందు ప్రసిద్ధములైన పట్టణములలో ప్రధానమైనదగు చెన్నపట్టణమునకు నుత్తరపుదిక్కు నుండు నెల్లూరికి పడమట, ఆ నెల్లూరికి ఇరువది కోసుల దూరమునందు కడపకు పోవు బాటలో, పెన్న యొద్దున సోమేశ్వరము అని యొక గ్రామము కలదు. దాని హద్దు చేసికొని పడమట బహుదూరము వఱకు మిక్కిలి యున్నతములైన పర్వతములు చాలుగు సరము కూర్చినట్లు కానవచ్చుచుండును. ఆ కొండలను తూర్పునాటి వారు వెలిగొండలు అని వాడుదురు. అందు సోమేశ్వరముతో జేరినకొండ సోమేశ్వర్లకనుమ అనబడును. అది పొడవు నందు రమారమి రెండువేల యడుగుకొలదై యుండును. దాని పై పఱపు తూర్పు నుండి పడమరకు అరకోసు. ఆ కొండయొక్క మీదిభాగము నందుండి చూచునపుడు చుట్టు పట్ల కనుచూపు మేర నుండు తిప్పలు, గొప్పగొప్ప తోపులు, పెద్ద పెద్ద యేళ్లు, కంచె బీళ్లు, వరిమళ్ళు, మలుము తోటలు, జొన్నచేలు, సన్నజీవాల గుంపులు, పసులమందలు, ఊళ్లు, పల్లెలు మొదలుగునవి కానవచ్చు రీతి ఇట్టిదని నిరూపించి చెప్పి నెట్టివారికి నలవిగాక యుండును. మఱియు నందుండి కొంచెము దిగువకు చూపును వ్యాపింపజేసిన యెడల, ఎల్లకాలము ఒక్కరీతిని చిగుళ్లు పువ్వులు పిందెలు కాయలు నిండుకొనగా కన్నులపండుగై యుండు తోపులతోడి కోనలు కానబడును. ఒక్కొక్కచోట పెనలు వేసికొని బుసకొట్టుచు కొండకొమ్ముల నుండి నేలకుఱుకు నుగ్రసర్పములోయన మలకలు తిరిగి కొండనెత్తముల నుండి మహాఘోషముతో లోయలకు దిగబాఱు సెలయేళ్లు చూచువారికి వింతను, వెఱపును బెనుచుచుండును. ఒక్కొక్క తట్టు దట్టముగా నల్లుకొన్న తీగ జొంపములచేత ఉద్యాన వనములలోని ద్రాక్షపందిళ్లవలె నంద గించు పొదరిండ్లును, మొసళ్లు, తాబేళ్లు, నెగళ్లు మొదలుగాగల జలచరములకు వాసయోగ్యములై తేటనీటం గనుపట్టు దొనలును మనోహరములుగా వెలయుచుండును.

ఇట్లు అతిరమణీయ స్థానమై యొప్పునట్టి యా సోమేశ్వర్లు కనుమకు ఈశాన్య భాగము నందు ఒక కోనలో బోయవల్లె యొకటి కలదు. దాని వెనుకతట్టు పెన్నలో గలియు వాగొకటి ప్రవహించుచుండును. అది సదా వట్టిపోక నీళ్లచే నిండుకొని యుండును గనుక ఆ పల్లెకు ఆగడ్తయో యనదగి యుండును. దాని దరిని పెక్కు పూదోటలు, ఆకుతోటలు, సజ్జలు,

రాగులు పండించునట్టి మలుము తోటలు, పెంపుడు వనములు నింపాదిగా గలవు. అట్టి యా పక్కణమునకు తూర్పు ప్రక్క ఒక విశాలమై పొడవైన బండ మీద, పూర్వ కాలపు గొప్పవారి యిండ్ల మాదిరిని కట్టబడిన చుట్టుబవంతి యొకటి కలదు. అది నాలుగు తట్టులను నాలుగు శాలాగృహములును, నడుమ బయలును, ఆ బయలి నట్టనడుమ బొడ్డు చవికయు గలది. మఱియు అది తూర్పు హజారము గలదైయుండును గనుకను, మిక్కిలి యెత్తయిన యరుగుమీద హజారమున కెదురుగా బొడ్డుచవిక కట్టబడియుండును గనుకను, ఆ చవికయందు గూర్చున్నవారికి హజారమునకు తూర్పువైపున బహుదూరము వఱకు గల ప్రదేశములన్ని చక్కగా గనబడుచుండుటయేగాక, ఉదయమై గడియ ప్రొద్దెక్కు నంతవఱకు సూర్యరశ్మి యా చవిక యందు ప్రసరించుచుండును. ఇదిగాక, ఆ యిల్లు, నానావిధములైన తీగలు చుట్టు నేర్పఱపబడియుండు పంచపాకల కెగబ్రాకి, చక్కగా అల్లుకొని, నడికొప్పు వఱకు వ్యాపించి యుండుటచేత, ఏ తట్టు చూచిన పైకప్పు కానరాక పెద్దపొదరింటి వలెనే కానవచ్చుచుండును. దానికి ఎదుట చదరపఱపబడిన పచ్చికబయళ్లును తక్కిన మూడు ప్రక్కలను బహుదూరము వఱకు వ్యాపించియుండు తోటలును గలిగియుండును. అట్లు ఒప్పిదముగా నేర్పడియుండు నా యింటి యందు ఒక బోయదొర వాసము చేయుచుండును. వాడు, నిజజాతి సామాన్యవృత్తి యందు ప్రవర్తింపక, పెక్కు తరముల నుండి గౌరవమును వహించియున్న వంశమున బుట్టినవాడు, కనుక తమ జాతిజనులకెల్ల దొరయై, పరిపాటి వివేకమును, ఈశ్వరభక్తియు, యథోచిత విద్యాసక్తియు గలవాడై, చదువు సాము లెఱుగక వేటలాడి జీవించునట్టి బోయలందఱు తన్ను గొలువగా కాలము గడుపుచుండును. వాని పేరు చెంచునాయుడు. వానికి, కొండలరాయడని యొక కొమారుడును, పేరక్క, బాలక్క అని యిద్దఱు కొమార్తెలును గలరు. అందు కొండలరాయుడు నడిమివాడు. వానిని సైతము తన వలెనే చదువనందు పరిశ్రమము కలవానిగా జేయవలెనని, ఆ చెంచునాయుడు అయిదవ యేటనే వానికి అక్షరాభ్యాసము చేయించి బడికిపంపెను. వాడును తండ్రి యిష్టము చొప్పున క్రమముగా బడికి పోయి చదువుకొనుచుండెను.

**– జులై,1882 నుండి ఏప్రిల్, 1883 వరకు, జనవినోదిని.**

*(యాభైపుటల దాకా ఉన్న ఈ కథ వివినమూర్తి సంపాదకత్వంలో వెలువడిన దిద్దుబాటలు అనే కథాసంకలనంలో ఉన్నది. ఆ పుస్తకాన్ని జనవరి, 2015న 'తానా' ప్రచురణల సంఘం వారు ప్రచురించారు. రాయలసీమలో తొలికథగాను, రాయలసీమ ప్రాంత జీవితమున్న తొలికథగాను ప్రాధాన్యమున్న ఈ కథ పూర్తి భాగాన్ని పై సంకలనంలో పాఠకులు చదవగలరని మనవి)*

# రోజాంబ, శ్వేతాంబ

*- గాడిచర్ల హరిసర్వోత్తమరావు*

**ఉ**త్తరమహాసముద్రమున భూపాలమను దీవియొకటుండెను. అందు సుందరమ యిన అడవులు కలవు. వానిలో నొకటి రమ్యమయిన ప్రదేశమున ముద్దులొలుకు గుడిసె యొకటి వెలయు. దానిచుట్టును పలు తెరుగుల గులాబీపువ్వుల చెట్లు సొంపుగులుకు చుండును. ఇంట ముగ్గరు స్త్రీలు మాత్రము నివసించుచుందురు. అందు ముసలిది తల్లి తక్కిన యిరువురును బిడ్డలు; కొంచెము సోగమొగమును నిడుదకండ్లును తీరిన పండ్ల వరుసయు కలది అక్క. మేనిఛాయయందు గులాబిపువ్వును పోలియున్నందున ఆమె తల్లిదండ్రులామెకు రోజాంబయని నామకరణము చేసి యుండిరి. ఆమె చెల్లెలు ఆమె కంటె తేలికరంగుగలది. తెల్ల గులాబిని పోలునది. మోముతీరునను ఆ పుష్పమునే అనుకరించునది. కావున నామెకు శ్వేతాంబయని పేరిడియుండిరి.

హేమంత ఋతువునందొకదినము మంచువిస్తారముగ పడుచుండెను. వణకు పుట్టించు చల్లని గాలియు వీచుచుండెను. రోజాంబ, శ్వేతాంబ, వీరితల్లి యీ మువ్వురును తలుపుల బిగించుకొని లోపల చలిమంట వైచుకొని ముచ్చటలాడుచు దాని చుట్టు కూర్చొని యుండిరి. సాయంకాలమై సూర్యుని వెలుగు లేనందున ఆ చలిమంట వెలుగే యింటికంతయు శోభ నిచ్చుచుండెను. పరిశుభ్రమయిన నట్టిల్లును; వివిధ విషయముల బోధించు పటములకు తావులయిన గోడలును, స్పష్టముగ నా వెలుగున కాననగుచుండెను. తల్లియు బిడ్డలును వుల్లాసముగcగాలము పుచ్చుచుండ నెవరో తలుపు తట్టుట వినవచ్చెను. నిలిచి నిలిచి రెండు మారులొకే విధమయిన ధ్వనికలిగినందున తల్లి యోజించి 'అమ్మాయీ యీ తీవ్రమయిన చలికి తాళలేక యెవ్వరో మనగుడిసెలో తలదాచుకొనవచ్చి యున్నట్లు తోచుచున్నది. పోయి తలుపు దెఱువుcడు' అనెను. రోజాంబ తల్లిమాటలతో లేచి లోగొళ్లెము సడలించెను. అంత యొక యెలుగుబంటు గుడిసెలోనికి మెల్లగదూరెను. దానిని జూచి రోజాంబయు, శ్వేతాంబయు విస్మయమందిరని చెప్పవలెనా? కాని వారి తల్లి మాత్రము నిజము గ్రహించెను. ఇంతలోపల నా యెలుగుబంటే మనుష్య వాక్కులతో 'జడియకుడు జడియకుడు బయట చలికి తట్టుకొనలేక వచ్చినాను దయయుంచి నాకు కొంచెము చోటిచ్చిన చాలును. రాత్రి పరుండి పెందలకడ లేచిపోదును' అని వివరించెను. తల్లి తనకు సహజమగు మృదూక్తులతో నా యెలుగుబంటును తమ యింటనొక ప్రక్కన పండుకొన నియోగించెను. రోజాంబ, శ్వేతాంబలు దాని బొచ్చున చొచ్చియున్న మంచుబొట్లను తుడిచివైచిరి. అదియు తన దేహముమీది వెంట్రుకలు రగులుకొనకుండునట్లు అగ్నికి తొలగి పండుకొని రాత్రిగడపి వేకువన లేచిపోయి మరునాడు సాయంకాలమునకు మరలివచ్చెను. ఇట్లు రోజాంబ, శ్వేతాంబలతో నీ భల్లూకము శీతాకాలమంతయు గడపెను. వసంతము ప్రారంభ మగునప్పటికి

‘ఇంక నేను పోవలయును లేకున్న నా గుజ్జు,నేను స్వీకరించి పెట్టిన వరహాల నన్నిటిని చూరగొనిపోవును’ అని నుడివి తన శీతాకాలపు స్నేహితుల నుండి సెలవు తీసి కొనివెడలెను. రోజాంబ, శ్వేతాంబలా యెలుగుబంటు తమ్మును విడిచిపోవుటకెంతో చింతించిరి.

ఇల్లువెడలి బయటికి పోయినప్పుడంతయు తమ ప్రాతచెలికాడు యెలుగుబంటి కనుపించు నాయని చూచుచుందురు. ఒకనాడు యిదే విధమున నరయుచుండ వారికొక గుజ్జు కంట బడెను. వాని గడ్డము వారికంటెను పొడవయినది. అదియొక చెట్టుతొఱ్ఱలో నిఱికి కొనిపోయి యుండెను. దానిని బయటికిలాగుట యందు వాడు తన శక్తినంతయు వినియోగించు చుండెను. వాని యెదుట బంగారు నాణ్యములును బంగారు నాణ్యపు సంచియు నుండె. వాడీ యక్కచెల్లెండ్లను చూచినతోడనే తన గడ్డమును విడిపింప వేడుకొనెను. శ్వేతాంబ జేబులో నుండి కత్తెరనెత్తికొని ఆ గుజ్జుగడ్డమును నడిమికి కత్తిరించి విడిచెను. వాడంతట కృతజ్ఞత చూపుటకు మారుగ రోజాంబ, శ్వేతాంబలకు తన ముష్టిని సూపి ధిక్కరించుచు నాణ్యముల సంచి నొకదానిని నాచికొని వెడలిపోయెను.

వీడు యింతటితో అదృశ్యుడు కాలేదు. పై మఱియొకతూరి ఆ యక్కచెల్లెంద్రొక మయిదానమున విహరింపబోవ నక్కడ నాణ్యెముల నెంచుకొనుచు కూర్చొనియుండెను. వీరిని చూచినంతనె మిక్కిలి కోపము నంది భీకరమగు చూపులబఱపి దూషింప మొదలిడెను. ఆ సమయముననె వీరి మొదటి నేస్తకాడు భల్లూకపతి ప్రత్యక్షమాయెను. ఎలుగుబంటి దృష్టికి దోచితోచకముందె గుజ్జు రక్షింపుడు రక్షింపుడని ప్రార్థించెను. కాని అట్టి ప్రార్థనకుగూడ కాలమియ్యక యెగులుబంటా కుజ్జుని తన పాదవుగోళ్లచే చీల్చివేసెను.

వాని మరణముతో యెకయద్భుతము బయలుపడెను. ఎలుగుబంటునకా రూపు మారి రాజపుత్రుని రూపుకలిగెను. నిండుజవ్వనుడు విశుద్ధ వస్త్రముల తమ యెదుట నిలుచుటకని రోజాంబ శ్వేతాంబలు అచ్చెరువందిరి. అతడు తన కథ నిట్లుచెప్పెను.

‘నా తండ్రి యొక రాజు’ నేను రాజపుత్రుడను; నాకు కావలసినంత ధనమున్నది. ఈ కుబ్జుడు నన్ను మోసపుచ్చి యెలుగుబంటును చేసి నా ద్రవ్యమంతయు నపహరించెను. నేనదృష్టవంతుడను కాన మీ మూలమున వానినిపట్టి శిక్షింపగలిగితిని. మీకు వాడు కానరా కున్న నేనింకను బహుకాలము యెలుగుబంటుగనే యుండి యుండవలసివచ్చును మేలయ్యె’ ఇది విని సంతసించి ఆ అక్క చెల్లెండ్లు అతనిని తమ కుటీరమునకు బిలుచు కొనిపొయి సుఖముగుండిరి. అచ్చటి గులాబీ చెట్లు సంవత్సరము దప్పక రోజాగులాబీలను, శ్వేతవర్ణపు గులాబీలను పుష్కలముగ నీనుడువర్ధిల్లెను. **– 1 అక్టోబరు, 1913, హిందూ సుందరి**

**సంపుటి – 11, సంచిక – 5**

*(శ్రీగాడిచర్ల హరిసర్వోత్తమరావు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు. కర్నూలు జిల్లాకు చెందినవారు. గ్రంథాలయోద్యమంలోను క్రియాశీలకంగా పాల్గొన్నారు. మాతృసేవ, స్వరాజ్య పత్రికలను నడిపించారు. ఎన్నో ప్రసిద్ధమైన రచనలను చేశారు.)*

# కడపటి పైసా

– కథకుడి పేరులేదు

**తుం**గభద్రా తీరము. సాయంకాలమయి రెండు గడియల ప్రొద్దైనది. చీకటులు క్రమ్మ నారంభించినవి. కొంత వరకు మబ్బులు నిండి వానవచ్చు చిహ్నములు దోచినవి. ఒకానొక యవ్వన పురుషుడు ఏటిలోని మడువు దగ్గరకు నల్లటి గుండ్ల మీదుగ పయన మగుచున్నాడు. అతని విగ్రహమును వర్ణించుటకు రాదు. అతడు ధరించిన వస్త్రములు మాత్రమా చీకటిలోను గూడ అతని స్థితిని కొంత యెరుకపరచుచున్నవి. మొలనుగట్టిన దోవతి మోకాళ్ళపైననే చిరుగులచే చిందులు ద్రొక్కుచున్నది. బాహువుల మీద ధరించిన శెల్లాయును చిరిగి తోరణమైయున్నది.

మడుగు సమీపించినది. తళుక్కున నొక్క మెరుపు మెరసినది. మడుగులో దాని నీడ ప్రతిఫలించినది. గభీలున నీయౌవ్వనున కేమియో తోచినది. అతడు గట్టిగ గొణగ నారంభించి నాడు. ఏమనుచున్నాడో?

'ఏమిటి? ఇంత సాహసమునకు నొడిగట్టితిని. ఏల నొడిగట్టరాదు. న్యాయమార్గాను వర్తినై స్వతంత్రముగా జీవనము జరుపుకొనుటకు ప్రయత్నించితిని. నాచేసిన పనిని ఎల్లరును సెబాసనుచు వచ్చిరి. ఎల్లరును నాయుద్యమములలో కోపకారములని భూషించుచు వచ్చిరి. నా స్వాతంత్ర్యము నుగ్గడించిరి.కానీ అది ఏమి లోకచిత్రమో కార్యమునకు వచ్చునప్పటికి ఎల్లరును నోటిమాటలతో రిత్తచూపులతో నూరకుండువారైరి. దగ్గరి చుట్టాలు సయితము నాశక్తి ప్రతిభలను నా ధర్మపరత్వమును నెరింగియు నాకు తోడ్పడక వృథాదూషణలతో నను వేధించిరి. న్యాయముగా బ్రతుకుట కుటుంబీకునకు నీకాలమున దుస్సాధ్యమని ఆలు బిడ్డలను వదలి వచ్చితిని. పని చేయుదమన్న గౌరవమగు పని యిచ్చువారలును గానరారు. పిడికెడు కూటికి పగలెల్లయు నౌకరీ చేయించుకొని ఆపని తామే చేసినట్లు లోకమును భ్రమింప జేయువారు మహానుభావులైనారు. వారి సంఖ్యయైనను నెక్కువగా గలదా యనిన నదియునుం గానరాదు. మాస మకాలముగ లోకమంతయు ద్రిమ్మరినను పూటకూటికి గడచుట కష్టమైనది. ఈ బ్రతుకుకంటె గంగాభవాని గర్భమున వసించుట, ఆ మాత శరణుజొచ్చుట మేల్కాదా?'

ఒక్క టీకుటాకుల షోకుగాడు సిగరెట్టు పట్టుచు ధూమములను వాతావరణ ములోనికి వదలుచు నీగొణగునాతనికి బ్రక్కగా వెడలివచ్చినాడు.

వాసన ముక్కు కెక్కినది. పూర్వపుటభ్యాసము స్మరణాపథము నాక్రమించినది. అంతట నా పురుషోత్తమనాయడు 'ఆహా! ఇది లంక పొగాకుతో నవీనముగా మన మద్రాసు వైశ్య సోదరులు సిద్ధము చేసి యమ్ముచుండు సరస్వతి సిగరెట్టు సువాసన, అరరే, దీని నింకొకమారు స్వయముగా పీల్చియనుభవింపక దేహత్యాగము చేయనగునా. అయిన– ఏల–కడపటి పైసా ఇంకను రొండిననున్నది గదా !'

నాయడు గ్రక్కున వెనుకను దిరిగినాడు. కర్నూలు పురమున కుమ్మరవీధి ప్రవేశించినాడు. అదె యాకొనసన పప్పుల వెంకయ్య దుకాణమున్నది. అటబోయి సరస్వతీ సిగరెట్టు కావలయు ననినాడు. దొరకలేదు. పెద్దవీధిని బడినాడు. గొప్ప షాపొకటి చక్కని దీపాల వెలుగున దృగ్గోచరమైనది. అచ్చటను సరస్వతీ మార్కు సిగరెట్టు లేదు. పేరు పెద్ద ఊరు దిబ్బ యనుకొనుచు పురుషోత్తమనాయడు మరియొక సందుమొనన నుండిన వక్కలాకుల దుకాణ మునకు బోయినాడు. అట పైసాకొక్కటే సిగరెట్టు కొన్నాడు. ముట్టించినాడు. పొగ నిడువ నారంభించినాడు. వాన చినుకులు బడినవి. లోప్రక్కన కొట్టమున్నది. అందులో ఏవో సంచులు పేర్చినారు. అక్కడ విశ్రమించుటకు అంగటివాని వద్ద సెలవు కైకొనినాడు.

పురుషోత్తమ నాయడు పరధ్యానముగా పొగ పీల్చుచుండగా ప్రక్కన గోతాల మీద కూర్చొని మరియిద్దరు వ్యక్తులు గుసగుసలాడుచున్నారు. కొంత గుసగుస నాయని చెవిలోనికి దూరినది. అది ఏమి ? మాటలాడుచుండినవారిలో ముసలివాడుగా కన్పించిన వ్యక్తి ఇట్లనెను.

'నేనెంతో శ్రమపడినాను, వాడు కానరానేలేదు. స్నేహితులకు ఉత్తరాలు వ్రాసినాను. స్వకీయసేవకులను బంపించి అన్వేషించినాను. నేను వెతకించుచున్నానని విని వాడు దాగుకున్నాడేమోయని వేగులవారిని నియమించినాను. నేనే స్వయముగా కూడా బయలుదేరి చూచుచున్నాను. నన్ను ప్రాతిపెట్టుటకు దగిన యంతయాస్తి నాడాలోచింపక పోయినందుకింత కడగండ్లు పడవలసి వచ్చినది. వాని ధార్మికత్వము వాడు మరుగైన తరువాత నాకు తెల్లమయినది. ఇప్పుడేమి సేయదు, ఎట్లు నాకు చిత్తశాంతి గలుగును.'

ఈ వాక్యములు పురుషోత్తమనాయనికి పరిచితమైన ఎలుంగున పల్కబడినవి. అతనికి ననుమానమంకురించె అంతట నాతడా ముసలివానిం దిలకించి చూచె. ఎచ్చటలేని మైత్రి అతని మానసమున స్వభావసిద్ధముగ దోచినది. దాపరికమునకు మనసు బట్టలేదు.

'తాతా! తాతా ! నీవా ! నీవా !' యనినాడు. ముసలివాని యానందము వాక్కుల నణంచినది. అతడు ఒక్క పెట్టున మనుమని నాలింగనము చేసికొనినాడు. బాష్పముల రాల్చినాడు.

మూడు గడియలకు పూర్వము నిరుపేదగ నుండిన పురుషోత్తముడు లక్షాధికారి యైనాడు. గంటకు మున్ను గంగాభవాని శరణు జొరనుండిన యౌవనుడు తాత యాశీర్వా చనమున చిరాయువైనాడు. కడపటి పైసా ఘనరక్షయై ధర్మమే జయమనుటను చాటించినది.

**– అక్టోబరు 1918,**

**సౌందర్యవల్లి మాసపత్రిక (దసరా సంచిక)**

# సుగాలీ కుటుంబం

**- చింతా దీక్షితులు**

పాత అధికారి వెళ్లి కొత్త అధికారి వచ్చాడన్న వార్త చుట్టుపట్ల నున్న గ్రామాల కన్నింటికీ తెలిసింది. ఇంత త్వరలో తెలియడానికి కారణము లేకపోలేదు.

ఆ ప్రాంతపు దేశమంతా అడవి మయము. ఆ అడవిలో ఒక భాగమునకు ఈయన అధికారి. ఏ వూరివాడో తెలియదు. అధికారము చెలాయించేటప్పుడు ముక్కుకు సూటిగా వెళ్లడం ఈయన మతము. ఈ సంగతి ఈయనే పలువురితో చెప్పటం కద్దు. లోకులు ఈ సన్మార్గమును కాఠిన్యమన్నారు.

ఒకనాటి సాయంకాలము ఈయన - పాత్రకు పేరు ఉండవలెను. గనుక ఈయనను మునిస్వామి అందాము - కంసాలి వానికి వర్తమానము చేసినాడు. ముప్పై తులముల బంగారముతో చేయబడిన కంటె ఒకటి ఆయన భార్య పెట్టుకొనే అలంకారములలో ఒకటి. ఈ కంటెను చెరిపించి నలభై తులాల బంగారపు కంటె చేయించి పెట్టమని భార్య అడగడము కంసాలిని పిలిపించడమునకు కారణము.

కంసాలి వచ్చినాడు. అతనికి చెప్పవలసిన మాటలు చెప్పుతుండగా అడవి కాపరులు ఒక మనిషిని పట్టుకొని మునిస్వామి వద్దకు తీసుకువచ్చారు.

అడవిలో నలమద్ది కొమ్మ కొట్టి యీ మనిషి తీసుకొని పోతుండగా కాపరులు పట్టుకున్నారు.

మునిస్వామి విచారణలో తేలిన విషయమిది. ఈ మనిషి బండి చక్రమునకు కొన్ని ఆకులు విరిగిపోయినవట. కొనడానికి కెక్కడా కఱ్ఱలు దొరకలేదట.బండి తోలుకొని జీవించడమే అతని ప్రధాన వృత్తట. అందుచేత అడవిలో కొమ్మ కొట్టినమాట వాస్తవమట.

సన్మార్గగామియైన మునిస్వామి అతనిపై కేసు చేసినాడు. అడవి కేసులకు సాక్ష్యము మొదలైనవి అక్కరలేదు! అధికారిమాటా, మేజిస్ట్రేటు శిక్షా. నేరస్థుని కొంప గుండము. అడవి పరిపాలనలో న్యాయ చక్రము పైమూటిమీద ఎప్పుడూ వర్తిస్తూ ఉంటుంది.

ఆ మనిషికి రెండు సంవత్సరములు కఠిన నరకము పడినది. మునిస్వామి వచ్చిన నెలలోపుగా ఇట్టివెన్నో జరిగినవి. ఆయన కీర్తి చంద్రికలు నాల్గువేపులా వ్యాపించిన వంటే ఆశ్చర్యమేమి!

రాక్షసనామ సంవత్సరమున సకాలమున వర్షములు లేకపోవుట చేత కొన్ని చోట్లా వర్షములు వెనుకబట్టుట చేత కొన్ని చోట్లా కాటకము సిద్ధించినది. పచ్చని చేలుండ వలసిన తావులందు పత్రభూములు కానవస్తున్నవి. సూర్యుని వేడిమి నానాటికీ సహింప శక్యము గాకున్నది. నాగళ్లు, గొఋలు, జడ్డిగాలు, పాపటలు, మెట్టులు అన్నియు మూలకొదిగి నవి. నూతులందు నీరు నానాటికి లోనికి పోవుచున్నది. చెరువు లెండుకుపోయినవి. విత్తనముల కొరకై వెనుకటి సంవత్సరము దాచుకున్న ధాన్యము, జొన్నలు, కొఱ్ఱలు ఈ సంవత్సము

గ్రాసమునకు వినియోగపడుచున్నవి. భూమిపైగడ్డి మొలవలేదు. అడవిలో చెట్టు చిగుర్చలేదు. ఆవులకుమేత లేదు, మనుష్యుల కావుపాలులేవు.

'ఈ యేడు వర్షములు లేక పంటలు లేవు. తినడానికి తాటిపళ్లేనా పడడంలే'దని ఒక మాలవాడు వినిపించాడు.

ఈ కాలమున మునిస్వామి అధికారములో నున్న అడవికి సమీపమున ఒక ఊరిలో ఒక సుగాలీ కుటుంబము కాపురమున్నారు. ఈ కుటుంబము ఆ ఊరికి రావడము నకు పూర్వము ఎర్రకొండలలో వుండేదిట. అక్కడ ఉన్న చెంచెవాళ్లు వీళ్ల కొంపలో పడి దోచుకోవడము చేతనూ, వీళ్ల పశువులను తోలుకుపోవడం చేతనూ జీవనాధారం లేక యిక్కడికి వచ్చినారు. అడవిలో నివసిస్తే చెంచువాళ్లు బాధపెడతారనే భయము చేత వూళ్లోనే కాపురమున్నారు.

ఈ కుటుంబము కడు బీద స్థితిలో ఉన్నది. భార్యా, భర్త, ఏడుగురు పిల్లలూను. వీరిపై దయదలచి ఒక బ్రహ్మడు తన దొడ్డిలో వీరి నుండనిచ్చెను. ఆదొడ్డిలో పాక వేసుకొని వీళు ్లన్నారు.

సుగాలీవాళ్లు అడవిజాతికి చేరిన వాళ్లు. చెంచులు,ఎరుకలు, కోయలు, ఒడ్డెలూ ఇట్టి అడవిజాతులే. సుగాలీలు వాలి సుగ్రీవుల సంతతివారమని చెప్పుకుంటారు.

సుగాలులకు కొండలూ, అడవులూ నివాస స్థానము. వీళ్లు అడవులకు పిల్లలు వంటివారు. అడవులు వీరిని కనును, అడవులు వీరిని పోషించును. అడవులు వీరిని భరించును. అడవులకు వీరు తమ ఆస్థుల సమర్పింతురు.

సుగాలీ స్త్రీలు అలంకారప్రియులు. వివాహితయైన సుగాలీ స్త్రీ చేతులకు ఎముక లతో చేసిన కంకణములను మోచేతి వరకు ధరిస్తుంది. బొంతలలో చిన్న చిన్న అద్దములు కుట్టి, గవ్వలను మామూలుగా కుట్టి బొంతలను కత్తిరించి ఆ బొంతలను లంగావలె కట్టు కొనును. రంగురంగుల గుడ్డలతో ఈ బొంతలు చేస్తారు. రంగులన్న వారికి ప్రీతి, వారీ బొంతతోనైన టోపీని తలపై దరించడం కూడా కద్దు. సుగాలీ స్త్రీలు సొగసుగా ఉంటారు. ఆరోగ్యము సౌందర్యమునకు వన్నె తెస్తుంది. వీరికి ఆరోగ్యము సౌందర్యము కూడా కలవు.

పురుషులును, స్త్రీలును కలసి పండుగ దినాలలో నృత్యము చేస్తారు. సుగాలీభాషలో పదములు పాడతారు.

అడవులలో కట్టెలను కొట్టి మోపులుగా గట్టి ఊరూరు దిరిగి వాటినమ్మి జీవిస్తారు వీరు. ఇది కొందరి వృత్తి. కొందరు అడవులలో పశువులను మేపుకొని జీవిస్తారు.

ఈ సుగాలులు ఇతర అడవిజాతుల వలె అప్పుడప్పుడు దారులు కాచి దొంగతనం చేయడం అందు స్త్రీలు కూడా పాల్గొంటారు. వీరిలో సాధారణముగా స్త్రీలు పురుషుల కన్నా బలాఢ్యులు.

కాటకము నానాటికి తీవ్రమైపోయింది. మర్యాదగా కూలిపని చేసుకొని గుక్కెడు అంబలి త్రాగేవాళ్లందరికి చిప్పచేతికి వచ్చింది. ఊళ్ళల్లో యాచకుల సమ్మర్థము ఎక్కువ యిందని పత్రికలలో మొరలు వినిపించాయి. వీధులలో పాటలు పాడుకుంటూ యాచకులు సంచారము చేస్తున్నారు. 'వానదేవుడు పదములు' అంతటా వినబడుతున్నాయి.

"వానదేవుడా ! ఓ వానదేవుడా!
ఇగ నెందు కున్నావు జగమేలు నాసామి
చిన్న చిన్న మొలకలు జింకల పాలాయె
వేసిన చేలన్ని ఎండెండిపోయె
చుక్కంటి మొగవాళ్ళు సూదులైపోయిరి
ఏకంత మొగవాళ్ళు ఎదవాడి వుండిరి
గుంటిక కొట్టేవాళ్ళు గుండెలారుకుపోయె
నాగలి పట్టేవాళ్ళ నడుము లెందుకుపోయె
నెత్తిమీద సూర్యుడా నెలవన్నెకాడా
తలమీద సూర్యుడా దండంబు నీకు
ఏనుగం తెద్దులా ఎత్తుబడి పోతాయి
గాడికట్టిన పసరం గడేంకు పోలేదు
ఎక్కడా వున్నావొ గ్రక్కునా కదులయ్యా
కురిపించు నాసామి కుంభవర్షాలు
కురవాక మాతోడ కువ్వారమేల
వానలు కురిపించి ప్రాణాలు రప్పించు
వంకలూ నిండంగ వాగులూ నిండ
కురిపించు నాసామి కుంభవర్షాలు
వానదేవుడా ! ఓ వానదేవుడా
ఇగ నెందుకున్నావు జగమేలు నాసామి."

ఈ సుగాలీ కుటుంబము కూలీ పనులున్న రోజులలో కూలీపని చేసుకొని పొట్ట పోసుకునే వాళ్ళు. కాటకమురావడం, కూలిపనులు పోవడం ఒక్కమారు తటస్థించాయి. కట్టెలు కొట్టుకొని అమ్మి జీవిద్దామంటే అడవి స్వాధీనములో లేదు. పశువులను కాచుకుందా మంటే పశువులు లేవు. అడవిజాతివాళ్ళని అడవిని అనుభవించవద్దనడం పిల్లను తల్లివద్ద పాలు తాగరాదనడమే.

ఈసుగాలీ కుటుంబము యజమాని పేరు రూపల్‌నాయక్, అతని భార్య పేరు చంద్రి. వీనికి కొడుకులు కూతుళ్లూ పాలుత్రాగేపిల్ల మొదలుకుని 15 యేళ్ళ వరకు వయస్సు వచ్చిన పిల్లలు ఏడుగురు,సూర్యనాయక్, పొటేల్‌నాయక్, లక్ష్మి,సీత,బద్ధి, భారతి వాళ్ళ పేర్లు, తండ్రీ, తల్లీ పాటుపడి పిల్లలనందరనూ పోషించవలెను. పెద్దపిల్ల లక్ష్మికి వివాహమైనది. పండ్రెండవ యేట.అత్తవారు తీసుకుపోయి బాధలుపెట్టడంవల్ల అత్తవారింటినుంచి పారిపోయివచ్చి తల్లి వున్న వూళ్లోనే ఒక శూద్రకుటుంబములో చాకిరీకి ప్రవేశించి పొట్టపోసు కుంటూంది లక్ష్మి.

తొలికోడి కుయ్యడంతోనే రూపల్ నాయకుడూ, చంద్రీ బయలుదేరి కొండలు మీదికి అడవులలోకి పోతూ వుండడం వాడుక. పిల్లలందరూ యింటివద్దనే వుందురు. అడవికి పోయి అక్కడ దేవదారు కూర,పింకికాయలు, పాలపళ్ళు, వెలగపళ్ళు- ఏవి దొరికితే అవి తీసుకవచ్చి ఊరూరూ తిరగి జొన్నలు కొర్రలు పోగు చేసుకొని మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటికి వచ్చే వాడుక. అప్పుడు కొఱ్ఱన్నమో, జొన్న సంకటో, జొన్న రొట్టో తయారుచేసి తామింత తిని పిల్లలకింత పెట్టి ఆరోజు గడుపుకునే వాళ్ళు.

సుగాలీ వాళ్ళు కష్టపడి పనిచేసి యింత తింటారుగాని ఒకరిని దేహి అని చెయ్యి చాపి అడగరు, ఇస్తే వద్దనరు.

కొంతకాలం ఈ రీతిగా జరిగింది. ప్రజలలో క్షామము ప్రవేశించింది. ఆకుకూ రలూ పండ్లూ కొనేవాళ్ళ సంఖ్య నానాటికి క్షీణించింది. ఇక చేయవలసినదేమి? చేయడానికి కూలి పనులు లేవు. కాయడానికి పశువులు లేవు. ఆకుకూరలు కొనడానికి మనుష్యులు లేరు. ఇలాంటి స్థితిలో నున్నవారే కొందరు యాచకులౌతారు. ఇట్టిస్థితి నున్న వారే కొందరు దారులు కొట్టుటకు మొదలుపెడతారు. ఎవరిదీ తప్పు? వారిదా?

అయిదారుగురు పిల్లలు రోటిచుట్టూ మూగినారు, వారెవరు? మోకాలుపై తల నుంచి ధ్యానము చేస్తూ కూర్చున్నాడొక మూల, అతడెవరు? వారి ముఖములు తేజోవిహీనమై యున్నవేల? వారి కడుపులు నడుముల కంటుకుపోయినవేల? రోకలి చేతబూని ఒక్కరీతిగా దంచుచున్నది. అవియేమి? ఆమె ఎవరు?

ఈతపండ్ల నక్కడక్కడ పోగు చేసుకొని వచ్చి వాని నెండబెట్టి తరువాత దంచి గింజలను పారవేసి ఆపొట్టుతో రొట్టెలను గాల్చుకొనుచున్నారు. రూపల్‌నాయక్ కుటుంబము. మార్గము లేనివారికి భగవంతుడొక మార్గము కల్పించక మానునా? కాలినది ఈతపొట్టు తోనయిన రొట్టె ఒకటి, తినడానికి సిద్ధముగా నున్నవారు ఎనమండుగురు.

కొంతకాలమిట్టు గడిచింది. ఈతపళ్ళు కూడా కొన్నాళ్ళు కరుదైనవి కావూ? చెంచువాళ్ళూ, మాలమాదిగెలూ, సుగాలీవాళ్ళూ ఇందరికీ ఎంతకాలము ఈతపళ్ళు ఆధారమై వుండగలవు. ఇంక సాధనమేమిటి?

ఒకనాటి ఉదయము రూపల్‌నాయక్, చంద్రీ యిద్దరూ తట్టలు చేతితో పట్టుకు పోయినారు. వాళ్ళ పిల్లలు ఊరిలో వీళ్ళ గడపలూ, వాళ్ళ గడపలూ పట్టుకొని కాలము బుచ్చుతున్నారు.

మధ్యాహ్నమయేసరికి భార్యభర్తలిద్దరూ తట్టెడు చింతగింజలను తెచ్చినారు. అవి ఎందుకూ? ఆ చింతగింజలను రోటిలో ఇద్దరూ దంచినారు. నీళల్లో నావేసి కడిగినారు. ఎండబెట్టి తిరుగలితో విసరినారు. తెల్లపిండి తయారైనది. వీరు చేసే పనులను పన్నెండు కన్నులు చూస్తూ వున్నవి. ఈ పిండితో సాయంత్రమయేసరికి రెండు రొట్టెలు తయారైనవి. మెడపట్టులు పట్టుకొంటూ తమకు తక్కువైనదని కొట్లాడుచూ పిల్లలూ దంపతులూ ఆ రొట్టెలను తిన్నారు. ఇంత నీరు త్రాగినారు. ఆ దినమునకు భగవంతుడింత యిచ్చినాడు. హాయిగా రాత్రి అందరూ వెన్నెలలో విచారము లేకుండా నిద్రపోయినారు.

కొంతకాల మీరీతిగా జరిగింది. చింతగింజలకు కూడా కరవైనది. కొన్నాళ్ళకు చింత గింజలను వర్తకులు అమ్మ మొదలుపెట్టిరి పడి అర్దణా! అర్దణా ఆ సుగాలీవాళ్ళకు ఎక్కడ నుంచి వస్తుంది? ఇక చేసేదేమిటి?

ఒకనాటి సాయంకాలము ఒక సుగాలీ కుటుంబము ఆరుబయట ఆకులలో నల్లటి పదార్థము పెట్టుకొని ఆత్రముగా తింటున్నారు. ఆ నల్లటి పదార్థమేమిటి. చింతచిగురు, చింతపండూ బూడిదలో కలిపి పొయ్యిమీద ఉడికించగా తయారైన పదార్థము. ఈ అంబలి త్రాగి కడుపునిండా నీళ్ళుత్రాగి చింతలేక హాయిగా నిద్రపోయారు. ఇట్లు కొన్నాళ్ళు, అడవిలో చింతపండు తెస్తూ వున్న వాళ్ళకు శిక్షపడుతూందని వదంతి పుట్టింది. ఇక చేయవలసిన దేమిటి?

దేవదారుకూర మిగిలిన ఆకుకూరల వలె గాక కొంత సువాసన కలిగి ఉంటుంది. దీనిని బ్రాహ్మలు పప్పులో వేసి వండుకొంటారు. అడవులలో తిరిగే వాళ్ళు ఈ కూరను వూరివారి బియ్యానికీ, జొన్నలకూ అమ్ముతారు. కొనేవాళ్ళు లేనప్పుడో?

అడవి సమీపమున నున్న దేవదారు చెట్ల నాశ్రయించి మధ్యాహ్నమయ్యే సరికి ఒక తట్టెడు దేవదారుకూర తెచ్చినారు ఈ సుగాలీ దంపతులు. కుండలో ఆకూరను బోసి, నీరుబోసి వుడకబెట్టి దించినారు. ఆకులలో బెట్టుకొని పిల్లలూ, తల్లీ, దండ్రీ కడుపునిండా తిన్నారు. హాయిగా నిద్రపోయినారు.

ఈరీతిగా కొన్నాళ్ళు జరిగింది. అడవియంచులనున్న కూర నానాటికీ తరిగి పోయింది. ఇక చేయవలసినదేమిటి?

నడిరాత్రి బయలుదేరి ఎవ్వరూ చూడకుండా యింత దేవదారు కూర దూసుకొని వచ్చి తెలవారుసరికి ఇల్లుచేరి గడుపుకొనవలసి వచ్చింది. ఇట్లు కొంతకాలము గడిచింది. ఒకనాడు తోవలో నలుగురు మాలవాళ్ళు కనిపించినారు. రెండు రోజులకు ముందు వారు దేవదారు కూర ఆరీతిగా తీసుకుపోతూండగా అడవికాపరులు పట్టుకొన్నారట. నూతనోద్యోగి కడకు తీసుకుపోయారట. బొటనవ్రేలి ముద్రలను వేయించుకొన్నారట. ఈ వర్తమానం సుగాలీ దంపతులకు తెలియవచ్చింది. ఇక అడవికి పోవుట ఎట్లు? పొట్ట పోషించుకో వడమెట్ల? పిల్లలను పోషించడం ఎట్లా?

రెండు రోజులు సుగాలీ కుటుంబమునకు తిండిలేదు. దిగుడు బావిలోనుంచి తెచ్చుకున్న నీళ్ళేతిన్నారు, ఆ నీళ్ళే త్రాగినారు. వెన్నెలలో సుఖముగా నిద్రపోయినారు. రెండు రోజులు గడచినవి. ఇట్లెన్ని రోజులు గడచును?

కష్టములలో ఉన్న వారికి భయము తక్కువ. ఏమన్నా భయముండదు. అధికారు లంటే భయమా? మృగములంటే భయమా? తోడివారంటే భయమా! ఆపత్తులు సంభవిస్తవని భయమా! భయము లేకుంటే నేమవుతుంది? కష్టములు వచ్చును. ఉన్న కష్టములలో అవి కలసిపోతవి. ఇంక భయమెందుకు?

మరింత జాగ్రత్తగా దేవదారుకూర అడవులలోనుంచి వారు తెచ్చుకొనక తప్పినది కాదు. కొంతకాలము సరిగానే జరిగింది. ఒకనాడు రూపల్‌నాయక్ అడవిలో దేవదారు కూర కోస్తున్నాడు. చంద్రికొండలలో ఒక చరియలో ఈతచెట్లకు పళ్ళున్నవని విని ఆ పళ్ళ కోసము అక్కడకు వెళ్ళింది రూపల్‌నాయకుడు వొడినిండా కూరకోసుకుని అడవి దాటి వస్తూ వున్నాడు. ఇద్దరు అడవికాపరులు అతనిని అడ్డగించినారు. పారిపోయినాడు. పరుగెత్తి వానిని పట్టుకున్నారు. అతనిని పరీక్షించినారు. దేవదారు కూర కానవచ్చినది. మునుసామి కడకు తీసుకుపోయినారు. దేవదారుకూర కోసినట్లును, కొమ్మలను విరిచినట్లును కేసు. కూర కొయ్యడం తప్పుకాదు. కొమ్మలు విరవడం నేరము. కొమ్మలు విరవడం ఎందుకు? పట్టుకుపోయి అమ్ముకుందామనే కదా! అడవికి నష్టము కలుగజేయవలెననే వుద్దేశ్యమే కద! మేజిస్ట్రేటు వద్ద కేసు జరిగింది. రూపల్‌నాయకుడు దీనముగా చెప్పుకున్నాడు. తనకు ఏడుగురు పిల్లలనీ కూలిపని చేసుకోవడము వృత్తనీ, కూలిపనులు లేవనీ, తిందామంటే ఈత పళ్ళు కరవయినవనీ, బూడిద తాగుదామంటే చింతపండు కరవయిందనీ, చింతపిక్కలు తిందామంటే ఖరీదైనవనీ, దేవదారు కూరపై అతని కుటుంబమంతా ఆధారపడియున్నదనీ, అతడు కొమ్మలు విరవలేదట. కూర కోసుకున్నట్లు వొప్పుకున్నాడు.

మేజిస్ట్రేటు నూతనోద్యోగి చాకచక్యమును మెచ్చుకున్నాడు. సుగాలీవానికి నాలుగు సంవత్సరములు ఖయిదు విధించినాడు.

చంద్రి ఈతపళ్ళను ఇంటికి తెచ్చుసరికి రూపల్‌నాయకుడు ఇంటికిరాలేదు. ఎక్కడైనా కూలికి పోయినాడేమో అని సంతోషించింది. ఈతరొట్టెలను పిల్లలకు పెట్టి తానుతిన్నది. రెండు మూడు రోజులపాటు రూపల్‌నాయకుడు ఇంటికి రాకుండడము అలవాటే.

రెండు రోజులు పోయిన మీదట తన భర్తకు ఖయిదు వేసినారని చంద్రికి తెలిసింది. ఏమి చేయగలదు? తన రెక్కలతో ఇందరిని పోషించగలదా? ఎడపిల్లను పెద్దపిల్లకు అప్పగించి చంటిపిల్లను చంకబెట్టుకొని వొకనాడు ప్రయాణమై తెల్లకొండలకేసి పోయింది. తెల్లకొండలలో దాని చుట్టాలున్నారట. ఈ సంగతి వూరివారికి తెలియదు.

పాకలో నలుగురు పిల్లలు తల్లిదండ్రుల కోసము ఆనాటి మధ్యాహ్నము వరకూ వేచి ఉన్నారు. ఎవ్వరూరాలేదు. పాకను విడిచి వూరిలో ఆనలుగురూ వేర్వేరు దిక్కులకు

పోయారు. వారేమయిరో ఎక్కడుండిరో ఎవరికీ తెలియదు. భూదేవి వారిని కన్నది! భూదేవి వారినిమళ్లీ స్వీకరించింది.

రూపల్‌నాయకుడు నాలుగేండ్లయిన తరువాత ఆ వూరు వచ్చినారు. తన కుటుంబ ములేదు. భార్య తెల్లకొండలకో ఎక్కడికో పోయిందనీ పిల్లలెక్కడకో పోయినారనీ పొరుగు వాళ్ళు చెప్పినారు. రూపల్‌నాయకుడు ఆ రోజునే బయలుదేరి తెల్లకొండలకు పోయినాడు. అక్కడ వాని భార్య కానరాలేదు.

మునుసామి నానాటికి ధనము గడించడము మొదలు పెట్టినాడు. సాలుకు ఇంత వచ్చే పద్ధతి మీద తనకు తెలియకుండా అడవిసరుకు తెచ్చుకొనవచ్చునని లోపాయకారిగా అడవి మనుష్యులతో రాజీపడ్డాడు. కేసులు తక్కువయైనవి. అధికారి సామర్థ్యమునకు దొర తనము సంతోషించింది.

అది విషజ్వరముల కాలము. ఊరూరా, దేశదేశమంతా విషజ్వరములే. యెందరో దాని వాతబడిరి. మునుసామి యింటి ప్రవేశించినదీ విషజ్వరము. భార్యా, యిద్దరు పిల్లలూ పది రోజులలో యెగిరిపోయినారు.

మునుసామి వొక్కడు, "నా" అన్నవాళ్ళు లేరు. ధనమునే చుట్టముగా చూచుకొన మొదలు పెట్టినాడు. క్రమ క్రమముగా మునుసామి ప్రవర్తన పైఅధికారులకు తెలియవచ్చింది. విచారణ జరిగింది. మునుసామిని ఉద్యోగము నుండి తొలగించారు.

చిన్ననాటి బంధువులతోనూ, మిత్రులతోనూ జీవితము గడపవచ్చునని స్వగ్రామ ము పోయినాడు మునుస్వామి, మిత్ర బంధుకోటి ఆ గ్రామమున అతనికి కరవైంది.

**- 1921**

*(చింతాదీక్షితులు రాయలసీమ ప్రాంతంలో ఉద్యోగబాధ్యతలు నిర్వహిస్తుండేవారు. సంచార, ఆటవిక, గిరిజన వర్గాల జీవితంపై మంచి కథలు రాసారు. చెంచురాణి కథ కోసం శ్రీశైలంలోని అటవీ ప్రాంతాలను తిరిగాడు. దాసరిపాట, ఊరిపేరు, కిష్కింధకాండలో కోతి, పెద్దమేడ, మనిషి-కోతి, వటీరావు కథలు, సాంఘిక దౌర్జన్యం తదితర రచనలను చేశారు)*

# అచ్చుబాటుకాని చదువు

- కొప్పర్తి నారాయణ

**తా**లూకా బోర్డు ప్రెసిడెంటుగారు బడి తనిఖీకి పది రోజులలో వస్తామని తాకీదు పంపియున్నారు. ఆయన వచ్చేసరికి బడిపిల్లల సంఖ్య వృద్ధి చేయుటకూ ఉపాధ్యాయుడు పిల్లలను జమచేయుటకూ ఇంటింటికి తిరుగుచున్నాడు. పాపయ్య సెట్టి కొడుకు ఆరేండ్ల వానిని బడికి పంపమని అడుగవలెనని సెట్టి యింటికి వచ్చాడు. అరుగుమీద ఉన్న అంగడిలో కూర్చొని ఇద్దరూ మాట్లాడుచున్నారు.

'సెట్టీ! ఇన్నాళ్లూ రేపు రేపు అని గడిపినావు. ఇదిగో తాకీదు. ప్రెసిడెంటు గారు స్వయంగా వచ్చి అయిదేండ్లకు మీరిన పిల్లలనందరిని బడికి పంపించమని బలవంత పెడతారు, తల్లిదండ్రులను. అంతేకాకుండా ఇది వరకు బడికి పంపనందుకు కఠిన శిక్ష కూడా విధిస్తారేమో! ఏం, మాట్లాడవు? ఇప్పుడయినా పంపుతావా?'

'ఇదెక్కడి పిశాచం! నేను కష్టపడి కనడమేమిటి? వారు వీరూ నా పిల్లాణ్ణి అక్కడికీ ఇక్కడికీ పంపమనడం ఏమిటి? వాడు చచ్చిపోతే ఒక్కడైనా బ్రతికించగలరా ? ఆ ముక్కకి సమాధానం చెప్పు మొదట!'

'ఇదెక్కడి చిత్రం! బడికి వస్తే మీ పిల్లవాడు చచ్చిపోతాడా!'

'అంతేనా? ఇంకా ఎన్ని ఆపత్తులు వస్తాయో ఎవరికి తెలుసును!'

'మీ మాటలలో ఏమీ తగిన కారణం కనపడటము లేదు.'

'చదువు మాయింట అచ్చుబాటులేదు, ఇంతకంటే కారణమేమి కావాలి?'

'చదువు అచ్చుబాటు కాకపోవడం ఏమిటయ్యా! పిచ్చివాడా, ఎక్కడా వినని కబురు చెపుతావు! నీకేమి? రేపు ప్రెసిడెంటుగారు వచ్చి ఆయనే కనుక్కుంటారు నీ సంగతి' అంటూ ఉపాధ్యాయుడు లేవపోతున్నాడు.

సహజగుణమైన పిరికితనమును చూపించి సెట్టి ఆయనచేయి పట్టుకొని కూర్చుం డబెట్టి 'అయ్యా ! చదువు మా వంశములో అచ్చుబాటు కాదు. మా ప్రస్తుత బీదస్థితికి చదువే కారణం. ఆ మాట తలచుకుంటే గుండె గుబెల్లు మంటుంది. ఇది వరకు జరిగిన సంగతి చెపుతాను. నామాట నిజమో అబద్ధమో మీకే తెలుస్తుంది" అని చెప్పి ఈ క్రింది వృత్తాంతము ఉపాధ్యాయునికి విశదపరుప మొదలు పెట్టినాడు.

'మా తండ్రి బళ్లారిలో కాపురముండి వంకాయల రత్తయ్య సెట్టితో జాయింటుగా పొగాకు వ్యాపారం చేసేవాడు. అందుచేతనే అందరూ ఆయనను పొగాకు పోలిసెట్టి అని పిలిచేవారు. రత్తయ్యసెట్టి డబ్బు పెట్టుబడి మాత్రం పెట్టాడు. వ్యాపారం నడపడమంతా మా తండ్రిదే. మహాపట్నంలోకి మాది ఒకటే పొగాకు అంగడి అవడంచేత విశేష లాభం వచ్చేది. సంవత్సరం ఆఖరున లాభం జాయింటుదార్లు ఇద్దరూ పంచుకునేవారు. ఇందులో రత్తయ్యకు మా తండ్రి

పెట్టినదే భిక్ష. ఇలాగా కొన్ని యేళ్లు జరిగిన తరువాత మా తండ్రికి కొంత ఆశ యెక్కువైంది. రత్తయ్యకు తక్కువ సొమ్ము లాభం క్రింద పంచిపెట్టేవారు. క్రమంగా ఒక యేడుకంటే ఒక యేడు లాభంతక్కువ కావడం చేత రత్తయ్యకు అనుమానం తట్టింది. కొంత సరుకు మా తండ్రి అపహరిస్తున్నాడని రత్తయ్య నమ్మకం.కాని రుజువు లేకపోవడం చేత ఏమీ అనలేకపోతు న్నాడు. ఇట్టి అనుమానమునకు చోటియ్యకుండ ఉండాలని మా తండ్రి కాపురమును కెన్‌టోన్మెంటుకు మార్చాడు. కెన్‌టోన్మెంట్ బళ్లారిలో భాగమైనా గానీ కస్బాకు మూడు మైళ్ల దూరమున్నది. హగ్రీ గ్రామము నుంచి బళ్లారి కస్బాలోకి పోయేబాట కేన్‌టోన్మెంటు గుండా ఉంది. హగ్రీలో పొగాకు విశేషంగా పండుతుందని ఈ ప్రాంతముల వాళ్లకు కూడా తెలిసే ఉంటుంది. అక్కడ నుంచే పొగాకు తెప్పించి మా తండ్రి వ్యాపారము చేస్తూ వుండేవాడు. ఆ రోజులలో ఐశ్వర్యము  చెప్పడానికి అలవికాదు. అప్పటికింకా నాకు చిన్న తనమయినా బాగా జ్ఞాపకము ఉంది. మాఅమ్మ వంటి నిండా బంగారమే. ఇంటి నిండా వెండి సామానే. పెట్టి నిండా తాకట్టు వస్తువులే. దొడ్డి నిండా బర్రెగొడ్లే. అబ్బబ్బ. ఇంకనే జెప్పలేను. తలచిన కొలది కడుపు తరుగుకు పోతుంది.

మా పినతండ్రి మదనపల్లిలో అత్తవారిల్లు జేరుకుని అక్కడ వ్యాపారముచేస్తున్నాడు. భార్య కాపురానికి వచ్చి అప్పటికి పదియేళ్లు అయినా గాని సంతానము లేకపోవడం చేత చిన్నప్పుడే మా చిన్నఅన్నని పెంపకానికి తీసుకెళ్లినాడు.ఇదే మా సంసారానికి కీడు  తెచ్చింది.  తానొకటి తలిస్తే దేవుడొక్కటి చేస్తాడు అన్నట్టు మా పినతండ్రి ఆస్థి కూడా మాలోనే ఉంటుందని ఆశతో మాతండ్రి పెంపకమిచ్చాడు. తుదకు ఇదియేలాగు పరిణమించిందో చూడండి!

పెంచుకొన్నవాడు మా కులాచార ప్రకారం కాస్త లెక్కాడొక్కా చెప్పించి వ్యాపారములోకి దింపవలెను గదా!  అలాగు  చేయకుండా  కోమటాళ్లలో  చదువుకున్న వాళ్ళు లేరు. వీడికి చదువు చెప్పిస్తే గొప్ప ఉద్యోగం అవుతుంది అని ఆశతో ఇంగ్లీషు చదువులోకి దింపాడు. మా చిన్నాన్న ఏడెనిమిదేళ్ళు ఈ చదువు వెలిగించాడు.తుదకు మా కొంప తగలేసినాడు, చదువు అంటినా అంటకపోయినా!

ఒకసారి మా చిన్నన్న బళ్లారి వచ్చాడు. పెంపకం ఇచ్చిన తరువాత ఇదే మొదటి సారి ఈయనగారు మా ఇంటికి రావడం. మా అమ్మ మా నాన్న ఈయన్ని ఎంతో గౌరవము చేశారు. రోజు పిండివంటలే రోజు ఫలహారాలే ఎక్కడలేని మక్కువను చూపించారు యీయ నంటే. ఈయన దయచేసిన నాల్గు రోజులకు ఉదయము పూట అరుగు మీద షోకుగా ముందర జుట్టు దువ్వి తెల్ల పంచ తెల్ల చొక్కావేసుకొని నోట్లో సన్ననిచుట్ట పెట్టుకొని కాలి మీద కాలు వేసుకొని గోడకు జేరగిలబడి కూర్చున్నాడు వీధి వెంబడిపోయే వాళ్ళు తనకేసి చూస్తున్నారో లేదో అని క్రేగంట చూస్తూను.

ముప్పైయేళ్ల మనిషొకడు భుజము మీద బుట్ట మోస్తూ పక్క సందులో నుంచి వచ్చి దాని మీద బరువు దింపి, “అయ్యా! ఇది ఒకటో రకమైనపొగాకు! అతి చౌకగా ఇచ్చిపోతాను,

చూడండి !"అని ఆతురతతో బుట్ట విప్పి ఒక ఆకు చేతికిచ్చాడు. మావాడికిక ఆశపుట్టి బుట్ట దగ్గరకు చేరి మధ్య నుండి ఒక ఆకులాగి చుట్ట చుట్టుతూ, "మంచి పొగాకయితే అంత చౌకగా ఏలాగ ఇవ్వగలవు. దొంగిలించిన బాపతాయేమిటి!" అని నవ్వగా ఎదుటి మనిషి "చిత్తం బాబయ్య! మీరు తండ్రి వంటివారు, మేము బిడ్డల వంటి వాళ్లము. డబ్బు పెడితే డబ్బు ఎత్తు ఉప్పుగల్లు అయినా కాని రోజులు వచ్చాయి. మాలాంటి వాళ్ళు యేలాగ బాబూ బతకడం ఎన్ని గడ్డులో కరవకుండాను" అని తన దోషమును ఒప్పుకుంటూ దానిని సమర్థించు కొనడానికి చూశాడు."దొంగ సొమ్మయితే అతి చౌకగావస్తుంది. ఇంక చౌకబేరం చేస్తే నా తెలివితేటలకు ఇంట్లో వాళ్లంతా సంతోషిస్తారు" అని తలస్తూ చుట్టిన చుట్టను సగము కాల్చి, "సరే, పొగాకు ఒక మోస్తరుగా ఉంది; ఇచ్చే ధర చెప్పు ఖండనగా మా ఇంటి వాళ్లకు బేరం అంటే అసహ్యం' అని అడిగాడు మా అన్నయ్య. అందుకా మనిషి అతి రహస్యముగా "అయ్యా,థడియం(2వీసెలు) రెండు రూపాయలకాడకు తీసికొనండి అంగడిలో మూడున్నరకు తక్కువియ్యరు: చూడండి!" అనగా మా వాడు "నీతో బేరమాడడానికి టైము లేదు. థడియం రూపాయికి ఇస్తే బుట్టంతా వేయించుకుంటాను."అంటూ లేచాడు. అంతట ఆ మనిషి చిరునవ్వుతో, "ఏమండీ, కామందులవారు! ఈలాగు అడిగితే ఎక్కడయినా బేరం కుదురుతుం దాండి, ఎంత దొంగ సొత్తయినా!" అంటూ చుట్ట కట్టబోవుచుండగా మా వాడు 'నే చెప్పిన ధరకు ఇస్తే నీవు ప్రతి రోజూ ఎన్ని బుట్టలు పట్టుకువస్తే అన్నింటిని రెండవ కంటివాడికి తెలియకుండా కొంటాను. లేకపోతే పోలీసు వాళ్లున్నారు"అంటూ కొంత ఆశ భయమూ కొల్పగా పొగాకువాడు ఆ ధరకు ఒప్పుకొని బుట్టను లోపలికి తీసుకువెళ్లి తూచడం మొదలుపెట్టాడు. ఒక పట్టునకు ఒక వీసెరాయి వేసి తూస్తున్నాడు. మా అన్నయ్య అది థడియం రాయి అనుకున్నాడు. 36 వీసెలు ఉంటే 36 థడియాలు అనుకొని తన ప్రయోజకత్వమును తానే సంతోషిస్తూ, తాను చేసిన బేరము గురించి, తన తల్లికి చెప్పి ఆమె మెప్పును పొందవలెననే ఆశతో పైకము 36 రూపాయలు తన పెట్టె నుంచి తీసి ఇచ్చి వేసి, ఇంకా ఏమయినా బుట్టలుంటే తెమ్మని చెప్పి ఆ మనిషిని పంపివేశాడు. పక్కనున్న నేను కూడా మంచి బేరగాడు మా అన్నయ్య అని మనస్సులో సంతోషించాను! ఆ దినం రత్తయ్య కూడా పొగాకు కొట్టు దగ్గర ఉన్నాడు. హగ్రీ నుంచి కాతాదారు పంపిన పొగాకు బండి అప్పుడే చేరినది. బండివాడు ఉత్తరము ఒక దానిని పట్టుకు వచ్చాడు. అందులో పది బుట్టల పొగాకు పంపినానని కాతాదారుడు వ్రాసినాడు. రత్తయ్య లెక్కపెడితే తొమ్మిదే ఉన్నాయి.బుట్టలు మాతండ్రికి కూడాలెక్కపెట్టి బండివాడి మీద కేకలు వేసినాడు. రత్తయ్యకు మా తండ్రి మీద ఇదివరలో కలిగిన అనుమానం బలమయింది. ఇతను చల్లగా అచ్చటనుంచిలేచి వెళ్లి టౌను పోలీసు స్టేషనులో రహస్యంగా రిపోర్టు చేసినాడు. ఈ పోయిన పొగాకు బుట్ట తప్పకుండా మా తండ్రి అపహరించి యున్నాడనిన్నీ, మా ఇల్లు సోదా చేస్తే తప్పక బుట్ట పొగాకు దొరుకు తుందనిన్నీ, ఫిర్యాదు చేసినాడు.

మా తండ్రి ఇంకా బండి వాడి మీద అరుస్తున్నాడు. తనకి ఏమీ తెలియదని బండివాడు నెత్తీనోరు కొట్టుకుంటాడు. పాపము! రాత్రి కునుకుపోతూ బండితోలేటప్పుడు వెనుకు నుంచి యెవ్వడో బుట్ట ఎత్తుకు పోతే వాడికేమి తెలుసు? బండివాని మీద నేరమా రోపించి అర్జీ వ్రాసి పోలీసువాళ్ల చేతికిచ్చాడు, మా తండ్రి. పోలీసువాళ్ళని వెంబెట్టుకుని రత్తయ్య మా ఇంటికి వచ్చాడు. పోలీసువాళ్ళని చూసేటప్పటికి మా అన్న గుండెలలో రాయి పడింది. ఇన్సెపెక్టరు "మీ ఇంట్లో పొగాకు బుట్టలేమయినా ఉన్నాయా?" అని అడిగే సరికి, 'అబ్బే మా ఇంట్లో యెందుకుంటాయి?' అన్నాడు మాఅన్న. పోలీసువాళ్లు లోపలికి జొరబడ్డారు. మాఅన్న మొగం వేలాడవేసినాడు. పొగాకు బుట్ట కనపడింది. "ఇది ఎక్కడిది?" అని ప్రశ్నించగా, "మదనపల్లి నుంచి సొంతానికి నే తెచ్చుకున్నాను అన్నాడు మావాడు. "ఇప్పుడు మా కొట్టుకాడకు వచ్చిన ఆకూ, ఈ ఆకూ పోల్చి చూస్తే తెలుస్తుంది." అంటూ ఒక ఆకు తన మొలనుంచి తీసి పోలీసు నాయకునికి అందించినాడు రత్తయ్య. రెండుఒక్కలాగే ఉన్నాయి!

'సరే ! ఇప్పుడైనా నిజం చెప్పుతావా ? లేక పోలీసు స్టేషన్‌కు వెళ్లుతావా ?"అని గర్జించినాడు నాయకుడు. మా అన్న నిజం చెప్పక తప్పింది కాదు. కాని యెవ్వరూ మా అన్న చెప్పినదానిని నమ్మలేదు. రత్తయ్యని మోసంచేసి మా తండ్రే దీన్ని అపహరించాడని దృఢపరుచుకొన్నారు పోలీసువారు. ఇంతటిలో మా తండ్రి వచ్చి పోలీసు వారి గర్జనల పూర్వకముగా వృత్తాంతమంతా తెలుసుకొని  లబలబలాడాడు.

ఆ రోజునే రత్తయ్య ఒక దమ్మిడీ అయినా మా తండ్రికి ఇవ్వకుండా కొట్టు స్వాధీనం చేసుకున్నాడు. ఈ సంగతి తెలియజేస్తూ మా తండ్రికి రిజిస్టరు నోటీసు ఇచ్చాడు. కొట్టులో అప్పటికున్న సరుకు, బాకీలు అంతా జేరి మూడు నాల్గు వేల రూపాయల దెబ్బ ఇది మాకు.

మరునాడు మేజిస్ట్రేటు కోర్టు నుంచి మా తండ్రికి మా అన్నయ్యకూ సమనులు వచ్చాయి. అందులో మూడు నేరముల క్రింద ఛార్జీవేసినట్లు తెలిసింది. 1) భాగస్వామిని మోసం చేయడం 2) అన్యాయంగా బండివాడిపైన ఫిర్యాదు చేయడం 3) దొంగసొత్తు కొన్నామని అబద్ధపు స్టేట్‌మెంటు ఇవ్వడం. అప్పుడు మా కులస్తులు మా ఇంటికి వచ్చి పరామర్శ చేయడం మొదలుపెట్టినారు. మా తండ్రి తల ఎత్తుకోలేక పోయినాడు. ఏలాగయినా ఈ కేసు తప్పించుకొనవలెనని బ్రహ్మప్రయత్నం చేసినాడు. ప్లీడరు ఖర్చు, సాక్ష్యం ఖర్చు, లంచం ఖర్చు, పై ఖర్చు, ఆ ఖర్చు ఈ ఖర్చులన్నీ కలిపి మా ఇల్లు గుల్ల చేశాయి. ధనికుడు, పలుకుబడి గలవాడు అయిన రత్తయ్య కేసు చేస్తే నెగ్గటమంటే మాటలా ? ఏలాగయితేనేమి, మా వాళ్లకిద్దరికి చెరివక యాభైరూపాయల జుర్మానా తోటి కేసు సమాప్తి అయింది. ఇంట్లో ఆస్తి గంగలో కలిసింది. రత్తయ్యతో కలహించి వ్యాపారం చేయడం ఎవడికి సాధ్యం? ఇప్పటికి కలిగిన నష్టము చేతనూ, ముందు వ్యాపారము చేయడానికి మార్గము లేకపోవడం చేతనూ, మా తండ్రి కృశించి, మంచంపట్టి ఆరు మాసములలో గతించినాడు. లక్ష్మి కూడా గతించింది.

ఆ ఊళ్ళో కాపురము చేయలేక ఉన్నదేదో పోగుచేసుకొని, నేను మా పెద్ద అన్న ఈ వూరు వచ్చి చిల్లర దుకాణము పెట్టుకొని పొట్టపోసుకుంటూ ఉన్నాము. మా చిన్న అన్నకు చదువు చెప్పించడము మూలాన గదా మాకింత దుర్దశ పట్టింది! కులాచారము మానినందుకు అనుభవించక తప్పుతుందా! అప్పటి నుంచీ మా కుటుంబములో వాళ్లమే కాకుండా బళ్లారిలో అప్పుడు కాపురం చేస్తూ ఉన్న కోమట్లు అందరూ పిల్లలకు చదువుచెప్పిస్తే అచ్చుబాటుకాదని ఎవ్వళ్లకీ చదువన్నమాట చెప్పించడం మానివేశారు.

'ఇప్పుడు తెలిసిందా! నే చెప్పిన దానిలో సారస్యం?' అంగడికి దినుసులను కొనటానికి వచ్చినవారి వైపుతిరిగి వారికి కావలసిన వస్తువులు ఇవ్వసాగినాడు కోమటి పాపయ్య. నిట్టూర్పువిడిచి 'నిజమే !' అంటూ మెల్లగా జారివెళ్లి పోయినాడు ఉపాధ్యాయుడు.

**– జూలై, 1923, శారద మాసపత్రిక**

**(కథకుడి వివరాలు తెలియవు)**

# ఒక చిన్న కథ

**– కథకుడి పేరులేదు**

**రా**మాపురము చాల జలవసతి కలిగిన గ్రామము. ఒక ఫర్లాంగు దూరములోనే పినాకినీ నదియున్నది. వేసవి కాలములో నదిలో నీరు లేకున్నను కాలువలో సమృద్ధిగా నుండును. ఊరిలో గొప్ప బావులను, మంచినీటి నూతులును గూడ గలవు. ఏటి కాలువల యాధారముచే రామాపురములోని తరీ భూములిరుగారు పండును. నూరు ఎకరములు వఱకు ధృవపైరు తోటలును, కొన్ని ఆకుఁదోటలును గలవు.

గ్రామములో కక్ష్యలు లేవు. రెడ్డి కరణము లిద్దఱు నన్నదమ్ములవలె పరస్పర మైత్రి గలిగియుండిరి. రైతులు తమ వ్యవహారములనన్నింటిని రెడ్డి కరణముల యొద్ద పరిష్కరించుకొనుచుండిరే గాని యూరువిడిచి పోవుమాటలేదు. ఏ కోర్టులోనూ రామాపురము కక్ష్యదారుడడగు పెట్టినది లేదు. వకీళ్ళపరిచయము వారికి లేనేలేదు. రివిన్యూ అధికారులకు సైతము జమాబందీ కాలములో తప్ప రామాపురము మాటయే వినబడదు.

వెంకటరామశాస్త్రులు గారాయూరి పౌరోహితులు. ఆయనకు దెలిసినంత వరకు తన పై ఏడు తరములవారు రామాపురములోనే కాపురము చేసియుండిరి. అంతకుముందెన్ని యేండ్లనాడు ఎప్పుడు వీరి పూర్వులాయూరు చేరిరో చెప్పువారెవ్వరు లేరు. శాస్త్రులు గారు చిన్నప్పుడే పంచకావ్యములు పఠించి పూర్వాపర ప్రయోగములు చెప్పికొన్నాడు. జోతిష్యము చాలవరకు తెలుసును. చుట్టుపట్టు పదిగ్రామములలో నెవ్వరియింట శుభా శుభకార్యమేది యైనను వారు శాస్త్రులవారు యొద్దకు వచ్చియే ఆయన సలహా దీసికొని పోవుచుందురు. ఇంతేగాక ఆయన వైద్యమునుగూడ స్వయముగా కష్టపడి కొంత నేర్చు కొనెను. డబ్బుతీసికొని వైద్యము చేయువాడు కాదు. కావున ఐశ్వర్యవంతుల కాయన వైద్యము మీద నమ్మకము లేదు. కాని బీదలెవ్వరికేమి వచ్చినను ఆయన యొద్దనే యౌషధమును కొంపోదురు. వారి కారోగ్యము కలుగుచునే యుండెను.

శాస్త్రులవారు దారిద్ర్యమెట్టిదో ఎఱుఁగరు. వారికిరువది ఎకరముల తరీభూమి యును, ఏఁబది ఎకరముల ఖుష్కీచేలును, ఒక చిన్న అరటితోటయు గలవు. రెండు గేదెలును ఒక యావును ఇంట పాడియొసంగుచుండెను. శాస్త్రులవారి గృహిణిపేరు లక్ష్మీదేవమ్మ. ఆమెకు యింటికి వచ్చిన మూడవ యేడే పుత్రసంతానమయినది. తర్వాతనిద్దరు కూతుర్లు గలిగిరి. లక్ష్మీదేవమ్మ దృఢాంగికాదు. గృహకార్యనిర్వహణమునకామె చాలదు. బళ్ళారి పుట్టినిల్లగుట చేత నామె చిన్నప్పుడు పట్టణవాసమున కలవాటుపడినది. పల్లెకాపురము ప్రారంభమునకామె చాలకష్టముగా దోచెను గాని క్రమముగా నలవాటు చేసికొనెను. శాస్త్రులగారి మేనత్త (పాపము చిన్నతనమునందే వితంతువైనది) వారియింటనే యుండి వంటవార్పుల నిర్వహించు చుండెను. ఇంట జీతగాఁడొకఁడు పశువులను జూచుకొనుచు వెలుపలి పనిచేయుచుండెను.

కాల్యోచిత కృత్యములఁ దీర్చుకొని ఉదయమునే శాస్త్రులు గారు అరఁటి తోఁటకేగి అచ్చట

నొక గంట కాలము నుండి తిరిగి వచ్చి చావడిలో గూర్చొని ఏమేని చదువుకొను చుందురు. దినశుద్ధియో ప్రయాణ ముహూర్తమునో యడుగగోరి వచ్చినవారి కప్పుడే కావల సినది చెప్పి పంపును. వైద్యముకోసరము వచ్చువారికి కాలనియమము లేదు. ఎవ్వరెప్పుడు వచ్చినను వారివెంట నరిగి రోగిని జూచి ఔషధమును నూరి యిచ్చి వచ్చెదరు. శాస్త్రులు గారు మధ్యాహ్నము పదునొకండు గంటలకు సరిగా స్నానాదికములు దీర్చికొని దేవపూజసల్పి, కమ్మని యావు నేయితో చిక్కని పెరుగు పాలతో దృప్తిగా భుజించి ఒక గడియసేపు విశ్రాంతి తీర్చుకొని మరల గ్రంథావలోకము సేయుచుందురు. నాలుగు గంటల వేళల లక్ష్మీదేవమ్మ చక్కర గలిపిన పేలపిండియో, వేయించిన యడుకులో, దోసపండో అరటిపండ్ల సీకరణియో ఫలహారము నుంచును. అదియైన వెనుక తీరసంజకడ మళ్ళతట్టో చేలవంకకో పోయి చీకటిపడిన వెనుక ఆయన తిరిగి వచ్చును. రాత్రి 9 ఘంటలకు భుజించి పది ఘంటలకు పరుండును. ఈ విధముగ శాస్త్రులుగారు సుఖజీవనము చేయుచుండిరి. వారి తండ్రి తాతలింతకంటె సేద్యపు పనులలో విశేషశ్రద్ధ వహించుచుండిరట. కాని అంతకష్టమునకు వీరలవాటు పడియుండలేదు.

కృష్ణుని కప్పుడే ఆరవయేడు వెళ్ళుచుండెను. ఐదవ యేడు పడిన వెంటనే శాస్త్రులు గారు వానికక్షరాభ్యాసము చేసి అక్షర గుణితము, ఎక్కములు నేర్పియుండిరి. పగలు బడికి పోయి కృష్ణుడక్కడనే విద్యనేర్చుచుండెను. తెల్లవారుజామున నిద్రలేపి శాస్త్రులుగారు వానికి అమరము శబ్ధములు, మొదలగునవి చెప్పుచుండిరి. కొన్నాళ్లకు బడి విడిపించి, వానికి తనకు వచ్చినంత వరకు ఒకటో రెండో కావ్యములు చెప్పి, తర్వాత నెవ్వరియొద్దనైన తర్కము వేదాంతము చదివింప వలయుననియ, జ్యోతిష వైద్యములు గూడ కొంతవఱకు నేర్పవలయుననియు శాస్త్రులుగారెంచి యుండిరి. కాని లక్ష్మీదేవమ్మ కీమార్గమేమియు సరిప డలేదు. పిల్లవానికి ఇంగ్లీషు చెప్పించి యుద్యోగములో చేర్పించవలెనను నభిలాష యామెకు మిక్కుటముగ గలదు. ఒకనాడు బ్రాహ్మ ముహూర్తములో మేల్కాంచి శాస్త్రులవారు

"కృష్ణా! కృష్ణా! లేవరా, తెల్లవార జొచ్చెను, అమరము ఒక సర్గ అయినా చెప్పుకొందువు లేయి" అని పిలిచెను.

లక్ష్మీదేవమ్మ : – పిల్లవాడు పాపము నిద్రలో నున్నాడు, మీరు పెద్దవారు గనుక నిద్రరాదు. అమరము చెప్పుకొందవు రమ్మంటారు.వాడులెయ్యవద్దా? పాపము కదమ్మ, నిద్రపోనీలేండి.

శాస్త్రులు :– తెల్లవారు జామున చదివిందే విద్య. ఇప్పుడు మనసుకు పట్టినట్లు పగలు చదివితే పట్టదు.ఇప్పటి నుండి అలవాటయితే తప్ప తెల్లవారే లేవడము తర్వాత కష్టమవుతుంది.

లక్ష్మి :–"ఆ అమరము శబ్ధాలు రాకపోతే మానెలేండి. ఏమీ మునిగిపోలేదు. అవి నేర్చుకొన్నవాళ్ళు ఏమి గుళ్లు గోపురాలు గట్టినారు కాంగ".

శాస్త్రులు :– ఓసి పిచ్చిదానా ! అమరము రానివారికి నేనమరను అనిందంట సరస్వతి. అమరము రాకపోతే ముందు చదువెట్లాగ

లక్ష్మీ :- బళ్ళారిలో పెద్ద పెద్ద క్లాసుల్లో జదివేవాళ్ళను జూచినాను. యఫే జదివేవాళ్ళను గూడ జూచినాను. ఒక్కరికీ ఒక ఆమరశ్లోకమైనా రాదు. శబ్దాలేమిటివో వారికి తెలియనే తెలియదంట అందరు ప్యాస్ అవుతూనే యున్నారు. భారీ భారీ వుద్యోగాలు చేస్తూనే యున్నారు.

శాస్త్రులు :-అది ఇంగ్లీషు విద్య, సంస్కృతముకాదు, ఇంగ్లీషు నేర్చుకోవడానికి ఓనామాలైనా అక్కర లేదు. కాని సంస్కృతానికి అమరము శబ్ధాల్లేకుంటే జరుగదు.

లక్ష్మీ :- జరక్కపోతే పోనీండి. ఈ దిక్కుమాలిన సంస్కృతం, ఎవ్వరికి కావలె ? మనవాడు ఇంగ్లీషే చదువుకొని ఏ మున్సఫో, ఏ డిప్టీకలెక్టరు ఉద్యోగమో చేస్తాడు.

శాస్త్రులు :- ఇంగ్లీషు విద్య అంటే సామాన్యమా! పట్నవాసం కాపురము చేయవలె. ఓపినంత దుడ్డు పుస్తకాలను జీతాలకు కావలెనే.

లక్ష్మీ :- అయితే అవుతుంది. అంతమాత్రము భరింపలేమా? మనకేమి పది మంది కొడుకులుండంగ! ఒక్కడూ! వాని చదువుకే తక్కువయిందా? తర్వాత ఉద్యోగము చేసేటప్పుడు సంచులు నింపమా?

భార్య చెప్పిన వాదము శాస్త్రులవారికి సరిపోలేదు.గాని ఆమెకు బదులు చెప్పక మౌనము వహించెను. కృష్ణుని లేవమని మరల యాయన పిలువలేదు. ఇంతలో తెల్లవారింది.

కృష్ణునికిని తనకును చంద్రతారాబలములు చూచుకొని ఒక మంచిదినము నాడు వెంకటరామాశాస్త్రులుగారు భార్యతోను,కొమరునితోనుబయలుదేరి మరుసటిరోజు ఉదయం బళ్ళారి చేరిరి. మామగారి యింటిలోనే వారు బసచేసిరి. కాని నాటి మధ్యాహ్నము నుండియే తమకు వేరేయిల్లు బాడుగకు కావలయునని యూరంతయు వెదకిరి. కొన్ని యిండ్లనుకూలము కలవియె యుండెనుగాని, లక్ష్మీదేవమ్మ వానినొప్పుకొనక తమ వారున్న వీధిలోనే వారి యింటికి కించుక దూరములో నున్న యిల్లె కావలయునని పట్టుబట్టుటచే బాడుగ యించుక హెచ్చయి నను శాస్త్రులుగారాయిల్లే తీసుకొనవలసి వచ్చెను. ఆ మరునాడు వారా యిల్లు ప్రవేశించిరి. తర్వాత గృహకృత్యమునకు కావలసిన పదార్థములన్నియు నొక్కటొక్కటిగా కొనిరి. బియ్యము, బేడలు, చింతపండు, మెరపకాయలు, కొంచెముగా నెయ్యి మొదలగు పదార్థములను లక్ష్మీ దేవమ్మ యింటనుండియే తీసుకొనివచ్చియుండెను. వంట చెఱుకులు కొన్నప్పుడు మాత్రము శాస్త్రులు గారికించుక ఆశ్చర్యమును భయమును కలిగినవి. తమ యూరికడ నూరక వచ్చుచున్న వానికై యిచ్చట నెలకయిదు రూపాయల వరకు సెలవు చేయవలసి యుండెను.

ఒక శుభముహూర్తము చూచి ప్రక్క వీధిలోనున్న స్కూలులో శాస్త్రులవారు కృష్ణుని ప్రవేశపెట్టిరి. ఆ బడిపంతులు పిల్లవాని పరీక్షించి, రెండువ తరగతిలో చేర్చికొనెను. వానికి కావలసిన పుస్తకములను కొనియియ్యవలసినదని పంతులుగారు ఒక పుస్తకముల జాబితా నిచ్చిరి. కొంచెము తక్కువగా పది రూపాయలు వాని ఖరీదగును. తాను నాటకాంతముగా సాహిత్య మభ్యసించినను, రెండు మూడు రూపాయల పుస్తకములకంటె హెచ్చు కొనలేదు. చిన్న తరగతికిన్ని రూపాయల పుస్తకము లేలయని శాస్త్రులగారికి సందేహము కలిగినదిగాని,

ఇంగ్లీషు స్కూలులలో విజ్ఞానాభివృద్ధి హెచ్చుగా జరుగుటకిదియే హేతువేమోయని సమాధానపడి, అంగడికి పోయి ఆ జాబితా ప్రకారము పుస్తకముల కొనితెచ్చిరి. తెచ్చిన తర్వాత వానిలో నేమున్నదోయని యొకసారి గ్రంథములించుక త్రిప్పి వేసిరి, కాని గుఱ్ఱము గాడిద పాఠములు తప్ప అందులో ఆ యీడు బాలుడు క్రొత్తగా నేర్చుకొనదగు సంగతులేమియు వారికి గోచరింపలేదు. భాషాజ్ఞానమయినను అందువలన విశేషముగా నలవడునట్లాయనకు దోచలేదు. వీరి మనోభావమును గనిపెట్టి లక్ష్మీదేవమ్మ 'సరి! సరి! మ్రొక్కిన తక్షణము దేవుడు వరమిచ్చునా ఇంకా బడిలో నడుగే పెట్టలేదు. అప్పుడే వానికి చదువురాలేదని మీరు చింతచేయుచున్నారు. ఒక మూడేండ్లు పాటు జరిగినదా తెలియును' అని వాదించెను.

"అది కాదు! నాలుగేండ్లు చదివినా ఏమీ వుపయోగం కలిగేటట్లు నాకు తోచడం లేదు. నీ అన్నకొడుకు ఫస్టుఫారం చదువుతున్నాడు గదా! వానిని కావలసింటే పరీక్షించి చూడు".

కృష్ణుడు పరుగెత్తిపోయి నారాయణుని బిలచికొని వచ్చెను.

"నారాయణా! నీవు బడిలో ఏమేమిచదవుచున్నావో కొంచెము చెప్పు" అని లక్ష్మీదేవమ్మ ప్రశ్నించెను.

"బడిలో కాదు నేను చదివేది. హైస్కూలులో, హిస్టరీ, జాగ్రఫీ, సైన్సు, ఇంగ్లీషు, మ్యాథమేటిక్సు, డ్రాయింగు, డ్రిల్లు అన్నీ చదువుతాను."

"అవన్నీ ఏమిటివో నాకు దెలియదుగాని నేనడిగే ప్రశ్నలకు జవాబుచెప్పు" అని శాస్త్రులు ప్రశ్నించెను.

నీవే సంవత్సరము పుట్టినది?

1907 సంవత్సములో నవంబరు నెల.

తెనుగు సంవత్సరం చెప్పరా?

అంటే నాకు తెలియదు.

ప్రభవలు, విభవలు మీకు చెప్పరా?

అవి పల్లెలో చెప్పేవి. హైస్కూళ్ళలో అవిచెప్పరు.

ఈ ప్రొద్దు తిథి వారములయినా చెప్పు?

వారము శనివారము తిథి ఏమోమాకురాదు.

హిస్టరీ అనేదానిలో విషయమేమి?

హిస్టరీ అంటే దేశచరిత్ర, జాగ్రఫీ అంటే భూగోళము.

మనదేశము బాగా పాలించిన ప్రసిద్ధులయిన చక్రవర్తులపేర్లు చెప్పు?

విక్టోరియా ఎడ్వర్డు.

మన దేశములో నుండిన వారు పేర్లు చెప్పు నాయనా?

క్లయివు, డూప్లే, తిరుచునాపల్లిన బాబు

నలుడు, హరిశ్చంద్రుడు మొదలగువారి చరిత్రలు దెలియవా?

అది హిస్టరీకాదు, నీతి కథలు.

మనముండే ప్రదేశానికి ఏ దేశమని పేరు?

సీడెడ్ డిస్ట్రిక్ట్సు అనగా దత్త మండలాలు.

ఇప్పటి పేరు గాదు పూర్వపు పేరేమి?

మా స్కూలులో చెప్పలేదు.

పెన్నేరు ఏ యూరి దగ్గర సముద్రములో పడుచున్నది?

సముద్రములోకాదు బంగాళాఖాతములో అది పడేది.

పోనీ పెన్నేటి కుపనదులు ఏవేవి?

గంగా సింధు నదులకయితే చెప్తూతాను, పెన్నేటికి దెలియవు.

ఇంగ్లీషు ఎన్నాళ్ళుగా చదువుచున్నావు?

మూడేఁడ్లుగ.

ఏదీ ఆ జాబుచదివి యందులో నేమున్నదో చెప్పు?

మాకు వ్రాత జాబులు చదివేది రాదు.

కాపీలు వ్రాయడం లేదా?

యచ్చుకాపీ పుస్తకములలో వ్రాస్తాము.

పోనీ తెనుగు జాబయినా జదువగలవా?

యదీ మాకు రాదు, నేను వెళ్ళుతాను, క్రికేట్టునకు టైమయింది.

యది లేకపోతేనేమి. కూర్చొని జాబులు చదివేదయినా నేర్చుకో.

క్రికేట్టు ఆడకపోతే మా మేస్టరు కొడుతాడు. జాబులు చదవలేకుంటే ఆయన ఏమీయనడు యని నారాయణుడు లేచి వెడలిపోయెను.

శాస్త్రులు భార్య వంక తిరిగి చూచెను. 'వానికి రానివన్నీ యడిగితే ఎట్టు చెప్పగలడు? పాపము, వాడు ఒక క్లాసులోను తప్పిపోలే' దని లక్ష్మీదేవమ్మ సమాధానము చెప్పెను.

ఈ క్రికెట్టు ఆటలేమిటి?

'వాళ్లకు సత్తువా బలం వచ్చేటందుకు ఇది ఏర్పాటుచేసినారు'

'ఇప్పుడు మాత్రం వీడేమి ధృడముగా నున్నాడు, చిన్నవాడయినా మనవాడే కొంత మేలు.

*(సశేషము)*

**– 2-9, అక్టోబరు 1926, సాధన పత్రిక**

*(16 అక్టోబరు 1926 నాటి సాధన పత్రిక సంచిక లభించనందున ఈ కథ ముగింపు, రచయిత పేరు తెలియటం లేదు)*

# ఇరువురు యాత్రికులు

- రామచంద్ర

1

గుంటూరు మండలమున రామాపురమను గ్రామంబొకటి కలదు. అందు గ్రామ జనులందరిచే గౌరవింపబడుచుండిన వృద్ధ రయితులిరువురుండిరి. వారి పేర్లు రామస్వామి, గోపాలయ్య, సంవత్సరాది పండుగనాడు ఈ వృద్ధులిరువురు చావడియందు సాయం సమ యమున కలిసి ఇట్లు సంభాషింప దొడగిరి.

గోపాలయ్య :– రామస్వామి! పుణ్యక్షేత్రమగు తిరుపతి యాత్రఁజేసి స్వామి నారాధింప వలయునని ఇది వఱకే సుమారు ఎనిమిది సంవత్సరముల క్రిందట నిశ్చయించితిమి. పోయిన ఉగాది పండుగకే పోవచ్చునని చెప్పియుంటిని. అది జరిగిపోయినది. మరియొక యుగాది పండుగ సహితము గడచిపోవుచున్నది. ఇంకను నిశ్చయింపఁజాలకున్నావా?

రామస్వామి :– ఇంకను సమయము రాలేదు. ఈ నూతన గృహము కట్టుటకు ప్రారంభిం చినపుడు రెండువందల రూపాయలతో ముగియునని యనుకొంటిని. అయితే ఇదివఱకే రెండు వందలు ఖర్చయినది కాని ఇల్లు సగముకూడ ముగియలేదు. కావున మన యాత్ర నింకొక యుగాది పండుగ వఱకు నిలుపవలయును. దేవుని కృపయుండినప్పుడు పోగలుగుదుము.

గోపా: – ఇప్పుడే వెళ్లిన బాగుండునని నాకు తోచుచున్నది. ఇదే మంచి సమయము.

రామ :– సరే! ఇది మంచి సమయమే! కాని ఇల్లు కట్టుటకు బ్రారంభించినాను, దానిని ఇపుడెటుల విడచి వచ్చుట?

గోపా :– నీ యింటియందు మరెవ్వరును లేరా? నీ కుమారుడు చూచుకొనుచుండును.

రామ :– అవును వాడే ప్రకారము పని జరుపునది నాకు తెలియును. వాడీ భారమును వహించుటకు నర్హుడుగాదు. వానికి తెలివి తక్కువ.

గోపా :– నీవు చెప్పునదిప్పటికి సరియే. నీవెప్పటికిని శాశ్వతముగ బ్రదికి యుండవు. నీ మరణానంతరమున నయినను నీ కొడుకు సంసార భారము వహింప వలసినదే కదా; కావున వాడిప్పటి నుండి పనుల నేర్చుకొనుట మంచిది. నాకుమారుడు నేర్చుకొనుచున్నాడు.

రామ :– అవును, నీవు చెప్పునది వాస్తవమే. అయినను నేజేయు కార్యములన్నిటిని నేనే ముగించిన బాగుగ నుండుననే దలంచుచున్నాను.

గోపా : – ఓ ప్రియస్నేహితుడా ! సర్వమును పరిపూర్ణము చేయుట మనుజునికి సాధ్యము గాదు. మాగృహమునందొకరొకరు ఒక పని చేయుట వలన, పనులన్నియు సులభముగ శీఘ్రముగను నెరవేర్చబడుచుండును.

రామస్వామి కొంత కాలమేమియో నాలోచించి పిదప, "ఈ గృహునకిదివరకే నెక్కువ ద్రవ్యము వెచ్చించినాను, ఉత్తచేతులతో యాత్ర జరుగనా? రెండువందల రుపాయలు సంపాదించుట మాటకాదు" అని చెప్పగా గోపాలయ్య నవ్వుచు "ఆహా! ఇందులకా నీవు వెనుదీయుచున్నావు, నాకాశ్చర్యమగుచున్నది. నాకన్నను నీవు పదిరెట్లెక్కువ ధనికుడవయ్యు ద్రవ్యసమాచారము మాట్లాడుచున్నావేమి? రెండు మారులు గ్రామ పంచాయితీకోర్టున కధ్యక్షుడుగ నుంటివి. మరియు భూములెక్కువగ నున్నవి. వెళ్ళుటకు సిద్ధముగ నెప్పుడున్నావో చెప్పుము. బీదవాడయినను నేనెట్లో ద్రవ్యము తెచ్చుటకు ప్రయత్నింతును.

రామ: –(చిఱునగవుతో) నీవంతటి ధనికుడవని నాకిదివరకు తెలిసియుండలేదు. ఏ ప్రకారము పైకము తెచ్చెదవు ?

గోపా :– ఏదో ప్రకారము ఇంటి యందే సరిచేసెదను. కొంత కాలము కష్టపడినను చింతలేదు. సగము పట్టుపురుగులను కాపాడుటకు నా మిత్రునకిచ్చెదను. ఆ ప్రకారము యింటి ఖర్చు తగ్గును.

రామ :– నీమిత్రుడా పట్టుపరుగుల వలన ఎక్కువ లాభమును సంపాదించినపుడు చింతిల్లెదవు గాబోలు.

గోపా :– నా కెప్పటికని అట్టి చింతలేదు. నేఁజేసిన పాపముల గూర్చియే చింతిల్లు చున్నాను; పాపముల నుండి రక్షించు తిరుపతి వెంకటరమణస్వామి ధ్యానముకన్న వేరుచింతయేల?

రామ :– అవును, అంతయు సరిగనున్న వేరు చింత యుండదు. కష్టములబడిన దేవునెట్లారాధించుట?

గోపా :– ఇదియే గొప్ప తప్పు. బాధలెన్ని సంభవించినను దేవునిపై దృఢభక్తి నిలిపి యారాధించుటయే శ్రేయస్కరము. కార్యములన్నింటికన్న దైవారాధనమే గొప్ప కార్యము. మనము యాత్రచేయవలయునని నిశ్చయించినాము. చేసియే తీరవలయును, నిలువకూడదు.

2

పై జెప్పినరీతి అనేక మారులు గోపాలయ్య బోధింపగా తుదకు యాత్రజేయుటకు రామస్వామి సమ్మతించెను. గోపాలయ్య గృహమునకతడొకనాడు ప్రాత:కాలముననే వచ్చి, నీవు చెప్పినది నిజము. ఆయుస్సు మన చేతియందులేదు. సంవత్సరములు రాగరాగ మనమెక్కువ వృద్ధులగుచున్నాము. శక్తియున్న కాలమునందే మనము నడవగలము. కావున నిదియే మంచి సమయము అని చెప్పెను.

రామస్వామి తానేవచ్చి యాత్రకు సిద్ధముగ నున్నానని చెప్ప గోపాలయ్య మిగుల నాశ్చర్యము జెంది "కానిమ్ము నా అభ్యంతర మేమియు లేదు. నేనెప్పుడయినను సంసిద్ధుడనై యుండువాడనని నీకు తెలియదా?" యని బదులు పలుకుచు తన యంగీకారమును

సూచించెను. ఒక వారములోపల వారి ప్రయాణము నిశ్చయింపబడెను. భాగ్యవంతుడగు రామస్వామికి ద్రవ్యము సేకరించుట చాలా చులకనయై యుండెను. నూరురూపాయలు ఇంటిఖర్చుకుగాను తన భార్య చేతికిచ్చెను. రెండువందల రూపాయలు తన ప్రయాణపు ఖర్చులకు తీసి యుంచెను. మిగిలిన యారువందల రూపాయలను గుప్తముగ తన బెట్టె యందుంచి తాళమువేసి తన దగ్గరనే తాళపు చెవిని భద్రముగ నుంచుకొనెను. గోపాలయ్య కూడ సిద్ధుడయ్యెను;తనకున్న వానిలో సగము పట్టుపురుగులను తన పొరుగువానికి నూట ఏబదిరూపాయల కమ్మివేసెను. తన భార్యయొద్ద నుండిన ముప్పది రూపాయలకును, కుమారుని యొద్ద నుండిన ఇరువదిరూపాయలను తీసికొనెను. వారును మిగుల నానందముతో నిచ్చిరి.

ఇంటి విషయములు నేప్రకారము నిర్వహింపవలసినది రామస్వామి తన కుమారు నకు బోధించెను. ఎంత మంది తనకు గుత్తలియ్యవలసినదియు, ఏఏ భూముల యందెట్టి పైరుల బంట పెట్టవలసినది, భూముల నెటుల సారవంతము చేయవలసినది మొదలగు విషయములను గూడ తన కుమారునకంతయు విశదముగ జెప్పెను. గృహనిర్మాణమునందెట్టి శ్రద్ధ వహింపవలయునో అదియు బోధించెను. అతడింటలేని సమయమున నేనేమి జరుపవల యునో నవియన్నియు నూహించి హితము చెప్పెను. గోపాలయ్య కిట్టి యోచనయే లేదు. ఇంటి విషయములు తానింట లేనపుడు ఎట్లు జరుగునను భయమతనికి లేదు. యాత్రజేసి స్వామి నారాధింప వలయుననియే అతని కోరిక. పొరుగింటివాని కియ్యవలసిన సగము పట్టుపురుగులలో దక్కువజేయక పూర్తిగ నియ్యవలయునని తన భార్యకు నొక్కి చెప్పెను.

ప్రయాణదినంబు వచ్చెను. యాత్రకు గావలసిన సామానులన్నియు భద్రముగ గట్టబడెను. వృద్ధులిరువురు దైవప్రార్థన గావించి సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించి బంధు, మిత్రాదులయెద్ద సెలవుగయికొని బయలు నెడలిరి. గోపాలయ్య మనంబమితా నందంబు నొందుచుండెను. చాలా కాలము నుండియు నెదురు చూచుచుండిన కార్యము సమకూర నున్నదని మిగుల సంతసించుచుండెను. దేవుని ధ్యానించుచు నడువదొడగెను. బాటపై పోవునపుడు గాని లేక ఒక పల్లెయందు బసచేసినపుడుగాని ఇతరులకు సాయము చేయుటకే ప్రయత్నించుచుండెను. ఒకపని మాత్రమతనికి దుస్సాధ్యముగ నుండెను. ప్రయాణము ప్రారంభించునపుడతడు నస్యమువేయుట వదలిపెట్ట వలయునని నిశ్చయించి నస్యపు డబ్బీని సహితము ఇంటి యందే విడచియుండెను. అయితే ఆ చూర్ణపు మహిమ యేమియో కాని అతనిని అది వదిలినది కాదు. మొట్టమొదట బాటయందు పోవుచుండిన యొక ప్రయాణికుని యెద్ద కొంచెము కొంచెముగ తీసికొనెను. తుదకు దానిని వదలిపెట్టు ప్రయత్నము మాని ఒక డబ్బీనికొని అందెప్పటికి పొడి యుండునట్లు నింపి దానికి దాసుడ య్యెను. తన స్నేహితుడగు రామస్వామికి గూడ నీచెడ్డ యలవాటు పట్టువడునను భీతిచే కొంచెము వెనుక నిలిచి అతనికి తెలియకుండ నస్యము వేయుచుండెను.

రామస్వామి నడుచుటయందభ్యాసము గలవాడగుటచే సులభముగ ప్రయాణము చేయు చుండెను. అయిన నతనికి మనశ్శాంతి కుదిరినది కాదు. ఇంటి విషయముల మరచుట సాధ్యమైనది కాదు. భార్యాపుత్రాదు లెటుల పనులు జరుపుచున్నారో యోచించుచుండెను. ఏ విషయమైనను చెప్ప మరచితినేమోయని తలపోయుచుండెను. నా కుమారుడు నేను చెప్పిన ప్రకారము కార్యములు జరుపునా? బాట యందు రయితులు తమ పొలములకు ఎరువు వేయుచున్నారు. 'నా కుమారుడీ ప్రకారము పొలమునకు ఎరువు వేసియుండునా?' కొన్ని సమయములయందు ఇంటికి మరలివెళ్లి పనులన్నియు స్వయముగ తానే జరిపిన బాగుండునని కూడ  తలచుచుండెడివాడు. ఈ ప్రకారము వారివురు ప్రయాణము చేసిరి.

3

ఆరు వారములు గడిచెను. కాలి చెప్పులు సమసిపోయెను. క్రొత్తవి కొనవలసి వచ్చెను. కొన్ని వేళలయందు వారు భోజన సామాగ్రులను కొనుచుండిరి. కొన్ని ప్రాంత్య ములయందు మనుజులు పరోపకారశీలులై వారిని అతిథ్యమునకు బిలుచుచుండిరి. దేశము ధనసమృద్ధి గలిగి విరాజిల్లు చుండెను. తరువాత వారు క్షామదేవత తాండవమాడుచుండిన నెల్లూరు మండలమున కేతెంచిరి. దిగుటకు గదులనిచ్చిరిగాని భోజన సామాగ్రులను వారే కొనవలసి వచ్చెను. కొన్ని గ్రామములయందు బదార్థము లేవియు దొరకకుండెను. పైక మెంతయైన నిచ్చుటకు సిద్ధముగ నున్నను, బియ్యము కందిపప్పు మొదలగునవి దొరకలేదు. గడచిన మూడు సంవత్సరములయందును వర్షము రాలేదు. భాగ్యవంతులగు రయితులు తమకున్న వానినంతయును అమ్మి వేసిరి. మధ్యమ తరగతులవారు కష్టములపాలయిరి. బీదలు దేశాంతరము వెడలిరి, పోలేనివారు మాత్రము గ్రామములయందుండి ఆకులను, కాయ కసరులను  తిని  జీవన్మృతులైయుండిరి.

ఒకనాటి ప్రాతఃకాలమున యిరువురును శీఘ్రముగ లేచి సూర్యోదయమునకుఁ బూర్వముననే వెడలిరి. ఎనిమిది మైళ్ళు నడిచిన పిదప నొక చిన్న నదియొద్దకు వచ్చిరి. ప్రాతఃకాలకృత్యములఁదీర్చికొని దంతధావన ముఖప్రక్షాళనంబుల గావించి తెచ్చియుండిన చల్దియన్నపు మూటను విప్పి, కడుపార నారగించి, స్వచ్ఛజలంబుల ద్రాగి, సేదదీర్చుకొనుటకు కొంతకాలమచట సుఖాసీనులైరి. గోపాలయ్య తన నస్యపు డబ్బీని పైకి దీసెను.రామస్వామి ఈ చెడ్డ యలవాటును వదలి పెట్టకూడదా? యని ప్రశ్నింప గోపాలయ్య నా శక్తి కొలది ప్రయత్నించితిగాని విఫల మనోరథుడనైతిని అని ప్రత్యుత్తర మిచ్చెను.

కొంత కాలమయిన పిదప వారు లేచి మరల నడవదొడగిరి. పదిమైళ్లు నడిచిన తరువాత వారొక పెద్ద గ్రామమునకు వచ్చిరి. సూర్యుడతి తీక్షణముగ నుండెను. 'గోపాలయ్య యలసియుండుటచే కొంత దాహము తీర్చుకొని నిద్రపోయి మరల ప్రయాణము చేయవ లయునని తలంచెను. రామస్వామి మాత్రం మలసియుండలేదు.

గోపాలయ్య : నాకు చాల దాహముగా నున్నది.

రామస్వామి : నీవు పోయి నీళ్ళు త్రాగిరమ్ము నాకు దప్పిలేదు.

గోపాలయ్య : అటులనే కానీ ! నీవు నిలువ వలసిన పనిలేదు. నేనీ సమీపమునందున్న ఇంటిలోనికి వెళ్లి నీళ్ళు త్రాగి ఒక నిమిషములో వచ్చి నిన్ను గలిసికొందును.

మంచిదని రామస్వామి చెప్పి బాటపై నడువదొడగెను. గోపాలయ్య ఒక చిన్న గుడిసె వైపు వెళ్ళెను. ఆ గుడిసె చాలాపాతది. గోడలు చీలి కొన్ని చోట్ల పడియుండెను. ఇంటి కప్పుకూడ ఒకవైపు క్రిందికి వాలియుండెను. గోపాలయ్య లోనికి వెళ్ళెను. తలుపు దగ్గరనే యువకుడొకడు పడియుండెను. నీడ యుండినప్పుడక్కడ పండుకొని యుండెనేమో కాని ఇప్పుడు తీక్షణముగ సూర్యుడతనిపై ప్రకాశించుచుండెను. అతడు నిద్రించుచున్నట్లు కానరాలేదు. కాని అటుయిటు కదులుచుండలేదు. గోపాలయ్య బిగ్గరగ నీళ్ళుకావలయును అని యడిగెను. కాని యెట్టి ప్రత్యుత్తరము రాలేదు. లోనికి వెళ్లెను. ఏడ్చుచున్న చిన్నబిడ్డ ధ్వని వినవచ్చెను. లోపలి తలుపుదట్టెను. లోపల ఎవరయ్యా యని పిలిచెను. ప్రత్యుత్తరము రాలేదు. తనచేతికర్రతో దలుపును గొట్టెను. దయయుంచి తలుపు దీయుడని కేకవేసెను. అంతయు నిశ్శబ్ధముగ నుండెను. వెళ్ళిపోవుటకతడు మరలుచుండ లోపలి నుండి మూలు గుచున్న ధ్వనియొకటి వినవచ్చెను. లోపలనేమో సంభవించియున్నది తెలసికొని పోవల యునని నిశ్చయించి మరల తలుపు వద్దకు వెళ్లెను.

4

తన హస్తమును తలుపు సందున చాపి లోపలి గడియను దీసెను. అదియొక చిన్నగది. అందొక చాపమీద యొక వృద్ధ స్త్రీ పడుకొని కన్నులు మూయుచు తెఱచుచు నుండెను. ఆమె సమీపమున నొక ఆరు సంవత్సరముల బాలుడు, ఆమె చీఱచెఱగు పట్టి లాగుచు ఏడ్చుచుండెను. వారి దగ్గర మరియొక స్త్రీ మూలుగుచు పొరలుచుండెను. ముసలిది గోపాలయ్యను చూచి 'నీకేమి కావలయును' అని యడిగెను.

'నాకు చాలదప్పియగుచున్నది త్రాగుటకు నీళ్ళు కావలయును'

'నీళ్ళు తెచ్చుట కెవరును లేరు. ఇంటి యందు నీళ్ళులేవు ఏమియు లేదు వెళ్లిపొమ్ము'

'ఈ పొరలుచున్న స్త్రీకి సహాయము చేయుటకెవరు లేరా'

ఎవ్వరునూలేరు, నా కుమారుడు వెంకయ్య ఇంటి బయట పడియున్నాడు. మేమందఱము ఇక్కడ పడియున్నాము'

'ఆ చిన్నబాలుడు 'అవ్వా! నాకు కొంచెము రొట్టెయిమ్ము చాల యాకలి యగు చున్నది' యని ఏడ్వప్రారంభించెను. క్రొత్త మనుష్యుడొక డింట ప్రవేశించుటగని వెంకయ్య యతికష్టముతో పైకిలేచి తడబడుచుచు లోపల తలుపు దగ్గరకు వచ్చి ధబాలున క్రిందబడెను. గొంత కాలమైన పిదప ఒక్కొక్క మాటగా నిట్లు చెప్పను. 'మేము.. అం...దఱము.. ఖాయిలా.. తిండి... లేదు...ఈ బా...లుడు...ఏడ్చు...చు..న్నాడు..నాకు...శక్తి లే..దు' గోపాలయ్య

హృదయము కరగిపోయెను. తన సంచియందున్న జొన్న రొట్టెను తీసి వెంకయ్యకు నియ్య బోగా నితడు తలయూచి, బాలునిపైపు చూపి, బాలునికిమ్మని సైగజేసెను. గోపాలయ్య బాలునికియ్య ఆ బాలుడు మిగుల సంతసముతో దాని నందుకొని ఒక నిమేష మాత్రమున దానిని మాయ మొనరించెను. పిదప గోపాలయ్య అందఱికిని కొంచెము రొట్టె ముక్క నీగా వారందఱుదినిరి. ఆముసలిది 'అయ్యా! నీళ్లు తీసికొని వచ్చెదవా? వీరి గొంతు లెండిపోయినవి. తెచ్చుటకు నేప్రయత్నింప బలహీనముచే గ్రింద బడితిని' యని చెప్పెను. బావియున్న స్థలమెరిగి, నీళ్ళు తెచ్చి గోపాలయ్య వారందఱికి నిచ్చెను. పిదప అంగడికి వెళ్లి బియ్యము పాలు గంజికాచి మూల్గుచున్న స్త్రీకి ఒసంగెను.

5

వెంకయ్య ఈ ప్రకారము తనచరిత్ర చెప్పదొడగెను. "ఓ మహానుభావా! నీవెవరో మాకు దెలియదు మా పాలిటి భాగ్యదేవతవలె వచ్చి మమ్ము రక్షించితివి. భగవంతుడే మిమ్ము పంపియుండవలయు. మేము ధనవంతులము కాము. పోయిన సంవత్సరము పంటలన్నియు నెండిపోయినవి. మా యొద్ద నుండిన ధాన్యమంతయు ముగిసినది. స్నేహితుల సాయము కోరెదమన్న వారు కూడా నిదేకష్టమందున్నారు. బిచ్చమెత్తుటకు మా మనసొప్పదు. కూలిచేసి జీవనము చేయుదమన్న కూలి దొరకదు. ఈ క్షామ కాలమునందు జీవనార్థము కూలిచేయుటకు కూడ సంసిద్ధులమై యున్నారము. కూలి దొరకునను యాశతో నూరువిడచి కొన్ని మైళ్ళదూర మేగితిమి కాని దొరకలేదు. ఒంటి పూట భోజనము చేయుచున్నాము. ఇట్టి సందర్భమున గోరుచుట్టుపై రోకలిపోటన్నట్లు అందఱికి జ్వరము వచ్చినది. బిడ్డల దు:ఖము చెప్పరానది. కాయ కసరులు తినుచుంటిమి. దేహముల యందు శక్తి లేదు. నా భార్యకు జ్వరము తగిలినది. ఆమెను విచారించుట కెవ్వరును లేరు. మేమందఱము మృత్యు దేవత నెదురుచూచుచు నిటబడి యుంటిమి.

గోపాలయ్య రామస్వామి మాటయే మరచెను. ఆ రాత్రియు మరుసటిదిన ముదయ మునను నిలువ నిశ్చయించెను. రాత్రి వారి కాహారమిచ్చి ప్రాత:కాలముననే లేచి ఇంటి పనులన్నియు దానేచేయుటకు బ్రారంభించెను. సామానుల జక్కజేసికొని, లేనివానిని అంగడికి పోయి, కొనితెచ్చి వండి వారందఱికి బెట్టెను.

ఈ ప్రకారమతడక్కడ మూడు దినంబులుండెను. బాలునికి శక్తి కలిగి నాలుగు వైపుల బరుగెత్త నారంభించెను. గోపాలయ్యను 'తాత' యని పిలువ మొదలిడెను. ముసల మ్మకు, రైతుకు కొంచెము బలమువచ్చెను. జ్వరము తగిలిన స్త్రీ కూడా కొంత బాగుపడెను. 'మంచిది, ఇన్ని దినము లిక్కడ నుండవలసి వచ్చునని నేను తలచియుండలేదు. కాలహర ణము జేయక నేను వెళ్ళవలయు'నని గోపాలయ్య నిశ్చయించెను.

6

నాల్గవదినము శ్రీరామనవమి, ఆ దినము వారితో భోజనముచేసి వెడలవలయునని

నిశ్చయించెను. తెల్లవారిన తరువాత లేచి పాలుపెరుగు మొదలగునవి కొనితెచ్చును. ముసలిది వంటచేసెను. పండుగ దినము గనుక పరమాన్నము కూడా చేసెను. పిదప నాయూరి యందున్న రామస్వామి యాలయమునకు వెళ్ళి ఫలపుష్పంబుల దేవుని కర్పించి, నమస్కా రంబులజేసి యింటికిజని అందఱును భుజించిరి. ఆ దినము సాయంకాలము ప్రయానము చేయవలయునని అతడు వారికి జెప్పెను.

వెంకయ్య ఆయూరియందున్న భాగ్యవంతుని యింటికి పోయి తనయెడ దయచూప వలయునని ప్రార్థించెను. వారికీ సంభాషణ జరిగెను.

వెంకయ్య:- అయ్యా ? మిమ్మతి దీనభావముతో వేడువాడ. నా భూములిప్పుడు వదలిపెట్టుడు మీ సొమ్ము తప్పక మూడు మాసంబులలో నిచ్చెద.

భాగ్యవంతుడు: - భూముల మాట యటుండని. నారొక్క మెప్పుడిచ్చెదవు? నాకిప్పుడు రూపాయలు జరూరుగా గావలయును.

వెంకయ్య :- భాగ్యవంతులగు మీరిట్లానతిచ్చిన మేమెట్లు బ్రతుకగలము? మొన్నటిదినము కొంచెము వర్షము వచ్చినది. కూరగాయలు పంట బెట్టవచ్చును. పండిన తక్షణమే మీ రూపాయలు మీకిచ్చివేసెదను. మేము పడిన కష్టంబులు మీకు తెలియనిది గాదు.

భాగ్య :- ఈ మాటలన్నియు పనికిరావు. రూపాయలు చెల్లించువఱకు, నే భూముల విడువను. వృథామాటలెందుకు? నాకు పనియున్నద'ని చెప్పుచు వెడలిపోయెను.

చేయునదేమియులేక వెంకయ్య చింతాకులస్వాంతుడయి కాళ్ళీడ్చుకొనుచు నింటివైపు మరలెను. ఇంచుకైనను కరుణజూపక దమకు రావలసిన వడ్డీని యసలును తెచ్చి ముందు బెట్టినగాని జరుగదని చెప్పు కఠినులగు భాగ్యవంతులన్ని గ్రామములయందు గలరు. వీరొనర్చు కార్యమతి ఘోరమైనది. ఇతరులు దు:ఖించినంగాని వీరు సుఖపడరు. కొంచము పైకమిచ్చి బీదలవారల యిండ్లు, భూములు తమ పేరిట వ్రాయించుకొని వాని యందు వచ్చు ఫలముల ననుభవించుచు ఇచ్చిన అసలుకు వడ్డీ ఫలముల ననుభవించుచు ఇచ్చిన అసలుకు వడ్డీ కట్టుచు, తుదకు వారిచ్చిన అసలు కంటె వడ్డీయే యొక్కవ కాగా, భూములను ఇండ్లను వారి స్వంతము జేసికొందురు. చిన్న చిన్న రయితులను పీల్చి పిప్పిచేయుచున్నారు. వడ్డీ వ్యాపార మంతటి పాపకార్యమేదియు లేదనవచ్చును.

గోపాలయ్య కీ సమాచారము తెలిసెను. అతడీప్రకారము యోచింప బ్రారంభించెను. 'నేనేమో వెళ్లిపోవుచున్నాను. వీరికి దినుట కేమియు లేదు. భాగ్యవంతుడు భూమినివ్వనని చెప్పినాడట. కూరగాయలు వేయునట్టి సమయమిది. భూములు లేమిచే వెంకయ్య యేమియు బండింప జాలడు. కావున నతనికేమియు దినుటకుండదు. ఏ ప్రకారము జీవనము చేయగలడు? నా దారినే బట్టిన వారు మొట్టమొదట యుండిన స్థితికే వచ్చెదరు. వారికి నేజేసిన మేలేమి ? ఏమి చేయనగును'.

అని అతడు సాయంకాలపు ప్రయాణమును మానెను. ఆరాత్రి దైవప్రార్థన గావించి పండుకొనెను. నిదుర పట్టలేదు. ప్రయాణ మొనర్పవలయునను కుతూహలము మెండుగ నుండెను. కాని ద్రవ్య మెక్కువగ నిదివరకే వెచ్చించి యుండెను. కాలము కూడ చాలా నతి క్రమించి యుండెను. ద్రవ్య కాలనష్టంబుల పొందినను ఆ బీద రయితులకు తగు సాయ మొనరించి యుండలేదు. 'అందఱికి మేలుచేయుట మనుజునకసాధ్యము. వీరికి కొంచెము రొట్టెయు నీళ్ళును ఇవ్వదలచితిని అయిన నాలుగు దినములు గడచిపోయినవి. వారికింకను శని వదలలేదు. వారికి ధన సహాయము చేయవలయునన్న వారి భూములను విడిపించి యియ్యవలయును, పిదప పాలిచ్చుట కొక యావును, సామానుల నంగడికి వేయుటకొక గుర్రమును కొనియియ్యవలయును. ఓ గోపాలయ్య! నీవీ విధమున బంధింపబడి యున్నావు. ఈ బంధము నుండి విమోచనము కావలయునన్న నీ చిత్తంబున నున్న యాత్రాభిలాషను పరిత్యజింప వలయును" అని తలచెను. ఇవ్విధంబున ననేక భావంబు లుదయించుచుండెను. నస్యపు డబ్బీని దీసి పొడి నుపయోగించెను. అయినను మంచి యోచన కుదరలేదు. యాత్ర సంపూర్ణము చేయవలయునను యాశ యొక వైపునను ఆ బీద కుటుంబమును రక్షించవలయునను యాశ మరియొక వైపునను లాగుచుండుటచే నతడేమియు నిశ్చయింప జాలడయ్యె. ఈ ప్రకారము నాలుగుగంటలయ్యెను. అప్పుడు కొంచెము నిద్రవచ్చు నట్లాయెను. కన్నుల మూసికొనెను. అతడీ కలగనెను. "అతడు తన మూట మొదలగువానిని గట్టి ప్రయాణమునకు సిద్ధమై తలపుతెఱచి బయటికి వెడలుటకు బ్రయత్నించెను. పోవుచున్నపుడు తన కోటు తలుపు సందున జిక్కెను. దానిని సరిగ దీయవలయునని క్రిందికి వంగెను అప్పుడాయింటి చిన్న బాలుడతని పంచను పట్టుకొని "తాతా రొట్టె ఇమ్ము" అని అడిగెను. ఈ సమయమున సరిగ అతడు మేలుకొనెను. కన్నులు తెరచిచూడ నిజముగ బాలుడు 'రొట్టెనిమ్మని' యడుగుచుండెను. తనలో దానిట్లనుకొనెను. 'సర్వేశ్వరుండు నాకు మార్గముజూపియున్నాడు. చంచల చిత్తుడనైయుంటిని. రేపటి దినము ఈ రయితు భూములను విడిపించి ఇచ్చెదను. గుర్రమును, ఆవును కొని ఇచ్చెదను. ఈ పని చేయని యెడల తిరుపతి వెంకటరమణస్వామిని దర్శించి యేమి ప్రయోజనము? అంతరంగంబున నుండు దేవుని విడనాడి బాహ్య ప్రపంచమందున్న విగ్రహముల బూజించుట నిజమైన భక్తికాదు. దు:ఖముల పాల్పడిన మనుజులకు సాయము చేయుటయే భగవంతు నారాధించుట కావున వీరికి దు:ఖవిముక్తి చేయుటయే ప్రధానకార్యంబు'

ఇట్లతడు దృఢనిశ్చయుడై కాలహరణము చేయక, ఆ దినముననే ఆయూరి భాగ్యవంతుని గృహంబునకు జని వెంకయ్య అతనికివ్వవలసిన రొక్కమునిచ్చి భూముల విడిపించెను. ఒక యావును, గుర్రమును కొనితెచ్చెను. ఒక మూట బియ్యము రెండు మూటలు రాగులు కొనెను. ముదుసలి స్త్రీ అవియన్నియు తమకై యుండవచ్చునని గ్రహించి నను గోపాలయ్యను ఆ విషయమడుగ వెనుదీసెను. అందరును ఆ దినమతి సంతోష ముతో గడిపిరి. ఇంటి వెలుపలి భాగమున గోపాలయ్య పండుకొనెను. అందరు నిద్రించిరి. ఎవరును నిద్రలేవక

మునుపే గోపాలయ్య లేచి తన సంచిని భుజమునకు వేసికొని రామ స్వామిని కలిసికొనవలయునను యాశతో బయలు వెడలెను.

7

ఐదుమైళ్ళు నడిచెను, సూర్యోదయమాయెను, వృక్ష మొక దానిక్రింద గూర్చుని, తన సంచినివిప్పి ఎంత పైకమున్నదో ఎంచెను, ఇరువది రూపాయలు మాత్రముండెను. "ఇది నా యాత్రకు జాలదు. ఇతరుల నడుగుట మంచిదికాదు. నా స్నేహితుడగు రామస్వామి తిరుపతికి పోవుచున్నాడు. నేను రానిది తెలిసికొని నా కానుకలు కూడ నతడే ఇచ్చునని తలచుచున్నాను. ఓ భగవంతుడా! నా ప్రార్థన నంగీకరింపుము, స్వయముగ రాఁబ్ర యత్నించితి; అయిన నది సాధ్యము కాలేదు. నేజేసిన కార్యము మంచిదో చెడ్డదో నిర్ణయిం చుటకు నీవే సమర్థుండవు కరుణాళుఁడగు నీవు ననుమన్నించి యుద్ధరింపవలయును".

పిదప తన మూట భుజముపై బెట్టుకొని ఇంటి మార్గము పట్టెను. వెంకయ్య గ్రామము దప్పించి కొన్ని దినములు ప్రయాణ మొనర్చిన తరువాత తన ఇల్లు చేరెను. రామస్వామితో బ్రయాణము జేయునపుడతనికి నడుచుట చాల కష్టమగుచుండెను. కాని ఇప్పుడొంటరియైనను కష్టమేమియు దోపక నుల్లాసముతో దినమునకు ముప్పది మైళ్ళు ప్రయాణముచేసి తన గ్రామమునకు వచ్చెను. అతని భార్యాపుత్రులమితానందులు జెందిరి.

ఎందుకతడు తిరుపతి వఱకు పోలేదని ప్రశ్నించిరి. అతడు యధార్థము జెప్పక దేవుడా ప్రకార మాజ్ఞాపించెననియు, రూపాయలు ఖర్చు పెట్టబడిన పిదప ప్రయాణమసాధ్య మాయెననియు దేవుడతని తప్పులను మన్నించుననియు చెప్పుచుండెను. తన యెద్దనున్న నిరువది రూపాయ లను తన భార్యకిచ్చెను. ఇంటి విషయములన్నియు చక్కగ నుండుటజూచి చాలా సంతసిం చెను. రామస్వామి భార్య వచ్చి తన భర్త సమాచారమడిగెను. "అతడారోగ్య వంతుడుగ నుండెను. యాత్ర సంపూర్తిచేసి రాగలడు. నా దురదృష్టముచే నాయాత్ర కొనసాగినది కాదు'అని ఆమెకు చెప్పెను.

ఆయూరి జనులందరాశ్చర్యపడిరి. బుద్ధిమంతుడును సద్గుణ సంపన్నుడునగు గోపాలయ్య యాత్ర ప్రారంభించి, కొంచెముదూరము వెళ్లి పైకమంతయు ఖర్చుచేసి యాత్రను పూర్తిచేయక మరలివచ్చుట యందేమో వింతయుండవలయునని తలంచిరి. గోపాలయ్యను వారీ విషయమై పెక్కుమారు లడిగిరి. అతడు నిజము చెప్పలేదు. తన గృహకృత్యంబుల నిర్వర్తించుచు సదా వెంకటరమణస్వామిని తన హృదయమున నెలగొల్పి అతనిని ధ్యానించుచు కాలముఁబుచ్చుచుండెను.

8

రామస్వామి గోపాలయ్యకుగాను చాలకాలమెదురుచూచెను. అతడు రాలేదు. వచ్చి కలసికొనునను తలంపుతో మెల్లగ నడువ బ్రారంభించెను. మూడు ఘంటలయ్యెను. ఇంకను రాలేదు. చాల దప్పియుండుటచే విశ్రాంతి గైకొనుటకై వృక్షచ్ఛాయఁబరుండెను. చల్లనిగాలి వీవ నతనికి నిదురపట్టెను. బాహ్య ప్రపంచమంతయు మఱచి సుఖముగ నిద్రించెను.

అర్ధఘుంట కెక్కువగ నెప్పుడు నిద్రింపని రామస్వామి ఈ దినము రెండు గంటలు పండుకొనెను. అయిదు గంటల సమయమున మేల్కాంచెను. నలువైపుల జూచెను గాని గోపాలయ్య కనబడలేదు. "సాయం సమయము వరకు నిద్రించితిని. నిద్రించునదెరుగక గోపాలయ్య నన్నుదాటి వెడలిపోయియుండునేమో లేకున్న దాహము తీర్చుకొని వచ్చుట కెంతకాలము పట్టును? ఎవరయినను బండిలో గూర్చుండబెట్టుకొని పోయిరా ఏమి? నేను వెనుదిరిగి అతనికై వెళ్ళిన, అతడు ముందుపోవుచుండిన నేనతనిని గలిసికొను మాటకల్ల. కాబట్టి ముందు నడుచుటయే మంచిద'ని తలచి ప్రయాణము ప్రారంభించెను.

బిఱబిఱ నడవ బ్రారంభించెను. ఆరు మైళ్ళ గ్రామములో నున్న యొక గ్రామమున కేతెంచెను. గ్రామములో గనబడినవారినందఱను 'గోపాలయ్యయను వృద్ధుడొకడీ గ్రామము నకు వచ్చుట చూచితిరా' యని ప్రశ్నింప వారందరు 'లేదులేద'నిరి 'సరే' గూడూరులో కాని రేనిగుంటలో కాని అతనిని చూడవచ్చునని తలంచి ప్రయాణము జేసెను. బాట యందనేకులు అతనిని కలిసికొనిరి. వారందఱు తిరుపతికి పోవువారే ! వారినందఱిని గోపాలయ్య విషయమై యడిగెను. వారందరతనిని చూడలేదని తెలిపిరి. కొన్ని దినములు ప్రయాణము చేసిన తరువాత వారు కాళహస్తి యను పుణ్యక్షేత్రమునకు వచ్చిరి. ప్రాత:కాల మున లేచి యూరు సమీపముననున్న నదియందు స్నానంబొనరించి దేవాలయమునకు వెళ్ళెను. తనవలెనే అనేకులు స్నానము చేసియుండిరి. ప్రాకారము చుట్టును ప్రదక్షిణము చేసి లోపలికరిగి, అందు చూపరులకు భయభక్తుల దోపజేయు కాళహస్తీశ్వరుని లింగమును జూచి కన్నుల మూసికొని మనంబున ధ్యానింప దొడగెను. పిదప నారికేల ఫలంబుల సమర్పించి కొంతకాలము స్వామి సాన్నిధ్యమున గూర్చొని యుండి తన బసకరిగెను.

మరునాడుదయముననే నాయూరు విడచెను. బాట యందు తిరుపతి వాస్తవ్యుడగు యొక మనుజుని స్నేహము గావించెను. వారిరువురును కలసి నడుచుచుండిరి. ఆ బాటసారి పేరు సుబ్బయ్య. వారిద్దరికీ సంభాషణ జరిగెను.

సుబ్బయ్య : ' అయ్యా ! మీ కెట్టి కష్టము లేక తిరుపతి యందు జూడదగిన స్థలంబులన్నియు నేజూపెద.

రామస్వామి : 'ఔను! స్వగ్రామవాసులగు మీకు దెలియనిదిందేమియు నుండదు.

సుబ్బయ్య : 'మాకెప్పటికి నిదేపని. యాత్రికులెందరో దూరదేశముల నుండి వచ్చుచుందురు. ఇదివరికెందరికో నేనిట్టి సహాయము చేసియున్నాను'

రామస్వామి :'మీరు చేయుపని చాల శ్లాఘ్యనీయమైనది. మీ సాయము లేనియెడ యాత్రకు లనేక కష్టముల పాలగుదురు. వారు దెచ్చు సామానుల భద్రము చేసికొనుట కష్టముగ నుండును'

సుబ్బయ్య : 'గొప్ప గొప్ప వారెందరో' మా యింట దిగియుండిరి. ఇంటి వెలుపల ప్రత్యేకముగ నొక గదియున్నది. పరదేశ యాత్రికులకిచ్చుటకే యది కట్టించినాను. అందు

సదా ఎవరయినను నుందురు. మీరందుండవచ్చును'

రామస్వామి : 'ఇప్పుడెవరయిన నక్కడ నుందురేమో' ?

సుబ్బయ్య : అట్టి భయము మీకెందుకు ? అందెవ్వరును లేరు. దానికున్న ఒకే తాళపుచెవి నా దగ్గరనే యున్నదిదిగో.

రామస్వామి : దేవుడు నాపై దయదలచియే నన్ను మీ యొద్దకు బంపియున్నాడు. నాకెట్టి కొఱతయు నుండదు.

ఈ ప్రకారము సంభాషించుచుండిరి. మూడు దినములు ప్రయాణ మొనరించిన తరువాత తిరుపతి సమీపమున కేతెంచిరి. ఎప్పుడెప్పుడు స్వామినిజూచు భాగ్యమొదవునాయని రామస్వామి తహతహ పడుచుండెను.

9

మరునాడుదయముననే లేచి రామస్వామి తనకు గావలసిన వస్త్రములను దీసికొని, కొంతపైకమును తన యొద్దనుంచుకొని, మిగిలిన దానిని గదియందే పెట్టి తలుపు బీగమువేసి, బీగముచెవి భద్రముగ బెట్టుకొని పుణ్యతీర్థమగు కపిలతీర్థమందు స్నానము చేయుటకు సుబ్బయ్యతో గూడ వెళ్ళెను. స్నానాంతరమున వారిద్దరు కొండ నెక్కుటకు బ్రారంభించిరి. యాత్రికులనేకులు దేవుని దర్శించుటకు 'గోవిందలు'పెట్టుచుపోవుచుండిరి. అక్కడక్కడ సోపాన ములను గోపురములును నుండెను. యాత్రికులు కొన్ని మెట్లు నెక్కుచు ఆయాసముతో నుస్సురుస్సురనుచు అక్కడక్కడ కూర్చుండి మరల నెక్కుచుండిరి. బలహీనుల బైకి నెక్కించుటకు డోలీలును సిద్దముగ బెట్టుకొని కూలివాండ్రు కాచుకొని యుండిరి. బలహీనులగు స్త్రీలు కొందఱు స్వయముగ నెక్కుట తమకు చాలకష్టమని తెలిసినను, డోలీలలో పోయిన యాత్ర ఫలంబు లభింపదను తలంపుతో డోలీల నెక్కమని చెప్పుచు పైకెక్కి పోవుచుండిరి. మరి కొందఱు కాళ్ళు నొప్పిపట్టకున్న నెక్కువ కానుకలు వేసెదమని దేవుని ప్రార్థించుచుండిరి. ఇరు ప్రక్కల లెక్కకు మిక్కుటముగ గ్రుడ్డి, కుంటి మరియు నితరావయవ లోపాలున్నవారు, బిచ్చము పెట్టమనియు పైకము నిమ్మనియు యాత్రికులందొందర బెట్టుచుండిరి. మన రామస్వామి బిచ్చగాండ్లకుగాను దమ్మిడీలు తెచ్చియుండెను. అతడు వారందరికిని నిచ్చుచు కొండ నెక్కుచుండెను.

ఈ ప్రకారం గాలిగోపురము మణకాలిమురి మొదలగునవి దాటి తుదకు వెంకట రమణస్వామివారి యాలయ సమీపమునకు వచ్చిరి. పుష్కరిణి తీర్థమునందు స్నానముచేసిరి. స్నానాంతరము రామస్వామి తన పైకపు తిత్తిని తీసిచూడ అందు ఇరువది రూపాయలు తక్కువగా నుండెను. సుబ్బయ్య తన కంటే ముందే స్నానముచేసి యట కూర్చుండి యుండె నుగాన నతనిపై సందేహము పొడమెను. అయిన బహిరంగముగ నతనిపై నిందమోపుటకు ధైర్యము చాలదయ్యెను. 'ఇదివరకు నాకు సాయము చేసియున్నాడు. అదియూను గాక నా దృష్టియంతయు తిత్తిపైననే యుండినది. అతడెప్పుడు తస్కరించి యుండగలడు ?

అతడుగాక మరెవ్వరు వచ్చిరి? నేదీసికొని వచ్చినదే యింతయా? లేక క్రింద బడిపోయి యుండునా? తెచ్చిన రూపాయల సంఖ్య జ్ఞాపకమున్నది. క్రింద ఎక్కడను పడలేదు. మనుషులను నమ్ముట చాల కష్టము. బహిరంగముగ వారు నవ్వుచు నవ్వుచునే యుండి కాలసర్పంబులవలె దారుణ కృత్యంబుల సల్పుచుందురు. సాధారణముగ నిట్టివి ఇచ్చోట జరుగుచుండునని నేను వినియున్నాను. దేవునిసన్నిధిలో వీరిట్టి కార్యంబుల జేయ సమకట్టియున్నారుగదా! ఏమి యాశ్చర్యము? పుణ్యతీర్థమగు తిరుపతి యందు గాపురము చేయువారెంత పుణ్యాత్ములై యుందురోయని దూరదేశయాత్రికుల తలంపు. ఇది యెంత భ్రాంతి. వీరిట్టి కార్యములు చేయుటచే వీరికి నిజముగ నరకప్రాప్తియగును. ఈ సమాచారము సుబ్బయ్యతో జెప్పిన నేమి ప్రయోజనము? పోయిన రూపాయలు రావు. కావున నెవరితో జెప్పక నల్లరి చేయక యుండుటే మంచిది. నేనే యిక మీదట జాగ్రత్తగా నుండవలయును' అని దీర్ఘాలోచనా మగ్నుండై యుండి తుదకు వస్త్రముల గట్టుకొని వెలుపలికి వచ్చెను.

సుబ్బయ్య ఇట్టి కార్యములయందారితేరినవాడు గావున నేమియుఁదెలియని వానివలె నటించుచు, దాని విషయమై రామస్వామి తనతో నేమియు జెప్పకుండుట జూచి యాశ్చర్య పడుచు ముందటివలెనే రామస్వామితో మాటలాడుచుండెను. అయితే రామస్వామి మనస్సు మాత్రమే దేనిపైననో యుండెను.

## 10

వారిరువురు దేవాలయపు ముంభాగమునకు వచ్చిరి. యాత్రికులు గుంపులు గుంపులుగ గుమికూడి యుండిరి. 'గోవింద, గోవింద' యను ధ్వని యన్నివైపుల ప్రతిధ్వనిం చుచుండెను. దాసయ్యలు 'ఏడుకొండలవాడ వెంకటరమణ వడ్డికాసులవాడ గోవిందా గోవిందా' యని కేకలు వేయఁ దలవెంట్రుకలు స్వామికర్పించిరి.వారి వెంబడి వచ్చు భక్తులు గోవిందయని బదులుజెప్పిరి. కొందఱు పసుపు వస్త్రంబుల ధరించి గోవిందలు పెట్టుచు భూమిపై బొరలుచుండిరి. మరికొందఱు నోర్లకు బీగమువేసికొని కానుకలను జెల్లించు చుండిరి. హుండీయందు జనులు తమ తమ కానుకలనేక చిత్తములతో వేయుచుండిరి. ఎటువైపు జూచినను దేవాలయమంతయు భక్తులతో నిండియుండెను.

లోపలి కరుగుట చాలకష్టముగ నుండెను. ఒకరినొకరి నూకుచు పోవుచుండిరి. అక్కడక్కడ పోలీసువారుండి ఎక్కువమంది ఒకటేమారు రానట్లు అడ్డగించుచుండిరి. ఎవరై ననువారికి పైకమిచ్చినవారిని పంపుచుండిరి. రామస్వామి సహస్రనామపూజ చేయించుటకు మంగళ హారతి చేయించుటకు ఏర్పాటు చేయబడిన మొత్తము చెల్లించి రసీదులఁ బొంది లోనికరిగెను. ఈ అర్చనలన్నియు పైకమెంతేని ఖర్చుచేసి చేయింపవలయునని యుద్దేశించి యుండెను. దీనివలన తన యాత్ర సఫలమగుననియు తన పూజలు దేవుడంగీకరించు ననియు అందువలన దనకు స్వర్గప్రాప్తియగుననియు నతని నమ్మకము. లోపలకి పోను పోను జనులగుంపు ఎక్కువకాజొచ్చెను. ముందొకయడుగు పెట్టుటయే కష్టముగ నుండెను. ఈ గడబిడయందు

తన పైకపు తిత్తిఎవరైనను తస్కరింతురో యనుభీతిచే దానినొక చేత భద్రముగ బట్టుకొని ముందుకు పోవుచుండెను. ఈ ప్రకారము రామస్వామి, సుబ్బయ్య ఎక్కువ కష్ట పడి సుమారు 50గజముల దూరమున వచ్చి నిలిచిరి. దానికంటె ముందు పోనియ్యలేదు. రామస్వామి పేరుచెప్పి పూజలు సేయపూజారులు మొదలిడిరి. రామస్వామి దేవుని ప్రార్థింపఁ దొడఁగెను. “దేవా! భగవంతుఁడవును బరమాత్ముఁడవును అనంతశక్తియునగు నీకు నా నమస్కారంబులు. విశ్వరూపుఁడవును విశ్వకర్తయు విశ్వహేతువునగు నీకు బ్రణా మంబులు. అనంతుడవును సూక్ష్మండవును సృష్టిస్థితిలయకారకుండవును నగు నీకు సాష్టాం గంబులు. ఓ దేవా! నేజేసిన పాపముల క్షమియించి నన్నాదరింపుము నీశరణుజొచ్చితి. ఓ వెంకట రమణా! నేను దేహము ధరించిన ఫలము నేడు పరిపక్వమయ్యెను. ఇప్పుడే నా కోటికలన్నియు సఫలమగునని తలంచెద. నీపాదభజన మాత్రంబున జనులు సంసారమును ధరించుచుండ నిన్ను దర్శించిన నా పుణ్యంబునకు ఫలమెట్టిదని చెప్పగలను. భవదీయ దర్శనంబునఁగనులు సఫలములయ్యె. నాపైఁగృపఁజూపి నన్ను ధన్యునిం జేయుము”.

అతడిట్లు ప్రార్థించుచుండినను అతని మనసేదో తలఁచుచుండినట్లుండెను. ప్రార్థనల ముగిసిన తక్షణమే అతనికి తన 20 రూపాయల సమాచారము జ్ఞప్తికిరాగ నిట్లు తలపోయ జొచ్చె. ‘ఎంత జాగ్రత్తగనుండినను పోయినదిగదా, నిజముగ నీ సుబ్బయ్యయే తీసియుండ వలయును. ఇది నిజమైన అతని ఇంటఁబెట్టియున్న పైకపుమూట ఏమగునో తెలియదు. ఓ భగవంతుడా! రూపాయలు దొరకిన నీకు మరిరెండు టెంకాయలు కొట్టెదను’.

ఇట్లతండు యోచించుచుండినపుడు దేవుని సాన్నిధ్యమునందతి సమీపమున గోపాలయ్య యుండుట జూచెను. తన కన్నుల నమ్మలేదు. అతనిని పోలిన మనజుఁడు మరియొక డుండవచ్చునని తలచెను. తదేక దృష్టితోఁజూచి యతఁడు గోపాలయ్య యనియే దృఢనిశ్చయుడై తన స్నేహితుని మరలఁగలసికొనుట తటస్థించెనని చాల సంతోషపడెను. “అతడెంత బుద్ధిమంతుడు! నా కంటెను త్వరగా నతఁడెట్లు రాఁగలిగెను. ఇక్కడికి వచ్చినను దేవుని సమీపమునకెట్లు పోఁగలిగెను. అతనికెవరో సాయముచేసి యుండవలయును. రేపటి దినమున నేనతనితో పోయెదను. పూజలు ముగిసిన పిదప నేనతనిని కలసికొని యీ సుబ్బయ్య సాయము వదలిపెట్టెదను” యని యోచించెను.

పూజలు ముగిసిన పిదప భక్తుల గుంపులు వెనుకకు మరలెను. ఒకరి నొకరు ద్రోయమొదలు పెట్టిరి. కొంత కాలమునకు రామస్వామి పెద్దద్వారము కడకువచ్చెను. అక్కడ గుంపులు తగ్గెను. రామస్వామి అచ్చట గోపాలయ్యను చూడవచ్చునను యాశతో ఈ ప్రక్కకు నాప్రక్కకు దిరుగుచుండెను. కాని గోపాలయ్య యెందును గానరాలేదు.

మరుసటి దినము కూడా రామస్వామి సరిగ దేవునికి మంగళహారతి చేయు సమయమునకు దేవాలయమునకు వెళ్లెను. ముందు వెళ్ళ ప్రయత్నించెనుగాని నిష్పల మనోరథుడయ్యె. ఈ దినమున దేవునికి వేదపారాయణంబుఁగావించుటకు పైకమొసగెను.

పూజారులతనిని నెక్కువగ పొగడి యతనికి దప్పకcబుణ్యము వచ్చునని నొక్కిచెప్పిరి. వారికి కూడ రామస్వామి కొంత పైకమివ్వ వారింకను నెక్కువగ బొగడిరి.కాని దేవునికతి సమీపమున బోనియ్యరయిరి. కావున రాతిస్థంభము నొకదానియొద్ద నిలువబడి ప్రార్థింప దొడగెను. కన్నులు తెరచిచూడ భగవంతుని పాదారవిందముల యొద్ద గోపాలయ్య హస్తముల జోడించి ప్రార్థించుచుండుట జూచెను. అతని నెట్లయినను గలసికొను నభిలాషతో మిగుల గష్టపడి ముందునకు వెళ్లెను. అక్కడికి పోయినప్పుడు గోపాలయ్య కన బడలేదు. ఎందుపోయినది తెలియరాలేదు. ఈ దినమెట్లయినను అతనిని కలిసికొనియే దీరవలయును నేనిప్పుడే ద్వారముకడ పోయి అక్కడ కనిపెట్టుకొని యుండెద. అతcడా వైపుననే వచ్చి తీరవలయును. అప్పుడతనిచేయిపట్టి నిలిపెద యని తలచి ద్వారముకడ వచ్చినిలిచెను. దేవుని దర్శించుటకు వచ్చినవారందరును వెడలిపోయిరి, పూజారి కూడా తలుపువేసియింటికి బోవుటకు వచ్చెను. గోపాలయ్య మాత్రము రాలేదు. 'ఇదేమి యాశ్చర్యము, నాకన్నులేమయినను భ్రమజెందినవా? భ్రమజెందుట కవకాశములేదే! నాకన్నులార జూచితిని. బాల్యస్నేహితుcడు. మా జీవిత కాలమంతయు ప్రతిదినము నొకరినొకరు చూచుచుంటిమి. ఇటులున్నపుడతనిని గుర్తెరుగుట కష్టమా? నిజముగ నేcజూచినది గోపాలయ్యయే. అందునకు సందేహమొకింతయు లేదు. అదియునుcగాక నొక దినముననే కాదు. మూడు దినములు చూచితిని. ఇదియేమి మాయ యోకాని యెంత వెదకినను కానరాcడు. భగవంతుని యద్భుత చర్యకాబోలు. దీనిని నేనూహింప సమర్థుcడనా! యని తనలో దాననుకొనెను.

తిరుపతియందుc జూడదగిన స్థలంబులన్నియు సుబ్బయ్య సాయముచే చూచి, కొండదిగి దిగువ తిరుపతి యందున్న గోవిందరాజస్వామిని దర్శించి కానుకలర్పించి, తిరుచానూరు నందున్న అమ్మవారిని సేవచేసి సుబ్బయ్య గృహమునకు వచ్చెను. మొట్టమొదట పైకపుతిత్తితీసి రూపాయలు సరిగ నుండుటcజూచి సంతోషపడి సుబ్బయ్యకు కొన్ని రూప్య ముల నొసంగి యతని సెలవు గయికొని గృహాభిముఖుడై వెళ్లెను.

## 11

వచ్చిన బాట మార్గముననే బయలుదేరెను. ఇంటివైపు ప్రయాణము ప్రారంభించిన తక్షణమే అతని మనంబున నింటియోచనలుద్భవించెను. 'నా కుమారుcడు నూతన గృహ మును బూర్తిచేసినాడా? నేను లేని సమయమున భూములను సాగుచేయక వ్యర్థపరచినాcడా? ఆవులు, గొఱ్ఱెలు మొదలగునవి వృద్ధియగుచున్నవోలేవో? నేనక్కడనే యుండి స్వయము గcజూచి కొనియుండిన బాగుగనుండెడిది. యాత్ర యడ్డమువచ్చినది. ఏమిచేయనగు?'యని యోచించుc బ్రయాణమొనరించుచుండెను. అతcడప్పుడే శ్రీవెంకటరమణస్వామిని ధ్యానించుట మరచెను. ఇహలోకవాంఛల బంధము నుండి విముక్తులగుట కష్టముగదా!

గోపాలయ్యకును తనకును నెడపాటు సంభవించిన గ్రామముకడకు రామస్వామి యేతెంచెను. ఆ గ్రామపు జనులc గుర్తించుట కష్టముగ నుండెను. అప్పుడు తినుటకాహారము

లేక క్షామబాధచే జనులు శుష్కించి యుండిరి. ఇప్పుడు వర్షములు వచ్చి పంటలు పండుటచే ధాన్యము సమృద్ధిగనుండుటంబట్టి జనులందఱు సంతోషముతో కాలము గడుపుచుండిరి. గ్రామములోపలికి వచ్చుచుండగా నొకచిన్న బాలుడతని కడ్డమువచ్చి 'తాతా తాతా! నీవు మాయింటికి రావలయున'ని పిలిచెను. ఆ బాలునికి బ్రత్యుత్తరమియ్యక రామస్వామి తనదారిన దాఁబోవుచుండ నా బాలుడతని వస్త్రమును బట్టుకొని నవ్వుచు తన యింటి వైపునకు లాగ ప్రారంభించెను. కొన్ని యడుగులు నడచిన పిదప తన గృహద్వారము కడనిలుచుండిన మనుజుఁడొకడు 'ఆహాః తాత ఎప్పుడు వచ్చినారు?'రండి. లోపలికి దయచేయుడు. ఈ రాత్రి మా యింటి నుండియే పోవలయును అని కృతజ్ఞతజూపు వచనంబులఁబలికెను. గోపాలయ్య దాహము దీర్చికొనుటకై పోయియుండిన గృహమని గ్రహించి, అతని విషయమునడిగి తెలిసికొన వలయునను కుతూహలముతో రామస్వామి లోనికరిగెను. తక్షణమే యొక ముదసలి స్త్రీ ఏతెంచి యతనిని కుశల ప్రశ్నలనడిగెను. కాళ్ళుకడుగుకొనుటకు జలమును బాలుడు తెచ్చియిచ్చెను. పిదప తినుపదార్థంబులదెచ్చెను. రామస్వామి దానినితిని చల్లని జలమునుద్రాగి 'అయ్యా మీరొనరించిన సత్కారమునకు నేనెంతయు సంతసించితిని, బాటసారుల కింతటి సాయముచేయుచుండుటచే మీరు వందనీయులు' అని చెప్పెను. లోనికి రమ్మని పిలిచిన మనుజుడు వెంకయ్యని చదువరులిది వరకే యూహించి యుందురు. అతఁడిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. 'అయ్యా! బాటసారుల నేనెట్లాదరింపకుందును? మాకందఱికిని బ్రాణదానం బొసగినది ఒక బాటసారియేగదా! భగవంతునిమరచి మేము జీవించుచుంటిమి. అందువలన మమ్మతండు శిక్షింపనెంచియో యనునట్లు మాకు కష్టములు సంప్రాప్తమయ్యెను. చావు నెదురుచూచుచుంటిమి అట్టి సమయమున అనాథ రక్షకుడగు భగవంతుడు మాపై దయదలచి మమ్ము రక్షించుటకై నొక ముదసలి మనుజుని పంపెను. అతఁడు మీరెట్లున్నారో యట్లె యుండెను. దప్పిదీర్చు కొనుటకై నీళ్ళు కావలయునని యడిగెను. ఇంటి యందు జలముండలేదు. మేమున్న దుర వస్త జూచి దయార్థ్రహృదయుడగుటచే మా ఇంట నుండి మాకు గంజికాచియిచ్చి మాకు సర్వోపచారముల నొనరించి మమ్ముజ్వరబాధనుండి తప్పించెను. అదియుంగాక మమ్ము ఋణబాధ నుండి దొలగించి మాభూములను విడిపించి యిచ్చెను. అతనిని మరల దర్శించు భాగ్యమున కెదురుచూచుచున్నాము. ఎప్పుడు సంభవించునో తెలియకున్నది.

వెంకయ్య నిలిపిన తక్షణమే యాముసలి స్త్రీ యిట్లు చెప్పుటకు ప్రారంభించెను. 'అయ్యా! అతఁడు మనుష్యుఁడో లేక మానుషవేషంబు ధరించిన భగవంతుడో ఇది వరకు నిశ్చయింపజాలకున్నాను. ఇంటి యజమానివలె యతఁడు మాపై దయగలిగి యుండెను. మాకత్యంతోపకారముచేసిన పిదప తననామధేయంబు గూడ వెలిబుచ్చక ఒకరితో నైన జెప్పక వెడలిపోయెను. అప్పుడు సంభవించిన దంతయు కన్నులకుగట్టినట్లున్నది. నేనిచ్చోట మృత్యుదేవత నెదురుచూచుచు పడియుంటిని. అట్టి సమయమున అతఁడు ప్రవేశించి దాహమ గుచున్నది. నీళ్లు కావలయును అని యడిగెను. పాపాత్మురాలగు నేను నీళ్ళు లేవు, ఏమియు

లేదు,వెళ్లిపొమ్ము అని కోపముతో బలికితిని. ఆ తిరుపతి వెంకటరమణుఁడు నన్ను క్షమించుగాక'

వెంకయ్య 'అతఁడు రాకున్న మేమందఱము పాపగ్రస్తులమై నరకమునకు పోయి యుందుము. ఎందుకన మాదురవస్థయందు దేవుడు - మనుజులు- చెడ్డవారని శపించు చుంటిమి. అయితే అతడు మమ్ముద్ధరించి, మనుష్యుఁడట్టి కేవలకఠినాత్ముడు కాదనియు భగవంతుడు దీనుల యార్తధ్వని విని వారిని రక్షించుననియు అతని చర్యలచే మాకు బోధించి మా మనోతిమిరమును పోగొట్టి మా హృదయంబును వికసింపజేసెను. దేవుడతనిని దీవుంచు గాక ! అతడిచ్చటికి వచ్చుటకు మునుపు మేము మృగప్రాయులుగ నుంటిమి. అతఁడు మాయందిమిడియున్న మనుష్య స్వభావమును పెంపొందించెను. మేమాతనికి సదా తలచు చున్నాము.

రామస్వామి ఏమియు మాటలాడక వారు చెప్పుచుండినదంతయు నతిశ్రద్ధతోను నాశ్చర్యముతోను వినుచుండెను. వారతనికనేక విధముల నుపచారము చేసిరి. ఆ దినమచ్చ టనే యుండెను. రాత్రి పండుకొని పిదప రామస్వామి యిట్లు తలపోయజొచ్చెను. 'తిరుపతి యందు దేవుని సాన్నిధ్యము నందతి సమీపమున గోపాలయ్య రూపముండుట కిదియే కారణమై యుండవలయును. కష్టములఁదగుల్కొని యుండిన యీ సంసారమునకు సహా యము చేసి దేవుని బ్రీతిబడసినాఁడు.నేజేసిన కార్యములునే జెలించిన కానుకలు దేవుఁడం గీకరించెనో లేదో తెలియదు కాని గోపాలయ్య యొనరించిన సత్కార్య మంగీకరింపబడినదని నేను నమ్ముచున్నాను. ఆహా! సంఘసేవ యెంత యుత్కృష్టమైనది! యాత్రవలన ఫలమేమి? ఇతరుల కష్టసుఖంబుల సరకుగొనక వారి దుఃఖమును తగ్గించుటకు యిట్టి ప్రయత్నంబుల గావింపకయున్న మనుజుల వ్రతంబులు పూజలు తపంబులు యజ్ఞంబులు తప్పక నిరర్థక ములే యగుననుటకు సందియమొకింతయు లేదు. నేను కూడ యిక మీదట గోపాలయ్యను మార్గదర్శిగ నుంచుకొని జనులకెల్లపుడు మేలుచేయుచుండవలయును. ఈ నాయుద్దేశము నెరవేరుటకు భగవంతుఁడు నాకుశక్తి యొసంగుగాక'.

మరుసటి దినము ప్రాతఃకాలముననే లేచి వెంకయ్య మొదలగు వారి దగ్గర సెలవుగైకొని రామస్వామి తనదారిన దావెడలెను.

## 12

పది దినములు ప్రయాణమొనర్చిన పిదప రామస్వామి తన స్వగ్రామమున కేతెంచెను. సాయంసమయమున తన గృహము చేరెను. తన కుమారుఁడింట నుండలేదు. కొన్ని నిమిషములయిన పిదప కుమారుడింటికి వచ్చెను.దుర్వాసన కొట్టుచుండెను. సంపూ ర్ణముగ గల్లుత్రాగియుండెను.రామస్వామి యతనిని ప్రశ్నింప నతఁడసంబద్ధ ప్రత్యుత్తరంబుల నిచ్చుటకుఁ బ్రారంభించెను. దీనిఁబట్టి తన కుమారుడు తానింటలేని సమయమున తన ఇచ్ఛానుసారముగ ప్రవర్తించుచుండెనని తెలిసికొనెను. చేయవలసిన పనులను మాని ద్రవ్యమును పాడుచేసియుండెను.

తండ్రి : కుమారుడా! ఎందుకు దురాచారప్రవర్తనుడై యున్నావు? ఇల్లు పూర్తియైనదా? పంటలు పండినవా?

కుమారుడు : నీకేమియు పనిలేదు. పెద్దవాడనని నన్ను దిట్టుటకు ప్రారంభించితివా? నేను కూడా పెద్దవాడనయినానని నీకు దెలియదా? నన్ను దిట్టిన నీవు కూడ తిట్లు తినెదవు జాగ్రత్త.

తండ్రి : ఏమిరా? పెద్దవాడయినావని నీకు పొగరు పట్టినది. గృహనిర్మాణమునకు నేనిచ్చిన రూపాయల నేమి చేసితివి?

కుమారుడు : ఉన్న రూపాయలన్నియు యాత్రకు నీవే దీసికొనిపోయితివి. ఇప్పుడు నన్నడుగు చున్నావా ? నీవే ఇక్కడ యుండి కట్టించి యుండవలసినది.

ఇఁక నతనితో మాట్లాడి ప్రయోజనంబు లేదని భావించి అతఁడప్పటికి సంభాషణ చాలించి గోపాలయ్య ఇంటివైపునకరిగెను. గోపాలయ్య పట్టుపురుగులకు మేతవేయుచుండెను. రామస్వామిని చూచినతక్షణమే అతఁడు చాల యానందముతో బయటికి వచ్చి అతనిని కుశలప్రశ్నల నడిగెను. పిదపవారిట్లు సంభాషించిరి.

గోపాలయ్య : రామస్వామి ! నీవెంతపుణ్యాత్ముడవు. తిరుపతియాత్ర సంపూర్ణముగ జేసితివిగదా?

రామ : ఆహా ! యాత్రకేమి? యాత్రసంపూర్ణమైనది. నా పాదములు యాత్రను పూర్తి గావించినవి. నీకు గాను స్వామి ప్రసాదమును తెచ్చియున్నానదిగో, దీసికొమ్ము. గోపాలయ్య మిగుల భక్తిపూర్వకముగ ప్రసాదమును నందుకొని, కన్నుల నద్దుకొనుచు స్వామిని మనంబున ధ్యానించెను. గోపాలయ్య ! యాత్రపూర్తియైనదను సంతసము నాకెందులకో లేదు. యాత్ర సఫలమైనదనియు, నాపూజా పునస్కారములు భగవంతుడంగీకరించెననియు నేఁజెప్పజాలను.

గోపా: మంచిది, మంచిది, దానిని తెలిసికొనుటకు మనమసమర్థులము. ఆ సర్వేశ్వరుఁడు నిన్ను దీవించుగాక.

రామ : నేనక్కడికి పోయినది నిజమే కాని దేవుని చలింపని మనంబుతో నేఁబ్రార్థించితినో లేక మరియొకరు ప్రార్థించిరో

గోపా: అవన్నియు నెందులకిప్పుడు చెప్పుచున్నావు.

రామ : నేను మరలి వచ్చునప్పుడు నీవు దాహముదీర్చుకొనుటకు పోయియుండిన యింటికి పోయియుంటిని.

గోపా : సరి సరి, అది అంతయు దేవునికృప దైవసంకల్పము. దానిమాటలెందుకు? లోపలికిరమ్ము ఫలహారమిచ్చెదను.

అని చెప్పి లోపలికిం గొంపోయి ఫలహారమిచ్చి ఇంటి విషయముల మాటలాడ దొడగెను. గోపాలయ్య భార్యయు, కుమారుడును వచ్చి సంతోషముగ వారి సంభాషణయందు బాల్గొనిరి. తన గృహమున తన కుమారుడు, గోపాలయ్య గృహమున గోపాలయ్య కుమారు నకును గల తారతమ్యములఁజూచి రామస్వామి యాలోచనాపరుడయ్యెను.

'ఎంత చేసిన వారికంత ఫలమేగాని చింతయేటికి రామకృష్ణా'యన్నట్లు రామస్వామి తాజేసిన ఫలము తాననుభవింపసాగెను. యాత్రలు, పూజలు, తపములు,యజ్ఞములు మొదల గునవి భక్తిలేక జేసిన నేమి ఫలము? దినపూజలు సల్పుచు, మూఁడు గంటలు ముక్కుపట్టుకొని జపము చేయుచు, వ్రతంబులు సమగ్రంబుగ నాచరించు చుండియు పొరుగింటివారి కష్ట సుఖముల విచారింపకున్న నెట్టిఫలమును రాజాలదు. మానవునియందు దైవాంశమున్నది. అట్టి మానవుల సేవించి వారికష్టంబుల విచారించి వారికి సాయము చేసిన దేవుని కెక్కువ ప్రీతిగల్గును.

**– 25 జూన్ – 16 జులై ,1927, సాధన పత్రిక,**

*( రామచంద్ర అనే మారుపేరున గల ఈ రచయిత ఎవరో స్పష్టంగా చెప్పలేము. సాధన పత్రికలో స్థానిక, అంతర్జాతీయ వార్తలు కూడా కొన్ని ఈ పేరుమీదనే వెలువడేవి. సాధన పత్రిక సంపాదకవర్గంలోనివారే రామచంద్ర అని మారుపేరు మీద రాసి ఉంటారు)*

## ఇరువురు యాత్రికులు కథ

**- విమర్శనము -**

**ఒక విలేఖరి యిట్లు వ్రాయుచున్నాడు :**

కడచిన సంచికలో పై శీర్షిక క్రింద వ్రాయబడిన కథ ముగిసినది. 'రామచంద్ర' అను మారుపేరు గల గ్రంథకర్త యెవ్వరై యుండునది చదువరులనేకులకు తెలిసియుండదు. కాని కథా ప్రారంభము నుండి తుదివరకు చదివిన గ్రంథకర్త వ్యాసముల వ్రాయుటలో యనుభవశాలి యనియు, నేర్పరియనియు హెచ్చుగ ఆంగ్లభాషా పరిచయము గలవాడనియు చదువరులకు తోపకమానదు. కథాప్రారంభ పర్యవసానములు చదువరుల కింపుగ వ్రాయ బడినవి. కథా సారాంశము శ్రేష్ఠమైన భాగము. శైలి సులభము, భావములు తేటతెల్లముగ వివరింపబడియున్నవి.

***గుణపాఠము :***

(1) వెంకయ్య తన భూముల విడిపించుకొని వచ్చుటకై భాగ్యవంతు నింటికివెళ్ళి కరుణ జూపుమని ప్రార్థింపగా రావలసిన వడ్డీని యసలును తెచ్చిముందు బెట్టినగాని జరుగదని నుడివిన కఠినుడైన భాగ్యవంతుని వృత్తివిషయమై గ్రంథకర్త వ్రాసిన భాగము ప్రస్తుతపు వడ్డీ వ్యాపార వ్యవహారముల విపులముగ దెల్పుచున్నది. సామాన్య మనుజునికి గూడ వడ్డీ వ్యాపార మెంతటి పాపకార్యమనునదియు కథలోని యీ భాగము చాటిచెప్పుచున్నది. ఈ కథను జదివిన గ్రామములోని రయితులును మరి యితరులును యీ గుణపాఠమును నేర్చుకొనెదరు గాక.

(2) గోపాలయ్య యొనర్చిన ' సంఘసేవ' శ్లాఘ్యమైనది. దుఃఖముల పాల్పడిన మనుజులకు సహాయము చేయుటయే భగవంతు నారాధించుట" యను తత్త్వమును మరచి ప్రతి మానవుని యందణగియున్న దైవాంశమును సరకుగొనక,యంతరంగంబున నుండు దేవునివిడనాడి బాహ్య ప్రపంచమందున్న విగ్రహముల బూజించుట నిజమైన భక్తిగాదని గ్రంథకర్త యొక్క దృఢనమ్మకమని తెలియనగు. ఈశ్వర పూజనములలో 'సంఘసేవ', 'యనాదలకాశ్రయము' మొదలగునవియు కేవల విగ్రహారాధనకు మించిన పూజగదా! అంతరంగిక పూజ శ్రేష్టముగాని బాహ్యపూజలు నిష్ప్రయోజనములను గోపాలయ్య యొక్క నమ్మకము కొనియాడ తగినది.

(3) పుణ్యక్షేత్రములనబడు తిరుపతి, రామేశ్వరము మొదలగు చోట్ల కథలోని సుబ్బయ్యవలె పుణ్యాత్ము లెందరుందరో కదా! వీరొనర్చు దారుణ కృత్యంబులు చెప్పుట కలవిగావు. పుణ్యక్షేత్రముల బుట్టి పెరిగి కాపురము చేయువారు చాలా పుణ్యాత్ములుగ నుందురనియు, దూరదేశపు యాత్రికుల కెంతయో సహాయములుగ నుందురని మనమూహించెదము. ఇయ్యది భ్రాంతి. అన్నివిధములగు పాపకార్యములు కొద్దిగనో గొప్పగనో యిట్టి స్థలముల యందు జరుగుట విషాదకరము. ఈ విషయమై యాత్రికులు హెచ్చరికగనుందురుగాక.

(4) కథను చదివినవారు ఈ గుణపాఠము గ్రహించి సాధ్యమైనంత యాచరణలో జూపుదురుగాక.

– ఒక విలేఖరి.

పై విమర్శపై సాధన పత్రిక సంపాదకులు పప్పూరు రామాచార్యులు స్పందిస్తూ ఈ విధంగా పేర్కొన్నాడు. ...“సంఘసేవ యుత్కృష్టమైనదను విలేఖరి యభిప్రాయముతో నేకీభవించుచున్నాము గాని ఆధ్యాత్మిక భావపరిణామ దశలలో విగ్రహారాధనము గూడ నొక మెట్టుగా పెద్దలు భావించుట వలన విగ్రహారాధనము నిరుపయోగమైనది కాదని యెంచెదము. గ్రంథకర్త గూడ విగ్రహారా ధనమును నిరసించలేదు.”

–సంపాదకుడు, సాధన

**23 జులై,1927**

**ఇరువురు యాత్రికులు**

**సంపాదకీయ సూచన - జవాబు**

**క**డచిన వారపు ‘సాధన’ పత్రికలో ఏడవ పుట యందు ప్రచురింపబడిన విమర్శ నముపై ముద్రింపబడిన సంపాదకీయ సూచన కొంత వరకు వాదింపదగినది. “సంఘసేవ, యుత్కృష్టమైనదను విలేఖరి యభిప్రాయముతో నేకీభవించుచున్నాను. గాని ఆధ్యాత్మిక భావపరిణామ దశలలో విగ్రహారాధనము కూడా నొక మెట్టుగా పెద్దలు భావించుట వలన విగ్రహారాధనము నిరుపయోగమైనది కాదని యెంచెదము. గ్రంథకర్త కూడ విగ్రహారాధన మును నిరసించలేదు” అని సంపాదకుడు సూచించియున్నాడు. సంఘసేవ, యుత్కృష్టమై నదను విలేఖరి యొక్కయు – గ్రంథకర్త యొక్కయు – యభిప్రాయముతో సాధన సంపాద కులేకీభవించుట సంతోషదాయకము.ఆధ్యాత్మిక భావపరిణామ దశలలో విగ్రహారాధనము కూడ నొక మెట్టుగా పెద్దలు భావించుట వలన విగ్రహారాధనము నిరుపయోగము కాదని సంపాదకులు యెంచియున్నారు. పెద్దలు భావించినవి యన్నియు సంపాదకుడు నిరుప యోగముకాదని భావించునా? దీని సత్యము మనుజుని నమ్మకముపై నాధారపడి యుండుటచే యీ విషయమై మరల చర్చించుటవసరము.

గ్రంథకర్త కూడ విగ్రహారాధనమును నిరసించలేదని గ్రంథకర్తకు సంపాదకుడు తోడ్పడియున్నాడు. ఈ విషయము జూలై 16వ తేది 11వ పుట యందు 26వ పంక్తి నుండి 30వ పంక్తి వరకును, జులై నెల 2వ తేదీ సాధన పత్రిక 11వ పేజీలోని (రెండవ కాలం) 30వ పంక్తి నుండి 32వ పంక్తి వరకు గ్రంథకర్త వ్రాసిన యభిప్రాయములనుబట్టి గ్రంథకర్త విగ్రహారాధనమును నిరసించువారిలో యొకరై యుందురను అభిప్రాయము తోపకమానదు. గ్రంథకర్త విగ్రహారాధనమును నిరసించినాడని నేను వ్రాయలేదు.

లోకమునందు పూజ పరి పరి విధములుగ పరిగణింపబడుటచే, “దుఃఖముల పాల్పడిన

మనుజులకు సాయము చేయుటయే భగవంతు నారాధించుట" యను గ్రంథకర్త తలంపు శ్రేష్టమయినదియు, నిజమయినపూజ కాదా? స్వయముగ దేవతార్చనము చేయుట పదవికి హేయమను భ్రాంతిచేతనో యింటనుండు కుందాసన మందలి లోహనిర్మిత స్త్రీ పురుష విగ్రహములను, మూషిక పక్షి పశ్వాది వాహనములను గుమాస్తాలచే కడిగించి (బహుశః కాలము చాలక, ఆచారము విడువక) అర్చింపజేసి తుదకు తీర్థము స్వీకరించుటతో మాత్రము నిజమయిన పూజయా? ఈ విషయమున మహాత్ముని 'సంఘసేవ' మనకు గొప్ప దృష్టాంతరము కాదా?

ఈ అభిప్రాయముల దీర్ఘముగ చదువరులే యోచించెదరుగాక సంపాదకుడీ విషయమయి పలువురయందు యోచనాశక్తుల మేల్కోలిపి చర్చించుట కవకాశమిచ్చినందుకు వందన శతంబులు.

– ఒక 'విలేఖరి'

ఈ అంశంపై ప్రత్యుత్తరమిస్తూ సాధన సంపాదకులు పప్పూరు రామాచార్యులు ఈ విధంగా పేర్కొన్నాడు. ..."విగ్రహారాధనము కూడదా, వలదా యను గొప్పయంశమును చర్చించుటకు మేముగాని యీ విలేఖరిగాని యధికారులముగాము. వెనుకటి సూచనలో 'పెద్దలు' అనుటకు జ్ఞాన వృద్ధులని మా భావము. జ్ఞానవృద్ధులగు పూర్వులు త్రొక్కిన మార్గములను అంత సులభముగా కాదనలేము. ఇరువురి యాత్రికులు అను కథ వ్రాసినవారి భావమెట్టిదో కనుగొనుటకు చదువరులే పరీక్షకులు. ఈ సందర్భమున పై సమస్యను గుఱించిన వాదములో దిగుట మాకిష్టముకాదు".

– సంపాదకుడు

**30 జూలై,1927**

### ఇరువురు యాత్రికులు

### గ్రంథకర్తగారి సమాధానము

**జూ**లై నెల 23,30 తేదీల యందు వెలువడిన 'సాధన' పత్రికలయందు "ఇరువురు యాత్రికులు" అను కథను విమర్శించిన విలేఖరికిని, సంపాదకునకును, కథ యొక్క గ్రంథకర్త విగ్రహారాధనమును నిరసించియున్నాఁడా? లేఁదా? యను యంశముపై వాదములు జరుగుచున్నవి. విలేఖరి "ఈ అభిప్రాయముల దీర్ఘముగ చదువరులే యోచించెదరుగాక " యనియు సంపాదకుఁడు " కథవ్రాసినవారి భావమెట్టిదో కనుగొనుటకు చదువరులే పరీక్షకు" లనియు వ్రాసియున్నారు. కావున నేనేమియు వ్రాయనక్కరలేదు. అయినను కథకు సంబం ధించి భేదాభిప్రాయములున్నప్పుడు నాయభిప్రాయముల వెల్లడిజేయుట నాధర్మమని తలఁచి యీక్రింది యంశములను వ్రాయుచున్నాను.

1.విమర్శించిన విలేఖరి యొక్క వాదమేమో తెలిసికొనుట కష్టముగనున్నది. గ్రంథకర్త

విగ్రహారాధనమును నిరసించి నాఁడనియా, లేక నిరసింపలేదనియా? 30 తేది పత్రికలో నతని జవాబునందీవాక్యములు కానవచ్చుచున్నవి.

"... గ్రంథకర్త వ్రాసిన యభిప్రాయములఁబట్టి గ్రంథకర్త విగ్రహారాధనమును నిరసించువారిలో యొకరైయుందరను అభిప్రాయము తోపకమానదు. గ్రంథకర్త విగ్రహారాధనమును నిరసించినాఁడని నేను వ్రాయలేదు." ఈ రెండు వాక్యములు ఒకటి వెంబడి మరియొకటి వ్రాయబడియున్నవి. మొదటి వాక్యమును బట్టి చూడ విగ్రహారాధనము నిరసింపఁబడినదని తెలియవచ్చుచున్నది. రెండవ వాక్యమును బట్టి చూడ విగ్రహారాధనము నిరసింపఁబడనట్లు తేలుచున్నది. ఈ వాక్యములు వ్యతిరేకభావంబులఁ జూపుచున్నవి. మొదటి వాక్యమునకు "ఇది గ్రంథకర్త యొక్క స్వంత అభిప్రాయమని" విలేఖరి తలఁచిన స్వంత అభిప్రాయంబులతో మనకెట్టి సంబంధమునులేదు. కథయందు వ్రాయఁబడిన విషయములపై గ్రంథకర్త యొక్క అభిప్రాయములు ఆధారపడియుండును. కథయందెట్టి అభిప్రాయమున్నదో దానిని గమనింపవలయునుగాని ఇయ్యది అభిప్రాయముండవచ్చునని యూహించుటసరికాదు.

2. విమర్శించిన విలేఖరి యుదహరించిన పంక్తుల ప్రత్యేకముగ దీసి యర్థమును గ్రహింపఁదగదు. కథావిషయమును బూర్తిగఁజదివి ఆ పంక్తులెట్టి సందర్భమున వ్రాయబడినదియు, దానికిని ఇతర విషయములకును ఎట్టి సంబంధముండునదియు అన్వయించుకొని గ్రహింపవలయును. ఈ ప్రకారమొనరించిన కథయందు విగ్రహారాధనము నిరసింపఁబడలేదని తెలియవచ్చుచున్నది.

సంఘసేవగావించిన గోపాలయ్య కూడా విగ్రహారాధన నిరుపయోగమని యెక్క డను చెప్పియుండలేదు. కథాప్రారంభమున, పుణ్యక్షేత్రమగు తిరుపతి యాత్రజేసి, స్వామి నారాధింపవలయునని యెక్కువ యుత్సాహమును పట్టుదలయు జూపినది గోపాలయ్యాయే. మరియు వెంకయ్యకు సహాయ్యము చేసి తన గ్రామమునకు మరలి వెళ్లునపుడు యీ విధముగ గోపాలయ్య దేవుని ప్రార్థించెను. "ఓ భగవంతుఁడా! నా ప్రార్థన నంగీకరింపుము, స్వయముగ రాఁబ్రయత్నించితిని అయిన నది సాధ్యము కాలేదు. నేజేసిన కార్యము మంచిదో చెడ్డదో నిర్ణయించుటకునీవే సమర్థుడవు. కరుణాళుఁడవగు నీవు నన్ను మన్నించి యుద్ధరింపవలయును" దీనిని బట్టి చూడ గోపాలయ్యకు వెంకటరమణ స్వామిని దర్శించి యారాధింపవలయుననియే యెక్కువ యభిలాష యుండెననియు, యాత్రకు పైకము చాలక వదలిపెట్టుట యతనికి దుఃఖకరముగ నుండెననియు తెలియవచ్చుచున్నది. గోపాలయ్య విగ్రహారాధనమును నిరసింపక దానియందు భక్తి కూడా జూపెననుటకు మరియొక నిదర్శనము కూడనున్నది. రామస్వామి, "నీకుగాను స్వామి ప్రసాదము తెచ్చియున్నానిదిగో దీసికొమ్ము" అని చెప్పినప్పుడు గోపాలయ్య దానిని నిరసింపక మిక్కిలి భక్తిపూర్వకముగ ప్రసాదమును అందుకొని కన్నుల కద్దుకొనుచు స్వామిని మనంబున ధ్యానించెను. విగ్రహారాధనమును నిరసించువాఁడై యుండిన యెడ నిట్టి పనిచేసియుండడు.

రామస్వామి విషయము పరీక్షింతము. విమర్శించిన విలేఖరి ఉదహరించిన వాక్యములు రామస్వామి తలంచిన తలంపులు. ఇతఁడు కూడ విగ్రహారాధనమును నిరసింప లేదు. "నేజేసిన కార్యములు, నే జెల్లించిన కానుకలు దేవుఁడంగీకరించెనో లేదో తెలియదు" అని సందేహమును సూచించుచున్నాఁడు గాని "దేవుడంగీకరింపలేదు" అని దృఢముగఁ జెప్పియుండలేదు. అదియునుంగాక, ఇతని పూజలు అంగీకరింపబడకుండుటకు, ఇతఁడు సంఘసేవ చేయకుండుటగాదు. సంఘసేవచేయుట కితని కవకాశముకూడా చూపఁబడి యుండలేదు. రామస్వామికి కూడ సంఘసేవచేయుట కవకాశమిచ్చి, అతడుదానిని నుల్లం ఘించి యాత్రకు వెడలిపోయి యుండిన ఈతారతమ్యము సరిపోయియుండును. అతని పూజలంగీకరింప బడకుండుట కతని చంచలభక్తియే కారణము. దేవుని ప్రార్థించు నపుడతని మనస్సతని పైకము మీదయుండెను. ఇతఁడు నిశ్చలభక్తితో యాత్రజేయలేదని కథా ప్రారంభము నుండియు తెలియుచున్నది. అతనికి ఇహలోక వాంఛలు మెండు. ప్రయాణ మొనర్చునపుడు కూడ ఇతనికి తన గృహము, భూములు మొదలగు వానిపైననే చింత. నిజమైన భక్తితో నిశ్చలమనంబుతో రామస్వామి పూజలు ప్రార్థనలు సలిపియుండిన దేవుఁడతని ప్రార్థన నంగీకరించియే యుండును. కావున నతని పూజలు అంగీకరింప బడకుండుటకు నతని చంచల భక్తియేకాని విగ్రహారాధనము కాదని తెలియనగు.

కడపట "యాత్రలు; పూజలు తపములు యజ్ఞములు మొదలుగునవి భక్తిలేకజేసిన నేమి ఫలము?" యని వ్రాయబడియున్నది. కావున భక్తితో విగ్రహారాధన జేసినను దేవుఁడు సంతోషించును.

(దీనిని ప్రచురించినందులకు సంపాదకునకు వందనంబులు)

– రామచంద్ర

**6, ఆగస్టు, 1927, సాధన పత్రిక**

# మన బెబ్బులి

**– కథకుడి పేరులేదు**

నందియాల వద్ద నల్లమల కొండల్లో ఒక పెద్దపులి ఉండింది. అది అన్ని పులులవలె సామాన్యమయింది కాదు. ఆ గాంభీర్యము మృగరాజుకయినా ఉందో లేదో అని ఆ కీకార ణ్యంలోని మృగాలన్నీ అనుమానిస్తూ ఉంటాయి. ఆ బెబ్బులి గర్జించినాడంటే మూడు లోకాలు ఆడావడిఅయి అల్లాడిపోతాయి. ఇంతటి ప్రతాపవంతుడయినా, పొట్టకూడు గడించే ఆశతో, అందరిపయి తన పరాక్రమం ప్రయోగించిన పాపానికొడిగట్టిన వాడుగాదు మన వ్యాఘ్రరాజు. ఆకల్లాడితే తెల్లబోయి దిక్కులజూచే అమాయకపు గొర్రె మందల జోలికి ఒక పూటయినా పోయింది కాదా పులి. తోకలు మెలికలు ద్రిప్పి అంబాయని చెంగు చెంగున గంతులు వేస్తూ పచ్చిక బయళ్ళలో బయలాలకించే ఆవుదూడలు తనకంటబడినా, కన్నులు మూసికొన్న పుణ్యానబోయిన సౌజన్యమూర్తి సుమా! మా బెబ్బులి రేడు. అంతేకాదు పొదలలో పొంచుకొని ఉండి, వెనుకబడిన గొర్రెపిల్ల పయి గుర్రున దుంకి, కుత్తుకగొరికే తోడేళ్ళపాలిటికి మిడేరున పెద్దపులి. ఆవులకాపరి హాయిగ నిద్రించే అదునుగనిపెట్టి ప్రక్కనుండి చివ్వున పంజాకొట్టె, మోసగారి మచ్చల చిరతపులుల పాలిటికి మన వ్యాఘ్రరాజు కాలమృత్యువు. కొండచరియల మారుమూలలలో, వలలొడ్డి, కత్తికటారులతో వేటాడవచ్చే క్రూరకిరాతులకితడు పిట్టపిడుగు.

మన శార్ధూల సార్వభౌముని సర్వోత్తమ శీలము బంగాళా రాష్ట్రములోని పులుల కలజడి పుట్టించింది.మధ్య రాష్ట్రం పెద్దపులులను నిద్ర నుండి మేల్కొలిపింది. పడమటి కనుమలలోని వ్యాఘ్రములన్నీ నివ్వెరపడి నిర్విణ్ణములయినాయి. వింధ్యాచల సింహాసనము నుండి అసేతు హిమాచల పర్యంతం అవక్రపరాక్రమంతో సామ్రాజ్యమేలే సర్వలోక సార్వభౌ ముడు సెబాస్!అని మెచ్చుకొన్నాడు. “ధర్మమేవజయతు” అని ఆశీర్వదిం చాడు. మన నిర్మల ప్రతాప తేజోవిస్ఫున్మూర్తి స్వధర్మరక్షణకయి దీక్షపట్టి వీరవిహారముసల్పి, నల్లమలకొండల కావలగల నానాజంతు వితానమునకు మేలుబంతియయినాడు. ఇరుగు పొరుగు అడవులలోని పెద్ద పులులన్నీ అజ్ఞానంలో అలమటిస్తూ ఉన్న నాటికే, మా పులి యేలిక స్వధర్మయజ్ఞంలో ఆత్మార్పణంచేసి ప్రతాపతేజోమూర్తియయి నెగడినాడు. కొండలలో బడి, లోయలగడపి, సమతలముల దిరుగాడి, పొంచికొనియున్న వేటకాంద్ర గుంపులపయి హుంకరించి, ఇనుప బోనుల వ్రయ్యలజేసి, ఆకలి మంటలలమికొన్నను వెనుదీయక, అధర్మవర్తకుల నడ్డగించి, ధిట్లనేకమున పట్టువదలక, స్వధర్మనిరతియయి వీరధర్మము నిష్కంటకముగ ఇరువదేడులు సల్పి కీర్తిగాంచినాడు మా శార్దూలసార్వభౌముడు.

సింధూర తీరములో స్వధర్మరక్షాదక్షుల మహాసభ జరిగినది. ఒక కొదమ సింగము నాటి కొలువుకధ్యక్షుడు. మన శార్ధూల సార్వభౌముడు నల్లమల రాజ్యానికి ప్రతినిధి. తక్కుంగల వీరవ్రతోత్తంసులు గడు సంరంభముతో చయ్యన అరుదెంచినారు. మన నల్లమల మన్నీ డుగూడ బయలుదేరినాడు. కాని దారి తప్పిపోయింది. దినములకొద్దీ బయనించినాడు.

అంతము కనపడలేదు. పోను పోను ఒక ఇసుక ఎడారి అంతా అడ్డమయింది. చెట్టులేదు. గుట్టలేదు. ఎక్కడచూచినా గొడ్డిసుకదిబ్బలే. ఒక పచ్చని మొలకయిన ఆ ఇసుక బీటి యొక్క భీభత్సానికి భంగము కల్పించేదిలేదు. తిరిగి తిరిగి విసుగు జనించింది. మనసు చలించింది. దప్పిబుట్టింది. బండకుబడి కొండలోయలలో దిమ్మదిరిగి నందులకు గొడ్డు ఎడారిలో అఘోరించే దుర్గతి బట్టింది అని అలవరించినాడు. ఇనుపబోనులో జిక్కి ఎంత రొప్పినా, కమ్ములు సడలిపోలేదు అని నిరాశ జెందినాడు. యోజనాప్రపంచంలో వెనుకముందు లాలోచించుకొంటూ బయనిస్తున్నాడు మన శార్ధూలచక్రవర్తి. ఇంతలో చల్లనిగాలి మైసోకింది. 'సమయమిదేరా' అనే పల్కు వినబడింది. చెవుల నిక్కబెట్టివిన్నాడు. సన్న సంగీతం కర్ణ పేయంగా హాయిగొల్పింది. ఆ దిక్కుబరువెత్తినాడు. ఒక రత్నాకరం కన్నులపండువు చేసింది హృదయంలో ఆతురత శృతిమించుతావుంది. సంద్రపుటొడ్డు జేరినాడు. ఎడారి మిడియె ండలో ఎగిరిపడిన పొడియిసుక వేడి చల్లారింది. చల్లగా చతికిలబడినాడు. ఆయాసంతో ఎగదేపుతూ ఇసుకతిన్నెపై పవళించినాడు. జలధితరంగాలు జోలబాడినాయి. వారిధీశ్వరుడు వింజామరలు వీచినాడు. ఇసుక తిన్నెలు హంసతూలికాతల్పమయింది హాయిగ గురక బట్టింది. కన్నులు మూసినాడు. మనసు నిద్రపోలేదు యోజనాతరంగాల అడావిడిలో అల్లాడి తటమటిస్తూ ఉంది. 'విశ్వవ్యాపియయిన సముద్రుడింత సంరంభంతో స్వాగత మిచ్చినదెందులకు? జలధియూర్మికల గంభీర మృదు కలాపము సన్నుతించే దెవరిని? జలరేఖ మరుగన చిన్నారి యలల కిన్నయు లెవరిగావింప నీ చిరునవ్వుల నాట్యము సల్పుచున్నవి? చల్లని తుంపురల జల్లగా సేదదీర్చ నీ రత్నాకరుడేల తలపెట్టినాడో? నా కొఱకేనా?' యని లోనసుమానించినాడు. కాదేమోయని సంశయించినాడు. ముందుగతి! యని దెప్పదిలి లేచి నాడు. దిక్కుదిక్కుల జూచినాడు. వెనుక ఇసుక ఎడారి, ముందు జలరాశి. "ముందుకా? వెనుక్కా !" అనే పదాలను పునశ్చరణము చేసికొంటూ నిశ్చేష్టుడయి అట్లే నిలబడిపోయినాడు.

ఇంతలో కలకలమతని మేల్కొలిపింది. కన్నులనుదెరచి చూచినాడు. తన్నుబోలి నవాడే ఎవరో వచ్చినట్లగుపడింది. ఆకారం తనవలెనే ఉన్నదికాని ఎత్తుపొడవులలో అర్ధార్ధ సంబంధము లేకుండా ఉంది. వర్ణంలో కూడా భేదమే కానవచ్చింది. ఏమి యీ విపరీతము! అని అనుమానిస్తు నిలవతబడినాడు. అవి దగ్గరకు వచ్చినాయి.

వ్యాఘ్రరాజు –"ఎవరు మీరు" అని ప్రశ్నించినాడు. ఆ గుంపులో నుండి కన్నుల కద్దాలు తగిలించుకొన్న నడిప్రాయం పిల్లి ముందుకువచ్చి "అయ్యా! మేము పిల్లులము, నేను మార్జాలచక్రవర్తిని. మేమీ తీరమున కాపురమున్న వారము; మీరాక గుత్తెఱిగి, మిమ్ము మా పట్టణమునకు బిల్చుకొనిపోవ నరుదెంచి యున్నవారము. మా కోరిక దీరిచి మమ్ము ధన్యులజేయ వేడుచున్నవాడ" అని బల్కి నమస్కరించింది.

వ్యాఘ్రము : మీయూరి పేరేమిటి?

పిల్లి : మార్జాల పట్టణము

వ్యా: మీ పేరు

పిల్లి : వంచకుడు

వ్యా : నా రాక మీరెట్లుఱుంగ గల్గితిరి.

పిల్లి : విశ్వవ్యాపియయిన సముద్రుడు మిమ్ము స్తుతియింపుచుండ, చేరువనున్న మాకు వినరాదా ?

వ్యా : సముద్రుడేమి? నన్నుస్తుతించడమేమి ?

పిల్లి : అయ్యా! ఇప్పుడు గూడ తరంగములు మీనామావళినే గానము సేయుచున్నది సుమా!

వ్యా: (స్వ ఆహా నేననుకొన్నట్లే అయినది. దిగంతములకు వ్యాపించిందిగదా నా కీర్తి)

ప్ర – సరే కానిందు మీయూరు కడుదూరమేమొ. నాకుగల రాజకార్యముల అడావడిలో కాలహరణము సేయతగదు గదా !

పిల్లి : ఎంత దూరమయిననేమి ? మీకొకించుకేమి బడలికలేకనే మా షేవర్లెట్టు మోటారులో మనోవేగంతో మిమ్మును దీసికొని పోగలము. ఆకొరత మీకెందులకు?

వ్యా : సరే కాని చీకటిపడితే నాకు చీకాకు గల్గునేమొ.

పిల్లి : ఆ భయము కూడ మీకక్కరలేదు. మీరడవులలో గుమ్మరుచున్న కారణము మేము మా జీవితముల చేసికొన్న మార్పులు మీకు దెలియవు గాఁబోలు. మునుపటివలె గాదయ్యా! ఇపుడంతయు తారుమారయింది. విద్యుచ్ఛక్తి సహాయంతో చిమ్మచీకటిని పట్టపగలు చేయ జాలమా? చీకటికయి చీకాకుపడనేల? స్వధర్మమని, మీరీ ప్రపంచసౌఖ్యమును విడచి ఆకటి మంటలో మలమలమాడి, చెట్టుగుట్టలలో కష్టములనుభవించుచున్నారు గాని, కడుపులోని కూడు కదలకుండ స్వధర్మ సంస్థాపనము సేయు చక్కని దమ్మను కొట్టిన రస్తాలలో మీరు బయనించుట మానుకొన్నారు. అయ్యా! ఆ గొడవ పెద్దది. మీరే కన్నులారా జూచి ఆనందింతురు గాక, మా విన్నపము మన్నింప వేడువాడ.

వ్యాఘ్రరాజు “వల్లె” అన్నాడు. మోటారులో గూర్చొన్నాడు. ఆ బండికి ఒక బావుటా తగిలించినారు. కొనలో విద్యుచ్ఛక్తి దీపాన్ని వెలిగించినారు. బెస్సున వెళ్లింది మోటారు. మన పెద్దపులి ఆనందం మితిమించింది. కొండల గుట్టలలో బండకష్టముజేసి కండలన్నీ ఎండిపోయ్యే ఏవగింపు బ్రతుకు బ్రదికేదానికంటే. అనాయాసంగా ఆమడలు దాటించే కంకర రస్తాలో గింగురుధ్వనులు కర్ణపేయముగాగ మోటారులో జీవయాత్రచేసేది ఎంతో మేలుగదా! అని మురిసినాడు. ఇంతలో రాజభవనం కన్నులకు పండువుసేసింది. అందఱు చయ్యన దిగినారు. భవనంలోనికి పోయినారు. ఒక్క దెబ్బలో దీపాలన్నీ దగ్గున వెలిగాయి. విద్యుచ్ఛక్తి వీవనలన్నీ గిర్రున తిరుగుతున్నాయి. మొత్తం సోఫాలపయి అఁదఱు కూర్చొన్నారు. ఆ భవనం ఇంద్రభవనాన్ని ఆధ్యకరిస్తూ ఉన్నది. చలువరాళ్లు గోడల్లో తమ ప్రతిబింబాలు

దృగ్గోచరమవుతున్నాయి. మూషకభటులు! మార్జాలముల పాదాలబట్టి కిచకిచలాడుతు న్నాయి. విందు గడుపు ఆరంభమయింది. పిండి వంటలు పట్టీలు పంచిపెట్టినారు. గాజు తట్టలతో పట్టీలోని క్రమం దప్పకుండా వడ్డిస్తున్నారు. మంచి నెయ్యి, చిక్కనిపాలు, గడ్డపెరుగు కమ్మని మీగడ, తెల్లనివెన్న, తియ్యనిజున్ను అందఱూ ఆరగిస్తున్నారు. ఇంతలో మార్జాల చక్రవర్తి కన్నుగీటినాడు. పిల్లుల పెద్ద లేచినాడు. ఆయన పేరు 'బడాయికోరు'. ఎక్కడి పిల్లులు అక్కడనే ఉక్కిరి బిక్కిరి మనకుండ తమ తావుల్లో తాముగూర్చొన్నారు. ప్రభుత్వ విషయాలన్నీ విమర్శించడానికి ఆరంభించినారు. బడాయికోరు గంభీరంగా ఉపన్యసిస్తున్నాడు. వాద ప్రతివాదాలతో సభ అంతా మారుమ్రోగుతూ ఉంది. ఆ ఆర్భాటాలు గూడ రూల్సు ప్రకారంగానే జరుగుతూ ఉండింది. మన బెబ్బులి రేడు నివ్వెరపడి చూస్తున్నాడు. తర్కశాస్త్రము తూచా తప్పకుండా సిద్ధాంతాలు చేస్తున్నారు. తీర్మానాన్ని ఓటుకు పెట్టినారు. పిల్లులన్నీ తోకలెత్తి సమ్మతిని దెల్పినాయి. ఇంకొక తీర్మానం వచ్చింది. ఇష్టములేని పిల్లులన్నీ గుర్రుమని అసమ్మతిని తెల్పుతూ ఉన్నాయి. కార్యక్రమంపట్టీని ముందరబెట్టుకొని, మార్జాల చక్రవర్తి వరుసగా అయిటమ్లు ఒక్కొక్కదాన్ని విమర్శలకు అనుజ్ఞయిస్తున్నాడు. పట్టీముగియ వచ్చింది. అధ్యక్షుడు లేచి నిలుచున్నాడు. పిల్లులన్ని తోకలుముడుచుకొని నిశ్శబ్దంగా గూర్చొన్నాయి. వంచకుడంత తమ యుపన్యాసాన్ని ఆరంభించినాడు.

నేడు మన విన్నపమాలించి, మా మాటకు బదులుచెప్పక మన ఆతిథ్యము నంగీక రించిన ఈ బెబ్బులిరేనికి మన మెంతయు గృతజ్ఞులము. (పిల్లులన్నియు మ్యావుమ్యావని కోలాహలము చేయుచున్నవి). నేడిందగుదెంచి మరల గారవించిన మన శార్దూల సార్వభౌముని స్వధర్మానురక్తి మీకు దెలియనిదిగాదు. ఈ మహనీయుని సర్వోత్తమ చరిత్ర వర్ణించుట ముఖస్తుతియగునని నాయనుమానము. కాని వేరొక మాట మీకు విన్నవింపక దప్పదు. ఈ మహనీయమూర్తిని మీరన్యునిగ దలచితి రేమొ. (పిల్లులన్నియు నివ్వెరపడి దిక్కులు జూచు చున్నవి). ఇతడు మన వంశములోని వాడని నేనువక్కాణించినచో మీకు విపరీతముగ గన్పట్టునోపు. (పిల్లులు మ్యావని కోలాహలము చేయుచు) మన మెల్లరమును ఒక జాతి వారము. కాని కాలవశమున మన జీవితధర్మములు మారినందున, నితడు బెబ్బులి యయినాడు. మనము పిల్లులమయితిమి. ఇంతటి మార్పు గల్పించిన మన జీవితధర్మములను నేను సూక్ష్మముగ విమర్శించుట నాకు దప్పని విధి. మనము ప్రాపంచక సౌఖ్యమునే జీవితాదర్శముగ నిడుకొనియుంటిమి. ఆ సౌఖ్యమును బడయుటకునయి, మనము చేయరాని పనుల నెన్నో జేసితిమి. కండలన్నీ కరిగించే మిడిఎండలో కాడు కష్టంచేసే అమాయకులయిన రయితుల కొంపగూల్చు మనమూషక వ్రాతమును ఉద్యోగులుగ నియమించి పల్లెటూళ్ళను పీల్చి పిప్పిచేసితిమి. మన భోగభోగ్య భూతములను సంతసింప జేయుటకయిన మితిమీరిన పన్నుల విధింప సమ్మతించితిమి. కృషీవలుల ఎముక విరచితిమి. పసిపిల్లలకయి నిలువబెట్టిన మీగడ పెరుగు గాజేసితిమి. కూలినాలిచేసి బడలియున్న కాపుకన్నెలు హాయిగ నిద్రించుతరి ఇండ్లసోరణగండ్లదూరిఉన్న పాలుపెరుగు దుత్తల పడగడపితిమి. అంతియ కాక ముద్దియలకు

ముద్దుగొలుప, మ్యావు గీతములతో, చిందులు ద్రొక్కితిమి. కమ్మని పాలబువ్వదినిపించిన తల్లులకే ద్రోహము తలపెట్టి ఇల్లుగుల్లగ చేసితిమి. కన్నబిడ్డలకన్న నెక్కువగ కాంతలఒడిలో పవ్వళించు పదవి బడయగల్గితిమి. పవ్వళించిన పదవితో తనివొందక, మెలతలమేనుదీవ నెగబ్రాకి, సుందర వదనారవిందమునుజేరి, మోహనపు ముద్దుల తియ్యనితేనెల జుర్ర గంటిమి. ఎంగిలికూటికయి, గుటకలు ప్రింగుచు, ఎంగిలాకుల ముంగిట గంతులువేసి, ఏవగింపుకూటి కాసించి మన తొంటి ధర్మమును వీడితిమి. పరధర్మము నాశ్రయించితిమి. బెబ్బులిరేనిబోని మనవంశశ్రేష్ఠుల దెగడితిమి. తోడేళ్ళ బయకారి మాటలకు చెవియొగ్గి కులక్షయమున కొడిగట్టితిమి. గ్రామసింహములకు జోటిచ్చి మనమృగరాజును బహిష్కరించి తిమి. కన్నబిడ్డల కుత్తుకలు కటుక్కున గొరికి, మనజాతిని మనమే మ్రింగబూనితిమి. స్వధర్మ నాశమున కొడిగట్టిన బానిసలమయియుంటిమి. మన అన్నదమ్ములయిన బెబ్బులు లన్ననో, కంటకా మృతకర్కశ పాషాణ పర్వతసీమలలో విచ్చలవిడిగా స్వచ్ఛంధ వీరవిహారము సల్పి స్వధర్మదీక్షబట్టి ఎనలేని కీర్తిగడించి, తొంటి అచ్చపుటపరంజి జిగిబాయక, పొగడ్తగన్నది. మనలనిరసించి, బానిసతొత్తులని, నాగరకపట్టణములకు బారదోలినవి. మన మాత్మ వంచనము చేసికొని పొట్టకూడుగడించుటే పరమధర్మమని, పొట్టికూటికయి ఏవగింపు బానిస బ్రతుకుజేపట్టి స్వధర్మనాశన మొనర్చికొంటిమి. ఆ కారణమున మనము మేలిబంగరు పసుపునిగ్గుదొలంగి అసహ్యమయిన బూడిదరంగు దెచ్చికొంటిమి.

అయినను నేడు మన ధర్మములు గూడ కొంత మారుచున్నవనుట కెంతయు సంతసించుచున్నాడను. నేడు మన మహాసభలో మీరెల్లరుగావించిన ధర్మవిమర్శత మన బెబ్బులిరేడు గమనించియే యున్నాడు. కాని నేనొక్కింత మన విమర్శనాతత్వమును విశదీక రింపకయున్న గౌరవనీయులైన మీయెల్లరయెడల నేనపరాధము సల్పినవాడనగుదు గాన ఆత్మస్తుతియని గర్హింపక నావిన్నపమాలింతురుగాక. నేడు మన శాసనసభలో స్వచ్ఛందముగ జరుపబడిన విరుద్ధ శాసనవిమర్శ, ప్రభుత్వ విధాన సూత్రనిర్ణయ ప్రౌఢిమ, స్వధర్మబద్ధమయిన ప్రజాశ్రేయానుభూతి మన వ్యాఘ్రసింహుడు ఎఱుగకపోలేదు. ఇన్నాళ్ళింతగ మన మెడతెగని యార్భాటము చేసినను తోడేళ్ళ ద్రోహదైన్య మొక్కింతయిన తగ్గలేదేయన్న అయ్యది వేరుమాట. అడుగంటియున్న పల్లెటూళ్ళు అభివృద్ధిపొందలేదేయన్న మనమాతురత బొందుట ధీలక్షణము గాదు. వీరధర్మనిరతులకు స్వచ్ఛందజీవనమింకను కలుగలేదేయని మీరధిక్షేపింతురేమొ. కాలమువేచి మనము శాంతముగ విజ్ఞాపనలబంపికొన్న నేడుగాకున్న నింకొక్క యుగము లోనయిన మన కాభాగ్యమబ్బకపోదు. ఇది వేరుమాట. అయినను ప్రస్థాపవశమున నింత జెప్పితిని. కాని ఒక్కమాట. ఫలమునాశించి కార్యములకు గడంగుట ధర్మవిరుద్ధము. నిష్కామ కర్మ మనము సక్రమముగ జరిపించినచో స్వధర్మరక్షణము కాజాలదా? అంతియ కాదు. ప్రజాశ్రేయోభంగములయిన శాసనములను మనము విమర్శించి ప్రతిష్టంబనచేయు స్వాతంత్ర్యము మనకు గల్గినది. తన్మూలమున జాతీయాభ్యుదయము కాలక్రమమున గల్గుననుట మా ధృఢవిశ్వాసము. మన పెద్దన్నను బోలిన వీరవరేణ్యులు మాకు సైదోడుగ

నిల్చి యధర్మశాసన ప్రతిష్ఠంభన విధానమును నిర్వక్రముగ సాధించినచో గెలుపు కరతలా మలకము. నాటికి మన ఏవగింపు బ్రతుకు సంపూర్ణముగ మార్పుజెందెడిని. వీరధర్మము మన కలవడకమానదు. పిమ్మట మనము తొల్లింటి బంగరు జిగి బడయగల్గుదుము. కనుక నేను విన్నవించునది ప్రపంచకల్యాణమే ప్రథమ ధర్మముగ గల బెబ్బులిరేని బోలిన ప్రతాపతేజో విస్ఫుర న్మూర్తులు, అడవులు విడచి, మన నడుమ నిలువగట్టికొని ప్రతిష్టంబన విధానము ననుసరించి జాతీయాభ్యుదయమునకు దోడ్పడి కీర్తిగడంచెదరు గాక.”

మన శార్దుల సార్వభౌముని హృదయము మెత్తపడినది. ఆ విద్యుచ్ఛక్తి ధగద్ధగలలో కన్నులు మూతలుపడినవి. మంచి సోఫాల మెత్తదనము హాయిగొలిపినది. ఎలెక్ట్రిక్కు వీపనల చల్లని పిల్లగాలులు పరవశుని జేసినవి. మార్జాలసభలోని శాస్త్రవాదములు గాంభీర్యము హృదయాంతరాళమున మోజుల మొలపించింది. ప్రతిష్టంబనవిధానము మచ్చుపొడి జల్లినది. పాలునేయి గలిపిన కమ్మని జున్ను మీగడలు నాలుకకొనపయి నాట్యమాడినవి. వెనుకకు మరలి చూచినాడు “కొండలు కంటకావృతములు–గుహలు కారుజీకటి కిరవులు – వృక్షరా జములతో విలసిల్లు లోయలు భయానకములయిన జరతలు–చల్లని సెలయేళ్లు గడవరాని భీకరతరంగములు– కాలినడక బడలికచేటు– వీరవిహారము అసిధారవ్రతము” అని తన తొల్లిటి బ్రతుకు నొకమారు స్మరించుకొన్నాడు. నేటివిభవమంతా జ్ఞప్తికి వచ్చింది. అంతయు తలక్రిందుగ దోచింది. బెబ్బులిదొర బెండగిలబడినాడు. మనమున అలజడి అంకురించింది. హృదయముయ్యాలలూగుతూ ఉండి, వెనుకా, ముందా! అనే ప్రశ్న బయలుదేరింది. అంతలో నిర్ణయించుకోలేక పోయినాడు. మనసు కుదుటబడలేదు. ఆలోచనాతరంగాల్లో అల్లాడుతూ నిశ్చేష్టితుడై మారుబల్కలేక మౌనము ధరించినాడు “మరలి వచ్చెదనని” నమస్కృతినొనర్చ సభామంటపము నుండి వెలువడినాడు. ‘బదులు జెప్పనైతినే మార్జాల ప్రతినిధులందఱు గుర్రుమందురేమో అని తటమటించినాడు. ప్రక్కన ఒదిగియున్న ఎలుకను బిలిచి మీ పిలుపుకు వేచియుండెదనని నామారుగ మీ రేనికి విన్నవింపుమన్నాడు. సింధూనదివంక బయనమయి నాడు ఆందోళనలో జిక్కి ఆయాసంతో నడుస్తున్నాడు. పాపం మెల్లమెల్లగా సింధూతీరము జేరినాడు. పెద్దపులులన్నీ సభ చేరినాయి. కొదమసింగాన్ని అధ్యక్షునిగా ఎన్నుకొన్నాయి. సింహకిశోరము లేచినది అధర్మము అడ్డములేకుండా సాగేదానికి కారణం పెద్దపులులన్నీ పిల్లులయిపోయిందానివల్లనే సుమా! అని రొప్పినాడు. ‘స్వధర్మదీక్ష పట్టండి’ అని గంభీరంగా గర్జించినాడు. ఆ మేరకు మార్జాల చక్రవర్తి బెన్నున మోటారు దెచ్చినాడు. వెంటనే బడాయికోరు తయారైనాడు. తియ్యని మాటల్తో తేనెసోనలు గురిపించినాడు. మన పెద్ద పులి సెభాస్ అని తలపంకించింది. తక్కిన పెద్దపులులన్నీ పిల్లకూత రోతకు రొప్పినాయి. చష్మని కుప్పించి లంఘించడానికి సిద్ధమయి హూంకారాలు చేయమొదలుపెట్టినవి. మార్జాల వంచకుడు గజగజ వణికినాడు. బడాయికోరు “నేనున్నానులే భయమేల? రా మనకీ పులులతో ఏంపని”? అని అన్నాడు. మన నల్లమల బెబ్బులిరేని తట్టుజూచి మ్యావు అని అరచినారు పిల్లుల పెద్దలు. పెద్దపులి ‘వెనుక్కా? ముందుకా?’ అనే ప్రశ్న వచ్చింది. వీర ధర్మమా? కాదు విస్తరికూడా?

అని తహతహపడినాడు. బానిస బ్రతుకులోగూడా మేలులేక పోలేదేయని బుద్ధిజెప్పికొన్నాడు. పిల్లులలోనికి బోయి సౌఖ్యమనుభవించేది మేలా? లేక పులులలో నుండి అడవులలో దిమ్మదిరుగుట యుచితమా? రెండవది అనుభవించినాను. ఇరువదేడులు గడిచినవి. ఇసుక ఎడారిలో ఎండవేడిమికి తల్లడిల్లి వాడివత్తయినాను. మొదటిది మొన్ననే చెవులార ననుభవించింది. ఒక క్షణమే ఇంతకూ ఇంతలో ప్రతిష్ఠించిన నిరుపయోగమని నిర్ణయించేది సమంజసమా? ఆత్రగానికి బుద్ధిఅల్పంబుగదా ! పెద్దపులులలో నేనొక పెద్దపులిని గదా! నాడు జలదితరంగములే నన్ను సన్నుతించినవి. వారధీశ్వరుడే వింజామరలు వీచినాడు. మార్జాల సామ్రాజ్యమంతయు నాకు పాదాక్రాంతం కాగలదు. మా వ్యాఘ్రసభా నిర్ణయములు కోపావేశమున వెల్వడినవి ఘుర్ఘుధ్వనులు. మార్జాల చక్రవర్తి మాటల తత్వమును మా పెద్దపులులు గ్రహింపలేకపోయినవి. “శేషంకోపేనపూరయేత్తినట్లు అయింది. చక్రగోష్ఠిలో సారస్యము లేకపోయెడినా ? బిడాలములన్నియు నన్ను తమ ప్రతి నిధిగాజేసి ఎన్నుకొనవా? ఆ ప్రతినిధి పదవిబడసి, విమానమున వెలిదీవిజేరి,నా ప్రతిభను వెలిగింపలేని అసమర్థుడునా? వెలిదీవి దొరలు సమ్మతింపకున్న ప్రతిష్టింబన చేయనగును గదా! చక్రగోష్టియే అవలంబనీయ మయిన విధానము తెల్లదొరలు నల్లప్రతినిధులు చక్రగోష్టిలో సమాన గౌరవ మర్యాదలతో జాతీయాభ్యుదయ విధానములను విమర్శించు అనన్యదుర్లభ నీయమయిన విభవ మీయదను గాక ఇకెన్నడూ నాకు గలుగనొప్పి” పిననాటి నుండి తెలిదీవి సౌభాగ్యమున దర్శింపగడుంగడు ముచ్చటపడుచుంటిని. కత్తిసాముకుదిగి వీరవ్రత మిరువ దేడులు గడపినను, తెలిదీవి గగనకుసుమమయినది. ఇయ్యెడ సందుదొరికినది. అభీప్సిత మీడేరే అదను జిక్కింది. అసిధారా వ్రతము చేపట్టి యిసుక ఎడారిలో ఏల మాడిమసి అయి సుడిగాలిలో అల్లాడేది సిరి, రా. మోకాలొడ్డనేల పెద్దపులిసభలో తనదలపు సూచించి నాడు. పెద్దపులులు బొబ్బబెట్టినాయి. మారీచుని మాటాడదలచుకొన్నాడు. వీరవ్యాఘ్రసభ నుండి వెలువడి వచ్చినాడు. మార్జాల పట్టణముతట్టు దృష్టిని గిడ్చినాడు. ఆవైభవ మంతయు పునశ్చరణము జేసినాడు. మరల ఆ రత్నాకరము చేరినాడు. సాగరతరంగశీకరములు స్వాగతమిచ్చి ఎదుర్కొన్నవి. ఇసుక తిన్నియలపయి ఇటునటు దిరుగుచు యోచనతో మునిగి, ఇదమిత్థమని నిర్ణయింపలేక తటమటిస్తూ నిలువబడినాడు.ఇంతలో ఒకపెద్ద అల వచ్చింది.పెళ్ళున పగిలింది. చీలికలయి వాలికలై మన పెద్దపులి నిలుచున్నచోట గల యిసుకను కదలించింది. బెబ్బులిరేని కాలుజారింది. ఇసుక చప్పున కరిగిపోయింది. తరంగో ద్వేగములో జిక్కి అర్భటిస్తున్నాడు. వంచకునికిధనిన్నాడు తెప్పదోనెలు తయారుచేయించినాడు. ఆ అలల తిరుగుమరుగులలో అల్లాడి పెద్దపులి ఒడ్డున బెండగిలబడింది. మార్జాల ప్రభృతులు చయ్యన వచ్చి పరిచర్య జేసినాడు. కన్నులుదెరచి ‘చక్రగోష్టి ఏమయింది మన మహాసభకు పోదాము వృధా కాల యాపనమేల తెలిదీవి సందర్శన మెన్నడబ్బుతుంది’ అని యిరెలుగున తానే హెచ్చరించినాడు. తాను బెబ్బులియనే జ్ఞానం మాయమైపోయింది. గంభీరగర్జన మిపుడతని వదన గహ్వరము నుండి వెలువడి అరణ్యమునందు ప్రతిధ్వనులెగయించుటలేదు. పిల్లుల మ్యావుటరపుల

కోలాహలములో లీనమయి పోయినది. బిడాలములన్నియు తోకలు మెలికలుద్రిప్పి గంతులు వేయుచున్నవి. మన బెబ్బులియు పిల్లులతో గలసి చిందులుద్రొక్కుచు న్నది. మన బెబ్బులియు తక్కువంగలపిల్లులతో గలసి మోటారులో బయలుదేరింది. మొన్న విందు గడుపులారగించిన రాజభవనంలో మరల ప్రవేశించినది మెత్తని సోఫాలు మురుపు గొల్పినాయి. విద్యుచ్ఛక్తి వీవనలు విసరిన పిన్నగాలులలో ఒడలు మరచినాడు. 'ప్రతిష్టంబ ననిధానము' అని అర్భటిస్తున్నాడు. అయ్యది స్తంబించిపోయిందని వగచుచున్నాడు. చక్రగోష్టి యని కలవరిస్తా ఉన్నాడు. తెలిదీవి తియ్యని యాశాప్రపంచములో మోజులు మొలిపిస్తూ ఉన్నది. ఓడలోనా విమానములోనా అని ఆలోచించి ఉగ్రూతలూగుతున్నాడు. ఇంతలో తన ఎదుట ఒక పెద్ద నిలుపుటద్దం కనబడింది. తన్నుతాను చూచుకొన్నాడు. మొదటి ఆశ్చర్యపుటపరంజి జిగి ఎగిరిపోయింది. ఏవగింపు బూడిదరంగు వచ్చింది. ఎత్తు పొడవులో ఏమీతగ్గలేదు. గర్జించేదానికి ఎలుగెత్తినాడు. గొంతులో పిడచబెట్టినట్లయింది. ఈ రెలుగు పడింది మ్యావు అనే బానిసల అరపే అలవాటు అయింది. పిల్లులన్ని తోకలెత్తి కలకల మారంభించినాయి. "బెబ్బులి పిల్లియాయె"నని తైతక్కలాడుతున్నాయి. మన బెబ్బులి కూడ ఎగురులాట కారంభించింది. బెబ్బులి పిల్లియాయెననే ఆర్భాటంతో ప్రపంచం అల్లాడిపో తూవుంది. "పెద్దపులి" "పెద్దపిల్లి"ఎంత బేధమిమిడిందీ రెండుపదాల్లో చెప్పడానికి నా సాధ్యమా! ఆలోచిస్తే తత్వం బోధపడుతుంది.

**– 19, ఏప్రిల్ 1930, సాధనపత్రిక**

# భగీరథ ప్రయత్నము

**- కథకుడి పేరులేదు**

**భ**గీరథుడు హిమవత్పర్వతమునుండి దేశాధిదృక్షాభిలాషతో రాయలసీమలోని అనంతపురము, బళ్లారి మండలములో సంచారము చేయుచుండెను. మోటారుబస్సులలో పోవు చుండగా విడపనకల్లు గ్రామము దాటిన వెనుక టైరు పగిలిపోయి అరణ్యమధ్యములో మోటారు కూలబడినది. సాయంకాలము వరకు ప్రయాణము సాగదని డ్రైవరు చెప్పెను. ప్రయాణీకులు దిక్కునకొక్కరుగా పోయిరి.

భగీరథుడు ఒక పల్లెవైపు నడిచెను. నాడు వాని తల్లిశ్రాద్ధము. బళ్లారికి పోయి ఏ పురో హితుని ఇంటిలోనో ముగించుకొందామని యనుకొని ఉండినాడు. పాపము త్రోవలో మోటారు వలన అభ్యంతరము కలిగింది. దగ్గర గ్రామములో ఏర్పాటు చేసికొనబోయెను. గ్రామజనులు భగీరథుని ఆదరించిరి. వర్తకులు కావలసిన పదార్థములను పంపిరి. ఆ గ్రామ పౌరోహితుడు చదువుకొన్నవాడు. మంత్రము చక్కగా పలుకనేర్చినవాడని భగీరథుడు విని సంతోషముతో వారి యింటికి వెళ్లెను. వెంట వచ్చినవారు తెచ్చినపదార్థ ములను అయ్యగారి యింటిలో నుంచి భగీరథులవారికి ఎట్టిలోపము కలుగకుండ వారి తల్లి శ్రాద్ధమును చేయింప వలసినదని శిఫారసు చేసిరి. పౌరోహితుడు ఒప్పుకొనకేమి? వర్తకులు ఇతర జనులు ఎవరి యింటికి వారుపోయిరి. కాని పౌరోహితునికి తర్వాత ఒక చిక్కు కలిగెను. మొదటనే అతడు యోచించిన యడల బాగుగనుండేది. విప్రులకు పశ్చమబుద్ధియం గదా సామెత, పాపము ఆ శాస్త్రుల వారు భగీరథుల వారియెద్దకుపోయి అయ్యా ఒక కష్టము సంప్రాప్తించింది అనిరి.

భగీరథుడు : ఏమి ?

శాస్త్రీ : శ్రాద్ధము జరుగుటకేమి గొఱతగాలేదు గాని పాదప్రక్షాళనము జరిగే విధము కనుబడలేదు.

భగీరథుడు : నాకు మంత్రములు వచ్చునులెండి

శాస్త్రి : మంత్రముల సంగతి కాదయ్యా, కాళ్ళు కడిగేదానికి నీళ్లులేవే .

భగీరథునికి కొంత వరకూ ఈ కష్టము బోధపడలేదు. రేగడి గ్రామములనీ, ఇక్కడ నీళ్ళు అరుదనీ ఆయనకు తర్వాత చెప్పగా చెప్పగా బోధపడింది. పాదప్రక్షాళన జరుగనిదే శ్రాద్ధమెట్లు? కాబట్టి ఆనాడు వాని తల్లి తద్దినము నిలిచిపోయెను. ఈ ప్రాంతములో నీటి కఱువు అ రాజఋషికి బోధయైనది. ఛీ! గంగనుతెచ్చి సముద్రము నించినదాని కంటే ఈ రేగడ సీమలో జలవసతి కల్గించేది ఫలప్రదమని భగీరథుడు నిశ్చయించుకొన్నాడు.

భగీరథుడు మళ్ళీ ఈశ్వరుని గుఱించి తపస్సుచేసినాడు. ఆయన ప్రత్యక్షమై మళ్ళీ ఏమి అవాంతరమన్నాడు. "నీ జటాజూటమును ఇంకొక్కసారి గట్టిగా విదల్చవయ్యా రాయలసీమలో పాదప్రక్షాళనానికి గంగలేదు" అన్నాడు భగీరథుడు. ఈశ్వరుడన్నాడు "ఓయీ చాదస్తపు

రాజర్షీ! నీవు కృతయుగము మాటాడుతున్నావు. అప్పుడు జటాజూట ముండేది. దానిలో గంగను నిల్పి ఉండేవాడను. ఇప్పుడు చూడు నానెత్తి క్రాపు కొట్టించినాను. హిమానీన్యాస లైనులు తప్ప నా జుట్టులో ఒక నీటిచుక్కలేదు". అపుడు భగీరథుడు తలపైకెత్తి చూచినాడు. ఈశ్వరుడు చెప్పినది నిజమే. ఆయన క్రాపు సుందరముగా పాపెటతో ముద్దు గుల్కుచున్నది. ముఖక్షౌరము చేసికొన్నాడు. మీసాలుకఱకుగా ఉండేటందుకు యూకలిప్టస్ నూనెపట్టించి తీడినాడు. భస్మములకు బదులుగా ఫేస్‌పౌడరు పూసుకొన్నాడు. ఇంక ఇక్కడ స్వారస్యములేదని భగీరథుడు విష్ణులోకానికి ప్రయాణమైనాడు.

... .... ....

విష్ణువు పాదములో గంగపుట్టినది కదా! ఆయనను అడిగితే ఆ పాదాలగంగను ఈ సీమ తట్టు మళ్లించవచ్చును అని భగీరథుడు ఆశపెట్టుకొని వెళ్ళి విష్ణువును ప్రార్థించి నాడు. విష్ణువు చిరునవ్వునవ్వి తన పాదములవైపు జూపినాడు. భగీరథుని కాశ్చర్యమైనది. ఆయన కాళ్ళకు బూట్సులు అమరిఉన్నవి. పైగా మేజోళ్లు వేసికొన్నాడు. ఇంక అందులో తేమ ఉండుట కవకాశమేదీ. ఒకవేళ గంగ వచ్చినను బూట్సుకాలిలో నుండి వచ్చే గంగ పవిత్ర మైనదా? భగీరథుడు వెనుకకు మళ్ళీ భూలోకమునకే వచ్చినాడు.

... .... ....

భూలోకములో గంగనే ప్రార్థించి రేగడి సీమకు పిలుచుకుపోతే కష్టమే లేదుగదా! అని గంగమ్మను గుఱించి తపస్సుచేసినాడు. ఆమె ప్రత్యక్షమై ఆ దేశము ఎట్లున్నదో ఏమో ఒకసారి స్త్రీరూపములో వెళ్లిచూచి వస్తాను. తర్వాత ఏమాటచెప్పుతానన్నది. భగీరథుడు గంగమ్మను పిలుచుక వస్తున్నాడు. త్రోవలో రయిల్వే రోడ్డు కట్టలు అడ్డువస్తున్నవి. వీనిని దాటివచ్చేదేలాగున అన్నది గంగమ్మ. నీవు ఒక్కసారి హూంకరిస్తే ఇవి ఎక్కడికక్కడ కొట్టుకొని పోవా? ఈ మంటి దిబ్బలేమి లెక్క ? అని ఉబ్బించినాడు భగీరథుడు. సరే అన్నది గంగ. ఎట్లయితేనేమి ఇద్దరూ బళ్లారికి వచ్చి అనంతపురం రోడ్డు పట్టినారు. త్రోవలో ఎనిమిది కల్లు లారీలు ఎదురైనవి. వాసన మైలుదూరానికే కొట్టింది. గంగమ్మ గుండెలు గభీలుమన్నది. భగీరథుడు నిర్విణ్ణుడయినాడు. గంగమ్మ అన్నదిగదా, "ఇది నా సవతి తాండవించే రాజ్యం, ఇందులో నేనొక్క నిమిషం ఉండనువీలుకాదు" అంటూనే గంగమ్మ అదృశ్యమై కాశీతట్టు పరుగెత్తింది. లారీమీద తోలు సంచితో ఊగుతు ఉండే ఎల్లమ్మ పొంగి పొంగి నవ్వింది సవతి పారిపోతూ ఉంటే నేనుండేచోటికి వస్తావా ఖబర్దారు! అన్నది.

... .... ....

భగీరథునికి ఎటూ తోచలేదు. బ్రహ్మవద్దకు పోయి ఆలోచించినాడు. "గంగమ్మ ఇకరాదు అక్కడికి. అయినా పరవాలేదు. తుంగభద్ర అక్కడనే ఉన్నది కాదా. నీవు గవర్నమెంటు శాసనసభలో మెంబరు పదవి పొంది తుంగభద్రకు ఆనకట్ట కట్టించి నీటిని కాలువల గుండా రాయలసీమలో పారేటట్లు చేయవలసినది అంతకంటే మార్గములే"దన్నాడు.

... .... ...

భగీరథుడు రాయలసీమ తరపున నిలిచి ఢిల్లీ అసెంబ్లీ మెంబరై తుంగభద్రా ప్రాజెక్టు తీర్మానము ప్రతిపాదించినాడు. కాని సెకండు చేసే వారెవ్వరూ కనబడలేదు. ఇంతలో ప్రభుత్వపు మెంబరు ఈ తీర్మాన ప్రవేశమునకే ఆక్షేపించినాడు. ఇది రాష్ట్రీయ సమస్య, ఇండియా గవర్నమెంటుకు దీనితో సంబంధము లేదనివాని ఆక్షేపణ.

అందు పై భగీరథుడు ఆ మెంబరుపనికి రాజీనామానిచ్చి చెన్న రాజధాని శాసన సభ్యుడగుటకు నిలువదలచెను. బళ్ళారి జిల్లా తరపున అభ్యర్థిగా నిలువదలచెను. ఆ జిల్లాలో లింగాయతుల సంఖ్య హెచ్చు. ఈయన నాపేరు భగీరథుడు అని చెప్పుకొనేసరికి లింగా యతులకు మహాకోపము వచ్చినది. "ఈయనేగదా విష్ణుపాదములందుండే గంగను తెచ్చి మా శివునినెత్తిన విడిచినాడు. ఎంత శివద్రోహి"అని ఆయన మీద కలియబడడానికి వచ్చి నారు. పాపము భగీరథుడు పరుగెత్తివచ్చి అనంతపురము మండలము తరపున అభ్యర్థిగా నిలిచెను.

.... .... ....

వోట్ల క్యాన్వాసింగు ప్రారంభమైనది. వోట్ల నడుగుతూనే గ్రామాలలో ఒకటే ప్రశ్న "నీవు కాపువా, కమ్మవా అని. నేను రెండూ కాదన్నాడు భగీరథుడు. అయితే మేమెవ్వరమూ వోటియ్యమన్నారు కాపులు, కమ్మలు. నేను తుంగభద్రను తెచ్చి మీ చెరువులు నింపుతానన్నాడు భగీరథుడు. కాపువాడు తెస్తేతప్ప మాపొలాలకు నీళ్ళు పారించు కోనమన్నారు రెడ్లు. కమ్మ గారన్నారు గదా! మా కులమువారు తప్ప ఇతరులు దెచ్చే నీళ్ళను కట్టలు తెంచి పారవే స్తామని. బ్రాహ్మల వద్దకి పోయి నాకు వోట్లు సాయము చేయమన్నాడు. నీవు సగర చక్రవర్తి వంశమువాడవు కనుక క్షత్రియుడవు. బ్రాహ్మణుల వోట్లు మీకు రావన్నారు వారలు. క్షత్రియులకు పోయి అడిగినాడు భగీరథుడు "నీవు ఋషివై బ్రాహ్మణులలో చేరినావు కాబట్టి మేమియ్యమన్నారు" బాహూసారులు. భగీరథుని ప్రయత్నమేమీ సాగిరాలేదు.

.... ..... .....

కడకు ఒక ఉపాయం వెదకినాడు వోట్లు సంపాదించను. అతడు వోట్లను అడుగడానకు ప్రచురించిన ప్రకటనలో నీక్రింది వాక్యములున్నాయి

"ఇటీవల కాంగ్రెసువారు కల్లంగళ్ళు ఇజారా కాకుండా కల్లమ్మకుండా తంటా చేస్తున్నారు. గవర్నమెంటు వారు టెంపరెన్సు ప్రచారము చేస్తున్నారు. నేను టెంపరెన్సు కమిటీలను తీసివేయించుతాను. కాంగ్రెసుకు విరుద్ధముగా పనిచేస్తాను. నేను త్రాగుబోతును. త్రాగుబోతులందరూ నాకు దేశాభిమానము ఆచారాభిమానము ఉంచి వోట్లు ఇప్పించవలెను".

ఇట్లు మద్యప్రియుడు,

భగీరథుడు.

దివ్యంగా వోట్లు వచ్చినాయి. ఈడిగవారందరు తిరిగి కష్టపడి వోట్లిప్పించారు. కమ్మవారు

కాపువారు కూడా యిచ్చినారు. నేసేవారు, బాహూసార, క్షత్రియులు సింగిల్ వోట్లనిచ్చినారు. బ్రాహ్మణులు వర్తకులలో చాలా మంది ఆయనకే ఇచ్చినారు. పోలీసు వారు కూడా ఆయనకే సహాయము చేసినారు. సబ్ఇన్స్పెక్టరు క్యాన్వస్ చేసినారు. పోలింగు ఆఫీసరులు ఇతరుల పేరు చెప్పినా ఆయా పేరుకే గుర్తు చేసినారు. విధిలేక ఎదుటివాని పేరునకు తను ఇన్సియల్ పెట్టకుండా వేసి ఆ వోట్లను ఇన్వాలిడ్ చేసినారు. కల్లు ఇజారాదారులు పోలింగుస్టేషన్ పక్కనే సీసాపెట్టి భగీరధునికి వోట్లనిచ్చిన వారికల్లా ముంతెడుకల్లు ఉచితముగా పోసినారు. ఏజంట్లకు సారాయి ప్రత్యేకముగా తేబడినది. భగీరథుడు గెల్చెను. ఎదుటివాడు 250 రూపాయల డిపాజిట్టును గూడా పోగొట్టుకొనెను. గెల్చినమాట వింటూనే ఈడిగవారు పెద్ద మెరవణిచేసి విందు చేసినారు భగీరథునికి.

... .... ....

శాసనసభ కూడినది. కాని భగీరథుడు కల్లంగళ్ళ విచారము ఎత్తలేదు. వానికి కావలసినది తుంగభద్రా ప్రాజెక్టు. వోట్లు సంపాదించడానికి పై ఎత్తు ఎత్తినాడు అంతే. తుంగభద్రా ప్రాజెక్టు తీర్మానం ఉపపాదించినాడు. ఎవరో తమ పేరు పత్రికలో పడవలెనని ఉవ్విళ్ళూరే మెంబరు సెకండు చేసినాడు. గవర్నమెంటువారు తీర్మానం ఒప్పుకొంటూ నైజాముతో రాయబారం సలిపేదానికి ఒక కమిటీ ఏర్పాటు చేసి దానికి భగీరథుల వారిని ప్రెసిడెంటుగా ఏర్పరచిరి.

వారు నైజాము గారిని చూచి తుంగభద్ర ఆనకట్ట విషయముపై మనవి చేసికొ న్నారు. “తుంగభద్రానది అనేది మా రాజ్యంలో పారుతూ ఉన్నదని మీవల్ల విని చాలా సంతోషించినాము. ఐనా నిజమో? కాదో? మా దివాన్ వారికి వ్రాసి తెలిసికొంటా”మని నైజాము గారు చెప్పివెళ్లినారు. హైద్రాబాదులోనే ఉండి భగీరథుడు దివాన్ గారిని చూచినారు. “మేమా విషయం తెలిసికొనడానికి ప్రయత్నించుతున్నాము”అన్నారు దివాన్ గారు. ఏ విషయం? తుంగభద్రానది హైదరాబాద్లో పారేది నిజమా అనే విషయం. భగీరథుడు నిరాశచేసికొని మద్రాసుకు తిరిగిపోయెను. కొన్నాళ్ళకు కమిటీ మెంబరులకు నైజాము నుండి బదులు వచ్చినది. “మాకు బీరారులు ఇస్తే మీకు తుంగభద్ర నీళ్ళు రానిస్తాం” అని.

ఇది భగీరథుడు గవర్నమెంటులో ఉంచినాడు. బీరార్లను ఇచ్చే విషయం ఇండియా గవర్నమెంటువారి అధికారం అని చెప్పి గవర్నమెంటు వారు ఆ కాయితాలను లాడ్జ్ చేసినారు. కొన్నాళ్ళకు మళ్ళీ భగీరథులవారు ఇంకొక తీర్మానం ప్రవేశపెట్టి నైజాము రాష్ట్రమునగాక బ్రిటీష్ ఇండియా ప్రదేశములోనే ఒకచోట తుంగభద్రా ప్రాజెక్టునకు స్థలము ఏర్పాటు చేయవలసినదని చెప్పినారు. గవర్నమెంటువారు ఒక ఎక్స్పర్ట్ కమిటీ ఏర్పాటు చేసినారు. వారు కొలతలు ఎత్తికొన్నారు. ఇంజనీర్లు ఎష్టిమేట్లు వేసినారు. ఇంకా ఎందుకు పని ప్రారంభము కాలేదని భగీరథుడు ప్రశ్నించినాడు. ఈ స్కీమునకయ్యే మూలధనమునకు వచ్చే శిస్తువలన వడ్డీ గిట్టదని గవర్నమెంటు వారు చల్లగ బదులు చెప్పి ఊరకున్నారు.

ఇంతింత కచేరీలు, భవనాలు ఢిల్లీ నగరమూ, కోట్లకొలది ఖర్చుచేసి కట్టించుతున్నారే, వీటి మీద వడ్డీ గిట్టుతుందా అని? మళ్లీ సప్లిమెంటరీ ప్రశ్నవేసినాడు భగీరథుడు. 'ఆర్డర్! ఆర్డర్!' అని అధ్యక్షుడు కేక వేసినాడు. ఇంకేమో అనబోతూ ఉండగా పోలీసువారు భగీరథుని గెంటించి వేసినారు. భగీరథునికి కోపము అసహ్యాము, ఆవేశము వచ్చి స్వర్గమునుంచీ గంగనైనా తెచ్చినాను గానీ ఈ శాసనసభల మూలమున తుంగభద్రను పారింపలేక పోయినాను అంటూ పరుగెత్తడము మొదలిడినాడు. త్రోవలో క్రొత్తగా గెల్చిన బళ్ళారి, అనంతపురము శాసనసభా సభ్యులు ఎదురై భగీరథుని తట్టు చూచి వేళాకోళము చేసినారు. కొందరు మీసాలు తీడినారు. "భగీరథా నీచేతకాలేదు. మేము తుంగభద్రను సాధించెదము చూడు. నీ బేడలు ఈ కలియుగము నీళ్ళలో ఉడుకవు" అన్నారు. "మీరు పప్పుచేసిన కాలా నికి వచ్చి నేను విందారిగిస్తాను" లెమ్మని భగీరథుడు మాయమైనాడు.

ఎలెక్షనునకు తిరిగిన పెట్రోలు బిల్లును పూర్తిగా యియ్యనిదే భగీరథుడు పరారీ అయినాడని పెట్రోలు కంపెనీ వారు దావాచేసి సమన్ వెడలిస్తారట ఆయన మీద.

ఇంతలో మెలకువ అయినది. రాత్రి చాల ప్రొద్దు వరకు సగర చక్రవర్తి కథ చదివినందున కలిగిన కలువరింత ఇదిగదాయని తెలివి తెచ్చుకొని నాలో నేను నవ్వుకొన్నాను.

**– 20 సెప్టెంబర్, 1930, సాధన పత్రిక**

## సన్యాసం

– కథకుడి పేరులేదు

సుశీల: “ఇదో”

మోహనుడు : .............

సు : “మాట్లాడరేమండీ”

మో: మాట్లాడేం చేయ్యాలన్నాను.

సు : మరి యిలా యెన్నాళ్ళు గడుస్తుంది?

మో : ఇప్పు డెన్నాళ్ళు గడిచింది.

మ : బలే మాటన్నారు లేండి. ఇల్లాగే యింట్లో కుండల్లో వూరుతుంటాయనుకొన్నారా! తిండి గింజలు, చెలమలో నీళ్ళకువల్నే? నిన్నటి బియ్యం చిక్కేసరికి బ్రహ్మవిద్య అయిపోయింది.

మో: మరేం చేయమన్నావిప్పుడు !

సు : నన్నడిగితే నేనేం చెప్పేది? సన్యాసం పుచ్చుకోండి సుఖంగా...

మో : పుచ్చుకుంటే?

సు : మన కష్టాలు కడతేర్తాయి.

మో : మరి మిమ్మల్నంతా వదలిపెట్టాల్సి వస్తుందిగా నేను సన్యాసం బుచ్చుకుంటే.

సు : వదలిపెడితే మటుక్కేం? మాకొచ్చే బత్తెము మాకొచ్చి పడుతూంటుంది.

మో: ఏల్లాగ?

సు : మీరు పంపిస్తుంటే.

మో : నేను సన్యాసినై సంపాదించిన డబ్బుని ఆలుబిడ్డల కంపుతూంటే లోకం నన్ను చిల్లిగవ్వ కింద కట్టేయరూ ?

సు : ఎందుకు? ప్రపంచకములో జరిగే పద్ధతులకంటే మనమేం భిన్నపద్ధతుల్లో నడుస్తూంటేనా?

మో : పోనీ; మరి సన్యాసులంటే ఏదో పేరు ప్రతిష్ఠలుండాలిగా? అవి లేకపోతే చిల్లికానీ ఎవ్వడిస్తాడు?

సు : వాటికేం. అని సక్రమంగా వస్తవి; చేసే డాబు కొద్దీని.

మో : మరి మఠం పేరేం పెట్టమన్నావు?

సు : నిరుద్యోగి పీఠము.

మో : స్వాములవారి పేరు?

సు : నిరుద్యోగి సంఘోద్ధరణ బద్ధకంకణ పరమహంస పరివ్రాజకాచార్యులవారు

మో : పేరేమో బాగుందికాని మరి పేరుకు దగ్గట్టు పనిచెయ్యద్దూ ?

సు : మనం చేసేడ్చాలాయేమిటి ?

మో : నేనే ఆచరించకపోతే యెవరు వింటారు నామాటల్ని?

సు : పాపము మీకేమన్నా తెలుస్తుందా? అన్నీ నేజెప్పిందాకాను. ఇప్పటి సన్యాసులు, పీఠాధిపతులు, కులగురువులు, ఆచార్యపురుషులు, మతప్రచారకులు,వేదాంతులు, సంఘ సంస్కర్తలు వీళ్ళంతా వాళ్లు వాళ్లు చేయాల్సిన పనులు చేస్తున్నారా? అలా చేయటంలేదని సంచారాలు, ఉపన్యాసాలు మానేశారా? అందులో మన మొకళ్లం.

మో : అయితే చేయాల్సిన ప్రబోధము సంగతో?

సు : ప్రబోధానికేం కరువొచ్చింది? నిరుద్యోగుల్నంతా రూపుచేసి, మనో రాజ్యమనే దొకటుందనీ దాంట్లో రాజుపని మొదల్కొని గులాంపనివరకు ఉద్యోగాలు ఖాలీ వున్నాయని, అచ్చట రాజత్వం బొందినవాడు ప్రకృతం బ్రిటిషురాజ్యంలో రాజువలెకాక అన్ని కార్యాలను స్వతంత్రంగా చక్కబెట్టొచ్చునని మంచి చెడుల వ్యత్యాసం చెయ్యటంలో బహునేర్పరిగా వుండాలనని, జీతములు రాజు కనుకూలంగా పొయ్యేకొద్దీ హెచ్చుతుంటాయని యిట్లా యేవేవో కబుర్లు నాలుగల్లి చెప్పేది. ఇంకా ఆ రాజ్యాన్ని వూరికే ఎక్కువగా వర్ణించి మనమంతా దరఖాస్తులు పంపుకుంటే మంచిదని చెప్పేది.

మో : మరి ఆ రాజ్యాన్ని చూపమంటే యెవరన్నా?

సు : ఓసి, దానికేం భాగ్యం, మీకు తెలిదాదోవ? మీరు సంస్కృతం చదువుకోలేదా? మనోరాజ్యం అణుపరిమాణం అనీ, అది దాంట్లో ప్రవేశించి రాజ్యం చేసేవాళ్ళకు కానీ కనపడదు. దాంట్లో ప్రవేశించేందుకు ప్రత్యేక యోగ్యతలవసరమని చెబితే మనకా యోగ్యతలు లేవేమోలే, పెద్దల వాక్కు అబద్ధము అవుతాయా అనుకుంటారు.

మో : యేమిటీ యోగ్యతలు?

సు : నిరుద్యోగిగా, భార్య పోయినవాడుగా, బ్రహ్మచారిగా, ఉన్మత్తుడుగా కాని వుంటే యీ సంఘంలో చేరొచ్చునని, ఈ సంఘంలో బడితే పైకొఱతలన్నీ బోయి మనిషి సంపూర్ణుడౌతాడు.

మో : మనోరాజ్యం నీవుచూశావా? అని ఎవరన్నా ప్రశ్నిస్తే?

సు : దానికేం! సమాధానం సులభంగా చెప్పొచ్చు. ఒక వస్తువు యొక్క సత్తా తెలియాలంటే ఒక ప్రత్యక్ష ప్రమాణమే సాధనము కాదు. ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన శబ్ధములని కొన్నింటిని సామాన్యంగా అందరు ఒప్పుకొన్నారు. వీనిలో రెండో ప్రమాణంతో మన రాజ్యమున్నట్టు మనం సాధించుకోవచ్చు. ఈశ్వరుడొకడున్నాడని మనవారెట్లనుమానం ప్రమాణంతో

సాధించితే అందరు ఒప్పుకొన్నారో అట్లనే మనము సాధించితే యెందుకు ఒప్పుకోరు. ఈశ్వరుడున్నాడనేందుకు చూడండి.

'క్షిత్యంకురాదికం – సకర్తకం – కార్యత్వాత్– ఘటవత్ (అనగా కార్యరూపమైన ఘటము వలన కర్తయైన కులాలు డెట్లూహింపబడుచున్నాడో, కార్యభూతములైన క్షితి, అంకురము, మొదలైనవాటివలన వాటికి కర్తయైన ఈశ్వరుని కూడా నూహింపవచ్చునని యీయసమాన తాత్పర్యము) ఇక మనకు సాధకమగు అనుమానము.

'మనః – రాజ్యం – ప్రకృతి రూపత్వాల్, దృశ్యరూప రాజ్యవత్ " ప్రకృతులు

ఇట్లాంటివింకా యేవేవోకొన్ని చెప్పి బేలుపుచ్చి డబ్బులాగేద్దాం"

మో : అక్కడ ఉద్యోగం చెయ్యటానికి చదువు సంధ్యలేమీ అక్కర్లేదూ? వాటిని వాళ్ళకు నేర్పించట మేల్లాగు.

సు : మనమెందుకు నేర్పించేది. అది మనపని కాదు. మన ప్రచారము, మరీ మరీ ఆ మనోరాజ్యాన్ని వర్ణించుటయే, చూపించకుంటే మాకిందులో నమ్మకం లేదని యెవరేనా గట్టిపట్టుబడితే మీకిందులో నమ్మకం లేకపోతే మా మఠంలోనుంచి బహిష్కారమిప్పిస్తాము' అని గద్దించితే వాళ్ళే వూరుకుంటారు. ఊరుకోకపోతే కంఠం మరింత పెద్దదిచేస్తేనన్నా మానేస్తారు. ఇలాజేస్తే మన కడుపెందుకు బూడదోచూస్తాను.

మో : 'ఓ వేళ కొందరు మొండివారు దాపురించితే '

సు : మొండివారిని రహస్యంగా పిలుచుకొని మన మఠం వరంబడిలో కొంత భాగమిస్తామంటే మన తరపున ప్రచారం కూడా చేస్తారు. డబ్బుకు దాసులు కాని వారెవళ్లీ డిప్రెషన్ రోజుల్లో? పైసా కనపడితే చాలు, ఎంత ఘోరాలైనా చేస్తారు. అందరూ అంతే. ఏదో ఓ పేరు బెట్టి ఓ సంఘాన్ని లేవదీసికొని కాస్తబలం కూర్చుకునేది ; ఉపన్యాసాలకు వేదిక లెక్కేది. తన్మూలంగా సంపాదించుకు తినేది. హరిదాసులు, గీతోపన్యాసకులు, సారస్వత సేవకులు యింకా యిట్లా ఎన్నో సంఘాలున్నాయి; నేను చెప్పుట యెందుకు!

మో : చూడకేమి కాని, మనమాచరించి యితరుల నాచరింపజేస్తే బాగేమో, మరి దాని పద్ధతులు నాకేవీ తెలీవె.

సు : చూచారా, మరీ మామూలు గొడవే. ఆ గొడవంతా మీకెందుకంటె వినటంలేదు. ఇప్పటి మత ప్రచారకులకు మల్నే మన ప్రచారం సాగించుకోవచ్చు. వారెవ్వరికైన జీవ బ్రాహ్మల యదార్థ్యం తెలుసునా? వాని నిష్కర్షగా తెలిసుంటే యిన్ని రగడ లెందుకొస్తాయి. తమ కోవాళ తెలిసుంటే అనుయాయులకు తెలుసుకునేందుకు ప్రత్యక్ష సాధనాలెన్నియైన చాటించినారా నట్టి వేదికోపన్యాసాలు తప్ప. అట్లాగే మనము తిన్నగా కొంత కాలం ప్రచారంచేసి కొంత మంది బుట్టచెడిన పెద్దమనుష్యుల లోబఱచుకొని శాశ్వతంగా మఠం నిలుపుకున్నా మంటే మరి మనం బయటికి కాలుకదల్పకుండ జరిగిపోతుంది.

మో: ఐతే మరెప్పుడు పుచ్చుకోమంటావు. సన్యాసాన్ని.

సు : 'ఎప్పుడో యెందుకు ; శుభస్య శీఘ్రం అంటూ ఆతురతను వివరించటానికి 'తదేవ లగ్నం' అన్నారు పెద్దలు. కాబట్టి యిదే మంచి ముహూర్తం ఇప్పుడే కావాలి.

మో : సన్యాసానికి కావలసిన పరికరాలో మరి.

సు : ఇవిగో కావి బట్టలు, కమండలం, దండము, పాదుకలు. ఇక కానివ్వండి.

మో: నారాయణ – నారాయణ – నారాయణ

**–18 మే, 1935, సాధన పత్రిక**

# దాహపు దొంగ

– పి.యస్. ఆచార్య, బి.ఎ

నవరాత్రి పండుగలు వచ్చుసరికి మామగారి నుండి యాహ్వానము వచ్చినది. మైకలుమస్సు సెలవులు నాయదృష్టవశమున దసరా పండుగలతో కలసి వచ్చుటచే తగిన గుడ్డలు, మా 'వాడికి' కావలసిన కొన్ని వస్తువులను సర్దుకొని ప్రయాణము చేసి మామగారి యూరు చేరితిని.

దుర్గాష్టమి వరకును పండుగలు నిత్యమొక భక్ష్యముచే కడచినవి. ఆనాడు తీపు దోసెలు చేసి యుండిరి. భోజనమునకు ప్రతిదినము నా ప్రక్కన కూర్చొనుచుండిన రాధ నేడును ఎప్పటివలెనే 'మామ' కింకొకటి, మరియొకటి అనుచుండగా, నా అత్త వేయుచునే యుండినది.

భోజనమైన వెంటనే రాధ "మామ నాలుగు, నేను రెండు, అత్త రెండే...!" అని లెక్క పెట్టుచుండగా మాయత్త విని 'రాధ!' అను కన్నుగీటినది. అంతటితో నా పిల్ల ఊరకయయ్యెను.

నా గదిచేరి; యందొకడనే యుండలేక 'రాధ!' అని పిలువగనె వచ్చి 'ఏమి మామ' అన్నది.

'అందరి యెదుటను అట్లు లెక్క పెట్టవచ్చునా నీవు.'

'లేదు మామ! అత్త చెప్పించినది. అత్తే...'

'వెఱ్ఱిదా...!' అను నంతలోనే యా పిల్ల గట్టితనము చూచి నాకు నవ్వు వచ్చినది.

ఆమె లేచి చక్కగా నా కుముదకడకు వెళ్ళినది. లోపల నేమేమొ గుసగుసలు, వారి మధ్య నవ్వు మాత్రము అప్పుడప్పుడు వినబడినది. ఆ మధ్య 'రాధ ! నీకు తన్నులు పడును. అట్లు మాట్లాడవద్దు' అను మాటలు వినబడినవి. వెంటనే 'అట్లు కాదత్తా! మామ నిన్ను..' అను మాటలను వింటిని.

సాయంకాలమైనది. కడుపు బరువు తగ్గలేదు. ఒకతూరి వాహ్యాళి వెళ్లివత్తమని మామగారి పొలముల కడకు వెళ్లి, యన్నిటినిచుట్టి తుదకారుగంటల కిల్లుచేరుకొంటిని. రాత్రి యాకలి కాకుండినప్పటికిని, బలవంతముమీద భోజనపు శాస్త్రము ముగించి, పడకజేరితిని.

రాత్రి సుమారు రెండుగంటలయి యుండవచ్చును. మెలకువైనది. దాహము భరింపరాకుండెను. కాని దగ్గర నీరులేదు. సాధారణముగా మా యింట నేను పరుండుటకు ముందు చెంబులో నీటిని వుంచుకొనుట అలవాటు. కాని మామగారింటిలో సిగ్గుచేత ఎవ రిని నీళ్ళుంచమని అడుగ బిడియపడితిని. ఆ యర్ధరాత్రి సమయమున నెవ్వరినైన మేల్కొ ల్పుటకు సిగ్గు, చాలాసేపాలోచించి తుదకు పరుండ నిశ్చయించితిని. పడకమీద పొరలుటే కాని నిద్రరాదయ్యెను. దప్పి మిక్కుటమగుచుండెను. అప్పుడు చేయునదిలేక, వంట ఇల్లు చప్పుడులేక ప్రవేశించి నీరుత్రాగిరానిర్ధారించి లేచితిని. అది యత్తగారిల్లు, ఎవరైన చూచిన నవ్వుదురనుకొని మరలా పరుపుమీద చతికిలబడితిని. దాహము మాత్రము నిమిష

నిమిషమునకు హెచ్చుగుచుండెను. తుదకు ధైర్యము తెచ్చుకొని యా సమీపముననే యుంచుకొన్న టార్చితీసికొని, గది తలుపును మెల్లగా తీసితిని. అటుపై నడుగిడుచు చప్పుడుచేయక వంటయిల్లు చేరి తలుపు తీయగా లోపలినుండి గాలి బెస్సని విసరినది. ఏవరో లోపలనున్నారని భ్రమపడితిని. దేహము ముచ్చమటలచే తడిసిపోయినది. గుండె యదరజొచ్చినది. అప్పుడు చేయునదిలేక అట్లనేయుండి, మరల ధైర్యము వహించి లోపల నెవ్వరును లేరని దృఢపరచుకొని వెళ్లితిని. నీటిబిందెను దేవుని యరుగు క్రింద మధ్యాహ్నము చూచినట్లు జ్ఞాపకము. కాని టార్చి సహాయమున దానికడకు వెళ్లితిని. కాని యట పంచపాత్ర కనబడలేదు. మరల దానికై నెదకి తెచ్చితిని. బిందె చాల పెద్దదగుటచే టార్చి నేలమీద పెట్టి రెండు చేతులతోను నీరు వంచుచుండ నొక ఎలుకవచ్చి టార్చిని త్రోసెను. అది ప్రక్కకు పొరలి ఆరిపోయినది. పొరలుటవలన కలిగిన సందడి కెవరైనను లేచిరేమోయని భయపడి, దానిని తీసికొనబోవు తొందరలో బిందెజారి క్రిందికి పడినది. ఢణ్...అను శబ్దమయ్యెను. లోటా పొరలిపోయెను. కడవలోని నీరు చల్లిపోయెను. నా గుండె నీరైపో యినది. కాని నా యదృష్టవశమున నెవ్వరును మేలుకొనలేదు. ఇక అచ్చట నుండుట మంచిది కాదనుకొని టార్చికై వెదకితిని. అది దొరకలేదు. తడబాటులో కాలొక పాత్రకుతగిలి దొరలిపోయెను. అప్పుడు కలిగిన ధ్వనికి నా ప్రాణములట్లె యెగిరిపోయినవి. ఇక జాగ్రత్త పడకుండిన బాగుండదనుకొని వాకిలికై వెదకుచు వంటిల్లంతయు తిరిగితిని. ఎటుపోయినను ఢీకొనుటేకాని మార్గము కనబడలేదు. తల రెండు మూడు చోట్ల దద్దరిల్లెను. కాని తడవియైన చూచుకొనక వాకిలికిగాను వెదుకుచుంటిని. ఇట్లు వెదకుచు నడుచుచుండ చేతికేదో మెత్తని వస్తువొకటి తాకినట్లయినది. అదేమి? ఎవరో మనుష్యుడు! ప్రాణమేమో పోయినది. గుండె కొట్టుకొన ప్రారంభించినది.

'ఓరి దొంగా... ఇంకెక్కడికి పోవుదురా!' అనుచు నా మామ గట్టిగా నన్ను పట్టుకొనెను. వీపు వాచిపోగొట్టెను. ఆ దెబ్బల కాగలేక నేలమీద వ్రాలితిని. "పోలీసు వారికిక సులభముగా నప్పగించవచ్చును. ఎట్టు పారిపోగలవురా!' అనుచు నామామ నన్ను పీనుగు నీడ్చినట్లీడ్చుకొని పోయి యొక గదిలో పడవేసి తలుపు భద్రముగా వేసి వెళ్ళెను.

అప్పుడు కొంచెమూపిరి త్రిప్పుకొన గల్గితిని. అయినను దెబ్బల నుండి కలిగిన నొప్పి మాత్రము తగ్గలేదు. మామ చూచినప్పుడే "నేను...మామా...' అని అరచియుండిన బాగుండెడిది. కాని ఏలనో అట్లు చేయకపోతిని. అతడు మరల తలుపుతీసి నన్ను చూచినప్పుడు గల్గు అవమానమును భరించుటెట్లు ? అబ్బ ! భరింపరానది. తలచుకొన్నంతనె భయమైనది. అత్తగారి యిల్లు ! సిగ్గుల చేటుకదా ! .... ... ....

బయటకట్టమీద మామగారు పొరుగింటి మామ హనుమంతాచార్యుల వారితో రాత్రి జరిగిన సమాచారముల ప్రసంగించుచుండెను. నేనున్న గదికి సమీపముననే వారు మాటలాడుచుండుటచే నాకు వారి మాటలన్నియు వినబడుచుండెను. వారిట్లు మాటలాడు కొనుచుండిరి;

'దొంగ రాముడు కావలెననండి' అనినాడు. హనుమంతాచార్యులు.

'కాదండి, మొన్న రెడ్డి యింటిలో ప్రవేశించిన వాడు కావలెను'

'మీకు వెర్రి మీరు చెప్పేవాడు వంట యింటిలోని వస్తువులు దొంగలించు వాడు కాడు. ఇనుప పెట్టెలతీయ బుద్ధిమంతుడండీ?

'ఉండిననుండవచ్చును. వాని విషయమై కథలు చాలా చెప్పుదురు'...

'రాముడు తప్ప యింకెవ్వరును కారు'.

'లోనికి పోదము రండు, పోయి చూచిన తెలిసిపోవును.'

వీరి మాటలు వినుచుండిన మా యత్తగారు 'మీ యిద్దరి చేతనగునా!' అన్నది.

'తాతా! మామను పిలుచుకొని వత్తునా!' అన్నది రాధ

ఎందుకులే, నిద్రపోవు చుండును లేపవద్దు.' అని మామ చెప్పెను.

నేను వారు వచ్చు చప్పుడు విని యొక మూల నొదిగి కూర్చుంటిని. తలుపు 'కిర్' అన్నది.

మామ చేతనొక లాటీని పట్టుకొని లోపలికి వచ్చెను. అతని వెంట గుదియను భుజము మీద పెట్టుకొని, గడ గడ వడకుచు హనుమంతాచార్యులు కనబడెను. కొంతవడి కతడు 'మీ.... అల్లు..... దండి! చూడండి!.....' అనెను.

కొంత కాలము మామ చక్కగా చూచి 'పొరబాటయినది. ఎంత.....' అనుచుండగనే లాటీను నేలమీద పడినది. అంతలోనే నా యత్త, రాధ, కుముద వచ్చిరి. 'మామయ్య!' అనుచు రాధ నాకడకొక్క పరుగున వచ్చినది. కుముద కూడ వచ్చినది!

అప్పటి మాస్థితి – వారిది కానీ, నాది కానీ చెప్పలేను !

**– 8 జూన్, 1935, సాధన పత్రిక**

*(పి.యస్. ఆచార్య అను పేరుగల పాళ్లూరు సుబ్బణాచార్యులు మడకశిర తాలూకా హరేసముద్రం గ్రామంలో జన్మించారు. ఆంధ్రపత్రిక, హిందూపత్రిక, ప్రజావాణి పత్రికలలో పాత్రికేయులుగా పనిచేశారు. పద్యకావ్యాలను, కథలను రాశాడు. 1930లో అనంతపురము నందు 'కవికుమార సమితి' స్థాపక సభ్యులలో ఒకరుగా ఉన్నాడు. 'కథాగుచ్ఛం' అనే కథల సంపుటినో లేక సంకలనమో ప్రచురించినట్లు ఇతర ఆధారాల వలన తెలుస్తోంది.)*

## గెలుపెవరిది

**– ప్రభాకరుడు**

రుక్మిణి : చంద్రికా నీవు వట్టి అమాయికురాలివి;

చంద్రిక : ఏల అనుమానించుచున్నారు. చెప్పదలచుకొన్నదంతయు చెప్పండి.

రుక్మిణి : నీవు వేరుగదలంతువేమొ?

చంద్రిక : మీకు ఏ కొరతయు వద్దు. ఒక నొప్పి, ఒక కష్టము అయితే విచారముగాని అజన్మాంతము కష్టమునే అడిగివచ్చిన నాకు ఇది ఒక గొప్పయా? నిండా మునిగినవారికి చలేమి, గాలేమి?

రుక్మిణి : నీవు లోకము తీరు గుర్తెరుంగవు. తెల్లనివెల్ల పాలు, నల్లనివెల్ల నీరని తలంచెదవు

చంద్రిక : మనసున కళంకములేనవుడేమి దిగులు?

రుక్మిణి : అట్లుకాదు. నీవు శేఖరునితో చనవిచ్చి మాటలాడుటను జూచి లోకము అపార్థము చేయవచ్చును గదా?

చంద్రిక : లోకము అపార్థము చేయుటకు నేను బాధ్యురాలనా?

రుక్మిణి : నీవు శేఖరునితో మాటలాడకయున్న... అతనిని ఇంటికి రానీయకున్న

చంద్రిక : అన్నతో చెల్లెలు మాటలాడగూడదా ? సోదరుని ఇంటికి రానీయకూడదా?

రుక్మిణి : ఇప్పటి కాలముతీరు వేరు సుమా?

చంద్రిక : కాలముతీరు వేరేమి? సూర్యోదయము పశ్చిమమున, అస్తమయము తూర్పున నగుచున్నదా! కాలములో మార్పులేదు గాని మనలో భావదాస్యము హెచ్చుయినది అంతియే.

రుక్మిణి : కనుక నీవును మారుట ఆవశ్యము గదా?

చంద్రిక : మంచికా చెడ్డకా?

రుక్మిణి : మంచికే

చంద్రిక : ఇంటి కెవరైన అతిథియో, అభ్యాగతియో వచ్చిన ; పెఢల్లున తలుపుల బిగించి కిటికీల నుండి తొంగిచూడమనెదవా నన్ను?

రుక్మిణి : లోకులు కాకులను సామెత నీకు దెలియదా?

చంద్రిక : లోకమునకు నేను మూకుడు మూయగలనా?

రుక్మిణి : అందుకే నలుగురితో పాటు నారాయణ

చంద్రిక : అమ్మా మనకు వచ్చిన చేటే యిది. స్త్రీలకే గాదు పురుషులకు గూడ. భారతీయుడు భారతీయుడుగ నుండరాదు. హిందూ స్త్రీ హైందవ నారీధర్మము నవలంభింపరాదు. అన్ని దేశభాష భాషాదుల నభ్యసించి, అచ్చపు భారతీయులను అనాగరక జంతువులని నిరసించిన

గాని గౌరవము లేదని దలంచుట మన పురుషులకు సహజమైపోయినది.అందందు సుదతు లింకను ఆ వ్యామోహమునకు గురిగాక యుండిరి. నేడు మిముబోలిన వృద్ధులుగూడ అదే తీరున బోధసల్పినచో, ఇంక చెప్పవలసిన దేమున్నది? హంస నడకలు రాలేదు. కాకి నడకలు మరచిపోయినవి. 'రెంటికి జెడిన రేవణు' లైతిమి. కనుక మనకు ఎందుజూచినను దోషమే కనబడుచున్నది. నిర్మలమైన దృష్టియే లేకపోయినది.

రుక్మిణి : పెద్దదానను, చెప్పితిని, నీ యిష్టము చంద్రిక మనసు కళవళమందినది. నేను చేయుచున్నది తప్పా? శేఖరుని రావద్దని చెప్పుదునా? అతడొనరించిన తప్పేమున్నది. లోకముతీరు జూడ రుక్మిణమ్మ చెప్పినసోదె నిక్కమేయగు. ఇంటికి వచ్చినవారిని రావలదు పొమ్మని చెప్పెడు కాఠిన్యమును అలవరచుకొనుటయు నా కర్తవ్యము. ఇవ్విధమున పరిపరివి ధముల నాలోచనలలో మునింగి పోయినది చంద్రిక. యోజనాతరంగముల నల్లలాడి, తుదకు కర్తవ్యము నిశ్చయించుకొనకనె నిద్దురపోయిన చంద్రిక, వేకువనే లేచి గృహకృత్యముల నిర్వర్తింపబూనినది. వంటయిల్లు శుభ్రము చేసి మజ్జిగ జిలుగుచున్నది. తీసిన వెన్న ముద్దను నరచేత గిరగిర లాడించుచు తన పనియందే నిమగ్నమైయున్న సమయమున మన రాజశేఖరు డులోన ప్రవేశించినాడు.

రేయెల్ల జొరరాక వెలుపల రొద పెట్టుచుండిన గాడ్పులు సోరణగండ్ల నుండి యిలుసొచ్చినది చంద్రిక తెలిసికొన్నది గాని రాజశేఖరుని రాక గుర్తించ గల్గినది గాదు. వచ్చినవాడు చంద్రిక మజ్జిగ జిలుకుట జూచి విస్మయమొంది, 'నవనాగరక యువతి గూడ'... అని మనమున దలపోసి, తటుక్కున జేబులో నుండి ఒక పట్టు వలువను చంద్రిక వంక విసరి వాకిటికడ నిలువబడి 'నీకే' అన్నాడు. చంద్రిక తొలుదొలుత ఆదరిపడినది. 'వెన్నవలె కరంగు నలివేణి' యగుట వెన్నను జారవిడుచుటకు ఆమె మన సొప్పినది కాదు. గాలి కెగురుచున్న ముంగురుల చీకాకు నొకింత సవరించుకొని, రాజశేఖరుని కర్థముగాని చూపులతో 'వద్దు' అని ఆ వలువను ఆవల ద్రోచినది.

కళకళలాడుచుండిన రాజశేఖరుని మనసు చిన్నపోయెను. "ఏల వద్దు?' అన్నాడు. 'ఎందుకయిన నేమి, నాకువద్దు' అన్నది చంద్రిక.

రాజశేఖరుడు : 'నీకయి దెచ్చినది' వద్దన్న నీ యిష్టము.

చంద్రిక : 'మీ యిష్టము' మీరు దెచ్చినది.

రాజ : అంతేనా?

చంద్రిక : అంతే.

రాజ : ఎవరికయి యుద్దేశింపబడినదో వారు నిరాకరించినది పరులకు చెందరాదు. అన్నిటిని జీర్ణించుకొనుశక్తి ఒక యజ్ఞేశ్వరునకే గలదు' 'అని ఆపట్టు దువ్వలువను మండుచున్న పోయి వద్దకు విసరుటకు చేయెత్తినాడు. అంతలో చంద్రిక దానిని నాచికొని 'ఇంత మొండిపట్టా' అన్నది. కాని చంద్రిక మోమున సహజ ప్రసన్నత రాజశేఖరునికి గోచరింపలేదు. హృదయవీధి

నుండి ఎగిరి వచ్చుచున్న భావజలద శకలములు ఆ సుందరి ప్రసన్నతను కంటగించినవి. రాజశేఖరుడు గూడ అచ్చట నిలువక తక్షణమే నిష్క్రమించినాడు. 'ఎందుకింత వెలగల పట్టుదుకూలమును రాజశేఖరుడు దెచ్చినది' నీకని యనియెనే 'ఏమి కారణము?' అని చంద్రిక తెలియమి చీకటిలో విలీనమయి పోయినది. రాజశేఖరుడు: ఎందుకింత పట్టుదలతో నిరాకరించినది? ఎన్నడు వద్దన్నది కాదే' అని యతడు యోచనలో మునిగిపోయినాడు.

ఆ సమయమునకింకను కొంత ప్రొద్దున్నది. సుదతులు సింగారించి కొను సమయము. చంద్రిక నాడు జడనల్లుకొన్నది గాదు. పూలసరము చంద్రరేఖవలె కొప్పున కమర్చినది. రోజాపువ్వు నొక దానిని చేతబట్టి దానిని ఎచ్చొట సవరింపవలెనో దోచక అద్దము ముంగిట నిలువబడి యున్నది. ఇంతలో శేఖరుడు వచ్చి కూర్చొన్నాడు. చంద్రిక గిరుక్కున వెనుకకు మరలి ఆ పువ్వును నిలుచున్న చోటనే జారవిడచి లోనికరిగినది. శేఖరుని మనసు చిన్నపోయియుండుట చంద్రిక గ్రహించినది. ఎంత మృదుమానసయో చంద్రిక కన్నులశ్రు పూరితములయినవి. 'పట్టుగుడ్డ నేలదెచ్చితిరి.'

రాజ : నాకు తేవలెనని బుద్ధిపుట్టినది.

చంద్రిక : ఎందుకు? ఏమి కారణము ?

రాజ : సూర్యుని కిరణాలు ప్రసరించనంతనే, మూతి బిగించి కొన్న మొగ్గలేల రేకుల విచ్చిపూచుట ? ఏ కారణమో ఎవరు చెప్పగలరు?

చంద్రిక : ఎందుకు దెచ్చితిరనియే నా ప్రశ్న.

రాజ : అన్న చెలియలి ముద్దుదీర్ప, ఏమయిన గొనితెచ్చుటకేల యింత విమర్శ.

ఆ పలుకులు వీనుల సోకినంతనే మానసోదధియుప్పొంగినది. విచ్చిన పూవురేకుల కొనల నుండి సూర్యకిరణస్పర్శమున కరగి నేలకు దిగజారు పరిమళ మిళిత హిమబిందు హారావళికరణి చంద్రిక కన్నుకెలంకుల నుండి జారదొడగెను. ఏమియో పల్క సాహసించినది కాని చంద్రికకు కుతుకపట్టినది. మాట వెలికిరాలేదు. తుట్టతుదకు 'ఈ యభాగ్యురాలి కంతటి భాగ్యమా' నేనంతటి సుఖమున కడిగివచ్చినదానను గాను. ఆ నోమునోచని కష్టజన్మ నాది. లేకున్న నేనొక్కతెను నా తల్లిదండ్రులకు బరువైతినా? తవుడిచ్చి కొన్న పిల్ల యిదియని నా చిన్నతనాన ఎక్కసక్కెము లాడుచుండినమాట నా బ్రతుకున నిక్కమైనది సుమా !' అని శోకపరికంపిత స్వరమునబల్కి తలవంచుకొని గూర్చున్నది. శేఖరుడు 'నా బ్రతుకును నంతియే! కాని ఏడ్చిన దీరునా?' అని బదులు పల్కినాడు. చంద్రిక ఏడ్పు చాలించి పైట చెరుగుతో మోము దుడిచికొన్నది.

నన్ను కారణమడిగిన దెందుకు అని శేఖరుడు మరల ప్రశ్నించినాడు. కాని చంద్రిక జవాబు చెప్పలేదు. మరల అడిగినాడు. చంద్రిక సిగ్గున తలవంచుకొని 'ఏమీ లేదు. ఓటమి నొప్పుకొన్న నన్ను దెప్పిపొడుచుట ధర్మము కాదు గెలుపుమీదే' అన్నది.

రాజ : నా గెలుపేమి, నీ ఓటమి ఏమి?

చంద్రిక : చంద్రుని నెత్తిపయి ధరించి మోయుట వలన నేనె ఓడినదానను గదా!

రాజ : నాకంత కర్థము తెలియదు. ఇప్పటి లోకము జాడ చూచి పొరపడితిని.

చంద్రిక : అంతయు నా నోరార ఒప్పింపవలెనని మీ పట్టింపా ? నేనొక అడవిపువ్వను. వనము నందు జీర్ణభావంబుగనుటే నా బ్రదుకు రేకుల సౌకుమార్యము దొరగి, సుడిగాలి కసరుల సుడిసిన నన్ను మీరింకను స్రుక్కింప దలంచుట నా దురదృష్టము.

మరల చంద్రిక కన్నుల నిండ తెరలు గ్రమ్ముచుండినవి శేఖరుడు జూచి 'నీకంత నొప్పి గలిగినచో నిన్ను మరలా విషయమును గురించి ప్రశ్నింపనులే' అని ఊరడ బల్కినాడు. నీలవారాశి తరగల దేలియాడు రాయంచవోలె, చంద్రిక మనసు ఎక్కడికో బోయినది. శేఖరుని మాటకు బదులు పల్కలేదు. ఆ నవ్వు శేఖరుని కర్థము కాలేదు. దిక్కుల జూచుచు లేచి నిలువబడినాడు.

చంద్రిక : "భయపడ నక్కరలేదు, ఏదో ఒక కథ జ్ఞప్తికివచ్చి నవ్వితిని '

శేఖరుడు : నేను వినవచ్చునా ఆ కథను.

చంద్రిక : నాబ్రదుకు కతలోనది ఒక తరంగ కిశోరము.

రాజ : కథ అంతయు వినవలెననియే ఉవ్విళ్ళూరుచున్నాను.

చంద్రిక : ఎంత చెప్పినను దీరనిది నా కథ

రాజ : ఎంత వరకయిన అంత వినవచ్చును.

చంద్రిక : మీరు 'అన్నా చెల్లెలు' అన్న కథ. జ్ఞప్తికివచ్చి నవ్వితిని అంతె. "అతడు తుంటరి. సుందరి యని పేరుగల సుదతి అతని నేస్తకత్తె. ఆ సుందరికి ఒక కుమార్తె. ఎవడో ఒకడు (ఆయూరికి గ్రొత్త) సుందరి యింట తన వస్తువులుంచి పని దీరినంతనే గొని పోయెద"నని సుందరి తనయ సరోజినిని అడిగినాడు. సరోజిని తొమ్మిది పదేడుల కన్నె. సరోజిని "మా యింట నీకేమి పని. రావలదు పో. అని కసరిపొమ్మన్నది ఆ పాంథుని. అతడు కానీ అని వెడిలిపోయినాడు. నాలుగేడులు గడచిన పిదప సరోజినిని ఆ పాంథునికే యిచ్చి పెండ్లిచేసిరి. పెండ్లిలో "నీవెకదా నన్ను నాడు రావలదుపో అనినది" అని సరోజినిని ఎత్తిపొడుపు మాటల గేలిసేయుచుండెను. సరోజిని "అందులకు మీరే గెలిచితిరిలే" అని మారు బల్కుచుండినది. ఆ కథ జ్ఞప్తికివచ్చి నవ్వితిని అన్నది.

రేపటి దినము కథ పూర్తి చేయవలయు సుమా అని శేఖరుడు వెడలిపోయెను. చంద్రికయు చిరునవ్వొలయు చూపుల "కానీ"అని తల యూచినది. శేఖరుడు వెలికివచ్చి చంద్రిక చెప్పిన కథను పునశ్చరణ చేయుచు "మీరే గెల్చితిరి" అను పదములకు అర్థము నరయ లేక ఆందోళనములో మునిగిపోయినాడు. "చంద్రికను నేను గెల్చితినా? చంద్రిక నన్ను గెల్చినదా!" కాని అనుచు కన్నులు మూసికొన్నాడు గాని చంద్రిక యతని దృష్టికి మరుగయినది కాదు. గెలుపెవరిది ?

**– సాధన పత్రిక, 22 జూన్, 1935**

*(మారుపేరున గల ఈ కథకుడి వివరాలు తెలియటం లేదు)*

# సుశీలా మోహనులు

**– యె.యల్. నరసింహారావు**

**ఆ**నాడు పూర్ణిమ. శీతకిరణుడు షోడశకళాపరిపూర్ణుండై గగన భాగమున రాజిల్లు చుండెను. ప్రపంచమంతయు వెండిపూత పూసినట్లుండెను. ప్రకృతి పురుషుడు నిశ్శబ్దముగ నుండి, గగన భాగము నిర్మలమై చంద్రకళావసంతమై రాజిల్లుచుండె. అట్టి సమయమున సౌధోపరిభాగమున నొక సోఫాపై గూర్చుండి సుశీల హేమలతతో తన విద్యాభ్యాసమును గూర్చి యిట్లు ముచ్చటింపదొడగెను.

"హేమలతా ! నేను బి.యే. పరీక్ష అయినట్లు నేడు వుత్తరం వచ్చిన సంగతి నీవు వినియున్నావా!'

'బంగారమ్మ గారు చెప్పగావిన్నాను. నీయదృష్టము పండినది. మీనాన్న గారి కోరిక ఫలించినది. నేటి ఆయన సంతోషమునకు మేరయున్నదా! చెలీ! నీకు సర్టిఫికెట్టు యెప్పుడు వచ్చును?'

'ఇక రెండు మాసములలో వచ్చును'.

'నేను గూడ చదువుకొనిన యెంతయో బాగుండెడిది. నా దురదృష్టము యిట్లుండ నన్నెవ్వరు చదివించెదరు?'

'బి.యే. పరీక్ష అయిన మాత్రమున నేమి ప్రయోజనమే! నీవు బి.యే. చదువ కపోయినను తెలివితేటలలోగాని, ఆలోచనలోగాని, నీకు సాటియెవరు? నీ భర్తసహితము నీతో ఆలోచింపక యేపనియు చేయరుగదా! నీ వంటి చతురమతి బి.యే. చదువకపో యిననేమి! నీ అదృష్టమున నీకోర్కె ఫలించినది.'

'కోర్కెలకేమి' అని మన ప్రయత్నమున నెరవేరునవి దానికంత కష్టములేదు. స్త్రీకి విద్యయున్ననే గౌరవము.

"హేమలతా! స్త్రీలకు యెంత విద్య యున్ననేమి? సత్సాంగత్యమున్ననే గదా బంగారమునకు తావియబ్బినట్లు శోభిల్లుట. అది పూర్వజన్మ సుకృత పరిపాకమున లభింప వలసినదియే గాని మానవ ప్రయత్నమెంత చేసినను విఫలమనియే తోచుచున్నది. ఏమి జరుగనున్నది తెలియకున్నది. నా హృదయ పరితాపమునకు మితిలేకున్నది.'

'నీవు విచారపడవద్దు. నీవనుకొన్న ప్రకారమే జరుగును. మొన్న విశ్వాసరావుగారికి కుమారునివద్ద నుంచి వుత్తరం వచ్చినదట. అతడు కులాసాగా వున్నాడనియు, కొలది దినములలోనే తిరిగి వచ్చుననియు చెప్పిరి.'

ఇట్లు వారిరువురు సంభాషించుకొనుచుండగా బంగారమ్మగారు రాగా ఆమెతో కలసి లోనికివెళ్లిరి.

విశ్వాసరావుగారు మంచి కుటుంబమునకు చెందినవారు. ఈతనికి తన పుత్రుడైన

మోహనరావును యింగ్లాండునకు పంపి ఐ.సి.యస్. చదివించవలెనని కోరికగలవాడై తనకు చాలినంత స్థితిలేకపోయినను అప్పుచేసియైనను చదివించదలచెను.

మోహనుడు యింగ్లాండు వెళ్లినది మొదలు విశ్వాసరావుగారు అప్పులు చేయ వలసి వచ్చెను. క్రమముగా అబ్బాయి చదువుకు అప్పు హెచ్చెను. ఉన్న ఆస్థి అంతయు అప్పులపాలై బీదవాడై మోహనుని చదువు పూర్తిచేయుటకు సహితము డబ్బు పంపలేని స్థితికి వచ్చెను. అప్పు ఇచ్చువారు లేకుండిరి. మోహనుడు తనకు వేయిరూపాయలు కావలెనని వ్రాసెను. కుమారుడు ఐ.సి.యస్. పరీక్ష అయిన పిదప మంచి యుద్యోగము చేసి ధనార్జన చేయగలడనియు అపుడు కుటుంబమునకు యేవిధమైన యిబ్బందియు వుండదనియు, కొలది కాలములోనే కష్టములీడేరుననియు విశ్వాసరావు తలచుచుండెను. కాని యిప్పుడు కుమారునికి పంపుటకు వేయిరూప్యములు అప్పుయిచ్చువారు లేకుండిరి. ఎరిగినవారిని, యెరుగనివారిని గూడ అడుగుచుండెను. ఈయనకు ఆస్తిలేకపోవుటచేత అప్పు యిచ్చుటకు యెవరును సాహసింపరైరి. ఎటకేలకు యొక దయాపరుడు విశ్వాసరావుగారి చిక్కులను తెలిసికొని యాతని కుటుంబ గౌరవమును తెలిసికొనిన వాడగుటచేత ఆరువందల రూప్య ములు మాత్రము తాను సహాయముచేయుదునని వాగ్దానము చేసి పిదప పైకమునిచ్చెను. కాని యింకా నాలుగువందలు కావలసియుండెను.

విశ్వాసరావు గారి బావమరిది శ్యామలరావు ధనికుడు. మంచి వుద్యోగములో నున్నాడు. శ్యామలరావుగారు విశ్వాసరావునకు సహాయము చేయదలచినను భార్య బంగారమ్మగారు చేయనివ్వదు. విశ్వాసరావుగారు కుమారునికి పంపుటకు డబ్బు లేక యిబ్బంది పడుచున్నారని విని శ్యామలరావుగారు కొంత ధనసహాయము చేసి వశపరచుకొని మోహనుడు ఐ.సి.యస్.ప్యాసు అయిన తరువాత తన కూతురునిచ్చి వివాహము చేయవచ్చు ననియు, లేకున్న తరువాత మోహనుడు వివాహముచేసికొనడనియు, బంగారమ్మతో మెల్లగా ప్రస్తావించెను. అందుకు మన అమ్మాయికి ఆ దిక్కుమాలిన సంబంధం వద్దనియు యింత మాత్రపు సంబంధము దొరకకపోదనియు, అమ్మాయి బి.యే. కృతార్థురాలగుటచేత అన్ని విధముల బాగున్నవారు, స్థితివంతులు విద్యావంతులు లభింతురని చెప్పుచు తనకు ఆడబిడ్డ మీద వున్న యీర్ష్యనంతయు వెళ్ళబుచ్చినది బంగారమ్మ.

'నీకింత యీర్ష్యయెందుకే వారియెడల! కాలము తప్పివచ్చుటచేత బీదవారైనారు గాని కులగోత్రములకెక్కడనైనా లోటుగలదా? మోహనుడు సుందరుడు గదా! విద్యలో లోటులేదు.'

'మీరెపుడు మీ చెల్లెలి పక్షము మాట్లాడుటేగాని న్యాయమాలోచించేవారు కారు. ఆ సంబంధము వలన మన అమ్మాయికి సుఖములేదు. మేనత్తకు కోడలకు చిన్నప్పటి నుంచి యెడముఖము పెడముఖముగావున్నదే గాని యొకనాడైన మేనగోడలియందు రవ్వంత ప్రేమైనా వున్నదా?' అన్నది బంగారమ్మ.

'నీ మాటలకేమిలే! చారుమతికి సుశీలయన్న నీకంటే యెక్కువ ప్రేమ. వారిద్దరు

అత్తకోడండ్రేరేని వారి కుటుంబగౌరవమునకు మేరయుండునా ! సుశీల మోహనుని ప్రేమించి యున్నది. వానిని గాక మరియొకరిని చేసికొనదు. ఇందు నీమాట జరుగదు.'

'మీ రట్లందురని అనుకొనుచునే యున్నాను. సుశీల నామాటకు అడుగుదాటదు. అది మోహనుని చేసికొనదు'

'అమ్మాయికి నీవు చెప్పనవసరంలేదు. అది విద్యావంతురాలు దానికి యిష్టమైన వానినే చేసుకొనును, కాని ఇపుడు మోహనునికి పైకము కావలసి బావగారు చాలా కష్టప డుచున్నారు. ఈ సమయమున మనము కొంత సహాయము చేయవలసియున్నది.'

'మేనల్లుడుగదా అని ఉన్నదంతయు దోచిపెట్టండి. తరువాత మనలను యెవరును దగ్గరకు చేరనివ్వరు.'

శ్యామలరావు బంగారమ్మమాటకు అడుగుదాటలేని వాడగుటచేత వచ్చుచున్న కోపమును లోనడచుకొని 'ఉపకార శూన్యురాలవు' అనుచు అచట నుండి వెడలిపోయెను.

మెల్లని పిల్లవాయువులు వీచుచుండ, నవవికసిత పరిమళ పుష్పగుచ్ఛ జాలములు వనమంతయు మనోహరము గొల్ప చంద్రకాంత శిలావేదిపై కూర్చుండి మోహన మోహతప్త హృదయయై యాతని రాకకై నిరీక్షించుచు, మామగారు పడుపలుబాముల విచారించుచు సుశీల హేమలతతో యిట్లు సంభాసించుచుండె. 'హేమలతా! మామగారు యింగ్లాడుకు పంపుటకు డబ్బులేక యిబ్బందిపడుచున్నారు. కుమారునిపై ఆశపెట్టుకొని మా మేనమత్తగారు వస్తువులన్నియు లోగడనే విక్రయించినారు. ఇపుడు యింకా వేయి రూపాయలు కావలసి యున్నవట ఎవరినడిగినను అప్పు యివ్వలేదట. ఈ సమయములో మానాన్నగారు కొంత సహాయము చేసిన బాగుండును. నేను మా నాన్నగారితో చెప్పుటకు సిగ్గుగా ఉన్నది. సిగ్గువిడచి చెప్పినయేమందురో ఏమియును తోచకున్నది. నీవుయేలాగైనా మా నాన్నగారితో చెప్పియిప్పింపగలవా?'

'నెచ్చలీ! మీ నాన్నగారు మేనల్లునికి సహాయము చేయవలెనను తలంపుగలవారై మీయమ్మతో సంప్రదింపగా ఆమె నిరాకరించుటయేగాక మీ మేనత్త పైగల యీర్ష్య వెళ్లబుచ్చినది.'

'నీకా విషయమెట్లు తెలియును'

'మొన్న మధ్యాహ్నము యింటిలో బంగారమ్మగారితో సంప్రతించుచుండగ నేను చాటున నుండి అంతయు వింటిని. మీ నాన్న గారు విశ్వాసరావుగారికి సహాయముచేసిన మోహనునకు నిన్ను వివాహము చేసికొనుట కంగీకరించునని చెప్పగా,' మీ అమ్మ 'ఆ దిక్కుమాలిన సంబంధము వద్ద'ని పట్టుబట్టినది. అంత ఆయన చింతాకులుడై యటనుంచి వెడలిపోయెను.

'హేమలతా! యీ సందర్భమున యెటులైనను మామయ్యగారికి కొంత సహా యము చేయవలెను. ఇందులకు నాకొక యుపాయము తోచుచున్నది. నీవు సహాయపడిన యీపని

నెరవేరగలదు. రేపు వుదయము సదానందుడు మాకు అయిదువేల రూప్యములు యిచ్చువాయిదాగలదు, మానాన్నగారు ఆపైకము నాచేతికిచ్చును. అందు వేయి రూపాయలు నీకుఇచ్చెదను. నీవు వానిని మా మేనత్తకు యిచ్చి నేను పంపినట్లును సందేహింపక తీసుకొన వలసినదిగాను చెప్పుము అని యిరువురు నాలోచించుచుకొనిరి. మరునాడు వాయిదా ప్రకారం సదానందుడు యిచ్చిన పైకమును వాకిటనుండియే శ్యామలరావుగారు సుశీలను బిలచి ఆమెచేతికిచ్చి భద్రపరుపుమని చెప్పెను. సుశీల అందు వేయి రూపాయలు రహస్య ముగా హేమలతకిచ్చి పంపి మిగతా పైకమును ఇనుపపెట్టెలో దాచెను.

సాయంకాలము శ్యామలరావుగారు పైకము కావలసిపెట్టెతీయగా అందు నాలుగువేల రూపాయలు మాత్రమే యుండెను. సుశీల తక్కిన వేయితీసికొనియుండునని శ్యామలరావుగారు తలచిరి. కాని యెన్నడు నొక కాసైనతీసియెరుగని దగుటచేత అనుమాన మున కవకాశము లేకపోయెను. శ్యామలరావు భార్యకు జవదాటనివాడైనను ఉదార స్వభావుడు. దీర్ఘాలోచనాపరుడు. సుశీల హృదయము బాగుగా తెలిసికొని వాడగుట చేత యీ పైకము నామె మేనత్తకు పంపి యుండునని గ్రహించి తన కుమార్తె చేసినపనికిలోన సంతసించెను గాని ఆ విషయము భార్యకు దెలుపలేదు.

మోహనుడు బయలుదేరివచ్చుచున్నట్లు వుత్తరం వచ్చినది. కుమారుడు వచ్చుచు న్నాడని తల్లిదండ్రులు పరమానందమున నోలలాడుచుండిరి. అట్టి ఆనందములో సుశీల తల్లిదండ్రులకు తెలియకుండా యింత మొత్తము యెట్లు పంపెనో యిందులకు కారణమేమై యుండునాయని రాత్రి భోజనము చేసిన పిదప వెన్నెలలో గూర్చుండి చారుమతి, విశ్వాస రావుగార్లు యోచించుచుండిరి. అట్టి సమయములో తలవాకిట తలుపుచప్పుడు కావచ్చినది. వెంటనే చారుమతి లేచివెళ్లి తలుపుతీసి చూడగా వాకిటనొక బండినిలచియున్నది. అందు నుండి నొక వ్యక్తిదిగి తటాలునలోనికి వచ్చినది. వచ్చిన వ్యక్తిని చారుమతి అనవాలుపట్టలేదు గానియెవరో భర్తకొరకై వచ్చినారని తలచి తలుపుమూసిలోనికి వెళ్లెను. లోపలకు వెళ్లుసరికి దీపము కడనొక దివ్యసుందర విగ్రహమును చూచి ఆశ్చర్యపడి 'సుశీలా! నీవటే! ఎవరో అనుకున్నాను. ఇంత అర్ధరాత్రమున వచ్చితివి?' అనెను.

'ఇపుడు అర్ధరాత్రమా!!'యని చలోక్తిగా పలికినది సుశీల.

చారుమతి సుశీలను గూర్చుండ నియోగించి యోగక్షేమములు విచారించెను. మోహనునిరాక, సుశీల, చారుమతి, విశ్వాసరావుల ఆనందాబ్ధినోలలాడించినది. సుశీల మోహనుడు వచ్చువరకు మేనత్తగారింట నుండ నిశ్చయించుకొన్నది.

మోహనుడు పరీక్షలో కృతార్థుడై వూరిలోనికి వచ్చినట్లు శ్యామలరావు భార్యయు విన్నారు. మేనల్లుని చూడదలచి శ్యామలరావు భార్యను రమ్మనగా ఆమె నిరాకరించుటచేత ఆయన వెళ్ళి చెల్లెలను, మేనల్లుని, కూతురిని చూచి యాదినమంతయు వారితో నచ్చటనే గడపెను. అపుడు శ్యామలరావు విశ్వాసరావుతో కుమారుని వివాహమును గూర్చి యడుగగా నాయన

అంగీకరించెను. పిదప బంగారమ్మ తన కిష్టములేకున్నను, సుశీల మోహనుని తప్ప యితరుని చేసికొనదని తెలిసినదగుటచేత విధిలేక ఒప్పుకొన్నది. అంతనొక శుభ ముహూర్తమున సుశీలా మోహనుల కళ్యాణము మహావైభముగా జరిగె. సుశీలా మోహనులు చిరకాలము మహాసౌఖ్యము నొందిరి.

**– 25 జనవరి, 1936, సాధన పత్రిక**

*(కథకుడి వివరాలు తెలియవు)*

# ప్రేమ బలి

**– కథకుడి పేరులేదు**

**1**

**'రాం**డి, ఇక్కడ, ఎక్కడనో వెళ్ళుచున్నారే, దయచేయండి.'

నాకు ఈ ధ్వని మొదట అపరిచితముగా నుండినది. తర్వాత ఎక్కడనో విన్నదిగానే తోచినది. తల ఎత్తి చూచితిని.

పిలిచినవాడు నాకు పరిచుతుడే. కాని వేషభాషణములలో కొంత క్రొత్తదనము కనుపించుచుండెను. నేనతనిని చూచి మూడేండ్లు పైబడినది.

'ఓహెూ, ఎన్నాళ్ళకు దర్శనము,' అంటూ నేను వాకిలి మెటికలు ఎక్కితిని,

ఒక చిన్నహాలు, గోడలకు వివిధ చిత్రపటములు, ఒక ఆల్మైరాలో పుస్తకములు, ఒక అరుగు మీద గౌచనవేసిన వీణె. ప్రక్కన సగము తెరచిన ఒక కేసులో పిటీల అగుపిం చుచున్నది. కిటీకీలకు చీటీపరదాలున్నవి. ఇనుప కుర్చీలకు తెల్లని తొడుగులు, మెత్తని దిండ్లు అమర్చబడినవి.

'కూర్చొనండి' అని మిత్రుడు నన్ను సాదరముగా ఒక కుర్చీ వైపు జూపెను. కూర్చుంటిని.

ఇంటిలోని రచనా విధానముగాక నా మిత్రుని వేషముగూడ నాకాశ్చర్యము గొల్పినది. తలలోనీ సన్ననిజుట్టు మాయమై క్రాపులోని వంకర వెంట్రుకలు చిఱుగాలికి మొగము మీద నాట్యముచేయుచున్నవి. మోచేతులపైకి రెట్టలుగల సన్నని సిల్కుషర్టు ధరించుకొ న్నాడతడు. తెల్లని బొంబాయి వలిపెము దోవతి కట్టుకొన్నాడు. కండ్లకు నల్లని ఫ్రేములో తెల్లనిస్ఫటిక సులోచనములు మెఱయుచున్నవి. ముత్యములబోలు పలువరుస అంతకంటెను తెల్లని కాంతుల ప్రసరించుచున్నవి. ఇంకను క్రొత్తగా కట్టించుకొన్న దంతములు కావున మాటలను నోట స్ఫుటముగా రానిచ్చుటలేదు. వెంట్రుకలు ఫౌంటన్‌పేనా మసివంటి నల్లనికా ంతులీనుచున్నవి.

నా యాశ్చర్యమునకు మేరలేదు. నా నోటమాటరాలేదు. మూడేండ్లలో నెంతమార్పు యాభై సంవత్సరముల నామిత్రుడు ముప్పైయేండ్ల యువకునివలె కాన్పించెను.

'తమ కీయూర నుద్యోగమైనదా' యంటిని.

'ఔను స్కూలులో మ్యూసిక్ మాస్టరును' అనెను.

'ఏ స్కూలులో, ఎంత జీతము' అని నేను ప్రశ్నింపలేదు.

'కొంచెము లైట్ టీ పుచ్చుకొందురా' అని మిత్రుడు కోరెను.

ఆ మాట నయగారితనము, నాగరకము వింతగొల్పినది. ప్రక్కన చిన్న స్టూలు పీటమీద తొండపు గాజుకూజాతో పొగరేగుచున్న తేనీటిని నేను గమనించలేదు.

'వలదు, నా కుదయమున టీ త్రాగు అభ్యాసములేదు' అంటూ పైకి లేచితిని.

'అప్పుడే వెళ్లెదరా' అనుచు అతడుగూడ లేచెను.

'ఔను, నాకు పనియున్నది మరల కలిసికొందుననుచు నేను పయనమైతిని.

మిత్రుడు తన కుడిచేతిని జాచి షేక్‌హ్యాండ్‌ను నిచ్చి నన్ను సాగనంపెను.

వెలుపలికివచ్చి బయటపడిన చెప్పులను దొడగికొనుటకు వెనుకకు తిరిగితిని. ప్రక్కన తలుపునకు చేరికగా ఇత్తడి ఇంగ్లీషు అక్షరములలో 'శ్రీరాములు నాయుడు గారు ఉన్నారు' అను నర్థముగల పదములు గల ఒక చట్టము గోడకు తగిలింపబడినది. నేనేమియు మాటాడక కదలివచ్చితిని.

... ... ...

బుక్కపట్టణమున రాముడు అన్నదమ్ములతో కలిసి సేద్యము చేయుచుండెను. చిన్నప్పుడు ప్రాథమిక పాఠశాలలో చదివి ఆదిపర్వము, గజేంద్ర మోక్షము ఇంచుక శయ్యగా చదువునేర్చినవాడు. పెద్దవాడైన తర్వాత గూడ నతడు దానిని మరచిపోక అప్పుడప్పుడు చదువు నలవాటు వృద్ధిచేసికొనెను. సేద్యము పనులాతనికి ఇష్టము కాదు. కాని అన్నల నిర్బంధముతో పొలమునకు పోవుచుండినాడు. ఒకటి రెండు సారులు దండనము సహించక పెనుగొండకు చెప్పకుండవెళ్ళి వారి బంధువులింట నుండగా అన్నగారు వెదకి పిలుచు కొనివచ్చిరి. మరల ఇల్లువిడిచి పోకుండుటకు వారాతనికి మేనమామ కూతురినిదెచ్చి వివాహము చేసిరి. సుబ్బమ్మ చాల వినయ విధేయతలు గలది. పనిపాటలలో బావలకు మెప్పు ధాన్యము విసరుట, దంచుట, గడ్డికోయుట, కలుపుదీయుట, వండుట ఇట్టి పనుల కామెకు చెప్పి మరి ఇతరులకు జెప్పపనిలేదు. ఆమె ధృఢాంగి, నిరోగి, పూర్వాచారపరురాలు.

పదేండ్లుగా చెఱువు నిండలేదు. సాతరలు వట్టిపోయినవి. పశువులు చావగా మిగిలినవి దట్టములైనవి. జనులకు బ్రదుకుదెఱువు లేదు. రాముడు తన భార్యతోవచ్చి అనంతపురము చేరెను. అర్థరూపాయ బాడుగచేసి ఒక చిన్నఇంటిని జేరుకొని ఆ దంపతులు జీవయాత్ర సాగింపదలచిరి. సుబ్బమ్మ మరునాటి నుండియే కూలి సంపాదించెను. దినము సేరుబియ్యమో, రెండణాల కూలియో తెచ్చుచుండెను.రామయ్యకు మాత్రమేమి పనిచేయుట కును తోచలేదు. కూలినాలిచేయుట అతనికి సరిపడలేదు.బజారులో భజన మందిర మొకటి యుండినది. ఒకనాడు రాముడాదారిని బోవుచు కొంతసేపు దానిలో గూర్చెనెను. కొందరు పాడిరి, కొందరు పద్యములు చెప్పిరి. కాని ఎవ్వరును రక్తిగా పాడలేదు. కొందరికి శ్రుతి గలియలేదు. కొందరి గొంతు అసలే బాగులేదు. మరికొందరి నోటను సుశబ్ధములు రావు.

రెండు మూడు రోజులు రాముడా భజనమందిరమునకు వెళ్లెను. ఈతని శ్రద్ధా భక్తులు జూచి ఇతడును పాడగలడని అచటి వారికి తోచెను. పాడమని వారు ప్రార్థించిరి. రాముడు

జంకుచు పాడెను. పద్యములను మాత్రము సహజధోరణిలో చక్కగా జెప్పెను. పదిపదిహేను రోజులలో రాముడే ప్రముఖుడయ్యెను. వారు వీరు పాడినది విని, గ్రామఫోనుల రికార్డువిని రాముని సంగీతము మరింత అభివృద్ధియయ్యెను.

అప్పుడీయూర నొక నాటక కంపెనీ యుండినది. రాముడా కంపెనీ వారు ప్రాక్టిస్ చేసుకొను చుండగా ఒకనాడచ్చటికి వెళ్ళెను. భజనమందిరము మెంబరుగూడ నొకడచట నుండినాడు. కంపెనీ మేనేజరున కతడు రాముని పరిచయము కలుగజేసెను. రాముడు ఇటీవల నేర్చిన ఒక నాటకపద్యమును గ్రామఫోను ధోరణిలో చదివినాడు. ఇతని గాత్రము బాగున్నది. బుద్ధి కూడ నిశితమైనది. కావుననే సంగీత శాస్త్రములో శిక్షణము లేకున్ననూ నాటకశైలిని చక్కగా పద్యములు జదువగలిగెను. పాటగూడ పాడెను. నాటకపు సంగీతము మాష్టరు, రాముని గాత్రములను మెచ్చుకొనెను. కానిపాటలో తాళజ్ఞానము లేదనియు కొంత నేర్పించినచో రాముడు సుమారైన వేషములకు పనికి వచ్చుననియు చెప్పెను. నాటినుండి రాముడు కంపెనీ రిహార్సల్‌కు నిత్యము వెళ్లుచుండెను. హార్మోనిస్టు నాశ్రయించి కొన్ని సంగీత పాఠములను గూడ నభ్యసించుచుండెను. ఒకటి రెండేండ్లు గడచినవి.

... ... ...

ఇన్నాళ్లు సుబ్బమ్మ కూలిచేతనే ఇరువురికి జీవనము. నాగరక సంఘములో తిరుగబట్టి రాముడు జిలుగు వస్త్రములను ధరించుకొనుట నేర్చుకొనెను. అవియైనను శుభ్రముగా నుండవలెను. గుడ్డలకు సన్‌లైటు సోపు కావలసివచ్చెను. తర్వాత రామునికి మైసూరు గంధపు సబ్బులు. ఇన్నాళ్ళు రాముడు సంపాదించినది సున్న. అన్నియు సుబ్బమ్మ కూలిలోనే కొనవలెను. అసాధుశీల భర్తనేమియు అనక తాను కష్టించి కూడబెట్టి మగని సౌఖ్యమునకు సర్వమును ధారపోయుచుండెను. ఆమెకు రెండు చీరలు రెండు రెవికలు తప్ప నేమియులేవు. మెడలో నల్లపూసలు చేతులకు గుట్టూరి గాజులు, తలకు మెఱుగుపెట్టి ఎఱుగదు. కాని భర్త సోపులకు, నూనెలకు, మల్లు పంచెలకు, షర్టులకు, ముఖక్షౌరములకు కొదువలేక ఇచ్చుచుండెను.

ఒక్కొక్కనాడు రాముడు మిత్రుల ఇంటనే భుజించును. రాత్రి సరిపొద్దునకు రాడు. సుబ్బమ్మ కాచికాచి ఒక్కొక్కనాడు భుజించుట మరచి అట్లే నిదురపోవును. కంపెనీ తాడిపత్రికి, అదవానికి, గుంతకంటికి నాటకములకు వెళ్లిన దినములలో రామయ్య కంపెనీ వారితో ఆ యూర్లలో నుండును. వారే ఇతని భోజన ఫలహారము లిచ్చుచుండిరి. అందరును కాఫీ త్రాగువారే ముఖ్యపాత్రధారులు గంట గంటకు కాఫి త్రాగునలవాటు. రామయ్యకును కాఫీ త్రాగునలవాటు ప్రబలమయ్యెను. నేతిదోసెల ఫలహారము మరిగెను.

ఎడపదడప గ్రామమునకు వచ్చినప్పుడతనికి సుబ్బమ్మ కారపుపచ్చడీ, పుల్లగూరా రుచించుట లేదు. తినీ తిననట్లు వెడలిపోవుచుండెను. భోజన సమయములో రుసరుస లాడుచుండెను.

సుబ్బమ్మకు మగడు నాగరక సంఘములో తిరుగుట మొదట చాలయిష్టముగానే యుండెను గాని, రాగా రాగా ఇంటికెడమై తన వంట సరిపడకపోవుట ఆమెకు కొంత మనోవేదన కల్గించినది. ఇన్నాళ్లు భర్త తన వద్దకూర్చొని ఇల్లామల్లి సుద్దులు మాట్లాడు చుండగా ఆమె తన కష్టమును మరచి భర్త సాంగత్యమున కొంతసేపైనను హాయిగా నుండెడిది. కాని ఇప్పుడు రాముడు రామయ్య అయిన వెనుక ఆమెను మాటాడించుటయే తక్కువ. మాట్లాడినను రొసరొసలు, యజమాని పరిచారికతో మాట్లాడినట్లే, క్రమముగా అతనికి భార్యయన్న సహింపులేదు. ఆలిని భూతముగా భావించుచుండెను.

సుబ్బమ్మ చదువరిగాకపోయినను మగనిలో గలుగుచున్న ఈ భావ పరివర్తనము గమనించుచుండినది. ఆమెకిది విషాదహేతువయ్యెను. మనస్సంకట మేర్పడెను. కలహించు చునైన భర్త తనయింట నుండుటే కఱవయ్యెను. కంపెనీలో కొంత ఆదాయమువచ్చినదని రామయ్య పాలికి ఒక యాభై రూపాయలనిచ్చినాడు. రామయ్య శిల్కు షర్టులు, ఒక జత బూట్సు, ఒక రిస్టువాచి, ఒక కోటు కొన్నాడు. కాని సబ్బమ్మకు రెండు రవికె గుడ్డలైన తెచ్చినవాడు కాడు. ఆమె తేపల రవిక, చినిగిన చీర కట్టుచుండినది చూచిగూడ రామయ్యకు కరుణ కలుగలేదు. ఇన్నాళ్ళకు అతని చేతికి అబ్బినది ఈ యాభై రూపాయలు. వానితో అన్నియు తన సింగారములకే కొన్నాడుగాని భార్యమాట తలపెట్టలేదు.

సుబ్బమ్మకు మనోవేదనతోపాటు శరీరరుగ్మత ఏర్పడినది. పూర్వమువలె పనిచేయుటలేదు. కాని భర్త నొక్కమాటయైన నాడినదిగాదు. అట్లె ఎద్దువలె పనిచేయు చుండినది. చూచి సంబరపడుటకు ఆమె బిడ్డలైనలేరు. మనోవేదన కిదియొక కారణము. ఒకనాడు చిత్తడిలో ఆమెకు పడిసెము పట్టినది. జ్వరము వచ్చినది. అట్లె పనిచేసి కూలి తెచ్చినది. ఇంత అన్నము వండినది. చారు గాచినది. రామయ్య ఆనాడు టాకుటీకుగా గడియారము వంక జూచుచునేవచ్చినాడు. ఆమె వడ్డించుట కొంత ఆలస్యమైనదని కసరి నాడు. సుబ్బమ్మ అట్లె లేచి ఆయాసము కనబడనీయకుండ అన్నము వడ్డించి వేడిచారు పోసినది. రామయ్య ఒకసారి నోట పెట్టుకొన్నాడు. చారులో ఉప్పుజాస్తిగా నుండినది. పాపము పరాకున సుబ్బమ్మ రెండుసార్లు ఉప్పువేసినదేమో. రామయ్య ఆగ్రహోదగ్రుడై లేచి ఎంగిలిచేతనే చారుకుండ పైకెత్తి తెర్లుచున్న చారునంతయు సుబ్బమ్మ నెత్తినపోసి కుం డను పోయిమీద పగలగ్రుక్కి వెళ్లిపోయినాడు.

... ... ...

సుబ్బమ్మ ఒళ్లు కాలిపోయినది. బొబ్బలు లేచినవి. మూర్ఛవచ్చినది. ఆమె పడినచోట నుండి కదలలేదు. రాత్రి విపరీతముగా జ్వరము కాచినది. రాత్రి ఇంటి తలుపు నైనను అడ్డము వేసినవారు లేరు. దీపపు బుడ్డీనూనె ముగిసిపోయిన వెనుక ఏ తెల్లవారు జాముననో ఆరిపోయినది.

తెల్లవారి ఆమెతో కూలికిపోవువారు పిలువ వచ్చి ఆమె దుస్థితిచూచి భయపడిరి. ఇటునటు

కదలించి చూచిరి. నోట గంజి కాచిపోసిరి. కొంతసేపటికి చైతన్యము వచ్చెను. ఏల ఇట్లు జరిగినదని యడిగిరి. చారుకుండ పగిలి మీదపడినదని మాత్రము చెప్పెను. మగని సుద్ది అడిగిరి. ఆయన రాలేదనెను. ఏమేమో చికిత్సలు చేసిరి.

తీర ప్రాణము పోయిన వెనుక భర్త రామయ్య గారు వచ్చిరి. వీధివారలు సుబ్బమ్మ మరణమునకు దుఃఖించుచు వారే అంత్యక్రియలు జరిపిరి. దూరపు బంధువువలె రామయ్య గారు వారి వెంట జనెను. కంటకన్నీరైనను పెట్టలేదు. తన్ను పట్టిన పిశాచము వదలినట్లు అతని మనసు తేలికయైనది.

## 2

సుబ్బమ్మ మరణించిన తర్వాత రామయ్య బంధనము నుండి విముక్తియైన పక్షివలె స్వేచ్ఛావిహారి యయ్యెను. తన యోగ్యతకు, రసికతకు, నాగరకమునకు సుబ్బమ్మ తగిన భార్యగాదని అతని భావము. సుబ్బమ్మ మరణమువలన పరమేశ్వరుడు తనకు మహో పకారముచేసెనని ఎంచెను. అహోరాత్రములు నాటక సంఘములోనే యుండి అక్కడనే తిని కుడిచి నిద్రించుచుండెను. వాని కిప్పుడొక ఇల్లులేదు. అన్నగారు ఈ వార్త విని చూడ వచ్చిరిగాని ఐదు నిమిషముల కంటే ఎక్కువగా వారితో రామయ్య మాటాడలేదు. తల్లి ఒక్క సారి నిన్ను రమ్మని కోరినదని వారు చెప్పిరిగాని రామయ్య చెవిని వేసికోలేదు. వారు వచ్చిన రాత్రియే మరలిపోయిరి.

నాటక సంఘమునకు నష్టమువచ్చెను. అంతఃకలహము లేర్పడెను. పరదాలు, హార్మోనియము కుదువలో బడెను. నాటకములిక నాడుమాటయే వినరాలేదు. రామన్నకింక నక్కడ పనియేమి? మాటాడించు వారెవరు? మరల భజనమందిరము వంక కొన్నాళ్ళు నడిచెను.

మునిసిపల్ ఎన్నికలు వచ్చినవి. భజనమందిరములోని ఒక ప్రముఖసభ్యుడు కౌన్సిలునకభ్యర్థిగా నిలిచెను. పనిలేని రామయ్య అతనికి ముఖ్య బంటై వోట్లు సంపాదించను తిరిగి కష్టపడినాడు. దైవానుగ్రహమున అతడు మెంబరుగా గెల్చినాడు. రామన్నకేమి యుప కారము చేతునా అని ఆలోచించుచుండినాడు.

మునిసిపల్ బాలికా పాఠశాలలో సంగీతపు మేష్టరుపని ఖాలీపడినది. ఆ మెంబరు ఛైర్మెన్‌తో మాటాడి ఆ సంగీతమేష్టరుపని రామయ్య కియ్యవలసినదని పట్టుపట్టెను. రామయ్య సంగీత విద్య నేర్చినవాడు కాడు. కాని నాటక సమాజములో కొన్ని పాటలు పద్యములు పాడుట నేర్చుకొన్నాడు. ప్రాథమిక పాఠశాల కీమాత్రపు ఉపాధ్యాయుడు చాలునని మెంబరు భావించెను. కొంత వాదము జరిగి వెనుక ఛైర్మెన్ ఆ మెంబరు ఎప్పుడును తనపరముగా నొటిచ్చునట్లు ప్రమాణము చేయించుకొని రామయ్యకు ఆ ఉద్యోగము నిచ్చెను. ప్రారంభమున 15 రూపాయల జీతమే అతని కియ్యబడినది. చెప్పులు, తలపాగ, లాంగ్‌కోటు, గొడుగు ధరించి, వల్లెవాటు వేసికొని రామయ్య బడికి సగర్వముగా నడిచిపోవువాడు. ఈ మధ్య

అతడు సంగీత విద్వాంసుల నాశ్రయించి సరిగమలు నేర్చుకొన్నాడు. బడిలో ఉపాధ్యాయినులందరు ఈతనికి భయపడుచుండిరి. ఏలన ఈతడు మునిసిపల్ కౌన్సిలరు స్నేహితుడు. ఎవ్వరిమీద ఏమి సాడీ చెప్పునో అని భయము. ప్రధానోపాధ్యాయిని గూడ ఈతని గౌరవించుచుండెడిది. బాలికలకు పాఠములు చెప్పుటకంటె ఈతనికి ఇతర వ్యవహారములందే శ్రద్ధ హెచ్చుచుండెను.

రామయ్య ఒక ఇల్లు బాడుగకు తీసికొన్నాడు. కొన్నాళ్లు స్వయముగా వండుకొనెను. కాని తర్వాత హెూటలులో భుజింపసాగెను. మరికొన్నాళ్ళకు హెూటలుకుపోయి భుజించుట అతనికి గౌరవలోపముగా తోచినది. కావున పదిరూపాయలు ఖర్చుచేసి పెద్ద భోజన క్యారీయర్ కొని దానిలో భోజనము నింటికి తెప్పించుకొనెడివాడు. కాని రాగా రాగా ఆ గిన్నెలను కడుగుట ఇంటిని శుభ్రపరచుకొనుట గూడ అతనికి తన హెూదాకు లోపముగా తోచినది.

బడిలో యేడేండ్ల అనాథబాలిక లక్ష్మి చదువుచుండెడిది. దాని తండ్రి తాగుబోతై భార్యను గర్భవతిగా నుండగనే ఇంట నుండి తరిమివేసెను. ఆ నిండుచూలాలు ఈ యూరు చేరి కూలినాలిచేసి బ్రతుకుచుండినది.కాన్పయిన పది దినములు మాత్రము కాలిలో మెట్టెల నమ్మి సంరక్షించుకొన్నది. పురిటిదినములు కడచీ కడవకనే మరల కూలికి వెళ్లుచుండినది. పసిపాపను పొరుగింట యొక వృద్ధాంగన చేతికిచ్చి పగలంతయు కూలిచేయు చుండినది. ఈ విధముగా తన కూతురు లక్ష్మిని యేడేండ్లు సాకినది.

అప్పుడు ఇన్ఫ్లూయంజా జ్వరము దేశములో చెలరేగెను. ఊరూర వందలు వేలు మరణములు కలిగినవి. ఆ జాడ్యములో లక్ష్మి తల్లి, లక్ష్మిని ఏకాకిని చేసి స్వామి పాదములు చేరుకున్నది. లక్ష్మి ఆరవయేట నుండి బడికి వెళ్లుచుండినది. ఆమె రెండవ తరగతి చదువుచుండెను. తల్లి మరణించిన వెనుక ఆ బాలికకు దిక్కెవ్వరు. ఒక పలక రెండు వాచక పుస్తకములు,ఒక బలపము, ఒక అంగీ రెండు పావడలు తప్ప. ఆ బాలికకు నా అనునవి లేవు. లక్ష్మి దుస్థితిని గమనించి ఉపాధ్యాయినులు ఆమెను తల ఒకనాడు వారములిచ్చి పోషించిరి.

రామయ్యకు ఒక యూహ తోచెను. ఆ పిల్లను తానే ఇంట నుంచుకొని ఏల పోషింపరాదు. తనకు చేదోడుగా నుండును. ఇంటి కార్యములు చూచుకొనును. హెూటలులో తెచ్చిన అన్నము నిత్యమును మిగులుచునే యున్నది. అది లక్ష్మికి చాలును. ఒక అనాథ బాలికను పోషించిన పుణ్యము గూడ కలుగును. ఉపాధ్యాయినుల నొప్పించి రామయ్య లక్ష్మిని తన యింట నుంచుకొని సాకుచుండెను. వినయవిధేయతలతో లక్ష్మి రామయ్య గృహకృత్యముల తీర్పుచు తానును ఆయన వెంటనే బడికిపోయి చదువుకొనుచుండెను.

.... .... ....

కానీ రామయ్యకు ఈవిధమగు జీవనము తృప్తి నొసంగలేదు. మరల వివాహము చేసికొనవలెనను భావము అతనిలో నానాటికి పెరుగుచువచ్చుచుండెను. కాని అనురూప

వతీయగు కన్య ఎక్కడ దొరుకును? రూపవతి, సుశీల, విద్యావతి, వివేకవతి అన్ని గుణము లుండవలెనని రామయ్య భావము. పెద్ద కుటుంబములో నట్టి పడుచులు లేకపోలేదు. ఒకరిద్దరికి కూతురినిమ్మని అట్టివారికి రామయ్య గంభీరమగు జాబులు వ్రాసెను. కాని వారు వానికి బదులు గూడ వ్రాయదలచుకోలేదు. ఇట్లాశాభంగము నొందిన కొలదిని అతనికి స్వకులము మీద కోపము, స్వసంఘముపై ఆక్రోశము, స్వబంధువులపై ద్వేషము అంకురించి ప్రవర్తమాన మగుచుండెడిది. అట్టివారితో మాటాడుటయే తనకు గౌరవహానియని అతడు భావించెను. ఇల్లువిడిచిరాడు ఎవ్వరితోను ఎలుగెత్తి మాటాడడు. వీధిలో నెవ్వరివంకను జూడడు. ఎవ్వరైనను తన్ను జూచుచున్నట్లు భావించినా మెడ పైకినీల్గించి, లాంగుకోటు జేబిలో చేయివేసి సగర్వముగా నాటకములో నాయకుడు నడచునట్లు నడుచుచూబోవును. ఆయన మాటలలోనూ నాటకభాషయే అలవరచుకొనెను. ఒక్కొక్కసారి ఆమాటలను సామాన్యజనులర్థము చేసికోజాలరు. ఈ కారణమును తాను అందరికంటె కడు నాగరికు డనియు విలక్షణ పురుషుడనియు భావించుకొననె. బాలికాపాఠశాలలోని ఉపాధ్యాయినుల యెదుట ఆయన మాటాడు వైఖరి చూచియే తీరవలెనుగాని వ్రాయుట సాధ్యముగానిపని. పట్టపురాణుల యెదుట మహారాజువలె నతడు నటించును. అతడు వాస్తవమునకు తాను ప్రభువుననియే భావించుకొనెను. తానొక సామ్రాజ్యాధికారినని వాని తలంపు. కాని సామ్రా జ్యముకానీ పాలింపవలసిన ప్రజలుగానీ లేకుండుటయే ఈ చక్రవర్తికి ఒక చిన్నలోపము. పామిడి గ్రామములో నొక బీద కుటుంబము గలదు. ఏదో కులదోషమున్నదని వారి కూతురికి వివాహము కాలేదు. పిల్ల పేరు నారమ్మ. కొంత వరకు చదివినది. స్ఫురద్రూపి. మాటకారి. కాని నారమ్మ పేరు బాగలేదని సత్యవతి యని నామకరణము గావించిరి. నారమ్మ తల్లిదండ్రులీ నూతన నామకరణమునకు ఒప్పుకొనిరి.

సత్యవతి రామయ్య ఇంటికివచ్చెను. కాని ఆమె తల్లిదండ్రులు అల్లుడు వివాహా నంతరము తమకు జూపిన అనాదరణను బట్టి మరల బిడ్డను చూచుటకు రాలేదు. పిల్లను తోడ్కొనిరమ్మని ఒక్కసారి జాబు వ్రాయించిరిగాని రామయ్య వారికి బదులు కూడ వ్రాయలేదు...

సత్యవతిని గొప్ప విద్యాంసురాలిని జేయవలెనని రామయ్య తలంపు. ఆమెకు సంగీతము చెప్ప తానే పూనుకొనెను. కాని దేహము మీద నున్న శ్రద్ధ ఆమెకు చదువుమీదలేదు. బుద్ధి కూడ అంత సునిశితమైనదిగా కానరాలేదు. మూడు నెలలు ప్రయత్నించినను కంఠము శ్రుతిలోనే కలియులేదు. నిరాశచెంది రామయ్య హార్మోనియం కట్టిపెట్టెను. సంగీతము లేకున్న మానె చదువైన చెప్పించి, భార్యను నవనాగరక స్త్రీగా మార్పించవలెనని ఆయన ఆశ. స్కూలులోని వాచకములు తెప్పించి ఆయనయే ఆమెకు తెనుగు, లెక్కలు నేర్పించెను. లక్ష్మి గూడ ఈ ప్రయత్నమున సత్యవతికి తోడ్పడుచుండినది.

రామయ్య సత్యవతుల మధ్య భార్యాభర్తల స్నేహప్రేమములు పెంపొందలేదు. గురు శిష్యుల మధ్యగల భయనియమము లేర్పడినవి. పాఠములు వర్ణించలేదని రామయ్యకు

ఆమెను గాంచినప్పుడు కోపము. ఎక్కడ విసుగు కొనునో అని ఆయనను చూచినప్పుడు ఆమెకు భయము. ప్రేమచేత రామయ్య ఆమె బుగ్గలు తాకినప్పుడు చెంపలు ఎఱ్ఱబారినది లేదుగాని లెక్కలు తప్పుచెప్పినప్పుడు ఆయన నులిమిన చెవుల ఎఱ్ఱదనము మాయుటయేలేదు. ఇట్లయి రానురాను సత్యవతికి మగడన్న భయము ముదిరెను. భర్త భూతమయ్యెను. అతనిపై అసహ్యము కలిగెను. అతడు ఇంటలేని సమయమే ఆమెకు నెమ్మది గడియలు. ఆయన ఇంట నుండనేని రొసరొసలు గుండె దడదడలు కన్నీటిధారలు, ఇట్లే కొన్నియేండ్లు గడచినది. సత్యవతికి చదువువృద్ధి కాలేదుగాని రాను రాను మగనివలన భయముతీరి అతనిపై ద్వేషము వృద్ధియయ్యెను.

ఆమె మంచి యౌవనముననున్నది. కాని అది అడవిగాచిన వెన్నెలవలెనయ్యెను. ఇంట నెక్కడను అనురాగమునకు తావులేదు. లక్ష్మి గూడ నిత్యమును అతని వెంట బడికి పోవును. సత్యవతి ఒకతెయే యింట రామయ్య బడికిపోవునప్పుడు ఆమెకు లెక్కలు వ్రాతలు ఎన్నియో ఇచ్చిపోవును. అవిచేయకున్న దండించునను భయమున ఆమె అందులోనే నిమ గ్నమై విధిని తిట్టుకొనుచుండెను.

లక్ష్మి క్రమక్రముగా తరగతులన్నియు కడతేరి స్కూలు ఫైనలు ప్యాసు చేసినది. తన క్లాసులో నందరి కంటె ఎక్కువ మార్కులు సంపాదించినది. ఆమెకు ఒక మెడల్ ఇచ్చిరి. ఇంటర్మీడియట్ చదువను స్కాలర్షిప్పుగూడ నిచ్చిరి. ఆమె గుంటూరు కాలేజీ చేరెను. వెళ్ళునప్పుడు రామయ్యగారికిని సత్యవతికిని నమస్కరించినది. సత్యవతికి ఉన్న ఒకతోడు గూడ వెళ్లిపోవుచున్నందుకు దుఃఖించినది.

లక్ష్మి వెళ్లినతరువాత సత్యవతికి ఇంగ్లీషు చెప్పువారులేకపోయిరి. రామయ్యకు ఇంగ్లీషురాదు. రాజారెడ్డి ఆను యువకుడు ఆయేడే బి.ఏ.ప్యాసయి ఉద్యోగము కోసరము వెదకుచుండెను. అక్కడ నిక్కడ ఆయనకు ఆక్టింగు ఉద్యోగము మాత్రమే దొరకుచుండినది. అతనికి రామయ్యతో పరిచయము కలదు. రామయ్య అతనిని ప్రార్థించి సత్యవతికి ఇంగ్లీషు చెప్పింప నేర్పరచెను. కొన్నాళ్ళు రామయ్య ఎదుటనే ఆయన సత్యవతికి చదువు చెప్పెను. లక్ష్మి వెళ్ళిన తరువాత వంటపని సత్యవతి పాలబడినది. కావున ఉదయము చదువుకొనుటకు విరామము చాలదు. తీరుబడిలేక ఒక్కొక్కనాడతడు రామయ్య బడికి వెళ్లిన తర్వాత వచ్చును. ఆయన ఇంట లేనప్పుడు తాను రాజారెడ్డితో చదువుకొన్న యెడల భర్త ఏమనునోయని సత్యవతి మొదట జంకెనుగాని రామయ్య ఈ విషయమున తన ఆక్షేపణ గనుపరుపలేదు. ఇట్లే ఆరు మాసములు వ్యాసంగము నడచినది. రాజారెడ్డి వీరి ఇంటనే ఎక్కువ కాలము ప్రొద్దుకడపు చుండును. కాఫీఫలహారములు గూడ ఇక్కడనె అతనికి సాగుచుండెను. రామయ్య సంగీతమును ప్రశంసించుట రాజారెడ్డి కలవాటుపడినది. వాస్తవమునకు అతనికి దంపతులపై ననురాగము హెచ్చెను. సత్యవతి గూడ వెనుకటి ఒంటిపాటు దుఃఖమును మరచి రాజారెడ్డి సాంగత్యమున వర్ష ఋతువునందలి లతవలె మారాకువేసి కళకళలాడుచుండెను. వంట

వార్పులయందు పనిపాటలయందు ఆమెకిప్పుడు రుచి పుట్టింది. కాని భర్తవలని భయము, అసహ్యాము మాత్రము తగ్గలేదు.

3

గుంటూరిలో లక్ష్మి వ్యాసంగము నిరభ్యంతరముగా జరుగుచుండినది. ఆమె రామయ్యా గారికి వారమునకొక జాబు వ్రాయుచుండినది. కాని కొన్నాళ్ళయిన వెనుక పక్షమున కొక జాబు నెలకొక జాబు వ్రాయసాగెను. పరీక్షల తొందరచే జాబు వ్రాయుట ఆలస్యమైనదని అప్పుడప్పుడు క్షమాపణలు గూడ... ఔను ఇటీవల రామయ్య, రామయ్యనాయుడైనాడు లెండి, ఆమెకు నెలకొక యుత్తరము తప్పక వ్రాయును.

మైక్లిమస్ సెలవులకు ముందు పరీక్ష జరిగినది. సగము ప్రశ్న పత్రములలో ఆమె మొదటి మార్కులు సంపాదించినది. తెనుగు పరీక్షలో అత్యధిక సంఖ్య మార్కులు తెచ్చుకొన్నది. సహపాఠకులకు ఆమె మేథాశక్తి యత్నశీలత ఆశ్చర్యముగొల్పెను. ఉపా ధ్యాయులకు ఆమెయన్న మెప్పు.

లక్ష్మి ఇప్పుడు పసిబాలికగాదు.పదునెనిమిది సంవత్సరముల ఎలజవ్వని. రామయ్యా నాయుడుగారి యింటనున్నప్పుడు తిండి చాలకనో భయముచేతనో స్వేచ్ఛలేకనో ఆమె బక్కచిక్కి యుండినది. వయసునకు తగినంత బలము ప్రాయము ఆమెలో కనుపిం చుచుండలేదు. కాని గుంటూరు చేరిన వెనుక వాతావరణము మారినది. హాస్టలున సుఖక రమగు తిండి, ఉత్సాహము గొల్పు చదువు, ఉడుకురక్తముగల యువతీ యువకుల స్నేహము, ఈ కారణములచేత భల్లున తెల్లవారినట్లు ఆకస్మికముగా యౌవనమామెలో దూరినది. అవయవములు స్ఫూతిగాంచినవి. దేహమున తారుణ్యా ముదయించినది. చూపులకు చుఱుకు దనము వచ్చినది. పెదవులకు రక్తిమయేగాదు ముఖమునకు చిఱునవ్వు సహజముగా ప్రాప్తమైనది.

ఒకచోట ఆమె యుండజాలదు. కదలక నిలువజాలదు. ఎప్పుడును అన్ని యవయవములును మనోహరముగా ఆడించుట ఆమె కలవాటైనది. నవయౌవన లావణ్యా మామె అంగములు నిండి తొలుకాడు చుండెను.

కళాశాల విద్యార్థుల కామె దర్శనము చంద్రదర్శనము వలె ఆహ్లాదము నిచ్చు చుండెను. ఆ బాలిక చిఱునవ్వు వెన్నెలలో చల్లదనము నాపేక్షింపని వారులేరు. ఆమె వాక్సుధ చవి గాంచగోరి వారామెను నిష్కారణముగా బలుకరింతురు. ఆమె పలుకులు వీణాలాపమువలె వారి హృదయమున నానందము నింపును. ఆమె సరళత, సౌశీల్యము, నిష్కపట హృదయము, వారి మనసులలో దుష్టభావములను రేపుటలేదు. ఆమె మితభాషిత్వము సభ్యతాయుతమగు ప్రసన్నదృష్టి, యువకులకు ఎక్కువ చదువునియ్యక వారిని హద్దులో నుంచుచుండెను.

కళాశాల వార్షికోత్సవము వచ్చినది విద్యార్థులందరు మైదానములో వేదిక చుట్టును సమావేశమై యుండిరి.

ప్రాతవిద్యార్థులు గూడ అనేకులా సభకు ఆహ్వానింపబడి వచ్చియుండిరి. అధ్యక్షుడు పేరు పేరపిలిచి బహుమానము లిచ్చుచుండెను. లక్ష్మికిగూడ వక్తృత్వ పరీక్షలో నొకబహు మానము వచ్చినది. ఆమె దానినందుకొని అధ్యక్షునికి వందనమర్పించి వేదికకు దిగువ మొదటనే యున్న కుర్చీలో కూర్చొనెను. సభాజనులందరు ఆమె ఎవరు? ఎవరామెయని ప్రక్కనున్నవారిని ప్రశ్నించుచుండిరి. కొందరికి తెలియదు. తెలియనివారు తెలియనివారినే అడుగుచుండిరి. కళాశాల విద్యార్థులు మాత్రము దగ్గరనున్న ప్రేక్షక జనమునకు ఆమె సీనియర్ ఇంటర్ చదువుచున్నదనియు ఆమె పేరు లక్ష్మి అనియు మెల్లగా చెప్పుచుండిరి.

నాటి యుదయమున ఆటల పందెములు జరిగియుండినవి. ప్రాతవిద్యార్థులు హాకీఆటలో గెలిచియుండిరి. వారి కెప్టన్‌కు బహుమానమియ్యబడెను. ఆ యువకుడు బి.ఎ. ఒక భాగము మాత్రము ప్యాసయి రెండవభాగమును ప్రయివేటుగా చదువుచుండినాడు. 20 సంవత్స రముల తరుణవయసు. నిమ్మపండువంటి మేనిఛాయ. వచ్చీరాని మీనములు ముఖసౌందర్య మునకు మరింత తోడ్పడుచున్నవి. విశాలపక్షము. ఆజానుబాహువులు, ఆ యువకుడు సభలో నుండి లేచివచ్చి బహుమానపూర్వకముగా నియ్యబడిన హాకీబ్యాటు నందుకొని నమస్కరించి చిరునవ్వుతో మరలి తన స్థానమునకువచ్చి కూర్చొనెను. ఆయన గుంటూరికి చిరపరి చితుడు.కావున ఇతడెవ్వరని ఆసభలో ప్రశ్నించలేదు. ఒక్క బాలికకు మాత్రమే అతడెవ్వరైనదీ తెలియలేదు. కాని ఇతడెవ్వడో తెలిసికొనవలెనను ఆపేక్ష. ఆమె నూరకుండ నియ్యలేదు. ప్రక్కన తన తరగతి విద్యార్థి రాధాకృష్ణుడు గూర్చొని యుండెను. వానితో మెల్లగా ఆమె ఆ యువకుడెవరని ప్రశ్నించెను. 'అతడు మాయన్న మోహనుడు. ఈ కాలేజీకి పాత విద్యార్థి. బి.ఏ. ఇంగ్లీషు పార్టున కీసారి ప్రయివేటుగా పోవునని రాధా కృష్ణుడు చెప్పెను. మరల లక్ష్మి అతని గుఱించియే యేవో ప్రశ్నలనడిగినదిగాని అధ్యక్షోప న్యాసము వినుసంబరములో రాధాకృష్ణుడామె మాటలను వినిపించుకోలేదు. లక్ష్మికి మనసులో నిమ్మళము కలుగలేదు. నాటి సాయంత్రము సభలో తర్వాత జరిగిన విషయము లందామెకు మనసుపోలేదు. అందరితోపాటు తనహాస్టలు గదికి లేచివచ్చినది. కాని పరధ్యానము వలనే ఆమెకు త్రోవనడచినట్లే కనుపడలేదు.

ఆ రాత్రి కళాశాల విద్యార్థులందరికిని వెన్నెల భోజనము. లక్ష్మిని ఒక విద్యార్థి పిలువ వచ్చెను. 'మనకేనా పాతవిద్యార్థులకు కూడానా విందు?' అని లక్ష్మి ప్రశ్నించినది. 'అందరికి ఆహ్వానము లంపబడినవి, వచ్చినవారు వత్తురు లేనివారులేర'ని అతడు బదులుచెప్పి పని తొందరలో వెళ్లి పోయెను. లక్ష్మి విందునకు వెళ్లెను. తెల్లని చీరధరించి రోజారంగు రవిక దొడగినది. జారు సిగముడి దార్చినది. ఆమెకు నగలన్నవి లేవు. వెన్నెల భోజనమున కందరు సమావేశమైనారు? వంటవారు ఆకులువేసి వడ్డించుచున్నారు. విద్యార్థులు అక్కడి కిక్కిడికి పొరాడుచు సందడి చేయుచున్నారు. ప్రొఫెసరులలో పూర్వాచార పరాయణులు గానివారు వచ్చి పీటలమీద కూర్చున్నారు. లక్ష్మి నలుగడల తిరిగివచ్చెను. ఆమె ఈ గందర గోళములో పాల్గొనలేదు. అంతటను కలయజూచెనుగాని మోహనుడు కనుబడలేదు. ఆలస్యముగా

వచ్చునేమోయని తలుపు వైపు దృష్టి నిగుడించి చూచుచుండెనుగాని అతని పొలకువ గానరాలేదు. తుదకు నిరాశ చేసికొనెను. ఆమె ఉత్సాహమంతయు తగ్గిపోయినది. రాధాకృష్ణుడున్న చోటికి వెళ్లి వాని ప్రక్కననే పీటమీద తాను గూర్చొని, మాట ప్రస్తావనగా 'ఏమి మీయన్నరాలేదా' అని ప్రశ్నించెను.

'లేదు మా అన్న భార్య నేటి సాయంత్రమే ప్రసవించినది. వైద్యుని నిమిత్తము మా అన్న వెళ్లినాడు. విందునకు రాడు. నేను గూడ త్వరలో వెళ్లవలసి యున్నదని రాధాకృష్ణుడు నుడివెను.

లక్ష్మి నిరుత్తరయయ్యెను. ఆమె విందు పూర్తి అగువరకు నక్కడ నిలువలేదు. పై మాటలు ఆమె చెవులకు ముల్లులైనవి. నిశ్వాసములలో వేడి ఎక్కెను. జ్వరము వచ్చినట్లయినది. ఆమె సడిచప్పుడు లేకుండ వెళ్లి తనగదిలో పరుండెను...

పది దినములు గడచెను. ఒకనాడు రాధాకృష్ణుడు కాలేజీకి ఆలస్యముగా వచ్చి నాడు. ఉపాధ్యాయుడు కారణమడుగగా తన వదినెకు చాల జబ్బుగా నున్నందున వైద్యుని పంపివచ్చుటలో నాలస్యమైనదనెను. బడివిడచునప్పుడు లక్ష్మి రాధాకృష్ణునితో నిట్లు సంభాషించినది.

లక్ష్మి : ఏ వదినెకు జబ్బు

రాధ : మాఅన్న మోహనుని భార్య లలితకు

లక్ష్మి : ఏమి జబ్బు?

రాధ : ప్రసవమైన నాల్గవ దినమే జ్వరము వచ్చినది. రెండు దినముల నుండి చాల తీవ్రమైన సన్నిపాతక జ్వరము.

లక్ష్మి : అయ్యో పాపము ! ఆమెను చూడవలెనని నాకు చాల ఆశగానున్నది. ఈ దినం నన్ను మీ యింటికి పిలుచుకొని పోదువా?

రాధ : ఆవశ్యము. ఇప్పుడే బండితెత్తును. నీవు వార్డన్‌గారి అనుజ్ఞ తీసికొనుము.

మోహనుని ఇల్లు చిన్నది. కాని చాల వసతియైనది. చాల శుభ్రముగాను అందము గానున్నది. ఒక గదిలో లలిత మరణశయ్యపై నున్నది. బహుళ చతుర్ధశినాటి చంద్రకళవలె ఆమె శుష్కించి పడినది. చుట్టును బంధుజనులు కూడినారు. ఔషధములు పోయుచు న్నారు.కాని బ్రతుకు ఆస ఎవ్వరికిని లేదు. ఎవ్వరు మాటాడుట లేదు. నిశ్శబ్ద పురస్సరముగా లక్ష్మి గదితలుపువద్దనుండియే రోగిని చూచినది. ఆమెకడ ఆవనత శరీరముతో నిమీలిత లోచనుడై భాష్పములు జాలువార కదలక కూర్చున్న మోహనుని జూచినది.

మోహనుని అక్కగారు జానకమ్మ మాత్రము కనుసైగతో రాధాకృష్ణుని ఈ బాలిక ఎవ్వరని అడిగెను. తమ క్లాసు విద్యార్థిని అని సన్నని గొంతుకతో నతడు బదులు చెప్పినాడు. లక్ష్మి ఆమె వద్దకు చేరి 'వదినా' లలిత స్థితి ఎట్లున్నదని దీనముగా నడిగినది. 'ఇంకేమి లలిత!

నాకేమో ఆశలేదు అమ్మాయీ! అని ఆమె కంటనీరు పెట్టినది. అరగడియ కాలముండి లక్ష్మి హాస్టలునకు మరలిపోయినది. మరునాటి ప్రభాత కాలముననే లలిత స్వర్గధామమునకు జనెనని కాలేజీలో ఆమెకు తెలియవచ్చెను...

రెండు మాసములు కడచనెను. ఇప్పుడు లక్ష్మి మోహనుని ఇంటికి నొక అపరిచిత బాలికవలె పోవుటలేదు. ఆ యింటి బంధువలెనే ఆమె మెలగుచున్నది. జానకమ్మతో ప్రథమ పరిచయమైన వెనుక లలిత మరణమును గుఱించి ఆమె నోదార్చుటకు లక్ష్మి ఎడపదడప వారియింటికి రాకపోకలు చేయుచుండెను. లక్ష్మి సభ్యత, మాటతీరు ఆమె తెలివి, జానకమ్మ చిత్తమునాకర్షించినవి. లక్ష్మి వచ్చినప్పుడామె సస్నేహముగా పలుకరించును. ఆమె చదువు కథల నాదరముతో వినును. సిగ్గుచే ఆమె రాగముతీసితీయక చదువు పద్యములకు ముచ్చట పడును. సెలవు దినములు వచ్చుసరికి లక్ష్మి వీరియింట హాజరుకాకున్న జానకమ్మ రాధా కృష్ణునితో వెంటనే చెప్పిపంపును. లేదా జట్కా పంపి ఆమెను పిలిపించుకొనును. ఆదివారము నాడు ఆమెకు వారియింటనే భోజనము. రాత్రి ఇష్టాగోష్టితో కొంతసేపు గ్రామఫోనుపాటలతో కొంతసేపు కాలహరణము. ఒక్కొక్కనాడు జానకమ్మ లక్ష్మిని పిలుచుకొని సినిమాకు వెళ్లెను. రాధాకృష్ణుడు తీరికయున్నచో వారిననుసరించును లేదా వారే వెళ్లివత్తురు. మోహనుని మనసు చింతావ్యాకులము కాకుండటకై సహృదయయగు జానకమ్మఇంటనేదో ఒక కాలక్షేపము నేర్పరుచును. గ్రామఫోనో, వెన్నెల భోజనమో, పద్యపఠనమో ఏదో ఒకనెపము పెట్టి ఆమె యింట కొంత అల్లరి కావించుచుండును. దానికి లక్ష్మిసహాయకారి. లక్ష్మి లేకున్న జానకమ్మ ఒంటరిగా నేమిచేయగలదు? కావున లక్ష్మిని పలుమారు పిలిపించుకొని ఆమెకు స్వాతంత్ర్యము చనవుకలుగజేసినది.

మోహనుడు భార్యమరణించిన పది దినములు అత్యంత మౌనము వహించి తనగది విడచి వెలపలికి రాకయుండెను. తర్వాత భోజన సమయమున మాత్రము అందరితో కలియుచుండెను. క్రమక్రమముగా నతడు వీరి ఆటపాటలలో పాల్గొన జొచ్చెను. మొదట మోహనుడు తను వద్దనున్నపుడు లక్ష్మి ఇంచుక సంకోచించుచు మాటాడుచుండెను గాని తర్వాత ఆ జంకుతీరి తన సహజధోరణితో సంభాషింపసాగెను. మోహనుడు పరాకుగా నున్నట్లున్నను లక్ష్మి మృధుభాషణములను చెవియొగ్గివినును. తనగదిలో చదువుచుండినను, ఆమె పాడునప్పుడు తన్మయుడై ఆలకించును.

ఒకనాడు రాత్రి 9 ఘంటలైనది. రాధాకృష్ణుడింట లేడు మబ్బురేగి చిటిపోటి చినుకులారంభమయ్యెను. లక్ష్మి హాస్టలునకు పోయి తీరవలెనని పట్టుపట్టెను. ఎక్కడను జట్కా జాడ కనుపించలేదు. వర్షము హెచ్చునను భయము తలచూపెను. అప్పుడు విధిలేక జానకమ్మ లక్ష్మిని హాస్టలులో విడచి రమ్మని మోహనుని ప్రార్థింపవలసివచ్చెను. మోహనుడు సమ్మతించెను. కాని ఉన్నది ఒక్కగొడుగే. రెండవది రాధాకృష్ణుడు తీసికొని వెళ్లియుండినాడు. లక్ష్మి ఒక టవలును మీద వేసికొని ప్రయాణమయ్యెను. మోహనుడు ఆమెయు ఒక్కగొడుగు ఆశ్రయములో బయలుదేరిరి. మోహనుని చేతిలో టార్చిదీపము ఉండినది.

ఆ నిశీథ సమయములో ఆచిటిపొటి చినుకులలో ఆ ఒంటరి పాటులో వారి యుల్లములు చిగిర్చినవి. తనువు లొండొంటి నల్లనతాకినప్పుడు ఒకానొక సమ్మోహనశక్తి విద్యుత్తువలె వారి దేహమునంతయు నావరించి హృదయ కోశమున విరమించుచుండెను. త్రోవన ఆకస్మికముగా వర్షము హెచ్చినది. నీరు రోడ్డులో అడుగులోతు ఒక చోట ప్రవహించు చుండినది. పరాకున లక్ష్మి చీకటలో ఆ నీట జారిక్రింద పడబోవుచుండెను. కాని మోహనుడు తక్షణముననే ఆమెను తన దక్షిణ హస్తమున పట్టుకొన్నాడు. ఆమె అతని భుజముమీద వ్రాలినది. ఆమెనొకచేత బిగ్గబట్టుకొని రెండవచేత గొడుగును బట్టికొని మోహనుడామెను మెల్లగా నడపించుకొని పోయినాడు. లక్ష్మికి హాస్టలుచేరిన తర్వాత గాని స్మృతిరాలేదు. ఆమె మోహనుని స్పర్శసౌఖ్యములో ఒడలు మరచియుండినది.

4

వేసవి కాలపు సెలవులు వచ్చినవి. శ్రీరాములునాయుడు గారింటిముందు ఒకనాడు జట్కా నిలువబడి యుండెను. కొంతసేపటికి నాయుడుగారు దానిలో కూర్చొనిరి. సిల్కుకోటు, జరీరుమాలు, సరిగంచు చేలము, జోబిగడియారము, ముక్కద్దములు, రిష్టువాచీ, కాలికి స్లిప్పర్లు, చేతిలో నినుపదండము, ఓహో! నాయుడు గారు నవనాగరక యువకునివలె కాన్పించుచుండెను. జట్కాలోనెక్కి కూర్చున్న ఆఠీవి మొగమున ఆ గాంభీర్యము. నాడు చూసి తీరవలసినవి. జట్కా స్టేషనునకు వెళ్లినది. నాయుడుగారు ప్లాటుఫారంలో ఇక్కడ నక్కడ పచారు చేయుచుండిరి. రైలువచ్చినది ఒక లావణ్యవతి చేతిలోనొక ఫాషనబుల్ సంచి పట్టుకొని సగముతొడిగిన జారు చెప్పులతో రైలుదిగి మందహాసముతో మందగ మనముతో నాయుని దగ్గరకువచ్చి, 'ఓహో, అయ్యగారే వచ్చినారే, ఎందుకీశ్రమ, నేను రాలేకపోతినా' అని సంభోధించువరకు నాయుడుగారు లక్ష్మిని గుర్తించలేదు.

ఔను, వాస్తవమునకు ఆమెను చిన్నతనము నుండి చూచినవారుగూడ ఆమెనిప్పుడు గుర్తించుట కష్టము. ఈ రెండేండ్లలో లక్ష్మి కొత్తమనిషిగా మారిపోయినది. గుంటూరికి పోయినప్పుడు ఆమె ఒక బాలిక. యౌవ్వనమామె బాల్యమును ఆకస్మికముగా నపహరిం చినది. వసంతమున పుష్పించిన మాధవీలత వొలె ఆమె ఎదిగి చుట్టును శాంతిపుంజముల వెదజల్లుచుండెను.

నాయుడు లక్ష్మి సామానును జట్కావాని కందించి ఆమెను మొదట బండి ఎక్కించి తర్వాత తాను ఎక్కి కూర్చొని త్రోవలో ఆమె ప్రయాణమును గుఱించి ప్రశ్నింపుచూ ఆమె నడువు మధురవచనములు కర్ణపూరముల గ్రోలుచు, జంకుతో ఆమె ముఖముపై దృష్టులు సారించి, ఆశ్చర్యానందములతో ఆ సౌందర్యమును ద్రావుచు ప్రయాణము సాగించెను.

ఇంటికడ తాను మొదట దిగి ఆమె దిగుచుండగా చేయియిచ్చి సాయపడ జూచెను గాని ఆమె వలదని వారించి తానే అవలీలగా దిగెను. నాయుడుగారు మనీపర్స్‌తీసి దర్జాగా జట్కావానికి బాడుగఇచ్చి లోనికి వెళ్లిరి. 'ఓహో, ఇంటిలోనంతయు మారినదే' అని నవ్వుచు

లక్ష్మీ ఆ క్రొత్తగా వేసిన పటములు, ఆ ఈసీచేర్లూ, ఆ బట్టతొడుగు కుర్చీలు, గడియారము వీనివంక దృష్టిని గుచ్చినది. 'నీవు మారలేదా, గుంటూరికి పోవునప్పుడెంట్లుటివి, ఇప్పుడెట్లు న్నావు' అని నాయుడు సరసముగా ప్రత్యుత్తరమిచ్చినాడు.

సత్యవతి చదువుచుండిన దానివలె చేతిలోని పుస్తకమునట్లే తెరచియుంచుకొని 'రాండి అక్కగారూ, స్నానము చేతురు, నీళ్ళు సిద్ధముగా తోడియుంచినాను' అనుచు ఆహ్వానించినది. సత్యవతి ఆమె వంకన ప్రేమతో జూచుచు, నీవు నీళ్ళాడినావా అని ఒక పరిహాస వచనము విసరి నాయునితో 'మా సత్యవతి మాత్రము యథారీతిగానున్నది' అన్నది. సత్యవతి ఇదేమీ గుంటూరిలో క్రొత్తభాష నేర్చుకొన్నారే అంటూ లక్ష్మీని ఈడ్చుకొని లోపలికరిగినది.

సాయంకాలము వరకును ఫలహారములతో గ్రామఫోనులతో సరస వచనములతో గుంటూరి కథలతో ప్రొద్దు నడచినది.

ఐదు గంటల సమయమున రాజారెడ్డి వచ్చినాడు. క్రొత్తది యగుట లక్ష్మినిజూచి లోపలికరుగజాలక జంకుచు నిలబడినాడు. కాని నాయుడు అతనిని జూచి 'రాండి, రాజారెడ్డిగారూ, ఈమె మా లక్ష్మి, నేడు వచ్చిన' దంటూ ఆయనను కుర్చీమీద ఉపనిష్టుని చేసెను. లక్ష్మి గుంటూరు కాలేజీలో మెదిగినదగుటచేత ఎట్టి జంకునులేక కుర్చీమీదనే యుండి, నాయుడుగారి వంక వీరెవరని అర్థమునిచ్చు చూపుచూచినది.

'మన సత్యవతికి ట్యూషన్ చెప్పుటకు ఏర్పడిన వారు. పేరు రాజారెడ్డి గారు' అంటూ నాయుడుగారు ఆయనను లక్ష్మికి ఇంట్రడ్యూస్ చేసినారు. సత్యవతి సిగ్గు కనుబరచు చూపులతో నించుక ఓరగా తన ఉపాధ్యాయునిజూచి చిఱునవ్వును ఱెప్పలలో నప్పళించినది. లక్ష్మి అతని నాపాదమస్తకము పోలీసువానివలె ఒక్క చూపుచూచినది. రాజారెడ్డి తలవంచుకున్నాడు.

గుంటూరు కాలేజి ఉపన్యాసకులను గురించీ, ఆ ఊరి ఎండలను గురించీ, గోంగూర పచ్చడి రుచిని గురించీ, తెనుగువారి సంగీతజ్ఞానమును గురించీ, లక్ష్మీ ప్రసంగిం చుచూ, మధ్య మధ్య వారి ప్రశ్నలకు బదులుచెప్పుచు ఒక ఘంట కాలము గడచినది. అందరి దృష్టులు ఆమె మీదనే కేంద్రీకరించినవి. అందరి చెవులును ఆమె మాటలనే వినుచుండినవి. ఆమెను మాటాడించు నిమిత్తమై ఒకటి రెండు ప్రశ్నలు వేయుటతప్ప ఎవ్వరును విశేషముగా మాటాడలేదు. గుంటూరి కాలేజీలో ఉపన్యాసకులు స్త్రీలా పురుష లాయని సత్యవతి ప్రశ్నించినపుడు మాత్రము లక్ష్మీ నవ్వును ఆపుకొనలేక పోయినది. సత్యవతి మొగము ఆవలకు త్రిప్పుకొన్నది. రాజారెడ్డి ముఖము తెల్లబారినది. 'కాలేజీలలో స్త్రీ లెక్కడ నైననూ ఉ పన్యాసకులుగా నుందురా?' అని నాయుడు తన సర్వజ్ఞత్వమును వెల్లడించినాడు. గోడకున్న జపాన్ గడియారము తా...తా... యని ఆరుగంటలు కొట్టింది.

నాయుడు గడియారము వంకజూచి 'ఆరుగంటలైనది, ఇంక సినిమా ప్రారంభ మగును. ఈ వేళ ఏదో 'దేవదాసి' యని మంచి సినిమా వేసినారు. మనము వెళ్ళుదము' అన్నాడు. 'అందరూ వెళ్ళినయెడల రాత్రి భోజనము మాటయేమి? నేనింకను వంట ప్రారంభిం పలేదు'

అని సత్యవతి అన్నది. తానా సాయంత్రమొక మిత్రుని కలిసికొనవలసిన పనియు న్నదని రాజారెడ్డి మెల్లగా మనవి చేసికొన్నాడు.

'సరే, నేనును లక్ష్మియు మొదటిషోకు వెళ్ళుదుము. మీరు కొంతసేపు పాఠము చదువుడు. లక్ష్మి తర్వాత వంటచేయును. రెండవషోకు గురువును, శిష్యురాలును కలిసి వెళ్ళుడు' అని నాయుడుగారు తీర్మానించినారు. నేడేమి అవసరమని లక్ష్మి నివారింపదలచినను నాయుడు వినలేదు. తొందరగా లక్ష్మి నవసరపెట్టి ఆమెతో సినిమాకు వెళ్ళెను. అతనిలో కలిగిన ఆ ధారాళబుద్ధికి లక్ష్మి లోలోపల సంతోషించినది.

ఇంటికడ నిట సత్యవతియు రాజారెడ్డియు వారు సినిమా వెళ్ళిన తర్వాత చాలాసేపు ఇష్టాగోష్టిలో నుండిరి. గుంటూరి నుండి లక్ష్మి తెచ్చిన ఆమె క్రొత్త ఫోటోవంక రాజారెడ్డి దృష్టిపడెను. ఇదెవరిది? అనుచు అతడు దానిని చేతబట్టుకొని చూడసాగెను. ఇదియు లక్ష్మిదే అని సత్యవతి అన్నది. ఇదికాక ఇంకొక్కటున్నదా యని రాజారెడ్డి ప్రశ్న. ఏడాది క్రిందట లక్ష్మి ఒక్కదానిని పంపినది కాని మీ నాయుడుగారు దానిని తమ టేబులులోనే ఉంచుకొని నిత్యము పదిసారులైనను చూచుకొనుచుందురు కానీ, గోడకు తగిలించలేదు అని సత్యవతి నవ్వెను. నాయుడు ఇటీవల చాలా మారినాడు. లక్ష్మి వత్తునని జాబు వ్రాసిననాట నుండి గృహాలంకరణము ప్రారంభించినారు. క్రొత్త దుస్తులు తెచ్చుకొన్నారు. అతని మనసులో నేదో ఆనందము, కళవళము అని సత్యవతి అంది.

బహుశ ఆమెను వివాహమాడ తలచుచున్నాడేమో అని రాజా అన్నాడు. అందరు నావంటి బుద్ధిహీనురాండ్రు కాదని సత్యవతి అంది. మనలనిద్దరిని సినిమాకు బొమ్మను చున్నాడే ఏల ఇంతదయ అని రాజా అన్నాడు. ఏదో ఎత్తున్నది. లేకున్న ఇంతటి సరసత మనవారి కెక్కడిదని సత్యవతి అంది. కానీపోదము, అప్రయత్నముగా దొరికిన ఈ అవకాశము నేలపోగొట్టుకోవలెనని రాజా అన్నాడు.

సత్యవతి వంటకు లేచెను.నేను 9–30 గంటలకు సరిగా వత్తునని రాజా వెళ్ళెను. లక్ష్మియు నాయుడును వెళ్ళుసరికే సినిమా ప్రారంభమైనది. నాయుడు రెండు కుర్చీ టికెట్లు కొనెను. స్త్రీలు వేరుగా కూర్చున్న స్థలములో కుర్చీల తరగతిలేదు. ఐనను లక్ష్మీ ఆ వైపునకే పోయెదననెను గాని నాయుడు అంగీకరింపక తనతో పైయంతస్థున కామెను తీసుకువెళ్ళెను. చీకటిలో తారాడుచు వారు కుర్చీల వెనుకవైపు నుండి సీట్ల కోసరము చూచునంతలో మొదటిరీలు ముగిసి లైటు పడినది. ఖాళీ కుర్చీలు రెండునొక్కచోట ఉండలేదు. మొదటి వరుసలోని యువకుడొకడు కడపటనున్న వానితో 'ఓరేయి నీ విక్కడకురా ఆ భార్యాభర్తలకు, అక్కడ చోటు విడువు' మన్నాడు.నాయుడు ముసిముసి నగవునగుచు ఆ ఖాళీపడిన కుర్చీమీదికి వెళ్లెను. లక్ష్మీ మొగమెఱ్ఱ బారినది. బొమముడివేసుకొని రెండవ కుర్చీలో కూర్చెనెను.

'లోకమెంత తలతిక్కది! ఆడుది మగవాడు ఒకచోటనున్నచో వారు భార్యాభర్తలేయని ఏల తీర్మానించవలెను. సోదరీసోదరులు కాగూడదా! తండ్రి కూతురు కారాదా! అని లక్ష్మీ మెల్లగా గొణిగినది.

'తప్పేమి? వారు తెలియక అన్నందుకు నీకేల ఇంత కోపము?' అని నాయుడన్నాడు.

'వయసును బట్టియైన వారు ఊహించవద్దా' అని లక్ష్మి

'మనకు వయోతారతమ్యమంత గొప్పదిగా కనబడుచున్నదా' యని నాయుడు

ఈ ప్రశ్నకు లక్ష్మి ఉత్తరము పలుకలేదు. నాయుడును మారుపలుకలేదు. లక్ష్మి సినిమా చూచెనో లేదో కాని ఏదో తలపోతలలో నుండెను.

'దేవదాసి' పదహారేండ్ల బాలిక. ముసలి రాజొకడు దానిపై వలపుచేత చెఱ బెట్టెను. రాజు పంపిన ఆభరణముల నన్నింటిని ఆ బాలిక విసరివేసెను. అతడు పంపు దివ్యాహారములను ఆమె పారవేసి దినముల కొలది ఉపవసించెను. బలాత్కరింప వచ్చిన వృద్ధరాజు నామె కాలితో దన్నినప్పుడు లక్ష్మి 'సెబాస్' చక్కగా బుద్ధిచెప్పింది' అనెను.

రాజభటులామెను రాజాజ్ఞతో ఊరిమాను వద్దకి గొంపోవుచుండిరి. 'యౌవన గర్వముతోచేసిన దుందుడుకున కిది తగిన శిక్ష' అని నాయుడు రిమార్కు చేసి లక్ష్మి వంకచూచెను. ఆమె నాయుని వంక చూడలేదు. దేవదాసిని ప్రేమించిన రాజపుత్రుడు ససైన్యముగా వచ్చి ఊరి నుండి ఆమెను రక్షించి వృద్ధరాజును సంహరించి రాజ్యలక్ష్మితో పాటు దేవదాసిని పరిణయమయ్యెను.

'ఈ ముసలి నగ్గునకు మరణశిక్ష' అని లక్ష్మి నాయుని వంక చూడకనే ఆయనకు వినబడునట్లు అనెను. సినిమా ముగిసినది.

**5**

శ్రీరాములునాయుడు గారును లక్ష్మియు ఇంటికి వచ్చిరి. ఎట్లుండినది సినిమాయని సత్యవతి ప్రశ్నించినది. ఒకేసారిగా నాయుడు బాగున్నదనియు, లక్ష్మి ఏమీ బాగులేదనియు ననిరి. ఇంతలో రాజారెడ్డి వచ్చి మొదటిషో ముగిసినదాయని ప్రశ్నించెను. ఔను అప్పుడే చాలాసేపైనది మీరు ప్రయాణముకండని నాయుడనెను. మీకు వడ్డింపకనె ఎట్లుపోదునని సత్యవతి. పరవాలేదులే మేమే వడ్డించుకొందుమని నాయుడు. ఏదో ముచ్చటగా మాట్లాడుతూ కూర్చోక పాడు సినిమా ఎందుకులే అని లక్ష్మి అంది. గుంటూరులో మంచి సినిమాలు చూచి మీకు నిస్పృహ; మాకిక్కడ నన్నియు క్రొత్తకదని సత్యవతి అనేను. రేపు మొదటి షోకు పోకూడదాయని లక్ష్మి అంది. ఈ ఫిల్మ్ నేటితో ఆఖరని రాజారెడ్డి అన్నాడు. కనుకనే పొమ్మంటినని నాయుడు అన్నాడు. పర్యవసానములో సత్యవతియు, రాజారెడ్డియు సినిమాకు వెళ్ళిరి. లక్ష్మియు, నాయుడు నిరువురు తామే వడ్డించుకొని భుజించిరి.

రాత్రి పదునొకండుగంటలయ్యెను. నాయుడు మంచము తీసి పరుపు పరచు కొనెను. రెండవ మంచముగూడ నదే రూములోనేసి లక్ష్మి తెచ్చుకున్న పరుపు దానిమీద పరచెను.

లక్ష్మి : ఇదేమి! మీరు నాపడక వేయుచున్నారు.

నాయుడు : ఏమి వేసిన తప్పా!

లక్ష్మి : నేనక్కడ పండుకోను. నేను మా అక్క గదిలో పరుందును.

నాయుడు : మీ అక్క ఇప్పుడే రాదు.

లక్ష్మి : వచ్చినప్పుడు రానీ

నాయుడు : నీకు ఒంటరిగానున్న భయము కాదా?

లక్ష్మి : నాకేమియు భయములేదు.

నాయుడు : నాకు భయము, అది వచ్చువరకు నీవిక్కడనే యుండుము. తర్వాత నీ యిష్టము

లక్ష్మి మరి మటాడలేదు. ఏదో పుస్తకమును తెరచి చూచుచు కూర్చొనెను. రెండు మూడుసారులావళించెను. నాయుడు తలుపులవేసి తన మంచము మీద కూర్చొని తాంబూలముతట్ట ముందుంచుకొని వక్కపొడి నములుచు ' లక్ష్మీ, నీవును తాంబూలము వేసికొమ్మని తట్ట అందించ తిరిగెను' కాని 'నా కభ్యాసములేదంటూ' లక్ష్మి వారించెను. మరల ఆమె చదువుచునే యుండెను. పది నిమిషములుగడచెను. మరల ఆమె తలెత్తి చూచునప్పటికి నాయుడామె మంచము మీద కూర్చొని యుండెను.

లక్ష్మి :(దూరముగాజరిగి) ఏమి?

నాయుడు : ఏదైన పద్యమో పాటో పాడుము. విన నువ్విళ్లూరుచున్నాను.

లక్ష్మి : రేపు అందరి ఎదుట పాడుదునులెండి ఇప్పుడు నిద్రవచ్చుచున్నది.

నాయుడు : నా ఒక్కని ఎదుట పాడగూడదా ?

లక్ష్మి : మీరు నేర్పిన విద్యయేగదా! గురువుల వద్ద దాపరమేమి? అదిమీ సొమ్మే కాని

నాయుడు : కాని... ఏమి ?

లక్ష్మి : కాని ఇప్పుడు నిద్ర వచ్చుచున్నది.

నాయుడు : నీ పాట ఒక్కటియేనా నా సొమ్ము

లక్ష్మి : విద్యయు మీ సొమ్మే

నాయుడు : దేహము!

లక్ష్మి : ఔను, చాలా నాళ్ళు పోషించినారు. మీ ఋణము నీజన్మములో తీర్చుకోలేను.

నాయుడు : తీర్చుకొనుటకు సాయమున్నది

లక్ష్మి : ఎట్ల

నాయుడు : నా సొమ్ము నాకొప్పగించుటవలన

లక్ష్మి : నాకర్థము గాలేదు.

నాయుడు : లక్ష్మీ !

లక్ష్మి : మీ ఉద్దేశ్యము నాకు తెలియదు

నాయుడు : నీ స్త్రీ హృదయమున్న తెలుసుకొన గలుగుదువు

లక్ష్మి : నాకు స్త్రీ హృదయముముగాక ఇతర మెట్టుండును!

నాయుడు : నానోటినుండియే చెప్పుకుందునా!

లక్ష్మి : లేకున్న నేనూహించుకో జాలను.

నాయుడు : నిన్ను ప్రేమించుచున్నాను.

లక్ష్మి : మీరట్లనుట తప్పు.

నాయుడు : నీవు కన్యవు మనము పరిణయమాడిన తప్పెట్లగును?

లక్ష్మి : మీరు పితృసమానులు

నాయుడు : సమానమునుగాని పితరుడనుగాను

లక్ష్మి: మీ మీద నాకు భక్తికలదు

నాయుడు : భక్తిని ప్రేమగామార్చ ప్రార్థించుచున్నాను.

లక్ష్మి : అది అసాధ్యము, మీకేల ఈ దుర్మోహము

నాయుడు : దుర్మోహము గాదు. గాఢమగు ననురాగము

లక్ష్మి: సత్యవతి...

నాయుడు : మా యిరువురి మధ్య భార్యాభర్తల కుండవలసిన పరస్పర ప్రేమబాంధవ్యాలు లేవు.

లక్ష్మి : తప్పు మీది

నాయుడు : ఆ తీర్పు నిన్నడుగలేదు.

లక్ష్మి : ఇది పాపము

నాయుడు : ఎన్నటికిని గాదు. మన పరిణయమునకు సర్వమును సిద్ధముచేసినాను.

లక్ష్మి : ఏదీ?

నాయుడు : ఇక్కడగాదు హిందూపురములో మనమేదో కారణము బెట్టుకొని రేపు ప్రయాణమై పోదము, మరునాడే వివాహముచేసికొని తిరిగి వత్తము.

లక్ష్మి : అందుకు నేను సమ్మతించినట్లా?

నాయుడు : సమ్మతింపకున్నను నేను విడువను.

లక్ష్మి : బలవంతమా?

నాయుడు : నయమున వినకున్న యెడల?

లక్ష్మి : నేనప్పుడే గుంటూరులో వివాహము చేసికొన్నాను.

నాయుడు : హా ! ఎవరిని !

లక్ష్మి : మోహనుడను యువకుని

నాయుడు : కల్ల నాయాజ్ఞ లేనిదేనా?

లక్ష్మి : ఇదిగో మేమిద్దరమును తీయించుకొన్న ఫోటో (పెట్టి నుండి తీసి ఇచ్చెను)

నాయుడు : నీవు ద్రోహివి, కృతఘ్నురాలవు.

లక్ష్మి : కావచ్చును. కాని మీయేడల నాకింకను గౌరవమున్నది

నాయుడు : ఉన్నందుకు ఒక్క ఆలింగన సౌఖ్యము నిమ్ము

లక్ష్మి : అది గౌరవచిహ్నము గాదు

నాయుడు : కాకపోయిన నేను బలవంతమునైన గైకొందును

లక్ష్మి : దూరము జరుగుడు. ఈ సరసము విరసముగా పరిణమించుచున్నది.

నాయుడు : ఇక నేను ఓర్చుకోజాలను

లక్ష్మి : నేను కేకలువేసి బయటపోయి నందరిని నిద్రలేపుదును, పోలీసువారికి ఫిర్యాదు చేయుదును.

నాయుడు : అది చేతగాదు

లక్ష్మి : గౌతమి! ఓ ! ఓ! ఎవరయ్యా అక్కడ రండు రండు

నాయుడు : ఆమె నోరు మూయును.

పారాకానిస్టేబిల్ : తలుపుతట్టును ఎవరక్కడ? ఎవరు లోపల? ఎవరు పిలిచినది?

లక్ష్మి : అయ్యా రండి రక్షించండి.

నాయుడు : ఎవరు మీరు?

పారా : మేము పోలీసులము తలుపులు తీయ్యండి.

నాయుడు : మీతోపనిలేదు, మా పిల్ల నిద్రలోకలవరించుచున్నది.

పారా : తలుపుతీసి మరిమాట్లాడుడు

నాయుడు : తలుపు తీయును

పారా : ఏమి అరుపు

లక్ష్మి : ఈతడు నన్ను బలాత్కరించుచున్నాడు

పారా : నీవెవరవు? ఇక్కడికేల వచ్చితివి.

లక్ష్మి : నేను గుంటూరులో కాలేజి విద్యార్థిని, పూర్వ పరిచయమువలన నిక్కడ వచ్చితిని.

పారా : ఇప్పుడేమి చేయమందువు

లక్ష్మి : నన్ను తీసికొని స్టేషన్‌చేర్చుడు. నేను గుంటూరు వెళ్లెదను.

పారా : ఏదైనా కంప్లెయింటు ఇచ్చెదవా?

లక్ష్మి : అక్కరలేదు.

పారా : సరే ప్రయాణము కందు, ఏమి నాయుడూ

నాయుడు : లక్ష్మి

లక్ష్మి : మీకు నాకు ఋణానుబంధము తెగిపోయినది. (పోలీసువారి వెంట వెళ్ళును)

(నాయుడు నిశ్చేష్టుడై పడకమీద పడియుండును)

6

లక్ష్మి ఆకస్మికముగా జట్కాదిగి వచ్చుటచూచి మోహనుడు సంభ్రాంతుడయ్యెను ఎదురేగి పిలుచుకొని వచ్చెను. జట్కావాడు పెట్టె పరుపు తెచ్చి పెట్టి బాడుగతీసికొని వెళ్ళిన తరువాత మోహనుడు

'ఏమి, ఇంత త్వరలో తిరిగి వచ్చితివి' అనెను

లక్ష్మి : మా వారు ఊరలేరు ఎక్కడికో యాత్ర వెళ్ళినారు. ఇంక నక్కడ నాకేమిపనియని తిరిగి వచ్చితిని.

మోహనుడు: మావారును తణుకునకు మా జ్యేష్ఠ సోదరి ఇంటికి వెళ్లినారు. ఇంట నేనొక్కడనే

లక్ష్మి మనసున కొంతకవళపడెను. ఇందున కామె మనసులో సంతోషమే కలెగునో లేక భీతియే యుదయించెనో చెప్పలేము. ఆమె క్షణముసేపు ఏమియూ మాటాడలేదు.

మోహను : కాఫీ నేనేచేసి ఉంచినాను. ఉపమా హొటలు నుండి తెప్పింతును.

లక్ష్మి : హోటలు నుండి ఏల నేను చేయజాలనా? రవ్వలేదూ.

మోహను : అన్నియు యున్నవి. కాని ఇప్పుడేల నీకా తొందరలు రేపటి నుండియు జేతువుగానిలే.

ఎనిమిది గంటలైన వెనుక లక్ష్మీ తానే వంట చేతునని పట్టుబట్టెను. మోహనుడు హొటలు నుండి తెప్పింతునని వాదించెను. కాని తుదకు లక్ష్మియే గెల్చినది.

ఆమె పదార్థములు వెతకికొని అమర్చుకొనుట కొంత కష్టమయ్యెను గాని గంటసేపులో కమ్మనికూరలతో వంటచేసెను. ఇట్లే దినములు గడిచినవి.

... ... ...

కాలేజి తెరచునప్పటికి యథారీతిగా లక్ష్మి హాస్టలు చేరెను. రెండు మూడు దినముల వెనుక మోహనుని అక్కగారును తమ్ముడును ఇల్లు వచ్చిచేరిరి. స్వహస్తపాకము మరిగినందు

నేమొ లక్ష్మికి హాస్టలు తిండి ఇమడలేదు. ఒక్కర్తెయే గదిలో నుండుచు వచ్చెను. తరచు యోచనా నిమగ్నురాలై యుండచుండెను. కాలేజీలాచార్యులీమె పాఠములందు జాగ్రత్తగా లేకుండుటను జూచి పలుమారు మందలించిరి. కాని ఈమె అస్వస్థతయే అందునకు కారణమని ఎంచిరి. హాస్టలు డాక్టరు ఆమె నొకనాడు పరీక్షించి ఏమియు మందువ్రాసి యియ్యలేదు కాని ప్రిన్సిపాలు గదికేగి కొంతసేపు ఏకాంతముగా మాటాడి వెడిలిపోయెను.

నాలుగు రోజులు మరల నెవ్వరామెను మాటాడించలేదు. డాక్టరు ఔషధమును పంప లేదు.

ఐదవ రోజు ఉదయము ప్రిన్సిపాలుగారే ఆమె గదిలోకి వచ్చిరి. తలుపు మూసిరి పరుండి ఏమియో చదువుచుండిన లక్ష్మి తటాలున లేచి వందనమర్పించెను. ప్రిన్సిపాలు గారు తామొక కుర్చీపై గూర్చొని రెండవ కుర్చీమీద నామెను కూర్చొనమనెను.

ప్రిన్సి : లక్ష్మీ నీతో కొంత రహస్యము మాటాడవలసి యున్నది.

లక్ష్మి : (గుండె దడదడకొట్టు కొనుచుండెను) చిత్తము

ప్రిన్సి : నీకు వివాహమైనదా? (ఆయన లక్ష్మీ మొగమును స్థిరముగా జూచుచుండెను)

లక్ష్మి : (తలవంచుకొని) కాలే...ఐనదైనది.

ప్రిన్సి : ఎప్పుడు? ఎక్కడ?

లక్ష్మి : మొన్నటి సెలవులలో మాయూర.

ప్రిన్సి : నాయెదుట అబద్ధము చెప్పవద్దు.

లక్ష్మి : మీరు నన్నేల విశ్వసింపరు?

ప్రిన్సి : నీ గార్డియన్ శ్రీరాములునాయుడుగారికి నేను జాబు వ్రాసియుంటిని వారు నాకు బదులు వ్రాయుచు నీకు వివాహము కాలేదని వ్రాసినారు.

లక్ష్మి : (ఊరకుండును)

ప్రిన్సి : నీ జబ్బేమో నాకు డాక్టరుగారు మొన్నటి దినము తెలియపరచినారు.

లక్ష్మి : (తలవంచియుండును)

ప్రిన్సి : నీవు త్వరలో తల్లివికానున్నావు

లక్ష్మి : (కన్నీరు కార్చును)

ప్రిన్సి : అవివాహితవు నీవిట్టి పనులొనరించి మా కళాశాలకు కళంకము తేనున్నావా?

లక్ష్మి : ఎవ్వరికైనను కళంకము కలుగుపని ఈ లక్ష్మి యెన్నడును చేయదు.

ప్రిన్సి : ముంజేతి కంకణమున కద్దమేల? ఎదీ నీట్రంకు బీగము చెవులిట్లిమ్ము .

లక్ష్మి : నేనియ్యను క్షమింపుడు

ప్రిన్సి : నేనే పగులగొట్టి జూతును

టేబిలు మీదనున్న తాళముచెవులను ప్రిన్సిపాలుగారు తీసికొని ట్రంకు తెరచిరి. అందులో మోహనుని ఛాయపటము అతడు వ్రాసిన ప్రియలేఖలు నుండినవి.

ప్రిన్సి: ఇవన్నియు నెట్లువచ్చెను?

లక్ష్మి : అతడు వ్రాసినవే

ప్రిన్సి : మరి నీ తప్పేమి లేదందువే

లక్ష్మి : అతనిని నేను వరించితిని. పరిణయ మాడుదును.

ప్రిన్సి : సంతోషము, అతని ఇంటివారు ఒప్పుకొన్నారా?

లక్ష్మి : లేదు; అందుకే మా పరిణయము జరుగలేదు.

ప్రిన్సి : లక్ష్మి నిన్ను జూచిన జాలి కలుగుచున్నది. కాని నేను ఇంకొక్క క్షణమైనను హాస్టలులో నుండనియ్యను.

లక్ష్మి : నాకు వేరాశ్రయము లేదు

ప్రిన్సి : అది నీ దౌర్భాగ్యము

లక్ష్మి : నా గార్డియన్‌కు వ్రాసి వేరొక ఏర్పాటు చేసికొను వరకైన అవకాశమిందు

ప్రిన్సి : ఎవరు గార్డియన్

లక్ష్మి : శ్రీరాములు నాయుడు గారు

ప్రిన్సి : ఇదో మీ గార్డియన్ నుండి వచ్చిన లేఖ చదువుము.

లక్ష్మి : ప్రిన్సిపాల్ గారి చేతి నుండి లేఖ గ్రహించి చదువును

అనంతపురము,

మ॥రా॥శ్రీ ప్రిన్సిపాల్ దొరవారి సముఖమునకు, శ్రీరాములునాయుడు
వందనములర్పించి వ్రాసుకొన్న లేఖ,

దేవరా! తమ యుత్తరమందినది. లక్ష్మి నీతిభ్రష్టమైనదని నాకు తెలిసియే నేను సెలవులలో వచ్చినప్పుడు ఇంటిలో నడుగుపెట్టనీకుండ వెల్లగొట్టితిని. తర్వాత సెలవులలో నామె ఎక్కడ నెవ్వరివద్దనుండెనో నాకు తెలియదు. తెలిసికొని ప్రయత్నింపనూ లేదు. నేను ఆమె విషయమున నేమాత్రపు సాహాయ్యముగాని సలహాగాని చేయజాలను. మీ యిష్టము వచ్చినట్లు చేయ వచ్చును. ఆమెను హాస్టలు నుండి వెడలగొట్టుటయే మంచి పద్ధతియని నా అభిప్రాయము, పాఠశాలలో ఇట్టి అవినీతి జరుగనిచ్చుట బాగుకాదు.

శ్రీరాములునాయుడుగారు.

లక్ష్మి : (జాబు క్రిందికి వదలిపెట్టి) చిత్తము తమ ఆజ్ఞయైనచో ఇప్పుడే వెడలిపోయెదను.

ప్రిన్సి : నీవు కాలేజీకి ఎప్పటివలె వచ్చుటకు నాయాక్షేపణలేదు.

లక్ష్మి: తమ ఔదార్యమునకు కృతజ్ఞురాలను,ఆలోచించుకొందును; ఇప్పుడే వెళ్లిపోవు చున్నాను.

లక్ష్మి గది వదలి నిష్క్రమించును.

ప్రిన్సి : ఈమెను చూచిన జాలివేయుచున్నది. కాని నాకర్తవ్యము నేను చేయకతప్పదు. ఈ నాయుడెంత కఠినుడు. గార్డియన్‌గా నున్నవాడు ఇంత నిర్ధయగానా వ్రాయవలసినది. (నిష్క్రమించును)

7

ఏ దినమున లక్ష్మి హాస్టలు నుండి తరుమగొట్టబడెనో ఆ దినమున మోహనుడూ రాలేదు. అతడు ఉద్యోగ కాంక్షచేత మద్రాసునకు వెళ్లి మూడు దినములైనది. ఇంతలో వచ్చునను నాశకూడలేదు.

లక్ష్మి అతని యింటికేగుటకు మనసురాలేదు. ఏమన కొలదిమాసముల నుండి మోహనుని అక్కగారు లక్ష్మిమీద అసూయపడుచుండిరి. మోహనునికి తన పుత్రకనిచ్చి పరిణయము చేయవలెనని ఆమె కోరిక. కాని ఈ అజ్ఞాతకులనంజాత ఈ మాయావిని, ఈ లక్ష్మివచ్చి మోహనునుని మనసు చూఱగొన్నది ఆమెకు క్రోధకారణమయ్యెను. స్త్రీ ప్రేమమయి, దయార్ధ్రహృదయ నిజమే.కాని వాని స్థానమున అసూయా, కోపములంకు రించెనో ఇంక ఆమె ప్రళయచండిక. అగ్నిజ్వాల. సముద్రజల మంతయు ఆ అగ్నినార్ప జాలదు. లక్ష్మి ఇది గ్రహించినది. మోహనుడు లేని తరి వారియింట కడుగిడుట ప్రమా దహేతువని గ్రహించెను. ఇంక నామెకు దిక్కేది?

కాలేజీ ఉపన్యాసకుడొకడు ఈ వృత్తాంతమును వినెనను. సహజముగా దయాళువగుట నతడు లక్ష్మిని తనయింటికి పిలిపించుకొనెను. 'అమ్మా భయపడకుము, నీకు ఇతర సాహాయ్యము దొరకువరకు మా యింటి నా బిడ్డవలెనే యుందువుగాని' అని ఊరడించి తన యింట నిడుకొనెను.

ఆ ఉపన్యాసకుని భార్యయు తనయలును లక్ష్మిని చాల గౌరవముతో జూచుచుండిరి. లక్ష్మి మొదటి ఒకటి రెండు రోజులు కాలేజీకి పోలేదు. ఇంటనే యుండి వారితో తన దుఃఖమంతయు వెల్లడించుకొనెను. చిన్ననాడు తల్లిని, తండ్రిని పోగొట్టుకొన్న లక్ష్మికి నేడా గృహము పుట్టినిల్లువలె తోచెను. ప్రేమమయియగు నాగృహిణి తన తల్లియని భావించుకొని లక్ష్మి ఆమె యెడిలో నూరట గాంచెను.

ఆ యుపన్యాసకుని సలహాతో లక్ష్మి శ్రీరాములునాయుడుగారికి ఒక జాబు వ్రాసినది.అది ఇది.

శ్రీరాములునాయుడు తండ్రిగారి చరణసన్నిధికి

మీ ప్రియపుత్రిక లక్ష్మి వ్రాసుకొన్న విన్నపము,

నా కష్టస్థితి తమకు తెలిసియే యున్నది. తాము మా ప్రిన్సిపాలుగారికి వ్రాసిన జాబు నాకాయన వినిపించెను. నన్ను హాస్టలు నుండి వెడలగొట్టెను. నేను నిస్సహాయురాలనై యున్నాను. ఇది యంతయు నా యవివేకము, నా దౌర్భాగ్యము వలన కలిగిన ఫలితమే.

ఈ సమయమున నాకు తమ కంటె దిక్కెవ్వరు? చిన్న నాటి నుండి ఆశ్రయమిచ్చి సాకితిరి. విద్యాబుద్ధులు తమ యనుగ్రహము వలననే కలిగినవి. ఇప్పుడు దయదప్పుట భావ్యముగాదు.

ఆనాటి రాత్రి జరిగిన విషయములను మరచిపొండు. నేనును వానిని స్మరింపను. యాధారీతి పితృప్రేమను గనుబరపుడు.

తమ నుండి అనుకూలమగు ఉత్తరము రాకున్న యెడల ఈ బాలికకు శరణ్యము ఏ గోదారియో కృష్ణయోయగును. ఇది ఊరక వ్రాసిన మాటగాదు. దృఢ నిశ్చయముతో చేసుకొన్న ప్రతిజ్ఞ. తిరుగుటప్పాలునకు మీ యుత్తరము నభిలషించు

మీ ప్రియకుమారి,

లక్ష్మి.

వారి యింట ఎంత ఆదరాభిమానములు చూపుచున్నను లక్ష్మి మానసము కుదుట బడలేదు. ఆమె తనకు పరాభవము జరిగినదని ఎంచుకొనెను. వంచింపబడితి ననుకొనెను. ఇంక బ్రతికి ప్రయోజనము లేదనుకొనెను. తన ఆశాలత ఒక్కమారు మొదలు తెగి కూలిపోయినదని భావించెను. నాయుడుగారి నుండియైనను సరళమగు ఉత్తరము రాగలదను నమ్మకమామెకు లేదు. ఒకనాడు కాలేజీకి పోవసాహసించెనుగాని తోడి విద్యార్థులనుగానీ ఉపన్యాసకులకును గానీ తలఎత్తిచూచుట కామెకు ధైర్యము చాలినది కాదు. అశ్రుధారాపూర్ణలోచనయై ఆమె తలవంచుకొని ఇంకను తుది గంట కొట్టనిదే కళాశాల నుండి మరలి వచ్చినది.

ఆ ఉపన్యాసకునింట అంతయు ఆమెకు సౌకర్యముగా నుండినది. కాని దైవఘ టనచే ఆయన బావమరది వారి యింటికి వచ్చినాడు. వాడు యువకుడు, ఐశ్వర్యవంతుడు కాని విద్యాగంధము లేదు. సినిమాలు గ్రామఫోనులు మోటారుషికారీలు ఇతర గప్పాలలో ఆరితేరినవాడు.

సుధేష్ణ యింటికి కీచకునివలె నాతడు ప్రవేశించిన నాడే ఆ లక్ష్మి వాని చూపులలోని కుటిలత గ్రహించెను. తరచు బయటికి రాకుండ లక్ష్మి తనగదిలోనే నుండుచువచ్చెను. కాని తలుపు తెరచెనా బయట నాతడు హాజరు.

ప్రొఫెసరు కాలేజికి వెళ్ళును. పిల్లలందరు బడికి వెళ్లుదురు. ఇల్లాలు ఇంటి పని పాటలు

చేసికొనుచుండును. లేదా విశ్రమించియుండును. ఈ కీచకునికి వేరుపని లేదు. లక్ష్మి గదిచుట్టూ కూనిరాగములు పాడుచు తిరుగుచుండును.

లక్ష్మికి కాలేజీకి పోవ నిష్టములేదు. ఇంటనున్న ఈ క్రొత్త బాధ ఒక్కటి ఉత్పత్తి యయ్యెను. ఇది పెద్దవారికి తెలియచేసిననేమి తప్పో, తెలుపకున్ననేమి ప్రమాదమో!

ఒకప్పుడామె యాతనివంక రూక్షవీక్షణముల బరపెను. వాడు దానికి చిఱునవ్వు నవ్వి కనుసన్నలతో ప్రత్యుత్తర మిచ్చెను. మృగమును వేటకాడువలె వాడామెను వెంటాడెను. లక్ష్మికి వ్యసనము, క్రోధము పొంగివచ్చినవి. ఏమిచేయగలదు? గది తలుపువేసికొని ఏడువ దొడగెను. ఎంతసేపేడ్చెనో తెలియదు. చెఱగు నీటనద్దినది వలె తడిసి యుండినది.

ఇంతలో తలుపుకడ పోష్టు బంట్రౌతు లక్ష్మికని ఒకజాబు తెచ్చియిచ్చినాడు. నాయుడుగారి నుండి శ్రీముఖమిది. అతురముతో గది తలుపు లక్ష్మి తెరచుకున్నప్పటికి ఆ కీచకుడా ఉత్తరము చేతపట్టుకొని 'లక్ష్మీ,నీకీదే జాబు' అంటూ వికటపు మందహాసముతో ఆమెకది అందిచ్చునెపమున కరస్పర్శ కావించినాడు. కాని జాబును చూడవలెనను ఆశతో ఆమె యీ అవమానము లెక్కింపలేదు. వెంటనే తలుపులు చేరవేసికొని జాబువిప్పి చదువు కొన్నది. అది శ్రీరాములు నాయుడుగారి నుండి వచ్చినదే. అందులో ఏమి లిఖింప బడినదో తెలియదు. వెంటనే ఆమె దానిని చింపులు చింపులుగావించి నిప్పుపుల్లగీచి ఆ చిదువుల న్నంటిని నిర్మూలముగా కాల్చివేసినది. కన్నీళ్ళతో పడకమీద బడిపోయినది. సాయంకాలము వరకు ఆమె పొలకువయే వినబడలేదు.

రాత్రి ఆకలిలేదనుచు ఇంటివారిచ్చిన కాఫీ మాత్రమే త్రాగి పరుండినది. ఉదయం ఆమె ఉనికినంత ఎవ్వరును గమనించలేదు. కాని మామూలుగా 8 గంటలవేళ ఆమె కాఫీకి రాలేదని వారి కూతురు గదిలోనికి వెళ్లిచూచినది. లక్ష్మిలేదు. నాయనా లక్ష్మి కనబడ లేదని ఆ పిల్ల అందరితో జెప్పినది. ఎక్కడ ఎక్కడనని పలువురు పలుతావుల వెదకిజూచిరి. ఎందుకు ఆమె జాడ కనబడలేదు. కాని గదిలో నుండి వారి బావమరిది ఆమె పడకమీదనున్న ఒక జాబు తెచ్చియిచ్చెను. అది ఆ యింటి యజమానికి వ్రాయబడినది. అందిట్లున్నది. గురూత్తమా...!

ఇన్నాళ్ళు నన్ను గర్భవాసమున నుంచుకొని రక్షించినందుకు నేను కృతజ్ఞురాలను. కానీ నేనీజన్మలో మీ యాదరమునకు ప్రతి తీర్చుకోలేను. ఏలన ఈ విశాల ప్రపంచములో నాకు నిలువ నీడలేదు. నేను గర్భవతిగా కూడా నున్నాను. నాకే ఆశ్రయములేనప్పుడు నా సంతానమున కేడకల్గును? ఏల మే మీ పృథివికి బరువుగా నుండ వలెను".

"నాకు మానవత్వమునందే విశ్వాసము అంతరించినదని చెప్పుటకు చింతిల్లుచు న్నాను. తమబోటి సత్పురుషులందందు లేకపోలేదు. కాని అందరు తమవంటి వారు కారు. ఎవరు నన్ను పుత్రికగా సాకి సంతరించిరో అట్టివారికి వాత్సల్యము బదులు దుర్మోహము అంకురించి వారి కామాగ్నికి నన్ను బలిగాచేయ ప్రయత్నించినప్పుడు ఈ అనాథ బాలిక ఎవ్వని

విశ్వసింపవలెను? ఎవ్వరు నన్ను ప్రాణములంటె తీపియని నాతోడిదే తమకు లోకమని భ్రమింపజేసి, చేయవలసిన అక్రమముచేసి తుదకు త్యజించిరో అట్టి వారికి నిలయమైన ఈ భూమిలో నావంటి హతభాగిని నిలువరాదు. నాకు కృష్ణవేణియే తల్లి సముద్రుడే తండ్రి. నా తల్లి మూలకముగా తండ్రిని జేరుకొందును. తమకు శ్రమయిచ్చి నందుకు క్షమింపుడు. నా విషయము అనంతపురమునకు దయవుంచి వ్రాయకుడు'.

ఇట్లు
నిర్భాగ్యురాలు,
లక్ష్మి.

మరునాడు అరుణోదయమున బెజవాడకు దక్షిణమున పదిమైళ్ళ దూరములో కృష్ణా స్రవంతిలో నొక గర్భవతియగు యువతి దేహము తేలాడుచుండినది. పడవవాండ్లు దానిని గట్టున కీడ్చిరి. పదిగంటలకు పోలీసులు వచ్చి పంచాయితీచేసి ఆత్మహత్యయని తీర్మానించిరి. ఆ వృత్తాంతము ఆంధ్రపత్రికలో గూడ ప్రచురించబడెను.

శ్రీరాములునాయుడా వృత్తాంతము చదివెను. నాటి దినము బడిలో ఆయన సంగీతపాఠము సమయమున శ్రుతిలో స్వరము కలియలేదు.

**3 అక్టోబరు నుండి 28 నవంబర్ 1936 వరకు,**
**సాధన పత్రిక**

# బ్లాకీకుక్క చరిత్ర

**- కందాళ శేషాచార్యులు**

1

అది చిన్న పల్లెటూరు, అందు కరణముగారి యింట ఒక్క కుక్కపిల్ల పెంపబడు చుండెను. కేవలమది వీధి కుక్కల మోస్తరుదైననూ తోడబుట్టువుల లేమింజేసి తల్లిపాలు పుష్టిగ(త్రాగి బటువుగ పెరుగుచుండెను. దానికి రాముడని నామకరణము గావించిరి. కరణము గారు 'రామ్' అని పిలుచుటే తడవుగ నది ఆయన వెంట పొలములందు అజమా యిషీ చేయుట కేగుచుండెను. అది మరల మిట్ట మధ్యాహ్నమున కిలుచేరుచుండి తనకై పడవేయబడిన చలిదియన్నమో యెండిన రొట్టెముక్కయో తిని తృప్తినొందుచుండెను. దానికి పరుండుటకు యింటి బయట యరుగే గతి. రాత్రింబవలు శీతవాతముల పాటుకులోనై యది కష్టపడుచుండిననూ మిగుల సొంపుగ పెరుగుచుండెను.

ఒకనాడు దగ్గఱ పట్టణమునందుండు జాన్ గారు స్నేహితుడగు కరణమును పల్కరించు టకు వచ్చిరి. వారి చూపు రామునిపై బడెను. వెంటనే దానిని తనకిమ్మని కరణముగారి నడిగిరి. స్నేహితునికి బదులు పలుకక రాముని జాన్ వశము గావించెను. జాన్ గారు దానిని తమ కారునందిడుకొని పట్టణమునకేగిరి.

పల్లెటూరి నివాసమునకు స్వస్తిచెప్పి రాముడు జాన్ దయవలన పట్టణవాస సుఖమనుభవింప దొడగెను. రామ్ అను పేరు గతించి దానికి రామ్‌సేయను క్రైస్తవ నామము వచ్చెను. చూచినవారెల్లరు దానిని రామ్‌సేయని పిలువదొడంగిరి. ఆపేరు దానికి నూతన శోభను గూర్చుచుండెను. ఎవరైనా పొరబాటున దానిని రామ్ అని పిలిచినచో దానికి బొత్తుగ గిట్టదు. అట్టివారిని చూచి యది కోపమున మొఱుగుచుండెను. పేరననే పసయుండుటయని దానికి మాత్రము తెలియకపోవునా!

ఇప్పుడు రామ్‌సే మంచి మంచి రొట్టెలు తియ్యని ఫలములు కాఫీ స్వీకరించును. వాలుడు కుర్చీలపైనను పరుపులపైనను పరుండును. స్నానములకు గుడ్‌విను సబ్బులుపయోగించును. షికారునకు మోటారులపై పోవును. ఒకనాటి విందు సమయమున జాన్ గారి కుమారుడొకడు రామ్‌సేనోట బలవంతమున బుడ్డీలోని ద్రవము నించుక పోసెను. నది అది మొదలు దానికా ద్రవము రుచి తలకెక్కెను. వేయేల! మన పల్లెటూరి రాముడిపుడు రామ్‌సేగా మారి నవనాగరికతయందు పూర్తిగ మునిగితేలుచుండెనన్న చాలును.

సరుకులను కొను నిమిత్త మాపురమునకు మన కరణముగారు వేంచేసి యుం డిరి.పనిని పూర్తిగావించుకొని మరలిపోవుచూ వారు తమ మిత్రుని చూడవచ్చిరి. మాట వరుసను తమ కుక్క క్షేమ సమాచారములను విచారించిరి. దానిని చూచి సంతసించి 'మన గ్రామమునకు వత్తువా!' యని ప్రశ్నించిరి. రామ్‌సే కిపుడు పల్లెఅన్న గిట్టునా? అది రానన్నటుల తెలియజేయుచూ పెద్ద పెట్టున మొఱిగి జాన్‌గారి యంకతలమును జేరెను. కరణము

చేయునది లేక మరలిపోయెను. ఎటునుండిన నేమి? తన కుక్క సుఖమనుభవించిన చాలునని యతడు తలంచెను.

2

ఇపుడు రామ్‌సేకు మంచి దినములు. అదృష్టదేవత వీక్షణము దానిపై బడినది. ఇంకను మంచి పదవి దానికి రానున్నదని యొక జ్యోతిషశిఖామణి జాన్‌గారికి తెలిపి యుండెను. నిజముగ భాగ్యదేవత గ్రుడ్డిదికాకున్న కోట్లకొలది జనులు తిండిలేక మలమల మాడుచుండ నీకుక్కకు అదృష్టమబ్బునటుల జేయునా? దాని యాహార పానీయములకు కొఱతలేదు. అది పుష్టిగ పెరుగుచుండెను.

ఆనాడు కలెక్టరు దొరగారాపురమున మకాము చేసిరి. వారిని చూచునిమిత్తము పలువురు పెద్దలు ముసాఫరు బంగళాకు పోయిరి. మన జాన్‌గారును తమ కారునెక్కి వెడలిరి. వెంట రామ్‌సేను కొనిపోయిరి. దానిక్కూడ తెల్లదొరగారిని సమీపించు భాగ్యము కలిగెను. బంగళాకు వెలుపల కొందరు రైతులు తమ కష్టములను విన్నవించుకొని వినతి పత్రమును దొరగారికి సమర్పింప వేచియుండిరి. జాన్‌గారు మోటారు దిగి చక్కగాలోని కేగిరి. కాని రామ్‌సే మాత్రమాకర్షక జనమునుచూచి యేలకో గఱ్ఱుమనెను. ఇటీవల దానికీ గ్రామజనుల దర్శనము గిట్టదు కాబోలు !

దొరగారికి కుక్కలను పెంచుటయందు ప్రీతిమెండు. జాన్‌గారి రామ్‌సే చూచుటకు వింతగ నుండెను. కనుక దానిని తనకిమ్మని జాన్‌గారి నడిగిరి. పెద్దల మాటలకుబదులు పలుకువారేరి? జాన్‌గారు సంతసమున కుక్కను దొరగారికిచ్చిరి. అది మొదలు రామ్‌సే కలెక్టరు దొరగారివద్ద పెరుగజొచ్చెను. జాన్‌గారు దొరగారి శెలవుపొంది బంగళా వీడిపోవుచూ రామ్‌సేను పలుమరు ముద్దాడి ముందరగిరి.

మరుదినమున మోటారులో రామ్‌సేను తీసుకొని దొరగారు తమ ప్రధాన నగరమునకేగిరి. అచట వారి బంగళా పెద్దది. పలువురు సేవకులు, వివిధములగు నాటవస్తువులు, అట జాన్‌గారి యింటికన్న మహావైభవ మెక్కుడగుటచే రామ్‌సే యుప్పొంగి పోయెను. అది యల్పసంతోషి. కాని అంతకు మున్నే యా బంగళాయందు పెంపబడుచున్న డజను కుక్కలను చూచి మన రామ్‌సే బెదరెను. సీనియారిటీని బట్టి తనకు తగుమాత్రపు గౌరవము లభింప దేమోయని భయమందెను. దొరగారదిగాంచి రామ్‌సేను భయపడవలదని మందలించి వీపు చఱచెను.

దొరగారు అచ్చము పాశ్చాత్యులు. కనుక తమ కుక్కలన్నిటికిని స్కాట్, స్టోను, టామ్, జాకీ, కింగు వంటి పేర్లనే పెట్టియుండిరి. అన్నిటి పుచ్ఛములను తగుమాత్రముంచి తెగగొట్టియుండిరి. మన పల్లెటూరి కుక్క ముద్దులు గొలుకుచున్ననూ కొంత నలుపురంగు కలదగుటచే దీనిని బ్లాకీయని పిలువదొడగిరి. దీని తోకను గూడ తెంచిరి. తోక తెగిన బ్లాకీని చూచిన కొన్ని బజారురకపు శ్యానములు పండ్లిగిలించి నవ్వుటచే దానికి రోషము

కలిగెను. కాని యది వాని హేళనమును లెక్కింపక తోకను తెంపుకొనుటయే ఫ్యాషన్‌గా భావించి సగర్వముగ తిరుగజొచ్చెను.

పరిసర ప్రాంత్యముల మార్పుతో బ్లాకీ యొక మెట్టుకెక్కెను. ఆహారపానములందది మరింత సౌఖ్య మనుభవింప సాగెను. అది యిపుడు నేలపై నడచుటయరదు. నిరంతరము సేవకుల భుజపీఠముల అలంకరించుచుండెను. ప్రొద్దున దానికి వేడినీటి స్నానము, పిమ్మట ప్రభుని వెంట తోటలందు షికారు, ఫలాహారమునకు బిస్కత్తులు ఓవల్టిను దానికి లభ్యమగు చుండెను. భోజన సమయములందు తృప్తిగ పులావులభించుచుండెను. అపరాహ్ణ సమయమున దొరవెంట ఆఫీసునకేగి అతని ప్రక్కన సుఖముగ కూర్చొనుచుండెను. ఒక కంట ఆఫీసు పనులను తిలకించుచుండెను. సాయంత్రమున దొరగారి టెన్నిసు ఆటలందు దవుదవ్వులకేగు బంతులను నోటకఱచుకొనివచ్చి స్వామి కందించుచుండెను. రాత్రివేళ భోజన సమయము లందది బ్రాందీబుడ్లను గది నుండి వెలుపలకు దెచ్చుచూ పదిలముగ టేబిలుపై నుంచు చుండెను. అందరి జతలో తన శక్తిమించక బ్రాందీ పుచ్చుకొనుచుండెను. కడకు తనకై సేవకులు పఱచిన పాన్పుపై సుఖనిద్రంజెందుచుండెను. ఇవేదాని నిత్యకృత్యములు. సత్యమాలోచింప నావల్ల కుక్కదే భాగ్యమనక తప్పదు.

దొర గారిని చూచు నిమిత్తమపుడపుడు గొప్ప గొప్ప జమీందారులు, ఆఫీసరులు, భూస్వాములు, చిల్లర యుద్యోగులు వచ్చిపోవుచుండిరి. పూవుల నాశ్రయించిన దారము కూడ తలపైకెక్కును. అటులే ఆవచ్చిపోవు వారు దొరను చూచి మాటలాడిపోవునపుడీ కుక్కను కూడా పరామర్శించుచుండిరి. దానిని పలుకరించి యాహారపదార్థములను దినుట కిచ్చుచుండిరి. ఒక్కొక్క సమయములందు దొరగారి దర్శనమునకు ముందే సదరీ గౌరవము బ్లాకీకి లభించు చుండెను.

కొన్నిరోజులు గతించెను. ప్రభుత్వమువారు దొరగారిని చెన్నపట్టణమునకు మార్చిరి. ఇపుడతనికి రెట్టింపు వేతనము చిక్కెను. హెూదా కూడ గొప్పదే. వారు చెన్నపురము నకేగిరి. మన నల్లకుక్క కూడ యదృష్టము కలదే. దొరగారి దయవలన నాపట్టణము చూడగలిగెను. ముందుండిన తన గ్రామమెక్కడ ? చెన్నపట్టణమెచ్చట? దానికి దీనికిగల తారతమ్యమెంత అబ్బ! అచటి వింత వింత విద్యుద్దీపములు, ట్రాములు, మోటారులు, గొప్ప గొప్ప భవనములు, టెలిఫోను తంతులు, సినిమాలు మొదలగునట్టి నూతన వస్తువులను చూచి బ్లాకీ యుప్పొంగెను. దాని యానందమే యానందము.

జిల్లా పట్టణములకన్ననూ చెన్నపురియందు తెల్లదొర లెక్కువ నివసించుచుండిరి. అందరును గొప్ప పదవులందుండువారే. వారి నాశ్రయించిన కుక్కల గుంపును గొప్పదే. బ్లాకీ యా శునకముల స్నేహము సంపాదించెను. అవి యన్నియు ఒక సంఘముగ గూడి ప్రభువుల నాశ్రయించినవే వానిపని దొరల బంగాళాలందు కుత్తుగబంటిగ మేయుట యందే తిరుగుచుండుట తప్ప యే ఘనకార్యముగాని చేసి యెరుగవు తమ జాతివానికే యుపకారము

కాని చేసిన పాపమున బోవు! ఇవి కేవలమలంకార ప్రాయముగ దొరల ప్రాంగణముల నంటిపెట్టు కొనునవేకాని, యే బజారు కుక్కలు తరముకొని వచ్చిననూ యెదిరించు శక్తిచాలక తుర్రనపారిపోయి మరల నా ప్రభువుల యంకతలముల నాశ్రయించునవే. వీనికి స్వాతంత్ర్యమునున్న పౌరుషము హుళక్కి మానాన మానములు నహి.

మన బ్లాకీ చెన్నపురియే గాక నీలగిరిని కూడ దర్శించి ధన్యతజెందినది. అపుడప్పుడు దొరగారి వెంట రాష్ట్ర పర్యటనము గావించి ప్రజల పోకడలను గుర్తించినది. ఎన్నియో నూతన భవన శంఖుస్థాపన ప్రారంభోత్సవములందును, జయంత్యుత్సవము లందును దశరా క్రిసుమను వేడుకలందును పాల్గొని యానందమున మునింగినది. దాని జన్మదానికే తగును.

4

దొరగారు మూడు నెలల సెలవు పుచ్చుకొని సీమకు పయనమయ్యెను. అతడు బ్లాకీని చూచి "You fellow , do you like to follow me" నావెంట వచ్చెదవేమోయి యని ప్రశ్నించెను.

మన నల్లకుక్క కాంగ్లేయ పదములు పలుకుట రాకున్ననూ అర్థమును గ్రహించు కుశాగ్రబుద్ధి కలదు. అంతనది దొరను చూచుచూ పండ్లిగిలించుచూ వచ్చెదనన్నటుల దీనముగ మూల్గెను. ఆశ్రితులను ప్రభువులెన్నటికిని విడువరు. మరునాడే బొంబాయిచేరి దొరజతతో బ్లాకీ 'రాజపుటావా' నెక్కెను. ఇట్లు పల్లెటూరి శ్వాసము కడకు సీమ పయనమునకు కూడ తయారయ్యెను.

అందరికి వలెనే బ్లాకీకి కూడ సముద్రయానమున డోకులు వచ్చెను. కాని అందు డాక్టరులకు కొదువయా! వారు దాని కారోగ్యమును గూర్చిరి. దారి పొడుగుననూ గల వింత వింత దేశములు, మనుజులు, వస్తువులు చూచి యది యసారముదము నొందెను. మార్గమధ్య మమున ప్యారిస్ పట్టణమున దొరగారు రెండు దినములు నిలిచిరి. నాగరికతకు పుట్టినిల్లగు ప్యారిస్‌లోని వింతలు బ్లాకీచూసెను. ఆఖరున లండనుచేరి భూలోక స్వర్గసుఖమను భవించ దొడెగెను. కుక్క మనమున 'లండనగుపించెన్ ఆహా! నాకోర్కె ఫలియించెన్' అని గొణగికొనెను.

లండను పురమున కొన్ని దినములు సుఖముగ గడచినది. అచటి వింతలు వర్ణింప చూచువారికే సాధ్యపడదనిన చూడజాలని యురగాధిపతికి సాధ్యమా ! దొరగారు మరల భారత దేశాభిముఖులైరి. చెన్నపురిని మరల తన హెూదాను స్వీకరించిరి. లండను చూచివచ్చిన మన బ్లాకీని మద్రాసొక చిన్న పల్లెటూరి వలె యగుపడెను. నిరంతరము లండను పట్టణముననే నివసించుట మేలనియు, తన్నాపురమున జన్మింపజేయని బ్రహ్మయెంత తెలివి మాలినవాడనియు బ్లాకీకి తోచెను.

దొరగారొకటి రెండు సంవత్సరములు పనిచూచుచుండి పింఛను పుచ్చుకొనిరి. తమ దేశమునకేగ నిశ్చయించిరి. పోవుచూ శనిలాగ యీ నల్లకుక్కను కొనిపోవుటకు సమ్మతింతురా! దానిని తమ సేవకులందు ముఖ్యుడగు ఒక ముదలియారు వశముగావించి దాని పోషణము

నిమిత్తమై యొక పదిరూపాయల నోటును కటాక్షించిరి. బ్లాకీ మరల లండను పురమును చూడవలయునని గంపెడాసగలదై, కడకు చచ్చిననూ లండనున చచ్చుట మేలనియు తలంచి, గోడుగోడున నేడ్చుచూ తన్ను మరల వెంటగోని పొమ్మని దొరను ప్రార్థించెను. కాని ఫలములేక పోయెను. ప్రభుత్వాధికారులును, అధికారేతరులును దొరగారికి గొప్పగ వీడ్కోలు విందుల గావించి వారిని సగౌరవముగ వారి దేశమునకు సాగనంపిరి.

పాపము ! ఇంత బ్రదుకుబ్రతికి నల్లకుక్క అంతమున నా ముదలియారుదయకు పాలుగావలసి వచ్చుట శోచనీయాంశము.

5

డబ్బు కనుకట్టువలె వైభవము, సుఖము, మర్యాదలను తెచ్చును. అది గతించిన పిదప అన్నియు సున్నయగును. పది రూప్యముల మర్యాదను బట్టి బ్లాకీని పోషించుచూ కొన్ని దినములు గడిచిన పిదప ముదలియారు దానిని యిలు వెడలించెను. అయ్యో ! ఇంకేమిగతి! బ్లాకీకి సుఖమింకెక్కడ లభింపగలదు ? ఎవరు దానిని సమీపమునకు రానిత్తురు? పదవీచ్యుతుడయిన రాజువలె నది పిచ్చిపట్టిన దానివలె వీధుల వెంట పరువెత్తజొచ్చెను. పాపము ! ఇపుడు దానికి మెత్తని దిండ్లు, కుర్చీలు, తినుబండారములు, పానీయములు, ఆహ్వానములు, చుంబనములు, పూవుల మాలలు కఱువయ్యెను. దానికిపుడు దుఃఖము పొంగి పండ్లు పటపట కొఱకుచుండెను.

అలవాటు చొప్పున యా శునకమొక క్లబ్బులోన ప్రవేశించెను. అది దానికి పరిచిత స్థానమే. కాని అదేమి? దర్వాను నిర్దయుడైయొక తాపు తన్నుటచే దాని పంచ ప్రాణములు కదలెను. అంతట నది గూచుచూ వెలికి వచ్చినది. ఆకలికి తాళజాలక దొరగారొకప్పుడు ఖాతాయుంచి యుండిన బిస్కత్తుల యంగడిని ప్రవేశించెను. ప్రతి దినమును పల్కరించి యాదరించు చుండిన వర్తకుడు కదాయని తలచి బ్లాకీ మిగుల చనువున వాని తొడపై నెక్కబోయెను. ఆహా? ఏమ న్యాయము? బ్లాకీకి తలగిర్రున తిరిగినది. తెలివి తప్పినది. మరల స్మృతి వచ్చునప్పటికి అది యొక జలదారి గట్టున పడి యుండెను. దయావిహీనుడగు వర్తకుడు చక్కగ దానికి దేహశుద్ధి గావించెను కాబోలు!

చెడి బ్రదుకుట కన్న బ్రదికి చెడుట మహాదుర్ఘటము. పాపము! మన బ్లాకీగతి దుర్గతి యయ్యెను ఎచటి కేగిననూ దానిని పల్కరించు వారు లేకుండిరి. దానికి నిజముగ పిచ్చి పట్టెను. తిండికి లేక శల్యమాత్రావశిష్టమయ్యెను. దిక్కు తెన్ను కానక చెన్నపురి జన సమూహముల నడుమ వీధుల వెంట పరుగిడజొచ్చెను. కాని తనజాతివగు బజారు కుక్కలు దీనిని బ్రతుక నిచ్చిన కదా? అవి దీనిపై ద్వేషము సాధింప దొడిగినవి. దానిని నిలిచినచోట నిలువనివ్వక వెన్నంటి తరిమినవి. స్వజాతి వైరము చెడుపు దెచ్చునని యది యప్పటికి గ్రహించినది. పశ్చాత్తాప పడినది. కాని యప్పటికే దాని స్థితి శ్రుతికి మించిపోయి యుండెను.

నాడెవడో మహనీయుని రాకకై మద్రాసుపుర మలంకరింప బడినది. జనులు వేలకు మించి సెంట్రలు స్టేషను వైపు వెడలుచుండిరి. బ్లాకీ కూడ తోడికుక్కల కాట్లకు వెఱచి పరుగెత్తి వచ్చుచూ ఆ జన సమూహమున జొరబడినది. అదియు వారి వెంట సెంట్రలు సమీపించుచుండగా ఎవడో బాలుడొక బిస్కతును తినుటచూచెను. ఆకలి దహించుకొని పోవుచుండెను. చాపల్యమున బ్లాకీ ఆ బాలునిచేతి బిస్కత్తును సంగ్రహింప బోవుటలో నాతనిచేతి వ్రేలికి కాటు తగిలెను. ఎవరో దీనిని పిచ్చికుక్క పిచ్చికుక్క యని పిలిచిరి. అంతలో మహనీయుడొకడు చేతి కఱ్ఱవేటున దానిని క్రిందికి నూకి ప్రక్కన ప్రవహించుచుండిన కూవము (వైతరణి) నదియందు పారవైచెను. ఆ ముఱికి నీటిని మూడు గుటకలు గ్రోలి బ్లాకీ అశాశ్వతమగు నీ దేహమును చాలించెను. బ్లాకీకి కడకు కుక్కచావే. దేవుడు దాని యాత్మకు శాంతినిచ్చుగాక.

**- 5 డిసెంబర్, 1936 సాధన పత్రిక**

*(కందాళ శేషాచార్యులు అనంతపురం జిల్లాలోని బుక్కపట్నం, కొత్తచెరువు గ్రామాలలో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహించేవాడు. సాధన పత్రికలో కథలు, వ్యాసాలు రాశాడు. 'వింత ప్రపంచం' అనే శీర్షికన విజ్ఞాన సంబంధమైన అంశాలపై వ్యాసాలు రాశాడు. ఇతని సాహిత్య కృషి వెలుగులోకి రావలసి ఉంది.)*

# సముద్ర మథనము - స్వరాజ్య సంపాదనము

- యర్రగుంట నారపరెడ్డి
మరూరు బండమీదపల్లె,

భారతీయులారా!

తొల్లి దేవేంద్రుని యవివేకమునంజేసి స్వారాజ్యవిభూతి యంతయు సముద్రమున మునింగిపోయినట్లు భారతీయుల యవివేకమున భారత సామ్రాజ్య విభూతి యంతయు బాశ్చాత్యలావణ్య సముద్రమున మునింగిపోయినది.

తత్సంపాదనాయత్తచిత్తులై సురాసురు లైకమత్యంబున నమృతోత్పాదన ప్రయత్న మొనర్చినట్లు కాంగ్రెస్ జస్టిస్ పక్షములు రెండును యేకకార్యపరత్వమున స్వాతంత్ర్యా మృతోత్పాదనమునకు గడగుటెంతయు సమీచీనముగ నున్నది.

దివిజ దనుజ సముదయంబమృత లబ్ధికై పరమోద్యోగంబున మందరనగోత్పాటన మాచరించి పురుషోత్తమ సాహాయ్యమున నమ్మందరాగము నమందరాగమ్మున సింధువుం జేర్చినట్లు యీ రెండు పక్షములు నేత దమృతాశయనంబు సభ్యత్వనామక మందర శైలో న్మూలన మాచరించి పురుషోత్తమ సాహాయ్యమున నజ్జలనిధింజేర్చుట మిగుల ప్రశంసార్హము.

అమ్మందరనగమున కవ్వానుకి తరిత్రాడుగ బరివేష్టించియుండునట్టీ సభ్యత్వ మందరమున కధికార ఘోర వాసుకి చుట్టుకొని యుండుట నొప్పిదముగ నున్నది.

దేవదైత్యులు తల తోకలకై పీకులాడినట్లు వీరును సమాకర్షణ స్థానభాగ నిర్ణయమునకు తగవులాడు చుండుటయుందగియున్నది.

అమ్మందరమున కయ్యానికి కూర్మమాధారముగనున్నట్లు యీ సభ్యత్వ మందరమున కీ యోటుకూర్మ మాధారముగ నున్నది.

ఇట్లు స్వారాజ్య విభూతి సంపాదనకయ్యు సురాసురుల చందమున స్వరాజ్య విభూతి సంపాదనార్థ మీ కాంగ్రెస్, జస్టిస్ పక్షములు రెండును బోరాడుచుండు టెంతయు శ్లాఘ్యముగ నున్నది.

కాని యిట్లుభయ పక్షముల వారును స్వాతంత్ర్య సుధా జననంబు జింతించుచు కొఱవడని తమకంబుల మరువుడింపక తరచుచుండ పరస్పర కరక్రమ, క్రమాకర్షణ సరీసృప పరీవృత ధరాధర పరిభ్రమణ వశంబున నిర్భర మత విద్వేషనామక మహా హాలాహలము ధ్భవించి భువన కోలాహలంభుంగ నింగిముట్టి నలుగడలకుంబఱచి సర్వలోకాధికంబై శక్యంబుగాక యకాల విలయమంజేయుచున్నది. మహాదేవ సాక్షాత్కార మెప్పటికో !

ఈ యవాంత్రము శాంతించినంగాని త్రచ్చుటకనువుపడదు. ఇట్టిలోకోప్రదవము తుట్టతుదకే మహాత్ము ననుగ్రహముననో శాంతించినను సుధాజనన మెంత కాలమునకో గాని శీఘ్రముగ కాదు. కరితురగ లక్ష్మిత్యాదులు రావలెను. సౌశీల్య చంద్రోదయము కావలెను. అనంతరము కట్టకడపట గదా స్వాతంత్ర్యామృత సంభవము !

ఇయ్యమృతము జనించినంతనె సంతోషము కాదు. అప్పుడీ యుభయ పక్షములందు

నయ్యమృత విభాగమునకై కలుగు కాసట బీసటలు, గాడిద గత్తరలు, గందరగోళములు యెట్లుండునో ! ఇయ్యమృతము పుట్టకున్నను బాగుండెనే యనుకొను స్థితి కలుగనేమో !

ఇట్టి కల్లోలముం గాంచి యమృతవిభాగ పరిష్కారమునకు ప్రభుత్వ మోహిని సాక్షాత్కరించియయ్యమృత కలశమును తనకైవసము జేసికొని వీరియుద్రేకమును మఱింత యగ్గల మొనరించును.

రెండు పక్షములవారును సమానముగ కష్టించి సాధించిన దగుట నయ్యమృత మును రెండు పక్షములకును సమానముగ నివ్వవలసినదిగ నున్నను; అందే పక్షము సత్ప్రతిష్ఠార్జ నాసక్తముగ నున్నదో, యే పక్షము శాంత శమదమాది సద్గుణ భూయిష్టమో, యే పక్షము సత్యదయా ధర్మముల కాలవాలమైనదో, యే పక్షము ధైర్యస్థైర్య గాంభీర్య పరాక్రమాది గుణగణాలంకార భూషితమో, యే పక్షము నిష్పక్షపాతి ప్రశస్తప్రవర్త నాభిశోభితమో, యే పక్షము ప్రజాహితమునకై పాటుపడు స్వభావము గలదియో, యే పక్షము రాజ్యపాలనమును లోకానందకరముగ నిర్వహింప సమర్థమైనదో, యే పక్షము సర్వజనాంగీకృతముగ నున్నదో గుర్తెఱింగి అట్టి పక్షమునకే యవ్విలాసనతి సంపూర్ణముగ నివ్వదలంచి, మఱియొక పక్షమును తన హావభావ విలాసాది శృంగార చేష్టాభినయములచే తన్మయత్వ మొనరించి కికురించి తుట్టతుదకు తన యభిమాన పక్షమునకు యమృత మంతయు బంచియిచ్చును. తత్ప్రధానిభాగ సమయమున రాహుకేతువు లెందఱుందురో! సూర్యచంద్రులు మాత్రముండక పోదురా ...!

అప్పటికీ రెండు పక్షములలోను సుధాపాన ముదాత్ములు దేవతాంశ సంభూతులనియును, మోహినీ మోహమాయా వశాత్ములు రాక్షసాంశ సంభూతలనియును తెలియవచ్చును. కాని యింతవరకును యీ కాంగ్రెస్ జస్టిస్ పక్షములందు దైవరాక్షసాంశ విభజనముఁజేయరాదు.

ఇట్లు స్వరాజ్యవిభూతి సంపాదనకై స్వాతంత్ర్యామృతముం బడయగోరి సభ్యత్వ మందరమును లావణ్యాంబుధింజేర్చి యీ కాంగ్రెస్ జస్టిస్ పక్షములవారు సురాసురుల చందమున ద్రచ్చుచున్నారు. ఇప్పటికి మతద్వేషనామక హాలాహలోద్భవము ప్రారంభమైనది. లోకరక్షణ కళాసంరంభుడగు శంభునికై రెండు పక్షములవారును యెదురు చూచుచున్నారు.

ఇప్పటి పరిస్థితులంజూడ తుట్టతుదకు స్వాతంత్ర్యామృతమే లభించునో లేక సముద్రోదక గుణవిశేషమునంజేసి లావణ్యసారమే (ఉప్పు) లభించునో తెలియకున్నది.

ఈ రెండు పక్షములలో నేపక్షము మోహిని తలంచిన తలంపులకుందగి యుండి తత్ప్రీతి పాత్రముగనున్నదో యాపక్షముచే యీ పుట్టఁబోవు నమృతము. ఈ యమృత పానముననే స్వరాజ్యము కరతలామలకము. ఇంకోక పక్షమునకు స్వారాజ్యమే గమ్యస్థానము.

ఎట్లైనను పట్టువిడువక మధించుచుండినచో ప్రయత్నము వ్యర్థముగఁబోదు. కాలమవు నంతకు యిట్లు స్వరాజ్యమో అట్లు స్వారాజ్యమో లభించును.

**– 26 డిసెంబర్, 1936, సాధన పత్రిక**

*(కథకుడి వివరాలు తెలియవు)*

# చంద్రికా మోహనులు

– రావూరు చంగనార్య

**పూ**ర్వము కనకపురియను పట్టణముండెను. అందొక సాహుకారు మణుల వ్యాపారమున విశేషధనము గడించి నూతనముగ ఏడంతరవుల మేడను గట్టించెను. ఆ సాహుకారి పేరు కాంచనదత్తుడు. అతనికొక కూతురుండెను. ఆమె పేరు చంద్రికామణి. చంద్రిక సుందరవతి. రామాయణ భారత భాగవతపురాణముల బాగుగా జదువుకొన్నది. చంద్రికకు ఇప్పటి కాంతలకు వలె చేతిలోని రవికె చంక కెక్కలేదు. ముఖమునకు దృష్టిదోషము దగులకుండ బెట్టునట్టి చుక్కలేకపోలేదు. అర్ధచంద్రాకారముగ మెడక్రింద శరీరోర్ధ్వ భాగముల వెలిగ్రక్కు చుండెడి బిగువైన కంచుకద్వయము లేదు. ఆమె వంకరటింకరగా ముంగురులను కత్తిరించి త్రిప్పిన నవీన నాటక నారీమణి కాదు. చంద్రిక సంగీతమునందు నేర్పరి. అన్ని గుణములును రూపమును ఆమె కొప్పియుండెను. చంద్రిక సాయం సమయములందు శ్రవణానందముగ పాడుచుండెను. అనేకులు ఆమె గానామృతమును గ్రోలి యానందమగ్నులై పోవుచుందురు.

సాహుకారు భార్య పేరు కనకాంగి. చంద్రికకు వివాహవయస్సు వచ్చినదని తనమగని హెచ్చరించి తగిన వరాన్వేషణమునకై యువ్విళ్ళూరుచుండెను. కనకపురి యందు గుణ శేఖరుడను నొక గుణవంతుడుండెను. అతని కొడుకు మోహనుడు. మోహనుడు సత్య ప్రవర్తనుడు సంతతమందస్మిత వదనముతో నుండువాడు. విద్యావంతుడు. గుణ వంతుడు. నూనూగు మీసము లేర్పడువయస్సు గలవాడు. జననీ జనకులను గురువులను పూజించు వాడు. అతడు సాయం సమయములందు షికారువెళ్లునపుడు చంద్రిక యొక్క మేడను దాటి పోవునపుడు యామె గానామృతమును గ్రోలిపోవుచుండును.

చంద్రిక మోహనునిగూర్చి లోకులు చెప్పుకొనగా పలుమారు వినియుండెను. అతని గుణములకు తగిన దివ్యసుందర విగ్రహమును మేడనుండి కాంచినపుడు అతడే తనకు ప్రాణనాథుడని మనంబున నిశ్చయించెను. మోహనుడు చంద్రికను గూర్చి పలు మారు వినుటచే యామె యందతనికి మనస్సు తగిలియుండెను. కాని తనకు లభించునో లభింప దోయని సందేహపడుచుండెను. ఇట్లు చంద్రికను గూర్చి మోహనుడును, మోహ నుని గూర్చి చంద్రికయు మాటలాడు కొనుచుందురు.

చంద్రిక ఒకనాడొక స్వప్నమును గాంచెను. ఆ స్వప్నమున మోహనుని గాంచిన ట్లుండెను. అది మొదలు ఆ మోహనాంగుని నెట్లయిన చూచు భాగ్యము గలుగునాయని యామె యువ్విళ్ళూరుచుండెను.

మఱుసటి దినము మోహనుడు ఎప్పటియట్ల షికారుబోవుచు చంద్రికా భవనము సమీపమునకు రాగా ఒక చెలియ బిఱ బిఱ వచ్చి యతని చేతికొక లేఖ నందిచ్చి తుఱ్ఱుమని లోనికిపోయెను. ఆ లేఖ యందిట్లుండెను:–

మనోహరా !

మీకు వందనసహస్రంబులు. మీ యొక్క గుణాతిశయములును, మీ పాండిత్య మును, మీ రూపలావణ్యమును గూర్చి వినియుండియు నేరులో చూచియు నా మనంబు మీపై మఱలినది. మీరు నిన్నటి రేయి నా స్వప్నమున కనబడి నన్నానంద సముద్రమున నోలలాడింప జేసినట్లు కంటిని. అప్పటి నుండియు మిమ్ములను దప్ప వేరొక్కరిని నేను వివాహమునకు ఇష్టపడలేదు. నేనింత ధైర్యముగ మీకు లేఖ వ్రాయుటలో నా సహజ ధర్మమును నిర్వర్తించితినని దలచుటలో తప్పేమియు కనబడదు. విద్యావంతుని, శీలవంతుని, రూపవంతుని గోరుకొనుటలో నాయందేమియు తప్పు కనబడదు.నా తలిదండ్రులు ధనవంతుడని, నన్ను యీయూర నున్న ధనదాసుని పుత్రుడైన కనకదాసుని కియ్యవలెనని నిశ్చయించి యున్నారు. మీరు నన్ను పరిగ్రహించుటకు నిష్టమున్న యెడల అంగీకార సూచకముగ మిరొక్క చిఱునవ్వు నన్ను జూచి నవ్విన నదేచాలును. మీరు నన్ను దిగనాడిన నా జీవితము వ్యర్థము. అనవరతము మీ ధ్యానమగ్నురాలైయున్న...

చంద్రికామణి.

మోహనుడు లేఖను జదువుకొని మనస్సులో ఆనందపడి లేఖను భద్రపఱచి నలుదిక్కుల చూడగా ఎవ్వరులేనందున మేడవైపు చూపు నిగిడించి, పూర్ణచంద్రుని వంటి చంద్రికయొక్క నవమోహనాకారమునుగని. అంగీకార సూచకముగ ఒక్క చిఱునవ్వు నవ్వెను. చంద్రికామణి చంద్రవదనుడగు మోహనుని తనివితీర చూచి సంతోషాతి శయంబున మైమఱచెను.

చంద్రిక తలిదండ్రులు వివాహప్రయత్నము గావించి పదివేల రూప్యములు దీసికొని మూఢశఖామణియైన కనకదాసుని కిచ్చుటకు నిశ్చయించిరి. చంద్రిక అపార దు:ఖమున మునిగినది. ఆ దినమునుండి ఆహారము విడిచినది. ఒకటి రెండు రోజులకు పడకబెట్టినది. తలిదండ్రులు తహతహపడుచున్నారు.మాంత్రీకులు భూతావేశమనుచున్నారు. జ్యోతిష్కులు గ్రహచోద్యమనుచున్నారు, రక్షలు కట్టుచున్నారు, కులదేవతకు ముడుపుకట్టుచున్నారు. ఏమిచేసినను ఆమెకు స్వస్థత కనుపించలేదు.చంద్రిక యొక్క నిజస్థితి యామెకుదప్ప నితరులకు తెలియదాయెను. ఒక వారము రోజులకు వివాహ మునకు నిశ్చయమైన దినములు సమీపించినవి. అప్పుడు చంద్రిక యొక్క తల్లిదండ్రులు గత్యంతరము కానక తమ తనయను బాగు పఱచిన వైద్యులకు తగురీతి బహుమాన మిత్తునని ప్రకటించిరి.

మోహనుడు ప్రకటననువిని ఒక వైద్యుని వేషమును బూని వెళ్ళి చంద్రికను జూచి ప్రత్యేకముగ బరీక్షింప నుత్తరవుగొని ఆమెకు తన నిజరూపమును జూపి ధైర్యము చెప్పి వెలుపలికి వచ్చెను.సాహుకారును పిలిపించి మాత్రలను సానపై రాచి చంద్రిక కిమ్మనెను. చంద్రిక దానిని లోనికిగొనిన అయిదు నిముసములలో పడకనుండి లేచి కష్టములేక తిరుగులాడ మొదలిడెను. వైద్యుని మఱల రాత్రికి రమ్మని చెప్పిరి. సాహుకారుకు కొంత ధైర్యము, సంతోసము కలిగినది. చంద్రిక తండ్రితోచెప్పి వైద్యుని యింటివద్దనే రాత్రియంతయు

నుండి వ్యాధియొక్క పోకడను గుర్తెతిగి మందిమ్మనెను. వైద్యుడు అటు లేయని చెప్పి మఱల రాత్రికి లేపనమునకై మందు సిద్ధపఱుప వలసియున్నది. అందులకై నూటయె నిమిది మూలికలతో తైలము సిద్ధపరుపవలయునని చెప్పిపోయెను. రాత్రి తొమ్మిదిగంటలయినది. చంద్రిక ఇటునటు పొరలాడుచున్నది. కొంతనవ్వు, కొంత యేడ్పు, కొంత పరిహాసము, కొంతతిట్లు యివిధముగా నటనమాడుచుండ సాహుకారు కేమియు తోచక వైద్యుని కొఱకై కబురంపెను.వైద్యుడు తైలమును సిద్దపఱచి తెచ్చుసరికి రాత్రి పండ్రెండు ఘంట లాయెను. అందరును నిద్రించిరి. సాహుకారు మాత్రము మేల్కోని యుండెను. వైద్యుడు వచ్చి చంద్రిక యుండు గదిలోనికిపోయి యామెయుండు స్థితిని గని “ఓహో! మించినది, మించినది” అయినను ఏ భయము లేదని తనవద్దనున్న తైలమును యామెకు మర్దన చేయింపగా కొంత వఱకు శాంతముగ నుండెను. వైద్యుడు ఇంటిలోనున్నంతవఱకు వ్యాధి కనుపింపదు.అతడు ఇల్లువిడిచి పోయిన వ్యాధి బయల్పడును! మోహనుడు మూడు దినములు సాహుకారి యింటనే యుండి చంద్రికకు అనేక విధములైన యౌషధములు నుపయోగపఱచి స్వస్థతగలిగించెను.

సాహుకారు షంతోషమునకు మితిలేదు. మోహనుని బిలిచి “నీ వేమి కోరినను బహుకృతి నిచ్చెదనని చెప్పగా” మోహనుడు “అన్నియు నిచ్చుటకు సర్వేశ్వరుడున్నాడు. నేను చేసిన స్వల్పమైన యుపకారమునకు బహుకృతి నోందవలసిన దినము ముందువచ్చు” నని వెడలిపోయెను.

సాహుకారు చంద్రిక వివాహమునకు తగు ప్రయత్నము గావించి బంధు మిత్రాదుల రావించి ముహుర్తము స్థిరపఱచి మంగళవాద్యములు చెలరేగుచుండ చంద్రికకు మంగళ స్నాన మాచరించి వివాహ వేదిక పై తారసిల్లునపుడు ఒక్క చిత్రము జరిగినది. మంగళ సూత్రధారణ సమయమున బ్రాహ్మణుల యాశీస్సులతో మానినీమణుల పాటలతో పెండ్లికూతురు దిగ్గునలేచి చేతధరించిన పుష్పమాలికను భిషగ్వరుని వేషమున గూర్చునియున్న మోహనుని మెడలో వేసెను. అతడు అదివరకే సిద్దపఱచియున్న మంగళ సూత్రమును నామె కంఠమున గట్టెను. అందురును దిగ్భ్రమజెంది లేచి అట్టహసమొనర్చిరి. కాంచనదత్తుడు కోపానల జ్వాలలగ్రక్కుచు లేచి “పట్టుడు, కొట్టుడు, ఆమంగళసూత్రమును గట్టినవానిని చంపుడు” అని యఱువగా మోహనుడు తన భిషగ్వరుని వేషమును మార్చి నిజరూపమును జూపెను. అందరును అట్లెనిలిచిపొయిరి. చంద్రికకు ప్రాణదానమొసగిన మోహనునికి తగిన బహుకృతి చంద్రికనిచ్చుట తప్ప వేరులేదనియు మోహనుడు చంద్రికకు తగినవాడనియు చంద్రిక తగినవానినే వరించినదనియును అందరు సంతోషించిరి. అప్పుడు కావలసినదే మున్నది. సాహుకారు అమితానందభరితుడై చంద్రికామోహనుల వివాహము కోలాహలముగ చేసెను. దంపతులెల్లరకు నమస్కరించి వారి యాశీస్సులు బొందిరి.

**– ఆగస్టు ,1937, తెనుఁగుతల్లి.**

# రాఘవేంద్రరావుగారి రాజీనామా

- టి. ఆర్మొగంపిళ్ళై

**రా**ఘవేంద్రరావు గారు తండ్రివైపున దేశస్థ రక్తస్పర్శ కలిగియుండకపోయి - అతని ప్రకృతిలో నుండెడి ముక్కుపై కోపము కొంచె మణగి మణగి స్వాధీనపడియుండినచో ఈ కథ వ్రాయుటకు మాకు సాధ్యపడియుండదు.కాని జరిగిన విషయములివి:

రాఘవేంద్రరావు గారికి ఆనాడు ఒక్క పెద్ద సమస్య ఖండితముగ పరిష్కరిం పబడవలసి యుండెను. అతడు గొప్ప వక్త. పాఠమును బోధింపనారంభించిన చాలును. ఎట్టి మొద్దు బాలుడైన 'నాకు లెక్కలన్న తలనొప్పి' యనుటమాని విశదముగ పాఠము నర్థము చేసికొను చుండును. ఆ స్కూలున గడచిన పదునైదేండ్లుగ లెక్కలలో- పబ్లిక్ ఎగ్జామి నేషన్స్‌లో తప్పిన వారిని వ్రేళ్లపై లెక్కింపదగినవి కొందరో గాని కడమ అందరు నెగ్గినవారే. తనకానెల ఐదువందల రూపాయ లత్యవసరముగ కావలసియుండెను. ఏకైక పుత్రి రజస్వల యైనది కాని పెండ్లికానిదే నేటి బాపలపడుచులు సమర్తాడకూడదు కదా? కావున అందటి వలనే దుర్గాబాయి వయస్సు పదునెనిమిది కావచ్చినను శరీరపాటవముతో యౌవనంపు నవ్యతారళ్యముత్తేజితమై విరాజిల్లుచుండినను తండ్రి కనుకూలముగ వివాహానంతరమే పుష్పవతికానిశ్చయించికొనెను! పాపమామె తల్లి కంటికికడవెడు కార్చుచు మగని నిద్రపో నివ్వక పెండ్లి ప్రయత్నములకై ఊపిరిపోసుకొనుచుండెను. నగలు నజరు గుడ్డగుసరు వేయికి మించిపోవును. ఎట్లు లెక్కలువేసి యంచనాలతో నింపినను రొక్క మొక్క పెద్దనోటు లేక ముసలిమగడైన వచ్చునట్లులేదు. ఎట్లో కష్టపడి బెంగుళూరుననొక్క ముదుకడు మూడవ పెండ్లికి దుర్గాబాయి మనువుకొఱకై వచ్చి ఆలస్యమయిన నక్కఱలేదని అగ్గిపై నిలిచి యడుదు డుకుసేయ నారంభించినాడు.

రాఘవేంద్రరావుకడ పైస లేదు. ఉపాధ్యాయవృత్తిలో మిగలబెట్టుకొన్నట్టి ముందా లోచన గలవారెందరున్నారు? ప్రావిడెంటు ఫండున ఒక ఏడెనిమిది వందల కంటె నెక్కుడు లేదు. దానిపై దృష్టిపడి సరసర ఒక అప్లికేషన్ గోకి బిర బిర హెడ్మాస్టరు గదిలోనికి పట్టు కొని వెళ్లినాడు. వెళ్లునప్పుడు తన హక్కును స్థిరపరచుకొనుటకు మాటలాడు విషయములను చిక్కబట్టుకొని ధైర్యముగ హెడ్మాస్టరుకు నెదిర్చికొనుటకు తీర్మానించి వెళ్లినాడు. హెడ్మాస్టరు నారాయణాచార్లు ఆఫీసునకు క్రొత్త. ఎం.ఎ.ఎల్.టి. ప్యాసయి మంచి సిఫార్సులపై ఆపని సంపాదించుకొన్నాడు. పాపమతినికి ఎల్.టి. చదువునప్పుడు బార్య ప్రథమ ప్రసవమును ప్రసవించి తల్లిబిడ్డలతో మరణించియుండెను. రాఘవేంద్రరావు గారు అతనితో నొకప్పుడు తన బిడ్డ విషయము ప్రస్తావించియుండెను. నారాయణాచార్యులప్పుడు తాను తొలిపెండిలితో గృహస్తాశ్రమమును వదల నిశ్చయించితిననియు నిక తన జీవితము బాలుర యభివృద్ధి కొఱకే వినియోగింప నిశ్చయించినట్లును నుడివియుండెను.కావున నేడు దుర్గాబాయి పెండ్లి

ప్రయత్నమునకై డబ్బు కావలసి యుండినందున నా ప్రస్తానము నాతనితో మాటలాడి వచ్చినందుల కతడు సిగ్గుపడుచు నుండెను. కాని విధిలేక తెగించినాడు.

ఏ గ్రహచారమోగాని నాడు నారాయణాచార్యులు మనసు మనసులోలేక ఎవరిపై కోపమో మ్రింగి యవస్థపడుచునుండెను. ఆ సమయమున రాఘవేంద్రరావు లోపల ప్రవే శించెను. హెడ్మాస్టరు గది గడపకడ చిన్న స్ప్రింగు తలుపుండును. ఎవరు గాని దానిని నెమ్మదిగ తట్టి లోపల వారు రమ్మన్ననే ప్రవేశింపవలయుననెడు నియమము కలదు. రాఘవేంద్ర రావుగారి కావేళకే కొంచెము కోపము మత్తెక్కి యుండినందున నీపనికిమాలిన సింగినాద ములను లెక్కపెట్టలేదు.

హెడ్మాస్టరుగారికిది కోపమును పుట్టించెను. కాని యాతడాముదుకనియందొక విధమయిన భక్తిభావముంచి యుండినందున నెమ్మదిగా 'ఏమండీ? ... కూర్చొనుడు' అని కుర్చీ చూపెను.

'మీతో మాట్లాడవలెను'

'ఏ విషయము?'

'ప్రావిడెంటు ఫండు'

'..........................'

'ఇదిగో అప్లికేషను'

'సరి అటుంచుడు పిదప చూసెదను. ఇంతేకదా....?

... మరల నెప్పుడైన తీరికగనున్నప్పుడురండు.'

'నాకిప్పుడే తీరిక, ముందు తామీపని గమనింపుడు' అనునంతలో తన మరాఠీకాఠిన్యము బిరెసెక్కినది! వెంటనే

'నాకీ డబ్బు వెంటనే జారీయగునట్లు సిఫార్సు చేయుము' అని ఖండితముగ నడిగెను.

నారాయణార్యుల కిప్పుడు ఇరువదేడేండ్లు. పసితన మింకను పూర్తిగపోలేదు. తన్నట్లాతడేకవచనమున సంబోధించుట గమనించి మనసు చుఱుక్కన నతని నెగదిగచూచి,

'అయ్యా, మీ పిటిషన్ ఉంచి వెళ్లుడు. చూచి వీలయిన సిఫార్సు చేసెదను. ఇంతవఱకు తమరనేక పర్యాయములు ప్రావిడెంట్ ఫండున లావాదేవీలు చేసియున్నారు. కావున తమకింత మొత్తము జారీచేయవచ్చునో కూడదో రూల్సు చూచి అట్లోనర్చెదను' అనియెను. 'రూల్సు చూచి~నందేదోబుద్ధిలేని కూతలుండును. సమయమునకు లేనిది చంక...?' నారాయణాచార్య లాతనిపై మాటనొక్క తీవ్రదృక్కున నణచివేసి.

'రూల్సునకు వ్యతిరేకమయినపని నెట్టిదైనను చేయజాలను. క్షమింపుడు. ప్రస్తుతము తాము వెళ్లవచ్చును.' అనుచు లేచి స్ప్రింగుతలుపును లాగి అతనికి వెళ్లుటకు దారిచూపినాడు.

అవఱకే తిక్కనెత్తికెక్కి తైతక్క లాడించుచుండినందున రాఘవేంద్రరావు ఉగ్రుడై ఉరిమిచూచి ఏమో అనబోయి మాటవెలువడక నేలను దబాలున ఒక్క తన్నుతన్ని గిరుక్కు నదిరిగి వెడలిపోయెను.

చివరికి వీరియద్దతనికి విరామముండెను. తనడెస్కు కడకేగి ఒక పెద్ద కాగితము లాగికొని హెడ్మాస్టరు చచ్చువఱకు మఱచిపోకుండవలయునని సంకల్పించి ఈ క్రింది జాబునుగోకెను.

జులై 16,

(సాయంకాలము 4 గంటలు)

.... హైస్కూలు హెడ్మాస్టరు గారికి,

అయ్యా,

భూతదయ పశ్చాత్తాపములేని మీకడ నుద్యోగిగనుండ నిష్టములేక నేనీ జాబు మూలముగ నామనస్ఫూర్తిగా ఇచ్చుచున్న రాజీనామా. నీవు నీబోర్డు పాఠశాల సభ్యులు ప్రపంచములో నొక్కజాతి నీచులుగా కన్పట్టుచున్నారు. మీకు ధనమూలమిదం జగత్తను సూత్రము ఇహపర సాధనకేకైకము. ఆ ధనమును మీరే పరలోకమునకు మోసికొని వెళ్ళుడు. అట్టి తుచ్ఛపు ఉద్యోగమున నుండజాలను. మూడు రోజులలోపల నన్ను బదిలీచేసి పంపకుండిన నేనే నిలిచిపోయెదను. మీకు పూర్తిగ నోటీసు కాలము నివ్వనందులకు మీరు నాపై కోర్టులో దావా వేసికొనుడు.

(తాత్కాలిక ) విధేయుడు,

రాఘవేంద్రరావు.

ఇంతలో మెరుపుతోచినట్లాలోచన మరొక్కటి తోచెను. ఒక పెద్దకవరులాగి తన ప్రజ్ఞ వెల్లడియగునట్లు తన అడ్రసువ్రాసి ఒక్క తపాళాబిళ్లనంటించెను. తరువాత రాజీనామా జాబులో

తాజా కలం॥ నీవు, నీపై అధికారులు పెనులోభులు కాన నాకు బదులు వ్రాయవలెననిన స్టాంపు వేయవలెనని ముక్కున నేడ్చుచుందురు. కావున నీ జాబుచేరినదని (రేపు శనివారము కావున) మీరు నాకు తెలుపుటకై ఈస్టాంపతికించిన నా యడ్రెసు కవరు పంపినాను.

రా ॥.

జాబునొక్కసారి తిరుగవేసి చదివియుండినచో తనకు తన నైచ్యమందులో స్పష్టపడి యుండును. కాని 'ఆదేశస్థ' దురభిమానము తన్నా పని నుండి తొలగద్రోచినది. వ్రాసిన అరగంటలోనా లేఖ హెడ్మాస్టరువారి వ్యక్తిగత చిరునామాతో తపాలాఫీసునకు చేరిపోయెను.

నారాయణాచార్యులు రాఘవేంద్రరావు కోపమున కచ్చెరువందుచు బల్లపై నతడు పడవేసి వెళ్లియుండిన ప్రావిడెంట్ ఫండు లోన్ అప్లికేషనును తీసిచదివెను. పాపము! రూ. 500కు... కూతురు పెండ్లికట! ఏమి ?......... పెండ్లి కొరకై లాంఛనాలకని అడుగుచు న్నారటకదా?'

అని దుర్గాబాయిని –రాఘవేంద్రరావును ఇద్దరిని గూర్చి చాలాసేపు ఆలోచనా నిమగ్నుడై యుండి. 'ఆలస్యమయి పోయినదేమో ! కాని చూతము' అని తీర్మానము దృఢముగ చేసికొని తన లెటరు పేపరు తీసి వ్రాయ మొదలుపెట్టెను.

బ్రాll శ్రీllవేద వేదాంతమూర్తులు శ్రీ రాఘవేంద్రరావు గారి పాదారవింద ములకు.....' అని వ్రాసి ముగించెను.

– – –

రాఘవేంద్రరావు గారానాడెట్లు భార్యతో వేగిరో మాకు సమాచారమందలేదు. ఆమె స్వభావము మేమెఱుగుదుము. ప్రస్తుత కార్యతీవ్రతయుదెలియును. కావున మఱునాటి ఉషఃకాలమున కాతడు పడకనుండి లేచినప్పుడు తన పూర్ణాయుర్ధాయమున కనీసమైదేడు లయిన నా ఒక్కరాత్రి తగ్గిపోయియుండవలెనని శాస్త్రరీతిగ గణించుకొనినాడు!

కాలకృత్యములయినదే కాఫీ పుచ్చుకొనుచుండగ బడి బంట్రోతువచ్చి ఒక కవరు నందిచ్చివెళ్లెను. రావుగారు ఏముండునందులో, నా నిన్నటి వైదుష్యమునకు మీ రాజీనామా దాఖలు చేసికొన్నామని గాక' అనుచు కవరులోని జాబునుతీసి చదువుచు కాకితమువలె తెల్లబారిపోయినాడు! 'హా, దేవుడా, నేనెంత హతభాగ్యుడను' అని కంటతడిబెట్టికొని భార్య వైపు జూచినాడు.

గంగాభవాని (ఆమె పేరది) 'ఏమి? ఉద్యోగమునకు స్వస్తియేకదా!' అని గుండెలుబాదుకొని బావురుమనెను. ఇంతలో దుర్గాబాయి పరువెత్తివచ్చి 'నాయనా, ఏమి?......' అని తాను గూడ వెక్కిళ్లుంచి ఏడువ నారభించెను.

అప్పుడు రాఘవేంద్రరావునకు దిక్కులుతోచక ' ఈ జాబు గట్టిగ చదువురా నా తండ్రీ దుర్గా'అని గారాబముట్టిపడ దానిని గూతురు చేతికందిచ్చెను. ఆ జాబులోని విషయములు....

కె.నారాయణాచార్యులు, ఎం.ఏ., ఎల్.టి.,

చిత్తూరు, ................ జులై 16.

(సాయంకాలము4 గంటలు)

తాము నేడు నాపై నాగ్రహించినందులకు మిక్కిలి మనఃక్లేశము కలిగినది. నాయందేదైన దోషముండిన సావధానముగ నన్ను మందలించి యుండిన తమ పలుకుల శిరసావహించియుందును. నన్ను క్షమింపవలసినదని మిక్కిలి ప్రాథేయపడి బ్రార్థించు చున్నాను.

మీ ప్రావిడెంటు ఫండులోన్ అప్లికేషన్ చూచితిని. మీరు ప్రస్తుతము వంద రూప్యముల కంటె నెక్కుడుగ పుచ్చుకొనుటకు రూల్సు అంగీకరింపదు.కావున మీరీ సమయ మున నడుగకుండుట మంచిది.మీరు వచ్చినప్పుడు నేనేదో మానసికాందోళనమునుంటిని. బహుకాలమడుగవలెనని సందేహించుచు నేనేదో తమ్మడగవలయునని బహుప్రయాసపడి

అదుగ తెగించునంతలో...మీరు వెడలిపోయితిరి.నేను ఇట్టి విషయములలో కొంచెము మందరాశివాడను.

ఈ నడుమ నెలకు బూర్వము నుండి నాలో, నా అభిప్రాయములలో చాల మార్పులు కలిగినవి. దాని ఫలితముగ పునర్వివాహమాడ నిశ్చయించితిని. నిరాడంబర ముగనది జరుగ వలయునని నా కోరిక. తామొక పరి నన్ను హెచ్చరించి యుంటిరికదా? ఇప్పుడు మించి పోకుండినచో మీ దుర్గను నా సహధర్మచారిణిగ నొనర్చుకొనుట నా భాగ్యమని తలంతును.

(ఇందు వెంట ఐదువందలరూప్యముల చెక్కును తమకుపంపుకొంటిని. మార్చి తమకిప్పిటి ప్రస్తుతపు ఆర్థిక సమస్యలను పరిష్కరించుకొనుడు. నేను తమకు జామాతయగు భాగ్యమేలేనిచో నీ మొత్త మొక యప్పుగ పరిగణించి తమకు వీలుకలిగినప్పుడు తీర్చివేయుడు)

అశీ:పాత్రుడు,

నారాయణాచార్లు.

ఈ జాబు చదివినదే యింటిలోనివారందరికి పిచ్చిపట్టినట్లయ్యెను.

రాఘవేంద్రరావు తన జాబును దలచితలచి ఇక కర్తవ్యమేమని తలపోయ నారంభించెను.ఇట్టి ఉత్తమ సంబంధము నెట్లు పోగొట్టుకోగలడు? ముక్కుపై కోపము నిక తన జన్మములో పెట్టను అని ప్రతిజ్ఞచేసి కొన్నాడు.

తన దుర్గను వలసియేయుండిన నారాయణాచార్యులు ఆ జాబును లెక్కపెట్టక పోవచ్చును.

కాని అట్టి క్షమాపణ పనికివచ్చునా! ఈసంగతి అతనికి తెలియనిచ్చిన జన్మాంత మతడు మఱచిపోక గెప్పుచుండవచ్చును కదా!

ఇక మార్గమేది ?

ఒక ఉత్తుంగమైన ఆలోచనాతరంగము తోచినది. ఆ... ఆ జాబును నారాయ ణాచార్యులు చదువకముందే అతనికి చేరనివ్వక ఆపివేయగలిగినచో ?...?

శభాష్! ఎంత చక్కని ఆలోచన! గంట చూచినాడు. ఇంకను టైమున్నది. వెంటనే తపాలాఫీసునకు గబగబ పరిగెత్తినాడు. స్కూలునకు వెళ్లు తపాలవానిని సంధించి పదిరూపాయల లంచమును ఆసచూపి బతిమాలినాడు.

తపాలవాడైన రాజు పైకెంత కఠినముగ కన్పట్టినను చండాలపు లంచగొండి. కావున రూపాయల దీసికొని స్కూలు జాబులనన్నిటిని చూపినాడు.

అందాతడు వ్రాసిన జాబులేదు. దేవుడా గతియేమి. ఔను హెడ్మాస్టరు వ్యక్తిగతమైన చిరునామాకు కదా నిన్న వ్రాసినట్లు జ్ఞాపకము?

హెడ్మాస్టరు గారి మేడ కడకేగినాడు అటునిటు పొందిచూచినాడు. వంటవాడు కన్పడినదే వానిని పిలిచి 'ఈనాడు తప్పాల్సు అప్పుడే వచ్చి చేరినదా? అని ప్రశ్నించెను.

వంటవాడు ఒక ఉడిపిమధ్వుడు. కన్నడము తప్ప మరేభాష తెలియదు. ఎట్లో రాఘవేంద్రరావు గారి బెంగనర్థము చేసికొని 'వచ్చినది' అనెను.

'అయ్యగారు అన్నిటిని చదివినారా ?'

'లేదు, ఇప్పుడే వారు స్నానము గదికి వెళ్లినారు.'

'ఇదిగో; నిన్న నేనాతనికి ఒక జాబు వ్రాసియుంటిని. దయచేసి ఆ జాబును నాకు అతడు చూడకముందే వాపసు ఇచ్చివేయుము. నీకు పది రూపాయల నిచ్చెదను.

ఉడిపి బ్రాహ్మణుడాతని యెగదిగజూచి 'మేమట్టిపని యెన్నడు చేయము. నీవు వెళ్లవచ్చును.'

'మఱి, ఎన్నో జాబులలో నీవు నీ జాబునే తీసుకొనగలవని యేమినమ్మకము? ఇంతకు నీవెవ్వరయినదినాకు తెలియదు' అని ఖండితముగ నన్నాడు.

'నేను బడిలోనొక ఉపాధ్యాయుడను.. నిజమే. నీవు – క్రొత్తగనున్నావు. నేను సాధారణముగ నిక్కడవచ్చినదిలేదు. పోనీ ఒక్కమాట; నేనిక్కడికిని వచ్చినది, నిన్నడిగినది అతనికి చెప్పక ఉండగలవా? అంతమాత్రము సాయపడిన నీకు చిక్కులేదు. నాకెంతయో లాభము.'

'సరే, అందువలన నాకు గలుగు నష్టమును లేదు. నేనెవ్వరితోడను చెప్పను మీరు వెళ్లుడు.' అని యతడు తలుపు గొళ్లెము పెట్టుకొని లోనికి వెళ్లిపోయినాడు.

– – –

ఇంత ప్రయత్నము భగ్నమయ్యెను కదా ? తన దురదృష్టమునకు చింతించుచు రావుగారు ఇల్లు చేరినారు. తొమ్మిదిగంటలైయుండును కంటతడిపెట్టుకొని పడక కుర్చీపై చేరబడి ఇంటికప్పును చూచుచు నట్లేపడి తన ముక్కుపై కోపమును తలచుకొనుచు నుండెను.

పోస్టు బంట్రోతు కవరొక్కటి కూటమున పారవేసి వెళ్లినాడు.

దుర్గాబాయి దానిని తెచ్చి తన నాయన కందిచ్చెను.

రాఘవేంద్రరావు గారాకవరును చించి లోపలి కాగితమెత్తుకొను లోపల చేతులు గడగడ వణకిపోయినవి. నోరు తడబడచుండగా ఒక్క పిచ్చి అఱుపరచినాడు. అతని ఆనందమునకు మేరయేలేదు.

మొదట తన కన్నులను నమ్మలేదు. 'లోకములో నింకను మాయాజాలమనునది ఉన్నదా? అనినాడు.

– – – –

'తాను వ్రాసిన రాజీనామా జాబును తన వ్యక్తిగత చిరునామాకే వ్రాసి స్టాంపతికించి బదులునకై పంపబడవలసిన దానిలో, తనకు తానే మోసపోయి అందులో నుంచి హెడ్మాస్టరు వారి కవరును దానిలోపల నూరకపెట్టి యుండెను! కావున తన పేరిట కవరు తనకే వచ్చిచేరినది!

**– సెప్టెంబర్, 1937,తెనుఁగుతల్లి**

# బిక్కిరింత పిదప వెక్కిరింత

**- టి. ఆరోగ్యం పిళ్ళై**

**క**వరువిప్పి జాబు చదువుకొంటిని. సంతోషముతో 'పాపాయీ, చూచినావా, రేపాదివారము కదా మంచి అదృష్టము నీది' అని అఱచినాను.

నా భార్య మొగమంత కన్నులతోనే చదువుచున్న న్యూసు పేపరును ఆవతలికి త్రోసి 'ఏమది?' అని అడిగెను.

'మాయాబజారు చూడవలెనని అంగలార్చుచుంటివే. ఇదిగో, పిళ్లెగారు రెండు రిజర్వుడు టిక్కెట్లు పంపినారు.'

'అమ్మయ్యా! మొన్న వారు వచ్చినప్పుడు ఈపాడు పిల్ల రాజేశ్వరి తటాలున, అడిగివేసినది. దాని నోరును నా చేత మూసిపెట్టినాను కాని ఎట్లో అడిగివేసినదండీ. కాని, తేది ఏ నాడని వేసియున్నారు?'

'రేపే ఆదివారము' పాపాయి మొగము, వెలవెలపోయినది.

'రేపు ఎట్లు వీలగును? రేపు రేడియోలో తన తమ్ముడు పాడుచున్నాడని వసంత మెరీనాబీచికి రమ్మన్నది కాదా. వత్తునని మాట యిచ్చినాము కదా. పోకున్న ఆమెకడ సడిపడలేమండీ' అని తీర్మానము చేసివేసినది.

నాకు కోపమువచ్చి బండమాట యేదో అన్నాను.

'రామేశ్వరము పోయినా శనేశ్వరము వదలలేదు.'అని పాపాయి కంటతడి పెట్టికొనెను.

నాకది కష్టముగ ఉండెను.

'ఏదో సాకు పెట్టి వసంత వారికి సమాధానముచెప్పరాదా?'

'.....................................'

'పోని ఒక కార్డెత్తి నాకేదో జ్వరము తగిలినది రావీలులేకపోయినది క్షమింపుమని వ్రాసివేసిన రేపుదయము మైలాపురు చేరును. సంగతివారికి తెలిసిపోయినదే మరియే చిక్కులేదు.'

'సరిలెండు అలాగే చేయవలె' అని పాపాయి బాగు ఆలోచించి గొణిగినది.

----

నేను ఆఫీసుకు వెళ్లి సాయంకాలము ఇంటికి మరల వచ్చినాను. పాపాయి కాఫీ పట్టుకొని వచ్చినది. ఆమె మొగములోని సంతోషమును చూచి ఏదో గొప్ప విషయముండునని ఊహించి చూడనివానివలె కాఫీ అందుకొని దృష్టి కాఫీపైన బెట్టి ఊరకుంటిని.

మీ కార్డు ముక్కాని మిగిలిన దండీ ! నా అదృష్టము అనగా నేమనుకొన్నారు ? ఇంత వరకు వసంతవచ్చి వెళ్లినది.

పాపము ఆమె మగడు రేపు ఏదో పనిమీద ఊరువిడిచి వెళ్లుచున్నాడట. రేపు తాను కూడా మెరినాకు వెళ్లవీలులేక పోయినదని ఏడిచినది. తమ్ముడు రేడియోలో పాడినానే, విన్నావా? ఏలాగుండెను? 'అని అడిగిన ఏమి బదులు చెప్పగలను? అని కన్నీరు కార్చి వెళ్లినది పాపము మీ జబ్బేలాగున్నదో రేపుకబురంపుమన్నది'.

'రేడియో ఎవరింటనైనా వినరాదా? మైలాపూరులో ఇప్పుడింటికొక రేడియో ఉంచుకొన్నారు.

'పోనీ రేపు బయలుదేరు వేళకు మీ ఆడంగి ఆలస్యాలు పెట్టుకోక నీవు రాజేశ్వరి 5 గంటలకు సరిగ తయారయి యుండవలెను. తెలిసినదా?'

----

ఫస్ట్‌బెల్ అయినప్పుడే లోపల ప్రవేశించినాము. బ్రాడ్వే టాకీస్‌లో రిజర్వుడు సీట్లకు వెళ్లువారు వేళకుముందేపోయిన నేమి గౌరవము ? నేనిది లెక్కపెట్టి చైనా బజారులో పాపాయి మొత్తుకొనుచుండినను బలవంతముగా ఆలస్యము చేయించినాను.

చీకటిలో టార్చ్‌లైట్లు చూపి కుఱ్ఱవాడు మాకు సీట్లను కనబరచి కూర్చుండుడని వెళ్లినాడు.

రిజర్వుడులో మేమే అనుకొన్నాము కాని అది వరకే అక్కడ ఇద్దరున్నారు. తెరపై టైటిల్స్ వెళ్లుచుండెను. ఆ చీటి పోయినదే ఇండియా పటము వచ్చెను. అప్పుడు పెద్ద వెలుతురు పడి కొంచెముగ హాలును, ప్రక్కన కూర్చున్న వారిని వివరపరచెను. ప్రక్కనున్న వారెవ్వరు?

వసంత, ఆమె మగడు రాజు!! మేము నలుగురు ఒకరినొకరు చూచుకొన్నాము. మా రాజేశ్వరి నాన్నా 'అడుగో, వసంతత్త రాజు మామ' అని అరచినది!

మా నలుగురి అవస్థ వర్ణింపనలవి కాకుండెను. చివరకు రాజు నన్ను ఎగదిగచూచి 'మీజ్వరమేలాగున్నదండీ'? అని కుచ్చితముగ కన్నుగొట్టి అడిగినాడు.

'నా – నా – న నాకు ఇప్పుడు కొంచెము నిమ్మళించినది'. అని నేనేమన్నానో జ్ఞాపకములేదు. తరువాత అతడు వసంత ముసిముసినవ్వులు నవ్వుకొనుచుండగా రోషముకలిగి' నాన్న చాలా తీవ్రముగానే జ్వరము తగిలియుండెను. డాక్టరు కృష్ణమూర్తిగారు చాలదిట్టముగ క్వైనా చేర్చి మందిచ్చినారు. నేడు పీడవదలినది.' అని సమర్థించితిని.

'నేడు మధ్యాహ్నము మా పిల్లెగారు రెండు టిక్కెట్లు పంపినారు. నేటి తేది వేసియుండ 'నందున వృథాగా ఏలపాడు చేయవలెనని ఎట్లో బలవంతపఱచి వీరిని లాగికొనివచ్చినా నిక్కిడకు' అని పాపాయి అందుకొని ముక్తాయింపు ఇచ్చెను.

'అయినా, రాజూ, నీవు గ్రామాంతరము వెళ్లెదవని వసంత చెప్పినదట కాదా? పోలేదేల? 'అని విసరు నెక్కిరింతతో అడిగినాను.

వెంటనే వసంత 'వారు బయలుదేరినారు. ఎక్స్ప్రెస్ తప్పిపోయినదని మరల ఇంటికి వచ్చివేసినారు. మధ్యాహ్నమగు సరికి మాకు ఒక స్నేహితుడు రెండు రిజర్వుడు టిక్కెట్లును

పంపినాడు. ఏదో వృథాపోనేల? వారి నేల చిన్నబుచ్చవలెనని ఇక్కడికి వచ్చినాము.' అని వ్యాఖ్యానము చేయసాగెను. 'పాపము మీ తమ్ముడు....”

'వానినెట్లో సమాధానము చేయవలెను'అని వసంత తనమగని మొగము చూచెను. రాజు మొగమటు ద్రిప్పికొని తెరవైపుచూచి' శ్రీరంజని శంకరాభరణమును' తతబహుజన్మ లబ్ధసుకృతంబు 'అని చేగడ యెత్తుగడలో పాడినది చూచినారా?' అని ప్రస్తావము మార్చెను.

నాకది గొప్ప బరువు తేల్చినట్లయినది.

'ఔనౌను ఆనాడు హార్మోనియం పెంచెలయ్య వాయింపలేదు. ఆ అమ్మాయి తాలూకు నాగమణియో యెవరో వాయించినారు. అతని యెత్తుగడ అలాగుండెను. అది మీరు గమనించి నారా?'

'గమనించినాను; అదా విషయము?”

మేమనుకొన్నంత సంతోషము నాడు మాకు కలుగలేదు. రాజువసంతలు ప్రక్కనుండినది మాకు గుండెలపై బండలవలె బరువుగనుండెను. వారిరువురు కూడా మా వలెనే సినిమా పూర్తియగువరకు మావైపే చూచుచు చూడనట్లు నటించుచు ప్రొద్దుపుచ్చి నారు. చిక్కిబిక్కరించి, వెక్కిరింపబడి ఉక్కిరి బిక్కిరిగ ఊపిరాడక ఎట్లో ఆ కొంచెము సేపు ఉండి మా రాజేశ్వరి పోరుపెట్టుకొన్నదని నెపముపెట్టి వచ్చునప్పుడు వారితో వెడలక వేరే రిక్షాలో ఇల్లువచ్చి చేరినాము. బయలుదేరునప్పుడు రాజు మరల కన్నుగొట్టినన్నుచూచి ' ఏమండీ రాయప్రోలు సుబ్రహ్మణ్యంగారద్భుతమగ నటించినారు కదా ?' అన్నాడు.

'ఔను, అతనికి ఉండిన మంచి పోర్షనంతయు, దాసుగారు మరణించిన తరువాత తీసివేసి నారట పాపము లేకుండిన అతనితో సమానముగ సంగీత సాహిత్య నాట్యాహార్యాలలో అడుగుపెట్టు వారేలేరు' అని ఇంక నేదో అనినట్లు జ్ఞాపకము.

---

నాలుగైదు దినములై యుండును. ఒకనాడు పిళ్లెగారు ఆఫీసునకు వచ్చినారు.

'మీరంపిన టిక్కెట్లవలన మా పాపాయి, మేము సంతోషముగ ఒక్క దినమంతయు గడిపినాము. చాల సంతోషమండీ పిక్చరేదో సుమారుగనున్నది.

'ఆహా! బాగానే చూచియుందురు పోనిత్తురుగానీ రాజుగారు ఏమన్నారు?'

నేనతని నెగదిగ చూచి నక్కనోరు వైచితిని.

'మీకేలాగు తెలిసినది వారు కూడా వచ్చినారని?'

పిళ్లె తన చెక్కపండ్ల నిగిలించినాడు. 'ఎవ్వరు చెప్పవలెను? మీకు పంపినట్లే టిక్కెట్లను రాజుగారికి కూడ పంపితిని. తమాషాకని ఈ సంగతి మీకు ప్రత్యేకముగ చెప్పలేదు. ఏమి, మంచి వేడుక జరిగినదా? చెప్పండి'

'వేడుకా? ప్రహసనము!'

'అబ్బ ఎంత పోకిరి పనిచేసినారు మీరు ?' – **నవంబరు,1937, తెనుఁగుతల్లి**

## పాపిచావు

– టి.ఆర్మొగం పిళ్ళై

**‘ఓ** పాపులారా, పరలోకపు తండ్రి చెప్పినదేమనగా ‘ఓ గొఱ్ఱె పిల్లలారా, నాదగ్గర రండు, మీకు పరలోకమునకు త్రోవ చూపించెదను అని. మీరు ఆ దేవుని లోకమునకు పోవలెనన్నచో నరకములో నుండి తప్పిపోవలెనినచో మా దేవుడైన యేసుక్రీస్తును నమ్ముడు. ఆయన పరలోకపు తండ్రి కొడుకు. ఆయన మిమ్ము తన తండ్రికి సిఫార్సు చేయును. మీకు నరకము, పాపము తప్పిపోవును.’

అని యింక నేమో ఉపన్యాసము చేయసాగినాడు. వినువారందరు గమనించుచు న్నారా లేదా అను సందేహమున నా ఫాదరీదొర చుట్టు కలయజూచెను. ఒక చోట నొక యేనాది ముగుద పైట తొలగించి బిడ్డకప్పుడే చన్నందిచ్చెను. ఆ దృశ్యము తన మనస్సున గాఢముగ హత్తుకొనిపోయెను!

ఆ ఫాదరీ ఇంగ్లాడులో పుట్టి పెరిగి మిషనరీగా ప్రపంచమంతయు పర్యటనము చేసినాడు. అనేక భాషల నేర్చినాడు. నానా దేశ నగర జనపదములలో నుపన్యాసములిచ్చి యచ్చటచ్చటి జనులతో కలిసి మెలసి యుండువాడు. వివిధ నారీ జన సాహచర్యము లభించినను భీష్మించి బ్రహ్మచర్యమును గాపాడుకొనినవాడు. అప్పుడప్పుడు కోతిబుద్ధి తప్పుడు త్రోవలకు లొంగదీయుచుండినను అసాధారణ ప్రతిభా సంకల్పమున మనసును చిక్కబట్టుకొని అట్టివానికి పెడమొగము బెట్టుచుండును.

ఆ పాలిండ్ల యందదుకు కొనిపోయిన దృక్కుల నట నుండి చీల్చికొని ప్రేక్షకుల మొగముల నొండొండ పరిశీలించెను. ఈ యేనాది గుంపంతయు వేర్వేఱుగ – ఒక్కొక్కరుగ – తన్ను సమీపించినగాని ఏసుక్రీస్తు పవిత్ర ప్రేమ నెఱుంగజాలదని తీరుమానించికొనెను.

‘పాపకూపమునబడి విలవిల దన్నికొని చావవలయునని నిశ్చయించికొని యుండి నవారు నాకడకు రాకుడు కాని, దేవుని బిడ్డలారా, మా తెల్లదొరల దేవుని దగ్గరకు పోయి మీ జన్మలను పవిత్ర మొనరించుకొనుటకు వలచితిరేని నా గుడిసెకడ కొక్కక్కరుగ రండు. సూక్ష్మములో మోక్షమార్గము చూపెదను. మందులను మూలికలను ఇచ్చెదను’ అనెను.

తాను నిలిచి యుపన్యసించిన గుంటిపై నుండి దిగి గుంపులో జొచ్చి ఒక్కొక్కరిని తన దారి కడ్డముండిన వారిని భుజముల దట్టుచు ‘నన్ను కలిసికొనుడు, వచ్చి చూడుడు’ అని చెప్పుచు వెళ్లెను.

– – –

ఆ యూరి వంకలో నొక మెలికలో నిర్మల సైకతస్థలిని ఒక్క యేనాది ముద్దుగుమ్మ తన మనోహరుని యంకమున బరుండి పొరలాడుచుండెను.

‘ఆ తెల్లదొర పాదిరీ చెప్పింది వింటివా చెంగీ ?’ అని యతడడిగెను. చెంగి అందముగా

ఆవులించినది. తరుణ తాళఫల సదృశమైన నొక గుబ్బతో నాటలాడుచున్న వాని చేతిని నొక్కుచు ' మనమిట్లుండిన పాపము వచ్చునటకదా?' అని తన గుబురుపారిన కనుబొమలు నుదురంతయు నాక్రమించుకొనునట్లెత్తి ప్రశ్నించెను. ఆ ప్రశ్నలో సంపూర్ణమగు మౌగ్ధ్యము వ్యక్తపడుచుండెను.

గుండు గాడట్లే చెంగిపై బడి యాసుందర విగ్రహమును బీజారి కౌగిట గ్రుచ్చి 'ఇది పాపమెందుకౌతుంది? ఆలూ మొగుడెట్టుంటే నేమీ? ఇది పాపమని యాడ శెప్పిం దంటా?' అని కొసరి కొసరి మాటాడినాడు.

అతని ఉక్కు వ్రేళ్లు తన్ను పులిమి వేయుచుండగా శరీరము మనోహరముగా పులకలెత్తుచుండ చెంగి చిన్న నవ్వుల వరాలవానను గురిపించెను. 'మనం పెండ్లి శేసుకోక ఆలూమొగుడూ ఎట్లవుతాం? పెండ్లి శేస్కొంటే పాపం వుండదు మనం ఎట్టుంటేను'.

అని చెప్పిన వెంటనే మొగమును సిగ్గువలన బోరగిలవైచి అతని తొడను నోరార కబళించి మోహవివశీకృతయై కొఱికినది. గుండుగాడా వక్రాలకములను దువ్వుచు మహదా నందమగ్నుడై 'చెంగి, సుబ్బి బదకదు. బదికినా నాకో బొగుమంచి వుగితి తోసింది. మనం యీ కిరస్తాని మతంలో కల్సిపోదాం. అది గమ్మనుండి పోతుంది' అనెను.

సుబ్బి గుండుగాని మొదటి భార్య ఏదో తీరని రోగముతో పడియుండెను. ఆమె మాటెత్తినదే చెంగి చివుక్కున చెంగించి యావలికేగి ముఖమునిరుచేతులతో గప్పికొనెను. గుండుగాడామెను తన కౌగిటికీడ్చికొని చేతులావలికి ద్రోసి 'ఏమి యాడవట మెందకూ? ఇంత సంతోసంగుంటే, నేనేవంటినని నువ్వేడవటము?' అని అడిగెను.

'మనం కిరస్తాని మతంలో కలిస్తే, అది కూడా రాదూ ? నాకేమో బయమేస్తావుంది. మామా నేను శేసినదంతా పాపం నిన్నూ నీపెళ్లాని యేరుసేశినా, ఇప్పుడు నీ బుద్ధి సెర్శినా, నీ కాపరం పాడయిపోయింది. నన్ను నరికెయ్ నీ శేతుల్లో ప్యాణం పోతేసాలు' అని చెంగి వెక్కి వెక్కి యేడువసాగెను.

గుండుగాని గుండెకరగినది. 'చెంగీ, మనం కిరస్తానీ మతంలో కల్సినా, కలవక పోయినా, సుబ్బి మనజోలికిరాదు. నాకు సత్తెప్పెమానం శేసింది. ఒక్కాలు కాట్లోవుంది. మీసుగానికి నాను అడ్డం తగుల్ను మామా అని సెప్పేసింది. అనేక నువ్వేమీపాపం శెయ్‌లే. నేసిందంతా నాను నాబుద్దేమి నూ శెఱవలె. నా నెందుకు నిన్ను నరకాలో తెల్లే నా బంగారు పిచ్చికని, నా సూపుల్లో యెలుగును. నాప్యానాల్లో ప్యానాన్ని, నిన్ను చెంగీ, నాను నరికేసి యేమయ్ పొయ్యేది?'

'అందుక్కాదు? నా పాపానికంతుందా? పెళ్లవకముందే నీతో –' ఏడుపు మరల నారంభించెను.

'యేమయింది నాతోవుంటే పెండ్లాడతానుగా?'

'అది కాదు, నాకు రెండు నెలలు తప్పింది.' చెంగి వెక్కి వెక్కి వచ్చే నేడుపును ఆపలేకపోయింది. 'గుంటినుండో గుంటలోనో పడి చస్తాను మామా, నన్ను మర్సిపో నువ్వు'

గుండుగాడట్లే నిర్ఘాంతపడి నిలిచినాడు. హృదయము కరిగి కన్నుల గుండా వెల్లు వలుగట్టి ప్రవహింప నారంభించినది. ఆలోచించినాడు జీవిత సమస్యను తీవ్రముగ తన తీర్మానమిట్లు వచించినాడు. 'చెంగీ, నీవు నేను ఈ ఫాదిరీ దగ్గరికిపోయి జరిగిందంతా సెప్పేస్తాం. పెద్దోళ్లెవురు తెల్సుకోక ముందే ఆయన్నడిగేస్తాం అనేకేమౌతుందో అయ్యేది కానీ.'

'నానూ చెప్పాలనుకొన్నా నానొక్కతో పోతాను. నువ్వొద్దు లోగా', 'సరే, మరి పదాంపద ఆడకి'

---

ఏనాది పాళెములో నిల్లు చిక్కుట కష్టమే. నాలుగణాల బాడుగకు ఒక చిన్న గుడిసె చిక్కినది మన ఫాదరీ దొరగారికి. ఒక చిన్న వెదురు తలుపు బోను తలుపువలె నాగుడిసెకు గలదు. ఒక మూల క్యాంపు మంచము, దాని ప్రక్కన ఒక సూటుకేసు కుర్చీకి బదులుగ నుపయోగించికొని ఫాదిరీ కూర్చొని లోపల వచ్చువారికి మంచి మాటల గొందఱకు, మందుల గొందఱకు, మతమును గొందఱకు బంచిపెట్టుచుండెను. తలుపు తట్టిన శబ్ధము వినినది.

'పాపాత్మా, లోపలరమ్ము' పెద్ద బొంతను నిండు ముసుగు పెట్టి ఒక వ్యక్తి లోపల బ్రవేశించి తప్పుటడుగులు పెట్టుచు నతని సమీపించి నిలువలేక కాబోలును చదికిలబడెను.

ఫాదరీ ఆత్రముతో నా వ్యక్తిని సమీపించి 'ఏమి? నీ సంగతేమి?' అని అడిగెను.

'మందు దగ్గుమందు' అని కేకరించి దగ్గు లినుమడించుచుండ దీనముగా నడిగెను.

ఫాదరి రోగిని బరీక్షించి నోరు చప్పరించి 'మందక్కఱలేదు. మతమును మాత్రము పుచ్చుకో స్వర్గానికి పోగలవు' అని నిర్వచించెను.

రోగి భయకంపిత స్వరముతో మీ దేముడు కూడ ఉపయోగం లేనోడేనా? అని అడిగెను.

'బుద్ధిలేనిదానా, మా దేముడు స్వర్గమును ఎప్పుడువచ్చినను ఇచ్చును. కడమ దేవుళ్ళదికూడ లేదు. పోనిమ్ము, నీకడ డబ్బే మాత్రమున్నది ?"

'దుడ్డెందుకూ?'

'కానుక దేవునికి. కానుక లేక వట్టిచేతులతో రావచ్చునా? తీర్థమిచ్చెదను. మందిచ్చెదను. నీ అదృష్టము మా దేవునికరుణ ఎట్లుండునో చూతము.'

'ఆ మాత్రం దైర్నమిస్తేసాలు. ఇదో దుడ్డు. ఎంతుందో ఎంచుకో' అని ఒక మంటి బుడిగ, పసుపుగుడ్డ మొగమునకు జుట్టి యుంచినది ఆతనిచేతికిచ్చి ' ఇది ఏల్ని వాడికి ముడుపులు మీదులు' అని చెప్పెను.

ఫాదరీ దానిని తీసికొని బరువుగ నున్నదనుకొనినాడు. వెంటనే కరుణ చిప్పిలునట్లు రోగిని మేనెల్ల తడవి తాజాచేసి 'నీ రోగము పోయినది. దేవుడు నీపై కరుణించుచున్నాడు' అని ధైర్యవచనముల నుడివి ఏదో మందిచ్చి తీర్థమిచ్చి పొమ్మనెను.

రోగికి కొంచెము మనసు కుదురుకొన్నదని యే చెప్పవలయును. ఆమె లేచి సంతోషముగ కాళ్లీడ్చికొనుచు వెళ్లెను.

తలుపు తెఱచినతోడనే యారోగికి చెంగి కన్పడినది. ముసుగులో నున్నందువలన తన మొగము చిట్లింతను చెంగి చూడలేదు. రోగి మాత్రము పోయినట్లుపోయి గుడిసె వైపునకే మరలివచ్చెను.వెలుపలికి వచ్చుచు రోగి తలుపు తెరచి యుండుటచే చెంగి లోన నిరభ్యంతరముగ ప్రవేశించెను.

ఫాదరీ దొర ముడుపువిప్పి రాగి డబ్బుల నెంచికొనుచుండెను చెంగి లోపల ప్రవేశించినది. ఆమె సమీపించిన పిదపనే తెనిసినది. కొంచెము కోపము తోచునట్లుగా 'తలుపుతట్టి రమ్మన్ననే రావలయును' అని కసరినాడు.

చెంగి అతని కసరింతను లెక్కపెట్టలేదు. కన్నులశ్రువులతో నిండియున్నవి. తటాలున నామె నేలకువంగి 'దణ్ణాలు దొరగారూ. రచ్చించండి పాపిష్టిని' అనుచు నమస్క రించెను.

ఆ వంగునప్పుడు కంచుకరహితమైన యురోజములా పైట నవలికి నెట్టివైచినవి. ఆ దృశ్యమును జూచిన ఫాదరీ గుండె లొక్కసారి 'గభిక్కు'మన్నది. చామనచాయ మేని తారళ్యము కనుల మిఱుమిట్టు గొలుపుచుండనోరు తడబడ 'పాపాత్మురాలా, దేవుడు నీ మొఱ వినుచున్నాడు. నీ సంగతేమో విశదముగ చెప్పికొనవచ్చును' అని సెలవిచ్చినాడు.

చెంగి అతని పాదములకడ కూర్చొని తనకు గుండుగానికి నున్న సంగతంతయు ముగ్ధత్వముట్టిపడ సమగ్రముగ వచియించెను. పెండ్లికాకముందేర్పడ్డ తన దుస్థితికి ప్రాయశ్చిత్తము క్రైస్తవమతమున నేమిచెప్పబడినది ? అని ప్రశ్నించెను.

ఫాదరి యామె వచించునది వినుచు నా చెక్కి తీర్చిన సుందర మనోహర విగ్ర హము నాపాదమస్తకము పరిశీలించుచుండెను. సహజ సౌందర్యమునకు నగలేల? విలువ వలువలేల? మనసున నేదో విధముగ వికార ముదయించినది అతనికి. చెంగి వెడద కందోయి, చిగురు పెదవి, యుబ్బుచెక్కిళ్లు, చాక్‌లెట్ల గుట్టలవంటి యాచందోయి నొక్కసారిగ కబళింపవలయునని శివమెత్త నారంభించెను.

'పిల్లా నీయపరాధమును మా దేవుడు క్షమించును. నేను నిన్ను అతనికి సిఫార్సు చేసెదను. నీకు దేవునిదయ కలుగునట్లు నేను నీ శరీరమును పవిత్రమొనరించెదను. లెమ్ము. ఈ చోట పరుండుము' అని క్యాంపు మంచము చూపి, బిరబిర వెళ్లి తెఱచియుంచి యుండిన నెదురు తలుపును మూసి లోనికువ్వంపుగొళ్లెముపెట్టి వచ్చినాడు. అంతలో నామౌఢ్యంపు చిన్నది ఆ తూలికాతల్పమున శరీరమును వెల్లవెలికిల బూడ్చివైచి పాపమునకు బాచితి నెదురుచూచుచుండెను.

ఫాదరీకి తలగింగు రెత్తుచుండెను. ఎన్నో వత్సరములు తన భౌతిక శరీరమునకు బరిత్యజించి వైచిన యాయమృతో పమాన బ్రహ్మానందానుభవమున కిట్టి తరుణము నిట్టి తరునియు లభించెనని యాంతరాత్మ సంభోధించుచుండ నాతడొక్క సీసాలోని తైలమును మునివ్రేళ్లనద్దికొని చెంగిని సమీపించెను. విస్ఫారితనయనముతో నా యువతి వారిని వీక్షించు చుండెను.

'నీకీ యమృతతైలమును మర్దించి నీ యవయవముల బునీత మొనర్చెదను అనుచు నవవడిన పైట నూడదీసి తనకు దోచినచోట్లెల్ల నామదవతికి మర్దనము కావించినాడు. చెంగియు గొంతవఱకట్టే కొయ్యబారి నిశ్చేష్టితయై పడియుండెను. ఫాదరీ కంతటితో తృప్తికలుగలేదు. తటాలున దాను వివస్త్రుడై చెంగిని కౌగలించెను.

అప్పటికి చెంగికి వానితంతు మనసునకు దట్టెను కాబోలు. తన చిన్నికూనల దాకిన వానిపై నుఱికెడు సివంగి వలె నొక్కఱపఱచి కాలితో గాఢముగా వాని ఱొమ్మున దన్నెను. వాడాతాపునకు వెల్లకిలబడి విలవిల తన్నుకోనుచుండగా చెంగి లేచి బిరబిర తలుపుదెఱచికొని పలాయనమాచరించెను.

ఫాదరీ చావునకు చెంగి కారకురాలనియు నదియే వాని నేమరించి చంపెననియు తీర్మానింపబడినది. చెంగి యా గుడిసె నుండి తల విరియబోసికొని పాఱిపోవుచుండుటను పలువురు చూచిరట. చెంగి మాటల నెవ్వరు నమ్మలేదు. మీదు మిక్కిలి భ్రష్టయని యందఱామె నేవగించికొనిరి. గుండుగాని సాక్ష్యమును దృఢీకరించిరి. చెంగిని పోలీసుల కప్పగించిరి. ఉరిదీయుటకు దీసికొనివెళ్లుచుండగా గుండుగాడడ్డపడెను. పోలీసులు వానిని చావగొట్టిరి. ఇంతలో సుబ్బి (గుండుగాని భార్య) రోజుచు బరువెత్తుకొని యటకు వచ్చెను.

'చెంగిని వొదిలేయండి. నానంతాసూసినాను. ముడుపు చెల్లించేశి వస్తావుంటే చెంగి లోగాపోయింది నాను సూశినా. ఆనేక ఫాదరీ తలుపేసుకొంటే ఏంజేస్తుందో సూద్దామని తలుపు సందుల్లో నుంచి సూస్తావుంటి. ఫాదరీ నూనె పూశి చెంగిపైనబడి శెడ్డపని శెయ్యాలను కొన్నాడు. చెంగి కాళ్లు జాడించి లేశింది. ఆ పోకిరిదొర యెనక్కి పడిపోయినాడు'. ఈ మాటలు కేసును తలక్రిందు చేసినది.

మరల విచారణ జరిగినది. సుబ్బి సాక్ష్యము నందరు విశ్వసించి చెంగిని వదలి వేసిరి. నిర్దోషియని రుజువయినదే చెంగిని గుండుగాడు కులముపెద్దలందరి యనుమతిచే పెండ్లాడినాడు. కాని చెంగి మాత్రము 'సుబ్బక్క సావకుంటే మేమింకా బగు సంతో సంగుండేవాళ్లము' అనుచుండెను.

**–డిసెంబర్, 1937,తెనుఁగుతల్లి**

# వెలి

– పాణ్యం సంజీవశాస్త్రి

1

"బేట్రాయ్ సామి దేవుడా !

నాయేలినోడ, బేట్రాయ్ సామిదేవుడా !

కాటమ్మరాయుడా ! కదరీ నరసింహుడా !

నీటైన వేటుకాడ నిన్నే నమ్మినాడ."

సంజనెలత ఆ గీతమును విని చొక్కింది. తుంగభద్ర తన చిన్న అలలతో గట్లకు తాళము వేసింది. సూర్యుడు మనసుగరిగి తన తీక్షణత విడిచి మోహనమూర్తియై పడమటి కొండ మీద ఒక్కింతసేపు నిలిచి విన్నాడు. పున్నమిచంద్రుడు మబ్బుల చాటు నుండి మోమెత్తి తొంగిచూచినాడు.

'పాట బాగుందా చంద్రా !'

'ఓ! బలే బాగుంది. ఇంకా కొంచెము సేపు పాడు పద్మా !'

కిన్నెర మళ్లీ మ్రోగింది. ఆ బాలిక కంఠస్వరము ఆ మ్రోతలో మిళితమై పోయింది. ప్రశాంతమైన ఆ యిసుక తిన్నెల్లో ఆ పాట సముద్రపుటలవలె ఉవ్వెత్తునలేచి క్రమముగా సెలయేటివలె పరుగెత్తి కడకు చల్లగాలివలె హాయి పుట్టింపజేసి మధురమై హృదయము ద్రవింపజేయు పద్మా చంద్రులను తన్మయులుగా జేసివైచినది.

'దేవకీదేవి కొడుకువై జగములోన దేవుడై నిలచినావురా

ఆవులమేపుకొని, ఆడోళ్ల గూడుకొని,

తావు బాగచేసుకొని తక్కిడి బిక్కిడి చేసినోడ

బేట్రాయ్ సామిదేవుడా !'

గీతమాగి పోయింది. ఇద్దరు కండ్లు తెరిచినారు. వారి నాలుగుకండ్లు కలసికొన్నవి. ఒక క్షణము నిశ్శబ్ధము.

'పద్మ '

'చంద్రా '

'..........'

'..........'

'చంద్రా! నీవెప్పుడూరికి పోతావు'

'రేపు పోతాను '

'మళ్ళీ ఎప్పుడొస్తావు '

'ఏమో చెప్పలేను '

'..........'

'..........'

'నన్ను జ్ఞాపకముంచు కుంటావు గదూ'

పై వాక్యమప్రయత్నముగా ఇద్దరి నోళ్ళ నుండి వెలువడినది. ఇరువురు నవ్వినారు. లేచి ఇండ్లకు పోయినారు.

2

పై సమావేశము జరిగి ఐదు సంవత్సరములైనది. గోపీచంద్రుడు బి.యే. పరీక్ష యందు నుత్తీర్ణుడైనాడు. ఇరువదేండ్ల వయస్సు బలిష్టమైన శరీరము. స్ఫురద్రూపము, అందమైన ముఖము, తేజోవంతమైన కండ్లు గలిగి అతడు విపుల నాకర్షనీయుడై యుండెను. అతని కైదేండ్లకిత్రము తల్లి చనిపోయినది. అపుడతడు తన తండ్రితోగూడ స్వగ్రామమగు రంగా పురమును విడిచి మేనమామగారి యూరైన రామగ్రామమునకు రావలసివచ్చెను. అతని తండ్రి ఆయూరనే యుండ, చంద్రుడు దగ్గరనున్న పట్టణములో బి.యే.వరకు చదివెను. చంద్రుని తండ్రికి మొదటి ఆరునెలలు మామగారి యూర బాగుగనేజరిగెను. తర్వాత ఇంటి చాకిరియంతయు నాయనయే చేయవలసివచ్చెను. ఆయనకది కష్టముగాతోచి మరల రంగా పురమునకువచ్చెను. కొన్నిదినములకే ఆయనకు క్షయవ్యాధి ప్రాప్తించెను. కుమారుడు దిగులు పడునేమోయని ఆయన తన వ్యాధి విషయము చంద్రునకు తెలుపలేదు. కొన్ని దినములకే అతడు మంచమునబడెను. తన కుమారుడుచదివివచ్చి, ఏదో ఒక ఉద్యోగములో ప్రవేశించి తనకు సంపాదించిపెట్టునని ఆ వృద్ధుడు, తన కుమారుని బడి జీతమునకును, ఇతర ఖర్చులకును అప్పుచేసి పంపసాగెను. ఆహా! హూణవిద్యా వ్యామో హము! కొలది కాలములోనే ఆయన భూస్థితి, భార్యనగలు అప్పులవారి పాలబడినవి. కాని ఇంకను అప్పు తీరలేదు.

గోపీచంద్రుని విద్యాభ్యాసము పూర్తియయినది. స్వగ్రామమునకు వచ్చినాడు. ఇంటిలో అడుగుబెట్టతోడనే తండ్రి మూలుగులు అతనికి వినబడినాయి. అతని గుండె కొట్టుకుంది. తండ్రి మంచము వద్దకు వెళ్లినాడు. గబ్బిలములకు నివాసమైన ఆ యింట్లో ఒక కుక్కి మంచముమీద పడియున్న తండ్రిని చూచినాడు. తండ్రిని పిలిచినాడు. ఆ ముదసలి అతికష్టము మీద కండ్లు తెరచి చూచినాడు. గద్గద్గ స్వరముతో ఒక్కసారి తన కుమారుని పిలిచినాడు.

'చంద్రా !'

'నాయనా !'

ఆ ముదుసతి ప్రాణవాయుములు ఆ అనంతాకాశమున లీనమైపోయినవి. చంద్రుడు తండ్రి కళేబరముపైబడి బాలునివలె ఏడ్చినాడు.

3.

“ఇదేమిటయ్యా !’

‘కనపడడం లేదూ !’

‘నాకేమీ ఈ విషయం తెలియదే’

‘ ఊ! పాపం మీనాయన మంచంలో పడింటే ఇన్నాళ్లు నీ చదువుకు దుడ్డెక్కణ్ణుంచి వచ్చిందనుకున్నావయ్యా?’

‘ అయితే రెండు రోజులు తాళండి, ఎక్కడున్నా ఉద్యోగం సంపాయించి...’

‘అదంతా వీల్లేదు.నాకిప్పుడిబ్బందిగా వుంది. డబ్బిక్కడ పెడ్తావా? ఇంట్లో సామానులు బయట పెట్టించమంటావా?’

‘అంత తొందరపడ్తే ఎట్లానండి కొంచం ’

‘ఓహెూహెూహెూ ! ఇట్లాటివాండ్లను చాలా మందిని చూచినాం. ఒరే తలారి? చూస్తావేంరా!’

కోమటి సబ్బయ్య చంద్రుని యిల్లు జప్తిచేయించి వెళ్లిపోయినాడు. ఆ దు:ఖజీవి కుక్కి మంచంలో కూలబడి రెండు చేతులతో ముఖం కప్పుకున్నాడు. ఏడ్పురాలేదు. అతని హృదయం పాషాణమైపోయింది. అతడెంతసేపట్లు కూర్చున్నాడో అతనికే తెలియదు.

4

పద్మ ఇపుడొక బాలవితంతువు. ఆమెకు పన్నెండోయేట పెండ్లయింది. పదమూడో యేట ముసలిమొగుడు చచ్చిపోయినాడు. అప్పటి నుంచి ఇంట్లో చాకిరి అంతా ఆమెనే చేయవలసి వచ్చింది. ఒంటిపూట భోజనము, ఉపవాసాలు, చన్నీళ్ళ స్నానాలు ఆమెను కృశింపజేసినాయి. కాని ఆమె మొగుములో తేజస్సూ, లాలిత్యమూ, లావణ్యమూ తగ్గలేదు. ఆమె ఎప్పుడయినా ఒక్కసారి ఒక గదిలోకి పోయి చీరకట్టుకొని సొమ్ములు కుంకుమ పెట్టుకొని అద్దంలో చూచుకొని సంతోషించేది. మరుక్షణము కన్నీరు నించేది. తన పాతగుడ్డలు కట్టుకొని సొమ్ములు తీసివేసి కుంకుమ చెరిపివేసి బయటకు వచ్చేసేది. అంత తప్పితే మరొక సుఖమెరుగదా బిడ్డ. కొన్నాళ్ళకు ఆ సొమ్ములూ గుడ్డలూ ఆమెకు లేకుండాపోయినాయి. అందరూ ఆమె మీద అధికారం చెలాయించేవాండ్లే అయినారు. ఆమెకు నాలుగుసైను గుడ్డలూ,చంద్రుడిచ్చిన కిన్నెర మిగిలినవి. ఆమె అదెప్పుడైనా ఎవరికి తెలియకుండా తీసి ఒకసారి మెల్లగామీటి చంద్రుణ్ణి తలచుకుంటూ తన్మయురాలైపోతుండేది.

5

రాత్రి తొమ్మిదిగంటలయింది. పిండారబోసినట్లు వెన్నెల గాస్తుంది. పద్మ తోటలోకి బిందె పట్టుకొని వచ్చింది. ఆమె కోనేటిగట్టుమీద బిందె పెట్టింది. ప్రక్కనున్న పొదలోనుండి ఒక కిన్నెరను ఒక కుంకుమ డబ్బీని తీసింది. కుంకుమ నొసటపెట్టుకొని నీటిలో ప్రతిబింబము

చూచుకొని మురిసిపోయింది. మరుక్షణమే రెండు వేడికన్నీటి బిందువు లామె చెక్కిళ్ళనుండి జారి తళతళ మెరుస్తూ నీటిలోపడి ఆ సుందర ప్రతిఫలాన్ని కలచివేసినాయి. అట్లే వెనుకటి తలంపులామె మనస్సును కలచివేసినాయి. ఆమె కిన్నెర వణుకుతున్న వ్రేళ్ళతో మీటబోయింది. ఇంటివైపు జూచి మళ్లీ ప్రక్కన పెట్టేసింది. మొగమును రెండు చేతులతో కప్పుకొని నిశ్శబ్ధముగా ఏడ్చింది. కొంత సేపటికి కండ్లు తెరచింది. ఎదుట చంద్రుడు కన్పట్టినాడు. గోపీచంద్రుడు ఉదయము నుండి తండ్రి శవము వొద్ద నుండినాడు. ఏడ్చుటవలన అతని గుండెబరువు కొంత తగ్గినది. ఇప్పుడు అతడు దప్పితీర్చుకొనుటకై కోనేటికి వచ్చినాడు. పద్మను చూచి అటులనే నిలువబడిపోయెను. ఆమె స్థితియంతయు నాతని కర్థమైపోయినది. అతని మనస్సులో గొప్ప సంక్షోభము గలిగినది.

'చంద్రా'

'పద్మా '

పద్మ చంద్రుని కౌగిల్లోకి ఒరిగింది. ఇద్దరి కండ్లు నశ్రుపూరితములైనవి. చంద్రు డామెను లేవదీసెను. ఒకరి మోమొకరు చూచుకొనిరి. ఒక నిముసమట్లే గడచిపోయెను. వారికండ్లేమో మాట్లాడుకొనినవి. పద్మయే ఆ నిశ్శబ్ధమునకు భంగము కలిగించెను.

'చంద్రా ! నాకీ ప్రపంచముపై రోతపుట్టినది '

'నాకుగూడ నంతే, పద్మా'

'అది నన్ను సుఖము నుండి వెలివేసింది'

'దాని బహిష్కారముతో మనకు పనిలేదు. మనమేదాన్ని బహిష్కరించుదాం '

'................'

'................'

'సరే '

వారిద్దరు ఆచెట్ల చీకటిలో అదృశ్యమైనారు.

ఒకనాడు రాత్రి వెన్నల్లో నల్లమల్లకొండల్లో తుంగభద్ర ఒడ్డున చల్లగాలి ననుభవిస్తూ ఒక వ్యక్తి ఒక చిన్నబిడ్డను చేతినిడుకొని ముద్దాడుచుండెను. ఇంకొక వ్యక్తి భువన మోహనమైన సౌందర్యంతో వెల్లివిరుస్తూ చేతనొక కిన్నెరమీటుతూ పాడుచుండెను.

> "బేట్రాయ్ సామిదేవుడా
> నాయేలినోడ బేట్రాయ్ సామిదేవుడా"
> ప్రకృతి వారిని చేయెత్తి దీవించెను.
> ఈశ్వరుడు చిరునవ్వు నవ్వినాడు.

**– 23 ఏప్రిల్, 1938, సాధన పత్రిక**

*(కథకుడి వివరాలు తెలియవు)*

# విడుమర

– కందాళ శేషాచార్యులు

రంగడు గొల్లపేట కాపురస్తుడు. పదేండ్ల పిల్లతనము నందే వాని తల్లిదండ్రులు చని పోయిరి. పిత్రార్జితములైన సొత్తులంతా కోర్టు వేలములందు మాయమయినాయి. అప్పట్లో అతన్ని చేరదీసి కాపాడినది వాని యక్క లచ్చమ్మ. ఆమె కాపురం కూడా గొల్లపేట యందే! ఆమె భర్త గౌరప్ప అనే ఆయన, మంచి పేరు పొందిన రైతు. ఈ దంపతుల కొమార్తెయే మంగమ్మ. ఈ పిల్లను రంగనికిచ్చి వివాహం చేసి వానిని తన యింటిలోనే యిల్లట ముంచు కుంటే బాగని భార్యాభర్తలు తలంచిరి. కాని రంగడు దుష్టుల జతగూడి దినదినానికి చెడిపోజొచ్చినాడు. వానికి అక్క యింటిలోని తిండి రుచింపలేదు.

లోకంలో సన్మార్గముపదేశించేవారు లేరు. ఒకవేళ వుండినా వారి మాట లెవ్వరికీ వినబడవు. ఇక దుర్బోధలు గావించే వారే చాలామంది. అట్టివారిలో ఒకడు రంగని చేరదీసి 'ఒరే రంగా! నీకు మీ లచ్చక్క యింటిలో యేమి సుఖముందిరా? వారి తిరిపెపు కూడు తినే కర్మ నీకేమి పట్టిందిరా? ఇదిగో బలం సాహసం వుంటే నాతోరారా! నీలగిరికి పోదాం. అక్కడ మంచి దొరలున్నారు. కాపీ చెట్లు కావలికాచేదేపని, అంతే! ఇదో! రైలు చార్జీలక్కూడా డబ్బు పంపించినారు. దీంతో మనమిద్దరం నీలగిరి చేరచ్చు. అక్కడ చేతుల నిండా రూకలు సంపాదించవచ్చు. కావలసినంత కూడబెట్టవచ్చు. ఏమంటావు? వస్తావా!'

రంగని కప్పుడు సుమారు పదునారేండ్ల ప్రాయము. ఉడుకు రక్తము! యుక్తాయుక్త విచారానికి చోటులేదు. అవకాశమున్నూ లేదు. పై సలహా అతనికి నచ్చింది. ఏమైనగాని స్వతంత్రంగా బతుక వచ్చుననీ, సంచులనిండా డబ్బు గంటుకట్టవచ్చుననీ, దర్జాగా దినాలు వెళ్లబుచ్చవచ్చుననీ తలచినాడు ఇకనేమి? ఆ మరుదినమే స్నేహితుని వెంట బయలుదేరినాడు. తన ప్రయాణ సంగతి యెవరికీ తెలుపలేదు. రైలుస్టేషనులో మాత్రము చిక్కిరెడ్డి ఇతన్ని చూచినాడు. ప్రయాణము మానమని యుపదేశించిననూ వినే స్థితిలో వీడుండలేదు! రైలు కదిలింది.

దూరపుకొండలు నునుపనేమాట నిజమైంది. రంగడొక కాఫీతోటయందు చేరినాడు. కాని వాని కందలి వాతావరణమేమిన్ని సరిపడింది కాదు. అక్కడి తిండి రుచించింది కాదు. అదేమిచిత్రమో కాని 'రాయలసీమలోని యెండకొంపలే సుఖంరా!' అనే తలంపాతనికి తట్టింది. తన దేశం, తన భాషా, తనయాహారమూ, తనయలవాట్లూ కనపడకపోయిన పుడందేమి సుఖమువుంటుంది? పాపము! వాడు చావు బ్రతుకులమధ్యా కొంత కాలము వెళ్లబుచ్చినాడు.

ఒకనాడు వానిపేరిట ఒక జాబు వచ్చింది గొల్లపేటనుండీ. వ్రాత చిక్కిరెడ్డిదే! అందులో "రంగా, నీవు నీయక్కతోగానీ, బావతోగానీ చెప్పకుండానే పారిపోయినావని తెలుస్తోంది. వారు నీకై చాలా చాలా చింతిస్తున్నారు. నీకు కాఫీచెట్లు కావిలి ఆరోగ్యాన్ని ఇవ్వదు. కాబట్టి

యీ జాబు చూస్తూనే గొల్లపేటకు వచ్చివేయి నేను నీకు మంచి నౌకరీ ఇప్పిస్తాను. తాత్సారం వద్దు. ఇంతే ఆశీర్వాదాలు చిక్కిరెడ్డి వ్రాలు" అని వుండినది.

రంగడాజాబును దొరకు చూపినాడు. కాని, ఆయన వానిని విడిచేదానికి వొప్ప లేదు. లేనిపోని ఆశలుచూపి వానిని కొలువులో నిలుపుకొన్నాడు. విధిలేక ఆ నిర్భాగ్యుడందే నిలిచిపోయినాడు. దొరకు జాబుచూపినను తన పొరబాటేయని అనుకున్నాడు. క్రమక్రమ ముగా ఆ దేశం జీవనానికి అలవాటుచేసుకోవడానికి ప్రయత్నిస్తూ వచ్చినాడు.

ఏదోవిధంగా రెండేండ్లు గడచినాయి. ఈ మధ్య వానికి గొల్లపేటనుండీ యెన్నో జాబులు వచ్చివుండినాయి. కాని వానినంతా లక్ష్యపెట్టకుండా రంగడు దినాలు గడిపినాడు. కాని యీమారు పిడుగువంటి జాబు వచ్చింది. వానికి మిక్కిలి వ్యసనము కలిగింది. హృద యము కృంగిపోయింది. గొల్లపేటకు కలరా దేవత వచ్చివుండిందనీ, గ్రామములోని వారిలో చాలా మంది ఆమె నోట్లో పడినారనీ, రెండు రోజుల క్రిందటనే రంగని అక్క లచ్చమ్మనూ, ఆమె భర్తనూ, దేవత మ్రింగిందనీ, పాపం! మంగమ్మ దిక్కులేని పక్షియై యల్లాడుచున్న దనీ, యేదియెట్లున్నా రంగడు గ్రామానికి వచ్చేది క్షేమమనీ, జాబులో తెలుపబడి వుండినది.

వానికి కాళ్లూ చేతులూ ఆడలేదు. కన్న తల్లిదండ్రులు పోయిననాటినుండి తన్ను కాపాడి రక్షించినవారగు లచ్చమ్మ గౌరప్పల నిక చూడలేనుకదా యనే తలంపు కలచివేయసాగింది. వాడు దొరకు ఆ జాబును చూపలేదు. ఆ రాత్రి గుప్పుచప్పిడి లేకుండా తన వద్ద దాచుకొన్న నలువది రూపాయలను గంటుకట్టుకొని గొల్లపేటకు పారిపోయెను.

మంగి పుష్పవతియై యప్పటికే నాలుగు మాసాలయి వుండినది చిన్నది. పైగా ఒంటి కాపురం చేస్తూ వుండినది. రంగడు గ్రామానికి వచ్చినాడు. కాని యాబిడ్డపై వానికి ఆ దినమే మక్కువ మాయమైంది. రోతపుట్టింది. ఏపాపమెరుగని బాలికపైన లేనిపోని నిందలారోపించి నాడు. ఈ సమయములోవానికి సలహాదారులు దావరించినారు. ఒరే! మంగి కంటే నీకు మంచి పిల్లనిచ్చేవారున్నారు. రారా! పోదాం అని వారి యుపదేశము. వీడేమో నీలగిరి నుండి సంచుల కొద్దీ డబ్బును తెచ్చినాడని గ్రామములో కొందరు భ్రమపడినది వాస్తవమే! కాని వీని ధనసంపత్తి యేపాటిదో సరిగా చెప్పువారు లేకుండిరి. ఉన్న దానినివీడు మద్యపానమందు వెచ్చించేది ఆనోటా ఈ నోటా పడి గ్రామమంతా తెలిసిపోయింది. ఇంకేమి ఆపిల్లల నివ్వదలచినవారంతా వెనకుదొక్కిరి. త్రాగుబోతు వానికెవ్వడిస్తాడు తన పిల్లను? రంగని కిపుడు తన సలహాదారులపై మహాకోపం వచ్చింది. అటు మంగిని చేసుకోక, యిటు క్రొత్తపిల్ల దొరక్క ఉభయ భ్రష్టుత్వము కలిగినది. ఎవరిపై కోప్పడితే యేం ప్రయోజనం?

కూలిపనులు చేతకావు. డబ్బు మిగిలివుంది. సురాపానం జతగూడింది ఇకనేం? రంగని బుద్ధి పూర్తిగా పెడదారిబట్టింది. ఆహారముండనీ, లేకుండనీ మద్యసేవనమును మాత్రము వదిలేట్లులేదు. వాడింటికి రాకుండా మంగిని చూడకుండా నిలిచిపోయెను. ఆ పిల్ల మాటంటే సరిపడకపోయింది.

మంగి సాహసించి ఒక దినము రంగడున్న స్థలానికిపోయి 'మామా ! ఎందుకీ మాదిరి త్రాగి డబ్బంతా పాడుచేస్తావు? మనింటికి పోదాముర! అక్కడ సుఖంగా ఉందువు కాని' అన్నది. ఆ మాటలు వినేటప్పటికి వానికి పిచ్చికోపం వచ్చింది. 'ఆ ! ఏమి సాహసమురా ఈ పిల్లముండకు? నా త్రాగుడును ఆక్షేపించేంత పొగరా దీనికి? గుడ్డు పిల్లను వెక్కరించిందట. పో అవతలికి పో గాడిదా!' అని గద్దించినాడు. పాపం! వెళ్లిపోయింది మంగి.

----

'ఉండినవాడు నవాబు, లేనివాడు ఫకీరు' అన్నాడొక తత్త్వవేత్త. మన రంగడీ రహస్యాన్ని గ్రహించినట్లుంది. కన్ను మిన్ను తెలియకుండా చేతిలోని ద్రవ్యాన్ని పూర్తిగా ఖర్చుచేసినాడు. నిలిచిన చోట నిలువకుండా, పరుండినచోట పరుండకుండా కాలం గడిపి నాడు. అంచనా వేసుకొన్న దినాల కన్నా ముందుగానే చేతిడబ్బు అయిపోయింది. ఈ దినము వాని చేతిలో ఒక చిల్లిగవ్వయైనా లేదు. అప్పు యిచ్చువారు లేరు. తిరిపమెత్తుట చేతకాదు. దీనికి తోడు కోపము. దురహంకారము ! వానిని రమ్మని పిలిచేవారు లేరు.

పోనీ, మంగి వుందికదా! అది మంచి పిల్లదే ! దాన్నడిగితే డబ్బు యివ్వదా? ఆం! ఒక మారుకసరి పంపివేసిన 'కొండముచ్చు'నా, మరల వేడుకొనేది? ఛీ! యింతకన్నా అవమానకరమైన విషయము మరేముంటుంది! త్రాగడానికి డబ్బుకై వెధవ ద్రవ్యానికై మంగి యింట కడప ద్రొక్కడానికన్నా యమసదనాన్ని ప్రవేశించేది లేసుకదూ!

ఐతే, యీ దినం మాటయేమి? సందెపూట త్రాగుట కేమిదారి ? ఇది తలంచు కొనేసరికి రంగని దేహము వేడెక్కి పోయింది. తలతిరిగి పోతుంది. అదేమోగాని, ఆ దినము కాలము మహావేగముగా పోతూవున్నట్లు కనబడింది. చూచుచుండగానే మధ్యా హ్నాము దాటి పోయింది. వేళమీరేకొద్దీ వాని గుండెలు దడదడా కొట్టుకుంటూ వున్నాయి.తల దిమ్మెక్కు తోంది. కనబడిన ఒకరిద్దరిని ద్రవ్యమడిగి చూచినాడు. బదులివ్వమన్నాడు. ఏమి యాస్తి వెలిగిపోతుందని వీనికి యెవ్వరైనా బదులిస్తారు! ఫలితము లేకపోవుటచూచి, డబ్బివ్వని యాకుంకలను చంపివేతునా అన్నంత కోపము వానికి కలిగింది. కానీ !...

రంగడేమి తర్కించుకున్నాడో మనకు తెలీదు. కానీ మంగినే యీ పూటకు అడుగుతా'అని లేచినాడు. త్రాగడానికి లేనినాడు ప్రాణాలను సుఖముగా విడుస్తానని సుబ్బన్నతో వాదించినవాని వాదనలేమైనవో యీ దినర! మంగి వయసులో చిన్నదైనా తెలివిగలదనియే చెప్పవలసి ఉంది. తలవని తలంపుగా మామ వచ్చినదిచూచి,ఆమె యెక్కడలేని గౌరవముతో లోనికి రమ్మని పిలిచింది.

'ఏదే మంగీ ! ఒక పావులా వుంటే యివ్వు. నీ పుణ్యముంటుంది. ఈ దినము నీళ్లకులేదు గాని !"

'మామా ! యింటిలో కూడు వుంది. రా తిందువుగాని. ఆ పాడు కల్లునీళ్ళకు రూకలెందుకు పాడుచేస్తావు "

రంగని కీ మాటల వల్ల కోపము రాలేదు. ఇప్పట్లో కోపము చూపితే పనులు సరిపోవని అతనిక్కూడా తెలుసు.

'ఉస్! నీ మాటలుండనీ లేద్దూ! కూడు విషయము మరలా చూస్తాముగానీ యీ పూటకు నా ప్రాణాలు నిలుపు, తొలీగా ఒక పావలా యివ్వరాదూ? పోనీ లేదనూ,పోతానూ"

'అట్లంటావా మామా ! ఇదో తెస్తావుండు, రేపటినుంచీ యిక్కడే నిలు మామా ! యెందుకే వూరికే యిల్లిల్లూ సందు సందూ తిరిగిచెడిపోతావు !

'అబ్బా ! కానీలే, రేపు మాట రేపటిది. ఏదీ త్వరంగా యీవే మరలా నిదానముగా వచ్చి మాట్లాడుతా గానీ !'

ఆ బాలిక పాపం ! అల్ప సంతోషి. నాలుగణాలరూక చప్పున తెచ్చియిచ్చింది. రంగడు వీధిలోనికి అడుగుపెట్టినాడు. తన్నెవ్వరూ చూడలేదులే అని యనుకొన్నాడు. కానీ యింటి గడప దాటకముందే సుబ్బన్న నవ్వుతూ యెదుట ప్రత్యక్షమయినాడు. అబ్బ! వీని సిగదరగా! వీడెక్కడ నుండీ ఊడిపడినాడురా బాబూ ! రంగనికి దేహము చల్లబడింది.

స్వబుద్ధిచేతనేమో లేక మరెవరి ప్రోద్భలమూ చేతనో చెప్పలేముగానీ, రంగడు మంగిని పెండ్లిచేసుకున్నాడు.ఒక శుభదినమందు వివాహము జరిగింది. దేశద్రిమ్మరిగా వుండినవాడిప్పుడైనా సంసారియనిపించు కొన్నాడుగదాయని చాలా మందికి సంతోషము కలిగింది. చిక్కిరెడ్డి పెండ్లి పెద్దగా నిలిచి కార్యాలన్నీ జరిపించినాడు. ఆ సందర్భములో ఆయన రంగన్ని చేరదీసి తీరికగా ఉపదేశము గావించినాడు.

"ఒరే రంగా! నీ మేలుకై యేవో కొన్ని మాటలు చెపుతున్నాను. మీ తండ్రి మా యింటికి చాలా కావలసిన వాడుగావుండిన వాడంట. ఆ మర్యాదను పాటిస్తూ నీకు మంచి చెబ్బర్లు చెప్పేది నా విధి అనుకుంటాను. సరీగా నడిచేదిన్నీ లెనిదిన్నీ నీఇష్టము. ఇప్పుడు నీవొక యింటివాడవయినావు. ముందు మాదిరి తిరుగుడు రాట్నమువలె చరించవద్దు. నీ కాలమంతా త్రాగడములోనే గడుపుతూన్నావని వింటున్నాను. నీకిది మంచిది కానేకాదు.దీన్ని బొత్తిగా మానివేయకపోతే నీ జన్మ వ్యర్థము. బొత్తిగా నిలిపివేయటానికి కాకుంటే క్రమక్రమముగానేనా యీ దుర్వ్యసనాన్ని మానుకో. నీ పెండ్లివల్ల మీ బావ గారి సొత్తులంతా నీకు చేరింది. వాటిని చక్కగా కాపాడుకొని బుద్ధితో బ్రతుకు. ఎవ్వరు గానీ నిన్ను చెడిపొమ్మని కోరరు. గొల్లపేటలో అట్టివారులేరని నమ్ము."

రంగడు ' కానీ రెడ్డీ!" అన్నాడు. అప్పటికి అంతే !!

----

చిక్కిరెడ్డి గొప్ప యింటికి చెందినవాడు.బి.ఎ.పట్టయును బొందినవాడు.ఇంత గొప్పగా చదివినవాడైనా నౌకరీలకు ప్రాకులాడకుండా గ్రామాలవైపు తిరిగిన ఘను డు.అన్నిటను గ్రామాలజనులు వెనుకబడివారని తెలిసి వారిని యుద్ధరింప నెంచినాడు. చదువులు చాలించి

గొల్లపేటకు వచ్చింది మొదలు అతడు గ్రామీణులకు పత్రికలను చదివి చెప్పుచూ ప్రపంచ పరిస్థితులనంతా వివరించి చెప్పుచూ, గృహపరిశ్రమలను పునరుద్ధరిం పుడని పురిగొలుపుచు, విదేశీ వస్తువులకై ద్రవ్యమును వృధాచేయకూడదని బోధించుచూ, రాజకీయ రంగంలో జరుగుతూ వుండే మార్పులను తెలియజెప్పుచూ, తీరిక వేళలందూ వ్రాతచదువులను నేర్పుచూ బాలబాలికలచేత చిన్నచిన్న నాటకములాడించుచూ, రైతు సోదరులకు ఆరోగ్యసూత్రములను తెలుపుచూ, కాలమును వెళ్లబుచ్చుచుండేవాడు. గ్రామానికి వచ్చిన రెండ్లేండ్లలోనే యతని తండ్రి మరణించెను. సంసార భారము నెత్తినపడినది. ఇందుకు తోడు గ్రామ మునసపుపని. ఈ మాదిరి సర్కారు నౌకరి యొక్కటి నుండిననూ గ్రామ పున ర్నిర్మాణ కార్యములందు అతడెప్పటివలెనే శ్రద్ధపుచ్చుకుంటూ వుండినాడు.

కాలమెప్పుడూ ఒకే విధంగా జరుగదు. 'భావ'సంవత్సరమది. వర్షఋతువు వచ్చింది కాని వర్షములు వెనుకాడినాయి. కార్మికులకూ, కర్షకులకూ పనులులేక పోయినాయి. వస్తువుల ధరలూ పెరిగినాయి. పిడుగు పాటుగా యీ మాదిరి రాయలసీమకు క్షామం సంభవించింది. పాపం! రైతులకు దిక్కుతోచలేదు. ప్రభుత్వం వారికి ప్రార్థనా పత్రికలనంపుతూ శిస్తులు నిలుపుదల చేయమనిన్నీ, తకావి యప్పుల నివ్వమనీన్ని, కోరిరి. కొంచెమో, గొప్ప ధాన్యము నిలువ యుంచు కొన్నవారున్నూ, బ్యాంకులందు కొల్లగ ధనము మూలుగుతూ ఉండేవారున్నూ, యీ కాటకమున జీవింపగలుగు చుండిరేమోగానీ, కూలినాలిచేయు బీదలగతి దుర్గతియైంది. ఈ కఱువు గొల్లపేటపై కూడా పారినదని వేరుగా చెప్పపనిలేదు.

ఏలాగైతేనేం సర్కారువారు బీదలకు పనులు కల్పించినారు. క్షామనివారణ పద్ధతులను అమలునందుంచినారు. వారీ యేర్పాటులు గావింపకున్నచో మన సీమలో పరిస్థితులెట్లు మారుచుండునో చెప్పలేము.

చిక్కిరెడ్డి ఒకనాడు ఆలోచనా నిమగ్నుడై చావడిలో కూర్చున్నాడు.

అబ్బా! ఒకవైపు ఋణములచే బాధపడుతూ వుంటే యీ గ్రామజనులకు కాటక మొకటి వచ్చిపడినది. ఇందేమేమి కష్టాలురానున్నాయోకదా ! ప్యామిన్ పనులకై స్త్రీ,పురుషులు లెక్కకు మీరిపోతున్నారు. ఎన్నడైనా కష్టించి పనిచేయనట్టి వారునూ, యొండకన్నెరుగని వారునూ యీదినం కూలిపనులను చేయడానికై పోతూ వుండేది చూస్తే మహా జాలి వేస్తూ వుంది. బొత్తిగా పనులు చేతగాని కుంటి గ్రుడ్డి వారికిన్నీ శతవృద్ధులకున్నూ, బాలబాలికల కున్నూ వారానికొక పర్యాయం డబ్బు బట్వాడా చేయుపద్ధతిని ప్రభుత్వము వారు అమలులో పెట్టినారు. బిల్లు యీ దినం పంపినాను. ఈ కొంచెం డబ్బూ బీదలకు అంబలి కాచుకోవ డానికి చాలీచాలకుండా వుంది. వెనుకబడి యున్న రాయలసీమకు పదే పదే క్షామమును ప్రసాదించుట దైవసంకల్పమేమో?

"పాపం! రంగని గతిచూస్తే మహావిచారం కలుగుతుంది. వాడు సంసారి అయి నాడేకాని గుణములు మారలేదు. వాని పెండ్లియైయినప్పటికి యెనిమిది సంవత్సరాలయి నాయి.

ఐదేండ్లవాడు కొమరుడున్నాడు. మంగమ్మ యిటీవలనే ఒక యాడుబిడ్డను కనిందట. ఆమె ఇంకా బాలింతరాలు. ఈ ఎనిమిదేండ్లకాలంలో రంగనిచేతి చలువచేత బావగారి సొత్తులన్నియు పాడైపోయినాయి. పూరిగుడిసె తప్ప మరేమియు మిగులలేదు. వాని సురాపానమేవానికీగతి తెచ్చింది. ఈ కాటకంలో వాని సంసారమేమికానున్నదో ఆ పరమాత్మకెరుక. వాడేమో ప్యామిన్ పనులకు పోతూవున్నాడు. వాని భార్యాబిడ్డలకు మాత్రం ఉచితంగా డబ్బు లభించే ఏర్పాటు చేసియున్నాను. ఈ డబ్బంతా వాని మధుపానపిశాచమే మ్రింగు చున్నదేమో!

'రంగని వంటి కుటుంబాలీసీమలోయింకా యెన్నో వున్నాయి. పాపం ! వారికెప్పుడు ముక్తి లభించునో తెలియదు. దేవునికి మారాళ్ళపై దయపుట్టునో పుట్టదో !'

ఒక ఆదివారం. చిక్కిరెడ్డి చావడి యందు కూర్చున్నాడు. గవర్నమెంటువారిచే మంజూరు కాబడిన ద్రవ్యాన్ని పనులు చేయజాలని కుంటి గ్రుడ్డి వగైరా జనానికి పంచి పెట్టుచున్నాడు. రంగడు కూడా హాజరయి తన భార్యా బిడ్డలకు రావలసిన డబ్బును పుచ్చుకొనడానికై కాచుకొని వున్నాడు. రెడ్డి వరుసగా పేర్లు చదువుతూవచ్చినాడు.

'మంగమ్మ! నాగడు!! లచ్చి !!!'

పేర్లు వినబడుతూనే రంగడు లేచి నిలిచినాడు. రూకలు పుచ్చుకొన్నాడు. రెడ్డి వానిపై తీవ్రంగా చూస్తూ ఆ డబ్బును వృథా పాడుచేయక సద్వినియోగం చేయమనీన్ని అట్లు చేయకుంటే రాబోవు వారం దానిని నిలుపుదల చేస్తాననీన్ని హెచ్చరించినాడు. వాడు వంచిన తలను పైకియెత్తకుండా వెడలిపోయినాడు. ఏ సందర్భములో యెట్లు ప్రవర్తించవలెనో వానిక్కూడా తెలుసు !

ఈసారి ప్రతి భానువారం దొరుకుతూ వచ్చిన దానికన్న యెక్కువ ద్రవ్యం లభించింది. ధాన్యపు ధరలమేరకీ ద్రవ్యము హెచ్చుతూ తగ్గుతూ జరుగుచుండును. రంగని యానందము మేరమీరింది. వాడింటివైపు మరలినాడు. దారిలో యెవ్వరో ప్యామిన్ కూలీలందరికి వుచితంగా వస్త్రములు పంచిపెడుతున్నారని వార్త విన్నాడు. ఆ స్థలానికి పోయినాడు. అందు శుద్ధ ఖద్దరు వస్త్రధారులు కూర్చొని వుండినారు. వారు గొప్ప గొప్ప మిల్లు యజమానులను యాచించి మూటలకొద్ది బట్టలతెచ్చి యుండిరి. వాటిని గ్రామ గ్రామాలకు తీసికొనిపోయి క్షామబాధితులకు పంచిపెడుతూ వచ్చినారు. రంగనికి కూడా ఒక పంచ, మంగికి ఒక కోక, బిడ్డలిద్దరికి రెండు చొక్కాలు లభించినాయి. వాడింటికి మరలినాడు.

డబ్బెక్కువగా చిక్కింది. ఆయాచితంగా వస్త్రాలు దొరికినాయి. అదేమిచిత్రమో రంగనికి మనస్సులో నేవోదురాలోచనలే బయలుదేరినాయి. ఆ దినం ఆదివారం కాబట్టి ఫ్యామిన్ పనికిపోవపనిలేదు. ఇంటికి పోయినచో ధాన్యం కొనితెచ్చి మంగికి ఇవ్వవలసి వుంటుంది. వస్త్రములు కూడా యివ్వవలిసి వుంటుంది. అట్లు కాకుండా... వెనుదిరిగి వస్త్రాలను కుదవబెట్టితే మరికొంత డబ్బు గిట్టుతుంది! అప్పుడు ? ఆచేతి నిండా ద్రవ్యంతో హాయిగా నాలుగు దినాలు కావలసినంత మద్యము స్వీకరించ వచ్చునే! ఆఁ !సమాచారం తలిస్తే

ఒడలంతా జలదరించి పోయింది. ఐతే ఆ నాల్గు రోజులూ మంగి గతి? మంగీ! ఆ ముండ గతియేమైతేనేం ! అది మొదలే రోగిష్టిగావుంది. యీ కాటకంలో బ్రతకదని తోస్తుంది. దానిగతే పిల్లలకున్నూ! వారేలాగూ చావసిద్ధంగా వున్నవారే. కాబట్టి వారికెందుకు యీ డబ్బు పాడుచేయడం తన సుఖానికి అంతరాయం కలిగించడం! ఏమైనకానీ యీదినం యింటికేపోకుంటే! ఈ దినమేమి? రేపు కూడా...? ...

రంగడు వెనుదిరిగి బజారువైపుపోయినాడు.

-----

"అమ్మా! నాన్న యీ దినము కూడా రాలేదుకదూ ?యెందుకే రాలేదు! మరి నాగతేమి ...ఆకలి "

'నాగా ! ఆకలిసరేగాని , యింటిలో యేముందిరా తినడానికి ? లేనిది తెమ్మంటే నేనేంజేతురా !

'అమ్మా ! నాన్న యెక్కడుంటాడో చెప్పవే. పిలుచుకొనివస్తా. మాకేమైనా తిండికి యిచ్చిపొమ్మని అడుగుతా.'

'అబ్బే, నీవు పోవవద్దు, పోయినా నీ కాయన కనబడడు, కనబడినా నీతో మాటలాడడు, తెలిసిందా ?'

'ఎందుకు మాట్లాడడే నాతో ! మనం యిక్కడ రెండునాళ్లుగా తిండిలేక మాడుతూ వుంటే నాన్న యేంజేస్తూ వుంటాడే ! ఆదివారం రెడ్డి యిచ్చిన రూకల్తో పాటు నాన్న యెక్కడ మాయమైనాడే ! యెక్కడుంటాడో చెప్పవే, వెదకి పిలుచుకొనివస్తా, తప్పకుండా !'

'నాగా, ఆయనెక్కడుంటాడని చెప్పుదురా, నీతో వాదించలేక నాకు తల తిరిగిపోతుంది. మూడు దినాలుగా పైత్యరోగము యెక్కువయింది. పడుకుంటానబ్బా!' అంటూ మంగి పడుకుంది.

'అమ్మా యిదిగోపోతూన్నా, గ్రామములో యెక్కడుండినా పట్టుకొనివస్తా నాన్నను.'

రెప్పపాటు కాలములో బాలుడు మాయమయినాడు. మంగి సొమ్మసిల్లి పడుకున్నది. చేతిబిడ్డ లచ్చి నిదురపోతోంది.

----

అది కల్లుపాక,మహాకోలాహలంగా వుంది. ఏ సంత కూడా దానికి సాటిరాదు. అంగడివాడెత్తయిన యరుగు పై కూర్చొని మద్యరసాన్ని ముంచిముంచి పోయుచున్నాడు.వాని డబ్బుసంచి క్రమంగా నిండుతూ వుంది. వచ్చిపోవువారి పొట్టలూ నిండుతూ వున్నాయి. 'చచ్చేటప్పుడు వెంటరాదురా పుచ్చిన గవ్వయినా' యని కొందరు తత్వము పాడుతూవున్నారు.

ఆ యావరణాన్ని వర్ణించేది సాధ్యమేకాదు. అది యెంత పవిత్రవంతమైన దనవచ్చు!

జాతిమతవయోలింగ భేదములను పాటించకుండా యెందరు కలిసి మెలిసి ఆనందంలో మునిగివున్నారు ! రాగద్వేషాలను మరపించేటట్లుండు ఆ సమయమెంత పవిత్రమైనదో చదువరులే తర్కించుకోండి.

నాగడు వాకిటనిలిచి ఆ దృశ్యాన్నంతా చూచినాడు. ఆసమూహములో 'నాన్న' యెక్క దున్నాడో గుర్తింపలేక పోయినాడు. ఆ త్రాగుబోతుల యలబం చూచి మొదట భయ పడినాడు. కాని మరుక్షణములోనే మనసు నిలకడ చేసుకొని లోనికిపోయినాడు. ఏలాగెతేనేం రంగడున్న చోటికి పోయినాడు. నాన్న అప్పటికే తృప్తిగా త్రాగియున్నాడు. లోనియానందాన్ని యరమోడ్పు కన్నులతో ప్రకటిస్తూన్నాడు. కఱవొస్తే యేమిభయం, కాటక మొస్తే యేమిభయం యనేస్థితిలోనున్నాడు. నాగడు సాహసిస్తూ నాన్నను పలుకరించినాడు.

'నాన్నా ! నాన్నా!'

రంగని కామాటలు వినబడినవో లేదో ?వాడీ లోకంలో వుండెనో లేదో !'

'నాన్నా ! ఓ నాన్నా !'

ఈ మాటు మరింత గట్టిగా బాలుడు పలుకరించినాడు. రంగనికి కొండదిగి వచ్చినట్లయింది.

'ఏమిరా..నా ...గా..నీవేనా?'

'ఔనప్పా! మరి యింటికి రా రాదూ?మేమంతా తిండిలేక చస్తూంటే మరినీవు..'

'ఓరి గాడిదా,యింటిసోదెను రచ్చకు తెచ్చినావా ? ఫో రానుఫో !'

నాగడు కదల్లేదు, ఏమిచేయడానికీ వానికి తోచలేదు. వాడింకా నిలబడి వుండేది చూచి రంగనికి కోపం రేగింది. మెల్లగ తూగుతూ లేచినాడు.

'ఆ ముండ నేనిక్కడుంటానేమో చూడమనడం యీ వెధవ తాతముల్లె పోగొట్టుకున్నట్లు యీడకు పారిరావడం, వీని పని పట్టిస్తాచూడు.'

వాని కనులకేమిన్నీ కానరావడం లేదు. పెదవి కరుస్తూ తీవ్రకోపముతో నాగని చెంపపై వొక దెబ్బ ప్రసాదించినాడు. పాపం! వాడంతటితో అమ్మా అని కూయుచూ నేల పైబడినాడు. రంగడు వాని నంతటితో పోనివ్వకుండా శక్తికొద్దీ కాళ్లతో తన్నినాడు. దాపున వుండిన దుత్తనుయెత్తి వాని తలపై వేసినాడు దెబ్బతగలి నాగని తల నుండి రక్తము స్రవింపజొచ్చింది.

'చావు వెధవా !' అంటూ జయమును పొందిన యుద్ధవీరునివలె రంగడు యధాస్థానంలో కూర్చున్నాడు.మరలా యెప్పటి యానందములో మునిగినాడు.

-----

నేను అంగడిపని చాలించుకొని యివతలికి వత్తుగదా యీ పిల్లవాడు కనబడినాడు. రెడ్డీ! వీడెవడోపాపం! తెలివితప్పి పడివుండినాడు. తలపై చాలా దెబ్బలు కూడా తగిలి వున్నాయి.ఎవరైనదీ తెలిస్తే వారింటి వరకూ యెత్తుకొనిపోయి విడిచివస్తా !'

చిక్కిరెడ్డి రికార్డులు  తిరగవేస్తూ వుండినాడు. యీడిగ బైరప్పమాటలు వింటూనే అతని కాశ్చర్యం కలిగింది. దీపపు వెలుగులో యాపాదమస్తక పర్యంతమూ పరీక్షించినాడు. వాని ముఖలక్షణాలను చూచిసరిగా గుర్తింప గలిగినాడు. 'అరరే! వీడు మన రంగడి కొడుకురా !పో ! త్వరగా వీనిని యిల్లు చేర్చుపో. వీని మొగం కడిగి గాయము లకు కట్టుకట్టమని మంగమ్మకుచెప్పిరా. రేపు ప్రొద్దునవీనిని నేను ఆసుపత్రికి పంపిచ్చే యేర్పాటు చేస్తాను. ఆ  వెధవ రంగనిపనే వుంటుంది యిదంతా.వాడెక్కడుంటాడో తలారిని వెదకమను' అన్నాడు.

బైరప్ప బాలకుని మోసుకొనిపోయి రంగని ఇంట దిగబెట్టి మరీ ముందేగినాడు. అన్నోదకాలు లేకుండా కృశించిపోయి మంగి పడుకొనివుంది. బైరప్ప నాగని పండబెట్టి వెళ్ళిపోయినదీ, పోతూ వాడేదో  చెప్పినది, ఆమెకు ఒక కలవలె వుండినది. వలదంటూ వుండినా పారిపోయినాడు నాగడు. వానిగతి యేమై వుండినది. యింత వరకూ తెలియనందున ఆమె మనస్సు చాలా ఆతురపడుతూ వుండింది.ఏమైతేనేం వానిని చూస్తూనే  ఆమె ప్రాణాలు లేచివచ్చినాయి. లేచికూర్చున్నది. కాని ఆ యంధకారములో ఆమెకేమీన్నీ కనబడడంలేదు. మెల్లగలేచి ప్రమిదను వెలిగించింది. ప్రమిదలో తైలములేదుగాని వత్తికి మాత్రము కొంచెము సేపు మాత్రమే వెలుగునిచ్చునట్లుండినది. మంగి నిరాశ చెందకుండా ఆ స్వల్ప కాలంలోనే, వున్న కాస్త వెలుగులోనే పిల్లవాని గాయము కడిగి కట్టుకట్టింది. ఆమెకు వాని గతిచూస్తూంటే దు:ఖం పొంగిపొరలివచ్చింది. కాని యేమిచేయగలదు? గట్టిగాయేడ్చే దానికైనా శక్తిలేని స్థితియందుండినది. ఇంటికంతా ఆమెమొక్కతియే ! ఓదార్చి పల్కరించే దానికైనా మరొక్కరు లేరు. వానిని తన తొడలపై పరుండబెట్టుకొని   బొట బొట కన్నీరు కార్చుచున్నది.

నాగడు కొంచెము కదలినాడు. కనులు తెరిచి చుట్టూ చూచినాడు. మంగి ముఖం కొంచెం వికసించింది. 'అమ్మా... అమ్మా... పాపం హీనస్వరం వింటూనే,కన్నువెంట కారుచుండిన ప్రవా ఓహాన్ని పయిటతో తుడుచుకొన్నది. ఏమి రా నాయనా! అన్నట్లు తలపూపింది.కాని యంతలో మరలా వాని కండ్లు మూతబడినాయి. మరలా తెలివి తప్పింది, మంగికి కూడా యేమీన్నీ  తోచిందికాదు.

చేరువనుండిన ప్రమిదలోని వెలుగుకూడా సన్నగిల్లింది. వత్తికి అంటి వుండిన తైలము అయిపోయింది.క్రమంగా వత్తి కూడా కాలుతూ వచ్చింది. అందువల్ల కమరువాసన కూడా వెడలుతూ  వుంది.

నాగడు మరొకమారు కండ్లు తెరిచినాడు.తల్లి మాట్లాడే స్థితిలో లేదు.

'అమ్మా! .....అ...మ్మా! నా...న్న..కొట్టి... నా..డే ! పై మాట వెడలలేదు.  అదేమిటో నోటికి అడ్డమువచ్చి పడినటులయింది. పాపడు కనులు తేలవైచినాడు.దేహం కొయ్యబారింది. 'అబ్బా'. అని బిగ్గరగా ఒక్క కేకవేసి మంగి బాలుని శరీరముపై పడింది.

ప్రమీదలోని దీపము ఆరిపోయింది. మరలాయెప్పటివలెనే చీకటులు వ్యాపించినవి.

----

మంగీ...మంగీ ! పాడుముండ యిద మరీ సోమరిపీనుగై పోతోంది. ఎన్ని మార్లు పిలిచినా పలుకదు. నాగొంతు పగులుతూ వుందేకాని, ఆ గాడిద పలికితేగా !

సుమారు అర్ధరాత్రి అయివుంటుంది. రంగడు యిల్లు చేరినాడు. వీధి తలుపు తెరచివుంది. లోపల దీపములేదు. చిమ్మచీకట్లు వ్యాపించివుంది. వానికెందుకో అనుమానం తట్టింది. మంగిని యెన్ని మార్లు పిలిచినా బదులులేదు. వాని యరపులకు గుడిసె పైకప్పు యెగిరి పోయినట్లుండినది. గోడలు అదురుచుండినవి. ఆ మతుకు తారాడుతూ లోనికి పోయినాడు.

'వెధవపక్షి ! యెక్కడ చచ్చిందో! కొంపకు కంపగొట్టి యేగాడిదతో పారిపోయిందో! ఏమో ఆడదాని బుద్ధి! యెవ్వడునమ్మినాడు? యి ముండ చచ్చినా కొంచెంమేలే! దీంతో నాకేమీ సుఖంలేదు.. కానీ యీసారీ నా చేతికి దొరకనీ, దీన్ని పూర్తిగా పనిపట్టిస్తా! ఆ! ఏమిది కాలికేమోతగిలింది. ఏయే ! నిన్నే పిలిచేది! పైకిలేయి!! సిగ్గులేక యింకా నిద్రపోతూవున్నావా..? ఏయే! లేవవూ?'

సత్తువకొద్దీ ఒక తాపు తన్నినాడు. ఆమె లేవలేదు. వాడు మెల్లగా నేలపైకూర్చొని తడవిచూచినాడు. ఆమె శరీరం కట్టెవలె మోటుగా తగిలింది. ప్రక్కన వుండిన చేతిబిడ్డ కూడా నీల్గివుండినది. బిడ్డలతో పాటు మంగి యీలోకాన్ని వదలినది !!

రంగనికి కన్నులు గిర్రున తిరిగినాయి. బుద్ధి తారుమారయింది. మత్తు పూర్తిగా దిగిపోయింది ! వెంటనే నేలపై చతికిలబడినాడు.

......

'రంగా ! యెంతపాపాత్ముడవురానీవు ! యిన్ని యనర్థాలకూ నీవే కారణము. నీ త్రాగుడే కారణము. నీకొంప కూలింది. చక్కని సంసారము చట్టుబండలైంది. నీకెన్ని మార్లు ఉపదేశించినా తలకెక్కలేదు. పిత్రార్జితం సొత్తులు నీవరకైనా నిలువలేదు సరికదా, నీ బావ గారి యాస్తిని అంతానీవే చేతులార మద్యదేవతకు అర్పించినావు. యింకా నీకు బుద్ధిరాలేదు.

'పోనీ, క్షామం వచ్చింది కూదూ యిప్పుడే ! అన్న వస్త్రాలులేక అనేకపాట్లు పడుతూ వుండినా నీవీ త్రాగుడుకు వదల్లేదు. యిందువల్ల ధనం నాశనమైంది, మానావమా నాలు నశించినాయి, అప్పు అధికమయినాయి, బంధుగులు దూరస్థులయినారు. ఇట్లెన్నని చెప్పడం ! త్రాగి తలదిమ్మెక్కి ఆలుబిడ్డలను చంపిన క్రూరుడవు ! నాగణ్ని కొట్టి చంపినందుకు నీపై కేసు వేస్తే యేమవుతుందో ఆలోచించుకో !!

చిక్కిరెడ్డి పలుకులు ములుకులై గ్రుచ్చుకొంటున్నాయి రంగనికి. వాడు నిలువునా కంపించిపోతూన్నాడు. కన్నుల వెంబడి నీరు జొట జొట రాలుతూంది.

'అయ్యయ్యో ! చేతులార బెంచుకొన్న చిన్నపాపని కొట్టుటకు నీచేతుల్లో యేమి పుండు పుట్టివుండిందిరా? యింతకూ వాడు చేసిన పాపమేమో? యింటిలో గ్రాసంలేదని యడుగడానికి వచ్చినదేనా? సాధ్వి మంగమ్మా, నోరెరుగని పసికూనలూ కూడులేక యెండుతూ

వుంటే, తలదిరుగునట్లు త్రాగడానికి నీకు మనసెట్టు వచ్చిందో! చేతిబిడ్డ పాలులేక చిక్కిపోయి యుసురులు పోవునపుడెంత తల్లడపడిందో ? దాని కొక్కదానికి పాలుకొని పోయడానికి డబ్బులులేవుకాని, ముప్రొద్దులు ముక్కు వరకూ త్రాగి తందనాలాడటానికి కావలసినంత వుంది కదూ ? ఫో అవతలికి ! నీ మొగంచూస్తే పరమపాతకం ! నీకంటే నీచుడు చండాలుడు మరియొక దుండడు నా దగ్గరనిలువకు ఫో ?

పొంగిపొరలిపోతూవుంటే దు:ఖముచేత రంగడు నిలువలేకపోయినాడు.నోటివెంట మాటలులేవు.పిల్లవానివలె గోడుగోడున యేడుస్తూ రెడ్డి కాళ్లపై పడినాడు.వానికి అంతకంటే యేమిచేయడానికిన్నీ తోచింది కాదు.

'దాసరితప్పు దండాలతో సరియని కల్లబొల్లిగయేడుస్తూ పాదాలపై పడితేమాత్రం ప్రయోజనం! యేనాడు నీవు త్రాగుడు మానితే ఆ దినం నీ మొగము చూస్తా! అదే నీ పాపాలకు ప్రాయశ్చిత్తం. ఆ ముందైనా నీకు మంచి గుణాలు అలవడుతుందేమో చూడ వలసివుంది. లేకుంటే నీ దారినీదే.'

'రెడ్డీ! నన్నెందుకు యీ మాటలతో చంపుతూన్నావు ? నా తప్పులన్నీటికీ ప్రాయ శ్చిత్తం చేసుకుంటా ! యిదిగో మీ పాదాలతోడు త్రాగుడు బొత్తిగా మానేస్తా వున్నా!! మీరే మి చేయమన్నాచేస్తా! మీరే నాకు తల్లి దండ్రి! మీ మాటలు మీరిపోను !!'

'ఐతే,రంగా లేయి ! నీతో నాకు చాలా పని వుంది. నీవు మాత్రం త్రాగుడు మాన్తే చాలదు.నీతోడివారలను కూడా మాన్పించితే బాగు.నేను మన మాలపల్లెలో హరిజనా శ్రమాన్ని యేర్పాటు చేయబోతున్నాను. ఇందులో నీ సాయం తప్పక వుండాలి. కావలసిన ద్రవ్య సహాయం నేనుచేస్తా. ఆశ్రమ నిర్మాణానికి కావలసిన సామాగ్రి చేకూర్చేపనినీది.'

చిత్తం స్వామి.!

మాలపల్లె అనేది గొల్లపేట గ్రామానికి చేరిన ఒక చిన్న మజరా. అక్కడ చిక్కిరెడ్డికి వొక మంచి మామిడితోట వుంది. ఆ తోపులో యిప్పటికి మూడు మాసములుగా కొన్ని కుటీరాలు, ఒక ప్రార్థనా మందిరమూ, వసతి గృహాలు, వంటశాలలు మొదలైనవి నిర్మింప బడినాయి. ఈ యాశ్రమానికయిన వ్యయప్రయాసలంతా రెడ్డి భరించినాడు.రంగడు కూలీలపై తనికీ చేస్తూ రాత్రింబవళ్లు కష్టపడినాడు. ఏలాగైతేనేం ఆశ్రమం పని పూర్తిఅయింది. ఆశ్రమ ప్రారంభోత్సవం యువ సంవత్సరాదిని కావింపబడింది.ఆశ్రమంలోని వారంతా యువకులే.

రెండేండ్లు గడిచినాయి. ఆశ్రమంలోని పనులు మహాచురుకుగా జరుగుతూ వున్నాయి. హరిజనులకు తోడుగా యితరులున్నూ కలసి మెలసి పనిచేయడము శుభావహం. రంగని వంటివారే కాకుండా నిరుద్యోగులుగావున్న పలువురు పట్టభద్రులు కూడా అందుచేరి ప్రజాసేవ చేస్తూ వున్నారు. అక్కడి చేతిపనుల్లో ముఖ్యమైనది నేత!

వేకువనే అక్కడివారు తమ తమ ప్రార్థనా మందిరములలోచేరుతారు. భారతమాత చిత్రానికి

యెదురుగా నిలిచి ప్రార్థనలు చేస్తారు. అనంతరం అల్పాహారాలు పుచ్చుకొని తమ తమ పనుల్లోనికి పోతారు. సోమరులకు అందు చోటులేదు.

అందరికి మధ్యాన్న మొకగంటకాలము విశ్రాంతి. విశ్రాంతి కాలములో యెల్ల రందే భుజింతురు. పిమ్మట తమతమ పనుల్లోచేరుదురు. సాయంకాల మూడుగంటలకు ఆటవిడుపు. అందరూ పనులు చాలించినప్పుడు మరలా దైవప్రార్థన గావింతురు. జాతీయ గీతములు పాడుదురు. రాత్రి భోజనము అగువరకూ పత్రికలు చదువుట, గ్రామ జనులకు ప్రపంచ పరిస్థితులు వార్తలు మొదలైనవి చెప్పుట ఆశ్రమవాసులపని. భోజనానంతరము పురాణములు భజనలు చేయుట యందు కాలముగడుపుదురు. ఇవే వారి నిత్యకృత్యాలు! ఆశ్రమవాసుల జన్మధన్యత చెందినదనవచ్చును.

ఈ దినం గొల్లపేట ఖద్దరు కేంద్రము. మంచిపేరు పొందినది. దానికి తోడ్పడిన వారిలో మన రంగడు ఒకడనకతప్పదు. వాడిపుడు అత్యంతానందమున దినాలు వెళ్లబుచ్చుతూ వున్నాడు. వాని జన్మ పావనమయింది. మద్యపిశాచము నుండి ముక్తిలభించినది. మొదలు వానిని దేశమాత ఆశీర్వదిస్తూ వున్నది. వానియందు నూతనోత్సాహము అంకురించింది!!

**– 10 డిసెంబర్, 1938 నుండి 21 జనవరి, 1939 వరకు , సాధన పత్రిక**

# ఉగాది కానుక

**- కందాళ శేషాచార్యులు**

**నా**రాయణరావు ఆ దినం జీతం తీసుకొని యింటిదారి బట్టినాడు. జీతం వస్తే సంతోష పడవలసిన పనేలేదు.చేసేది పల్లెటూరి స్కూల్ మేష్టరీ. బాకీలు యెన్ని చోట్ల వుంటుందో ఆలోచించుకోండి. బడి వదలి యీవల కాలిడుతూండగానే ముసిముసినవ్వులతో శెట్టి నమస్కారం చేసినాడు. ఆ నమస్కారానికి అర్థం... జీతం వచ్చినట్లుందే, అంగడి బాకీకి గాను జమ యిస్తే మేలే అని.ఇన్నాళ్ళవలె అడ్డుమాటలు వేయడానికి తోచక శెట్టి కేదో కొంచెం జమయిచ్చి మరీ ముందుకు కదిలినాడు. ఎదురుగుండా బట్టల వర్తకుడు బర్మాజీ ప్రత్యక్షం కావడమూ,వాడికీ యింత జమకట్టడం జరిగింది. ఈ విధంగా చెల్లించగా మిగిలింది రెండు రూపాయాలూ తొమ్మిదణాలు. ఈ డబ్బుతో మరలా జీతం డబ్బు మొగం చూసేవరకూ జరుగవలసి వుంది. ఇంట్లో బియ్యం వుంటే బేడల్లేవు. దీపానికి నూనెలేదు. అంగీలు భుజాల మీదా వీపు మీదాచిరిగివున్నాయి. గట్టిగా వుంటుంది కదా ఖద్దరు కొందామా అంటే బలే దుబారా పోనీ డబ్బు ఎక్స్‌ట్రాగా సంపాదిద్దామా అంటే ప్రత్యేక యోగ్యతలు సున్న. తాతలసొత్తు తండ్రికాలానికే సరి

లోనుంచీ ముగ్గురుబిడ్డలూ వచ్చి నాన్నను పట్టుకొన్నారు 'నాన్నా! నాకీసారి ఖద్దరునిక్కరూ', 'ఆ ! నాకో సిల్కుపావడా!', 'నాకు పెద్ద బిస్కత్తులు!'అని ముగ్గురి కోరికలూ వింటూనే రావు కంటిలో నీరు గిర్రునతిరిగింది.ఏమో ! గంపెడు రూకలు నాన్న తెచ్చినాడే మోనని వారి సంభ్రమమేకాని నిజస్థితి వారికేం కాబట్టు! బిడ్డల మాటలకంతా తలవూపుతూ వారిని సంతోషపరచినాడు.పోనీ యేదో పి.ఎఫ్.లోన్ తీసికొని అందరికీ దండిగా బట్టలు తీద్దామంటే తాను యిదివరలో ఖాయిలా పడినపుడు తీసినబాకీ కంతులు యింకా తీరడానికే లేదు. ప్రస్తుతం చేతిలో వుండే రెండు చిల్లరతో యీనెల్లో ప్రమాధిని ఆహ్వానింపవలసివుంది. అతనికీ ఆలోచనలతో దిక్కుతోచిందికాదు. ఇంతలో రక్తాక్షి నవ్వుతూ వచ్చి భర్తను పల్కరించింది.

'ఏమండీ ! నేను చెప్పింది తెచ్చినారా ?" 'నీవేం చెప్పివుంటివి ?"

'పోనీలేండి పాపం ! ప్రతి నెలా యిదేగోడు కదూ! నేను అడగడం, మీరు లేదనడం మామూలు పల్లవి అను పల్లవీ అయింది" అంటూ గబగబా లోనికి పోయింది.

నారాయణరావు కూడా వంటింటిలోనికి పోయినాడు. నాన్న అమ్మా తగవుచూచి పిల్లలు దిక్కుతోచక యిక లాభంవుండదని తమతమ ఆటల్లో నిమగ్నమయినారు.

'అదికాదే! విషయమేమో సరిగా చెప్పవు. పైగా మాట్లాడితే ముక్కుమీదకోపం! అసలునీవు అడిగినదేమో సవిస్తరంగా తెలుపుదూ! నాకు జ్ఞాపకానికి రాలేదు !'

అన్నం వారుస్తూ తపిలెను టక్కున నేలకు కుక్కింది ఆమె.

'పోనిలేండి జ్ఞాపకం లేకుంటే ! నాకేం ! మానం మర్యాదా అన్నీ పోతూ వుంటే! నాకయితేనేం

మీకయితేనేం! అంతావొకటే పోండి! త్వరగా స్నానంచేసి రాండి కష్టపడి వచ్చినారు పాపం! భోంచేసి నిద్రపోదురుగాని !"

నారాయణరావు ఇంటిలోని ఈ 'పజులు' గ్రహించలేక పోయినాడు. యింతకూ ఆమె తెమ్మనిన వస్తువేమో మనసుకు పట్టడంలేదు.

'మానమేమి మర్యాదయేమి! చంపుకొని తింటూన్నావుగాని, చెప్పరాదూ యిప్పటికైనా, అదేమిటో,చెప్పకుంటే యిగొవొట్టు.."

'ఎన్ని మార్లండీ చెప్పడం, మూడు నెలలుగా నెత్తిననోరు పెట్టుకొని కొట్టుకుంటూ న్నాను. వున్నవి చినుగులై పాచి గుడ్డలయినాయని సాంగ్లీ చీరలలో అని చెప్పలేదూ, మీకు కండ్లులేవూ?

అతనికి తటుక్కున వొళ్లంతా జెర్రులు పారాడినట్లయింది. అవును పాపం! యిల్లాలు చీరలోచీరలో అని మూడు నెలల నుంచీ చెప్తూంది. ప్రతిసారికిన్నీ యేదోవొక బాకీ తగలడం, చీరలకై డబ్బు మిగలకపోవడం ! పోని ఆ గ్రామంలోని బర్మాజీ అంగట్లోనే అప్పు తెస్తానూ అంటే మూడుకు ఆరుగా వెలవేస్తాడు. చూచిచూచి దండుగ చేయవలెనంటే చేతులు రావడం లేదు. నగదుపెట్టి వేరే గ్రామంనుంచీ తెప్పిద్దామాఅంటే శక్తిలేదు. జీతంరాళ్లు మిగులడం లేదు. ఇక యీ నెల సంగతిచూస్తే మిగిలింది రెండూ చిల్లర. పైగా ఉగాది ప్రమాదంగా వస్తూంది. వుండే రెండురూపాయలకు ఒక్క చీర వస్తుంది. కొనవచ్చు. కానీ, ఆ నెల్లో ప్రతి సంతకూ పాలు పెరుగుకనీ, కూరగాయలకనీ, కట్టెలుకంపలకూఅనీ యేమి మిగులు తుందీ! ఈ ఆలోచనలతో మెదడు డైనమో అయింది అతనికి. విద్యుత్తు దేహమంతా పాకింది.

'ఏమండీ యిప్పటికైనా జ్ఞాపకానికి వచ్చింది కదూ! మీరు ధర్మవరం చీరలు కొనడానికి శక్తిలేదు.నాకు కట్టడానికి అదృష్టం లేదు. మర్సరయిసు రకమైనా చూతామా అంటే ఊహూ! కడకు సాంగ్లీ రకం అగ్గువకదా అంటే ప్రతినెలా యిట్లనే జరుగుతూంది.పైగా జ్ఞాపకశక్తి పోతూంది ప్రస్తుతం మాకుండే భోగభాగ్యాలవల్ల పాపం! మీరేం చేస్తారులేండీ ! నాగ్రహచారం.

ఒక చేత్తో ముక్కు చీదేస్తూ యింకో చేత్తో తిరుగబోత వేస్తూంది.

"కాదే !జ్ఞాపకం వచ్చిందికానీ..."

'కాని గీని నాకేమీ చెప్పవద్దండి. యీసారి అప్పోసప్పో యేమైనాచేసి చీరలు తెస్తేనే. లేకపోతే వచ్చే నెలలో తప్పకుండా తెస్తాలే !...

'అదంతా వల్లపడదంటే ! ఉగాది ఈనెల్లో వస్తుంది. సమయానికిలేంది..."

"మంచి ప్రమాది వచ్చిందే ప్రమాదంగా ఈ పండుగ నీకేనా నాక్కూడానా ! ఇగో నాపంచలు అంగీలున్నూ గమనించు.యేవియెక్కువగా చిరిగి నాయో ! నేను కొత్త పంచలు కట్టితే చూడాలని నీకులేదా? నీవు మంచిచీరలు రవికలతో నిగనిగలాడ్తూ వుంటే చూడాలని నాకులేదా ?పిల్లలు నూతన వస్త్రాల్లో కిలకిలాడుతూంటే మనం యిద్దరం చూడాలనిలేదా ? మరి..."

'చాలించండి మీ సోదె ! ఇంతకూ యీ నెల్లో యేం మిగిలిందో చెప్పంది !'

'ఇదో ఆ మాదిరి అడుగు, చెప్పుతాను' అంగడి వారికి ఆహుతులుపోను యిదో ఈ రెండు రూపాయల తొమ్మిదనాలు మిగిలివుంది. నీ యిష్టం! నీ చేతుల్లో వీటినివేస్తా ! ఏంచేస్తావో చేయి, చీరలే కొంటావో పిల్లలకు అంగీలే తెస్తావో! నా నెత్తిన కిరీటమే పెడతావో ? "

రక్తాక్షికి చురచురమనింది. కోపం కొంచెంగా వచ్చింది. ' తీరి కూర్చొని మించి వస్తే నా చేతుల్లో పడవేయడానికి సిద్ధంకావడం? ఏం చేస్తావో చేయమనడం. కబుర్లు చెప్పి నవ్వించడం. మరిపించెడం.

యేమేమో గొణుగుకొంటూ వుంది. అవి ఎట్లు వచ్చినాయో ముత్యాలవంటి రెండు చుక్కలు కండ్ల నుండీ రాలినాయి.చెరుగుపైన ఇంతలో పొయ్యీమీద అన్నం మాడు వాసనవచ్చింది.

'పోవే ! అన్నం మాడినట్లుంది. త్వరగాపో !"

'మాడనీలేండీ ! నా బ్రతుకెట్లాగోఅది కూడా అంతే !"

లోనికిపోయి తపిలె దించింది. అడుగుభాగానికి చన్నీళ్లు చల్లింది. నారాయణరావు టవాలు చుట్టుకొని స్నానానికి లేచినాడు. తిండికి లేవండి అని పిల్లలను కేకవేసింది ఆమె. పిలిచినదే తడువుగా ముగ్గురూ తిండికి వచ్చినారు. వడ్డన ప్రారంభమయింది.

ఇంతలో తలుపు తట్టుతూ 'నారాయణావు టీచరు...అమ్మా! సార్ వున్నారండి' అన్నాడు తపాలువాడు.

స్నానం చేయకుండానే వెనక్కు వచ్చినాడు బడిపంతులు.

'ఏమిటోయి మామూలు జాబులా లేక ట్రాన్సుఫర్ ఆర్డర్లా !!

'ఆవేవీ కావండి సార్, రిజిస్టరు పార్సిల్ '

'ఎక్కణ్ణుంచీ "

'బళ్లారి ముద్రవుంది సార్'

'బళ్లారి పేరు వింటూనే వడ్డిస్తూన్న గరిటెచేత్తోనే రక్తాక్షీ వెలుపలికి వచ్చింది. మొగం కళలూరింది ఆ కోపం యెక్కడ పోయిందో?

'బళ్ళారయితే మా అన్నయ్య ప్రసాదరావు పండక్కు చీరలు పంపివుంటాడు, నాకు తెలుసు!'

పార్సిలు పుచ్చుకొన్నాడు నారాయణరావు. 'పండుగ యీనామేదండీ' అంటూ చేయిచాసిన పోస్టువానికి రెండుణాల రూక సమర్పించినాడు. వాడు సలాం చేసి వెళ్లినాడు.

తిండితింటూ సగంలో లేచివచ్చినారు ముగ్గురు పిల్లలూ, యీ వింత చూచేందుకు. పార్సిలు తెరువబడింది. అందులో సాంగీచీరలు రెండు, శుద్ధ ఖద్దరు దోవతులు రెండు, శాలువ ఒకటి, పిల్లలకు అంగీలు నిక్కర్లు పావడాలు, మధ్య ఒక జాబు.

రక్తాక్షి జాబును లాక్కొని గబగబాచదివేసింది.

బళ్లారి,

10-3-39.

శ్రీ బావగారికి, నమస్కారములు. ఇక్కడ అందరూ క్షేమము. అక్కగారికి, మీకు, పిల్లలకూ ఉగాది కానుకను పంపినాను స్వీకరించేది. మీ మీ క్షేమాలకు బదులు వ్రాసేది. మీ ఇరువురకూ వందనములు, పిల్లలకు ముద్దులు.

యం. ప్రసాదురావు.

అందరి మొగాల్లోనూ వెన్నెలలాడినాయి ! బడిపంతులోక నిట్టూరుపు విడిచినాడు.!

**- 18 మార్చి, 1939, తెనుఁగుతల్లి**

# నా పెండ్లి సంబరం

**– విద్వాన్ విశ్వం**

వ్రాయొచ్చు గదా అని వాటిలోని కొన్ని వాక్యాలను మఱీ బాగా జాగర్త చేసుకొనే దాన్ని. ఆ పుస్తకాలలో మఱేవైనా పెద్ద విషయాలు – అవి పెండ్లిని గూర్చే కానివ్వండి – ఉంటే చదవకుండా కాగితాలు తిరిగేసేదాన్ని.

మా యింట్లో ముచ్చటైన వస్తువేది కనబడినా మా యింటికి – అదేగా యింక సొంతం కాబొయ్యేది – తీసుకుపోవడానికి ముచ్చటపడేదాన్ని. కానీ ఒక మాటు మా అమ్మ 'యిది మీ అన్న పెండ్లయితే కావద్దూ?' అనేప్పటికి నాకెట్లో అయింది. మా నాన్న నడిగితే తప్పకుండా నాకే యిస్తాడులే అనే ధైర్యమున్నా మూతి ముడుచుకొని మూన్నాళ్ళు మా అమ్మతో సరీగా మాట్లాడలేదు.

కొన్నాళ్ళకు...

మొన్న మొన్ననే మావాళ్లు పెత్తనం పోయి వచ్చినారు. యేవరికోసమనుకున్నారు? నా కోసమే. చాలా నాళ్ళ నుంచీ యీ ప్రయత్నం జరుగుతోంది. కానీ, ఇంకా యేదీ నిర్ధారణైనట్టు కన్పించదు.

యిలా అనుకుంటే మాత్రం చాలా నిరుత్సాహం కలుగుతుంది. ఏమమ్మా ! ఒకనాడా రెణ్నాళ్ళా... యెనిమిదేండ్లయింది నేను సమర్తయి...

అదో పెద్ద గొడవ ఆనాడు నాలోకల్గిన పెద్దవిప్లవమేమో నాకు కన్పించలేదు కానీ, ఆ మూల కూచోబెట్టడం, ఆ పేరంటాలు, ఆ నువ్వుపిండీ, ఆవేషాలు – దినమూ ఒకటి – ఆ ముచ్చట్లు, అబ్బ! విధీ విరామం లేకుండా ఆ పదారునాళ్ళూ చెప్పకనే వెళ్లిపోయినాయి.

మఱీ యధాప్రకారం అటువంటి సంగతి ప్రతి నెలా జరుగుతున్నా నన్నెవరూ మట్లాడిం చడంలేదు. అదో మామూలయిపోయింది. ఇదో ! ఎవరికీ చెప్పనంటే చెబుతా ! నేనో తూరి – మూడో తూరో నాలుగోతూరో – సరిగా జ్ఞాపకం లేదు. మా అమ్మదగ్గరకు పరుగెత్తుకొని వెళ్లిచెప్పాను, మరీ నాకు సంబరాలు జరుపుతారు కదా అని.కానీ, మా అమ్మ యేమనిందో తెలుసా? యేమిటినీ తగలకుండా పెరటి రూములో కెళ్లి కూచోమంది. అంతటితో విడిచిందీ! అందులోనే తిండీ తీర్థమూ పడేసి, ఆ నాలుగునాళ్ళూ నా మీద కసిదీర్చుకుంది. ఆనాడూ అదే, యీనాడు అదే, అప్పుడట్లా జరపడం, యిప్పుడిట్లా యేడ్పించ డమెందుకో, నాకిప్పటికీ అర్థం కావడంలేదు.

ఆ, మఱచిపోయాను. మఱీ మధ్యలో యీ గొడవతో యిట్లా యెనిమిదేళ్లయింది. ఆనాటి నుంచీ యెక్కడెక్కణ్ణో చూస్తున్నామనే అంటారు. యిదో ఈ వైశాఖంలో తప్పక చేస్తామంటారు. మరీ మాఖమంటారు. అదేమో ప్రతియేటా నేను సర్వసిద్ధం కావడం, అదేమో వెనక్కి పోతూండడం సర్వసామాన్యమయింది. ప్రతిసారీ ఊళ్ళోయెన్ని పెండ్లిండ్ల వుతున్నా యనుకున్నారు.ఆ సంబరాలూ అవీయివీ నా ఔత్సుక్యాన్ని మఱీ ఱెచ్చగొట్టేవి.

ప్రతి పేరంటానికీ వెళ్ళి ఆ పెళ్ళికూతురెలా కూచుందో, యేమేమి చేయవలసి వుంటుందో బాగా స్టడీచేసేదాన్ని. పెండ్లికొడుక్కు గంధం పూయడం, తాంబూలమందివ్వడం, పక్కన్నే కుర్చీలో కూచోవడం, యివన్నీ నా గుండెలో రక్తాన్ని ఉడుకెత్తించేవి. జలదరింపజేసేవి. కానీ, వాళ్ళందరికన్నా నేను చక్కగా ఆ పనులన్నీ చేసి మెప్పించగలననే ధీమామాత్రం ఉండేది. ఆ భాగ్యం యెప్పుడో అనుకొన్నప్పుడో పెద్ద నిట్టూర్పు మాత్రమే నన్నూరడించేది.

పక్కింటి అమ్మాయితో కనుక్కున్నాను. అదేమో మగవాళ్లే కరవైపోయినారా అని. చదువుకున్న వాడూ – అంటే పరీక్షలకు – ఆస్తిపరుడూ కావాలని మావాళ్ళు వెదుకుతున్నారనీ, పైగా మనదర్జాకు తగిన వాళ్ళయితే తప్ప సరిపోరనీ యేవేవో చెప్పింది. ఏమిటో దర్జా, నా పెళ్లికీ వాళ్ళ దర్జాలకూ యేం సంబంధమో! నేనేమంత రంభను కాకపోయినా, మా వూళ్లో వాళ్ళందరూ బాగానే ఉందంటారు. యేం రూపముంటే కడక్క తాగుతారా అంది మా అవ్వ. యేదో మాదీ మంచి పెద్ద సంసారమే గనుక కావలసిన సౌందర్య సామగ్రంతా తెచ్చుకున్నాను. దినమూ అదేపనిగా యేవేవో వేసుకొంటూనే ఉన్నాను.

చదువూ! చాల్చాలీమాత్రం. మగనికి ముచ్చటగా జాబులు రాయగలను. అతనికింకా అర్థంకాని మాటలు కూడా – యెంతైనా యింగిలీషు చదువుకున్న వాడేగదాలే వచ్చేది – తెలుగులో రాయగలను. కాస్తో కూస్తో యింగిలీషూ వచ్చు. నేను చదివినన్ని పుస్తకాలతడూ చదివి వుండడు. పాఠాలే వాళ్ళకు బోలెడంట.

.... .... ....

మఱికొన్నాళ్ళకు...

యేమో యెన్నాళ్ళని యీ ప్రిపరేషన్సుతో కాలం బుచ్చడం. నాలో యేదో యిటీవల ఓ మార్పు కనబడుతోంది. అప్పుడేదో పెండ్లంటే తమాషాగా మాత్రమే ఉండేది. ఇప్పుడది అవసరం (necessity) గా కనబడుతుందా.

ఏదో అసంపూర్ణత గోచరిస్తూంది. అది సరీగా యేదో, యెందుకో చెప్పలేనుకానీ ఒక బాధ శరీరమంతా లేవుతూంది. యేపనీ చేయబుద్ధికాదు. మొహమంతా పాలిపోతుంది. అప్పుడే అందంగా ఉంటినేమో అనిపిస్తుంది. యెన్ని టానిక్కులు తీసుకొన్నా లాభం లేదు. అమాంతంగా శరీరమంతా ఆ వేదనాగ్నికి ఆహుతయి పోతుంది. యేపావురాళ్లో రెండూ ముచ్చటపడుతూండడం – మా తమ్ముడు సాకుతున్నాడు లెండి – చూచినా ఒక యెలిక్ట్రిక్ షాకుతో కంపితమైపోతాను. ఇంక సినిమాలు చూచేటప్పుడూ, ఆతర్వాతా పడే అవస్థ ఆ దేవుడికే తెలుసు.

ఇంతకు ముందు నాలో ఉన్న ఆ చలాకీ ఆ ఆనందం యెక్కడపోయినాయో? ఆ గంతులు ఆ ఆటలు తల్చుకుంటే యెట్లో అవుతుంది. యిప్పుడింటిలోనే అటూ యిటూ తిరిగితే కాళ్లు తీస్తాయి.

నిద్ర సరిగా పట్టదు. విసుగు, సోమరితనం, అరుచి, ఒకటేమిటి ? యేవేవో నన్ను విధ్వంసికం చేసివేస్తున్నాయి.

సొగసు చేసుకోవడానికి కూడా యిష్టము లేదు. యెందుకీ సొగసు. యెవరి తృప్తికి – యీ ప్రశ్న నాకు తెలీకనే నానోట వస్తుంది. యింతకు ముందివన్నీ యెందుకనే ప్రశ్న రావడమే లేదు. కానీ యీ మధ్య యివన్నిటికీ యేదో ఒకర్ని సంతోష పెట్టడమే ఉద్దేశ్యంగా తోస్తుంది. ఇలానేననుభవిస్తున్న బాధ యితరుల కేమి తెలుస్తుంది.

.... .... ....

ఇంకాకొన్నాళ్ళకు...

అమ్మ! కడాకు పెండ్లి కుదిరిందట. యింక వారంలో పెండ్లి. ముహూర్తపత్రిక్కూడా రాసుకున్నారట!

అతడెవరో యేంసంగతో మావాళ్లు చెప్పారు. కానీ నా చెవిలో అవేవీ దూరలేదు. యెటూ నేను పరీక్షచేసి తగినవాడా కాదా అని తేల్చుకునే హక్కు లేనప్పుడు అవన్నీ తెలుసుకొనీ ఏం లాభం ! యెటూ మావారి మాటేకదా ?

యేదో ఒక ఆశ్రయం కోసం పరితపిస్తూండేలత యేచిన్నపుల్ల దొరికినా గట్టిగా నాలుగైదు చుట్లు చుట్టుకొని అల్లుకుపోవడానికికెలా ఆతురపడుతూంటుందో అలా ఉంది నామనస్సు. ఇంకో వారంలో పెండ్లయిపోతుంది. నేనూ ఒకింటిదాన్నవుతాను. యిప్పటికే పెండ్లి పనులన్నీ అయిపోయినాయి. ఫలహారాలు కూడా చేసివేశారు.

మరీ ముచ్చటగా పెండ్లి పత్రికను కొట్టించారు. ఇదో ఆ పత్రికే యెవరికీ తెలకుండా నా బొగ్గిట్లో చెక్కొని, మాచెల్లెలు మరీ చిలిపిపిల్ల చూస్తే అల్లరిచేస్తుంది. సమయం చిక్కినప్పుడుల్లా చూచుకుంటున్నాను.

పెండ్లి నాకు పెండ్లి.

**– 12 ఆగస్టు, 1939,సాధన పత్రిక**

*( విద్వాన్ విశ్వం 1915 అక్టోబర్ 21న అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో జన్మించాడు. విద్యాభ్యాసానంతరం తొలిదశలో సాధన పత్రికలో కవితలు కథలు వ్యాసాలు రాశాడు. 'నవ్యసాహిత్యమాల'ను స్థాపించి సామ్యవాద భావాల వ్యాప్తికి కృషి చేశాడు. అనంతర కాలంలో జాతీయ కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా కొనసాగాడు. అనేక పత్రికలలో వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహించాడు. ఆంధ్రప్రభ వారపత్రికలో 'మాణిక్యవీణ' శీర్షికను ఆకట్టుకొనేలా కొనసాగించాడు. 1956లో రాయలసీమ రైతాంగ జీవన స్థితిగతుల్ని ఉట్టిపడేలా 'పెన్నేటిపాట' కావ్యాన్ని ప్రచురించాడు. అనేక సంస్కృత కావ్యాలకు వచనానువాదాలను చేశాడు)*

# మొగమహారాజు

**- విద్వాన్ విశ్వం**

ఎంత హృదయంలేని దబ్బా యీ ప్రపంచం ! యే కొంచెం సద్భావమైనా వద్దా? నన్నెందుకిట్లా యెత్తిపోసు కోవడం? యేయిద్దఱమ్మలక్కలు కలిసిని నా సంగతేనా ? యే పేరంటాల్లోనూ నా విషయమేనా ? యేగుసగుసలూ నన్ను గూర్చేనా ? యేమమ్మా నేనంత చేయరానిపని చేసి ఉండేది. లోకానికంతా అతిశయంగా నేనే చేశానా ? మఱెవ్వరూ చేయలేదేం?

అందఱిలాగే నాకూ అన్ని వసతులూ ఉంటే నేనూ బాగానే ఉండి ఉందును. ఇందఱితో యిన్ని మాటలనిపించుకోవలసిన అగత్యమే ఉండేదికాదు.

ఇంతకూ యీ తప్పంతా యెవరిదంటారు ? అన్నిటికీ ధర్మశాస్త్రాలేమో చెబుతూ, వాటికి విరుద్ధంగా నటిస్తూ స్వార్థంతో తమకు తగినట్లే ప్రతి చట్టమూ సృష్టిచేసుకొని తగుదునమ్మా అని సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని గూర్చి ఉపన్యాసాలు దంచుతున్నారే ఆ మొగమహారాజులదే యీ తప్పంతా !

నాకుమాత్రం నలుగురినోళ్ళల్లో నానవలసిన అగత్యమెందుకొచ్చింది ? ఆ సంగతి గమనించకుండా శ్రీరంగనీతులు చెప్పితే యేం ప్రయోజనం? నీకు మాత్రం తెలీవూ, యీ నీతి నియమాలు ? నేనూ చిన్నప్పుడు సతీధర్మాలు చాలా కంఠాపాఠం చేసినా,మా అవ్వ చెప్పిస్తూంటే.

ఆసంగతనుకుంటే వళ్ళు జలదరిస్తుంది. యెంత మంచి మాటలు చెప్పేవారు అబ్బబ్బబ్బ ! ఆ ప్రేమ - ఆ మురిపెము - ఆ వేడుకలు - కామానికి దాసుడై అలా ప్రవర్తించినాడేమో ! లేకపోతే...

... ... ...

నిజమే! మేము బీదవాళ్లమే. ఉన్నయావదాస్తీ అప్పులపాలయిపోయింది. ఉన్నదల్లా మా అమ్మా నేనూ అన్నయ్యా కన్నవస్థాపడి కంచిలో చేయిగడికి కబళం సంపాయించి పెట్టేది మా అమ్మ. కానీ ఆత్మగౌరవమూ ఆదర్శాలూ నశించలేదు. పస్తయినా ఉండేవాళ్ళం కానీ, కన్న కూటికీ ఆశించేరకంలో చేరలేదు. అదేంగ్రహచారమో! యిట్లా ఉన్న వాళ్ళం ఊరికే ఉండకూడదూ! అదే కాలమాహత్మ్యమంటారు.

ఆ దినం బడికిపోయి యింటికి పరుగెత్తుకొని వచ్చినాను. అక్కడే నులకమంచం మీద ఒకాయన కూర్చున్నాడు. మా అమ్మ వాకిటిలో ఆవైపుగా కూచోనుంది. వారంతకు ముందేమి మాట్లాడుతున్నారో నాకు తెలీలేదు 'ఇలారా అమ్మా యేంచదువుతున్నావు? ' అంటూ ఆయన యెంతోపరిచయమున్న వానిలాగా పల్కరించినాడు.

'చెప్పమ్మణ్ణీ ! అన్నయ్య అడుగుతూంటే ' అని సాగదీసింది మా అమ్మ ?

ఏమిటో, నేనేమీ పలక్కుండా లోపలికిపోయి పలకాపుస్తకాలింట్లో పడేసి బయటికి వచ్చేసినాను. నాకు మరీ కొత్తమగవారితో మాట్లాడడమంటే మంట.

ఇదీ ఆయన ప్రథమ దర్శనం. ఆనాటి నుండి మా యింటికి పదే పదే వచ్చిపోతూం డేవాడు. అమ్మమాత్రం ఆయన్ను చాలా మెచ్చుకొనేది. యెప్పుడూ యేవేవో మాట్లాడుకుంటూ ండేవాళ్లు. అంతకన్నా నాకెక్కువ తెలీదప్పటికి.

ఒకనాడు నేనింటికి వచ్చేటప్పటికల్లా మా అమ్మ మూటా ముల్లా కడుతూంది. సంగతి కనుక్కుంటే తేలిన సారాంశమిది. మాకిక్కడ సరీగా జరగడంలేదు. యిన్నాళ్లూ ఆయన చాలా సాయం చేస్తూండేవాడట. ఇంకోగూరికి పట్నవాసానికి వెళ్ళిపోతున్నాడట. అక్కడకే వస్తే నన్నూ మా అన్నయ్యనూ చదివిస్తాననీ, అన్ని విషయాలకూ అండగా ఉంటాననీ చెప్పినాడట. సరే, బలే బాగుంటుంది. అటు స్కూలులో చదవడమూ, ఆ పట్నవాస జీవితమూ, అనుకొని గుటకలు మింగుతూ కూచున్నాను.

... .... ....

ఆస్కూల్లో చేరడానికి ముందే కాస్త యింగిలీషు రావాలనీ యింకా యేవేవో తెలియాలనీ అందుకు ట్యూషన్ కూడా ఆయనే యివ్వడం మొదలుపెట్టినాడు. పాపం ! యెంతో ఆదరంతో చదువు చెప్పేవాడు. యేవేవో కథలు చెప్పి నవ్వించేవాడు. అన్నా యిన్నా, యెన్ని సంగతులు చెప్పేవాడు ! బలేతమాష మనిషిలే. హార్మోనియం మీదనేను పాడుతుంటే యెంత సంతోషపడేవాడో ! అయితే ఒకటి ; చదువుకన్నా యీ సంబరాలే జాస్తి.

సరే స్కూలు చేరినాను. చదువు సంగతెట్లా ఉన్నా, ఆ పిల్లనూ యీపిల్లనూ చూచి చాలా సొగసులు నేర్చుకొన్నాను. వాళ్ళ కన్నా బాగా తయారుకావాలనిపించేది. నిద్రలేచినప్పటి నుంచీ యిదే. మా అమ్మ లేస్తూనే తల దువ్వి జడవేసేది. తర్వాత యెంతైనా పల్లెటూరామె కాబట్టి నాయంతకు నేనే మరీ నాణ్యంగా వేసుకొనేది నేర్చుకున్న తర్వాత ఆమెతో వేయించు కోవడం వదలిపెట్టినానులే – స్నానం చేసి మంచుమీగడ రాచుకొని అదో క్రొత్త తరహాలో ఆరోజు చీర – ఆయన మదరాసు నుంచీ తెచ్చి యిచ్చినాడులే – కట్టుకొని అటూ ఇటూ సవరించుకొని, నా దగ్గరున్న పుస్తకాలన్నీ – మోసేన్ని – సరిచేసుకునేటప్పటికి పది కొట్టేది. అందువల్ల ఆయన ట్యూషన్ పొద్దునపూట నుంచీ సాయంత్రానికి మార్చుకోవలసి వచ్చింది.

... ... ...

అప్పుడప్పుడే నావళ్లు అంచులుతీరి జల్లుమని వికసించింది. నన్ను నేనే చూచుకొని ఆనందించుకునేదాన్ని.మరీ బాగా ముస్తాబయ్యేదాన్ని. ఆయన దగ్గఱ కూచొని చదువుకొందా మనుకొన్నా చెప్పడం కన్నా చూడడమే యెక్కువయింది. కాని అంతకుముందు యెగాదిగా చూచేదాన్ని, యిప్పుడు అదేదో తల దానంతటదే వంగిపోతుంది. మరీ చూడాలనే ఉన్నా, అదేదో మధుకీలలాగా తియ్యని బాధ కలిగేదాతడు నవ్విస్తూంటే, ఆ మాట ప్రతిదీ యేదో భావాన్ని స్ఫురింప జేస్తూండేది. అతడెప్పుడన్నా తప్పిపోతే – అలా పెన్సిలుతో తడితే –

గగుర్పాటు కలిగి గుండె తటతట కొట్టుకొనేది. ఇంకంత కథెందుకు ; నాలో వలపులూరిం చినాడు. నా హృదయవీణెను తంతులు సారించి శ్రుతి చేసి రాగాలాపనకు మొదలిడినాడు.

ఆ సాయంత్రం మా అన్న చెరువు కట్ట మీదికి పోయినాడు. మా అమ్మ దేవాల యానికి పోయింది. నేనూ ఆయనా అదేదో పాఠం చదువుకుంటున్నాము. అదెట్లా ప్రస్తావ నొచ్చిందో తెలీదుగానీ, ఆయనేదో కవిత్వం చెప్పడం మొదలుపెట్టినాడు. అవేవో అర్థంకాని పదాలన్నీ, అయినా నాకు చాలా వినబుద్ధవుతూండింది. ఇంతకూ సంగతి ; ఆయన ప్రేమిస్తున్నాననీ, నన్ను పెండ్లి చేసుకుంటాననీ అందుకే యెవరినీ వద్దంటున్నాడనీ, అందుకు మా అమ్మ కూడా వప్పుకున్నదనీ, ఆ మాటల్లో అక్కడక్కడా తేలింది. ఆయన నాకోసమెంత ఆందోళన పడుతున్నాడో అని ఆలోచిస్తూన్నాను. ఆ మాటలు వింటూన్న కొద్దీ నా నరాల్లో సంచలనం బయలుదేరింది. మనస్సు సంగతి తెలీదుగానీ శరీరం స్వాధీనం తప్పిపోయింది. ఆ తూలిపోతూన్న శరీర మాయన కౌగిటలో కరిగి నీరైపోయింది.

... ... ...

ఆ మధుజీవితం మూడేండ్లు జరిగింది. అందుకు నా మనస్సేమీ సంకోచించడమే లేదు.కానీ ఆయన చదువు పూర్తీ అయి ఉద్యోగములో ప్రవేశించేవఱకూ పెండ్లి చేసుకోవడం మంచిదికాదన చెప్పే మాటలన్నీ అప్పుడప్పుడు కొంత సందేహానికాస్పదమిచ్చినా ఆయన మీద ఉన్న అభిమానం యేమాత్రమూ వేఱేవిధంగా ఆలోచించనిచ్చేదికాదు.

ఆయనకుద్యోగం కుదిరింది. వెళ్ళిపోయినాడు. చాలానాళ్ళు బదులు వ్రాయలేదు. యేదో పనులు గదా తీరికలేదనుకున్నాను.నాకూ యేదో ఒడలికగానూ విసుగుగానూ ఉం డేది. మొగం పాలిపోయింది. యేదో నీరసం, బడికిపోతే అందఱు పిల్లలూ యెగాదిగా చూచి యేవో గుసగుసలుపోతూ ఒక్కమాటు నవ్వినారు. నాకేమీ అర్థం కాలేదు. ఆంతర్యంలో జరిగే సంగతి అందరికీ యేం తెలుస్తుందిలే అనుకునేదాన్ని ఆ కాలంలో.

... ... ....

మూడో నెల. ఆయన రానేలేదు. వచ్చీ మొగం చూపించకుండా వెళ్ళిపోయినాడట. మా అమ్మ చాలా తొందరపడుతూంది. అదేదో వెక్కిరింపుగా వేళాకోళంగా అందరూ చూచే వాల్లు. అందులోనూ ఆడవాళ్లు. ఇంక మగపిల్లవాళ్ళ సంగతి సరేలే. వాళ్ళతట్టో మాటచూచినా – యేమిటి కన్నాగానీ – అలాగే అవస్థపడిపోయ్యేదాన్ని.

రాను రానూ ' లౌ లెటర్లు ' రావడం జాస్తీ అయింది. ఏ పిల్లవెధవా రాయడమే. యెంత నీచులో, అడవాళ్లంటే అంత పశువులనుకొన్నారా ? అంగడిలో అమ్మే వస్తువులను కొన్నారా ? ఈ అల్లరి జాస్తీ అయిపోయి బడికి పోవడమే మానుకున్నాను.

.... ... ...

ఇంక ఆ సంగతిని గూర్చి యెక్కువ వ్రాయలేను. అదనుకుంటే గుండెలు పగిలిపో

తున్నాయి. ఆయనకు పెండ్లి కుదిరిందని వార్త వచ్చింది. నేను రాసే జాబులన్నింటికీ జవాబు రావడమే నిలిచిపోయింది. మా అన్నయ్య భావిజీవితాన్ని, మా అమ్మ ఆందోళననూ, మా కుటుంబ గౌరవాన్నీ, ఆయన చేసిన అమానుషకృత్యాన్నీ, అర్థంలేని సంఘమర్యాదలనూ, హృదయంలేని పశుప్రవృత్తిని, అమాయికలలో ఉన్న వాంఛను కారణంగా చేసుకొని ఆత్మీయ తాత్కాలిక సౌఖ్యాన్ని పరిపూర్తి చేసుకొనజూచే మగవాళ్ళ స్వార్థపరత్వాన్నీ పురస్కరించుకొని వానికోసం నన్ను నేను వంచించుకొని పెండ్లి చేసుకొన్నాను, మఱొకరిని.

... ... ....

ఈ పాడు ప్రపంచంలో యిన్ని ఘోరాలున్నాయని నాకు తెలీదు. మానవ హృదయాలు పూలగుత్తులనుకున్నాను. కానీ ముండ్లకంపలనుకోలేని మాటలకూ మనసుకూ సంబంధం లేదు. మానవ పశువులూ సంఘంలో మర్యాదకు లోటు లేకుండా పెద్దమనుష్యు లుగా ఉండొచ్చు. మనఃపూర్వకంగా మాలిమి చూపిన మనిషి వంచిస్తే దిక్కూ మొక్కూలేని అమ్మాయి ఆశ్రయం కోసం విధిలేక అర్థంలేని ఆర్థిక నీతులకు దాసురాలై యింకొకరిని పెళ్లి చేసుకుంటే అదందఱికి అపహాస్య భాజనం. అవినీతికరం కావడం.

ఇంతకూ ఒకరి ననుకోవడమెందుకు ఆయనే సరైనవాడైతే వీళ్లందరికి మొగం మీద కొట్టేదాన్ని. కానీ ఆ అదృష్టం పడలేదు. అందఱూ నన్ననేవాళ్లు ఆయన సంగతికి ఎవరికి కాబట్టింది ?

అన్ని నిందలూ ఆడవాళ్ళకే.

ఆయనకేమమ్మా మొగమహారాజు !

***(అంకితము - అమాయికలైన అమ్మాయిలకు)***

**– 26 ఆగస్టు, 1939, సాధన పత్రిక**

# ఎందుకు ?

– విద్వాన్ విశ్వం

**నా**కేమీ తోచడం లేదంటే నమ్మరుగానీ యేచిన్నముక్కా సరీగా ఆలోచించుకు న్నామంటే అంత తొందరగా నిర్ధారణ చెయ్యలేము.

ఏమిటిదంతా? యీ ఘోరాలేమిటి యీనీచత్వం యేమిటి? అని అడిగితే అందును గూర్చి ఆందోళన చెందితే, నన్ను వెఱ్ఱివాడనుకొంటారుగానీ మీరొక్క మాఱు సమాజంలోని దినసంఘటనలను పరికిస్తే తప్పక గుండెలు నిల్చిపోవూ?

ఎంత బాధపడుతున్నారో? యెందఱు బాధపడుతున్నారో? యెందుకు బాధపడు తున్నారో? యెవరు విచారించేవారు ?

....

అదో అక్కడో ముసలామె చూడండి. పాపం ఆమెకు దిక్కూదివానమూ ఉన్న దల్లా ఆ మనుమడు మాత్రమే ఆమె శరీరం వంగిపోయింది. యెన్ని కష్టాలను మోసుకొని తిరిగిందో.

కొడుకూ కోడలూ మొన్న వచ్చిన ఉత్తరలో కాలంచేసినారు. కాటకంలోనే కడుపు మాడ్చుకొని గతించినాడామె మొగుడు అంతకు పూర్వమే.

ఇప్పుడామె మనుమడికి మలేరియా జ్వరం అంటుకొంది. అది నాల్నాళ్ళ జ్వరంగా తిరిగింది. చిక్కి శల్యమై పోయినాడు. అతనికి మందోమాకో యివ్వడానికి యిప్పించడానికి యేముంది? పక్కింటి వెంకమ్మతో పసరాకు కట్టించింది. అంతే...

అతని దగ్గఱే కూచొని కంటతడి పెట్టుకుంటూంది. ఆః. ఆః. అంతలోనే ఆ పాపోడట్లా అపసోపాలు పడుతున్నాడెందుకు ? దప్పి దప్పి అని వాపోతున్నాడు. భరించుకో లేకున్నాడు తాపానికి. 'అవ్వా !' అనేమో చెప్పబోయినాడు ; కానీ గొంతెగయలేదు. కఫము చుట్టుకొంటూంది.

పాపోడా ... పాపోడా అంటూ పలవరిస్తూనే పాపోడి మీద మందు నూరి పోసింది. ఒక్కసారి మాట్లాడిచ్చి కన్నీళ్ళతో కన్నుమూసాడా పాపోడు. నూనెలేక గబ్బు నూనెబుడ్డి గుప్పుమని ఆరిపోయింది. ఆమెక్కడికి పోవాలి, యెవరిని రమ్మనాలి. దీపంలేని యింట్లో కొఱకొఱ మంటూన్నా కూనను విడిచిపోవానికి కాళ్లొస్తాయా ?

ఆ ముసలవ్వ కడుపులో కుములుతూన్న సంకటాన్ని గూర్చి యెవరాలోచిస్తారు? ఆమె చేతిలోనే కొంత డబ్బుంటే? ... ఎందుకూ యీ ఆలోచనంతా అంటారు కదూ మీరు ? అవును మీకెందుకూ యీ సంగతంతా ?

....

అదో ఆ రైతు చూడు, యెందుకో అంత తొందరగా పోతున్నాడు.అదో అతని పక్కనే అమీనా ఉన్నాడు. అతనేమో అంబలి లేక అల్లాడుతూ అప్పుచేసి రెండు బడెనుపోతులను

తెచ్చుకొని, కణేకల్లెనుపోతులు కొనడానికి దుడ్డులేదుగా – కట్టుగింజలకు మడిసాగినాడు. యెడకారు పంట బొత్తిగా కాలేదు. యిరవైనాలుగ్గంటలూ కష్టపడి యేట్లో కాల్వతవ్వి ఆకాసంత భూమీ వరి చల్లుకొన్నాడు. ఆ వచ్చిన నీళ్ళల్లో వంతు లెట్లా వున్నా వారూ వీరూ సవరించుకోగా వచ్చేది పదహైదు నాళ్ళకు.

మంచి పంట సమయంలో నీళ్లు చాలలేదు. ఆకాస్త మడీ యెండిపోయింది. కళ్ళంలో గింజలు కొలిస్తే కట్టుగింజలకు చాలలేదు. కాళ్ళోకడపులో పట్టుకొని పత్రం రాయించి ఆసామీ నొప్పించుకొన్నాడు.

కానీ ఫసల్ జాస్తీ కట్టవలసి వచ్చింది. ఆ అప్పును తిప్పుకోవడానికి వీల్లేకపో యింది. అందువల్ల అమినా జప్తీచేయడానికి వచ్చినాడాయెనుపోతులను.

అతడెక్కడికి పోతున్నాడు. యెందుకు పోతున్నాడు అంటే ? ఏమిటీ యీ పిచ్చి వూహలన్నీ అంటారు కదూ ?

....

అదో, ఆ నులక మంచం మీద పండుకొన్నాడే ఆయనేదో గొణుక్కుంటున్నాడు చూడు. ఆయనో పెద్ద భూస్వామి పూర్వం. ఆయన పేరంటే హడల్ చుట్టూ పది పల్లెలకు.

ఆయనది చల్లని కడుపు. పది మంది పిల్లలు, నలుగురు బిడ్డలకూ రంగ రంగ వైభవంగా పెద్ద దర్జాగల వాళ్ళకే యిచ్చి పెండ్లి సేసినాడు. పెండ్లి కి బాగానే ఖర్చుపెట్టినాడు. కొడుకులనూ పెద్ద పెద్ద పరీక్షలకు చదివించినాడు. అందఱూ ఉద్యోగాల్లోకి పోయినారు. వాళ్ళ వాళ్ళ కొత్త పెండ్లాలతో.

కడగొట్టు కొడుకు మాత్రం కొంపలోనే ఉన్నాడు. వీని వంతు వచ్చేటప్పటికల్లా తేలింది, ఆస్తిపోనూ అప్పు అయిదువేలు. అట్లాగే సేద్యమో నాద్యమో చేసుకుంటూ ఉన్నాడు. మిగతా వాళ్ళ భార్యలు పూర్తీ నాగరికులుగనుక యీ ముసలాయనకు శరణ్యం లేక యీ కొడుకుదగ్గఱే ఉన్నాడు.

పొద్దున్నాయన అన్నానికి బోయినప్పుడు చిన్న కోడలు పొరుగింటి నరసమ్మతో అంటూందిటగదా 'అందఱి కొడుకులనూ బాగా చదివించి పనుల్లోకి పంపించినాడు. మా ఆయనకేమో మన్ను బూసుకోవడం తప్పలేదు. పైగా యీయనా మానెత్తిన్నే పడినాడు ' అనే రకంగా, అట్లే ఆకలికాలేదని వచ్చి పండుకొని గొణుక్కుంటున్నాడు.

ఇదంతా చెబితే ఉడత కెందుకురా ఊళ్లో పెత్తనం? అంటారు మీరు.

....

అదో ఆ యువకుడు, తిండికి లేక వారాలు చేసికొని బజారుదీపాలదగ్గఱ చదువుకొని కడకు గ్రాజుయేటయినాడు. కన్నవస్తాపడి, ప్రతివారినీ ఆశ్రయిస్తున్నాడు. డి॥బోర్డు ప్రెసిడెంటింటి కెన్నిసార్లు తిరిగినాడో ! యెక్కడా ఉద్యోగం దొరకలేదు. రూము బాడుగకు

తగాదా. హెూటల్లో తగవు. చాకలి రంపు, అబ్బ బాధపడలేక అదో పారిపోతున్నా డెక్కడికో! మీరేమైనా చూస్తున్నారా ?

....

అదో ఆమె పెద్ద యింటితనస్తురాలు. చిన్నతనంలోనే మొగుడు చనిపోయినాడు. ఆస్తి కాస్తా అన్నదమ్ములూడదన్నుకున్నా కొంతకు కొంత యీామెకూ దక్కింది.

అంతకుముందే మొగుణికి ప్రాణస్నేహితుడుగా ఉన్నాడొకతగాడు. ఆయన కింట్లో బలే స్వతంత్రం. అంతా అతనిదే. ఇంటాయన చచ్చిపోతూనే యీామెకేమి – తెలీదు కాబట్టి ఆయనే యధాప్రకారం యజమాని.

కొంత కాలానికి చనువు బలిసి సరే అమాయకురాలైన ఆమెను సంబంధం చేసి నాడు. ఆ ఆస్థికాస్తా కాజేసి ఆమెను వెళ్లగొట్టినాడు. అక్కడా యిక్కడా పడి తుదకు కాపిటల్ లేక శరీరాన్నే కాపిటల్‌గా పెట్టి వ్యాపారం చేస్తుంది. మనకు తమాషా.

ఆమె కడుపులోని శోకం కదిలిస్తే తెలుస్తుంది? యెవరికి కాబట్టింది? బజార్లో కనబడితే అసహ్యించుకుంటారంతే కదూ?

....

అదో ఆయన ప్రథమంగా జైలుకుపోయి వచ్చినాడు. రాజకీయాల్లో ఉన్నదంతా ఊడ్చుకొనిపోయింది. ఉద్యమంతో దేశదేశాలు తిరిగినాడు. పల్లె పల్లెలూ ఉపన్యసించినాడు. ఆయన ఉపన్యాసం అంటే వేలకు జనం కలుస్తారు. కలంబడితే విజ్ఞానాన్ని ఒలకబోస్తాడు.

కానీ, తిండికిలేదు. రాజకీయాల్లోనూ పార్టీల్లో పార్టీ లేర్పడినవి. తానందులో యిమడలేడు. అదో ఆయన భావశిథిలాల్లో రేగే దుమారం దులుపుకుంటూ అప్పడగడానాకి పోతున్నాడు. సాహసగాళ్ళు తప్పుకుంటున్నారు, కనబడకుండా.

చూస్తున్నారా? అతగాని ఖర్మం అంటారుకదూ?

.....

ఆయన రచయిత; చూడు, చాటలో పడింది మొదలూ ఈ దినంవఱకూ దిన గండంగా గడుస్తూందతని జీవితం. బాగా రాస్తాడని అందఱూ అంటారు. చక్కని శైలి. భావాలకు కొదవలేదు విజ్ఞానానికి కొఱతలేదు. తత్త్వశాస్త్రాలను తడివిచూచినాడు. ఉద్విగ్న హృదయంతో 'అపిగ్రావారోదిత్యపిదళతి వజ్రస్యహృదయం' అన్నట్లు వ్రాస్తాడు.

కానీ అతని రచనలు బయటికి వచ్చే మార్గం? వచ్చినవి చదివేవారు? చదివినా కొనేవారు. అట్లో యిట్లో చేసి అచ్చు వేయించి అప్పు తీర్చలేక అలవరిస్తూండే అతణి అవస్థ చూడు?

'ఎచ్చటకన్నా ఎచ్చటవిన్నా అతని దుఃఖమే కనిపిస్తుంది. వినిపిస్తుంది' అంటే ప్రపంచజ్ఞానం లేదని అంటామా?

....

ఒకటేమిటి యేపక్క చూచినా యీ విషాద సంఘటనలే కనబడుతూంటే ఆవేదన కాక మఱేమిటి? ఇవన్నీ చెబితే?

ఎందుకిదంతా? ఏమిటి నీకుపిచ్చి?యెంతమంది యివన్నీ సరిజేయాలను కున్నారు. యెందఱు నిరాశ చెంది నిర్విణ్ణులైపోయినారు? నీవే మహామేధావి ననుకున్నావా? యీ మొగోడేనేమో లోకోద్ధారంచేసేది? అంటారు మరీ పెద్దవాళ్లు.

నిజమే నాయనా యిదంతా? యేం చేస్తాం ప్రపంచమిది! నీవూ నేనూ యేం చేయగలం. మహా మహావాళ్ళు మన్నుగొట్టుకొనిపోయినారు. ఎంతమంది తత్త్వవేత్తలు తల విదలించుకొని అడవుల్లోకి పరుగెత్తినారో ! అంటారు శాస్త్ర హృదయం కలవాళ్ళు.

నేడు ఇదంతా సంఘనిర్మాణంలోనూ మానవుని స్వార్థపరత్వాన్ని పరమోచ్చ స్థానానికి కొనిపోయే ధనికతత్వంలోనూ ఉన్న దోషమే. దీన్ని మార్చివేయడానికి వీలవుతుంది. అందుకు పనిచేయవలసినదే మానవసేవే మాధవసేవ. అంటూ ఊరడింపులతో ఉపన్యా సాలతో ఉ బలాటం తగ్గించడానికి ప్రయత్నిస్తారు మరికొందరు.

కానీ... కానీ...

ఇవన్నిటినీ మార్చడానికి వీలున్నది? సంఘాన్ని పునర్నిర్మాణం చేయ్యడానికి చేతనౌతుంది; అని అందుకు నడుముకట్టి ప్రస్తుత సంఘాన్ని విమర్శిస్తే, కనులెఱ్ఱదౌతవి మిగతవారికి. ఆ సేవానారాయణులే అతణ్ణి ద్వేషిస్తారు. సంఘం వెలివేస్తుంది. స్నేహితులు అపహాస్యం చేస్తారు?

అయితేమాత్రం అతని ప్రయత్నం మానుకొంటాడా ?ఎన్నటికి మానుకోడు.

యెందరో యీ నిరాఘాటధాటితో పోతూన్న సమాజ జగన్నాథరథం కింద నల్గిపోవలెను. యెందఱి రక్తంతోనో యీ భూమి తడిసిపోవలెను. యెందఱి ఆత్మలో పిశాచాలై ప్రపంచ మంతా ప్రళయతాండవం చెయ్యవలెను. యెందఱి ఆడపిల్లలో అన్నంలేక మలమలమాడి పోవలెను. ఊఱికే మారుతుందా సంఘం.

ఆ సమాజ శక్తికే బలికావలెను. అందుకు సర్వసన్నాహాలూ చేసుకొని రంగంలోకి దుమికితీరవలెను.

యెందుకూ ? అంటే

అందుకే ; అందుకే; ఆ బలికే ; ఆ బలికే ; ఆ ఆపొలికే !

పొలి పొలి ! బలి బలి !

**– 20 జనవరి, 1940,సాధన పత్రిక**

# నీతులు

– విద్వాన్ విశ్వం

ప్రతి వారూ, పలకరిస్తే, పదినీతులు చెబుతారు. యే ముసలవ్వనడిగినా, యే పిల్లతల్లి మాట్లాడినా, యేదానికీ నీతులేకరువు పెట్టడం మామూలుగా మనం వింటూంటాము.

అందులోనూ కొన్ని వారి వారి మతాలకూ, వర్గాలకూ సంబంధించిన నీతులను కొందఱికి కొందఱు ఒప్పుకోలేకపోయినా, ప్రతివారూ ఒప్పుకొనే కొన్ని నీతులున్నాయే అవిమాత్రం అవిచ్ఛిన్నంగా వాడుతుంటారు.

ఎవరినీ బాధించరాదు; ఒకరిసొత్తు ఆక్రమించుకోరాదు; అబద్ధమాడరాదు; వ్యభిచారం చేయరాదు; దొంగతనం కూడదు;

అబ్బా బోలెడన్ని ఉన్నాయి. ఇవన్నిటినీ యెట్టిదొమ్మగలవాడూ కాదనలేడు. పైగా తనకువచ్చిన భాషనంతా ఉపయోగించి వీరిని వర్ణించి ఆగుణాలున్నవారిని చెడదిడతాడు. ఏ పుస్తకం చూచినా యేశతకం తీసినా ఏకథ చదివినా పలుకువలుకునా యీ నీతివాక్యాలు పొడసూపుతూంటాయి.

యెన్నడో ఏనాడో ఏర్పడిన వేదాలు మొదలుకొనీ యీ నీతిప్రశంస ఉండనే ఉంది. అప్పుడప్పుడూ కాస్త మార్పులు కలుగుతున్నా.

కానీ అసలివి యెందుకు పుట్టినాయో ఆపని మాత్రం నెఱవేఱిందా అంటే తలగీరు కోవలసి వస్తుంది.

సమాజానికీ వ్యక్తికీఉన్న సంబంధాన్ని చక్కగా ఒడిదుడుకులు లేకుండా జరిగేటట్లు చేయడం కోసం కొన్ని నీతినియమాలు అత్యవసరములైన వాటిని రక్షించడం కోసమే అనేక రాజ్యాంగాలు గూడా ఏర్పడినవి. యెన్నో మతాలు తలసూపినవి. యెన్నో తత్త్వశాస్త్రాలు బయలుదేరినవి.

అవేమో ఆయా కాలాలలో ఉన్న సమాజస్థితి కనుగుణంగా సమరసతను చేకూర్చేటందుకై కొంతకు కొంతకు ఉపయోగపడినవనే చెప్పొచ్చు. కానీ పూర్తిగా నెఱవేఱలేదు ఉద్దేశం.

మనిషి సామాన్యంగా ఒక ప్రజాభిప్రాయమేదైనా ఏర్పడిందంటే దానికి బహిరం గంగా యెదురుచెప్పడానికి జడుస్తాడు. అందుకే తానూ ఆపాటే పాడడం మొదలుపెడతాడు.

అందుకే ఆనాడు ఏర్పడియున్న ప్రజాభిప్రాయప్రకారం ఆ నీతులు చాల మంచి వనేమో చెబుతాడుగానీ, వాని నాచరణలో పెట్టడానికి మాత్రం అంతగా ప్రయత్నించడు.

అహింసకోసం అంత బ్రహ్మాండప్రయత్నం చేసినాడు బుద్ధుడు; యేమయింది? అహింసాపరమోధర్మః అనడాని కెవ్వరూ అడ్డుచెప్పలేదు కానీ ఆచరించినవారో?

ఒకరినేమాత్రమూ బాధించరాదన్నాడాయన. కేవలం ఆ కాలంలో బ్రాహ్మణ మతం చాటున జరుగుతున్న పశుహింసలను, రాజులూ, ధనికులూ, బీదవాళ్ళు, నేడ్పించడాన్ని పురస్క

రించుకొని అవంతా అన్యాయమనీ, యీ ప్రపంచం దు:ఖమయం, దీనికోసం యెందుకిట్లా పలవరించడమనీ అన్నాడాయన. దేవుడున్నాడో లేడో అది గాదు సంగతి, మన:పరిశుద్ధతను ప్రతిపాదించే మంచి గుణాలు అలవఱచుకోవాలన్నాడు.

మహాపాతకాల కాకరమైన మారుణ్ణి – కామాన్ని – జయించమన్నాడు. అందుకు బోలెడు గ్రంథాలు చెప్పినాడు.

కానీ, ఆయనబోధ నెంతమంది అంగీకరించినారు. ఆ ప్రముఖ శిష్యకోటి కడకాయన సిద్ధాంతాల నేవిధంగా ఆచరణలో పెట్టినారు ? ఆయన చనిపోతూనే దంతాలకూ, యెము కలకూ యుద్ధాలు చేసినారు. రక్తాన్ని పారించినారు.

హింస అంటే యెవని ప్రతిరక్తకణమూ ప్రతిఘటిస్తుందో, అతని శరీరంలోని అవయవాల కోసం అతని సిద్ధాంతాలను ప్రపంచంలో ప్రబలించి పరమస్వర్గాన్ననుభవించగలమనే పరమాదర్శంతో పనిచేసే అతని శిష్యులు, చేసిందేమిటి? హింసా మహాయజ్ఞం.

ఇట్లాగే ప్రతి సిద్ధాంతమూ ఆచరణలో చాలా భేదాన్ని పొందుతూ వచ్చింది.

యీ నాటికీ యే మగాడూ హింస, వ్యభిచారం మొదలైన వానిని మంచివని చెప్పలేదు. కానీ వానినే అనుక్షణమూ అంతో యింతో ఆచరిస్తూనే ఉంటాడు.

అంతెందుకూ, ఆచారం చెప్పిన పిన్నపెద్ద ఆకూటికే లోబడినాడంటారు. అట్లా ప్రతి ధర్మమూ కేవలం మాటల్లో ఉన్నన్నినాళ్లూ యేమాత్రమూ పనిచేయలేదు.

కేవలం ఆదర్శంగా మనం యెన్ని విషయాలనో అంగీకరించవచ్చు. కానీ వానినట్లా అంగీకరించడం వల్ల వచ్చిన ప్రయోజనమేమిటి?

అందఱూ ఒకరిని బాధించడం తప్పంటారు. అందఱూ బాధిస్తారు. యెందుకు?

ఇంతకూ యిందులో యేదో రహస్యముంది. లేకపోతే అంత అన్యాయంగా యెందుకు ప్రవర్తిస్తారు. చెప్పుచేతలకు సంబంధంలేకుండా !

యీ నీతినియమాలు కూడా అవి ఆదర్శాలు కావు. మరి అవి సాధనాలు. సమాజానికీ వ్యక్తికీ సామరస్యాన్ని కల్గించేవి.

కానీ యివన్నీ ఆచరణలో పెట్టడానికి తగిన సమాజ నిర్మాణం లేకపోవడమే దీనికి కారణం కావచ్చు.

దేనికైనా పరిసర పరిస్థితులు అనుగుణ్యంగా లేకపోతే ప్రయోజనమేముంది?

ఇప్పుడు మనం 'పరపీడన మంచిది కాదు' అంటే నిజం! అనే వాళ్ళను లెక్క లేనంత మందిని పురమాయించుకోవచ్చు. కానీ పాపం వారు తెలిసో తెలియకో పీడిస్తూనే ఉంటారు, పరులను.

ఒక భూస్వామే ఉన్నాడు. అతనికి మనసులో యే మాత్రమూ కూలివాని నోరు గొట్టాలని యిష్టం లేకపోవచ్చు. కానీ మన సమాజ విధానమే అతని శ్రమ నితడు దోచుకొనేటట్లు చేసిపెట్టింది. యేమి చేయగలడు.

ఆర్థిక నిర్మాణం యంత్రప్రాయమైనది. తనపని తాను చేసుకుంటూ యీ అస్థిరమైన స్వేచ్ఛా వ్యాపారం మూలాన, ఒకనికీ, 'సెక్యూరిటీ' అనేదే ఉండదు. అందువల్ల తత్ఫలితంగా పోటీలూ, దివాలాలూ, పీడనలూ, ధనకేంద్రీకరణమూ, ఒకటేమిటి తద్వారా మహాభయంకర యుద్ధాలూ, దేశస్వతంత్ర భంగాలూ కలుగుతుంటాయి.

ప్రతివాడూ ధర్మం పలికేవాడే కానీ ప్రపంచమేమో మహాభయంకరంగా మారిపోతుంది.

కేవలం మనసుమారితే ప్రయోజనం లేదు. అసలది మారదు పరిస్థితులు మారనిది. భావవాదులిన్నాళ్ళు కొట్టుకుంటూనే ఉన్నా ప్రపంచం యేమాత్రం శాంతంగా జరగడం లేదు.

అందుకే కాస్తదీర్ఘంగా ఆలోచిస్తే యే నీతినియమాలు సరిగా ఆచరణ సాధ్యాలు కావాలన్నా సంఘ నిర్మాణంలో మార్పు జరుగవలెను. ఆచరణలేని సిద్ధాంతాలనవసరాలు, ఆడంబరాలు.

షావుకారి కేవలం ఆస్తికి ధర్మకర్త అనుకోవాలనడం చాలాబాగుంది. కానీ అనుకుంటాడు? అనుకోవడానికి వీలున్నదా ?

అందుకే, వర్గాలు అనే భేదమున్నన్ని నాళ్ళు యివి సరీగా నడుపుకోవడం కష్టం.

ఊరికే లేవంటే కుదరదు. ఒకరిని పీడించడాని కనువయ్యే భౌతిక వాతావరణం లేకపోతే ఆతర్వాత మానసికంగా కూడా ఆ వ్యక్తిలో పరపీడనేచ్ఛ నశిస్తుంది. ఒక్కతూరే పోకపోవచ్చు. కానీ ఆ క్రొత్త వాతావరణం కొన్నాళ్ళల్లో అతని మానసిక ప్రపంచంలోనూ యీ దుర్గుణాలను తుడిచిపెట్టి వేస్తుంది.

మన ధర్మప్రవర్తకత్వం చక్కబడటానికీ ఉపాయం తప్ప మఱివేఱేలేదు.

ఆదర్శాలలో యెవ్వరూ తీసిపోరు. ఆచరణలోనే అందఱూ బోల్తాపడేది. అహింస మంచిదని ప్రతివారూ అంటారు కానీ ప్రతి దినమూ యెంతమందిని హింసిస్తున్నారు ?

శాంతిస్థాపనకోసం పరరాజ్యాలను గుంజుకుంటారు. న్యాయపరిపాలన కోసం స్వతంత్రమివ్వరు. దుర్బలరక్షణ కోసం సామ్రాజ్య వ్యాపనం చేస్తారు.

ఏమిటో యీ పరస్పరమైరుధ్య ప్రపంచమే యీ విధంగా తేలిపోతూంది.పీడితులూ పీడకులూ అనే భేదం ఉన్నంతవఱకూ యింతే. యిందుకే ఆ వర్గరహితమైన సమాజం యేర్పడింతరువాత సులభంగా పై నీతినియమాలను కేవలం ఆదర్శాలుగా కాక ఆచరణలో ఉండేటట్లు చేయవచ్చు.

లేదంటారా ?

మీరు చెప్పే ధర్మాలన్నీ ఆచరించండి... అందుకై ప్రయత్నించండి. 'యెక్కడికిలేప్పా అవన్నీ ఏదో మహాత్ములకవి సాధ్యమవుతాయి కానీ మనకెక్కడలే ' అంటే కుదరదు.

మహాత్ముల కోసం కాదు నీతులు. మనవంటి వారికోసమే, మానవసమాజ శాంతి కోసమే. మాటలకు కాదు.

**– 27 జనవరి 1940, సాధన పత్రిక**

## ఎక్కడికి ?

**– విద్వాన్ విశ్వం**

**అ**దేమిటోగానీ జీవితాన్ని గూర్చి అంత సులువుగా అర్థం చేసుకోలేము. మన మేమిటి, ప్రతి విజ్ఞానీ తత్వవేత్తా యిందును గూర్చే అనుక్షణమూ తలపోసి తలపోసి తనకు తోచిన వ్యాఖ్యానం చేస్తూ 'అనుక్తమన్యతో గ్రాహ్యం' అని వదలిపెడుతూండేవాడు.

ప్రతిశాస్త్రమూ ప్రతివేదాంతమూ యిందుకోసమే తన శక్తినంతా ధారపోసి పెరిగి పెరిగిపోయింది. ప్రతి కావ్యమూ, కథా దీన్ని వివరించడానికే ప్రయత్నించి బలిసిపోయింది.

యేదీ అర్థంగాకపోతే యీ జీవితానికే అర్థంలేదు. ఇదంతా భ్రమ పొమ్మని దిక్కుతోచక పలకడానికీ యీ జీవితమే కారణమయ్యింది.

అట్లాకాదు. యీ జీవితమనేది చాలా అపూర్వమైనది; అదృష్టవంతమైనది. దీన్ని చక్కగా నడుపుకోవడానికి ప్రయత్నించాలనే వాళ్లూ ఉన్నారు.

అంతూ జీవితమనేది బాగా వుంటే ప్రతి వాళ్ళకూ యిష్టమే. కానీ అది కాస్త గతుకు కొట్టుతుందంటే శివశివా యీపాడు జీవితం యెందుకిచ్చినావురా మహానుభావా! అంటారు.

అందువల్ల జీవితం చక్కగా నడిచేటట్లు చూచుకుంటే అప్పుడన్నీ సరిపోతాయన్న మాట.

ఆ తర్వాత అదెట్లా సుఖప్రదంగా ఉండగలదు అనే ప్రశ్న బయలుదేరింది. ఓయబ్బ ! లెక్కలేనన్ని మార్గాలు సూచించడం మొదలుపెట్టినారు.

ఆ జీవితాన్ని సుఖప్రదంగా చేసుకోవడానికై యేర్పడిన మార్గాలే తత్త్వశాస్త్రాలూ, రాజ్యాంగ చర్చలూ, నీతినియమాలు.

కానీ అవన్నీ ఒకేవిధంగా యెప్పటికి ఉంటాయని అనుకోవడానికి వీలులేదు. జీవన విధానంలో మార్పులు జరిగేకొద్దీ మనుష్య విధానంలో మార్పులు జరిగేకొద్దీ మనుష్య శక్తి విజృంభించేకొద్దీ, ప్రకృతిని మనిషివశం చేసుకొనే కొద్దీ, అనేక విధాలైన మార్పులు కలుగుతూ రాక తప్పలేదు.

అందువల్ల ప్రపంచ జీవనం మారేకొద్దీ ఆ జీవిత దృక్పథాలు కూడా మారడం అనేక తత్వాలుదయించడం జరుగుతున్నది.

ఇన్ని తంటాలూ, తగాదాలూ, ధర్మజిజ్ఞాసలూ, తత్త్వచర్చలూ, రాజ్యాంగాలూ, ఆర్థిక నిర్మాణాలు, ఊరేగింపులూ, ఉపన్యాసాలూ, తీర్మానాలూ, సవరణలూ, సభలూ, సభ్యత్వాలూ యివన్నీ యెక్కడికి మనలను కొనిపోతున్నాయి? యేమీ దిక్కూ మొక్కూ లేకుండా దారెక్కడికి తీసుకొనిపోతే అక్కడికి పోదాములే అనుకున్నామా? లేక మనకేదైనా ఆదర్శమున్నదా? అతదేది? అదెట్లా సిద్ధిస్తుంది?

ఎప్పటికీ మనిషి తన ఆదర్శము ముందు నిర్ధారించుకొని తర్వాత మార్గం నిర్ణయించుకొన వలెను గానీ యేదో ఒక దారిలో అకస్మాత్తుగా పడి అట్లే పోతూంటే వానిగతేం కావలెను?

అది చెఱువులోనికే పోతుందో? బావిలోనికే పోతుందో? మన మెట్లా తెలుసుకోవడం? అంత తమాషా విషయమాయిది?

మనిషి సామాన్యంగా పాతత్రోవనే అనుసరిస్తాము అనుకొనేరకం. కానీ అందుతో పాటు స్వార్థమూ సుఖాపేక్షా యెక్కువ. అందువల్లనే తనకేమాత్రమూ ఆలోచించకుండానే నీటిలో పడిపోతుంటాడు.

పెద్దవాళ్ళ మార్గాన్ని అనుసరించడంలో తప్పేమీలేదు. ఆ పెద్దలందఱికి మనకన్నా బుద్ధి తక్కువనీ అనలేదు; అనుకోరాదు. కానీ, ఆ కాలానికి అప్పటి పరిస్థితులనుబట్టి యేర్పాటు చేసుకున్న వారి విధానాన్ని యితరమైన వ్యవహారాలన్నీ మార్చుకొని కొన్ని మాత్రం 'పెద్దలనుసరిస్తూన్నవి' అని చెప్పడంలో మనకిష్టమైనవాని మీది మమత తెల్పుతుందిగానీ మన వృద్ధాచార పరత్వం వెల్లడించదు.

స్వార్థంవల్ల కాకపోతే యెన్నో మార్చుకొన్నాము. యింటిలోని ప్రతి వస్తూవూ దాన్నమర్చే వైఖరి మొదలుకొనీ, మనమూ మన వేషభాషలూ మొదులకొనీ మన ప్రవర్తనా, ప్రధాన జీవితాలూ మొదలుకొనీ, ఒకటేమిటి ప్రతిదీ మన జీవిత దృక్పథమే పూరా మారిపోయింది. కానీ మనకేమైనా నష్టం కలుగుతుందేమో అన్న భయమేర్పడిందో, తప్పకుండా యిది పెద్దల ఆచారానికి విరుద్ధమనీ, పూర్వకాలంలో యిటువంటి పరిస్థితులులేవనీ బ్రహ్మాండమైన ఆదర్శాలు కల్పించి ఉపన్యాసాలు దంచిపారవేస్తారు.

విదేశాలవని యే వస్తువులు విడిచి పెట్టినాము మనము? రైళ్ళలో కూర్చోవడం విడిచినామా? కార్లల్లో ఊరేగడం మానుకున్నామా? కాఫీలు తాగడం వదలినామా? సారీలూ, అపాలజీలూ, ఒకటేమిటి ఒక్క అయిదు నిమిషాలు, కాస్త నాగరికుడని అనుకొనేవానితో మాట్లాడినామంటే, కడకూరికే అతణ్ణి గమనిస్తూండినామంటే – వెయ్యి విదేశీయ విధానాలు మనకు కనబడతాయి. కడకాలోచనలు కూడా పర్యయాలే. మాటలు చెప్పనక్కర్లేదు. పోనీ శరీర పరిస్పందనాలు కూడా ఆరకంవే.

కానీ

ఇంకేమైనా వానికి దెబ్బ తగిలే విషయం చెప్పినామో యిదంతా విదేశీయం పరానుకరణం – మనదేశం యెంత గొప్పది యేం కథ. అంత విశాలమైన అభిప్రాయాలు గల ధర్మ శాస్త్రాలు రాసినారే మనవాళ్లు' అంటారు.

ఈ చిన్న విషయాలే కాదు. పెద్ద విషయాలలో మాత్రం, ఈ ధనిక విధానం మన తాతల కాలమునాటిదా? మనుస్మృతిలో చెప్పినారా? యీ మిల్లులూ, యీ స్వేచ్ఛా వ్యాపారపద్ధతీ, పరపీడనా యిదంతా యిట్లా చెయ్యమని ఉపదేశించినారా?

ధన కేంద్రీకరణమంటే పూర్వం బొత్తిగా సరిపేడేదికాదు. ఒకడంతకు ఒక్కడే తాను కావలసినవన్నీ అనుభవించడానికి వీలులేదు. ఒక్క దేవళమూ, మందిరాలూ, రాజగృహం

తప్పితే అంత పెద్దవి యితరులు కట్టించు కోవడానికి కూడా వీలులేదనే స్మృతి వాక్యాలున్నవి. కడకు మూడేండ్లు తన సంసారానికి ఖర్చులకూ తగినంత ఆస్తి, చేకూరితే ఆ తర్వాత యజ్ఞ మో, యాగమో, చెయ్యవలెననీ అవి వీలుకాకపోతే, అంటే అందుకర్హత లేనివాళ్ళైతే చేయించ వలెననీ చెప్పినారు. అదెంతమంది వింటున్నారు?

అసలు సంగతి చూడండి. వర్ణ విభాగాన్ని చేసి చక్కగా యెవరి వృత్తి వాళ్ళను సవ రించుకోవాలని ఒకదాన్నొకరు అనుసరిస్తే దేశద్రోహంగా భావించి మరణశిక్ష విధించే వారు.

అవెంతమంది అనుసరిస్తున్నారు. అనుసరించడానికిష్టపడతారు. బ్రాహ్మణులేమో యితర వృత్తులలో చేరవద్దంటే వింటారా? క్షత్రియులు పాలిస్తామంటే రాజ్యమిచ్చే వాళ్ళెవరు? వైశు ్యల వాణిజ్యాలలో చేయిచేసుకొని ముల్లెకట్టుకోని వాళ్ళెవరు? శూద్రులు బ్రాహ్మణ సేవ చేస్తూ దాసూలుగా ఉండమంటే బ్రతకనిస్తారా?

ఇరవై యేండ్లవఱకూ గురుకులావాసం చెయ్యమంటే వింటారా? వేదాధ్యయనం ప్రతి ద్విజుని కర్తవ్యమూ అంటే యెంత మంది చేస్తున్నారు? అగ్నిహోత్రాలెంతమంది ఆరాధిస్తు న్నారు? గృహస్థధర్మాలెంతమంది అనుసరిస్తున్నారు? అతిథి సత్కారాలూ అన్నదానాలూ ఆ వితరణా యెక్కడ పోయినవి? వయసుమళ్ళుతూనే వానప్రస్థం తీసుకొని వనంలోకి పొమ్మంటే, వింటారా? మరీ ఒక వగలాడికి మగడై వయసువారి పక్క చూస్తే వాపోతాడు కానీ!

ఇట్లాంటివాటి కన్నిటికి ప్రాచీనశాస్త్రాలూ, ధర్మాలూ చూడవలసిన పనిలేదు. వానిని తఱచిచూడ నవసరము లేదు. ఇదంతా చాదస్తము, ఒక ప్రక్క అధికారంలో ఉన్న వాళ్లు, వాళ్లు వ్రాసుకున్న పుస్తకాలనడమూ, పోనీ మనమూ అలాగే తెలిపితిమా దూత్ బాత్ యిదంతా పరకీయమూ ఇమిటేషనూ, మన ధర్మశాస్త్రాల్లో ఇవి చెప్పినారా అనడమూ.

అట్లా పూర్తీ పాతకాలంలో రకంగా పోదాం పదండి. అచ్చం అట్లాగే మరీ స్వయంపోషకాలు చేద్దాం గ్రామాలను అంటే అదంతా కుదరదు. పై కెవడైనా అన్నా తమ అధికారం సాగవలసిందే. వ్యాపారాలు విచ్ఛిన్నంగా జరగాలి. విదేశ వస్తువులన్నీ విచ్ఛిన్నంగా జరగాలి. విదేశ వస్తువులన్నీ కావాలి. ఇంకా వీలైతే మనుషులతో కూడా.

ఇంటా వంటా యితరులవే కావాలి. ఆ డిన్నరులూ, ఆ టీలూ, ఆ ఆటలూ, ఆ పాటలూ, ఆ బోటులూ, ఆ చోటులూ, ఆ బాటలూ, ఆ వేటలూ, ఆ విహారాలూ, ఆ అసెంబ్లీలూ, ఆ కౌన్సిళ్ళూ, ఆ పాయింట్ ఆఫ్ ఆర్డర్లూ, ఆ అమెండ్మెంటూలూ, ఆ ప్రెసిడెంటూ సెక్రటరీ పదవులూ అబ్బ కాయితాలు చాలవు. ఇవన్నీ కావాలి. ఇవన్నీ పరదేశాలవి కావు. కానీ, ఆ పరదేశాల నుంచీ దిగుమతే అయిన ఈ వెధవ సమాజవిధానం బాగు చెయ్యడానికీ, యీ పరపీడనను నిర్మూలించడానికి, యీ దరిద్ర నిరుద్యోగాలను విచ్ఛిన్నము చేసి ప్రపంచంలో శాంతి సౌభాగ్యాలను కేవలం యేజన్మత: ఒక వర్గానికి చెందిన యంబ్రహ్మలకో కాక నలుగురికీ సంబంధించినవిగా చేయడానికేవిధానమైన ఆలోచిస్తామంద్రా అంటే, ఊహూహూ. ఇదంతా మైల–

ఏం కొట్టుకొనేది? ఇదంతా, యెక్కడికి దారితీస్తుంది? కేవలం స్వార్థం కోసమే కొన్ని విషయాలలోనైనా వీరు ప్రాచీనుల పేరైనా యెత్తడానికి యిష్టపడుతున్నారు కానీ మరింకేమీ కాదని యేకాస్త ఆలోచనాశక్తి ఉన్నవానికైనా అర్థం కావడం లేదూ? అర్థమైనా బయట కనరులే. అనేవాడు అందఱికీ చెడ్డ. నిజమాడితే – నిష్ఠూర్యం, ఏం చేస్తాం?

కాలం!

కాబట్టి పాతకాలంది కాదు కాబట్టి విదేశీయం కాబట్టి యేసిద్ధాంతమో ఆచరణో పనికిరాదనడానికి వీల్లేదు. అని తేలినట్లేనా?

**– 3 ఫిబ్రవరి 1940, సాధన పత్రిక**

# ప్రభాతభేరీ

– యం.వి. శాస్త్రి

**మా**లతి యెంత అమాయకపు పిల్ల ? ఆమె చూపుల్లో ఒక విధమైన చాకచక్యము న్నట్లు లోకం అనుకొంటుంది. స్వభావ సిద్ధములైన చూపుల్లోను, ముత్యాలతళుకు వంటి శరీరచ్ఛాయలోను, దూదిపింజల వంటి చెక్కిళ్ళతోను, చిరునవ్వు చిందుతూ వుంటే కన్గొన ల్లోను, తుమ్మెద పిల్లల వంటి ముంగురులలోను ఒక విధమైన అవ్యాజ సౌందర్యం తొల కాడుతూ వుంటుంది. మాటల్లో కూడా మాధుర్యం వుట్టిపడుతూ వుంటుంది. వుంటే మాత్రం యేమిప్రయోజనము? సమయోచితముగా ఆ సౌందర్యాన్ని వుపయోగపెట్టుకొనుట ఆ అమాయకురాలికెట్లు తెలుస్తుంది ?

ఒకర్ని చూచైనా నేర్చుకొంటుందనుకొంటే అదొక పల్లెటూరి 'చాందసమా' అంటే 'ఓ' అంటుంది. వారి యింట్లో వాళ్ళు నాయనుకు దాదాపు అరవైయేండ్లుంటాయి. తెల్లవారు జాముననే లేచి స్నానము చేసి అహ్నికానికి కూచుంటే మధ్యాహ్నము పన్నెండు గంటలైనా పైకిలేవరు. అంతవరకూ 'మికోమికో' అంటూ వుండవలసినదే.

తండ్రి విశ్వనాథంగారు ఛాందసుడుగా వున్నా చాలా మంచివాడు. చుట్టూ ముట్టూ బాగా పలుకుబడి ఉంది. వూళ్ళో యేవిషయాన్నయినా అంతా కలిసి మాట్లాడుకోవలెనంటే ఆయన యింటి దగ్గరకే రావలెను. యెటువంటి క్లిష్టసమస్యసైనా క్షణంలో తీర్చివేస్తాడు. బాగా శాస్త్రపరిచయం కలదు. ఇప్పటివాడు కాకపోయినా ఆయనకు తిలక్కు, గాంధి అంటే చాలా భక్తి విశ్వాసాలు. కూతురు పెండ్లికని ఐదువేల రూపాయలు దగ్గర దాచి ఉంచు కొన్నాడు. బాగా ఖర్చురాటీగానే పెళ్ళి సాగించవలెననుకొన్నాడు. వరాన్వేషణానికై బిడ్డనుకూడా వెంట పిలుచుకొని పోవలెననే ఆయన అభిప్రాయం.

అనుకొన్ననాడు వాండ్ల వూళ్ళో గాంధీగారి వర్ధంతి పాటించడం వలన ప్రయాణము ఆగిపోయింది. ఈ కార్యక్రమానికంతా విశ్వనాథం గారే అధ్యక్షత వహింప వలసినదిగా గ్రామస్థులంతా కోరుకొన్నారు. అదే ప్రకారం ఆయన కూడా ఒప్పుకొన్నాడు. రేపు వర్ధంతి అనగానే ఈ రాత్రికే అగ్రహారం నుండి ప్రసాదరావు గారూ వారి కుమారుడు మాధవరావు కూడా స్వంత బండ్లో వచ్చి ఆ వూరి కరణంగారింట్లో బసచేసినారు. మాధవుడంటే ఆచుట్టూ యువకవర్గానికి దండనాయకుడు. ఇంగ్లీషులో అంతపరిచయం లేకపోయినను తెనుగు సంస్కృతము బాగా చదువుకొన్నాడు. మంచి అందం అంటే అతని సొత్తే.

ఊరంతా పచ్చతోరణాలతో అలంకరించినారు. యే యింటి మీద జూచినా జాతీయ పతాకమే. ఇట్లా పల్లె ఒక దేవమందిరంవలె పవిత్రంగా ఉంది. మాధవుడు తెల్లవారు జామువనే దివ్యకంఠముతో వందేమాతరమ్ పాటపడుకుంటూ పిల్లలకు చెప్పిస్తూ బయలుదేరినాడు ప్రభాతభేరీ.

విశ్వనాథం ఇంటి వసారాలో గాంధిగారి పటమున్ను, శ్రీ బాలగంగాధర తిలక్

మహాశయుల పటమున్ను, అరటి స్తంభాలతో అలంకరింపబడిన మంటపములో పెట్టి వాటిని పూలహారాలతో అలంకరించి పూజాగృహం నిర్మించినారు. పంచదీపస్తంభములు రెండు వైపులా దివ్యకాంతులతో ప్రకాశిస్తు వున్నవి. భారతమాత పటము కూడా మధ్య పూలమాలలతో దేదీప్యమానంగా ఉంది.

అట్టి పవిత్ర గృహద్వార సమీప చిత్రానికి మహానందముతో మాధవుడు అట్లా కొంతసేపు నిలబడి జోహారుబెట్టి 'వందే వందే భారతమాత' అనే గీతాన్ని వీణామధుర కంఠముతో పాడడం ప్రారంభించినాడు. అమరగానాన్ని నిద్దురమంపరంలో విని మాలతి తన్మయత్వమును పొందింది.

తెల్లవారింది పల్లెఅంతా ఆరోజున నవయుగారంభ సంరంభాన్ని కాంచగలిగింది. తను ఇంట్లో ప్రతి రోజూ స్వంతంగా వడికిన నూలే ఇంటి వాళ్ళందరికీ కావలసినన్ని దుస్తులకు సరిపోయేటట్లు వడికిపెట్టేది. సన్నని దారంతో కుచ్చులేచేసి మాలగా కట్టింది మాలతి. తలంటి నీళ్ళుపోసుకొని తానే సన్నగా వడికిన దారముతో నేయించుకొన్న చీరను కట్టుకొని యీ సంరంభాన్ని చూడవలెనని వచ్చింది.

వూరి నడుమ మంచి విశాలమైన ప్రదేశంలో ఎత్తుగా ఒక వేదిక పచ్చతోరణాల తోను, జాతీయ జండాలతోను అలంకరించబడింది. దానికి సమీపముననే యెత్తయిన జాతీయ పతాకమును కూడా అమర్చియున్నారు. జనమంతా నూలుగింజ నేలబడటానికి వీలులేకుండా వచ్చిచేరినారు.

నాటి సభకు అధ్యక్షతవహించిన శ్రీవిశ్వనాథంగారు జాతీయపతాకపు చరిత్ర ముక్తకంఠముతో జనానికి సువ్యక్తమయ్యేటట్లు ఉపన్యాసం చెప్పినారు.

వారి వుపన్యాసము ముగిసింది. స్నేహితులంతా మాధవుని మాట్లాడమని కోరినారు. మాధవుడు కూడా మహాముచ్చటగా సులభశైలిలో వుపన్యాసం చెప్పుతూ వుంటే జనమంతా తదేక దృష్టితో అతనితట్టు చూస్తూన్నారు. మాలతికూడా ప్రేమామృత దృష్టులతో అతనినిచూస్తూ వూహాప్రపంచములో అతని బాహువల్లరిని జిక్కినట్లు కలగనింది. ఆకారణ ముగా ఆమె పెదవుల నుండి చిరునవ్వు దారాలంగా మూతలాడసాగింది. ఆ తన్మయత్వములో అతని వుపన్యాసములో యేం జరిగిందో తానేమి వినిందో. వుపన్యాసము పూర్తి అయింది.

ఆ సాయంత్రం గోధూలి లగ్నంలో వీధిలో ఉత్సవం బయలుదేరింది. మాధవుడు తనచేతిలో మహాత్ముని పటము ధరించి కంఠంలో పూలహారాలు వేసికొని జయ జయ ధ్వానములతో ముందు నడుచుచున్నాడు. మహాత్మునికి కాయ కర్పూర మంగళారతులు ఇస్తూ వచ్చినారు ఇంటింటా. విశ్వనాథశర్మ గారింటికి వచ్చేటప్పటికి మాలతి మంగళ ద్రవ్యములు చేతపూని నిలుచున్నది. మాధవుడు ఇంటి ఎదురు నిలువగానే కాళ్ళుకడిగినది. పూవులుకాయలు వెంట వచ్చినవారిచేతికిచ్చినది. కుడి చేతిలో తాను స్వయంగా కూర్చి యుంచిన హారమును గాంధీపటమునకు వేయుటకు మారుగా మాధవుని మెడలో వేసినది.

జనులు కరతాళధ్వనులు చేసినారు. మాధవునికి లజ్జ ఉదయించినది. మాలతి గూడ, చేసినది తప్పని కాబోలు, సిగ్గుతో తలవంచింది.

ఇంతలో మాధవునికేమి తోచెనో ఏమోగాని చేతనున్న పటమును ప్రక్కవారి కందించి తన కంఠహారములను మాలతి మెడలో వేసినాడు. మరల కరతాళ ధ్వనులు చెలరేగినవి. విశ్వనాథంగారి కనులలో ఆనందాశ్రువులుదయించినవి. అప్రయత్నంగా ఆయన ముఖమునుండి వివాహ మంగళశ్లోకములు బయలుదేరినవి.

గుమిగూడిన ప్రజలు ఉత్సవము ఈ విధముగా సుఖాంతముగా పరిణమించి నందుకు సంతోషాశ్చర్యములు పెనుగొన వధూవరులను వెంటనే బండినెక్కించి మెరవణి చేసిరి. విశ్వనాథశర్మ పెండ్లికి గాను తీసియుంచుకొన్న ఐదువేలను కాంగ్రెస్ నిధికి ఇచ్చి వేసెను.

**– 10 ఫిబ్రవరి, 1940, సాధన పత్రిక**

*(కథకుడి వివరాలు తెలియవు)*

# ప్రాణస్నేహితం

– విద్వాన్ విశ్వం

అనంగా అనంగా ఒక పల్లెలో ఒకాయనుండేవాడు. అమాయకుడూ చాలా మెత్తని మనస్సు గలవాడూ.అతడు ఒక చిన్నపూలతోట వేసుకొని అందులోనే చిన్న గుడిసెలో కాపురంచేసేవాడు ఏకాకిగా.

ఆ తోటలో అన్ని రకాల పూలు పూస్తాయి. ఒకటిపోతే ఒకటి పూస్తూండడం వల్ల యెంతో ముచ్చటగా కనబడుతూండేది అతని తోట. ఆ పూలు కోసుకొనిపోయి పక్కనే వున్న పేటలో అమ్ముకొని వచ్చిన దానితో పొట్టబోసుకొనేవాడు.

అతనికి చాలా మంది నేస్తగాళ్ళున్నారు గానీ వాళ్ళల్లోకెల్లా ఒక షావుకారి ప్రాణ స్నేహితుడు. అతడెప్పుడు పక్కన వెళ్ళిపోతున్నా ఒక మాటు తోటలోకి వచ్చి ఇతనితో మాట్లాడి అక్కడున్న పూలు కొన్ని తీసుకొని పండ్ల కాలమైతే నాల్గుపండ్లు జోబీలో వేసుకొని పోయేవాడు.

"స్నేహితులన్న తరువాత యేమీ భేదం ఉండకూడదు" అంటూండేవాడా షావుకారి. ఆ మాటలు వింటుంటే పొంగిపోయేవాడు మన తోటమాలి. అంత గొప్ప అభిప్రాయా లుగలవాడు తనకు స్నేహితుడుగా ఉన్నందుకు గర్వపడేవాడు.

ఇరుగూపొరుగూ అమ్మలక్కలు మాత్రం కొన్నాళ్ళకు గుసగుసలు ప్రారంభించినారు. "ఇదేమిటిదమ్మా అంతపెద్ద షావుకారైనా ఒకనాడన్నా యేమాత్రమూ తోటమాలికి సాయం చేయడు. పెద్దమిల్లూ, ఆవులూ, గొఱ్ఱెలూ, భూములూ కావలసినన్ని వుండేవాడు 'ఇదోయిది పట్టు' అని ఒకసారి కాకపోతే ఒకసారయినా అనడు. పైగా తోటలో మంచి మంచి పూలేమో లేపుకొని పోతూంటాడు" అంటూ అక్కడాయిక్కడా మనలో మాటంటూ మూతిత్రిప్పేవారు.

కానీ మన తోటమాలి కవేవీ బట్టలేదు. ఆ షావుకారి స్వార్థరహితమైన స్నేహాన్ని గూర్చీ అందులోని వైశిష్ట్యాన్ని గూర్చీ చెప్పే వుపన్యాసాలు వింటూ మైమఱచిపోయేవాడు.

మిగతా అప్పుడంతా ఆ చిన్న తోటలో అవీయివీ పండించుకొని తృప్తిపడుతున్నా పాపం పూర్తీ మంచుపడే కాలంలో మాత్రం యే పూలూ పూచేవికాదు. పండ్లూ పండేవికావు. అపుడు మాత్రం తిండికి కూడా దొరికేది కాదు. యేవో గడ్డలు కాల్చుకొని తినేవాడారోజుల్లో. అప్పుడు తన స్నేహితుడు ఒక మాటైనా వచ్చేవాడు కాదు.

ఆ షావుకారి పెండ్లాంతో అన్నాడు కదా "నా స్నేహితుడైన తోటమాలిని యీ మంచు కాలంలో పోయి చూడదలచు కోలేదు. యేదో బాధపడుతున్నప్పుడు స్నేహితులను చూడడం చాలా కష్టము. వారిని ఒంటరిగా వుంచడమే మంచిది. మనలిని చూస్తే పాపం మరీ దు:ఖపడతారు. యీ కాలం పోయి వసంతం వచ్చిందంటే తప్పకుండా వెళ్లి విచారిస్తాను. పాపం యెంతవద్దన్నా యెన్నో పూలిస్తాడతడు. అవివ్వడంవల్ల అతనెంత ఆనందపడతాడను కున్నావు. నేనంటే ప్రాణం విడుస్తాడు, పాపం!"

"నిజంగా మీరు బలే సూక్ష్మంగా ఆలోచిస్తారండీ. మీరివన్నీ చెబుతూంటే యెంతో వినబుద్దవుతుండండీ. యెన్ని ధర్మశాస్త్రాలు తెలుసునండీ మీకు. పురాణం చెప్పే శాస్త్రులు కూడా యిన్ని చెప్పలేడనుకుంటాను" అనిందాతని భార్యా శిరోమణి హాయిగా దిండ్లువేసిన సోఫామీద ఆనుకొని కూచొని.

"నానా నానా !! పాపం ఆయన కష్టపడుతూంటే యిక్కడికెందుకు పిలుచు కరాకూడదూ. నా బొమ్మలూ పావురేవులూ అన్నీ చూపిస్తాను.నాతో కూడా అన్నం తింటాడు. కథలు చెప్పుకుంటూ ఉంటాడు" అన్నాడు వాళ్ళ చిన్న పాపోడు.

"ఓరి పిల్ల వెధవా ; స్కూలుకు పోతున్నా నీవేమీ నేర్చుకోలేదన్నమాట. పాపం అతగాడిక్కడికివచ్చి మన తిండీ మన మంచాలూ కుర్చీలు మేడలూ యివన్నీ చూస్తే అతనిలో అసూయ మొలకెత్తుతుంది. అసూయ అనేది చాలా ఘోరమైన దుర్గుణము. స్వభావాన్నే నాశనంచేస్తుంది. అతని సత్ప్రవర్తన దుర్గుణభూయిష్టం కావడం నాకిష్టములేదు. నా స్నేహితుడు చెడిపోతే నేను చూస్తానా?" అని కసురుకొన్నాడు.

వసంతం వచ్చింది. మరీ పూలు పూసినవి యధాప్రకారం మన షావుకారి వచ్చినాడు. "పాపం యిన్నాళ్లు చాలా కష్టపడినావేమో యెట్లా కాలం గడిపినావో యేమో యేం చేస్తాము. ప్రపంచమే కష్టాల కాలవాలమైనది. వెన్నెల కొన్నాళ్లు చీకటి కొన్నాళ్లు" అంటూ విచారం తెల్పినాడు.

"యేదో పస్తో అస్తోపడి కాలంగడిపినాను. మీరు మాత్రం విచారించినదానికి చాలా కృతజ్ఞుణ్ణి. ఇప్పుడేం పరవాలేదు. అన్నీ బాగా పూసినవి" అన్నాడు మొగమంతా వికసింప జేసుకొని.

"నిజంగా నీవెంత అవస్థపడుతున్నావో అని దినమూ నేనూ నా భార్యా అనుకునే వాళ్ళము. ఆమె పాపం కళ్ళనీళ్ళు పెట్టుకొనేది అనుకున్నప్పుడు. రోజాపూలీసారి బాగా పూసినాయా?"

"ఔను ఇవన్నీ యీ దినం అమ్మి మరీ నా సామాన్ల బండి వెనక్కి తెచ్చుకుంటాను"

"అంటే అది అమ్మివేసినావా ? అట్లా యెవరైనా చేస్తారా?"

"చెయ్యకేం చెయ్యను? అన్నం కోసమే నాకున్న వెండి గుండీలూ గొలుసూ మొలతాడూ అన్నీ అమ్మివేసినాను. అవన్నీ యింక వెనక్కి తెచ్చుకోవలె."

"నేనిస్తాను, కాసింత పాతబడిందనుకో. అయినా రిపేరీ చేస్తే బాగా పనికొస్తుంది. ఇదిస్తే అందరూ యెంత దూబరదిండిరా అనుకుంటారు. అయినా అదేమో నాకు స్నేహితులంటే ఆ భేదమే కన్పడదు" అన్నాడు.

"అందుకో చెక్క కూడా నాదగ్గఋంది రిపేరీ చేసుకుంటానులే " అన్నాడు.

"యహా! నాకూ చెక్క కొంచెం అత్యవసరంగా కావలెను. యిస్తావు కదూ"

"తప్పకుండా"

"సరే గానీ యీసారి పూలు మరీ యెక్కువగా యివ్వకు, యేవో కాసిన్ని ఈ బుట్టనిండా వేసి పంపు"

మింగలేక కక్కలేక అందులో స్నేహాన్ని తలంచుకొని ఆ పూలూ కాస్తా బుట్టలో పడేసినాడు.

సరే మరసటినాడు ఒక సంచి పండ్లు బజారుకెళ్లి పడేసి రమ్మన్నాడు. పాపం యెంతో పనున్నది. నీళ్ళు పోసుకోవాలి చెట్లకు. యెటూ నీవు తెచ్చుకోవడానికి రావాలికదూ అన్నాడు. ఆ యెండలో మోసుకొనిపోయి వచ్చేటప్పటి కలసిపోయి పొద్దెక్కె వరకూ పండుకున్నాడు.

పొద్దున్నే షావుకారి వచ్చినాడు. "యేమింత సోమరివైపోతున్నావు, యింతసేపు పండుకో రాదు సుమా! సోమరితనం చాలా చెడ్డది. నేను స్నేహితడను కాబట్టి కలుపుగా వున్నా నీ క్షేమం కోసం చెబుతున్నాను అంటూ ధర్మపన్నాలు చదివినాడు.

ఇట్లా ఒకటా రెండా; దినమూ యితనితో పనిచేయించుకొంటూండేవాడు. పైగా అతని భార్య "అన్నా! అన్నా! మీ బావ కెన్నిసార్లు చెప్పినా చెవున్నే వేసుకోడు; యీ పని చేసిపెట్టు" మని చెప్పంపేది.

వాళ్ళ పనుల్లో సగం పనులితని నెత్తినవేసుకొని చేస్తుండేవాడు. వీటన్నిటికీ ప్రతి ఫలం ఆయన స్నేహాన్ని గూర్చిన వుపన్యాసాలు వినడం. అతని పూలతోట చూచుకో వడానికి కూడా పురసత్తులేదు. అయినా ఆయనంత పెద్దవాడు చెబితే వినకపోవడమా; అందులోనూ సామాన్ల బండి ఇస్తాడు గదా' అనుకొనేవాడు.

ఒక రాత్రి బోరుమని వానా గాలీ కొడుతూంది. గాఢాంధకారం. కొట్టమంతా నీళ్ళుకారుతున్నవి. అట్లే కూచొని వణుకుతున్నాడు తోటమాలి. వాకిలి చప్పుడైతే తీసినాడు. యెదురుగా ఒక చేతిలో గొడుగూ యింకొక చేతిలో లాంపూ పట్టుకొని షావుకారి నిలబడినాడు.

"మా అబ్బాయి గోడమీద నుంచీ క్రిందపడినాడు. చాలా దెబ్బతగిలింది. డాక్టరును పిలుచుకొని రావాలి. చాలా దూరంలో అతడున్నాడు. నేను పోతే యింట్లో యెవరూలేరు. యెట్లయినా నీవు పోయి పిలుచుకొని వస్తే తప్ప వీలులేదు. నీకన్నా నాకు ప్రాణస్నేహితులింకె వరున్నారు?" అన్నాడు.

"తప్పకుండా పోతా" నంటూ లాటీనువైపు చూచినాడు. "అయ్యో పాపం చీకటి! ఈ లాటీను లేకపోతే నేను పోలేను యేం చేస్తాం తప్పదు. యెట్లాగో వెంటనే డాక్టరును పిల్చుకొనిరా" అన్నాడు.

గాలి; వాన; కటికి చీకటి. యెట్లాగో మొండి ధైర్యంతో డాక్టరుండే పక్కవూరికి వెళ్ళినాడు. ఆయన కెంతో నచ్చజెప్పి తక్షణమే బయలుదేరకపోతే పిల్లవాడికి అపాయమని బయలు దేరేటట్లు చేసినాడు.

వెంటనే డాక్టరు టార్చి తీసుకొని ఉలను గుడ్డలన్నీ వేసుకొని రైనుప్రూపు కోటుతో గుఱ్ఱం మీద కూచొని బయలుదేరినాడు.

తోటమాలి వెంట పరుగెత్తుతున్నాడు. అదంతా కొండలూ చెట్లూ, కొంత దూరం పోయే టప్పటికి దారి తప్పిపోయింది. కాలుజారి కిందపడపోయినాడు. ప్రాణం యెగిరిపోయింది.

మరసటినాడు గొల్లవాళ్ళకాతని శవం కనబడింది నీళ్ళల్లో తేలుతూ. వారాతని శవాన్ని గుడిసె దగ్గఱకు తెచ్చినారు.

ఆ చుట్టూపట్టు వాళ్ళందఱూ చేరినారు అంత్యక్రియలకు. మన షావుకారి అందులో ప్రథముడు. ముఖ్యుడు కాబట్టి తొట్టతొలుత బయలుదేరినాడు వూరేగింపులో. అప్పుడప్పుడూ చేతిగుడ్డతో కనులొత్తుకొనేవాడు. అంత్యక్రియలయిపోయినవి.

"నిజంగా చావవలసినవాడు కాదండీ. ఎంత దయగలవాడని, తనపనెంతో తానెంతో ఒక్కమాట ఒకరిననేవాడుకాడు" అన్నాడొకాయన.

"నిజంగా నాకిదొక పెద్దదెబ్బ. నాకు కుడిభజంలాగా వుండేవాడు. నాకెంతో స్నేహితుడు. పాపం! యేంచేస్తాం. యెంత అయుస్సో అంత. అయినా యీ సంగతి వింటే నాకు ఆహారమే యిందడం లేదు" అంటూ నిట్టూర్చినాడు.

మరసనాటినుంచీ ఆ తోటలో తన స్నేహితుని జ్ఞాపక చిహ్నంగా ఒక అరుగువేసి స్నేహితుడు పోయినాడని తోటను విడిచిపెడితే దాన్నెవరు చూచేవాళ్లనే ఉదార హృదయంతో తానే దాన్ని చూచుకుంటూండేవాడు.

ప్రాణస్నేహితమంటే మరి సామాన్యమా?

సరేగానీ ఇంతా చదివినారు గదా? ప్రాణస్నేహితుడెవరో చెప్పగలరు? చెప్పేవాడా? చేసేవాడా

**– 23 మార్చి, 1940, శ్రీసాధన పత్రిక**

# భవతీ భిక్షాం దేహి

- విద్వాన్ విశ్వం

**"అ**మ్మా !భిక్ష."

"పోయి రాప్పా"

"ఔను, పోయిరావలెను. ఎక్కడికో? తిరిగి రావలెను. యెప్పుడో?"

... ... ...

"తల్లీ కవళం"

"ఇంకా మా భోజనాలే కాలేదు. నీకు వంగదోసేవారెవరు?"

"నిజమే. వారేతినంది నాకెందుకు పెడతారు. తిన్న తరువాత మాత్రం పెడతారని నమ్మకమేముందిలే"

... ... ...

"మాదా కవళం తాయీ"

"ఇంట్లో యెవరూలేరు. పోయిరా"

"ఎవరూలేరు. ఆ మాటచెప్పేబదులు అంత కడి వేయగూడదూ? భిక్షం వేసేవారు వేరే వుంటారేమో?"

... ... ...

"అమ్మయ్యా అన్నం"

"అమ్మయ్యను పిల్చుకొనిరాపో అన్నం వేయిస్తాము. అదే లేక మేమూ చస్తున్నాము"

"అమ్మయ్యను పిల్చుకొనిరావలెను. అమ్మయ్య వుంటే నాకు మాత్రం యీగతెందుకు పడుతుంది?"

... ... ...

"నాయనా దమ్మిడీవుంటే పారెయ్యరాదూ"

"చిల్లరుందా అణాకు?"

"అణాకే చిల్లరుంటే అడుగుకోవలసిన అవస్థేముంది"

... ... ...

"ఆకలి ! అంత గంజిపోస్తే చాలు"

"అయ్యో ఇప్పుడే పారబోస్తినే. కొంచెం ముందు రాకూడదా?"

"అవును. ముందే రావలసింది."

...    ...        ...

"అమ్మా  గంజి"

"ఇంకా  వార్చలేదు.  కాస్త  నిలిచిరా."

"ఇంకా  నిలిచిరావలెను."

...        ...        ...

"అబ్బ పొద్దున్నుంచీ తిరుగుతున్నాను తిండి మొగం చూచి మూన్నాళ్ళయింది. పిడికెడు మెతుకులు  కరవైనవి.

అంబరాలంటే మిద్దెల్లో అన్నీ అనుభవించేవారూ వున్నారు. అదే మేడల కింద నావంటి అనాథలూ  వున్నారు.

వ్యత్యాసాలు ; విరోధాలు."

...    ...        ...

అతడొక అనాథుడు. విశాలమైన నుదరూ వెడల్పైన కళ్లూ. ఆరిపోతున్న దీపాల్లా వున్న ఆ కళ్ళల్లో నుండి వెలుతురు విరజిమ్ముతున్నాడు.

బక్కచిక్కిన శరీరం. పాపం కాళ్ళీడ్చుకుంటూ పోతున్నాడు. చేతిలో మట్టిపాత్రొ కటుంది. అందులో  యేమీలేదు.

ఆ శూన్యమూ అతనూ అవినాభావంగా ఆ వూరంతా తిరుగుతున్నారు అదేమోయన. అంత  కడీ  దొరకలేదు.  గంజీ  దొరకలేదు.

అతడు ఆశ్రయించని పంచలేదు. అడగని అమ్మలేదు. కానీ, యెవరూ పెట్టిన పాపాన పోలేదు.  అపసోపాలు  పడుతూ  అట్లే  పోతున్నాడు.

సత్రంలో  భోజనాలు  పెడుతున్నారు.  కానీ  బ్రాహ్మణ  భోజనాలింకా  కాలేదు.

ఇంటిలో మనుషులో దిక్కులేనంత మంది. కానీ యెవరూ లేరన్నారు. లేదా పనిమీద వున్నారేమో.

విద్యార్థులు వికవికా నవ్వుతూ ఇస్పేటాకులాడుతున్నారు. అమ్మను పిల్చుకొని రమ్మన్నారు.

పది పలహారాలుతిని కిల్లీ సిగరెట్టుతో బయటికివస్తూ అణాకు చిల్లరిమ్మ న్నాడింకొకాయన.

ఒకామె  గంజివార్చలేదు.

ఇంకొకామె  పారబోసింది.  ఆమె  నిల్చిరమ్మనది.

యీమె  ముందే  రాకపోతివా  అన్నది.

పట్టణమంతా హడావిడిగా వుంది. పదులూ నూర్లూ వ్యాపారాలు జరుగుతున్నవి. పడుతూ లేస్తూ  పనులు  చేసుకుంటున్నారు.

పండుగరోజు, బొమ్మలపండుగ, విజయదశమి, ఇళ్లల్లోనే కాదు. వీధుల్లోనూ బొమ్మలు వేడుక గొల్పుతున్నవి.

... ... ....

కానీ

తిండి దొరకలేదు.

కళ్ళు మబ్బులు గప్పుతున్నవి.

తల తిరిగి పోతున్నది.

కాళ్లు తడబడుతున్నవి.

గొంతారి పోతున్నది.

ఆకలి మాడ్చివేసే అతని కడుపుమంట. అతనికే తెలుసు. ఆశాకం యితరుల కంటే పనేముంది?

"అబ్బ! "

మెల్లగా వూరిబయటికి పోతున్నాడు.

వీధి దాటేలోపల నాల్గుచోట్ల కూచున్నాడు. ఎవరింటిముందు కూచున్నా పాపం ముగ్గా యరమన్నూ పెట్టి కళకళా పెట్టుకున్న యింటికీ అనాథుడు కళంకంగా తోచి వారు వెళ్ళగొడుతున్నారు.

ఎట్లో వీధి దాటినాడు. ఇంక చేతకాలేదు. అట్లే ఒత్తగిలపడినాడు.

అదొక కొట్టం. ఈతాకు కొట్టం. అక్కడేమో పండుగ చిహ్నాలు కనబడలేదు. అయినా యేదో పొగ వస్తూంది. గంజివాసన కొడుతూంది.

ఆ వాసనైనా పూర్తీ చూస్తే ఆకలి కొంత వరకు తగ్గుతుందేమో అనుకున్నాడు. యేమో వాసన చూసినా అది మైలపడితుందేమో.

అడుగుదామా కాసిని మంచినీళ్ళయినా అనే ఆశ పొడమింది. కానీ "ఛా యింక ఆమాటే అనుకోరా"దనుకున్నాడు. అప్రయత్నంగా 'అమ్మా' అన్నాడు.

అంతలోనూ దిటవు చేసుకున్నాడు. యీ వెధవ బిక్షపాత్రే యింతాచేసింది. అన్ని చోట్లా వ్యర్థమైన కోరిక యిక్కడ మాత్రం నెఱవేఱుతుందా?

'అభాగ్యజీవికి అన్నంలేదు" ఆ ఆక్రోశం తలకెక్కింది. తల తిరిగిపోతున్నది. ఆ పాత మట్టి బిక్షాపాత్రను తీసుకొని నేలకు విసిరికొట్టినాడు. ముక్కముక్కలై పోయినది. చరాలునలేని వెళ్ళిపోతూవున్నాడు.

లోపలి నుండి గిన్నె నిండా గంజి తీసుకొని ఇల్లాలు బయటికి వచ్చింది.

"నాయనా  గంజిపోస్తానుపట్టు"

తిరిగి చూచినాడు, తటుక్కున మొగం తిప్పుకున్నాడు.

"వద్దుతల్లీ; వద్దు, బిక్షాపాత్ర పగిలిపోయింది. మరీ ఆదరిద్ర దేవతాపతాకాన్ని తగులదలచుకోలేదు."

"కాస్త తాగునాయనా; నీరసంగా వున్నావు. చేతులో పోస్తాను"

"వద్దమ్మా వద్దు; అభాగ్యజీవికి దేశంలో అన్నంలేదు. అభాగ్యులందటికి భాగ్యం కలిగేవఱకూ అన్నం దొరకదు."

అంటూనే యెక్కడాలేని ఆవేశంతో ఆ అంధకారంలోకి చొరుచుకొని పోతూనే వున్నాడతడు.

**– 12 అక్టోబరు, 1940, శ్రీసాధన పత్రిక**

# ప్రళయ దీపావళి

**– విద్వాన్ విశ్వం**

**దీ**పావళి, బలే సందడిగా వుంది అనంతపురం. ఎక్కడా వేడుకలూ, విహారాలే. బిడ్డలనూ అల్లుళ్ళనూ పిల్చుకొనివచ్చి తమ కుండలో కలిగింది చేసిపెట్టి సంతోషపడుతున్నారు పెద్దముత్తయిదువలు.

అత్తగారిచ్చిన దుస్తులను అంతో యింతో అతృప్తిపడినా కట్టుకొని ఠాక్ ఠీక్‌గా బజార్లల్లో పారాడుతున్నారు కొత్త అల్లుండ్లు. అల్లుండ్లకన్నా ఆడబిడ్డలది మరీ బడాయి. అందులో కాస్త సంపన్నులైతే పట్టపగ్గాలు చాలవు.

అన్నీ యిన్నీ కాదు, గంపెడేసి పూలు పెట్టుకొని అటూ యిటూ తళాయిస్తూ దీపాలులేకనే దీపావళి సృష్టిస్తూన్న కన్నెల సౌభాగ్యం సౌందర్యం నిజంగా చూడతగినది. అంతేకాదు వారు లీలామూర్తులు. నడుస్తూ నడుస్తూన్న కవితాకన్యలు వారు.

అతనికి అన్నెమూపున్నెమూ తెలియనప్పుడే అభాగ్యానికి అంకితమై పోయినదాతని జీవితం. అంతకన్నా అతని పూర్వచరిత్ర మనకు తెలీదు.

పొద్దున్నే లేచినాడు. ఉన్న దొంటరిగా, రాత్రల్లా చదువుకొని లేచేటప్పటికే తొమ్మిది గంటలైంది. హెూటలుకు బయలుదేరినాడు.

… … …

“ఏమండీ డబ్బీదినం కావాలి ”

“ఇస్తాను ! తప్పకుండా సాయంత్రమిస్తాను”

“మాకు చాలా అవసరంగా వుందండీ, నెలలు నెలలు ఆపడం యెట్లా వీలవుతుంది.”

“నిజమే ఈ వొక్కనాడూ ఆగండి.”

“చిత్తం, క్షమించండి. ఇక్కడికే అకౌంటు పెరిగింది. ఈపూట డబ్బిచ్చి తినండి. మరీ ఆ మొత్తం తెచ్చిస్తురు కానీ ఈ దినం దీపావళి. లక్ష్మీపూజ”

“ఆc –”

… … …

నిజమే. వారికీవలసిన మొత్తం యిరవై రూపాయలయినది. ఇంకా యెన్నాళ్లని యిస్తారు. పోనీ ఉన్న స్నేహితులందటినీ ఊడ్చివేసినాడు. యింక అడిగితే వారెవ్వరూ యివ్వరు. అతనికో వూహ అంతట్లోనే తట్టింది. అతని పాతస్నేహితుడొక్కడు జ్ఞాపకం వచ్చినాడు. సరే, అతని దగ్గఱకు పోదామని పయనమయినాడు.

వారిల్లు మూడోరోడ్డు కడాపట వుంది. చచ్చీ చెడీ కాళ్ళీడ్చుకుంటూ పోయినాడు. అప్పటికే పదకొండయింది. పోయి వాకిలి తట్టినాడు. బదులు రాలేదు. మరీ తట్టినాడు. ఊహూ.

గట్టిగా పిలిచినాడు. లోపలేదో అలికిడివుతూనే వుంది. అంతలో వాకిలి తీసిన చప్పుడయింది. కానీ ఉన్నట్టుండి వినీలాకాశంలో మెఱుపులాగా ఒక్క మించు తొలకరించింది. మరీ వాకిలి పడిపోయింది.

మరోచిన్న అమ్మాయి వచ్చింది.

"అమ్మా అన్నగారు లేరూ"

"ఊరికి పోయినారు "

"వదినైనా ఉందామ్మా"

"ఊహూ, అన్నా వొదినా యిద్దఱూ అత్తగారింటికి వెళ్ళినారు. దీపావళి కదూ"

"దీపావళి!"

... ... ...

అక్కడనుండీ మరలినాడు. వాన చిటపటాపడుతూ ఉంది. దోవలో ఒక్క చూచిన మొగమైనా కన్పించలేదు.

పోనీ పోస్టాఫీసుకుపోయి ఒక్క జాబురాసి పడేస్తాము. లేదా తంతి యిచ్చేస్తాము. అతగాడైనా యేమైనా పంపకపోతాడా. అని పాతుళ్ళోకి పోయినాడు. పోయేప్పటికి ఒంటిగంటయింది. ఆఫీసులో సందడిలేదు.

"ఏమండీ తంతి యివ్వరూ"

"సెలవు"

"పోనీ కార్డివ్వరూ"

"సెలవు బాబూ సెలవు."

"ఏమీ?"

"దీపావళి"

"ఆ "

... .. ..

"పోనీయే అంగట్లోనైనా చూచినవాడు కదా అనుకున్నాడు.

"ఏ మండీ ఒక కార్డిస్తారూ"

".. ... "

" ఏమండీ"

"ఏమిటిదయ్యా, పటాకులు కొనుక్కొనే పిల్లకాయలకన్నా మరీ అతి. తే...ఏదో నీ బేరం చూస్తాం."

" ఇదో. ఒక కార్డివ్వు"

జేబులో చేయిపెట్టినాడు. ఏముంది, మాసిపోయిన కర్‌ఛీఫ్ తప్ప.

"పండుగనాడూ బదులేనా"

"గరుక్కున వెనుదిరిగినాడు.

… … …

రాత్రి రూములోకి వచ్చినాడు.తడుములాడి తడుములాడి అగ్గిపెట్టె తీసుకొన్నాడు ముట్టించినాడు దీపం, గ్లాసు తీస్తే నూనెలేదు మండలేదు. అంటుకొనీ అంటుకొనకనే యితని మొగములాగే వెలవెలపోయింది.

… .. …

అబ్బ, ఈ దినం ప్రతి దానికీ దీపావళే అడ్డం వచ్చినది. అంతా అదే."దీపమే లేని వారికి దీపావళేముంది".అంటూ పడి నిద్రపోయినాడు యీత చాపమీద.

… … ….

కలత నిద్దుర. వెలలేని రత్నాలు. కలలో నైనా సరే కనుగొన్నానుకదా అని కండ్లు తెరచినాడు. అమాంతంగా వెలుతురై పోయినది రూమంతా. ఏమిటా అనుకున్నాడు. అమ్మ యీ రాత్రియెట్లాగో దీపావళి అయిందే అనుకొని ఆశ్చర్యంతో సంభ్రమంతో లేచి చూచినాడు.

'ఠప్ ఠప్' మని ధ్వనులు వినబడుతున్నవి. ఆ!… నా రూముకు నిజంగా దీపావళే. పటాకాయలు కూడా పగులుతున్నాయి.బలే మంచి పండుగ.

యింతలోనే మరీ మంటలు లోపలికి ప్రాకినవి కిటికీల గుండా.

" ఆ ఏమిటది"

… … …

దాపులో ఒక షావుకార్ల యిల్లుంది. అదో దీపాలమయ సౌధం. అంతా అల్లరి. యెంత మంది పిల్లలు యెన్ని టపాకాయలు. ఆకాశంలో నుంచీ దిగజారుతూన్న ఆ మెఱుపు తీగలకూ యీ క్రింది నుంచీ పోతున్నవెలుగు రవలకూ అభేద– అద్వైతసిద్ధి కలిగి అపూర్వ రక్తిమా తేజస్సూ కలిగిస్తున్నవి.

అక్కడి నుండీ ఓ చుఱచుఱ బాణం బయలుదేరింది.యితని ఈతాకు వరాండాపై పడింది.మెల్లగా యింతై అంతై బ్రహ్మాండంగా మంటలు బయలుదేరినవి. ఇంకేముంది. అవే రూమంతా యెగబ్రాకినవి.

దిగ్భ్రాంతుడై దీపావళి అనుకున్నాడు. గబగబా బయటికి పరుగెత్తినాడు. ఏమిటో నిద్ర, కల, వెలుగు, మంటలు; ఫటఫటాత్కారాలు.ఎక్కడున్నాడో తెలీలేదు. ఏమి చేస్తున్నాడో తెలీ లేదు. అట్లాగే నోరు తెరచుకొని చూస్తూ నిల్చున్నాడు. రూమంతా కాలిపోయింది. ఊరిబయట

కాబట్టి వారూవీరూ యిదంతా దీపావళీ మాహత్మ్యమే అనుకుంటున్నారు. ఎవరూ ఆ ప్రక్కరాలేదు. ఇతనదేచూడడం. చూడడం. గుడ్లు నిల్చిపోయి చూడడం. ఆ మంటల శాకం తగి తనపంచ భగ్గుమన్నది. యెగిరి పడ్డాడు. తెలివివచ్చింది.

"ఆ."

బిరబిరా పంచే అంగీ అందులోకే – ఆ మంటలోకే విసిరివేసినాడు. అదోవిధమైన ప్రళయాట్టహాసం.' వెకిలినవ్వు, పిచ్చినవ్వు, వెఱ్ఱినవ్వు, గట్టిగా, "అహహా" అన్నాడు. వారూవీరూ బిరబిరా చేరినారు. యేదో భయంకరజ్వాలలూ,యీ భీకరమూర్తీ.

చూచి భయభ్రాంతులైనారాజనం.

"ఏమిటిదంతా " అన్నారు.

"ఇదా! ఇదా!

దీపావళి.

దీపంలేని దీపావళి.

దివ్యదీపావళి

భవ్యదీపావళి

ప్రళయ దీపావళి."

ఒక్క వెకిలినవ్వుతో ఆ మంటల్లోకి ఉరికినాడు.

... ... ....

ప్రళయాట్టహాస మింకా గాలిలో పలుకుతూనే ఉంది.

**– 2 నవంబరు, 1940, సాధన పత్రిక**

# చిలకా గోరంకా

– విద్వాన్ విశ్వం

అదొక చిన్నపూలతోట. అందులో చాలరకాల పూలచెట్లున్నవి. మంచి మంచి పండ్లూ కాయలూ కాసే పెద్ద పెద్ద చెట్లూ వున్నవి. అవేవీ కత్తెర తాకులకూ బిత్తరుల సోకులకూ చిత్తరువుల పూజలకూ యెఱగాకుండా గాలికి పెఱిగిపోయినవి.

ఆ చెట్లల్లో నడుమ తియ్య మామిడి చెట్టుంది. పెద్ద పెద్ద కొమ్మలూ సన్న సన్న ఱెమ్మలూ యెఱ్ఱయెఱ్ఱ చివుళ్ళూ పిల్లపిల్ల పూలూ, పచ్చపచ్చ కాయలూ కలకలా మాగిజల జలారాలే పండ్లూ దానికొక నూతన శోభను కలిగిస్తున్నవి.

అందులోకి చిలకొకటివచ్చి చేరుకొనింది. దాని పుట్టుపూర్వోత్తరాలు మనకంతగా తెలీవు. చిన్నతనంలోనే తల్లీతండ్రీ యెవరివాతనో పడిపోయినారు. ఆపక్కనే వున్న పెద్ద ఆడవినుండీ అక్కడా యిక్కడా పడి యీ పూలతోటలోనికి వచ్చింది. వచ్చీరావడంతోనే యీ మామిడిచెట్టు కనబడితే పరమానందంతో అందులో నిలవరం యేర్పఱచుకొన్నది.

కానీ దాని మనసు మనసులోలేదు. యెక్కడా పలకరించేవారు లేరు. అన్ని పక్షులూ దూరదూరం నుంచీ చూచేవి. కానీ వానికదేదో కొత్తతరహాగా కనిపిస్తున్నది మాటాపలుకూ లేకుండా మౌనంగా యిది కూచోవడం చూచి అవీ పక్కపక్కనే వైదొలగి పోయేవి.

దీనికేమీ పొద్దేపొయ్యేదికాదు. తనవారెవరూ లేరే అనే ఆవేదనా, తోడులేక పోయేనే అనే చింతా యెక్కువైపోయి యేదో ఆకలైతే యే మాగినపండో యెంగిలిచేసి ఒక మూల కూచొని హృదయకుహరంలోనే భావగీతాలను పాడుకొనేది.

ఇంతలోనే ఒకనాడు కాస్తతోటైనా పూర్తిగా చూద్దామా అనిపించింది. బాగా కలకలలాడుతూంది తోట. రంగులరంగుల చీరెలూ సొత్తులూ పెట్టుకున్న కన్నెల్లాగా వున్నాయి చెట్లన్నీ. సరేగదా అనుకొని అలా ఒక చుట్టు తిరిగింది. ఆమూలనొక చిన్న చెట్టుమీదొక గోరింక కూలబడి వుంది. అదీ దీన్ని ఆప్యాయనంగా చూస్తూ వుంది. యిదీ చూచింది. కాని కండ్లే మాట్లాడుకున్నాయి. ఆ కారణంగానే హృదయాల్లో పరస్పరం విశ్వాసం పాదుకొనింది.

అయినా ఒక దానికీ పలకరించడానికి పాలుపోలేదు. అటూ యిటూ రెండుసార్లు తిరిగి మరీ తనతావు చేరుకొన్నది చిలక. ఆ దినం కొంత సంతోషంగా ఉన్నది. యేదో తనకొక నిధి దొరికినట్లు తనకే తెలీకుండా తాను పొంగిపోతున్నది.

అట్లాగే ఒకటిరెండు తూరులు ఆ చిలకా గోరింకా తోటలో కలుసుకొనేవి. మాటాపలుకూ మాత్రం లేకుండా మౌనంతోనే మచ్చికెక్కువైనది వానికి.

రాను రానూ చాలా సన్నిహితులుగా యేదోభావ బంధం రెంటినీ అనుసరి స్తున్నది. మనసు మనసూ మనకు తెలీకనే మాట్లాడుకుంటాయేమో ఒకొకప్పుడు.

సాయంత్రం రెండూ చిన్న పొదరింటిమీద వాలినవి. అదంతా పూలమయం. మెల్లగా చిలక పలికింది. గోరింక బలకొట్టింది. ఊ అంటే ఊ అనుకున్నాయి.

దగ్గఱకు చేరుకున్నాయి. నీవెవరంటే నీవెరవనుకున్నాయి. ఇన్నాళ్ళిలా అనవసరంగా నీరసజీవితం గడిపినామే అని నివ్వెరపడినాయి. నవ్వుకొన్నాయి. నాట్యం చేసుకున్నాయి. సరే అంటే సరే అనుకొని ఱివ్వున గూళ్ళు చేరుకున్నవి.

అప్పటి నుండీ అవి రెండు కలిసి తోట నొక అందాలబరిణీగా చేసివేసినవి. రాగాల పెట్టెగా మార్చివేసినవి. స్వేచ్ఛగా పాటలు పాడుకుంటూ ఆటలు ఆడుకుంటూ జీవిత సంగీతాన్ని గానం చేస్తూన్నవి. రెండూ ఆ చెట్టు మీదే చేరినవి. అవి పాడేపాటలు ఆడే మాటలూ వినీకనీ ఆ మామిడిచెట్టెంతో ఆప్యాయత చెందుతూ మరింత పెరిగిపోతూంది. దాన్నాశ్రయించే అనేక లతలు ప్రాకిపోయి పూలతో విరిసిపోయినవి.

ఇవి రెండూ గొంతెత్తి పాడుతుంటే ఆ తోపులో వున్న వివిధ జాతుల పక్షులూ చేరుకొనేవి. హాయిగా వినేవి. కొన్ని అసూయపడేవి. కొన్ని యేమి విఱుచుకుంటాయమ్మా అనేవి. ఇంత మిడిసిపడేవి యెన్నాళ్లు పారాడుతాయమ్మా అని మూతీముక్కూ తిప్పేవి.

కానీ వానిలో ఒక కోయిల వుంది. దానికి వీరంటే ప్రాణం. అందులోనూ చిలు కంటే మరీ. గోరింక గొంతులో నుంచి గిఱ్ఱున పొంగివచ్చే అలాప ప్రభంజనం యిది ఓర్చుకోలేదు. దాన్ని అర్థం చేసుకొనేంత ఓపికా లేదు. చిలక పలుకుతుంటే చెవి విచ్చివినేది. తనకింకా పలుకు రాకముందే.

అదీ పెద్దదయింది. కాకులు పొడిచి తరిమివేసినవి. తప్పటడుగులతోనే తనూ చేరుకున్నదా చెట్లదాపున్నే వున్న పొన్న చెట్టులో. తనగొంతూ నిచ్చి కూకూఅని పాడడం మొదలుపెట్టింది. దీనిపాటా చిలకమాటా కలగలసిపోయినవి.

“అ కొమ్మపైనుండి అతడు కూకూ యంచు యీ కొమ్మపై నుండి నీవు కూకూ అంచు యేమి బాసలచేతులే కోయిలా’ అంటూ గొణగొణా గొణుకునేది పావురం. చిలకకూ కోయిలకూ కొద్దికొద్దిగా పరిచయమైంది. అప్పుడప్పుడూ బయటకేవో సామాన్య విషయాలే కూడ బలుకుకున్నా హృదయాల్లో మాత్రం దానిని గూర్చి యిదీ దీనిని గూర్చి అదీ గంభీరంగా యెన్నో సంగతులు విమర్శించుకొనేవి. కానీ యేనాడూ తన సంగతి మనసువిచ్చి చిలకగానీ, కోయిలగానీ యెత్తనేలేదు. యెత్తవలెననుకొనేటప్పటికల్లా యేదో ఒక అవాంతరం సంభవించేది.

... ... ...

ఇట్లా కొన్నాళ్లు గడిచింది.

ఒకనాడివన్నీ చేరిన ఒక చోట వీనితో పాటు తోటలోవున్న పక్షులన్నీ చేరినవి. యేవేవో వానికిచ్చ వచ్చినన్ని కిచకిచలతో నింపివేసినవి భూనభోంతరాళాన్ని. అ! –అన్నట్టు మఱచిపోయి

నాను. ఆ తోటలోనే ఒక చిన్నమేడవుంది.వారే యీ చెట్లన్నింటి ఫలాన్నీ అనుభవించే అధినేతలు.

అందులో వున్న అమ్మాయికీ హడావిడంతా తలనొప్పి కల్గించింది. వెంటనే పనివాళ్ళను పిల్పించి అన్నిటినీ తరిమివేయమనింది.

సరే డబ్బాలో రాళ్ళువేసి శబ్ధం చేసినారు. పెట్లుప్పు పేల్చినారు.

అందులో పక్షుల్లో కలవరపాటుకల్గింది. చిందఱ వందలైనవి అటూయిటూ బెదఱి పోయినవి. బెదురుమారివి పూరా కన్పించకుండానేపోయినవి.

కొన్ని మటుకూ మరీ ఆ ధాంధాణా తగ్గుతూనే వచ్చి చేరుకొన్నవి.

యివి మూడూ యేమిటీ అన్యాయం. యిట్లా యెక్కడైనా కద్దా. మనమేం చేసినాము మన పాటలు మనం పాడుకోవడమూ కష్టమేనా వారికి అనుకున్నాయి. సరే ఆ మాట ఆనోటా యీనోటాపడి పక్షికులమంతా ప్రాకిపోయింది.

కమ్మగా ఉన్న పండ్లన్నీ కాట్లుపడివుండడం, చివుళ్లు తెగిపడడం పూలురాలి పోవడంతో ఆయింటామె కోపం నడినెత్తికెక్కింది. యింతకూ యేమి ముఖ్యకారణ మంటే, చెప్పినారు పాలకులు, చిలకా, గోరింకా అని సరే పట్టుకొని రమ్మనింది.

మెల్లగా వీనిని పట్టుకోవడమెట్లా అని ఆలోచించినారు. అక్కడక్కడా చిన్న చిన్న వలలు వేసినారు. అవి వాని పక్కనే రావడం మానుకొన్నవి.

ఇంక ప్రయోజనం లేదనుకున్నారు. పెద్ద వలను తెచ్చినారు అవి తిరిగే ప్రాంత మంతా వేసినారు.

యెంత జాగ్రత్తగా మెలగుతున్నా ఆ పాటల సంబరంలో స్వేచ్ఛ విహారధోరణిలో తటాలున చిక్కుకున్నవి. చిలకా గోరింకా మెల్లగా వానిని చిక్కించుకున్నారు. వారిదగ్గఱే వున్న పంజారంలోకి విడిచి వాకిలి వేసినారు.

అందులో వాని స్వేచ్ఛాగానం అంతరించిందా ? లేదు ఆగిపోయింది తాత్కాలి కంగా అంతే.

ఆ యింట వ్రేలాడుతన్న వా పంజరాలు. వేళకు పాలూ వుక్కెరా వస్తున్నవి.కానీ ఆ స్వేఛ్ఛాలాపాలు లేవు. ఆ ఆనంద విహారాలులేవు. ఆనందించే పక్షికులానికంతా యెడమై పోయినవి.

కోయిల దూరం నుంచీ చిలుక తట్టు చూచింది. ఆ కన్నుల్లో వున్న కవిత్వం అర్థం చేసుకొనింది చిలుక. తానూ గుడ్లనిండా నీళ్లు పెట్టింది. అవేమనుకున్నాయో మనకు తెలీదు. అసలు చిలకేమనుకున్నదో కోయిలేమనుకున్నదో చిలక్కు కూడా తెలుసునో తెలీదో.

అట్లాగే నిల్చుకొని చూస్తుంది వీనిని కొనిపోతూండడం, అవిపోయినా ఆ త్రోవనే చూస్తూంది విషాద గంభీరదృక్కులతో,

ఆ చెట్లన్నీ కలవరపడి ఆకు రాల్చినవి. వాడు పట్టినవి. ఆనాటి కళాలేదు. కాంతీ లేదు.

శూన్యారామం నీరసంగా మరీ వాని కోసం తపస్సు చేస్తూన్నట్లుంది.

కోయిల మాత్రం చిలక కోసమింకా కాచుకొనే ఉంది.

మఱచి పోగలదా ?

మఱచిపోతే మనసున్నట్టా,

ఆ తోట కెప్పుడు వసంత మొస్తుందో? ఆ తియ్యమామిడెప్పుడు విరియగాస్తుందో.

ఆ కోయిల కెప్పుడు గొంతారా కూకూ స్వరం చేసేంత ఆనందం చిలకెప్పుడు దర్శనమిచ్చి ప్రసాదిస్తోందో ?

ఎవరికి తెలుసు ?

కాలానికి తప్పా ?

**– 7 డిసెంబర్, 1940, శ్రీసాధన పత్రిక**

## కూలివాడు

- కందాళ శేషాచార్యులు

'ఏయ్ ! కూలీ... యిలా రారా!'

'చిత్తం బాబూ ! యేమి సెలవు?'

' యీసామాన్లు స్టేషను చేర్చడానికి యేమిమ్మన్నావు !'

'బరువు జాస్తీగా వుంది. పావలా దయచేయండి'

'అణాయిస్తా చాలు ఎత్తుకో '

చాలదు స్వామీ ! బీదోణ్ణి. మూడణాలన్నా యిప్పించండి'

'అయితే, పోవోయి....'

'పోనీయండయ్యా ! ఆఖరికి బేడయినా యిస్తారాండి !'

'ఊ! ఎత్తుకో... నడు'

కూలీ వయస్సు అరవైదాటి ఉంటుంది. ఆ నరసినతలా, గుంతకన్నులూ, పాలిపోయిన ముఖమూ, యెండిన కట్టెవలెవున్న ఆ శరీరమూ, వణుకుతూన్న కాలుచేతులూ, వానిస్థితి తెలుపుతూంది. కట్టుకొన్న పంచ, చినిగిపోయిన అంగీ, అంతా చమటతో ముద్దయి ఉంది. వాన్ని చూచి మోహన్‌కు జాలివేసింది. 'ఇంత ముసలితనంలో కూడా వాడు కష్టపడుతున్నాడు కదా! వానిని కాపాడే పిల్లలులేరా! వుంటే వానికీగతేమి?' అనుకొంటూ వాని కథ విందామని కుతూహలం కలిగింది. రైలుకు యింకా పొద్దుంది. కానీ, యీలోగా కొంత కాలము గడిచినట్లుంటుంది అనుకొన్నాడు.

'ఓరే నీపేరేమిరా?'

'అయ్యా ! నా పేరు గుండడు '

'ఏమిరా నీయింటిలో నీవొక్క డేనా ? యింకా యెవరైనా వున్నారా ? '

'బాబూ ! నేనూ, పదేండ్ల చిన్న కుమారుడు మాత్రం వున్నాం. అంతా గతించి నారండి. ఆ చిన్నవాని కోసమే యింత శ్రమ, వాడే లేకపోయివుంటే నేనీపాటికి సుఖంగా పరలోకంలో వుండేవాణ్ని...' అంటూ కన్నీరు కార్చినాడు.

మోహన్‌కు మరింతకుతూహలం కలిగింది. బీదతనం చెడ్డది. అందులోనూ తోడునీడలేని వారిగతి మరింత ఘోరం.

'గుండా! నీ కథంతా చెప్పరా విందాం. నాకేమో వినాలని ఉంది.'

' సామీ! యీ బీదవాని కథేం బాగుంటుంది? మీరు వింటే మాత్రం ప్రయోజనం? ఇంతకూ మీకు టయిమవుతుందేమో...'

‘ ఇంకావుందిలే చాలాపొద్దు. చెప్పరా !’

....

నాలుగేండ్లకుముందు నా జీవనం బాగానే సాగిపోతావచ్చింది. మా గుడిసెలో నేను, నా యెల్లి, మాకొడుకు వుంటూ వుండినాం. మొదట్లో పుట్టిన వారంతా పోగా వాడొక్క మొలకమాత్రం మిగిలినాడు. వాన్ని గారాబంగా చూస్తూవచ్చినాము. నేను శారదా మిల్లులో కూలీ. నెలకు పదిరూపాయలు దొరికేది. బీదవారికి యెంతగిట్టితే అంతే పరమా నందం. మేము ముగ్గరమూ అంబలో గంజో త్రాగుతూ బతికేవారం. ప్రొద్దున్నే సద్దితినిపోతే సాయంత్రము అయిదుకు వచ్చేవాణ్ణి. మరునాడు డ్యూటీకి వెళ్ళేవరకూ పిల్లవానిని ఆటలాడిస్తూ యెల్లికి మంచి మంచి కథలు చెప్తూతూ ఆనందంతో కాలం గడిపేవాణ్ని. ఈ విధంగా కొన్నాళ్ళు జరిగినాయి.

‘అంతా సుఖంగానే దినాలు జరిగితే చింతయేదీ? ఈలోగా మిల్లులో కూలీలను కొందరిని పనిలోంచి తీసేసినారు. అందుకుగాను అందరూ హరతాళము జరిపినారు. తోడివారంతా పనికిపోలేదు. పోదలంచినవారిని పోనివ్వక పికెటింగు చేసినారు.

‘ఇట్లా వారంరోజులు జరిగినాయి. ఫలితం తేలలేదు. నాకో ! యింటిలో బువ్వకు జరగడం కష్టమయింది. మలమల మాడిపోతున్న బిడ్డనూ, కంటనీరెడుతూన్న యెల్లినీ చూచి కడుపు తరుక్కుపోయింది. ఏమయినా కానీయని ఆదినం తెగించి మిల్లుకు పరుగెత్తినా, కొంచెం దూరము పోతినోలేదో నావెనకలే కూలీల గుంపంతా పరుగెత్తుకొని వస్తూంది. ముందు నేను, వెనుక వారూ వున్నాం. మేనేజరుగారు ఆఫీసు బయట నిలబడి తమ అసిస్టెంటుతో మాట్లాడుతూ ఉన్నారు. మమ్ముచూచినారు. ‘అయ్యా బీదోణ్ణి ఆకలికి చచ్చిపోతూన్నా. నన్ను పనిలోనికి చేర్చుకోండి’ అందామని అనుకొన్నా. నోటిలో మాటరాక ముందే వెనుకనున్నవారు ‘ధనికవర్గము నశించుగాక..., కార్మిక సంఘానికి జై..., విప్లవము వర్ధిల్లుగాక...’ అంటూ దిక్కులదిరేటట్లు ఘోషించినారు.

నా దౌర్భాగ్యము యేమని చెప్పేది ? ఆ గుంపుకంతా నేనే నాయకుణ్ని అని మేనేజరను కొన్నాడు. ఆమాటే అసిస్టెంటుతో అన్నాడు. నా ప్రార్థన మరల నేను చెప్పదలంచేలోగా మరలా మావారంతా జయ జయ ధ్వనులు చేసినారు. మేనేజరు నావైపు చురచుర చూస్తూ లోనికి పోయినారు. పోలీసులు మమ్మును చెదరగొట్టి తరిమేసినారు.

....

మరియొక వారం జరిగింది. నాయకులంతా రాజీకుదిరించినారు. కూలీల నందరినీ పనిలో చేరమన్నారు. నేను కూడా పనిలోనికి పోయినాను. మేనేజరు నన్ను చూచి ఉగ్రుడైనాడు.

‘ఓహో! మీరేనా కార్మికనాయకులు? ఏమి దయచేసినారు, పాపం! ’ అన్నాడు.

‘దేవరా!యీ బీదోనికి అంత మర్యాద ఎందుకండీ,కూడులేక చస్తూన్నాం, పనిలో చేరుతాను మీ దయ ఉంటే...’

సరే పనిలో చేరవచ్చునని వారు అంగీకరించినారు. అప్పటి నా సంతోషానికి హద్దులేదు. కోటి దేవతలకు మొక్కుతూ పనిలో చేరినా.

...

'నాలుగైదు రోజులు జరిగింది. పనిలో ఉండగా నొకనాడు పోలీసులు కొందరు వచ్చినారు. నాకొక మూటచూపినారు.

'గుండా ! యీ మూట నీదేనా ?' అన్నారు...

'కాదండి బాబూ '

'దీనికి కట్టిన పంచ యెవరిది?'

'నాదే' అంటూ ఉండగానే, చేతికి బేడిలువేసినారు. స్టేషనుకు లాక్కోని పోయినారు. నాకేమి చేయడానికీ తోచలేదు. మేనేజరు నావైపు చూస్తూ వికటంగా నవ్వుకొన్నాడు. తోడి కూలీలకంతా ఆశ్చర్యం వేసింది.

నాపైన చోరీనేరం మోపినారు. మేనేజరుగారు వారి ఖాసానౌకరులు సాక్షులు. నా అంగవస్త్రములో ఆ సొత్తు లెట్లుచేరినదో నాకు తోచలేదు. కోర్టులో నా ఘోష వినేవారేదీ? నిర్దయుడైన మాజిస్ట్రేటు 18 నెలలు శిక్షవేసినాడు. నా భార్యాపిల్లలనైన చూడనియ్యకుండా, ఆ దినమే జైలుకు తీసుకొనిపోయినారు.

....

శిక్షపూర్తిఅయి బక్కచిక్కిన దేహంతో బయటపడినాను. సరాసరి నా గుడిసెకు పోయి చూస్తే యెవరూలేరు. ఉన్నకొంప పూర్తిగా నేలమట్టం అయింది. భార్య గతించి సంవత్సర మయిందన్నారు. పక్కింటియామె నా పాపణ్ని సాకుతూ వచ్చింది. ఆ దినం నాబాలుని దబ్బుకొని ఎంతగా యేడ్చినానో ఆ దేవుని కెఱుక. అప్పటి నుంచి వాణ్ని సాకుతున్నాను.

బాబూ! 'వాన్ని గురించే యింత శ్రమాను. ఒక్కొక్కసారి యీ శ్రమపడలేక యేబావో చెరువో చూచుకొందా మనుకొంటా, చావురమ్మంటే రాకుండా ఉంది. యిదే నా కథ.'

...

మోహన్ రైలులో కూర్చొంటూ. 'ఒరే! మీ అబ్బాయికి గాను' అంటూ కూలీ చేతిలో ఒక రూపాయ వుంచినాడు. గుండనికంట్లో జలజల అశ్రువులు రాలినాయి. ఈ విచిత్ర మానవ ప్రపంచంలో తనపై దయచూపినవాడొక్కడైనా వున్నాడు కదా అని సంతోష మయింది.

'అయ్యా! సెలవంటూ' నమస్కారం చేసినాడు. రైలు కదిలిపోయింది. అది పోయినవైపే చూస్తూ నిలబడి పోయినాడు కూలీవాడు.

**– 26 ఏప్రిల్ 1941, సాధన పత్రిక**

# లక్ష్మీ కటాక్షం

**- కందాళ శేషాచార్యులు**

**వా**ని పూర్వీకులు తాతముత్తాతల కాలంనుంచీ తిండికి లేక చచ్చినవారే. వానికి పైతృకంగా లభించిందీ దారిద్ర్యం. పేరు లక్ష్మీపతి అని అంతాపిలుస్తారు. లక్ష్మీయేమో అంటలేదు. సరస్వతీ అంతే. ఆగ్రామంలో యిక అంతకంటే దౌర్భాగ్యుడింకెవరూలేదు. కర్మఫలంగా కాకపోతే దినమంతా కష్టపడినా వానికి కడుపునిండా తిండిగానీ బట్టగానీ దొరికేదికాదు. వానిలో ఒక సుగుణం ఉంది. ప్రొద్దున్నే లేచి స్నానం చేసుకొని సమీపంలో వుండే గుడి ముందర కూర్చోవడం దైవకీర్తనలు పాడడం. మరలా మధ్యాహ్నానికి యింటికివచ్చి యింత అంబలికాచి త్రాగడం. దేవాలయానికి వచ్చే జనం అందరికంటే ముందుగా పోవడం, అందరికంటే వెనుకరావడం, అక్కడవున్నంత సేపూ దైవధ్యానం చేయడం, ఏ రెండు నిమిషాలో దొంగ మొక్కులుమొక్కి పోయేవారికి కావలసినంత సంపద యిచ్చినాడు పాడుదేవుడు! గంటల పర్యంతం తదేక ధ్యానంతో కాలంగడిపే లక్ష్మీపతికి యేమీ యీలేదు !! ఈ విషయమే ఆలోచించడు మనవాడు. అంతా కర్మఫలమని అనుకొనేవాడు.

వాన్ని చూస్తే అందరికీ హాస్యమే. అంతా అనే మాటలు 'ఓరే! దినమంతా యీ మాదిరి కొంగజపం చేస్తే ప్రయోజనం? దేవునిదగ్గర యేం ఖజానా ఉంది. కాబట్టి నీకివ్వ డానికి ? ఏదో కష్టపడితేగాని కూడుపుట్టదు. అందులో యిది కలికాలం ! యేకొట్టులోనో యింత నౌకరీచేస్తే రెండు కాసులు దొరుకుతుందే! ఒకే మొండిపట్టుతో దేవళంముందు కూచుంటే నీముద్దు మొగం చూచి యెవరేమి యివ్వగలరోయి? గంటల పర్యంతం దైవధ్యానం చేసేంత మూర్ఖులము మేముకాలేదు. పోనీ, యింత నిష్టతో వుంటే నీకు దేవుడు కడుపునిండుగా నైనా యెందుకు తిండియివ్వడు ?'

మన హీరో యీపోటుమాటలు లక్ష్యపెట్టకుండా దిగమ్రింగి, అంతా కర్మఫలమ నేవాడు. పైగా 'డబ్బు సంపాదించేవాని గొప్పతనం నాకేమి కనబడలేదు. దానికేం, భోగందికూడా గడిస్తుంది. భగవధ్యానంలో వుండే ఆనందం మీకేం తెలుస్తుంది ? ఆ యానందం కోసమే నా ధ్యానమంతా !' అనేవాడు. వీని మాటలు వింటూ అంతా వికటంగా నవ్వి వెళ్లిపోయేవారు.

ఒకదినం లక్ష్మీపతికి జ్వరం వచ్చింది. ముందు రోజు నుండీ కూడులేదు. గడగడవణికి పోతున్నా ప్రొద్దున్నే తానుచేసే చన్నీళ్ళస్నానం మానలేదు. యథాప్రకారంగా చింపిపంచ కట్టుకోని దేవాలయం ముందుభాగంలో కూర్చోని ధ్యానంచేయడం ప్రారంభించినాడు. ఆయాసం చేతనో మరెందుకో కండ్లు మూతబడినాయి. ఒక విధంగా తెలివితప్పినట్లయింది. అది కలేనో మరేమో కాని ఒక దివ్యమూర్తి కనబడినట్లయింది. వాడామూర్తిని ప్రశ్నింప మొదలుపెట్టినాడు.

'మీరెవరండీ ?'

'నీవెవరిని పూజిస్తున్నావో అతను.'

'అయితే యెందుకు దర్శనమిచ్చినారు ?'

'నిన్ను పరీక్షించి నీకోరిక ప్రసాదించే దానికి.'

'నన్నా పరీక్ష చేయడం? నాకేం కావలెనో మీకేం తెలుసు?'

'నాకంతా తెలుసు. నిన్నొక కోటీశ్వరునిగా చేస్తున్నా నీ భక్తికి మెచ్చినా' అంటూ దివ్యమూర్తి మాయమైనాడు. ధ్యానానంతరం లక్ష్మీపతి కండ్లు తెరచి నాడు. చాలా ఆశ్చర్యం వేసింది. ఈ కల యెందుకు వచ్చిందో వానికేం తోచిందికాదు. అయితే యీ విషయం తలచుకుంటే మనస్సులో యేదో చెప్పరాని సంతోషమూ, బలమూ వచ్చింది. ఈదినం వానికి కలిగిన ఉత్సాహం మరెన్నడూ కలుగలేదు. అక్కడి నుండి లేచి తన గుడిసెకు బయలుదేరినాడు. వాకిలి తెరచిచూస్తే అపరిమితమైన ఆశ్చర్యం కలిగింది! బంగారూ, వెండీ, వెలలేని రత్నాలు మొదలయినవంతా రాసులు రాసులు పడివున్నాయి!!

....

ఇప్పుడు పురమంతా లక్ష్మీపతిని పొగడేవారు. అతడొక గొప్ప వ్యాపారి అయినాడు. సుప్రసిద్ధ కోటీశ్వరుడైనాడు. ఎన్నో మిల్లులకూ, కంపెనీలకూ అధికారి. పరమ దరిద్రుడుగా ఉండినవాడింతలో ఛటుక్కున మారిపోయినాడు. శ్రీమాన్ లక్ష్మీపతి రావు బహద్దరుగారికి, ముందుండిన భక్తి యోగం యెక్కడ మాయమయిందో తెలీదు. ఇప్పుడు దైవధ్యానానికి సమయమే దొరకడం లేదు. లక్ష్మి యెక్కువయ్యేకొద్దీ ధర్మమార్గం తప్పి పోతూంది. ఎవరైనా సాహసించి 'ఏమండీ ! యిప్పుడు కూడా దేవుని గురించి జపం చేయరాదా?' అని అడిగేవారే ఉంటే వాడు 'అబ్బే! పురసత్తు లేదండీ . ఇక్కడ యింటి పనులూ అక్కడ మిల్లులూ, కంపెనీలూ వీటి లెక్కలూ. కష్టేఫలీ అన్నారు కదండీ. కష్టపడక పోతే యింత వ్యాపారం జరిగేదెట్లాగండీ!'

ఇప్పుడు వారి వయస్సు 45. అయితే యేం ? ధనవంతుడు, యింత వరకు పెండ్లిలేదు. ఓస్ ! బోలెడు మంది మేమంటే మేమని తమ పిల్ల నివ్వడానికి వస్తూన్నారు. మహారాజ భవనాలకు మించిపోయే మహలులలో మహాఅట్టహాసంగా సోఫాలో కూర్చోన్నాడు. సమయం కనిపెట్టి రావ్‌బహద్దూర్ కమలావతి గారువచ్చి వందనం సమర్పి ంచుకొని తమ కన్యను యివ్వడానికి ప్రస్తావనచేసినారు. మన హీరో చిరునవ్వుతో 'అయ్యా! ఇంతవరకూ మున్నూరు మంది తమ కన్యలను యివ్వడానికి సమ్మతించి జాతకాలు యిచ్చి వెళ్లినారు. వారికేమీ బదులివ్వలేదు. మీ పిల్ల జాతకం కూడా యిచ్చిపోండి. జ్యోతిష్కులేమి చెప్పితే ఆ ప్రకారంగా నడుచుకొంటాం. ఇంత వరకూ తొందరపడి పెండ్లి చేసుకొనే అభిలాష నాకులేనేలేదు' అంటూ చెప్పి వచ్చిన పెద్దమనిషిని పంపేసినాడు.

బయట షికారు వెళ్లడానికి వస్తూంటే యెవరో బీదవాడు పాపం, వచ్చి నమస్కారము చేసి 'మహాప్రభూ! రెండు దినాలుగా తిండి లేదు. ఏమయినా దయచేయండి. దేవుడు మిమ్ము కాపాడుతాడు' అన్నాడు. వాని కూతలు వినడానికి లక్ష్మీపతిగారికి తీరికలేదు. బిచ్చగాడు మరలా తన సోదె ప్రారంభిస్తే శ్రీవారికి మహాకోపము వచ్చింది. 'ఏమివోయి నీకు రోగం?

దున్నపోతు లాగున్నావు. పనిచేసి సంపాదించుకో ! ఫో అవతలికి. అరే యేమి కదలకుండా నిలబడినావు ? ఏయ్ యెవర్రా అక్కడ, వీనిని మెడబట్టి గెంటవోయి !' అని ఫర్మాయించినాడు. బిచ్చగాడు పోతూ పోతూ 'అంతా కాలప్రభావం ! లక్ష్మీ కటాక్షం యెవరినైనా గ్రుడ్డివానిని చేస్తుంది. నిన్న మొన్న గోచిపాతరాయుడుగా ఉన్నవానికి యీ దినం యెంత గర్వం వచ్చింది? నాకెక్కడా యీ దినము తిండి దొరకని దానివల్ల కదా యీ నిర్భాగ్యుని మొగం చూడవచ్చింది. కాని దేవుడు సర్వసాక్షి. అంతా యీ విచిత్రాన్ని చూస్తున్నాడులే !' అని అనుకున్నాడు.

....

అదేమి? మరల ఆ దినం వలనే కల! పగలు కనబడిని బికారి లాగున్నాడు! ఏమా పొగరుబోతుతనం? లక్ష్మీపతిని చేయిబట్టిలాగి ప్రశ్నించుతూ ఉన్నాడు.

'మూర్ఖుడా ! నా వరాన్ని దుర్వినియోగం చేస్తూన్నావురా ! దేవుడే లేడనుకున్నావా ? అంతా ధనమే ప్రధానమా?'

'ఓహెూహెూ! యీ మొగమేనా నాకు ధనమిచ్చింది ? అంతా శుద్ధాబద్ధం ! అంతా నాకష్టం వల్లనే లభించిందీ ఐశ్వర్యమంతా ! నీ పిచ్చి కూతలు చాలించి వెళ్లిపో. నీతో మాటలాడే అవకాశం నాకు లేదు. పోతావా లేదా ?

'పోకుంటే యేమి చేస్తావోయి నన్ను. నీ పొగరు మాయంచేయడం నా చేతిలోని పని. తెలుసా ?'

'నీచేత కాదు, నీ యబ్బచేతకాదు. ఫో అవతలికి, అరే యెవర్రా అక్కడ !'

ఇంతలో అలారం గడియారం గణగణ మ్రోగింది. లక్ష్మీపతిగారికి మెలకువ వచ్చింది. పాడుకల యెందుకు వచ్చిందో అనుకొంటూ శ్రీమంతుడట్లే కొంచంసేపు మంచం మీదనే పడివున్నాడు. ఇంతలో నౌకరు వచ్చి ' ప్రభూ ! బయట హాలులో దివానుగారు కాచుకొని వున్నారు. తక్షణం తమ దర్శనం కోరుతున్నారు' అన్నాడు. సరే వస్తూన్నానని చెప్ప'మంటూ లేచినాడు.

'ప్రభూ ! అంతా మోసం జరిగిపోయింది. అన్యాయం జరిగినది. మనస్టీమర్లు మునిగి పోయినాయి. అకస్మాత్తుగా మూడు మిల్లులు యీరాత్రి అగ్నికి దగ్ధమైనాయి. కొన్ని లక్షల నష్టము కలిగింది ...'

శ్రీమంతుడు సమాచారమంతా వింటూ మూర్ఛబోయినాడు. పడినపాటుకు బలమైన గాయం తగిలింది.

....

ముందు సాయంత్రం కోటీశ్వరుడు ఈ దినం తెల్లవారుసరికి దరిద్రనారాయణుడు. అందరికీ యీవింత సమాచారం వింటూ మహదాశ్చర్యం కలిగింది. లక్ష్మీపతిగారు యధా ప్రకారంగా అవతారం ధరించినాడు. మామూలుగా తనువుంటూ వుండిన గ్రామమూ,

దేవాలయమూ చేరుకున్నాడు. అదే సరోవరము, అదే ఆలయము, స్నానంచేసి పడికావలికాస్తూ కండ్లు మూసుకొని ధ్యానమగ్నుడైనాడు.

దివ్యమూర్తి కనబడినాడు, ఒకనాడు. 'ఏమోయి అంతా కథముగిసిందా ? శాంతి అయినదా ? ఇంకా యేమైన మిగులువుందా ? అన్నాడు. లక్ష్మీపతి కంపితకంఠంతో 'మహాస్వామీ ! నేను తప్పుచేసినాను. యీ దీనుని మన్నించి మరలా కటాక్షింపరాదా ?' అన్నాడు. దివ్యపురుషుడు ' పిచ్చివాడా ! మాటిమాటికి యీ మాదిరి అవకాశాలు దొరకవు, తెలుసునా ? నాటకం ప్రారంభించినా... ముగించినా చాలు.' అంటూ అదృశ్యుడైనాడు.

**– 16 ఆగస్టు 1941, సాధనపత్రిక**

# 101వ మార్గము

– కందాళ శేషాచార్యులు

అప్పుడే నిద్రలేచి మొఖం కడుక్కున్నా. కాఫీ పుచ్చుకోవడానికి కూర్చున్నా. ఇంతలో యెవడోవచ్చి 'సార్! మిమ్మల్ని సత్యనారాయణగారు పిలుస్తున్నారండీ ' అంటూ వెళ్లిపోయి నాడు.

'ఊ! దయచేయండి పాపం ! మీ ప్రాణస్నేహితుడు పిలుస్తున్నాడంట' అంటూ మాయావిడ సోదె ప్రారంభించింది. 'నీకెందుకే అంత కోపం ? ఎవరో సలహాకోసరమే అతను పిలు స్తుంటాడు. పోతే తప్పా?' అన్నా.

మా సత్తిగాడు నన్ను చూడకుండా, వాణ్ని నేను చూడకుండా వొక నిమిషమైనా గడవదు. ముందుదినం వాణ్ని చూడలేదు అందుకనే పిలిచి వుంటాడనుకుంటూ వాని యిల్లు చేరుకున్నా. వాని సంగతి కొంచెంగా చెప్తుతున్నా వినండి. నావలె అందరికీ సలాములు చేసే ఉద్యోగి కాదతడు. కావలసినంత సంపద వుంది కాని అదృష్టంలేదు. ముందూ వెనకా యెవ్వరూ లేరు. ఇది వరకే యిద్దరు భార్యలను పోగొట్టుకున్నాడు. వయసు నాలుగోపడి దాటుతూంది. తృతీయ వివాహం కాలేదు. మంచి సంబంధాలు వెదుకుతున్నాడు. ఏది యెట్లున్నా యిరవైనాలుగు గంటలూ ఖుషీగా గడిపే ఘటం.

పోతూనే నవ్వుతూ నాకు పేపరు అందిస్తూ ' సుబ్బా యీ ప్రకటన చూడరా మనకు సరిపోయేలాగుంది. నిన్ననే యీ సంబంధం విషయంగా జాబు రాసినా, అన్నట్లు నీకు చెప్పడం మరచినా' అన్నాడు.

ప్రకటనలో 'ఒక 25 యేండ్ల వర్జినువిడోను పెండ్లి చేసుకోవడానికి 35 లేక 40 సంవత్సరాల వరుడు కావలెను. జీవనానికి తగిన ఆస్తిపరుడైతేచాలు' అని వుంది.

'ఓరి నీపిచ్చికాలా ! మరలా యిలాంటి పాడు ప్రకటనలు తిరుగవేయడం మొద లుపెట్టినావేమిరా? హాయిగా వుండవలసిన ప్రాణానికి లేనిలంపట తెచ్చిపెట్టుకుంటున్నావు?'

'అది కాదు సుబ్బా ! ఇంత యిల్లూ, వాకిలీ, ఆస్తి అంతా ఆ వొక్క ప్రాణిలేంది యేమో బిసూరుమంటుందిరా, నీవేమైనా చెప్పు, తప్పకుండా యిలాంటి పిల్లే నాకు తగివుం టుందిరా.'

'అయితే కడకు విధవా వివాహానిక్కూడా తయారన్నమాట!'

'మరేం జేయమన్నావు ? చూచి చూచి నన్నొక యింటివాణ్ణి చేయండ్రోయని మొత్తుకుంటే యెవరూ నొప్పరు. ఇక నీవో ముందే నన్ను ముసలివాడవని అంటావు. పైగా యెత్తిపొడుపు మాటలు, పోనీ, యిది యెదిగినపిల్లే విడో అయితేయేం? ఒక విధంగా సంఘసంస్కారముగా కూడా వుంటుంది. ఏమంటావురా దీనికి ? '

'కట్టుకోని వూరేగువాడివి నీవైతే నా మాటకేం ? రైటో అంటూ, పిల్ల 25 యేం డ్లని వ్రాసినారే ? అక్కడే నాక్కూడా అనుమానంగా ఉందిరా ?'

'నీకెప్పుడూ అనుమానాలే ! నీవు సరే అనరా ' రేపు ప్రొద్దున్నే మన పురోహితుని చూచి

యీ నెలలో లగ్నాలేమయినా వున్నాయో లేవో కొంచెం కనుక్కోరా ?'

నాకు నవ్వు వచ్చింది.

....

ఏడు దినాలు యేడు యుగాలుగా జరిగినాయి. ఏలాగైతేనేం శుభమంటూ జాబురానే వచ్చింది. ఇంకేం ? మా సత్తిగాన్ని పట్టపగ్గాలు లేవు. పెండ్లి పెద్దగా నన్నురమ్మని చంపుకోని తిన్నాడు. కాని మా దొర సరీగా ఆ రోజే తనిఖీకి వస్తానని ప్రోగ్రాం పంపినాను. నేను మాత్రం రాలేనని యెంత చెప్పినా వినలా, పోనీ అక్కగారినైనా పంపమన్నాడు. దొరవస్తే ఆయన వెంట తిండిపోతుదద్దమ్మ జావానొకడుంటాడు. వీరిరువురికిన్నీ మేత సరిగా వేయక పోతే రిమార్కులు తప్పవు. తిండి తీర్థాలకు మాయావిడ లేకుంటే జరుగదు. కనుక మేమెవ్వరూ రాలేమనీ, కావలిస్తే నిన్ను వచ్చేనా. స్టేషన్‌లో తప్పక కలుసుకొంటామనీ నచ్చచెప్పేటప్పటికి తలప్రాణం తోకకొచ్చింది. మావాడు విధిలేక సరేనంటూ, దొరకు శాపనార్థాలు కురిపిస్తూ బయలుదేరిపోయినాడు.

ఎందుకైనా మంచిదే అని యీ శ్రావణశుద్ధ దశమిదినం బాగుందని నిశ్చయిం చినాం. ఈలోగా ఆవైపు నుండి పది ఉత్తరాలూ మా సత్యం నుండి పదిహేను ఉత్తరాలూ తిరిగినాయి టపాల్లో. క్షేమంగా పోయి లాభంతో రావోయి' అంటూ మిత్రుణ్ని స్టేషన్‌లో సాగనంపివచ్చినా.

....

మరీ ఐదురోజుల మాట. సుఖంగా దంపతులు వూరు చేరుకున్నారు. వెంటనే పిలుపు వచ్చింది.

'మధురం, యీయన్ని చూచినావా ? యీయనే మా మిత్రులు సుబ్బయ్యగారు, మన యింటి విషయంలో చాలా సాయపడుతూండేవా'రని తన భార్యకు నన్ను పరిచయం కలిగించినాడు సత్యం.

ఆమె నాకు నమస్కారంచేసి 'చాలా సంతోషం !' అంటూ తలవంచుకొని లోనికి పోయింది.

'సత్తీ ! అమ్మాయి బాగానే ఉందిరా ! నీ అదృష్టం బాగానే ఉంది' అన్నా.

'ఏమోలేరా, అంతా మీలాంటి స్నేహితుల ఆశీర్వాద బలం'

'ఒరే !అయితే వివాహం గప్‌చిప్‌గా యే తొందరలూ లేకుండా జరిగింది కదూ?'

'ఆ ! తొందర లెందుకుంటాయిరా ? పాపం ! దాని మేనమామా తల్లీ చాలా మంచివారు. కార్యం అయినతోడనే అతను లీవులేదంటూ మద్రాసు వెళ్లినాడు. మా అత్తగారు మాత్రం కూతురికి యిల్లు సర్దుబాటు చేద్దామని వచ్చింది'

'ఓహో! అత్తగారిని కూడ పిలుచుకొని వచ్చినావో ?'

'మరి రాకుంటే పాపం ! మధురానికి యీ యిల్లూ వూరు కొత్తరా ! రెండు దినాలుండి పోతుంది.'

'రెండు దినాలు కాకుంటే, ఆమె యిక్కడే ఉంటే మాత్రం యేం? మీరిద్దరూ చిలకా గోరింకల్లాగా ఉంటే చూచి ఆనందపడుతుంది.'

'ఆమె చాలా మంచి మనిషోయి, పనివంతురాలు, కూడా ఇల్లంతా యెంతబాగా సర్దుబాటు చేసిందిరా ? నాకే ఆశ్చర్యం వేసింది! అన్నట్టు నిన్న మన యింటిలోని సామాగ్రి అంతా తల్లీబిడ్డల కిద్దరికి నొప్పజెప్పినా, నా మొదటి భార్యల తాలూకు సొమ్ములుకూడ మధురానికి పెట్టినా, భ్రమపడుతూంటుందని.'

'మంచి పని చేసినావోయి ! మరి నాకు సెలవా ? రేపు మా యింటిలో మీకు విందు, మాయావిడ మిమ్ము తప్పక తీసుకరమ్మంది తెలుసునా?'

'ఆహ ! అట్లుకాదు, యిది మొదటి విందు., రేపు కాకపోతే ఒట్టు' అన్నా.

'సరేలేరా!' అంటూ నవ్వుతూ నన్ను సాగనంపినాడు.

....

ప్రొద్దున్నే లేస్తూ మిత్రునికి చేయబోయే విందు విషయం ఆలోచిస్తూ మాయావిడతో మాట్లాడుతున్నా. కాఫీ యింకాతీసుకోలేదు. ఎవరోవచ్చి 'సార్ ! మీ సత్యంగారు పిలుస్తూన్నారండీ ' అన్నారు.

'సరేలే ! ఎప్పటి మాదిరి పిలుపే' అనుకుంటూ కాఫీ ముగించినా ఐదు నిమిషాల్లో మరొక బులావు వచ్చింది. 'అయ్యా వెంటనే రాండి, ఆయనేదో మహావిపత్తులో పడినట్లున్నది, కొంత వరకూ యేడుస్తున్నాడుకూడా' అని

'ఆరే! యేడిచేంత యేమొచ్చిందో ' అనుకుంటూ పరుగుపరుగున పోయినా.

నన్ను చూస్తూనే దు:ఖం నిలువలేక బిడ్డపోయిన తల్లిమాదిరిగా గోడుమన్నాడు. 'విశేషమేమిరా? ఏం జరిగింది?' అంటే పలకడు. లోనివైపు సైగచేసి నాడు. ఏదో ప్రమాదమే జరిగిందనుకుంటూ లోనికి పోయినా, ఏముంది ? రెండు నాళ్లగా కలకలలాడుతున్న యిల్లు సర్వశూన్యంగా వుంది. మధురంగాని, ఆమె తల్లిగాని పత్తాలేదు. రాత్రే యేరైలులోనో వుడాయించినట్టు కనబడింది.

'బ్రదర్ ! మధుర యేదీ' అన్నా,

'దాని ముండమోసిరి; వెధవ పీనుగ పోతేపోయింది గాని నా మొదటి భార్యల బాబతు రెండే పేర్ల బంగారు, సిల్కుచీరలూ... పెట్టెలోని నగదు రెండు వేలూ... అంతా.. పోయిందిరా... ఆ..బ్బా !' అంటూ కుర్చీలో కూలబడి పోయినాడు.

నాకేమీ దిక్కుతోచలేదు. ఎంత ధైర్యంచెప్పినా వినలేదు. ఆ పిల్ల ఆచోకీయేమయినా దొరుకుతుందేమోనని యిల్లంతాగాలించినా సత్తిపడక క్రింద నొక పుస్తకం దొరికింది.

దానిపేరు 100 ways of earning Money (డబ్బు సంపాదనకు నూరుత్రోవలు) ఆఖరు పేజీలో క్రిందితట్టు పెన్సలుతో యెవరో రాసినట్టుంది.

'101 వది సత్యంగారి మూడో పెండ్లి' ఈ మాటలు చూచి నేను కూడా విచారంలో మునిగిన మాట నిజం!!

**– 6, సెప్టెంబర్ 1941, సాధన పత్రిక**

## బడి పంతులూ !

– కందాళ శేషాచార్యులు

**బ**డిపంతులూ ! నీవు కూడా వొక ఉద్యోగిననుకున్నావా ? శుద్ధ పొరబాటు పడుతున్నావు. నీకూ ఒక హెూదా వుందనీ, నీవు చేస్తూందేదీ వొక ఉద్యోగమేననీ భ్రమ పడితే, యేం జెప్పమన్నావు ? అయితేవిను..

...

'రామయ్యగారూ! మీ పనేమేలండి హాయిగా లీవులు వస్తూ వుంటాయి. సుఖంగా కాలక్షేపం చేస్తారు. ఇక మాకో దినదినమూ అర్జంటు పనులంటూ తగనిచావు!

'రావుగారూ! పంతులపని సుఖమేనని అంతా అనేవారే. మా జీతాలగోడు యెవ్వరికీ కాబట్టదు. వచ్చేది మా సంసారాలకు బొత్తిగాచాలదు. కొన్నాళ్ల వరకు రూపా యకు 14 వంతుననూ, యిప్పుడిప్పుడు 15 అణాలవంతుననూ ముట్టుతుంది. ఇక యింక్రిమెంట్లమాట మరచిపోండి. రెండేండ్లకోమాటు ప్రభుత్వంవారివ్వకపోయినా మాయా విద మాత్రం ఇంట్లో జనాభా లెక్క క్రమంగా రెండేండ్ల కొకటి చొప్పున యెక్కిస్తూంది !'

'మంచిదే మీదే అదృష్టం ! మా యింట్లో ఏడాది కొకటి.'

...

'పంతులూ యిలారా !'

'చిత్తం... యేమి సెలవు?'

'నిన్నెందుకు యీవూరికి బదిలీచేయించినారో తెలుసా ? యేమో పాపం ! బీదవాడవనీ, కొంప కొంపలు తిరిగి కష్టపడిపోయినావనీ, యేదోవొక చోట స్థిరంగా వేయిస్తే బాగుపడతావనీ యీ వూరికి వేయమని ఖుద్దున సిఫారసు చేసినా తెలుసునా !'

'అంతా తమ దయ '

'ఆ మాట కేంగానీ, యిదిగో చూడు మరేం అనుకోకు, మావాణ్ని ఈసారి హైస్కూలుకు పంపుతున్నా, కొంచెం యింగిలీషూ, లెక్కలూ యింటికాడ చెప్పించి వాణ్ణి తయారుచేయి నీపేరు వుంటుంది.'

...

'అమ్మయ్య ! లేదో లేదో అని మొత్తుకుంటే యీసారి మా వూరికి వొక బాపనయ్యను వేసినారు. మేలయింది'

'మేలేరా సుబ్బన్నా ! మనూరిలో బ్రాహ్మణ కొంపలు లేనేలేవుకదా ! దావతప్పి యే పెద్దమనిషో, యే వుద్యోగస్తుడోవస్తే యింత కూడువండిపెట్టే దిక్కులేదు. ఇంక ఫరవాలేదులే. వొక అయ్యవారంటూ వచ్చినాడు. మనమర్యాద దక్కింది'

...

'ఇదేం న్యాయమండీ! మా పిల్లవాణ్ణి ఫెయిలుచేసినారు. వాడు పాఠములు బాగాచదువుతాడే? బుద్ధిమంతుడేనే ? పైకియెందుకు వేయలేదండి ?.... ఏమీ? మార్కులు రాలేదనా !... అది మీ చేతులో పనే. ఎగవింటి ఎర్రప్పకు మార్కులు రావడానికీ మావానికి రాకుండడానికీ కారణాలేవీ ? ఆ మరచినా, వాడు మెంబరుగారి మేనల్లుని కుమారుడు కదూ!.... మీరేం చేస్తారులేండీ పాపం !'

'....................?'

....

జమాను: 'అయ్యగారూ ! మాదొరకు వుర్లగడ్డల కూర నిమ్మపులుసు పిండించితే మహాయిష్టం! అది యీ పూటకి చేయండి !!'

పంతులు : 'కాసీమూ ! యీ పాడూరిలో కూరగాయలు యేమీ దొరకవు. కడకు ఆకుకూరలైనా దొరకవే ! నీకు తెలియదా ! యేం జేయమన్నావు ?'

జమాను : 'అదేమో నాకు తెలియదు. ఆ ప్రకారం చేయకపోతే మరి యీసారి గ్రాంటుకు చక్రం ! ఉన్న మాట చెప్పినా !!

పంతులు: '.........'

జమాను : రేపు మా అయ్యాగారింట్లో తద్దినం వస్తుంది. మంచినేయి దొరికితే పంచేరూ, పది అరటాకులు, కాయలూ, బొందె పంపమని చెప్పమన్నారు అమ్మగారు.

ఉ : 'యీ వూరిలో పాడి యెక్కడుంది ? చెప్పలేక పోయినావా?'

జ : ఆ పని నాది కాదు సార్ !

...

'ఏమయ్యా మాపిల్లోడు వెట్టిచాకిరికి దొరికినట్టుందే ? పారా, పికాసీ తెమ్మన్నా రంటే యెందుకో అనుకున్నా, తోట అనే పేరుతో మీ యింటిక్కావలసిన కూరగాయలు బడి ముందర వేయించడానికేనా?మా పిల్లవాండ్లకు అలాంటి త్రవ్వడం, నాటడం, నీళ్ళుతోడడం, పనులు చెప్పకండి, వృథా కష్టం పెట్టకండి. చేతనైతే చదువు చెప్పండి చాలు. కాని యీ మాదిరి కాయకష్టం పెట్టకూడదు. తెలుసునా ?'

....

'అయ్యవారిపని మేలురా! హాయిగా కుర్చిలో కూర్చొని కాళ్ళమీద కాళ్లువేసుకొని, నెల అవుతూనే ఠంగున జీతం తీసుకొంటాడు !! ఇంత కష్టపడి పనిచేసినా మా కడుపులు మాడడమే!!!'

...

'ఆయనకేం ! వూరంతా ఆయన మాట వినేపిల్లలే !! జీతంలేని నౌకర్లు దొరికినట్లు'

....

'అదో ! ఆ పోతూండే ఆయన వేషం చూడు. ఎంత ధీమాగా ఉన్నాడో ! చేసేది మేష్టరుపని! ఆ సైకలూ, తెల్లబట్టలూ, చెప్పులూ, కళ్ళజోడూ ఆ యింత షోకు యెందుకూ అంటా ? ...'...

'ఏమన్నాడు ? మా యింటిలో పెండ్లి పనులు కొంత ఉందంటే రావడానికి లీవు లేదంటనో, సరేలే ! నా తడాఖా చూపిస్తా యీసారి మీటింగులో !

**– 27 సెప్టెంబరు 1941, సాధన పత్రిక**

# రైల్వేగైడ్

– కందాళ శేషాచార్యులు

‘దిగవోయి రైలు. మీ యబ్బ గంటనుకున్నావా యిది; టికట్టు లేకుండా ప్రయాణం చేయడానికి?’ అంటూ టికెట్టు కలెక్టరు అతన్ని క్రిందికి నూకినాడు. ప్లాటుఫారంపై తమాషా చూస్తూ జనంఅంతా నిలబడి ఉన్నారేకాని, వాని మాటలు విని దయతలచేవారేరీ?

మాసిన గడ్డమూ, దుస్తులూ, చిందరవందరగా ఉండి నెలలు తరబడిగా సంస్కారం లేనట్టున్న క్రాపూ, మురికిబట్టిన బక్కపలచని శరీరమూ, వాన్ని చూచి నాకు జాలివేసింది. మొఖంవైపు తదేకంగా చూచినా, ఎక్కడనో పరిచితమైనదిగా తోచింది. వెంటనే నా కాలేజీరోజులు జ్ఞాపకానికి వచ్చింది; తక్కున మెరుపు మెరిసినట్లు వాని పేరు కూడా.

‘శంకర్’ అని కేకవేసి పిలిచినా. పేరు వింటూనే బుడబుడా కన్నీరు కారుస్తూ అతడు నావేపు జాలిగా చూచినాడు. ఇక పెట్టెలో కూచోవడానికి నాకు బుద్ధి పుట్టలేదు. క్రిందికి పరుగెత్తుకొనివచ్చి వానికిగాను వొక టికెట్టు కొనితెచ్చినా? అంతవరకు చిందులు త్రొక్కుతూ ఉన్న టికెట్టు కలెక్టరుకు తగిన సమాధానం చెప్పి మిత్రుని పిలుచుకొని పెట్టెలో కూర్చున్నా, రైలు కదిలింది.

నన్ను చూచి వొకవైపు ఆనందమూ, మరోవైపు సిగ్గూ అభినయిస్తూ తలవంచు కున్నాడు శంకర్. అతడు మా కాలేజీలో నా జతలో చదువుకున్నవాడే. మహా తెలివిపరుడు. గొప్ప జమీందారు బిడ్డ. సుఖంగా పెరిగిన ఘటం. బి.ఏ. మొదటి తరగతిలో నెగ్గినవాడు. ఇంగ్లీషులో వాడు వ్రాస్తూ వచ్చిన కథలూ, నాటికలూ చూచి ప్రిన్సిపాలు దంగయిపోయేవాడు. మేమంతా వాణ్ని షేక్సుపియర్ అని మారు పేరుతో పిలిచేవారం. అంతవాడీవిధంగా మారి ఉండడమూ, యింత హీనస్థితికి రావడమూ, చూచి నాకు చాలా ఆశ్చర్యమూ, విషాదమూ కలిగింది.

‘శంకర్... కాదు షేక్సుపియర్ ! యేమిరా యీ మాదిరయినావు ? ’

‘బ్రదర్ ! నన్నా విధంగా పల్కరించవద్దు. రెండు దినాలుగా తిండిలేదు. ముందు కొంచెం టిఫెన్ తెప్పించు. మరి మాట్లాడుకుందాం !’

వాని మాటలు వింటూనే నాకు కన్నుల వెంట గిర్రున నీరు తిరిగింది. ప్రక్క స్టేషనులో రైలుఆగితే రిఫ్రెష్మెంటు వానిని పిలిచి సమృద్ధిగా ఫలహారాలు తెప్పించినా. మిత్రుడు గబగబా ఫలహారం చేసి విశ్రాంతిగా కూర్చున్నాడు. మరలా నా ప్రశ్నలు మొదలు పెట్టినా.

‘ఏమిరా శంకర్ ! యీ విధంగా మారినావు? యిప్పుడైనా చెప్పరా? ’

శర్మా! నా కథ చాలా విషాదాంతం. నేను చెప్పడమూ నీవు వినడమూ అనుచితము. ఇంతకూ అది విని యెవరేమీ చేయలేరు.

నాకు చాలా ఆశ్చర్యమేసింది.

'అది కాదోయి ! అంత గొప్ప జమీందారీ యేమయింది ? నీ చదువేమయింది? మొదటి తరగతిలో ప్యాసయిన వాడివి. ఏదో నౌకరీ అయినా దొరకలేదా ? '

ఎంత బతిమాలినా కథను చెప్పలేదు. నేను మాట్లాడినంతసేపు వాడేదో దు:ఖంతో పొర్లిపోతున్నట్లు తోచింది. ఇంక వాన్ని వేధించి మనసుకు కష్టం కలిగించడం బాగులేదని అప్పటికి వూరుకున్నా. సరి, మేము దిగవలసిన వూరు వచ్చింది. రైలు దిగి బసచేరుకున్నాం. ఆ రాత్రి మాయపె వండిన మంచి మంచి పదార్థాలు భోంచేసి గదిలో కూర్చొన్నాం. శంకర్‌ను ముందు కూర్చుండబెట్టుకొని మరలా నాసోదె మొదలిడినా.

'బ్రదర్ ! నీ విషయంగా నాకు జాలివేస్తూందిరా. చేతనైతే సహాయం చేస్తామని నా మనస్సు తొందరపెడుతూంది.దయచేసి యిప్పుడైనా చెప్పరా నీకథ. చెప్పకపోతే ఒట్టు!

'అయితే సరే, నా కథ చెప్పుతా, నేను బ్రతికి వుండగా నా విషయం యెవ్వరితోను అనుకోకు.'

....

'శర్మా ! నా సంగతి యెవ్వరికి యింతవరకూ కాబట్టలేదు. నీ బలవంతంచేత యిప్పుడు వినిపిస్తున్నా. మన కాలేజీ రోజుల్లో నేనేవిధంగా చీకూ చింతాలేకుండా కాలం వెళ్లబుచ్చిందీ నీకు బాగా తెలుసు. బి.ఏ. ప్యాసయిన సంవత్సరమే నాకు పెళ్లయింది. మా తండ్రి సంపద చూచి, నా చదువుచూచి మా సంబంధం మెచ్చుకొని ఒక ఐ.సి.యస్. ఉద్యోగి తన బిడ్డను యిచ్చినాడు. నన్ను ఇంగ్లండుకుపోయి ఐ.సి.యస్. కూడా చదువమని చెప్పినాడు. నేనూ అంగీకరించినా, కాని యింతలో మా తల్లి విషజ్వరానికి గురై మృత్యువాత పడింది. అదే మా కష్టాలకు నాంది.

మా నాన్నకు తీరని చింత కలిగింది. పిట్టపిడుగు మాదిరి యింతలో దక్షిణాది బ్యాంకి ఒకటి దివాలా తీయడం జరిగి, మాకు లక్షల పైబడి నష్టం వచ్చింది. నాన్న పూర్తిగా కృంగిపోయి మంచంపట్టినాడు. ఇల్లాలుతోపాటు యింటి సంపత్తు కూడా పోయిందని పలవరించేవాడు. లక్షాధికారి ఒక్క మారుగా బిచ్చగాడై పోవడం యెంత ఘోరమో ఆలోచిం చుకో ! తండ్రి ఖాయిలాగా వున్నాడు. వెంటనే లలితను ( నాభార్యపేరు ) పంపమని మా మామకు జాబువ్రాసినా బదులు రాలేదు. సరికదా ఐ.సి.యస్. గారికి మా యందు గౌరవం పోయినట్లు తోచింది. తను ముద్దులబిడ్డ యిక్కడేమి కష్టపడిపో తుందోనని పంపజాలనని, కొన్నాళ్ళకు ఖచితంగ జాబురాసినాడు. ఛీ! వీరి మర్యాద యీమాత్రమేకదా అనుకొని నాన్నగారికి వుపచారాలు నేనే స్వయంగా చేస్తూవచ్చినా.

కానీ ! దైవం వోర్చలేదు. మా తండ్రి గతించడం, నేను దిక్కులేని పక్షినైపోవడం జరిగింది. చిల్లర అప్పుల వాళ్ళు మా ఇండ్లు వాకిండ్లూ యేలంపాడించి నన్ను తరుమ గొట్టినారు. నేను నిర్మించుకున్న గాలి మేడలంతా ఒక్కమారుగా కూలిపోయినాయి. అన్నమో రామచంద్రాయని వాపోయే గతి వచ్చింది. మామగారు మాత్రం యేవోకొన్ని సానుభూతి వాక్యాలురాసి నన్ను తక్షణం తమ వద్దకు రమ్మన్నారు.

బ్రదర్ ! అప్పటికి నాకు బొత్తిగా మతిపోయి ఉండినది. విధిలేక మామయిల్లు, చేరి, ఆ యింటి యెంగిలి మెతుకులకు తినేగతి పట్టింది. అదే నన్నింత పిచ్చివానిగా మార్చివేసింది. అక్కడకు పోకుండా యే కూలి నాలో చేసుకొని పొట్టపోసుకొనే ఆలోచన నాకు తట్టివుంటే యెంత బాగుండేది ? '

కథ సగంలో నిలిపి, కన్నీటిధార తుడుచుకొని మరలా చెప్పడ మారంభించి నాడు.

"అవతలి కథ యేంజెప్పెను ? ఉత్తర భాగమంతా నరక పూరితం. మా మామ నా భార్య యిరువురికీ నన్ను చూస్తే అసహ్యం పుట్టింది. ఇంగ్లాండుకు పంపుమాట దేవుడెరుగు. సరిగా తిండితీర్థాలక్కూడ కరువై పోయింది. సౌఖ్యం ఏమూల దాక్కుందో ఆఖరుకు యింటినౌకర్లకు కూడా లోకువైపోయినా. అప్పుడు నా బ్రతుకు కంటే చావు మేలనిపించింది.

'ఒక దినం రాత్రి భోంచేసి నా గదిలో ఉన్నా, ఆ రాత్రి లలిత సినిమాకు పోయి ఉండినది. నాకు ఆలోచనాపరంపరలలో నిద్రరాలేదు. కారు శబ్ధం వినబడితే కిటీకీ గుండా తొంగిచూచినా, ఎవరుంటారు మా లలితే యెవ్వని భుజముపైననో చేయి వేసుకొని నవ్వుకుంటూ విలాసంగా తన గదిలోనికి పోయింది. ఆ నూతన పురుషుదెవ్వరో నాకు తోచలేదు. నేను నిలువునా క్రుంగిపోయినా, ఆ వచ్చినవాడా రాత్రి లలిత గదియందే విశ్రమించినట్లు తోచింది. ఇక నాకక్కడ వొక క్షణం కూడా ఆగుటకు బుద్ధిపుట్టలేదు. వెంటనే ఆ యమలోకం వీడి బయటపడినా.

పిమ్మట నా సంగతి యెవ్వరికీ కాబట్టలేదు. నాచేత డబ్బు నహీ. వూరూరు తిరుగుతూ వ్యసనంతో క్రుంగిపోయినా. ఆత్మహత్యకు దారులు వెదుకుతూ వచ్చినా, బి.ఏ.లో నేను చదివిన శాస్త్ర మిందుకేమాత్రమూ సహకారి గాకుండా ఉంది.'

వెక్కి – వెక్కి యేడుస్తూ అతడు పడకపై వ్రాలిపోయినాడు. నాకేమీ తోచలేదు. అప్పటికి కొన్ని శాంతివచనాలు చెప్పి సుఖంగా విశ్రమింపమని వానికి చెప్పినా.

....

మరుదినం సాయంత్రం నేను ఆఫీసు నుంచి వచ్చేటప్పటికి గదిలో అతడు రైల్వేగైడు తిరగేస్తున్నట్లు కన్పించింది. నాకనుమానం కలిగింది.

'శంకర్ ! గైడెందుకురా తిప్పుతూ వున్నావు ? ఏ రైల్లోనో ఉడాయిద్దామనా ? అలాంటి పిచ్చిపనులు చేయద్దు. నేనుండే వరకూ నీకు వచ్చిన భయం లేదు. ఒక నౌకరీ రేపటి దినం నీకు దొరికే ఏర్పాటు చేసి వచ్చినా, దయచేసి యెక్కడికి పోవద్దు బ్రదర్ !'

'లేదోయి ! వూరికే పొద్దుపోకుంటే గైడు తిప్పుతూ బొంబాయిమెయిల్ యే స్టేషన్‌ల మధ్య యెంత వేగంతో పోతుందో లెక్కిస్తున్నా అంతే' అంటూ చిరునవ్వు నవ్వినాడు. అతడదే మొదటిసారి నవ్వడము. అతన్ని చూచి నాకూ సంతోషం కలిగింది. ఆరాత్రి సుఖంగా గడిపినా, రేడియో పాటలు వింటూ.

.....

నిద్రలేచి శంకర్‌ను చూడబోతే గదిలో అతని జాడలేదు. ఇల్లంతా వెదకినా యెక్కడా లేడు. నాకు దిగులయింది. ఇంతలో బజారులో యేవరో 'విన్నారా నిన్నరాత్రి మెయిలు క్రింద పడిన యువకుడు పాపం ! ఊరు పేరే యేమీ తెలీదట!!' అన్నారు. ఇంకేముంది ? గైడు తిరుగవేసిన దాని అర్థం నాకప్పటికి తెలిసింది. సమయం మించిపోయిన దానికేం చేయడం. స్నేహితుని దుర్గతికి వేడి కన్నీరు వదలినా.

మరునాటి పేపరులో యువకుని మరణవార్త పడింది. వాని వూరు పేరు తెలియ లేదనివుంది. అదే పేపరులోనే మరో పుటలో సౌ॥ లలితకున్నూ బారిష్టరు సుందరం గారికిన్ని వారం రోజుల్లో వివాహం జరుగనున్నదని ఫోటోతో కూడా ప్రకటితమైవుంది.

పెండ్లి నాటికి సరీగా లలితకు చేరునట్లు పాత రైల్వే గైడును టపాలో వేసినా.

**– 19,అక్టోబరు 1941, సాధనపత్రిక**

# బి.ఏ. అర్జీ

- కందాళ శేషాచార్యులు

'ఉస్ !...అబ్బా! బాధ! సీతా!వచ్చినావా తల్లీ? ఎంత సేపే మంచినీళ్లు తేవడం?"

'నన్నేంజేయమన్నావే, మగగుంపు కొళాయిచుట్టూ వుంటే ఆలస్యమయింది. అంతేనమ్మా!'

'పోనీలే ! టపావాడేదో జాబులుపడేసి పోయినాడు. అని యెవరురాసిందో కొంచెం చదివిచెప్పు.'

సీత రెండు జాబులూ చదివి వూరుకుంది.

'ఏమమ్మా వూరకున్నావు ? ఎవరెవరు రాసినదే'

'ఒకటి నెల్లూరిది, మీకు వియ్యంకులు కాబోయే ఆయనగారు రాసింది.'

'ఏం తెలిపినారో ? సంబంధం నిశ్చయించుకున్నారటనా ?'

'లేదట,వారి అబ్బాయిని ఐ.సి.యస్.కు పంపుతారట. నెలకు వంద రూపాయలు యిస్తూ కన్యకల నిచ్చేవారు తిరిగిపోతూన్నారట. కాబట్టి మన బీద సంబంధం వొల్లరట !'

'అయ్యో ! అది కూడా ఆశవదిలినట్టేనా? ముఖ్యం నీ చదవుకే సమకూర్చలేక ముసలి ముండను నేను ఆగసాట్లు పడుతూంటే అల్లుడు కాబోయే దద్దమ్మకు వందలూ వేలూ యెక్కడ తెత్తునే ? పోనీ ! మన ప్రారబ్ధం యిట్లుంది !... అబ్బా ! దాహం !!

తల్లికి నీరుతాగిస్తూ 'ఇంకోజాబు మా ప్రిన్సిపాల్ గారు రాసింది. పరీక్షలకు రోజులు తక్కువవుతాయి వెంటనే రావలసిందని, అంతే !'

'అయితే!నన్ను వదలి కాలేజీకి పోయిరా, పరవాలేదులే, రోగం కూడా నయమయ్యేట్టుంది. డాక్టరు మంచివాడే!..'

'ఆఁ చాల్లేవమ్మా ! నిన్నీ విధంగా విడిచి పోవడమే? చదువూ చట్టుబండలూనూ, నీవీసారి చల్లగా బాగుపడితే వచ్చేసారికి పరీక్షకుపోతాలే..'

అంటూ సీత వంట ప్రయత్నానికి పోయింది. బుచ్చమ్మ విధవరాలు. ఏకైక పుత్రికను గారాబంగా పెంచుతూంది. ఉన్న మడిమాన్యాలు అమ్మి చదివిస్తూంది. బిడ్డ యిప్పుడు యింటర్ సీనియర్‌లో ఉంది. పదహారేండ్ల ప్రాయం. మంచి తెలివిగలది, గుణవతి, రూపవతి కూడా. ఎన్ని సంబంధాలు వెదకినా కుదురలేదు. వరుడు చదువుకున్నవాడైతే ఏమిస్తావు, యెంత యిస్తావంటాడు. ఆఖరుసారి ప్రయత్నించిన నెల్లూరి సంబంధంకూడా యీ మోస్తరుదే అయింది. వరుడు రంగారావు సీతను వరించడానికి ఒప్పుకున్నాడు. కాని తల్లిదండ్రులు పడనీయలేదు. తల్లికి యీ మధ్యా జబ్బు చేస్తే సీత కాలేజీకి రజాపెట్టి బెంగుళూరికి వచ్చింది. దినదినానికి రోగం ముదురుతోన్నట్టు తోచింది. డాక్టరేమో యధా రీతిగా యెంత ధైర్యం

చెప్పుతూవచ్చినా అయమ్మాయికి నమ్మకం కలగలేదు. మాతృదేవతను వదలి చదువుముఖం పెట్టడానికి ఆమెకు సుతరామూ యిష్టంలేదు. తల్లికి సేవచేస్తూ కాలంవెళ్ళబుచ్చుతూంది.

....

'డాక్టరూ గారూ ! యీ వేళ అమ్మకు యెట్లుందండీ !'

'రక్తం పోటు యెక్కువగానే ఉందమ్మా! ఇప్పుడిచ్చిన యింజక్షను గంటలో పనిచేస్తుంది. పిమ్మట యీ సీసాలోని మందు అరగంటకో మోతాదు యిస్తురాండి. పరవాలేదు. నేను మరలా సాయంత్రం వచ్చి చూస్తా !'

అంటూ డాక్టరు వెళ్ళినాడు. సీతమ్మ నిలువునా కంపించి పోతూంది. ఎంత బిగపట్టినా కళ్ళ వెంట నీరు ప్రవహిస్తూనే ఉంది. హరీయని ఆ వొక్క ముసలి ప్రాణం పోతే ఆ మహానగరంలో పలకరించే దిక్కులేదు. సమీప బంధువులుగానీ, తన్ను చూచి దయదలచే వారు గానీ యెవరూ లేరు. తెచ్చిన ద్రవ్యమయిపోయింది. ఆ బాలిక వొంటరి, ఆమె మాత్రం యేం జేయగలదు? దిక్కుతోచక వసారాలో కూర్చొని దు:ఖముతో కుమిలిపోతూ మధ్యా నిట్టూర్పులు విడుస్తూంది.

ఎదురింటి మేడలో యెవడో ధనికుడు మిల్లు యజమాని బసచేసి రెండు రోజుల యింది. పేరు రామారావు. అతను కూడా పాపం ! తన తమ్ముని చికిత్సకు గాను ఆ వూరు వచ్చినట్లుంది. సంపన్నుడు కాబట్టి కక్కుర్తిపడకుండా డబ్బు వెదజల్లుతూ తమ్మునికి మందులి ప్పిస్తున్నాడు. ఆయన మేడమీద పచారుచేస్తూ విచారిస్తూన్న సీతమ్మను చూచినాడు. ఆయన కెందుకో చాలా జాలికలిగింది. వెంటనే క్రిందికి వచ్చినాడు.

'అమ్మాయీ ! ఏమలా విచారిస్తున్నావు ? మీ అమ్మగారి కెలాగుంది ?'

విచారించువారు దొరకనంతవరకూ దు:ఖము లోలోపలనే యిమిడి ఉంటుంది. ఎవరైనా కనికరంతో పల్కరించినారా, ఇక అంతటితో కట్టలు తెంచుకొని వ్యసనం పొర్లిపోతుంది. సీతకు ఆస్థితే కలిగింది. తెరలు తెరలుగా లోననేమో పొంగిపోయినట్లయింది.

నోట మాట రానివ్వలేదు. వెక్కి వెక్కి యేడువసాగింది. రావుగారి కంటి వెంట కూడ ధార ప్రవహించింది.

'అమ్మా చింతపడి ప్రయోజనంలేదు. మీ కథంతా డాక్టరుగారు చెప్పితే విన్నా. దినదినమూ నీవు పడుతూండే కష్టాలు చూస్తున్నా. ఇంత బిడియపడితే యీ పట్టణంలో చూచేవారేరీ? కన్నులు తుడుచుకో, మీ తల్లిని వోమారు చూస్తాం పద ...

లోపలి నుండీ యింతలో 'అయ్యో !... సీతా !' అన్న కేక వికృతంగా వినబడింది. ఇరువురూ గబగబా లోనికి పోయినారు. ఏముంది ! బుచ్చమ్మా యీ లోకం వీడిపోయింది.

'అమ్మా !' అంటూ కేకవేసి సీత నిలువునా కూలింది.

....

సాధారణంగా ధనికుల్లో ఉండే పిశినిగొట్టుతనం, గర్వమూ గాంభీర్యమూ యివేవీ రామరావుకు లేవు. అతనిది చాలా ఉదారస్వభావం. తానే అంత డబ్బూ చెల్లించి బుచ్చమ్మ కర్మలంతా చేయించినాడు. సీతను వోదార్చినాడు. ఆ బాలికను తానే స్వీకరించి, ఆమెను మంచిదారికి తెద్దామనే కుతూహలం దైవికంగా అతనికి కలిగింది. తన కోరికను ఆమెకు తెలియజేసినాడు. ఆమె కూడా చదువుకొన్నదే ! ప్రపంచజ్ఞానం కలదే ! అంతకంటే తన మేలుకోరేవారెవరున్నూ యీ విశాల ప్రపంచంలో కనబడలేదు. అతని కోరిక స్వీకరించింది.

తమ్మునికి ఆరోగ్యం కలుగుతూనే రామారావు సీతతో కూడా బొంబాయికి పయనమైనాడు. ఒక శుభముహూర్తంలో సీతా రామారావులకు అతివైభవంగా వివాహం జరిగింది. దంపతులకు మిల్లు యజమానులు వొకనాడూ, కార్మికులొకనాడా విందు లిచ్చినారు. ఆమె భర్త యనుమతితో బి.ఎ. వరకూ చదివి మొదటి దర్జాలో ప్యాస యింది. ఆమె వచ్చిన దాది మిల్లులలో అధికంగా లాభాలు వచ్చినాయి. రావుగారు సర్వాధికారాలు ఆమెకు సమర్పించినాడు. కంపెనీ పేరు 'రామారావు మిల్సు' అనుటకు బదులుగా 'సీతారామ్‌మిల్సు'గా మారింది, యిప్పుడు.

...

బొంబాయి దిన పత్రికలన్నిటలోనూ, సీతారామ్ మిల్సులో పనిచేయడానికి అదనంగా గుమాస్తాలూ, కూలీలూ, కావాలనీ, దరఖాస్తు దారులు శ్రీమతి సీతారామ రావుగారిని ఆఫీసు కాలంలో యింటర్వ్యూ చేయవచ్చుననీ, ప్రకటన మయింది. అసలే ఉద్యోగాలు దొరకని పాడు దినాలు. బోలెడు అర్జీలువచ్చి పడినాయి మిల్లు ఆఫీసులో.

పదకొండుకు సరీగా కారు ఆఫీసు ముందు నిలిచింది. సీతమ్మ బండిదిగి వయ్యారంగా ఆఫీసులోనికేగింది. వెలుపల వందల కొలది అర్జీదారులు ఆమెకు గాను కాచి వుండినారు. ఒక్కొక్కరినే లోనికి పంపమని దఫేదారు కుత్తర్వు ఇచ్చి ఆమె సోఫాలో కూర్చుంది. అర్జీల కట్టలు తిరగవేస్తుంటే ఆకస్మాత్తుగా ఒక దానిలోని సంతకం ఆమెను ఆకర్షించింది. 'అరే! రంగారావు ? యీ పేరెక్కడనో విన్నట్టుందే! ఏయ్ యెవరక్కడ ? ...రంగరావను యువకుని మొదటరమ్మను ' అంటూ ఉత్తర్వు నిచ్చింది.

....

రంగారావు బి.ఏ. తలవంచుకొని ఆమె ప్రశ్నకుత్తరమిస్తున్నాడు.

'మీదేవూరు ?'

'నెల్లూరు '

'అబ్బో ! యింత దూరం నౌకరీవచ్చినారే ! అక్కడ దొరక్కపోయిందా ?'

'దొరికివుంటే వచ్చేవాడినా ?'

'బి.ఏ. చదివి, కడాకు కూలీపనికా మీరు అర్జీ యివ్వడం ? మీ పట్టామర్యాదను పూర్తిగా పోగొట్టినారే ?

'అమ్మగారూ ! తిండిలేక చస్తున్నా ! మీరేపనిచ్చినా చేయగలుతాను, మీరు దయచూపకపోతే నాగతి ఆత్మహత్యే!'

'మీకు వివాహమయిందా !'

'లేదు '

'పాపం ! ఐ.సి.యస్. పంపడానికి నెలకు వంద చొప్పున యెవ్వరూ యివ్వలేదు కాబోలు !... అంతేనా ?'

ఆ మాటలు వింటూ, అతను నిలువునా కంపించిపోయినాడు. ఒకమారామె ముఖంవైపు చూచినాడు. అప్రయత్నంగా కన్నీరు జలజలరాలింది. తక్షణం ఆమె పాదములమీదపడి వెక్కివెక్కి యేడవసాగినాడు.

'రంగారావూ ! ఇప్పుడు పశ్చాత్తాపపడి ప్రయోజనంలేదు. గర్వితులకంతా దేవుడే తగినశాంతిని ప్రసాదిస్తాడు. కన్యాదాత నేడ్పించి చదువుదామనే దురలవాటు నశించు వరకూ మీలాంటి వారి గతి యింతే ! ఇది ఆఫీసు ! మీరలా నమస్కారం చేయడమూ, యేడ్వడమూ బాగులేదు. లేవండి, గతాన్ని మరువండి.

...

సీతారాం మిల్లులో పని యిప్పుడు జోరుగాసాగిపోతూంది. రంగారావు, బి.ఏ. దానికిప్పుడు మ్యానేజరు. అతని జీతం నెలకు 300 రూ. ప్రతి దినమూ సీతమ్మ తల్లిని తలుస్తూ దీపం వెలిగించడం అతని వాడుక.

**– 15 నవంబర్ 1941, సాధనపత్రిక**

# ఆకలి

**– కందాళ శేషాచార్యులు**

“ఎన్ని మార్లోయి నీకు చెప్పడం? మరల మరలా శనిలాగ దాపరిస్తున్నావు! ఒక్క మారు చెబితే తెలివుండాలి! ఇక్కడ ఉద్యోగాలు ఖాళీలేవు. లేవు లేవు. సరా! ఇక వెళ్లిపో!!'

'జీవనం జరక్క రెండు ప్రాణాలు కుమిలి మాడిపోతున్నాయి. సార్ ! ఆకలిమంట లార్పడానికి యేదైనా చిన్నపని దొరికినా చాలండీ ! మీ పేరు నిత్యమూ జపిస్తాం !'

'అరే ! మరలా నీ సోదెనే ప్రారంభించినావు ? కదలు యిక్కడి నుంచీ, నాకు పనుంది... కదలవేం ? ...ఏయ్ దఫేదార్...'

వేడినిట్టూర్పు విడుస్తూ రంగడు వెనుదిరిగినాడు.

....

'నన్నేంజేయమన్నావే, పని దొరికితేనా? '

'సిగ్గులేకుంటే సరీ ! యెందుకండీ మగజన్మమెత్తడం? యీ మొగానికేనా పనిదొరకడం! ఛీ!'...మూడు దినాలుగా పొయి మండలేదు కదా! ఏమి తిని బ్రతకమంటారో చెప్పండి?”

'మంగూ ! నీవు కూడా మండిపడితే, నాగతేం ? తిరిగి తిరిగి కాళ్లు పుండ్లయినాయి. ఈ దినం కూడా మిల్లు యజమాని తరిమేసినాడు. యెక్కడా ఖాళీలేదనీ, నాకా తల తిరిగి పోతూంది. దేహం సుస్తీగా ఉంది? ”

'మరి నాకు మాత్రమో! ఓయి దేవుడా! యిలాంటి నిర్భాగ్యుణ్ని భర్తగా నా కెందుకు అంటగట్టినావురా తండ్రీ! తిండీ బట్టా సుఖమే లేదు. దీనికితోడు పిల్లా చెల్లా కలిగి వుంటే మా గతి కుక్కలు కూడా పడవు ! రేపటిలోగా యే బావో చెరువో చూచుకుంటే పీడ వదలి పోతుంది.'

'ఒసే ! ఊరకే వదురుతూ ఉంటే ప్రయోజనం? నీవేమి చేయమంటే అదిచేస్తా ! చెప్పరాదూ!'

'ఏమి చేయమనేదీ! పాడిందే పాట... మరలా! ఏం చేస్తారో చేయండి! సాయంత్రంలోగా తిండికి సమకూరిస్తే, అంతేచాలు! లేక నా సలహా, యెందుకూ !'

....

'మగవాడే చావుచస్తే యేం! యీ అడంగులకు కావలసింది తెచ్చిపెడితే సరి. సంపాదన! సంపాదన ! ఒకటేగోల. 'భార్య జోలిచూస్తుంది ! తల్లి కడుపు చూస్తుంది' అని వూరికే అంటారా పెద్దవాళ్ళు ! నాకో ! యింటా బయటా రెండు విధాలా పోట్లు తప్పలేదు. ఏమి చేయడమో తోచలేదు.'

బజారు మోటులో కూర్చుని రంగడు చాలసేపు ఆలోచించినాడు. తళుక్కున మెఱుపు మాదిరి వొక విధానం తట్టింది. ఏమైనా కాని, అని తెగించి లేచినాడు. గబగబా బజారులోకి వెళ్లినాడు.

...

వంట తయారయింది. భర్తకుపెట్టి తాను భోంచేసింది మంగు. నాటి రాత్రి ఆమెకు కలిగిన ఆనందానికి మేరలేదు. భర్త సాక్షాత్తు రంగనాయకుడైనాడు ఆమె పాలిటికి. పది దినాలకు సరిపోయే బియ్యమూ, మిగతా పదార్థాలూ యిల్లుచేరింది. అతడు డబ్బు లెక్కిస్తూ వెర్రిగా నవ్వుతూన్నాడు. 'ఒకటి, రెండు... పది! పదిరూపాయాలే !'

మీ పౌరుషం యీ దినం వెల్లడయిదండీ ! భేష్ ! యిప్పుడు నాకు సంతోషమ యింది! నా తపస్సు ఫలించింది!! మగవారు ప్రయత్నపడితే , యే పనికాదు ? సోమరితనం వదిలేసి దినమూ యీ మాత్రం కష్టపడితే !!' అంటూ మంగు యింటిలోని సామానులు సర్దింది. ఇరువురికీ బిచానా వేస్తూ కూనిరాగాలు తీస్తుంది!

'కట్, కట్' మంటూ తలుపు చప్పుడయింది. రంగడు తలుపుతీసినాడు. వెంటనే పోలీసులూ, గంగారామ్ మార్వాడీ ప్రవేశించినారు.

'ఇగో ! యీ వేధవేనండీ, దొంగ ! సమయం చూచి గల్లాపెట్టెలోని పదిహేను రూపాయలు...' అంటూ ఉండగా బేడీలు తగిలించినారు రంగని చేతులకు.

పోలీసులు లాక్కొని పోతుంటే అట్టహాసంగా నవ్వుతూ రంగడు 'మంగీ ! చూస్తివా! నా తపస్సు కూడా ఇప్పటికి ఫలించింది. శ్రమ తొలగిపోయిందీనాటితో ! చీకూ చింతా లేకుండా జైలులో భత్యం దొరుకుతుంది నాకు! అక్కడికి నీవూ వస్తేమేలే ! ఆడదానివని చింతింప పనేలేదు! నీవు కూడా రావచ్చు సులభంగా !! చెప్పనా ఆ మార్గమేదో!'

మంగు నిర్ఘాంతపోయి చూస్తూ వాకిట్లో నిలువునా కూలిపోయింది.

**– 24 జనవరి 1942, సాధనపత్రిక**

# చిరంజీవి

**– జి. రామకృష్ణ**

ఇంకా పెదింత పొద్దుంది. వెంకటరాముడు అప్పుడే పనులన్నిటిని గదుముకొని ఇంటికి వస్తూ వున్నాడు. కుఱ్ఱలు చౌకలించుతూ, అంకెలేస్తూ వస్తున్నాయి. వెంకట్రాముడు తన చిక్కాన్ని కట్టెకు తగిలించి భుజాన వ్రేలాడేసుకొని చలకోలతో మందను తోలుతూ ముందుపడి వస్తున్నాడు. ఊరి ముందుకు వచ్చిన తర్వాత సుబ్బన్న మామా యెదురై అడిగినాడు. 'యేరా యంగట్రాముడూ! ఇంకా పొద్దుండగానే యింటికి తోలుతావుండావేమీ, రెడ్డి అరచడాయేమి?'

వెంకట్రాముడు యేమీ బదులు చెప్పలేదు. 'ఉండు మామా' అన్నాడు అంతే. ఆత్రంగా ప్రక్క దోవలు పడుతూ వున్న పసరాలను వూర్లోకి మళ్లించి ముందుకు పడిపోతూ ఉన్నాడు.

ఊర్లోకి పసులొచ్చింది చూసి కొంతమంది పిల్లలు వెంకటరాముని వద్దకు పరుగెత్తి వచ్చినారు. ప్రతి దినము వెంకట్రాముడు చేనినుంచి వచ్చేటప్పుడు సద్దకంకులో, పెసరకాయలో, తెచ్చి యిచ్చే అలవాటు. ఈ దినం ఆ పొలకనేమి కనపడక పిల్లలు యెగాదిగా చూసి వెళ్లిపోయినారు.

కొంత దూరము పోయిన తర్వాత యెదురింటి అచ్చమ్మవ్వ యెదురై అడిగింది. 'యేరా యెంగట్రాముడూ! నేను చెప్పిన ఆకు తెస్తివా?'

'తెస్తాలెవ్వా' అని పరధ్యానంగా బదులు చెప్పి ముందుకు నడిచినాడు.

ఇంతలో నారమ్మ అత్త దగ్గుతో అగ్గి తీసుకుపోతూ వచ్చింది. 'ఏమి యంగట్రా ముడూ! మీ యమ్మకు యెట్లుంది'అని అడిగింది. అట్లే ఉందత్తా'అని బదులు చెప్పి ప్రక్కకు తిరిగి చూచినాడు. పశువులన్నీ రెడ్డి యింటి ముఖం పట్టిపోతున్నాయి. పోతాయిలే అను కుంటూ, తాను తన గుడిసె యింటికి పోయినాడు.

వెంకట్రాముడు తడిక తీసి గుడిసెలో ప్రవేశించాడు. తల్లి కుక్కి మంచములో పడి మూలుగుతూ ఉంది.'అమ్మా... ఓం మ్మా!'అని పలకరించాడు.తల్లి కొంచెం కదిలి, 'యేమి నాయనా వస్తివా, నీవు వచ్చేదంకన్న వుంటానో లేదో అనుకుంటి' అని కొడుకును దగ్గరగా తీసుకుంది.

'నాయనా... యంగట్రాముడూ...యింక నేను బ్రతకునురా, చచ్చేదాన్ని యట్లా సస్తాను... నిన్నో... యింటోన్నన్నా.. చేసి చచ్చివుంటే ...నా ప్రాణానికి బాగుండేది. రెడ్డికి గూడ ఈ సంతతి చెప్పితి. 'నాయనా, ముసిలి ముండనయినాను. నా బొందిలో ప్రాణ ముండగానే నా కొడుక్కు పెండ్లి చెయ్యి...నా జీవితంలో ఆ సంబరమన్నాచూసి సస్తాను' అని... కాని ఆ మారాజు చెవులోనన్నా వేసుకోలా'.

వెంకట్రామునికి చావంటే భయం, తన తండ్రి చచ్చినప్పుడు ఆ దు:ఖాన్ని అనుభ వించినాడు. ఇప్పుడు మళ్లా తల్లి చావును జ్ఞాపకం చేస్తూ వుంది. ఆ భయాన్నంతా దిగమింగి తల్లిని ఓదార్చుదామనుకొని ' నేను బాగా పెద్ద అయిన తరువాత సంపాదించి

చేసుకుంటాలేమ్మా, నువ్వేమీ దిగులుపడొద్దు' అన్నాడు.

'దిగులెందుకు నాయనా, నాకెందుకు దిగులు, అంతా రెడ్డోరే చూసుకుంటారు. మీ నాయన పెండ్లి చేసింది వాండ్లే కదా? మీ తాత పెండ్లి కూడా రెడ్డోరే చేసినారట. ఇంక నీ పెండ్లికి మాత్రము లోటు చేస్తారా నాయనా, నువ్వు సంపాయించేదెప్పుడు? మీకు సంపాయించే రాతే వుంటే, యిప్పటికి రెడ్డోరి బాకీ తీరేవుండును. ఎప్పుడో మీ ముత్తాత పెండ్లికిగాను మూడు యిరవైలు రెడ్డోరితో అప్పు తీసుకుండారంట. ఆ అప్పు అట్లే వస్తావుంది. వడ్డీ కట్టలేక తల్లులు పిల్లలు యింటి చాకిరీ చేస్తావుండాము. చాకిరీ చేస్తే వాండ్లే యింత కూడు గుడ్డా యేస్తారు. వాండ్లనే నమ్ముకుంటే నీకు పెండ్లి కూడా చేస్తారు. నా కండ్ల ముందర కాకున్నా... అమ్మయ్యా!.. వెంకటేశుడా...నారాయణమూర్తీ... యిన్ని నీళ్లు యీ నాయినా, నోరు ఆరుకొస్తావుంది'.

'గంజి తెస్తాను తాగమ్మా, పొద్దున్నుంచి కడుపులోకి యేమీ పోలేదు'

'గంజి యెవరు చేసిస్తారు నాయనా మనకు'

'పోనీ సంగటే తెస్తాను నీళ్లలో పిసికితే గంజి అవుతుంది'

'పో, పోయి బిరీనరా'

వెంకటరాముడు రెడ్డి యింటికి పోతూ వున్నాడు. దోవలోయెక్కడలేని ఆలోచనలు తట్టాయి, వచ్చేటప్పుడు పశువులను గాటిపాట్న కట్టేసి రాలేదు. కోడెలన్నీ పోట్లాడి యిల్లంతా గగ్గోలు పట్టించి వుంటాయి. పసిగిత్త మందలో ఉండినట్లే లేదు. కట్టి వేయనందువల్ల, ఆవు లన్నీ పాలుచేపి దూడలను తాపుకొని వుంటాయి. ఈరాత్రికి పాలు లేనట్లే. ఇదంతా చూసి రెడ్డి ఉగ్రుడై ఉంటాడు. ఆలోచనలతోనే వెంకట్రాముడు రెడ్డింటి వాకిలి త్రొక్కినాడు. రెడ్డి గర్జనలు వినపడినాయి. ఎదుటపడినాడు. వెంటనే రెడ్డి అందుకున్నాడు.

'థూ. యెందరికి పుట్టింటివిరా, ఋణపాతకం నాకొడుకా...ఈనికి పెండ్లంట. పెండ్లి. ఈ నమ్మ ముండ పనికిరాక మూడు దినాలాయ, ఈ లంజకొడుకు.....'

నోటి దురద తీరేదంకా రెడ్డి తిట్టినాడు. చేతిలోని బఱ్ఱ విరిగేదంకా కొట్టినాడు. వెంకట్రాముడు కిమిక్కు మనలేదు. ఒక చోట కుప్పైకూచున్నాడు. ఆవేశము తగ్గిన తర్వాత రెడ్డి వెళ్లిపోయాడు.

రెడ్డి భార్య లక్ష్మమ్మ దయగల తల్లి. వెంకటరామున్ని పిలిచింది. అతనితో సంగతం తావిని, పుటకగంప నిండా సంగటి ముద్దలు నింపింది. ఇంత ముంతకు చారుపోసి వెంకటరామునికి యిచ్చింది.

వెంకటరాముడు తీసుకొని బిరబిర్న యింటికి పోయినాడు. ఇంటిలో అమ్మ మూలుగు వినపడ లేదు. పలుకరించాడు.

'అమ్మా ! ఓం మ్మా!" అమ్మ పలుకలేదు.

**– 26 మార్చి 1941, విజయవాణి పత్రిక (ఉగాది ప్రత్యేక సంచిక)**

# కడగండ్లు

– కె.సభా

*(సాహూకార్లు చేసే దుండగాలు*

*తత్ఫలితంగా బీదాళ్లు పడే కడగండ్లే ఈ కడగండ్ల కథా వస్తువు)*

**మే** మాస మధ్యాహ్నసమయం వేడి వేడిగాడ్పులు వీస్తున్నై లోకాన్ని భానుడు మాడ్చేస్తున్నాడు. శ్రీమంతులు, సంపన్నులు, తమ మేడల్లో విసవిసవీచే పంకాలమధ్య, చల్లటి కమ్మనివాసనల్లో హాయి హాయి యంటుండే తరుణం.

ఎంకన్న ఆ నడి యెండలో అతికష్టం మీద మోటతోల్తున్నాడు. ఆ వేడిమికి తాళుకోలేక పాపం నోరులేని యెద్దు చొంగలు కారుస్తున్నై. వాటి కన్నీటి కణాలు జారిపోయ తున్నై. ఎంకన్న బట్టలు స్వేదబిందువుల్లో తడవటం ఎండటంగా వున్నై. తొలి కోడికూతతో కట్టిన కపిల ఇంకా ఒదిలెట్టలేదు.

దబదబ మంటూ ధ్వని వినబడింది. ఎంకన్న తిరిగి చూచాడు. దొరువుమెల్లగా దొర్లు కొంటూంది. వెంటనే తప్పుకోబోయాడు. కానీ సాధ్యంగాక పోయింది. సర్వము బావిలోనే పడినై. చుట్టు ప్రక్కల వాళ్లు పరుగెత్తుకొచ్చారు. ఎంకన్న బావిలో స్పృహ తప్పి మునిగి పోతున్నాడు. వారిలో కొందరు సాహిసించి దుమికారు. ఎంకన్నను మెల్లగా గట్టు జేర్చారు. బావిలో ఓ యెద్దు మాత్రము ఈదుకొంటుంటే చూచారు. వెంటనే సాహుకారికి ఈ వార్త అందజేశారు.

సాహుకారు కొంత సమూహంతో కావలసిన పరికరాలతో పరుగిడివచ్చాడు. బావికీమూల పెద్ద పెద్ద కొయ్యలమర్చారు. మోకుల సహాయంతో ఎద్దును బైటకులాగారు.ఆ ఎద్దుకు సైతము బలమైన గాయాలు దగిలినై.

ఎంకన్నకు కాస్త తెలివొచ్చింది. లేచిచూచాడు. జరిగిందంతా గ్రహించాడు. తనకు తగిలిన గాయల నుండి చిమ్మే రక్తాన్ని చూచాడు. ఏం చేస్తాడు పాపం. ఆ గాయాల్ని లెక్క చేయకుండాపైకిలేచి గాయాలు తగిలిన ఎద్దును దగ్గరించాడు. ఇంకో ఎద్దు ఏదీ అన్నాడు దగ్గుత్తికతో అదుర్తూ బెదుర్తూ.

ఇంత వరకు ఆ ఎద్దు నందరూ గట్టులోనే వుందనుకున్నారు. అది గట్టులోన లేదు.అది బావిలోనే దొరువు క్రింద పూడుకుపోయింది. శాశ్వతంగా చల్లటి నీటి పట్టులో పడుకొంది. ఆ సాధు జంతువు ఈ రక్కసుల బాధ తప్పించుకొంది. ఆ ఎద్దు ఆ సాహుకారుకు పదేళ్లుగా కష్టపడుతోంది. ఈనాడు ఈలోకాన్ని ఒదిలెట్టింది.

సాహుకారు సర్వమూ గ్రహించాడు. అప్పటికేమీ మాట్లాళ్లేదు. కానీ ఎంకన్నను మాత్రం తీవ్రంగా చూచాడు. ఆచూపుల్లో చూడు నిన్నేంచేస్తానో అనే భావం ఎంకన్నకు ప్రస్ఫుటంగా గోచరించింది. ఎంకన్నా గుండె టకటక లాడింది. అతని ఒళ్లు దడదడమంటూ ఒణికి

పోయింది. నేనేం తప్పు చేశానుస్వామీ అన్నట్టు పరితాపంగా జూశాడు. మెల్లగా ఎద్దును లేవగొట్టి తోలుకొని వూరివైపు దారితీశాడు కళ్లనీళ్లు తుడుచుకుంటూ. ఎంకన్న గుడిసె ఊరి చివరిలో ఉంది.ఒకప్పుడు ఆ ప్రదేశం మిద్దెటిండ్లతో కళకళలాడింది. కానీ పరిస్థితుల అవక తవకల్లో అది గుడిసెగా మారింది. ఆ గుడిసెవుండే స్థలము మరీ రెండు ఎకరాలు చేను ఎంకన్నకు చెప్పదగ్గ ఆస్థి.

గాయాలతో పాటు చలిజ్వరం వచ్చింది. ఆ పూరి గుడిసెలో మాసిన బొంతను కప్పుకొని చలికి అల్లాడుతున్నాడు. బిడ్డలు పాపం తండ్రికి చలిపోగొట్టటానికి చినిగిన గోనె సంచులు కప్పి అదిమిపట్టుకొంటున్నారు. ఎంకన్న భార్య సుబ్బి సాహుకారింట్లో పని చేయటాని కెళ్లిందింకారాలేదు.

ఎంకా ఎంకా అనే పిలుపు వినబడింది. ఏంబాబు అన్నాడు లేచినిలబడి. నిన్ను సాహుకారు రమ్మంటున్నాడు అన్నాడు తలారి. బాబూ చలిజ్వరం, గాయాల నొప్పి బాధగా ఉంది. ప్రొద్దునే కనబడుతానని చెప్పుబాబూ అన్నాడు దీనంగా వేడుకొంటూ తలారీ వెళ్లిపోయాడు.

ఆనాడు సాహుకారి ఒక పంచాయితీ చేర్చాడు. అందరూ భజన గుడివద్ద మూగారు. బావిలో పడి పూడుకుపోయిన సాహుకారు ఎద్దు నష్టాన్ని కట్టిచ్చేవాళ్లెవరు? ఇదీ పంచాయితీలో తీర్మానం కావలసిన విషయం.అందరు తలోమాట మెల్లగా చెప్పుకొంటున్నారు. కానీ అందులో ఎవరూగూడా సాహూకారుకు వ్యతిరేకించలేరు. అతనికి విరుద్ధంగా మాట్లాడి బ్రతకలేరు.

తలారి ఎంకడు చెప్పిన విషయాన్ని పంచాయితీలో చెప్పాడు. సాహుకారు ఉగ్రుడై పోయాడు. మండిపడ్డాడు. నా ఎద్దును చంపిందీ గాక పిల్పిస్తే పలక్క పోవటం అంత పొగరా వాడకని గద్దించాడు. వెంటనే పిలుచుకురా అనీ మళ్లీ అజ్ఞాపించాడు, తలారీ మళ్లీ వెళ్లాడు. పాపం అప్పుడే ఆబాధకు అట్టే ఒళ్లుమరిచాడు ఎంకన్న. వెంటనే పిలుపు. సాహుకారు కోపించుకున్నాడని, అందరూ పంచాయితీ చేరారని, రాకుంటే వారే వచ్చి, ఈడ్చుకొస్తారని తలారిచెప్పాడు.

వెంటనే ఎంకన్న పాపం తూగుడుతో లేచాడు. ఒకళ్ల సాయంతో మెల్లగా పంచాయితీ స్థానాన్ని చేరుకున్నాడు. సాహుకారు ప్రధానమంత్రి కామయ్య ఎంకన్నను పలకరించాడు. సాహుకారు ఎద్దు నీ మూలంగానే నష్టమైందని, అందుకు నీవే బాధ్యుడవనీ, నీవే అచ్చుకోవాలీ అనీ చెప్పాడు. ఎంకన్న హృదయ కుహరంలో పిడుగుపడింది. ఆ సమ యం తాను బ్రతికిందే ఎక్కువైంది. దొరువు దొర్లుకోవటం తన తప్పట. ఎద్దు నష్టాన్ని తానే కట్టివ్వాలి నట. అబ్బా! ఈ న్యాయాన్నెలా సహిస్తాడు. ఆలోచించాడు. అదెల బాబూ నేను బాధ్యుడైతాను అన్నాడు మెల్లగా బెదురుతూ! ఏమో నాకు తెలీదన్నాడు కామయ్య. పంచాయితీ పెద్ద మనుష్యుల్ని పేరుపేరున నీవు చెప్పు బాబూ అన్నాడు. పేరుకు పంచాయితీ అక్కడుండేవి జీవంలేని విగ్రహాలు. సాహుకారు ఏ న్యాయము తీర్మానించినా చెల్లాలి. అలా చెల్లకుంటే విధి లేదు. ఎంకన్నా యోచించాడు.ఏం చేస్తాడు. ఆ క్లిష్టపరిస్థితుల్లో అతనికి అయ్యోమనే ప్రాణిలేదు.

అందరూ ఉన్నారు. కానీ ముందుబడే దాతలేడు. మిటకర్తిస్తున్నాడు. ఏదొకటి వెంటనే తీర్మానం కావాలంటూ సాహుకారు హెచ్చరించాడు.

ఒక ఎద్దు ఖరీదు ఎన్ని రూపాయలు విధిస్తామో, దాన్ని ఎన్నాళ్లకు తాను తీర్చగలడు? పాపం అతడు మెట్లులేని బావిలో పడ్డాడు.దారిలేని సంద్రంలో దగుల్కొన్నాడు. హృదయం మాత్రం బలవంతునితో విరోధం అపాయకరమంటోంది. ఒక్కొక్క మారు ఏం చేస్తామో చూతామంటూ సాహసించబోతోంది.

నావల్ల కాదు బాబు బీదోణ్ణి అంత మొత్తం కట్టలేను. కనికరించండంటూ అందరిలో, ఆ భజన గుడిలో నిద్రబోతుండే జీవంలేని రాత్రి విగ్రహం యెదుట సాహుకార్ని ప్రార్థించాడు. వేడుకున్నాడు.కన్నీరు ఒదిలాడు. కర్కశహృదయుడు సాహుకారుకు కనికరం బదులు, అహంకారంతో కూడిన కోపాగ్ని ప్రభలింది. ఛీ పో బుద్ధిలేదో అని కసిరాడు. దూరంగా పొమ్మన్నాడు కంపుకొడుతాంది దరిద్రుడా అన్నాడు.

వాస్తవమే బీదోళ్ల వద్ద కంపుకొడుతుంది.వారి బట్టలు తల ఒళ్లు మాసిపోయివుంటె, చీమురక్తంతో బాధిస్తుండే గాయాల్తో, చలి జ్వరంతో మాసిన చిరిగిన గోనె సంచులు కప్పు కునుండే ఎంకని దగ్గఱ కంపు కొడుతోంది. ఆ కంపు బీదోళ్ల రక్తం పిండి పీల్చి వారి హృదయాలిని మాడ్చి వేపుకుతినే, సాహుకార్ల వద్ద లక్ష్మితాండవమాడుతుంటుంది. ఆ లచ్చి బుద్ధి అంత లచ్చనంగా ఉంది. శ్రీ మన్నారయణామూర్తి వాళ్లనే కనికరిస్తాడు. వారికే వర మిస్తాడు. శ్రీ మహాలక్ష్మి వారి గృహంలోనే శాశ్వతంగా ఉంటుంది. నాలుగు మొగాల బ్రహ్మకలము వారి నొసట వ్రాసేటప్పుడు ఓపిగ్గా అతి భయభయముల్తో వ్రాస్తుంది. ఆయన గారి భార్యారత్నం, సరస్వతీ దేవీ ధనికుల్నే ఎక్కువగా వర్తిస్తుంది. ఇవన్నీలీలానాటక సూత్రదారుని కపటలీలలంటారు మనోళ్లు.

ఎంకన్న ఆలోచించాడు. ఒక తీర్మానానికొచ్చాడు. ఏమైనాగానీ ఆ తప్పు నాదిగా దన్నాడు.సాహుకారుపైకి లేచాడు. రేపు సాయంకాలంలోగా నిన్ను మూయిస్తానన్నాడు. నీ పనితీరుస్తానన్నాడు. అందరూ ఎంకన్నకు హితోపదేశం చేశారు. సాహూకార్లతో జరిగిన వాళ్లతో విరోధం తగనిపని అన్నారు.సాహుకారన్నాడంటే అన్నంత పనిచేసితీరుతాడన్నారు. ఏదో ఓ విధంగా పోవటం మంచిదన్నారు. అందరూ వెంకన్నకు హితోపదేశం చేసే వారే కానీ ఎవరూ అతని బీదరికం గురించి కాని అతడు నిర్ధోషనిగాని చెప్పటానికి సాహిసించిన పెద్దమనుష్యులేరు.ఆ పెద్ద మనుష్యుల్లో అందరూ మనుష్యులే. పంచాయతే.

వెంకన్న మూసేస్తాడన్న మాట వినిందే భయపడ్డాడు. పోలీసోళ్లంటే వెంకన్నకు ఏమీ తెలీదు. కానీ అప్పుడప్పుడు పోలీసులు సాహుకారింటికి రావటం, ఆ దినం విందులు జరగటం, పోయేటప్పుడు ఒకరిద్దర్ని సాహుకారు చెప్పిన వాళ్లని బెదిరించటమో పట్టుకుపోయి ఒది లెట్టటమో, నాలుగు రోజులు రిమాండులో ఉంచటమో, తన్ని కొట్టి పంపటమో, తన అనుభవములో చాలా మార్లు చూశాడు. జంకాడు, సరేనన్నట్లు తలవాల్చాడు.

సాహుకారుకు పెద్ద మనుష్యులా సమాచారాన్ని తెలియజేశారు. సాహుకారు పొద్దున్నే ఎనిమిదింటికి తనింటికి రమ్మని చెప్పి వెళ్లిపోయాడు. అందరూ లేచారు. ఎంకన్న ఇంతటితో ఒదిలింది మంచికాలమన్నారు కొందరు. ఎంకడెలాగో మొదట్లోనే తెలివి తెచ్చు కొన్నాడన్నారు మరికొందరు. ఇంతకు ఎంకనికి మంచి కాలం లేకుంటే సాహూకారు కనికరిస్తాడా అనన్నారు కొందరు పెద్ద మనుష్యులు. పాపం ఎంకడు మాత్రం ఎలా తీర్చబోతాడో సొమ్మన్నాడొకాయన. ఉండే రెండు ఎకరాల చేను సరిపోతుందన్నాడు సమాధానంగా ఇంకొక పుల్లయ్య.

వెంకన్న హృదయం బరువైంది. ఆ చీకట్లో తడుముకుంటు, అదుర్తూ ఆ బాధకు నడవలేక నడచిపోయాడు. గాడాంధకారంలో లీనమైన పూరిగుడిసెలో అతి ప్రయాసమీద శరీరాన్ని కూలద్రోశాడు. అంతులేని ఆలోచనలతో పచ్చినెత్తుటి గాయాల్తో, తీవ్రమైన జ్వరంతో, గజగజ వణికే చలితో... ఆరాత్రి గడిపాడు.

కరనమయ్య కలం వడిగా నడుస్తోంది. మధ్య మధ్య ఆగి మళ్లీ కదులుతోంది. ఎంకయ్య కుటుంబ ఖర్చులకుగాను రొక్కంగా పుచ్చుకొన్న రూపాయలు మూడువందల యాభైలు. మళ్లీ అడిగిన తక్షణం చెల్లించేలా షరతు. అలా చెల్లించకుంటే, ఎంకయ్య చేన్లు స్వాధీనం చేసుకొనేలా స్వాధీనఅడమాన పత్రం వ్రాయబడింది. వడ్డికి బదులుగా సాహూకారు ఎంకయ్య చేలనుండి వచ్చిన ఫలితాన్ని అనుభవిస్తుంటాడు. ఏనాడైతే ఎంకడు అప్పు తీరుస్తాడో ఆనాడు చేలు ఎంకయ్య స్వాధీనమౌతుంది.

కరణం గారి కలం ఆగింది. సాహూకారు ఎంకయ్య వైపు అధికారపూర్వకంగా చూట్టం ఎంకయ్య ఎడమచేతి బొటన వ్రేలు చూపట్టి కరణం గారు కార్యం ముగించటం నిమిషాల్లోనే జరిగింది.

కరణాలంటే ఆ కరణమనే పదానికి నిర్వచనం ఇవ్వాలంటే యిలా చెప్పటం తప్పుగాదేమో అనిపిస్తుంది.

'క' కారే కలహకంఠ

'ర' కారే రాక్షసాన్వయ

'న' కారే నాగసర్పంశ్చ

'ము' కారే మూషికోనరి

అంటే కలహంలో కవులు వర్ణించిన నారదునికే మాత్రం తీసిపోడన్నమాట. మరి 'ర' యెందు హెచ్చిందంటే ప్రస్తుతం రాక్షసులు లేనిలోటును వాళ్లు పూరిస్తూ ఆ స్థానాన్నా క్రమించారు. 'న' అనే అక్షరం యొక్క మూలభావం యేంటంటే చలపెట్టటంలో సమయం జూచి కాటేయ్యటంలో త్రాచుపాములన్నమాటే. మరి 'ము' మూలం, ముషికోన్నారి. అంటే మార్జాల చక్రవర్తి అంటే మౌనంగా, మెత్తగా పనిచేయటం పిల్లి మనోళ్ల దగ్గరే నేర్చుకోవాలి.

ఇన్ని అక్షరాలతో మిళితమైన ఆ కరణం అనే పదం సంఘములో చిరకాలం నుండి

వేరు పురుగులాపనిచేస్తోంది. దాన్ని పెరికేయాలంటే బీదోళ్ల తరంగాదేమో అనిపిస్తుందో సారి. ఎందుకంటే వాళ్లని సాహూకార్లు మేపుకొంటున్నారు గాబట్టి.

పట్టపగలే ఎంకయ్య కళ్లల్లో దుమ్ముగొట్టి పత్రం వ్రాసాడు. అంటే ఎంకయ్య సొమ్ము మూడవందలయాభై దోచుకొన్నారన్నమాట. ఎంకయ్య అన్యాయంగా నా వద్దా వ్రాసుకొన్నాడనంటే చాలు ఆయన చేతిని బేడీలు అలంకరిస్తై.

ఇలాంటి చిక్కుల్లో ఈ రాక్షసుల మధ్య ఎంకయ్య తన జీవితాన్నెలా గడుపుతాడో చూడాలి.

దినాలు గడిచే కొద్దీ ఎంకన్నకు చలి జ్వరం ఎక్కువైంది. గాయాల బాధ విపరీతంగా వుంది.మందు మాకిచ్చే దిక్కు లేదా గ్రామంలో. సాహూకారు రోజూ పొలాలన్ని పాడయ్యా యని పాపిష్టి ఎంకని మూలన పైర్లన్ని ఎండిపోయాయని, అసలు పనికి గూడా రావటంలేదని చిందులాడుతున్నాడు. వాళ్ల చేతిలో మందు పుచ్చుకోటానికి కానీ డబ్బులు లేవు.

ధర్మవైద్యశాల యిరువది మైళ్లల్లో వుందనివిన్నాడు. కానీ అక్కడ గూడాపైసా చూపితేనేగాని ముఖమైనా సరిగ్గా చూడరని వాళ్లు వీళ్లు చెప్పుకోవటం వినటం మూలాన ఆ ప్రయత్నం నుండి మానుకొన్నాడు.

ఎంకన్న భార్య సుబ్బి రోజూ సాహూకారింట్లో చాకిరీ చేస్తుంటుంది.ఒక్క నెల పూర్తిగా జేస్తే రెండురూపాయలు ముట్టజెప్తుతారు. గ్రహచ్చారవశాత్తే దినమైనా ఆగిందంటే ఆ దినం బేడ డబ్బులు ఆమెకు దూరమయ్యేయి.కానీ దానికి బదులు చీవాట్లు మాత్రం అందేవి.

వేకువన లేచి వెడుతుంది. పాచి పనులతో ప్రారంభిస్తుంది. మధ్యాహ్నమైందంటే ఓ పది నిమిషాల పాటు యింటికి రానిస్తారు. ఆ పది నిమిషాల్లో వచ్చి తను తెచ్చిన రెండు రాగి ముద్దలు బిడ్డలకు, మగనికందిచ్చి వెంటనే వెళ్లిపోతుంది. మళ్లీ రాత్రి పది గంటలకు వరకు విశ్రాంతి అంటే యేమో ఎరుగదు. కూలీలందరికి బువ్వ అంటే వరిబువ్వ గాదు సుమా రాగి ముద్దలు వండాలి.వాటిని పొలాలకు మోసుకెళ్లాలి. వాళ్లు తిన్నాక పచ్చిక తీసుకురావాలి. మళ్లీ రాత్రి వంటలు ప్రారంభించాలి, ఈమధ్యలో పిండి విసరటం, కారాలు మిరియాలు నూరటం అన్నీ తనే చెయ్యాలి. సాహూకారు పిల్లలికి స్నానాలు చేయించటం, బట్టలు తొడగటం వడ్డించడం మొదలు తానే.చంటి పిల్లలకు పాలివ్వటానికి గూడా ఆమెకు వ్యవధి ఉండదు.ఉండినా ఆమె దాన్నుపయోగించుకోటంచూస్తే వాళ్ళొప్పుకోరు.

తన బిడ్డ వంట గదిలో పొగలో మిరియాలు కారాల వాసనలో పడిపొర్లుతుం టుంది. సాహూకారు బిడ్డ కూటంలో తు తూగుటయ్యేలలో, చీల పడకలపై చల్లగా వూగుతూ ఆడుకొంటూంది. ఎప్పుడైనా తనబిడ్డ సాహూకారు బిడ్డనుముట్టిందే ఆ గృహాధికారి రాణి గారు చూస్తే చండికావతారం దాలుస్తుంది. కోపం ముదిర్తే ఛీ దాన్ని బిడ్డ వీపు బ్రద్దలు గూడా జేతుంది.

వేడి వేడి యిడ్లీలు వెండి కంచాలల్లో సాంబార్లతో చల్లార్చుకొంటూ దిగకదిగక శ్రీమంతుల పిల్లలు తింటూంటే, ఆపాటికి అన్నం ముక్క నోటికందని తన పసిపాపలు తలుపు సందుల్లో

నుండి తొంగిచూట్టం, సాహుకారు భార్య లక్ష్మీదేవమ్మగారు కోప్పడటం చూస్తుంటే సుబ్బి మనకర్మ మనపూజాఫలం అనుకోవటంలోనే తృప్తి పడేది.

నిజమే ఈమె కర్మ అంటే ఈమిలా చేసుకొంటుంటోంది గాబట్టి అలానే ఉంది. సాహూకారు కర్మలు దినచర్యలు జీవితం డబ్బు సంపాదించటమే ప్రధానోద్దేశంగా వుంటోంది గాబట్టి అది ఆయన పూజాఫలమంటారు.

ఓనాడు పంద్రెండు గంటలకు సుబ్బి చేతిలో రాగిముద్దలు తీసుకొని గుడిసె కెళ్లింది. ఎంకన్న ఆపాటికి ముకం గడిగిన పాపానపోలేదు గాబట్టిన్ని, ఉదయం నుండి ఎండలోనే కూర్చుని వుండటంవల్లా కళ్లు దిరిగింది. మైకంతో పడిపోయాడు. సుబ్బి చెదిరిన గుండెతో అతని కుపచారాలు చేస్తుంటే, బిడ్డలు కన్నీళ్లతో చుట్టూ విలపిస్తున్నారు. రెండు గంటలైంది గాని ఆయనకు తెలివి రాలేదు. ఆమెకు సంశయం గలిగింది. వణుకుతో పొరుగిం టావిడను సలహా అడిగింది. ఆమె ఏదో కలికమంటూ ఎంకని కళ్ళకు వేశాక ఎంకనికి తెలి వొచ్చింది. అందరికీ కాస్తా ధైర్యమొచ్చింది. మెల్లగా ఎంకన్ని కూర్చొబెట్టి తను తెచ్చిన రాగి ముద్దలో సగం తినిపించింది.

ఆలోగానే ఐదారుమార్లు సాహుకారింటి నుండి సుబ్బికి పిలుపు, వినబడటంచే గబగబా వెళ్లింది. సాహూకారు పెద్ద కొడుకు సుందరంబాబు పట్టణంలో మూడో ఫారం చదువుతుండే విద్యావంతుడామెను చూచిందే మండిపడ్డాడు. తన చేతుండే సైకిల్ పంపుతో ఆమె తల మీద బలంగా కొట్టాడు. ఆమె మారు మాటాళ్లేదు. కళ్లల్లో నీళ్లు క్రమ్ముతుంటే లోపలికెళ్లింది. మళ్లీలోని కెడుతున్నావ్ ? నీళ్లివ్వకుండా నంటూ మళ్లీ దెబ్బలు తగిలించాడు. ఆమెను కొడు తుండటం లక్ష్మి చూస్తూనే ఉంది. కానీ బెల్లంగొట్టిన రాయిలా వూరుకొంది. సుబ్బి మళ్లీ తన కార్యక్రమంలో మునిగిపోయింది. ఆమెకాదినం అంత చెప్పుకోదగిందిగాదు. దానికంటే బాధలు పడ్డ రోజులె యోన్నోవున్నె గనక.

ఆకాశం మబ్బుబాటలో లీనమైంది. నక్షత్రాలుగాఢనిద్రలో కండ్లు మూసుకున్నై. చంద్రుడు సముద్రపు చిరుకెరటాల ఊయల్లో జలకాల తెఅలో కునుకుతీస్తున్నాడు. ప్రకృతి భీకరాకృతిలో కాళరాత్రి కౌగిలింతలో అన్ని ప్రాణులు కలవరిస్తున్నై.

ఎంకన్నకు చలి ఎక్కువైంది. జ్వరంతో బాధపడుతున్నాడు. ఓపూటైనా వరిమెతుకులు దొరకలేదా నిర్భాగ్యునికి. రాగిముద్ద తిన్న గడియకే ఒళ్లు చలవలు క్రమ్మినై. ఒంటి చల్లదనంతో కాళ్లు చేతులు చల్లబడినై బ్రతుకుతాదనటం నిరాశ. ఎంకని భార్య హృదయం మీద సమ్మెటపోట్లు పడుతాన్నై.

ఏ పలుకుబడి కలిగిన వ్యక్తికైనా లేక ఏ వైస్రాయికో గవర్నరుకో ఐతే ప్రత్యేక వైద్యులుంటారు. వాడికి ముక్కునొచ్చినా, కాస్త ఎక్కువతిని కడుపునొచ్చినా ప్రపంచం కలవర పడుతుంది. పత్రికలు పెద్ద పెద్ద అక్షరాల్తో పలానా వారి ఆరోగ్యం యిలా ఉందంటూ ప్రచురిస్తుంది. వారి అడుగుకు మడుగులొత్తటానికి వాళ్లకు వుపచారాలుచేయటానికి వేనకు వేలుగా కాచుకుని

వుంటారు. ఎంకనికి చావు బ్రతుకుల్లో గూడా సాయం చేసే పురుగులేదు. సానుభూతిచూపే ప్రజలేదు.కారణం ???

సుబ్బి హృదయంలో ఒక్క మెరుపు మెరిసింది. ఆమెకు పెన్నిధి లభించినంత సంతోషం కల్గింది.మబ్బు చీలికల్ని దూసుకుంటూ వడిగా నడిచింది. దూరములోమెరుపులు, ఎక్కడో పిడుగులు పడిన శబ్ధం. ఒకే మనస్సుతో ఆశాపూరిత హృదయముతో అడుగులు వేగంగా పడుతున్నై. బడిపంతులు యింటి ముందు ఆగింది.పంతులు పెళ్లాం హార్మోనియం వాయించకుంటూ పాటపాడుతోంది.

వలపు కుసుమముల మధర తేనియల

గ్రోలగరావే భృంగ కుమారా...

తియ్యని తలపులు కమ్మని వలపులు

మొలకలెత్తినవి చిగురించినవి

ప్రియా............

ఈ చలి రాత్రే .... మన ప్రణయ జీవితము...

హాయీ... ప్రకృతి... హాయి...

గిలిగింతలు రా... పులకరింతలురా...

ప్రియా ....... ఆ........

ఆమెకీ ప్రకృతి కమ్మగా వుందట. గిలిగింతలు పులకరించాయి. ఆమె జీవితమే ప్రణయము. ఈ చలి రాత్రి ఆమెకెంతో యిష్టమట. మానవులంతా దేవుని బిడ్డలు, దేవుం డందర్ని సమానంగా చూచుకుంటాడనే. యీ రఖా దొంగల్ని చూస్తే నాకు బాధేస్తుంది. వాళ్ల బుద్ధిహీనతను ఏమనాలో బోధపడుటలేదు. అందుకే దేవుడనే వాడొకడుంటే వాడిని నిలబెట్టి యీ అక్రమాలన్నీ ఎందుకుచేస్తున్నాడో ! నిలదీసి అడుగదామనిపించుటం లేదో ధైర్యంగల మానవులకు. ఆ పని లేదు. ఎందుకో అర్థం చేసుకోండి. సుబ్బి హృదయం యింత దూరం ఆలోచించలేదు. ఆమె మనస్సు నవనీతం. ఆమె జీవితం విషాదం. ఆమె దారి సీసా ముక్కల బాట.ఆమె దినచర్య బానిసత్వం. ఆమె నిరంకుశానికి బలివ్వటానికి పెంచబడ్డ కోడిపిల్ల. అబ్బా! పేదరికం,భయం, గుండెలుకొట్టుకోవటంలేదు.గుండె మీద చేయివేసి చెప్పండి మీరు పేదోడుగా జీవించటానికి అంగీకరిస్తారా ???

అసలీ నవలే నా స్వానుభవంలో ఏర్చిమార్చిన సంఘటనలు. హాయిగా నిద్రబోయే ధనికుల్నంతా క్షుద్రులంటాను. వాళ్లని పిశాచులంటాను. దుర్మార్గు లంటాను.ఎందుకంటే అనేలా వాళ్లు చేసుకున్నారు కాబట్టి. వాళ్లు మానవులనిపించు కోవటంలేదు కాబట్టి. ఇంకా వాళ్లని యీ ప్రపంచంలో బ్రతకనిస్తే మనుష్యుల్ని తినటానికి గూడా వెనుదీయరనుకుంటాను. అందుకే స్వతంత్రం అవసరం. ముందు యీ ప్రభుత్వాన్ని కాలికి బుద్ధి చెప్పేలాచెయ్యాలి.

ఆ దినమే సుదినం. అందుకే ఆనాటికోసమే ఎందురో వుపవాసమున్నారు. పథ్యమున్నారు. జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. వాళ్లంతా తెరమరుగు వ్యక్తులు. వాళ్లే మన సోదరులు. సోదరులనే పదానికి నిర్వచనంయిస్తే యిదే మొదటవస్తుంది. కడుపుమంటలో కథ వెనుకబడింది. ఆ విషాదజీవులు కథ చిత్రించటం చాలా కష్టం. కలమాడదు. కలానికందని విషయాలు యింకా ఎన్నివున్నయ్యో!!!

స్వామి సమాధిలో వున్నాడు. పుష్టిగా తిని పద్మాసనం వేసికూచున్నాడు. వాడొక రోగ్. వాడి కథరాయటానికి వుపక్రమిస్తే అదీ ఒక గ్రంథమౌతుంది. వాడిని గురించి క్లుప్తంగా చెప్పుటయే శ్రేయస్కరం. వాడు కులట. నమ్మకద్రోహి. దోపిడిగాడు దేవుడనే తెరచాటులో దాక్కుని మానవ జీవితాల్ని ఖూనీ చేస్తున్నాడు.

సుబ్బి స్వామి పాదాల మీద వాలింది. పురుషున్ని కాపాడమని బతిమాలుకుంది. వాడి రాతి గుండెలా కరగలేదు. సాధువైతేగా? వైద్యానికి ఖర్చులుకు, పూజావస్తువులకు ప్రతిఫలం అవసరమని అతడి ఏజెంటు అంటే శిష్యుడనే బురఖా దగిలించుకున్న రాస్కెల్ మూలంగా తెలియజేశాడు.

ఏబది రూపాయలు అబ్బా ఎంత మొత్తం. ఎన్నిరోజులు కష్టపడితే ఎంత మొత్తాన్ని ఎలాగా తీర్చటం. ఎం చేయుట ? ఆలోచన.

అడుక్కుంది. కన్నీరు కార్చింది. అతడి పాదాలపై వెల్లువలు. అబ్బా కర్కశుడు...

ఎలాగో ఒప్పించింది. ఒప్పుకున్నారు. పొద్దుపుడితేనేగానీ రానంటు వచ్చాడు. బ్రతిమాలి పిలుచుకెళ్లింది.

అర్థరాత్రిలో ఆ పూరి గుడిసెలో స్వామీజీ తాయత్తు కట్టాడు, మందివ్వలేదు. సుబ్బికి ఎంకన్నకి దేవుడు మంత్రముల మీద నమ్మకముంది. కాబట్టి ధైర్యంతో వుండిపో యారు.

ప్రక్కింటి మామిడి పళ్ల సాయబును అడుక్కొని తన తట్టా చెంబులు కుదువపెట్టి పదిరూపాయలు తెచ్చి స్వామీజీ పాదాల ముందు అర్పించింది.

.....

కర్కశ హృదయము కన్నులలోనా

కారదు కన్నీరూ...

కులీళ్లంతా కూటికి లేకా

కుమిలి కృశించిననూ...

ఈ గేయాన్ని వింటుంటే ఎంకన్న హృదయం వెల్లువలై కరిగి ప్రవహిస్తోంది. ఆ దినాలు తలంచుకొంటే మనస్సు వుద్రేకంతో కళ్లెంలేని గుఱ్ఱంలా బ్రేకుల్లేని ఇంజన్‌లా ముందుకు దొర్లుకుపోతోంది.

బోలో రైతు రంగాకు... జే.... బోలో రైతు కూలీ ప్రజారాజ్యానికి...జే... నినాదాలు దూదిపింజలై బెదరిపోయిన్నై వలంటీర్ల ఉత్సాహానికి పరిమితిలేదు.పురాతన వీరపురుషులు స్మృతికి వస్తున్నారు. మనల్ని శతాబ్దాల నుండి త్రొక్కి మసిగా నుసిగా రాలియేలా మాడ్చివేస్తున్న నిరంకుశమనే రాక్షస బలగాన్ని బలిచేసే రోజులు దగ్గరించినవా?

ఆ ప్రజా ప్రవాహం, స్వచ్ఛంద సేవకుల ఆర్భాటం, కూలి సోదరుల కడుపుమంట పెద్ద పెద్ద మంటలై పాలిత ప్రజల్ని ఆహుతిచేసే తరుణం సమీపించిందా?

అతీతమైన మనశ్శక్తుల్ని మనోభావాల్ని వికసింప చేసుకోవటానికి డబ్బులేక విద్యాగంధంలేని పసిపిల్లలు అమాయక హృదయులు, యువకుల గాఢనిద్ర, సమాధిలో శయనించిన వృద్ధ భారతవీరుల పౌరుషం ఉపయోగపడే దినాలు ఆసన్నమైనవా?

అవును. వాస్తవం ఎరుగని ఆగర్భ శ్రీమంతుల హృదయాలకు ఉక్కుశూలాలు. కష్టమెరుగని ధనికవర్గానికి మృత్యువు సమీపించింది.లేకుంటే ఈ కోలాహలం ఏమిటి? ప్రజాశక్తి... ప్రజాశక్తి ...ప్రజాశక్తి. ఆ శక్తి అచంచలం, అసాధ్యం, అజేయం, అమోఘం. అదే మనల్ని రక్షించే పరమాస్త్రం. ఆశక్తి కేంద్రీకరించిన ఒక పెద్ద సత్యం. ఆ జనంలో ఆ సమా వేశంలో పాల్గొనటానికి ఎంకన్నకు శక్తిలేదు. ఎవరో నాయకులు వస్తారని కూలీలకు రైతులకు మేలు చేస్తాడని ప్రచారం మాత్రం విన్నాడు. ఆ గ్రామంలో యువకులు కూలోడు నాటకాన్ని ప్రదర్శిస్తారని తెలుసు. అయినా? చూచే తరుణంకి తన చలిజ్వరాన్ని ఏంచేయాలి?

ఆ ప్రజావాహం ఒక్క క్రమశిక్షణలోనాటకాన్ని తిలకిస్తూ ఉంది.తెఱలో ఏదో పాట...

ఉన్నారులున్నారురా,

కూటికేలేని కూలాళ్లురా

బట్టకేలేని పేదోళ్లురా...

వారి కళ్లలో జీవాలు వెలిగేనురా

వారి బొజ్జలు వెన్నుముకలంటేనురా

చూడాలిరా...

చూపాలిరా...

కూలీల కష్టాలు తొలగాలిరా

రైతులకూ,

కూలీలకూ,

రాజ్యాలు వెంటనే రావాలిరా ...!!

ఎక్కడొస్తుంది ? కూలీలకు రాజ్యమా ? అక్కర్లేదు బాబూ. కడుపునిండా కూడు ఒంటికి జానెడు బట్ట దొరికతే చాలు. అదే పదివేలు ఎంకన్న ఆలోచిస్తున్నాడు. కూలాడు

స్టేజిపైకొచ్చాడు. నిజంగా అతడే కూలాడు ఎంకనికి అతన్ని చూస్తే జాలేసింది. పరుగెత్తికెళ్లి కౌగిలించుకుందామనుకున్నాడు. జనసమూహం ?

సాహుకారు బాదేశాడు జాటితో.అమ్మా అని అట్టే వాలిపోయేడు. ఆ దెబ్బ వెంకన్న గుండెల్లో తుపాకి గుండులా దూసుకుపోయింది. అట్టే నిలబడిపోయాడు.

కూలాడు విలపిస్తున్నాడు.పచ్చినెత్తురు చిందబాదెను సాహూకార్

బాధ బాధ... అయ్యయ్యో... ఓర్వజాల...ఎంకన్న కళ్ళల్లో నీళ్లు గి(్రుమన్నై. శక్తి వుంటే ఆ సాహూకార్ని చితక్కొట్టేవారు. అట్టే మధ్య చిత్రంలా నిలబడిపోయాడు. ఆ తరువాత ఏం జరుగుతోందో అతనికి స్మృతి కెక్కలేదు.

జయజయ శబ్ధాలకు వులిక్కిపడ్డాడు. నాయకుడు మాట్లాడటానికి వుపక్రమిస్తు న్నాడు. తన హృదయములో అతనికెన్నో నమస్కారాలు చేశాడు. అతడిని ఒక దేవుడిలా భావించాడు. అతడే తండ్రి అనుకున్నాడు. అతడు తనలాంటి వాళ్ల కష్టాల్ని తీర్చటానికి అవతరించాడని నమ్మాడు. అతన్ని వేయి కళ్ళతో చూశాడు. ఎంతటి అమాయక హృదయం?

అదే దీక్షగా ఉపన్యాసాన్ని ప్రజలు ఆలకిస్తున్నారు. ఎంకనికి చలి జ్వరం ఎక్కువైంది. అక్కడ ఆగలేకపోయాడు. సుబ్బి బలవంతాన లాక్కుపోయింది. గుడిసెలో పడుకున్నాడు. అతనిలో ఏవేవో భావాలు వుదయిస్తున్నై. మనకు ఈ భూమిలో బతకటానికి హక్కు వుందా? నేను మనిషినైతే నన్నెందుకు అందరూ నీచంగా చూస్తారు? చిన్నోడైనా పిల్లాడైనా ధనికుడైతే అన్నా అయ్యా అని సంభోధించే ప్రజలు నన్నెందుకు ఒరేయ్ ఎంకడూ అంటారు? నేనేం పాపం చేశాను? నేనేం చేసినందుకు ఈ దరిద్రం అనుభవిస్తున్నాను? దేవుడికి నా మీద ఎందుకు కోపం? అతడికి నేనేం అపకారం చేశాను? అతనికి నేనెప్పుడూ దణ్ణం పెట్టకుండా పోలేదే? అతడి సొమ్ముతినలేదే ? మా సాహూకారులా ధర్మకర్తగా వుండి సొమ్మంతా తినలేదే? స్వామిద్రోహం చెయలేదే? బ్రాహ్మళ్ళంటే నాకు చాలా గౌరవమే? నేనేం చేశానని ఈ తప్పు? నేను అపరాధియా? కాదు. ఇందులో ఏదో రహస్యముంది? అసలు దేవుడున్నాడా? ఛా.. లేదంటే కళ్ళుపోవూ? యమదూతలు రారూ? ఊ... ఒట్టిది. ఉందంటే ఏమి వచ్చి మిగిలేను. లేదు.దేముడూలేదూ, దయ్యమూ లేదూ. అంతా బూటకం. ఇదంతా మనుషులే చేసిన ద్రోహం. దేవుడుంటే నాకు జ్వరం వస్తుందా? వచ్చింది గదా ఎందుకు పోవటంలేదు? నాకే ఎందుకు రావాలి. దేవుడులేదనే ఆ రాజుకు రాకూడదా? అతడెప్పుడూ బావుంటాడే. పైగా మంచోడే. నన్నుచూస్తే ఈ వూళ్లో అతడొక్కడే అయ్యా అని తండ్రిని పిలిచినట్లు చనువుగా పిలుస్తాడు. బాగా గొప్పగా పట్నంలో చదువుకున్నా అతడికి కొంచెమైనా గర్వ ముందా? ఎంత దొడ్డబుద్ధి, ఈపాడు వాళ్లని నమ్మటానికంటే అతన్ని పూజించవచ్చు. నా పెళ్లాన్ని అందరూ ఒసేయ్ సుబ్బీ అంటే అతడూ అక్కా అంటాడు. ఎంత మంచోడు? నా గౌరవం అతనికేం కావాలిసింది? అతడు నాతో ఎన్నో మార్లు చెప్పాడు. నాలాంటి వాళ్లకి మంచి కాలం ఒస్తుందని. ఎప్పు డొస్తుందో నా బోటి దౌర్భాగ్యులు లక్షణంగా చావటం మేలు.

పాపం ఆయనే గదా ఈ డ్రామాలు, సభలు జరిపించింది. ఎంత కష్టపడుతున్నాడు పాపం? ఆయన్ని చూస్తే ఈ సాహూకారు ముండాకొడుక్కి కంటిలో పుల్లపెట్టినట్టుంటుంది. ఎందకో? వీడేం చేయగలడు. ఆయన వుక్కుతునక. నిప్పుపుల్ల, అగ్గిని చూస్తే అందరికీ భయమేగా... ఊ... చూస్తాం. అమ్మా...

ఆవలింతల్తో మైకంగా నిద్ర ఆవహిస్తోంది. కోడి కూసినట్టుంది. సుబ్బియింకా రాలేదు. సాహూకారింట్లో పెళ్లి కాబట్టి ఆ రాత్రంతా తీరని పని చేయాలి. పిల్లలు ఆకలికి ఏడుస్తున్నా అట్టే నిద్రపోయారు. చలిగా ఉంది.

దూరములో గుడిగంటలు గాలికి వాగుతున్నై. వీధిలో రామభక్తులు గోవిందనామ సంకీర్తనం చేస్తున్నారు. ఎంకని హృదయంపై హిమాలయాలు శయనించినై.

**– ఏప్రిల్,1944, చిత్రగుప్త మాసపత్రిక**

*(కె.సభా చిత్తూరు జిల్లాకు చెందినవాడు. కథా రచయిత, నవలాకారుడు, నాటకకర్త, కవి, గేయకర్త, బాలసాహిత్యకారుడు, సంపాదకుడు, ప్రచురణకర్త, సంకలన కర్త, జాతీయోద్యమ చైతన్యంతో వైవిధ్యభరితమైన రచనలను చేశాడు. బంగారు, పాతాళగంగా, నీటి దీపాలు మొ॥ కథాసంకలనాలను రచించాడు. 300 దాకా కథలను రాసాడు. 'దేవదత్తం' వారపత్రికను 'పాంచజన్యం' అనే ఆంగ్లపత్రికను నిర్వహించేవారు. ఉపాధ్యాయుడిగా వృత్తిలో ప్రవేశించి తరువాతి కాలంలో పూర్తిగా పత్రికా రంగంలోనూ,రచయితగాను కొనసాగాడు)*

# అనుబంధం

## చిన్నకథలు

**– హెచ్.నంజుండరావు, బి.ఎ., బెంగుళూరు**

కథాశ్రవణ కుతూహలము మావన నైసర్గిక గుణము. దాని మూలము మానవ జీవిత సంజాతము. దాని చరిత్ర మనుష్య జీవితచరిత్రయే. దాని యుద్దేశ్యము మానవ సహజ గుణములలో ముఖ్యమయినవగు సంతోషాశ్చర్యాదుల గలిగించు విషయ పోషణము. అది కూడా వాఙ్మయ వృక్షమున నొక శాఖయగుటచే గవిత్వపు ముఖ్య కర్తవ్యమగు మనోరంజక గుణమందుండి తీరవలయును. ఇఁక నాశ్చర్యకరముగ నెందున కుండవలయు ననగా నయ్యది మానవ జీవిత సామాన్య నిత్యకృత్యములనే ముఖ్య విషయముగ జేసికొనిననది సంతోషదాయకమగుటకు మారుగ విసుగును బుట్టించును. కాన గీటు త్రోవను దప్పి కొంతమట్టునకు భావనా ప్రపంచమున నోలలాడించు సందర్భ సంఘటన ముండిననే రుచి. అయిననది కేవల మస్వభావమై యుంట మంచిదికాదు. అట్లుండినచో నయ్యది మనుష్య జీవిత సంబంధము లేక మానవ చిత్తభావముల నుద్రేకింపదు. చీకటింటిలో నద్దముండిన నేమి ఫలము? కాఁబట్టి కథా విషయము మానవ జీవిత సంబంధము గలిగి సంతోషాశ్చర్యాది గుణములకు దృప్తిని గలిగింపవలయును.

పై యంశముల బట్టి చూడ గథాభాగము మానవ జీవిత మందలి యసామాన్య చర్యలను బ్రతిబింబించి మనోరంజకముగ నుండవలయునని తేలుచున్నది. ఒక ధీరోదాత్తుని జీవిత చరిత్ర సాహస కృత్యములతో నిండి మనుష్య ప్రకృతి సంబంధమై యుంటఁబట్టి యట్టివారి చరిత్రే మొదటి కథలు. ఈ సిద్ధాంతము మానవకోటి జీవితచరిత్ర యందంతయు జెల్లునని కనఁబడుచున్నది. కావ్యావలోకమున కంటె నెక్కుడు సంతోష దాయకమయి పలుమారు వెఱ్ఱి నెత్తించి నాట్యాదులనబడు అంగచేష్టలకు త్రోవ సూపునది గానము. ప్రాచీన కథలన్నియు ముద్రాయంత్రములేని యట్టి యాకాలమున జనపారంపర్యముగ వదలదలచియో లేక అధికతర మనోరంజకముగా జేయనెంచియో జనాంగములీ కథలను జాలమట్టునకు బాటలు పద్యములు మున్నగు రూపముల వెలిఁబుచ్చుచు వచ్చిరి. ఈ సమయమున నాదిమ నాగరికతలో వన్నె కెక్కిన మతబోధకులు దమ తత్వములను పురాణ ములను బద్యగీత రూపమున జనుల మనము నాకర్షించుచు గథలను వానికి దోహదము లవలె జేర్చుచుండిరి. కథలప్పటి నుండి పెచ్చు పెరిగిన మత గ్రంథములలో నుపకథలై గద్యరూపము వహించుట దక్కువ యాయెను. తుదకు సుప్రసిద్ధి వడసిన గవులందఱు జిన్ని కథలను గద్యరూపమున వ్రాయుట తమ కవిత్వ పటుత్వ గరిమకు హేయమయినదని తలంచుచు వచ్చిరి.

పైన జెప్పిన కారణములచే జిన్ని కథలు గద్యరూపమున నరుదయ్యె హితోపదేశ మొక్కటి

తప్పు కథ కోసమే కథను వ్రాయుట అంతకంటె నరుదయ్యెననిన నతిశయోక్తి కానేరదు. ప్రబంధాదులును పాత్రపోషణమే ముఖ్య కర్తవ్యమయి, వర్ణనాధిక్యములచే నిండిన దీర్ఘ సంఘటన కథనములును అథవా ప్రస్తుత కాలపు నవలలును వాని స్థానము నాక్రమించు కొనియెను. పూర్వము నీ జనులకు బెనుఁగథలను జదుపునంతటి విరామ ముండినది. దీర్ఘసమాసాదుల జిక్కులనైన విడిపించి యర్థము జేసికొనునంతటి యోపిక యుండినది. అయిన నిప్పుడన్ననో మానవ జీవితములలో విరామము తగ్గి పనులెక్కువైనవి. అంతయు విద్యుద్వేగముతో నడువవలయును. వ్యవసాయముపై నాధారపడి యుండు పల్లె దేశములందు సహితము మోటారుబండ్లు తలఁజూపినవి. ఇఁక యంత్రశాలలపై నాధారపడి యుండు దేశముల విషయమయి యడుగవలసిన దేమున్నది? కాఁబట్టి యొక కాలుఘంట సేపులోఁ తుది ముట్టించి మనస్సున నుద్భవించు భావ కల్లోలముల నన్నింటిని ఉపసంహరింప వీలును గలిగి యుండు కావ్యావలోకమును కావలసియున్నది. అట్టి గ్రంథ ములు చిన్నకథలే. పాశ్చ్యాత్య దేశములందు ముఖ్యముగా నింగ్లాండమెరికాది దేశములలో, జిన్ని కథల ప్రకటనము విద్యుద్వేగముతో బ్రబలుచున్నది. గ్రంథ పఠనము సామాన్య జనజీవితము నాక్రమించియున్నది. సుప్రసిద్ధ కవిపుంగవులు సహితము తమ గౌరవమున కించుకేనియు లోటులేక తద్రచనలో దిగియున్నారు. మనదేశమందు గూడ లోకవిఖ్యాతుం డును మానవకోటి కంతయు జ్ఞానజ్యోతిని వెలిగించి పూర్వ పాశ్చాత్య నాగరకతలలో నుండు సద్భావముల నొండొంటి నేకీభవింపఁ గంకణము గట్టియుండు రవీంద్రనాథటాగోర్ వంటి మహామహులు చిన్నికథలను వ్రాసి ప్రకటింపజేసి యున్నారు. గాంధీ మహాత్ముని కీడుజోడై యించుమించుగ సమానాభిప్రాయములు గలిగి లోక కల్యాణమే తమ కల్యాణమని తలంచి ప్రపంచ సంచలనమునకు గారణభూతుఁడయిన కౌంట్ లియోటాల్‌స్టాయ్ మహనీయుఁడు చిన్న కథలను వ్రాసియున్నాడు. ఇంతటి గొప్పవారు కూడ నీపనిలో దిగియుండుట గాంచిన నిందున నేమో మహత్త్వమున్నదని కనుపడక మానదు. గ్రంథావలోక నముచే మనసును రంజింపఁజేయుటయే వీరి జీవితోద్దేశముకాదు. లోకహితైక కార్య నిరతత్వమునందు దమ సర్వస్వమును ధారవోసిన త్యాగశీలులు వీరు. కానగథలు చదువుటచే నిత్యకృత్యములనుండి గలిగిన విసుగును బోఁగొట్టుకొనుటయే కాక తత్వజ్ఞానము గూడ లభింపవలయును. అందుచే జిన్ని కథా రచన సామాన్య రచనగాక నొక కళగా నెంచఁబడిన కొన్ని కట్టుబాటులను ననుస రించుచున్నది అవి యెవ్వియన :-

(1) కథ నవలవలె బెద్దదిగాకబోవుటచే నందున నవలయందువలె బాత్రపోషణ దీర్ఘ వర్ణన మనోపరిశోధనాదులే **(Development of Character, long descriptions and analysis of the mind)**ముఖ్య కర్తవ్యముగాక సంఘటన సముద్ధరణముపైననే దృష్టి నుంచ వలయును.
(2) వివిధ విధమానవజీవితములను బ్రతిబింబింప వలయును. ఏలనన దమమంటి జీవిత

వర్ణనములనే తాము జదివిన నందు గ్రోత్తదేమియు లేక ఆశ్చర్యము బుట్టింపదు. సంతోషదా యకమంతకు ముందే కాదు. చూడుడు. అంతఃపురజీవిత విషయము గుఱించిన గథలు, సామాన్య వ్యక్తికి రుచించును. సామాన్య జీవిత చరిత్రమును వెల్లడించు గథలు అగర్భశ్రీ మంతులు జదివి యానందింతురు.

(3) దీర్ఘ వర్ణనారహితమయి ముఖ్య సంఘటనము నుద్వేగముతో నడపించుట కొంచెము స్థలములో నెక్కుడు ఫలితమును బొందవలయును గాన నియ్యది యావశ్యకము.

(4) శ్రావ్యమగు సులభ శైలియును సాధ్యమగు వఱకు నయ్యది పాత్రానుగుణముగను నుండవలయును.

(5) నవలలందును తదితర గ్రంథములందువలె గ్రంథకర్త నీతిబోధక వాక్యములందే యుద్దేశముతో వ్రాయగూడదు. అంతశ్చక్షువునకు గోచరమగుచు నుండవలయునే కాని బాహ్య చక్షువున కగపడకూడదు. ఇందునకు గారణ మరయ దూరము పోపనిలేదు. స్థలసం కోచ మొకటి, రెండవది యుద్దేశపూర్వకమయిన నీతివాక్యములు గథలయొక్క చిత్రకళా స్వభావము నెగురంగొట్టును. ఏలన"కళనుగప్పి పుచ్చుటే కళయందలి నైపుణ్యము" (Art Consists in Concealing art) అను లాక్షణిక సూత్ర మందఱకు దెలసినదే.

పై యంశములను బర్యాలోచించి చూచిన నాటకాది కావ్యరచనముల కత్యావశ్యకములగు గాలస్థళ సంఘటన సమంజస నియమములు (Unities of time place and action) చిన్ని కథలు గూడ ఆచరించవలయునని తేలుచున్నది. ఒక వేళ స్థళ సమంజస న్యాయమంత గణ్యము కాకపోయినను దదితర నియమములకు బద్ధములయి యుండవలయును వీనికి దోడుగ కథ యందలి పూర్వచరిత్ర (Back Ground) పాత్ర సంఘటనములకు వన్నె గట్టునట్టి వ్యాప్తితో (Atmosphere) నిండియుండవలయును. ఇయ్యదిలేక బోయినచో కథపిప్పియై తగిన ఫలితము నాపాదింపదు. ఇట్టి నైపుణ్య ప్రకటన మందు 'యడ్గర్ అలెన్ పొ' (Edgar allen poe) అను అమెరికా దేశపు చిన్ని కథల గ్రంథకర్త యద్వితీయుండు. ఈ సూత్రమును మనసున నుంచుకొనక బోయినచో గథా కథనమంతయు దేశచరిత్రములందు వలె విషయముపై విషయమును బెర్చినట్లగును. ఆంధ్ర కవివర్యులీ నియమమాచరించిన దమ కథారచనకు జీవకళ నొసంగ గలుగుదురు.

**– 15, జనవరి 1927, సాధన పత్రిక**

*(హెచ్.నంజుండరావు బళ్లారి ప్రాంతంలో విద్యాశాఖ ఇన్స్‌పెక్టర్‌గా ఉండేవాడు. ఆంగ్లసాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేశాడు. టాల్‌స్టాయ్ కథలకు తెలుగు అనువాదం చేసి పుస్తకంగా ప్రచురించాడు. 'కుబేర పతనం' అనే వచన నాటకాన్ని ప్రచురించాడు. సాధన పత్రికలో అనువాదకథలను, కథ, నాటక లక్షణాల వ్యాసాల్ని రాశాడు.)*





డా. అప్పిరెడ్డి హరినాథ రెడ్డి


అనంతపురము జిల్లా, గాండ్లపెంట మండలం, తాళ్ళకాల్వ గ్రామంలో జన్మించారు. రాయలసీమ కక్షల కథలపై పరిశోధన పూర్తిచేసి పిహెచ్.డి. పట్టాపొందారు. సాహిత్య, సీమ సామాజిక అంశాలపై రాసిన వందవ్యాసాలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. జాతీయ సాహిత్య సదస్సులలో పదిపత్రాలను సమర్పించారు. వెలుగులోకిరాని శాసనాలు, తాళప్రతులు, రాత ప్రతులు, ఆదిమానవుల కాలంనాటి రేఖాచిత్రాలు, పురాతన కట్టడాలను వెలికి తీస్తున్నారు.

రాయలసీమలో స్వాతంత్ర్యానికి పూర్వం వెలువడిన పత్రికలను అన్వేషించి అందులోని సాహిత్య, సామాజిక అంశాలను విశ్లేషిస్తున్నారు. 'శ్రీసాధనపత్రిక కవితాసంకలనం', 'శ్రీకృష్ణదేవ రాయ జయంత్యుత్సవ ఉపన్యాసాలు, వ్యాసాలు' పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. 'సీమసాహితీ స్వరం – శ్రీసాధన పత్రిక' అనే మరో పరిశోధన పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకానికి 2014 సంవత్సరం 'కేంద్రసాహిత్య అకాడమి యువపురస్కార అవార్డు'ను అందుకున్నారు.

అనంతపురం జిల్లాలో స్వాతంత్ర్యోద్యమం, టి.శివశంకరంపిళ్ళై ఇంగ్లాండుయాత్ర, రాయలసీమపాటలు, థామస్‌మన్రో జీవితచరిత్ర తదితర పుస్తకాలు త్వరలో వెలువడ నున్నాయి. భాషోపాధ్యాయుడిగా వృత్తిబాధ్యత నిర్వహిస్తూ, 'వేమన అధ్యయన అభివృద్ధి కేంద్రం' కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.





# మా ప్రచురణలు















అబ్జ క్రియేషన్స్
సాహిత్య సాంస్కృతిక సంస్థ (రి)
హైదరాబాద్.